# HISTORICAL METHOD WITH SPECIAL REFERENCE TO INDIAN HISTORY

# (DH23)

# (MA-HISTORY)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

పాఠం - 1

# చరిత్ర : నిర్వచనం, స్వభావం మరియు పరిధి

**విషయక్రమం :**


**1.0** లక్ష్యం

**1.1** పరిచయం

**1.2** నిర్వచనం

**1.2.1** మూలపదం

**1.2.2** భిన్న నిర్వచనాలు

**1.3** చరిత్ర లక్షణాలు

**1.3.1** చరిత్ర మానవ ప్రపంచానికి సంబంధించినది

**1.3.2** వ్యక్తులను దేశ, కుల పరిస్థితుల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి

**1.3.3** చరిత్ర శాస్త్రీయం

**1.4** చరిత్ర - చరిత్ర

**1.5** చరిత్ర స్వభావం

**1.5.1** భిన్న దృక్పథాలు

**1.6** చరిత్ర విషయపరిధి

**1.7** మాదిరి ప్రశ్నలు

**1.8** ఉపయుక్త గ్రంథాలు


## 1.0 లక్ష్యం :

ఈ పాఠం అధ్యయనం చేయడం వలన మీరు

- చరిత్ర మూలం గురించి, దాని అర్థం, భిన్న నిర్వచనాలను, లక్షణాలను పేర్కొనగలగాలి
- చరిత్ర బహుముఖ స్వభావాన్ని విశ్లేషించగలగాలి
- చరిత్ర విషయ పరిధి ఆది నుండి నేటిదాకా ఏవిధంగా విస్తృతమౌతూ వచ్చిందో వివరించగలగాలి.

## 1.1. పరిచయం :

చరిత్ర అనే పదాన్ని, దాని అర్థాన్ని, దాని విస్తృత పరిధిని అవగాహన చేసుకోవడం కష్టసాధ్యమైనపని. ఎంతో కుతూహలంతో మరెంతో క్షుణ్ణంగా అధ్యయనం చేసినా వీటి గురించి సమంజసమైన నిర్ధారణకు రావడం కష్టం. అయితే ఒక ప్రయత్నంగా యీ పాఠంలో మనం చరిత్ర మౌలికపదం గురించి, భిన్న నిర్వచనాలను, లక్షణాలను గురించి, చరిత్ర బహుముఖ స్వభావం గురించి, దాని విస్తృత విషయపరిధి గురించి తెలుసుకుందాం.

## 1.2 నిర్వచనం :

చరిత్రను నిర్వచించడానికి చరిత్ర అంటే ఏమిటో వివరించడానికి గ్రీకు చరిత్రకారులు మొదలుకొని యీనాటి వరకు అనేకులు అనేకరకాలుగా ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలలో వారు నివసించిన కాలాన్నిబట్టి, సమాజంపై వారికి వున్న అవగాహననుబట్టి, ఆలోచనా సరళినిబట్టి తమకు నచ్చిన నిర్వచనాలను, వివరణలను యిచ్చారు. అయితే ఏదీ సమగ్రమైనదని చెప్పలేము.

### 1.2.1 మూలపదం :

ఆంగ్లంలో వాడుకలో వున్న "హిస్టరీ" అనే పదం గ్రీకు భాషలోని 'ఇస్తోరియా' అనే పదం నుండి ఆవిర్భవించింది. 'ఇస్తోరియా' అంటే 'వెదకుట' 'పరిశోధన', అన్వేషణ', 'విచారణ', 'పరిశీలన', 'వార్త' 'విషయం' అని అర్థం. ఇదే కాలక్రమంలో అన్వేషణ ఫలితంగా రూపొందిన 'రికార్డు'గా కూడా అర్థాన్ని సంతరించుకుంది. గ్రీకు పదం 'ఇస్తోరియా' యే లాటిన్ పదం 'హిస్టోరియా'గా ఇండో-యూరోపియన్ భాషల్లోకి ప్రవేశించింది. ఈ మాటకు మారుగా జర్మన్లు 'గెశ్చిచె' అనే పదాన్ని ఉపయోగించారు. ఈ పదానికి 'సంఘటన' అని అర్థం. కాని 'గెశ్చిచె' అనే మాట 'చారిత్రక వివరాల సేకరణ'గా ఎక్కువ ప్రచారంలోకి వచ్చింది. అయితే ప్రస్తుతం 'హిస్టరీ' అనే పదమే ప్రచారంలో స్థిరపడింది.

అరబ్బీ భాషలో చరిత్ర అంటే 'సంఘటలను తెలియజేసే కాలం' అనే అర్థంలో 'తారిఖ్' గా వ్యవహరించబడుతుంది. ప్రాచీన భారతదేశంలో 'చరిత్ర'కు ప్రత్యామ్నాయంగా 'పురాణం', 'ఇతిహాసం' అని వాడారు. ధార్మర్ధ కామమోక్షాలనే నాలుగు పురుషార్థాలకు సంబంధించి ఉపదేశంతో కూడిన జరిగిన విషయాల్ని కథలాగా చెప్పడం అనే విస్తృత భావంతో 'ఇతిహాసం' పదాన్ని ఉపయోగించారు.

### 1.2.2. భిన్న నిర్వచనాలు :

చరిత్ర పట్ల ఆసక్తివున్నా, లేకున్నా, అవగాహన వున్నా, లేకున్నా అన్నిరకాల వ్యక్తులు అంటే చరిత్రకారులే కాక పండితులు, శాస్త్రవేత్తలు, తత్త్వవేత్తలు, సామ్రాజ్యాల అధినేతలు, జాతీయ నాయకులు, సామాన్య ప్రజలతో సహా - చరిత్రను నిర్వచించడానికి ప్రయత్నించారు. బహుశ దీనికి కారణం సాంకేతికం కాని జనరంజకమైన చరిత్రను ఎవరైనా నిర్వచింపవచ్చుననే ఒక గుడ్డి నమ్మకం అయివుండవచ్చు.

మొట్టమొదట చరిత్రను నిర్వచింపడానికి పూనుకొన్న వారు గ్రీకులు. క్రీ.పూ. మొదటి శతాబ్దానికి చెందిన హాలికార్నసస్ నివాసి డయోనిషియస్ చరిత్రను 'ఉదాహరణల నుండి గ్రహించిన తత్త్వశాస్త్రం' అని అభివర్ణించాడు. ఉదాహరణలు అంటే నిజ జీవతంలోని సంఘటనలని, తత్త్వశాస్త్రం అంటే ఆ సంఘటనల నుండి పాఠం నేర్చుకొనే పద్ధతి అని మానవాళి అనుభవసారాన్ని చరిత్ర మనకందిస్తున్నదని డయోనిషియస్ భావించాడు.

గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్ 'మార్పు చెందని గతానికి సంబంధించిన వర్ణన'గా వర్ణించాడు. భగవంతుడు కూడా గతాన్ని మార్చలేడని అతని నిశ్చతాభిప్రాయం. గ్రీసుకే చెందిన థూసిడైడిస్, పలీబియస్‌లు చరిత్రను 'జ్ఞాపకం వుంచుకోదగిన విషయాల గాధ'గా భావించారు. 16వ శతాబ్దానికి చెందిన ఆంగ్ల తత్త్వవేత్త ఫ్రాన్సిస్ బేకన్ 'మానవుల్ని వివేకవంతుల్ని చేసే విద్యావిభాగం చరిత్ర' అన్నాడు. మంచీ చెడు విచక్షణను తెలిపేది వివేకం. ఆ వివేకాన్ని కలిగించే ఒక సాధనం చరిత్ర అని అతని అభిప్రాయం. ఈ కారణంగానే చరిత్రను 'ఏవో సూత్రాలను తెలిపే సాధనంగా కాక, యుక్తాయుక్త విచక్షణ కల్గించే అధ్యాపకుని'గా 18వ శతాబ్దానికి చెందిన రాజనీతిజ్ఞుడు ఎడ్మండ్ బర్క్ భావించాడు.

జర్మను తత్త్వవేత్త లైబ్‌నిట్జ్, బ్రిటిష్ చరిత్రకారుడు లెకీలు చరిత్రను మతం గురించి చెప్పేదిగానో, నీతిసూత్రాలపై ఆధారపడిన జీవన విధానమనో భావించారు. ఆంగ్ల న్యాయశాస్త్ర చరిత్రకారుడు మైట్‌లాండ్ 'చరిత్ర అంటే మానవులు చేసింది, చెప్పింది - అన్నింటినీ మించి వాళ్ళు ఆలోచించింది' అన్నాడు. చరిత్రను 'సంఘజీవులైన మానవుల గాథ'గా పేర్కొని రేనియర్ చరిత్ర పరిధిని విస్తరించాడు. 'మహాపురుషుల జీవితచరిత్రలే మానవజాతి చరిత్ర' అని 19 వ శతాబ్దపు బ్రిటిష్ సాహితీవేత్త కార్లైల్ చెప్పి చరిత్ర గొప్పవారి ఘనకార్యాల రికార్డ్ క్రింద తేల్చాడు. ఈ భావననే అప్పటి అమెరికన్ తత్త్వవేత్త ఎమర్సన్, ఫ్రెంచ్ కవి లామార్టిన్‌లు బలపరుస్తూ, జీవిత కథే చరిత్ర అని చాటారు.

19వ శతాబ్దపు బ్రిటిష్ వారిలో చరిత్ర రాజకీయాలకు ప్రతిరూపం అనే భావన బలీయం. సీలీ, ఫ్రీమన్ వంటి చరిత్రకారులు యీ కోవలోనికి వస్తారు. ఈ కారణంగానే 'గత రాజకీయాలే నేటి చరిత్ర' అని ఫ్రీమన్ పేర్కొన్నాడు. అయితే చరిత్ర పరిధి విస్తృతమైన నేడు రాజకీయాలు చరిత్రలో ఒక భాగం మాత్రమేనని స్పష్టమవుతుంది. ఇక కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఆధునిక చరిత్రాచార్యునిగా ప్రసిద్ధుడైన ఆక్టన్ చరిత్రను 'మానవ స్వాతంత్ర్యం వివరించే గాథ'గా నిర్వచించాడు. అతని దృష్టిలో మహాసామ్రాజ్యాలు నిర్మించిన క్షణాలు చరిత్రలో గొప్ప క్షణాలు కాదు, మానసిక వికాసానికి తోడ్పడే సంఘటన లక్షణాలు, సంకల్పస్వేచ్ఛ పొందిన క్షణాలు గొప్పవి. నిర్బంధం ప్రేరణను చంపేస్తే స్వేచ్ఛాసంకల్పం సృజనాత్మకతను ప్రేరేపిస్తుందని అతని అభిప్రాయం.

'ప్రతిదేశ చరిత్ర ఆ దేశానికి సంబంధించిన నాగరికత చరిత్రే' నన్నాడు. ఏ.ఎల్.రౌజ్ మొత్తం చారిత్రక పరిజ్ఞానం పరోక్షం కాబట్టి చరిత్ర ప్రధానంగా ఒక వివేచనాశాస్త్రమనే ధృక్పథంతో ఫ్రెంచి చరిత్రకారుడు సినోబోస్ ధృక్పదంతో అతను ఏకీభవించాడు. ఫ్రాన్స్‌కు చెందిన టర్గాట్, కోడార్సేలు చరిత్రను ప్రగతి భావనతో జతపరచి చరిత్రకు ఏకతను, సమన్వయాన్ని కల్పించారు. ఈ ప్రగతి భావనాగతాన్ని వర్తమానంతో కలపడానికి బాగా తోడ్పడింది. దీనితో మానవాళి పురోగతిని కొలిచే సాధనంగా చరిత్ర రూపుదిద్దుకుంది. ఈ కొలమానం ప్రాతిపదికనే మానవుడు అనాగరిక స్థాయి నుండి యీనాటి స్థాయికి యే విధంగా అభివృద్ధిని సాధించిందీ తెలుసుకోగలుగుతున్నాం.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించిన అభివృద్ధి దృష్ట్యా శాస్త్రీయ దృక్పథంతో సమాజాల అధ్యయనం కావడం చారిత్రక చింతనలో మరోమలుపు. పర్యవసానంగా విచారణ, పరిశీలన, వివరణ, సత్యాన్వేషణ అనే విజ్ఞానశాస్త్ర లక్షణాలను చరిత్రకు వర్తింపజేసి ఐరిష్ చరిత్రకారుడు జె.బి. బరీ, చరిత్ర ఖచ్చితంగా శాస్త్రమే. History is a science no less and no more అని ప్రకటించి పెద్ద వివాదాన్ని రేకెత్తించాడు. "మానసిక - భౌతిక కార్యాచరణ నేపథ్యంలో సంఘజీవులుగా మానవుల వ్యక్తిగతమూ, విలక్షణమూ, సామూహికమూ అయిన చైతన్యాన్ని దేశ కాల పరిస్థితుల ఆధారంగా మానవ పరిణామాన్ని నిర్ణయించే యదార్థాలను పరిశోధించి, అందించే విజ్ఞానశాస్త్రమే చరిత్ర'' అని జర్మను చరిత్రకారుడు ఎర్నెస్ట్ బెర్న్‌హీం చరిత్రను మరింత సమగ్రంగా నిర్వచించాడు. జీవిత వాస్తవాలపై ఆధారపడి నిజంగా జరిగిన సంఘటనల గురించిన క్రమబద్ధమైన విజ్ఞానాన్ని చరిత్ర అందిస్తుందని ఆ జీవితపదార్థాలను వాటి సరైన సందర్భంలో వివరించడం, సంఘటన కార్యకారణ సంబంధాలను విశదీకరించి సమస్యకు మూలం కనుక్కోవడం, విషయాన్ని లోతుగా పరిశీలించి దానిని మొదటనుండి చివరిదాకా వ్యాఖ్యానించడం చరిత్రకారుని కర్తవ్యమని బెర్న్‌హీం అభిప్రాయం. చరిత్రలో యదార్థాల ప్రాముఖ్యంతో బాటు చరిత్రకారుని వ్యాఖ్యానికీ అంతే ప్రాధాన్యత వుందని అయితే చరిత్రకారునికీ అతని యదార్థాలకు మధ్య పరస్పర సంబంధం ఏవిధంగా వుండాలో వివరిస్తూ బ్రిటిషు చరిత్రకారుడు ఇ.హెచ్.కార్ చరిత్రను "చరిత్రకారునికీ, అతని యదార్థాలకూ మధ్య అవిచ్ఛిన్నంగా సాగే కార్యవిధానం; వర్తమానానికీ, గతానికీ మధ్య జరిగే అనంతమైన సంభాషణ''గా నిర్వచించాడు. చరిత్ర రచన తలపెట్టినప్పుడు చరిత్రకారుడు ప్రాథమికంగా ఎంచుకొని వాటి ప్రాతిపదికతో ముందుగా ఒక వ్యాఖ్యానం ఆరంభిస్తాడు. ముందుకు సాగే కొద్దీ వ్యాఖ్యానం, యదార్థాల ఎంపిక పరస్పరం

ప్రభావితం చేసుకుంటూ అతనికి తెలియకుండానే క్రమేణా మార్పు చెందుతాయి. చరిత్రకారుడు వర్తమానానికీ, అతని యదార్థాలు గతానికి సంబంధించినవి గనుక యీ పరస్పర సంబంధం వర్తమానానికీ, గతానికీ మధ్య కూడా వుంటుంది. యదార్థాలు చరిత్రకు పునాది చరిత్రకారుడు యదార్థాలకు ప్రాణం పోస్తాడు . . . అర్థం కల్పిస్తాడు. అలాగే గతం లేకుంటే వర్తమానం లేదు. వర్తమానం లేకుండా గతానికీ అర్థం లేదు. ఈ విషయాలనే కార్ తన నిర్వచనంలో సూక్ష్మీకరించాడు.

ఇప్పటిదాకా చెప్పుకున్న నిర్వచనాలకు భిన్నంగా చరిత్రను నిరాశావాదంతో విరూపంగా చిత్రించిన నిర్వచనాలు మరోరకం. ప్రష్యాను పాలించిన రెండో ఫ్రెడరిక్ చరిత్రను 'అసత్యవాది'గా ఇంగ్లండ్‌కి చెందిన రాజనీతిజ్ఞుడు రాబర్ట్ వాల్‌పోల్, ఫ్రెంచి తత్వవేత్త వాల్టేర్, చక్రవర్తి నెపోలియన్లు 'కట్టుకథ'గా, అమెరికన్ వ్యాపారవేత్త హెన్రీఫోర్డ్ 'వట్టిమావం'గా యులీసెస్ గ్రంధకర్త జేమ్స్ జాయిస్ ఒక 'పీడకల'గా చిత్రించారు. ఇవన్నీ వారి పాక్షిక దృక్పథాలను ప్రతిబింబించేవే.

## 1.3 చరిత్ర లక్షణాలు :

చరిత్రకు అనేకులు అనేక రకాల నిర్వచనాలివ్వడం పైన వివరించడం జరిగింది. అందులో కొన్ని సామాన్యం మరికొన్ని సంకీర్ణం. చరిత్రను నిర్వచించడంలో ఆరిస్టాటిల్, రేనియర్‌లు గతానికి ప్రాముఖ్యతయిస్తే, కార్ చరిత్రను వర్తమానానికి, గతానికి వారధిగా భావించాడు. కార్లైల్, ఎమర్సన్, లామర్టీన్లు మహాపురుషుల కోణం నుండీ చూస్తే ఫ్రీమన్, సీలీలు రాజకీయాలకు ప్రతిరూపంగా భావించారు. చరిత్రను జటిల్యంగా కొందరు నిర్వచిస్తే, నిష్ఠురంగా మరికొందరు నిర్వచించారు. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్వచనం ఒక్కటీ లేకపోవడం చూస్తుంటే చరిత్రను నిర్వచించడం చాలా క్లిష్టమన్పిస్తుంది. నిర్దిష్టంగా విషయాన్ని నిర్వచింపలేనప్పుడు చరిత్ర అంటే ఏమిటో వివరించవచ్చు. ఆయా నిర్వచనాలను, అవి ప్రతిబింబించే దృక్పథాలను విశ్లేషిస్తే చరిత్ర భిన్నలక్షణాలు కన్పిస్తున్నాయి.

### 1.3.1 చరిత్ర మానవ ప్రపంచానికి సంబంధించినది :

చరిత్ర జిడ జగత్తును గురించి కాని యితర జీవ ప్రపంచం గురించి కాని పరిశీలనలోకి తీసుకోదు. అది కేవలం మానవునితోనే ముడిపడి వుంది. ఈ చరాచర సృష్టికే తలమానికమైన మానవుడు ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి పరికరం. అందుకే చారిత్రక ప్రాధాన్యత వున్న మహాపురుషులు జీవితాలను వారి సామాజిక నేపథ్యంలో అధ్యయనం చేస్తే సంఘటనలను, వాటి క్రమాన్ని సరిగ్గా అర్థం చేసుకోగలమని కార్లైల్ అభిప్రాయం.

అయితే వర్తమానం సామాన్య మానవునిది. ప్రజాసమూహాలు ప్రబలమైన సాంఘిక శక్తిగా రూపొంది చరిత్రగతినే మలుపు తిప్పుతున్న రోజులివి. దీనితో సార్వత్రిక మానవాళి చరిత్ర చరిత్రకారుని ఆదర్శంగా మారింది. ఒక సామాజిక ప్రక్రియగా చరిత్రను, సామాన్య ప్రజల పాత్రను అధ్యయనం చేయడం ముఖ్యమని కార్ పేర్కొన్నారు.

### 1.3.2 వ్యక్తులను దేశం, కాల పరిస్థితుల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి :

మానవుడు, ప్రకృతి చరిత్రకు ప్రధానాంశాలు. ఈ రెండింటి మధ్యా పరస్పర ప్రభావం తప్పనిసరి. భౌగోళిక, నైసర్గిక పరిసరాలు మనిషి వ్యక్తిత్వాన్ని రూపొందిస్తే, మనిషి చేతుల్లో పరిసరాలు ఆకారాన్ని రూపుదిద్దుకుంటాయి. చైతన్యవంతమైన యీ పరస్పర ప్రభావం నుండే ఆయారంగాల్లో మనిషి సాధించే విజయాల తీరుతెన్నులు ఆవిర్భవిస్తాయి.

నైసర్గిక, భౌగోళిక పరిసరాలే కాకుండా మానవుడు జీవించే కాలం కూడా అతనిపై ప్రభావం చూపుతుంది. భౌగోళిక స్థితి, కాలమానం, చరిత్రకు రెండు కళ్ళని రిచర్డ్ హక్లుయర్ మహాశయుడు చెప్పిన విషయం తెలిసినదేకదా ! చరిత్ర సారం

కాలంపైనే ఆధారపడి ఉంది. కాలమనేది గతం, వర్తమానం, భవిష్యత్తులతో అనంతంగా సాగే ప్రవాహం. పరిణామ శీలమైన కాలం ప్రకృతిపై, మానవునిపై నిరంతరం మార్పు చూపిస్తూనే వుంటుంది. ఒక సంస్థ కాని, ఒక వ్యవస్థ కాని, ఒక సిద్ధాంతం కాని, ఒక ఆశయం కాని శాశ్వత విలువలతో వుండవు. కాలమే ఎప్పటికప్పుడు విలువల్ని నిర్ణయిస్తుంది. చరిత్రకు అవిచ్ఛిన్నతను ప్రసాదిస్తున్నది కాలమే. చరిత్రలో వచ్చిన మార్పుల్ని వివరించడానికి చరిత్రకారుడే తన సౌకర్యం కోసం చరిత్రను యుగాలని, శకాలని విభజిస్తున్నాడు. చరిత్ర అనేది కాలగతితో మానవాళి అభివృద్ధి క్రమమే. దేశ కాల పరిస్థితుల నేపథ్యంలో గతకాలపు సంఘటనలను చరిత్రకారుడు అర్థవంతమైన సమగ్ర రచనగా తీర్చి దిద్దగలుగుతున్నాడు. మారే కాలపు విలువలతో బాటే దృక్పథాలూ మారుతాయి. కనుకనే చరిత్రను ప్రతి తరానికి తిరిగి రాయాలి.

### 1.3.3 చరిత్ర శాస్త్రీయం :

చరిత్ర రచన రెండు విషయాలపై ఆధారపడివుంది. ఒకటి చరిత్రాధారాల అన్వేషణ సేకరణ, మరొకటి లభించిన సమాచారాన్ని వివేచనాత్మకంగా విశ్లేషించటం. అన్ని శాస్త్రాలకూ మూలమైన కార్యకారణ సంబంధాన్ని కాదంటే జీవితం ప్రయోజన శూన్యం, శాస్త్రాలు నిరర్థకం అవుతాయి. చరిత్ర కూడా యీ కార్యకారణ సంబంధాన్ని ఆమోదించి జరిగిన, జరుగుతుందన్న సంఘర్షలకు కారణాలను వెతుకుతుంది. లభిస్తున్న విజ్ఞానాన్ని క్రమబద్ధీకరించి కొన్ని సామాన్య సూత్రాలను శాస్త్రాజ్ఞులు ప్రతిపాదించినట్లే చరిత్రకారుడూ సత్యాన్వేషణకు తోడ్పడే ఆలోచనా సాధనాలుగా సామాన్య సూత్రాలను చెబుతున్నాడు.

## 1.4 చరిత్ర చరిత్ర :

ఒకప్పుడు తత్వశాస్త్రంలో అంతర్భాగంగా, అనంతరం రాజనీతి, అర్థశాస్త్రాలతో ముడిపడిన చరిత్ర నేడు స్వతంత్ర అధ్యయన విభాగమయింది. మానవాళి గత అనుభవాల సారాన్ని ప్రతిబింబిస్తూ వర్తమానాన్ని అర్థం చేసుకునే సాధనంగా స్వీయ వివరణాత్మకంగా ఎదిగింది. పదాలు, కథాగేయాలు, జానపద వీరగాథలే చరిత్ర అనుకునే ఒకప్పటి స్థాయినుంచి విశ్వజనీన సర్వమానవాళి అనుభవసారమనే స్థాయికి చరిత్ర అభివృద్ధి చెందింది. 'చరిత్ర పిత' ప్రసిద్ధుడైన గ్రీకు చరిత్రకారుడు హెరిటోడస్., క్రీ.పూ. 5 వ శతాబ్దంలోనే చరిత్రకు 'అన్వేషణ' సూత్రాన్ని అనుసరించి స్వతంత్ర అధ్యయన విషయ ప్రతిపత్తిని తీసుకువచ్చాడు. అతని అనంతరం థూపిడైడిస్ చారిత్రకు విశ్వసనీయతా ప్రమాణాలను నెలకొల్పాడు.

మధ్యయుగంలో చరిత్ర మతం చేతిలో కీలు బొమ్మగా మారింది. కాని 17 వ శాతాబ్దంలో సాహిత్యేతరమైన శాసనాలు, నాణేలు వుపయోగంలోకి రావడం, చారిత్రక ప్రమాణ గ్రంథాల పరిశీలన పెరగడంతో విమర్శనాత్మక చరిత్రకు గట్టి పునాది ఏర్పడింది. 19 వ శతాబ్దంలో శాస్త్రీయ సూత్రాలు, పద్ధతులు అవలంభించడంతో చరిత్ర విజ్ఞానశాస్త్ర స్థాయికి పెరిగింది. జర్మనీ శాస్త్రీయ చరిత్రకు పుట్టినిల్లయింది. విషయాత్మక పరిణామం కూడ చరిత్రలో కన్పిస్తుంది. ఒకప్పుడు రాజకీయ అంశాలకే పరిమితమైన చరిత్ర కార్ల్‌మార్క్స్ ఆగస్ట్‌కాంట్‌ల పుణ్యమా అని ఆర్థిక, సామాజిక విషయాలవైపు దృష్టి మళ్ళించింది. అనంతరం మానవజాతి విజయ పరంపరలో సాంస్కృతిక చరిత్రకు ప్రాధాన్యత హెచ్చింది. సమాజశాస్త్రం మనోవిజ్ఞాన శాస్త్రాల అభివృద్ధితో చరిత్రకారుడు మరిన్ని కొత్త విషయాలవైపు దృష్టి సారించాడు.

## 1.5 చరిత్ర స్వభావం :

కాలగతిలో వచ్చిన కొత్త పరిణామాలతో మానవ దృక్పథంలో కొత్త భావాలు, విలువలు తలెత్తినాయి. దీనితో యిటీవలి కాలంలో చరిత్ర స్వభావరీత్యా, విషయపరిధి పరంగా విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పర్యవసానంగా గతంలో వరుసగా పేర్చిన సంఘటనల జాబితాగా వుండే చరిత్ర యిప్పుడు ప్రాచీన గ్రంథాలలోని కథలను పునశ్చర్య చేయటం గాక

విమర్శనాత్మక శాస్త్రీయ అధ్యయనం అయింది. చరిత్రను ఒక నిరంతర సామాజిక ప్రవంతిగా భావించి గతాన్ని వర్తమానం సహాయంతో, వర్తమానాన్ని గతం వెలుగులో పూర్తిగా అర్థం చేసుకోవడం చరిత్రకారుని కర్తవ్యం అయింది. నిదర్శనాలలో గతంలో ఏం జరిగిందో తెలుసుకోవడం, చారిత్రక యదార్థాలను నిర్ణయించి మదింపుచేసి విలువకట్టి ప్రాధాన్యతను, అంతరార్థాన్ని జనసామాన్యానికి అర్థమయ్యేలా ఆకర్షణీయంగా భావాలను వ్యక్తీకరించడం చరిత్రకారుని లక్షణంగా మారింది. కనుకనే చారిత్రక యధార్థాలను సేకరించడంలో ఒక శాస్త్రవేత్తగా, వాటిని వివరించడంలో ఒక సాహితీవేత్తగా వాటిని సూత్రీకరించడం ద్వారా ఒక తత్వవేత్తగా చరిత్రకారుడు వ్యవహరిస్తున్నాడు.

సంకీర్ణమైన చరిత్ర స్వభావం అనేక దృక్పధాలకు, వివరణలకు చోటు కల్పించింది. చరిత్రకు ప్రాతిపదిక చారిత్రక యదార్థాలు కాబట్టి, చారిత్రక యదార్థాల స్వభావమూ సంకీర్ణమే. 'ఆనుషంగిక' లేదా 'సాహాయక' శాస్త్రాల తోడ్పాటుతో లభించే, చరిత్రకారులు అందరికీ సమానమైన 'ప్రాథమిక యదార్థాల' మాట అటుంచి గతానికి సంబంధించిన యితర యదార్థాలు చారిత్రక యదార్థాలు కావటం చరిత్రకారుని వ్యాఖ్యానంపై, ప్రాధాన్యతాక్రమంపై ఆధారపడి వుంది. కనుక చారిత్రక యదార్థాలన్ని ఆయా చరిత్రకారుల ఆలోచనా ధోరణుల్ని, నమ్మకాలను ప్రతిబింబిస్తాయి. ఫలితంగా ఎంత కాదనుకున్నా చరిత్రకారుడు గతాన్ని అధ్యయనం చేసేటప్పుడు పక్షపాతంగా సమకాలీన పరిస్థితుల ప్రభావంలో తనకాలపు విలువలను, ఆశనిరాశల్ని ప్రతిబింబిస్తాడు.

## 1.5.1 భిన్న దృక్పథాలు :

చరిత్ర స్వభావ సంకీర్ణతను ప్రతిబింబిస్తూ భిన్న చరిత్రకారులు భిన్న దృక్పధాలను కనబరచారు. చరిత్రకు ముడిసరుకు చారిత్రక యదార్థం అనే నమ్మకంతో కొంతమంది 'ధృవీకరింపబడిన యథార్థాల సంకలనమే' చరిత్ర అని భావించారు. కాని చరిత్రకు ముడిసరుకు చరిత్ర ఎలా అవుతుంది ? ఋజువు చేసిన చారిత్రక యదార్థాలను ఒకచోట పోగు చేస్తే అది బ్రిటిషు చరిత్ర తత్వవేత్త అన్నట్లు, 'అతుకుల బొంత చరిత్ర' (Scissors and paste history) అవుతుందేకాని శాస్త్రీయ అధ్యయనం ఎలాగవుతుంది ? అనేక నిరూపిత యదార్థాల నుండి చరిత్రకారుడు చారిత్రక యథార్థాలను యెంచుకుని వాటి తోడ్పాటుతో నాగరికతా ప్రవంతిని హేతుబద్ధంగా విశదీకరించాలి.

ప్రాచీన కాలపు థూసిడైడిస్ నుండి ఆధునికయుగపు స్పెన్గ్ టాయ్న్బీ వరకు చరిత్రకు పునరావృతమయ్యే స్వభావముందనే నమ్మకాన్ని వెలిబుచ్చారు. ప్రతి సంవత్సరం ఋతువులు పునరావృతమైనట్లే జీవిత చక్రంలో పుట్టటం, పెరగటం, చనిపోవటం సహజమైనట్లే మానవ సంస్కృతీ నాగరికతల్లో కూడా పునరావృతం సహజమని వీరి భావన. కాని మార్క్స్ చెప్పినట్లు సంఘటనల మధ్య ఎన్నో పోలికలున్నా ఏ రెండూ ఒక్కటికావు. ఆయా స్థితిగతుల తులనాత్మక అధ్యయనంవల్ల పరిణామాలకు కీలకమేమిటో? కొంతమేరకు అర్థం చేసుకోవచ్చు. కాలిన్‌వుడ్ అభిప్రాయంలో చరిత్రలో మనకు కన్పించేది చక్రీయ గమనం కాదు. సర్పిలగమనం (Spiral enrolement) కార్ దృష్టిలో చరిత్ర పునరావృతమయ్యే ప్రసక్తే లేదు. గత సంఘటన పూర్వాపరాలు మనకు తెలిసినప్పుడు మన ప్రవర్తన ఆ పరిజ్ఞానం వల్ల ప్రభావితమౌతుంది కదా! పైగా భవిషత్తూ గతంలాగే వుంటుందనుకుంటే మానవాళి సృజనాత్మకక్రియాశక్తులకు పాత్రేముందీ కాని మానవ జీవితం పురోగమిస్తూనే వుంది కదా !

చరిత్ర పునరావృతమౌతుందనే భావనలో భాగంగా 'చరిత్ర మొత్తం సమకాలీనమే'ననే దృక్పథాన్ని గత శతాబ్దారంభంలో ఇటాలియన్ క్రోచె విలెబుచ్చాడు. చారిత్రక యదార్థాలే సర్వస్వం, యదార్థాలే చరిత్ర అనే 19 వ శతాబ్దపు భావనకు యిది పూర్తి విరుద్ధం. కాలిన్గ్‌వుడ్ కూడా నొక్కి చెప్పినట్లు గతానికి సంబంధించిన యదార్థాలను, తన సమకాలీన సామాజిక సమస్యల, విలువల కోణంనుండే చరిత్రకారుడు వీక్షిస్తాడు. గనుక సర్వత్రా క్రోచె అభిప్రాయాన్ని గౌరవిస్తున్నారు. చరిత్రకారుడు వర్తమాన కాలానికి సంబంధించిన వాడు కాబట్టి అతడు గతాన్ని వర్తమానకాలపు దృక్పథంతో, వర్తమానకాల సమస్యల వెలుగులో చూస్తాడు.

అందుచేతనే ఇ.హెచ్. కార్ చరిత్రను 'వర్తమానానికి, గతానికి మధ్య జరిగే అనంతమైన సంభాషణ'గా చిత్రించాడు. అయితే గతం వర్తమానంతోనే కాక, భవిష్యత్తుతో కూడా ముడిపడివుంది. భవిష్యత్తెలా వుండాలి ? ఎలా వుంటే బావుంటుంది ? అనే ఆలోచనతోనే గతం పునాదిగా చరిత్రకారుడు వర్తమానంలో ఉద్యమిస్తాడు. నెమియర్ చెప్పినట్లు 'చరిత్రకారులు గతాన్ని వూహిస్తారు, భవిష్యత్తును జ్ఞాపకం వుంచుకుంటారు ! కార్యకారణ సంబంధంతో గతాన్ని విశ్లేషించి సాధరణీకరణం ద్వారా చరిత్రకారుడు భవిష్యత్తుని సూచిస్తాడు.

సంకీర్ణ చరిత్ర స్వభావానికి సంబంధించిన మరో వివాదాస్పద విషయం ఆక్టన్ చెప్పిన చరిత్రలో విలువకు సంబంధించిన తీర్పులు సమంజసమా ? అనేది. ఆక్టన్ సమంజసమనే కాదు అవసరం అనికూడా పేర్కొన్నాడు. వ్యక్తులపైగాక సంఘటనపై, వ్యవస్థల కార్యాచరణపై ప్రత్యక్షంగానో,పరోక్షంగానో విలువలతో కూడిన తీర్పులు తప్పవు. చరిత్రను ప్రగతి శీలంగా భావించే యీనాడు చరిత్రలో శాస్త్రీయతకు మరింత తావుంది.

## 1.6 చరిత్ర విషయపరిధి :

విషయపరిధిలో మరే యితర విద్యావిషయంకన్నా చరిత్ర విస్తృతమైనది. చరిత్రకు మూలమైన గ్రీకు పదం 'ఇస్తొరియా' అంటే అన్వేషణ కదా ! ఈ అన్వేషణ అనేది మానవ జగత్తు గతం గురించి. చరిత్ర పరమైన ఆసక్తి మానవుడు విచక్షణా జ్ఞానంతో సంఘజీవిగా మారినప్పటి నుండి ప్రారంభమయింది. అయితే మొదట్లో వీరగాథా గేయాలతో జానపద కథారీతిలో పుక్కిట పురాణంగా కల్పనతో చరిత్ర వుండేది. క్రమేణా విషయపరిధిలో మార్పు వచ్చింది. రాజ్యాలు, రాజవంశాల వృద్ధి క్షయాలకు పరిమితమైచరిత్ర కాలక్రమంలో సమాజం, సామాజిక వ్యవస్థల పరిణామం, పరిపాలన, యుద్ధాలు, ఒడంబడికలు, అంతర్జాతీయ సంస్థలు, విదేశీ వ్యవహారాలు, మత, సాంస్కృతిక, ఆర్థిక అంశాలు, పరిణామాలు వివరించేదిగా రూపొందింది. ఒక మాటలో చెప్పాలంటే మానవాళి సంస్కృతి, నాగరికతలను ప్రతిబింబించే ప్రతి విషయమూ చరిత్రలో అంతర్భాగమయింది. కాలంతోబాటే చరిత్ర విషయపరిధీ మరింత విస్తృతమయింది. వంశచరిత్ర స్థాయినుండి మానవ నాగరికతా పరిణామం విశదీకరించే సాంఘిక శాస్త్రం స్థాయికి చరిత్ర ఎదిగింది.

వివిధ కాలాల్లో వివిధ చరిత్రకారులు చరిత్రను కార్యకారణ సంబంధం రీత్యానో, ఆర్థిక విషయాల దృష్ట్యానో, మహాపురుషుల పరంగానో, విజ్ఞాన శాస్త్రపరంగానో వీక్షించి వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 19 వ శతాబ్దంలో చరిత్ర గతిని వివరించడంతో శాస్త్రీయ ధోరణులు చోటు చేసుకోవడంతో విజ్ఞానశాస్త్ర స్థాయికి ఎదిగిన చరిత్ర ఏం జరిగింది ? ఎలా జరిగింది ? ఎందుకు జరిగింది ? వివరించడం దాని లక్షణంగా, లక్ష్యంగా మారింది. రాజకీయాల ప్రాధాన్యం తగ్గి ఆర్థిక, సామాజిక అంశాల ప్రభావం వైపు దృష్టి మళ్ళింది. ఉత్పత్తి సంబంధాలు, ఆర్థిక స్థితిగతులు చరిత్ర గమనాన్ని నిర్ధేశిస్తాయని పేర్కొని కార్ల్‌మార్క్స్ విప్లవాత్మక చరి&రత విశ్లేషణకు తెర తీసాడు. అనంతరం సమాజ, మనోవిజ్ఞాన శాస్త్రాల అభివృద్ధితో చరిత్రకారుల ఆలోచనలు, పరిశీలనా విధానాలు మారినాయి. ఈ నూతన ధోరణుల ఫలితంగా చరిత్ర విషయపరిధి అనూహ్యంగా విస్తరించింది. విశ్వజనీన సర్వమానవ చరిత్ర యీనాడు చరిత్రకారుని ఆదర్శం. ఒకప్పుడు సాహిత్యంలో భాగంగానో, తత్వశాస్త్రంలో భాగంగా భావింపబడ్డ చరిత్రకు నేడు స్వతంత్ర ప్రతిపత్తి కలిగింది. అమెరికాలో చారిత్రక సాపేక్షితావాదం ఆవిర్భవించడంతో చరిత్ర విషయపరిధి మరింత పెరిగింది. ప్రజా సమూహాలను ఏ ఆశలు, ఆశయాలు ప్రేరేపించి మార్గదర్శకమై చైతన్యవంతుల్ని చేసాయో ఆ విషయాలు చరిత్రాధ్యయనంలో ప్రధానమైనాయి. దీనితో విశ్వజనీన సర్వమానవ చరిత్రలో సామాన్య ప్రజలపాత్రను విశ్లేషించి, వ్యాఖ్యానించడం నేడు చరిత్రకారుని ఆదర్శమయింది.

## 1.7 మాదిరి ప్రశ్నలు :

### ఎ) సంక్షిప్త ప్రశ్నలు

1. ఆంగ్లభాషలోని హిస్టరీ మూలపదం గురించి వ్రాయండి ?
2. నాటి గ్రీకు చరిత్రకారుల నుండి నేటి కార్ వరకు చరిత్రకు యిచ్చిన భిన్న నిర్వచనాలను గురించి వ్రాయండి ?
3. చరిత్ర లక్షణాలను గురించి వ్రాయండి ?
4. చరిత్ర బహుముఖ స్వభావం గురించి వ్రాయండి ?
5. చరిత్ర విస్తృత విషయపరిధి గురించి తెలపండి.

### బి) వ్యాసరూప ప్రశ్నలు

1. చరిత్రను నర్వచించి, దాని స్వభావాన్ని, విషయ పరిధిని వివరించండి.
2. చరిత్ర స్వభావాన్ని విపులంగా చర్చించి, దాని విషయ పరిధిని గురించి రాయండి.

### సి) ఈ క్రింది వాటిపై లఘువ్యాఖ్యలను రాయండి ?

1. గ్రీకులు చరిత్రకిచ్చిన నిర్వచనాలను పేర్కొనండి.
2. చరిత్ర లక్షణాలను వివరించండి.
3. చరిత్ర పునరావృత మౌతుందా ?
4. చరిత్ర విషయపరిధిని వివరించండి.

## 1.9 ఉపయుక్త గ్రంధాలు :


| | | |
|---|---|---|
| Carr, E.H | : | What is History ? (Macmillan, 1961) |
| Clark, Kitson | : | The critical Historian (Heinman, London, 1970) |
| Collingwood, R.G | : | The Idea of History (O.U.P., 1966) |
| Daniels, R.V. | : | Studying History, How and Why ? (Prentice Hall, New Jersey, 1960) |
| Durga Prasad, J. | : | Charitra Rachana Sastranm (Tel.) (Telugu Akademi, Hyderabad, 1987) |
| Elton. G.R. | : | The Practice of History (Fontana, 1969) |
| Gardiner, Patrick | : | The Nature of Historical Explanation (O.U.P., 1968) |
| Newins, Aller | : | The Gateway to History (Vota & co, 1968) |
| Marwick, Arthur | : | The Nature of History (Mac millan, London 1970) |
| Sastri, K.A.N. & Ramanna, H.S. | : | Historical Method in relation to Indian History (S. Viswanathan, Madras, 1956) |
| Vajreswari | : | A Hand Book for History Teachers (Madras, 1966) |
| Webster, John C.B | : | An Introduction to History (Mac millan, 1977) |

పాఠం - 2

# యధార్థాలు - చరిత్రకారుడు

**విషయక్రమం :**


2.0 లక్ష్యం
2.1 పరిచయం
2.2 యదార్థం అంటే . . . ?
2.3 చారిత్రక యదార్థాలు
2.4 మౌలిక యదార్థాలు
2.5 చారిత్రక యదార్థాల నిర్దేశంలో చరిత్రకారుని పాత్ర
2.6 20వ శతాబ్దంలో . . . . .
2.6.1 క్రోచె, కార్ల్ బెకర్‌ల ధోరణి
2.6.2 కాలిన్‌గ్వుడ్ చరిత్రతత్వం
2.6.3 విమర్శ
2.7 చరిత్రకారుడు తన యదార్థాలకు ఏ విధంగా స్పందించాలి ?
2.8 సంక్షిప్తంగా . . .
2.9 పరీక్ష నమూనా ప్రశ్నలు
2.10 ఉపయుక్త గ్రంథాలు


## 2.0 లక్ష్యం :

ఈ పాఠం అధ్యయనం వలన మీరు :

- యదార్థం అంటే ఏమిటి ? చారిత్రక యదార్థాలని వేటిని పేర్కొంటాము ? అవేవి వివరించగలగాలి.
- యదార్థాల స్వరూప స్వభావాలను పేర్కొనగలగాలి
- చరిత్ర రచనలో చారిత్రక యదార్థాల పాత్రను, వాటికి చరిత్రకారునికి మధ్య వుండవలసిన సంబంధాన్ని విశ్లేషించగలగాలి.

## 2.1 పరిచయం :

చరిత్రకు మూలపదమైన 'ఇస్తొరియా' అంటే, అన్వేషణ అని భావించినప్పుడు యీ అన్వేషణ గతం గురించి అనేది స్పష్టం. గతం గురించి పరిశీలన ఎవరి గురించి ? దీని గురించి అంటే మానవ సంస్కృతీ నాగరికతల పరిణామం గురించి అని చెప్పవచ్చు. ఈ పరిణామం గురించి వివరించడానికి చరిత్రకారుడు గతంలో జరిగిన సంఘటనలపై ఆధారపడతాడు. సంఘటనలను యదార్థాల నుండి, యదార్థాలను సంఘటనలు వదలివెళ్ళిన అవశేషాలు లేదా చరిత్ర ఆధారాల నుండి గ్రహిస్తాడు. సహాయక లేదా అనుషంగిక శాస్త్రాల సహాయంతో లభించే ప్రాథమిక (మౌలిక) యదార్థాలు చరిత్రకారులందరికీ సమానమే గాని గతానికి సంబంధించిన యదార్థాలన్నీ చారిత్రక యదార్థాలుగా పరిగణించబడటం లేదు. వేటికయితే చరిత్రకారుడు ప్రాధాన్యతను ఆపాదిస్తున్నాడో అవే చారిత్రక యదార్థాలుగా రూపొందుతున్నాయి. కుర్ చెప్పినట్లు చరిత్ర యదార్థాలు వాటిని గ్రంధస్థం చేసిన

వ్యక్తుల, చరిత్రకారుల మనసులలో పరావర్తనం చెంది బయటపడుతున్నవే. అంటే చరిత్రకు ముడిసరుకైన యదార్థాలూ కావాలి ? . . ఆ యదార్థాలను చారిత్రక యదార్థాలుగా నిర్ణయించే చరిత్రకారుడూ కావాలి. వీటిలో దేనికో ఇంకో దానిపై ఆధిపత్యంలేదని, రెండూ యిచ్చి పుచ్చుకొనే ధోరణిలోనే వుండాలని గ్రహించాలి.

## 2.2 యదార్థం అంటే . . . ?

ఆంగ్లపదం 'Fact' కి మూలం లాటిన్ భాషలోని 'Factum' దీనినే వ్యవహారంలో 'యదార్థం' అని లేదా 'వాస్తవం' అని వుపయోగించటం జరుగుతున్నది. ఉన్నది అనో, జరిగింది అనో తెలిపిన దానిని సూచించడానికి సాధారణంగా యీ మాట నుపయోగిస్తారు. కాలక్రమేణా జరిగిన మానవ నాగరికతా సంస్కృతుల పరిణామాన్ని వివరించేది చరిత్ర అని భావిస్తే యీ పరిణామాన్ని వివరించేందుకు చరిత్రకారుడు గతంలో జరిగిన సంఘటనలపై ఆధాపడతాడు. ఈ సంఘటనలను అతడు యదార్థాల నుండి గ్రహిస్తాడు. ఏ చారిత్రక అన్వేషణకైనా యధార్థాలు ముడిసరుకు. యదార్ధాలు లభించే సాక్ష్యపత్రాలు లేదా చరిత్ర ఆధారాలు ముఖ్యం. యదార్ధాలు లేకుంటే చరిత్ర లేదు.

### 19వ శతాబ్దం యదార్ధాల మహాయుగం :

చరిత్రలో ఏం చెప్పినా, యదార్ధాల పైనే ఆధారపడాలి. యదార్ధాలు కళ్ళెదుట ప్రత్యక్ష్యంగా కన్పించే శిలలు. వీటిపైనే చరిత్రను నిర్మించటం సాధ్యం. చరిత్రకారుడు చెప్పే కథనం యదార్థాల ప్రామాణికతపైనే ఆధారపడివుంది. అందుచేతనే 19వ శతాబ్దం అన్నివర్గాల దృష్టిలో యదార్ధాల మహాయుగం. ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత ఛార్లెస్ డికెన్స్ రాసిన Hard time అనే నవలలో గ్రాడ్‌గ్రెండ్ అన్నపాత్రధారి 'నాకు కావలసినది యదార్ధాలు . . . కేవలం యదార్థాలే జీవితంలో కావలసినవి' అని చెబుతాడు. 19వ శతాబ్దపు చరిత్రకారులందరూ యీ అభిప్రాయంతో ఏకీభవించారు. 1830 దశకంలో శాస్త్రీయ చరిత్రకారుడు రాంకె చరిత్రను నీతిబోధకంగా రూపొందించడాన్ని విమర్శిస్తూ, 'కేవలం జరిగింది జరిగినట్లు చెప్పడమే చరిత్రకారుని విధి' అని పేర్కొన్నాడు. అనంతరం మూడు తరాల జర్మను, బ్రిటిషు, ఫ్రెంచి చరిత్రకారులు అతనికి వంతపాడారు. చరిత్ర విజ్ఞానశాస్త్రం స్థాయికి తీసిపోదని ఘంటాపదంగా చెప్పాలనుకున్న ప్రత్యక్ష జ్ఞానవాదులు యీ యదార్థాల ఆరాధనకు తమ పలుకుబడిని జోడించారు. 'ముందు యదార్థాలను రాబట్టు . . . అప్పుడప్పుడు వాటి నుండి నిర్ధారణలు చెయ్యి' అనేది వారి మాట. ఇదే భావన బ్రిటిషు అనుభవైక ప్రామాణ్యతావాదులదీను, దేనికైనా స్వానుభవమే ప్రమాణం వీరికి. ఈ వర్గ తాత్విక లక్షణాన్నే ప్రతిబింబిస్తూ, ఆక్స్‌ఫర్డ్ షార్టర్ ఇంగ్లీషు డిక్షనరీ యదార్థాన్ని 'తుదినిర్ణయాలకు భిన్నమైన ఒక అనుభవ సమాచారం' అని నిర్వచించింది. ఇది ఒక విధంగా చెప్పాలంటే ఆ శతాబ్దపు జనానికి చరిత్ర అంటే వున్న సాధారణ భావన. వారి దృష్టిలో చరిత్ర అంటే ధృవీకరించబడిన యదార్థాల సముదాయమే. అందుచేతనే, సి.పి.స్కాట్ అనే జర్నలిస్టు 'యదార్ధాలు పవిత్రమైనవి, అభిప్రాయం స్వేచ్ఛాయుతం' అన్నాడు.

## 2.3 చారిత్రక యదార్ధాలు :

గతానికి సంబంధించిన యదార్థాలన్నీ చారిత్రక యదార్థాలు కావు. అటువంటప్పుడు చారిత్రక యదార్థం అంటే ఏమిటి ? ఏ ప్రాతిపదికపై ఇతర యదార్థాల నుండీ చారిత్రక యధార్థాలను ఎలా వేరుచేయడం ? ఇది అత్యంత ప్రధానమైన సమస్య. చరిత్రకారుడు మానవాళి కార్యకలాపాలను, అనుభవాలను యే విధంగా తెలుసుకుంటున్నాడురు చారిత్రక యదార్థాల ద్వారా మాత్రమే తెలుసుకోగలుగుతున్నాడు. అవి గతాన్ని వర్ణిస్తాయి, గతించిన కాలానికి సంబంధించినవి గనుక చారిత్రక యదార్థాలు, అంచనాలకు ప్రమాణం ఏమిటి ? ప్రత్యక్ష పరిశీలనకు గతమనేది మనముందు సజీవంగా లేనప్పటికీ గతానికి

సంబంధించిన, గతకాలపు సంఘటనలు వదలివెళ్ళిన అనేక అవశేషదృశ్య చిహ్నాలను యదార్థాలను నిరూపించడానికి అధ్యయనం చేయవచ్చు. చారిత్రక సంఘటనల చిహ్నాలే ఆ సంఘటనలను వాస్తవమైనవిగా మన ముందు వుంచుతున్నాయి.

గతంలో జరిగిన ప్రతిదీ చరిత్రలో యదార్థమే. ఈ యదార్థాలు వేటికవే విడివిడిగా వివిధ చరిత్ర ఆధారాలతో చెల్లాచెదురై వున్న అణువుల వంటివి. వీటిలో ఎక్కువభాగం వుపేక్షావస్థలో వుండి చరిత్రకారునికి దొరకవు. పరిశీలనాత్మక దృష్టి వున్న చరిత్రకారుడు తాను వ్యవహరించే విషయానికి అన్వయించే యదార్థాలను ఎంచుకొని వాటికి ప్రాధాన్యతను ఆపాదించకపోతే యీ యదార్థాలు అచేతనంగా, అర్థరహితంగా మిగిలిపోతాయి. ఇంకోమాటలో చెప్పాలంటే చరిత్రకారుడు స్పందించే తీరునుబట్టి, అతని చైతన్యాన్ని బట్టి యదార్థాల వునికి నిర్ధారింపబడుతుంది. చరిత్రకారుని కథనం యదార్థాల ప్రామాణికతపై ఆధారపడి వుంది. ఆధారాల ప్రామాణికతను నిర్ణయించడం, వాటిని విశ్లేషించి చరిత్రకథనానికి కావలసిన యదార్థాలను రాబట్టటం చరిత్రకారుని కర్తవ్యం. సాధారణ యధార్థాల నుండి చారిత్రక యదార్థాలను వేరుచేయడం అతని మొదటి కర్తవ్యం. ఆ యదార్థాలే నమ్మదగ్గ సాక్ష్యాలని రూఢి చేసుకోవాలి. సాక్ష్యాధారాలతో నిజాన్ని వెలికితీయడం, యితర సాక్ష్యాలతో ధృవీకరించుకోవడం, యితర సామ్యాలతో సరిచూడటం - యివన్నీ చరిత్రకారుని పరిశోధనలో భాగమే.

## 2.4 మౌలిక యదార్థాలు :

ఇ.హెచ్. కార్ చెప్పినట్లు చరిత్రకారులందరికీ ఒక్కటే అయిన చరిత్రకు వెన్నెముక లాంటి ప్రాథమిక లేదా మౌలిక యదార్థాలనేవి కొన్ని వుంటాయి. ఉదాహరణకు **1526**లో ఇబ్రహీం లోడికి బాబరుకు మధ్య జరిగిన మొదటి పానిపట్టు యుద్ధం. ఇదొక మౌలిక యదార్థం. చరిత్రకారుడు ఇటువంటి వాటిని ప్రాథమికంగా పట్టించుకోడు. అయితే ఆ యుద్ధం **1526** లోనే జరిగింది . . . **1525** లో కాని **1527** లో కాని కాదని; ఇబ్రహీంలోడి, బాబరుల మధ్యనే జరిగింది . . , వేరే వారి మధ్య కాదని తెలియడం చాలా ముఖ్యమే. చరిత్రకారుడు యీ విషయాలలో దోషరహింతంగా వుండటం తప్పనిసరి. హౌస్‌మన్ చెప్పినట్లు 'ఖచ్చితత్వం అనేది ఒక కర్తవ్యమే కాని సద్గుణం కాదు' చరిత్రకారుడు నిర్వహించే కార్యక్రమంలో అతడు తప్పనిసరిగా పాటించాల్సిన విధి. మౌలిక యదార్థాల ఖచ్చితత్వాన్ని రాబట్టడానికి అతడు పురావస్తుశాస్త్రం, శాసనశాస్త్రం, నాణెశాస్త్రం, ప్రాచీన లిపివిజ్ఞానశాస్త్రం, భౌతికరసాయన శాస్త్రాలు, జీవశాస్త్రం, వృక్షశాస్త్రం వంటి అనేక అనుషంగిక శాస్త్రాలపై ఆధారపడతాడు. ఈ యదార్థాలు చరిత్రకు ముడిసరుకే కాని యివే చరిత్ర కాదు. ఇవి చరిత్రకారులందరికీ ఒక్కటే. మౌలిక యదార్థాలను నిర్ధారించే అవసరం అనేది వాటిలో వున్న ఏదో యోగ్యతపైకాక చరిత్రకారుడు ఆపాదించే ప్రాధాన్యతా నిర్ణయంపై ఆధారపడి వుంటుంది. దీన్ని ప్రభావితం చేసే మార్గం ఒక్కటే . . . తగిన యదార్థాలను ఎంచుకొని క్రమంలో యేర్పరచుకోవటమే. ఈ సందర్భంలో ఆంగ్ల చరిత్రకారుడు కిట్సన్ క్లార్క్ యదార్థాల గురించి చెప్పిన విషయాన్ని విస్మరించలేం. చరిత్రలో ఏదో మేర ఖచ్చితత్వం వుంటుందంటే అది యదార్థాల భాగం మాత్రమే. (చరిత్రకారుడు చేసే) మొత్తం వ్యాఖ్యానం మొత్తం ఊహారచన భావనాత్మకమే. యీ వూహారచన యదార్థాలను గౌరవించకపోతే, అది ఖచ్చితంగా నిరర్ధకమూ, మోసపూరితముగా అవుతుంది' అని అతడు పేర్కొన్నది అక్షరాల నిజం.

## 2.5 చారిత్రక యదార్థాల నిర్దేశంలో చరిత్రకారుని పాత్ర :

యదార్థాలు వాటంతట అవే మాట్లాడతాయని ప్రత్యక్ష జ్ఞానవాదముతో ప్రభావితులైన కొందరు భావిస్తారు. కాని నిజానికి చరిత్రకారుడే యదార్థాలను మాట్లాడేలా చేస్తున్నాడు. అతడు వాటిని యదార్థాలుగా నిర్దేశిస్తున్నాడు. ఏ యదార్థాలను పరిగణనలోనికి తీసుకోవాలో, వేటికి ఎంత ప్రాముఖ్యం యివ్వాలో, యే క్రమంలో యే సందర్భంలో చెప్పాలో అతడే నిర్ణయిస్తున్నాడు. అసంఖ్యాకంగా వున్న యదార్థాలలో కొన్నింటికే అతడు ప్రాధాన్యత నాపాదించి తన కథనంలో జొప్పిస్తున్నాడు. కొన్ని సందర్భాలలో

ఒకప్పుడు మామూలు యదార్థంగా గతానికి సంబంధించి యెటువంటి ప్రాధాన్యత లేనిది అనంతరం చారిత్రక యదార్థంగా అతని చేతులలో రూపుదిద్దుకోవచ్చు. ఒక్కోసారి ఒక చారిత్రక యదార్థమే మామూలు యదార్థంగా, ఆ తరువాత కాలంలో అదే మళ్ళీ చారిత్రక యదార్థంగా ప్రాధాన్యతని సంతరించుకోవచ్చు. ప్రాచీన మధ్యయుగాల గురించి అధ్యయనం చేసే చరిత్రకారునికి వుండవలసిన మొదటి లక్షణం సరళతరం చేసి విశదీకరించే, విషయాలనుగుణమైన యదార్థాలను యెంచుకొని యితర అనేకం వదలివేసే అజ్ఞానం. కాని ఆధునిక యుగాన్ని అధ్యయనం చేసే చరిత్రకారుడు వున్న ప్రాధాన్యత కలిగిన కొద్దిపాటి యదార్థాలను శోధించి వాటిని చారిత్రక యదార్థాలుగా మలచడమేగాక అనేక అప్రధానమైన యదార్థాలను అచారిత్రకమని త్రోసివేయవలసిన ద్వంద్వ కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. అయితే తిరుగులేని, విషయగతమైన యదార్థాలను వీలైనంత అధిక సంఖ్యలో కూర్చడమే చరిత్ర అనే 19 వ శతాబ్దపు భావజాలానికి యిది పూర్తిగా భిన్నం. ఈ కారణంగానే ఆంగ్ల చరిత్రకారుడు ఆక్టన్ 'చరిత్రకారునిపై వున్న అవసరాల ఒత్తిడి అతణ్ణి సాహితీవేత్తకి మారుగా విశ్వకోశ సంకలనవేత్తగా మార్చే ప్రమాదం వుంది' అని పేర్కొన్నాడు. అని పేర్కొన్నాడు.

అయితే చరిత్రకు యదార్థాలే సర్వస్వం . . . యదార్థాలే చరిత్ర అని మూఢంగా ఆరాధించేవారు ఆ యదార్థాలు లభించే సాక్ష్యపత్రాలు లేదా చరిత్ర ఆధారాలనూ అంతగానే ఆరాధించారు. కాని యిక్కడ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే ఏ సాక్ష్యపత్రమైనా ఆ పత్ర రచయిత జరిగిన సంఘటన గురించి ఏమనుకుంటున్నాడో తెలియజేస్తుందే తప్పించి అంతకు మించి ఏమీ అదనంగా తెలుపదు అని. అందచేత సాక్ష్యపత్రాలు లేదా చరిత్రాధారాలలో కన్పించే యదార్థాలను చరిత్రకారుడు వాటిని వుపయోగించుకోవడానికి ముందు యింకా విచారించవలసి వుంది. ఏమి జరిగిందనేది సాక్ష్యపత్రాలు తెలియజేయవు. ఆ పత్ర రచయితలు ఏం జరిగిందని అనుకుంటున్నారో లేదా ఏం జరిగిందని యితరులు భావించాలని ఆ రచయితలు అనుకుంటున్నారో అదే సాక్ష్యపత్రాలు చెబుతాయి. కనుక యదార్థాలు, అవి లభించే సాక్ష్యపత్రాలు చరిత్రకు ముఖ్యమైన అవసరమే కాని అవే చరిత్ర కాదు. కాబట్టి వాటిని ఆరాధనా స్థాయిలో వుంచవలసిన పనిలేదు. వాటంతట అవే చరిత్రగా రూపొందవు. చరిత్ర అంటే ఏమిటి ? అదే విసుగు పుట్టించే ప్రశ్నకు ముందుగానే సిద్ధంచేయబడిన సమాధానాన్నేమీ యీయవు. 19 వ శతాబ్దపు చరిత్రకారులు సాధారణంగా చరిత్ర లేదా చరిత్రతత్వం అంటే ఉపేక్ష చేసారు. సంతృప్తికరమైన యదార్థాల గురించి యెటువంటి వికారమైన ప్రశ్నలు వేసే లేదా వాటికి సమాధానం చెప్పే ఉద్దేశ్యం వారికి లేదు. 'యదార్థాల గురించి చరిత్రకారుడు జాగ్రత్తపడితే చాలు . . . ఆ పై వాడు చరిత్ర అర్థం చేసుకుంటాడనే రాంకె నమ్మకమే అందరిదీ. ముఖ్యంగా 19 వ శతాబ్దంలోగాని, 20 వ శతాబ్దం ఆరంభంలో కాని బ్రిటీష్ చరిత్రకారుల విశ్వాసమేమంటే, చరిత్ర అర్థం ఊహించి తెలుసుకోవలసిందే . . . స్వయం విశదం అని. అది అమాయకపు యుగం. చరిత్ర అనే దైవం సమక్షంలో చరిత్రకారులు తాత్వికత అనేది పిసరంతైనా లేకుండా అనాచ్ఛాదితంగా, నిస్సిగ్గుగా సంచరించిన కాలం. అందుచేతనే యదార్థాలను వున్నది వున్నట్లుగా రాబట్టాలనే తాపత్రయం. అదే సర్వస్వం అదే ఆరాధనా భావం . . . అదే చరిత్ర అనే నమ్మకం. కాని మూడిసరుకును చరిత్ర అనలేం. పైగా యీ ముడిసరుకుకి వున్న పరిమితులు . . . అందులోనూ చరిత్రకారుడిచ్చే ప్రాధాన్యత దృష్ట్యా యే యదార్థమైనా చారిత్రక యదార్థం కావటం వంటి అంశాలను పరిగణనలోనికి తీసుకున్నప్పుడు ధృవీకృత యదార్థాల సముదాయమే చరిత్ర కాదనేది స్పష్టంగా పేర్కొనవచ్చును.

## 2.6 20 వ శతాబ్దంలో . . . :

19 వ శతాబ్దంలో చరిత్రకారులు, తత్త్వవేత్తలు యదార్థాలకు, అవి లభించే సాక్ష్యపత్రాలకు పూర్తి ప్రాధాన్యతనిస్తే, 20 వ శతాబ్ది ప్రథమార్థంలో చరిత్రకు యదార్థాలను నిర్దేశించే, వాటిని వ్యాఖ్యానించే చరిత్రకారుడే సర్వస్వమై కూర్చున్నాడు. చరిత్రకారుడు సృష్టించిందే చరిత్ర అయింది. యదార్థాలు వాటంతట అవి మాట్లాడవు గదా ! వాటిని నిర్దేశించేది, వాటిని వ్యాఖ్యానించేది

చరిత్రకారుడు. యదార్థాలను నిర్ణయించేవాడు, వాటితో మాట్లాడించేవాడు చరిత్రకారుడైనప్పుడు అతని దృక్పథం, రచనా ధోరణి ఆ యదార్థాల ఎంపికపై ఆధారపడి వుంటుంది. పైగా యే యదార్థాలకు ప్రాధాన్యమివ్వాలి, ఏ సందర్భంలో ప్రవేశపెట్టాలి, ఏ వరుసలో ప్రవేశపెట్టాలి - యివన్నీ చరిత్రకారుడే నిర్ణయిస్తాడు కాబట్టి అతడు ఆలోచించిందే చరిత్ర . . . అతడి అనుభవమే చరిత్ర అవుతుంది. గతాన్ని జ్ఞాపకంగా గ్రంథస్థం చేయడం కాక విలువ నిర్ణయించడం చరిత్రకారుని ప్రధానకర్తవ్యం అయింది.

## 2.6.1 క్రోచె, కార్ల్ బెకెర్‌ల ధోరణి :

యధార్థాల మహాయుగమైన 19 వ శతాబ్దంలోనే 1880, 1890 దశకాల్లో చరిత్రలో యదార్థాల ప్రాధాన్యం, స్వయం ప్రతిపత్తి సిద్ధాంతానికి సవాలు యెదురయింది. 19 వ శతాబ్దపు ఉదారతావాద సాధికారతను తలక్రిందులుగా చేస్తూ జర్మనీలోనే యీ సవాలు డిల్తీలాంటి వారు విసిరారు. అక్కడి నుండీ యిది 20వ శతాబ్దం ఆరంభంలో ఇటలీకి ప్రాకింది. 1910 లో అమెరికన్ చరిత్రకారుడు కార్ల్‌బెకెర్ "ఏ చరిత్రకారునికైనా చారిత్రక యదార్థాలనేవి వాటిని అతడు సృష్టించేవరకు సిద్ధంగా వుండవు" అని చెప్పాడు.

20వ శతాబ్దం ఆరంభంలోనే ఇటలీకి చెందిన చరిత్రకారుడు క్రోచె "చరిత్ర మొత్తం సమకాలీనమే' అనే తత్త్వాన్ని ప్రచారం చేసాడు. విచక్షణారహితంగా యదార్థాలను చిత్రీకరించడం కాకుండా వాటిని అంచనావేసి వ్యాఖ్యానించడం చరిత్రకారుని ప్రధాన కర్తవ్యమని, ఆ ప్రయత్నం చేయకపోతే గ్రంథస్థం చేయడానికి దీనికెంద అర్హత ఉందో తెలియదని అతని నమ్మకం. అయితే గతానికి సంబంధించిన యదార్థాలను విలువ కట్టటం అనేది చరిత్రకారుని సమకాలీనం దృష్ట్యా జరుగుతుంది కాబట్టి మొత్తం చరిత్ర ఆవిధంగా చూస్తే సమకాలీనమే అవుతుందని అతని అభిప్రాయం. క్రోచె దృష్టిలో సమకాలం, సమకాలీన సమస్యల దృష్ట్యా గతాన్ని పరిశీలించడమే చరిత్ర అధ్యయనం. సమాజంలో అంతర్భాగమైన చరిత్రకారుడు తనకు తెలిసో, తెలియకో తన సమకాలీన సమాజానికి ప్రతినిధిగానే గతకాలపు చారిత్రక యదార్థాలను వీక్షిస్తాడు. అతని దృక్పధానికి, ఆలోచనా విధానానికి, అతని సామాజిక చారిత్రక నేపథ్యంతో దగ్గర సంబంధం వుంటుంది. యదార్థాలను కార్యకారణ సంబంధం రీత్యా క్రమబద్ధీకరిస్తున్నప్పుడు చరిత్రకారుడు ప్రత్యక్ష్యంగానో, పరోక్షంగానో సమకాలీన దృక్పధంతో విలువల కోసమూ అన్వేషిస్తాడు.

## 2.6.2 కాలిన్గ్‌వుడ్ చరిత్రతత్వం :

క్రోచె ఆలోచనాధోరణి ఆ తరువాత కాలంలో బ్రిటిషు చరిత్ర తత్త్వవేత్త కాలిన్‌వుడ్‌ని ప్రభావితం చేసింది. 20వ శతాబ్దంలో చరిత్రతత్వానికి గణనీయమైన సేవలందించిన ఏకైక బ్రిటిషు ఆలోచనాశీలి యీ కాలిన్‌వుడ్. చరిత్రతత్వంపై ఒక క్రమబద్ధమైన, గ్రంథాన్ని వ్రాయాలని అతడు సంకల్పించినా మృత్యువు అతణ్ణి ముందుగానే తన ఒడిలో చేర్చుకుంది. అయితే అతని శిష్యులు, అభిమానులు అతని మరణానంతరం 1945 లో "Idea of History" పేరుతో అతని వ్యాసాలను సంకలం చేసి ప్రచురించారు.

కాలిన్‌వుడ్ దృష్టిలో చరిత్ర తత్వం అంటే "గతం గురించేకాక . . దాని గురించిన చరిత్రకారుని ఆలోచన గురించేకాక వాటి రెండింటి పరస్పర సంబంధాల దృష్ట్యా రెండింటికీ సంబంధించినది, 'చరిత్రకారుడు అధ్యయనం చేసే మృతప్రాయమైన గతంకాదు . . . వర్తమానంలో యింకా ఏదోరూపంలో సజీవంగా వున్న గతం అని అతని భావన. అయితే గతకాలపు ఒక క్రియ లేదా కార్యకలాపం వెనుక ఉన్న ఆలోచనయేమిటి అనేది చరిత్రకారుడు అర్థం చేసుకోలేకపోతే ఆ చర్య మృతప్రాయమే లేదా అర్థరహితమే అవుతుంది. అందుచేత కాలిన్గ్‌వుడ్ దృష్టికి 'మొత్తం చరిత్ర చింతన చరిత్రే. ఎవరి చరిత్రనైతే చరిత్రకారుడు అధ్యయనం చేస్తున్నాడో వారి ఆలోచనను అతడు తన మనస్సులో పునర్ఘటించడమే (పునర్నిర్మించడమే) చరిత్ర'. ఇది

అనుభవపూర్వకమైక సాక్ష్యంపై ఆధారపడి వుంది. అనుభవపూర్వకం అంటే కేవలం యదార్థాలను వల్లెవేయడం కాదు. దీని పరిశీలనాత్మకంగా యదార్థాలను యెంచుకోవడం, వాటిని వ్యాఖ్యానించడం కావాలి. అందుకే ఎం.ఓక్‌షాట్ అనే పండితుడు 'చరిత్ర అంటే చరిత్రకారుని అనుభవం. ఇది చరిత్రకారుడు తప్పించి యితరులెవ్వరూ రూపొందించింది కాదు. చరిత్రను వ్రాయటం ద్వారా మాత్రమే చరిత్ర రూపొందుతుంది' అని పేర్కొన్నాడు.

పరిశీలనాత్మక విమర్శకుడైన కాలిన్గ్‌వుడ్ నిర్లక్ష్యం చేయబడిన కొన్ని సత్యాలను వెలుగులోకి తెచ్చాడని అంగీకరించాలి. అందులో ముఖ్యంగా చారిత్రక యదార్థాలనేవి వాటిని గ్రంథస్థం చేసే వ్యక్తి మనస్సులో ఎప్పుడూ పరావర్తనం చెందుతూనే వుంటా యనేది ముందుగా చెప్పుకోవాలి. అంటే మనం ఒక చరిత్ర రచనని పరిగణనలోనికి తీసుకున్నప్పుడు మొట్టమొదట పరిశీలించవలసినది యదార్థాలను కాక దానిని రచించిన చరిత్రకారుని గురించి, ఇంక రెండో విషయం - ఎవరి గురించి అయితే చరిత్రకారుడు అధ్యయనం చేస్తున్నాడో వారి మనస్సుల్ని అర్థం చేసుకోవడానికి అతనికి భావనాత్మకమైన అవగాహన కావాలి అనేది కాలిన్గ్‌వుడ్ చెప్పిన మరోవిషయం. వర్తమానం దృష్ట్యానే గతాన్ని మనం వీక్షించడం, అవగాహన సాధించడం జరుగుతుందని వర్తమానాన్ని అర్థం చేసుకునే సాధనంగా గతాన్ని ఔపోసన పట్టడం, అవగాహన చేసుకోవడం చరిత్రకారుని విధి అని అతని విశ్వాసం. ఇ.హెచ్. కార్ కూడా చరిత్రకారుడు గతాన్ని వర్తమానకాలపు దృష్టితోను, వర్తమాన కాలపు సమస్యల వెలుగులోను తప్పనిసరిగా చూస్తాడని భావించాడు.

### 2.6.3 విమర్శ :

యదార్థాలకు ప్రాధాన్యతనిచ్చి రూపం కల్పించేది చరిత్రకారుడు . . . అతడు ఆలోచించిందే చరిత్ర . . . అతని అనుభవమే చరిత్ర . . . అతడు సృష్టించిందే చరిత్ర . . . భావాల చరిత్రే చరిత్ర అనే ఈ 20వ శతాబ్దపు చరిత్రకారుల అభిప్రాయాలలోనూ లోపాలు కల్పిస్తున్నాయి. చరిత్ర నిర్మాణంలో చరిత్రకారునికే అగ్రతాంబూలం యిస్తే వస్తుగతమైన లేదా విషయ నిష్ఠతతో కూడిన చరిత్ర మృగ్యమౌతుంది. అదేవిధంగా చరిత్రకారుడు గతాన్ని అధ్యయనం చేస్తున్నప్పుడు, సమకాలీన దృక్కోణం నుండే పరిశీలించినప్పుడు చరిత్రకు సరైన వ్యాఖ్యాత లక్షణం సమకాలీన ప్రయోజనాలను నెరవేర్చడమే అవుతుంది. ఈ పరిస్థితుల్లో వ్యాఖ్యానమే ప్రధానం అవుతుంది కాని చరిత్రలో యదార్థాలకు విలువ వుండదు.

## 2.7 చరిత్రకారుడు తన యదార్థాలకు ఏ విధంగా స్పందించాలి ?

చరిత్రకు యదార్థాలెంత ముఖ్యమో, ఆ యదార్థాలను వాటి ప్రాధాన్యతను నిర్దేశించే చరిత్రకారుని వ్యాఖ్యానమూ అంతే ముఖ్యం. చరిత్రకారుడు తన అధ్యయన విషయానికి, వ్యాఖ్యానానికి సంబంధించి తెలిసిన, తెలుసుకోగలిగిన యదార్థాలను అన్నింటిని శోధించాలి. అలాగని చరిత్రకు ప్రాణాధారమైన రక్తం లాంటి వ్యాఖ్యానాన్ని తొలగించడమని అర్థం కాదు. చరిత్రకారుడు యదార్థాలను తాత్కాలికంగా యెంచుకొని దేని సహాయంతో యెంచుకున్నాడో ఆ తాత్కాలిక వ్యాఖ్యానంతో మౌలికంగా ఒక చట్రాన్ని సమకూర్చి తన చరిత్ర రచనను ప్రారంభిస్తాడు. ఈ వ్యవహారంలో తీసుకున్న యదార్థాలు, వ్యాఖ్యానం యితరులవి కావచ్చు లేదా తనవే కావచ్చు. చరిత్ర రచనలో ముందుకు సాగుతున్న కొద్దీ వ్యాఖ్యానం, యదార్థాల ఎంపిక, వాటి వరుస ఒకదానిని మరొకటి ప్రభావితం చేసుకుంటూ చరిత్రకారుని ప్రమేయం లేకుండానే క్రమేణా మార్పుకు లోనవుతుంటాయి. యదార్థాలు, వ్యాఖ్యానమూ మధ్య పరస్పరం యిచ్చి పుచ్చుకునే యీ ధోరణి యేక కాలంలో జరుగుతుంది. ఈ రెండింటిని వేరు చేయ ప్రయత్నిస్తే లేదా ఒకదానిపై మరొకదానికి ఆధిక్యతనిస్తే అది, అర్థరహితమైన 'అతుకుల బొంత చరిత్ర' అవుతుంది లేదా ప్రచారం కోసం వ్రాసిన చరిత్ర గానో, చారిత్రక కల్పనగానో మిగులుతుంది.

ఇక్కడ మరో విషయం చెప్పాలి. గ్రంథ రూపంతో చారిత్రక యదార్థాలన్నీ ఆయా చరిత్రకారుల ఆలోచనా ధోరణులను, దృక్పథాలను విశ్వాసాలను ప్రతిబింబిస్తాయి. దీని పర్యవసానంగా యదార్థాల విశ్లేషణలో, వ్యాఖ్యానంలో ఆయా ప్రాంతాల, కాలాల భావనలు చోటు చేసుకుంటున్నాయి. గ్రీకులు చరిత్రను వివేచనాత్మకంగా తీర్చిదిద్దితే, రోమన్లు రాజకీయపు రంగును అద్దారు. క్రైస్తవ చరిత్రకారులకు చరిత్రలో దైవమే కన్పించాడు. జర్మన్లు తాత్వికతను, మార్క్సిస్ట్‌లు గతితార్కిక భౌతికతను, ఫ్రెంచివారు సామ్యవాదాన్ని, బ్రిటిషువారు సామ్రాజ్యవాదాన్ని చరిత్రకు ఆపాదించారు. ఫ్రెంచి రాజనీతిజ్ఞుడు టర్గో, తత్త్వవేత్త కోండార్సెలు చరిత్రను ప్రగతి భావనతో జతపరిచారు. చైనీయులు, అరబ్బులు, భారతీయులు భిన్నకోణాల నుండి చరిత్రను వీక్షించారు. ఎంతోకొంత ఆత్మాశ్రయతకు అవకాశం వుంది కాబట్టే నూతన శాస్త్రాల సహాయంతో యదార్థాల వివరణకు పూనుకున్నా, చరిత్రకారుడు తాను జీవిస్తున్న సమకాలీన సమాజ ఆశయాలకు, ఆలోచనలకు ప్రతినిధిగానే స్పందించడం కనబడుతుంది.

చరిత్రలో యదార్థాలు విషయాత్మక వివరణకు సూత్రరీత్యా యేమీ లోబడినప్పటికీ ఏ చరిత్రకారుడూ వాటిని విస్మరించడం సాధ్యంకాదు. ఒకదానికొకటి ప్రాతిపదికగానే యదార్థాలు, వాటి వివరణ, వ్యాఖ్యానం పరస్పరం ప్రభావితమవుతూనే ముందుకు సాగుతాయి. అందుచేతనే వివరణ వ్యాఖ్యానాలకు తగినట్లు యదార్థాలను, యదార్థాలకు తగినట్లు వివరణ, వ్యాఖ్యానాలను మలుచుకుంటూ దేని ప్రాధాన్యతనూ మరోదానిపై రుద్దకుండా అవిచ్ఛిన్నంగా సాగే ప్రక్రియతో చరిత్రకారుని కర్తవ్యం ముడిపడివున్నది. చరిత్రకారునికి, అతని యదార్థాలకు మధ్య వున్న సంబంధం సునిశితమైనది. యదార్థానికి వ్యాఖ్యానానికి మధ్య, ప్రత్యేకతకు సాధారణతకూ మధ్య, అనుభవానికి సిద్ధాంతానికీ మధ్య, విషయ నిష్ఠతకు ఆత్మాశ్రయతకు మధ్య వాడియైన కత్తి మొనలాంటిది. అటు జరిగినా, యిటు జరిగినా ప్రమాదమే. ఇది ఒక విధంగా మనిషికి, చుట్టూ వున్న పరిస్థితులకు మధ్యనున్న సంబంధం లాంటిదే. చరిత్రకారుడు తన యదార్థాలకు ఒదిగి వుండే బానిసాకాదు . . . అలాగని వాటిపై పెత్తనం చలాయించే నిరంకుశుడైన యాజయానీ కాదు. సమానస్థాయిలో వుండే సంబంధం యిది . . . పరస్పరం యిచ్చిపుచ్చుకునే వ్యవహారం. ఈ ప్రక్రియలో యదార్థానికిగాని, వ్యాఖ్యానానికిగాని ఒక దానిపై మరోదానికి ఆధిక్యత అనే ప్రసక్తేలేదు. చరిత్రకారునికి అతని యదార్థాలకు మధ్యనున్న యీ పరస్పర కార్యవిధానం వర్తమానానికీ, గతానికి మధ్య కూడా వుంటుంది. చరిత్రకారుడు వర్తమానానికి, అతని యదార్థాలు గతానికీ చెందినవి కాబట్టి యిది తప్పదు. వర్తమానం గతాన్ని, గతం వర్తమానాన్ని ప్రభావితం చేస్తూనే వుంటాయి. చరిత్రకారుడు, చారిత్రక యదార్థాలు పరస్పరం ఒకదానికొకటి అవసరం. యదార్థాలు లేకుంటే చరిత్రకు పునాది లేదు. చరిత్రకారుడు మూలరహితుడు, నిష్ఫలుడూ అవుతాడు. అలాగే చరిత్రకారుడు లేని యదార్థాలు జీవరహితం, అర్థరహితం అవుతాయి. కనుకనే ఇ.హెచ్. కార్ "చరిత్ర అనేది చరిత్రకారునికీ, అతని యదార్థాలకూ మధ్య అవిచ్ఛిన్నంగా సాగే పరస్పర కార్యవిధానం; వర్తమానానికీ, గతానికీ మధ్యజరిగే అనంతమైన సంభాషణం'' అని చరిత్రను నిర్దిష్టంగా నిర్వచించాడు.

## 2.8 సంక్షిప్తంగా :

గత కాలపు చరిత్రను అంటే మానవ నాగరికతా సంస్కృతుల పరిణామాన్ని వివరించడానికి చరిత్రకారుడు ఆధారాలు అందించే యదార్థాలపై ఆధారపడతాడు. వీటి సాయంతోనే చరిత్రను నిర్మించడం సాధ్యం. 19వ శతాబ్దంలో రాంకె వంటి చరిత్రకారులు "కేవలం జరిగింది జరిగినట్లు చెప్పడమే చరిత్రకారుని విధి'' అంటూ యదార్థాల ప్రాముఖ్యాన్ని నొక్కిచెప్పారు. ప్రత్యక్ష జ్ఞానవాదులు తదితరులు కూడా దీనికి మద్దతు పలకటంతో 19 వ శతాబ్దం 'యదార్థాల మహాయుగం'' అయింది. చరిత్రకు యదార్థాలే ప్రాణం . . .యదార్థాలే చరిత్ర అనే భావన ప్రబలమయింది. అయితే దీనికి భిన్నంగా 20వ శతాబ్దంలో యదార్థాలను నిర్దేశించే, వాటిని వ్యాఖ్యానించే చరిత్రకారుడే సర్వస్వమై కూర్చున్నాడు. కార్ల్ బెకెర్, క్రోచె, కాలిన్గ్‌వుడ్ వంటి చరిత్రకారులు , తత్వవేత్తలు, 'చరిత్రకారుని ఆలోచనే చరిత్ర . . .అతని అనుభవమే చరిత్ర. . . చరిత్ర చరిత్రకారుని సృష్టి' అనే

దృక్పధాన్ని వెలిబుచ్చారు. కాని చరిత్రకారుడే చరిత్రకు సర్వస్వమైతే యింక వస్తుగతమైన చరిత్రకు తావేది ? అలాగే సమకాలీన దృక్కోణం నుండి చరిత్రకారుడు గతాన్ని పరిశీలిస్తే సమకాలీన ప్రయోజనాలను తీర్చడమే చరిత్ర వ్యాఖ్యానానికి లక్షణమౌతుంది. అటువంటప్పుడు చరిత్రలో యదార్థాలకే మాత్రం విలువ వుండదు. ఇది సరికాదు. చరిత్రకారుడు, చారిత్రక యదార్థాలు పరస్పరం ఒకదానికొకటి అవసరం. యదార్థాలు లేని చరిత్ర పునాదిలేనిదవుతుంది. చరిత్రకారుడు లేని యదార్థాలు మృతప్రాయం, అర్థరహితం అవుతాయి. అలాగే చరిత్రకారుడు వర్తమానానికీ, యాదార్థాలు గతానికి చెందినవి కాబట్టి చరిత్రకారునికి, అతని యదార్థాలకు మధ్య అవిచ్ఛిన్నంగా సాగే కార్యవిధానం వర్తమానానికీ, గతానికి మధ్య కూడా వుంటుంది.

## 2.9 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### ఎ) క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.

1. "చరిత్ర అంటే చరిత్రకారునికి, అతని యదార్థాలకు మధ్య అవిచ్ఛిన్నంగా జరిగే కార్యవిధానం; వర్తమానానికి, గతానికి మధ్య జరిగే అనంతమైన సంభాషణం'' వివరించండి.
2. కాలింగ్వుడ్ చరిత్రతత్వాన్ని విశ్లేషించండి.

క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను వ్రాయండి.

1. మౌలిక యదార్థాలంటే ఏమిటి ?
2. చారిత్రక యదార్థాల నిర్దేశంలో చరిత్రకారుని పాత్ర ఏమిటి ?
3. 'మొత్తం చరిత్ర సమకాలీన చరిత్రే' వివరించండి ?
4. చరిత్రకారునికి, యదార్థాలకు మధ్య సంబంధం ఎటువంటిది ?

### చదువదగిన గ్రంథాలు :


| | | |
|---|---|---|
| Carr, E.H | : | What is History ? (Macmillan, 1961) |
| Clark, Kitson | : | The critical Historian (Heinman, London, 1970) |
| Collingwood, R.G | : | The Idea of History (O.U.P., 1966) |
| Daniels, R.V. | : | Studying History, How and Why ? (Prentice Hall, New Jersey, 1960) |
| Durga Prasad, J. | : | Charitra Rachana Sastran (Tel.) (Telugu Akademi, Hyderabad, 1987) |
| Elton. G.R. | : | The Practice of History (Fontana, 1969) |
| Gardiner, Patrick | : | The Nature of Historical Explanation (O.U.P., 1968) |
| Newins, Aller | : | The Gateway to History (Vota & co, 1968) |
| Marwick, Arther | : | The Nature of History (Macmillan, London 1970) |
| Sastri, K.A.N. & Ramanna, H.S. | : | Historical Method in relation to Indian History (S. Viswanathan, Madras, 1956) |
| Vajreswari | : | A Hand Book for History Teachers ( , Madras, 1966) |
| Webster, John C.B | : | An Introduction to History (Macmillan, 1977) |

పాఠం - 3

# చరిత్ర - శాస్త్రము - కళ

విషయక్రమం :

**3.0** లక్ష్యం
**3.1** పరిచయం
**3.2** చరిత్రపై శాస్త్రాల ప్రభావం
**3.3** చరిత్ర శాస్త్రమనే వాదన చరిత్ర
**3.4** శాస్త్రమంటే . . .
**3.5** చరిత్ర శాస్త్రమే
**3.6** చరిత్రను శాస్త్రంగా పరిగణించటానికి ఉన్న ప్రధాన అభ్యంతరాలు
**3.6.1** చరిత్రలో సాధారణీకరణం
**3.6.2** చరిత్ర పాఠాలు నేర్పుతుంది
**3.6.3** చరిత్ర భవిష్యత్తును సూచిస్తుంది
**3.6.4** చరిత్రలో విషయ నిష్ఠత
**3.6.5** చరిత్రలో మతం, నీతి
**3.7** చరిత్ర ఒక కళ
**3.8** చరిత్ర శాస్త్రం, కళల మిశ్రమం
**3.9** సంక్షిప్తంగా . . .
**3.10** మాదిరి ప్రశ్నలు
**3.11** ఉపయుక్త గ్రంథాలు

## 3.0 లక్ష్యం :

ఈ పాఠం అధ్యయనం వలన మీరు

- శాస్త్రం అంటే ఏమిటి ? చరిత్ర శాస్త్రమనేవాదం ఏవిధంగా వచ్చింది ? వీటి గురించి విశ్లేషించగలగాలి.
- చరిత్ర శాస్త్రమనడానికి వున్న అభ్యంతరాలను విశ్లేషించి, శాస్త్రమేనని చెప్పగల్గడానికి వున్న కారణాలను వివరించగలగాలి
- చరిత్రకున్న కళాలక్షణాలను విశ్లేషించగలగాలి
- చరిత్ర శాస్త్రము, కళల మిశ్రమం అనే వాదాన్ని వివరించగలగాలి.

## 3.1. పరిచయం :

చరిత్ర రచనా పరిణామ క్రమంలో 19వ శతాబ్దం ఒక కీలకదశ. మతధార్మిక భావన స్థానంలో చరిత్ర రచనలో శాస్త్రీయ ధోరణి చోటుచేసుకుంది. జర్మన్ల సృజనాత్మకత కారణంగానే హేతువాదం హెచ్చింది. చరిత్ర ఆధారాలు విమర్శనాత్మక

అధ్యయనానికి గురైనాయి. ఈ పరిణామాలలో భాగంగానే చరిత్రకు సంబంధించిన కొన్ని సిద్ధాంతపరమైన జటిల సమస్యలు చరిత్రకారుల దృష్టిని ఆకట్టుకున్నాయి. సంకీర్ణమైన చరిత్ర స్వభావానికి సంబంధించిన తీవ్ర వివాదాస్పద అంశం చరిత్ర శాస్త్రమా? కళా ? లేదా శాస్త్రమూ, కళల మిశ్రమమా ? అనేది. ఈ పాఠంలో మనం యీ విషయాలను లోతుగా పరిశీలిస్తాము.

## 3.2 చరిత్రపై శాస్త్రాల ప్రభావం :

చరిత్రకు ఆలంబన మానవ జగత్తు. బహుముఖమైన మానవ జగత్తును గురించి అధ్యయనం ఆరంభించిన ప్రాచీన తత్త్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్ వంటివారు అనేకానేక విషయాలు అన్నింటిని తత్త్వశాస్త్రంలో అంతర్భాగంగా పరిగణించారు. నిరంతరం విస్తృతమవుతున్న విజ్ఞానం ఒక శాస్త్రంలో భాగంగా యిమడలేక ప్రకృతిశాస్త్రం, పదార్థ విజ్ఞానశాస్త్రం, సామాజిక శాస్త్రాలుగా ప్రత్యేక ప్రతిపత్తితో యేర్పడినాయి. ఈ పరిణామ క్రమంలో 19వ శతాబ్దం ఒక మైలురాయి. ఆధునిక యుగారంభం నుండీ విజ్ఞాన శాస్త్రంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, క్రొత్త అన్వేషణలు, డార్విన్, న్యూటన్ సిద్ధాంతాల వలన మనిషి ఆలోచనా విధానంలో చెప్పుకోదగిన మార్పులు సంభవించాయి. ఈ మార్పులు సాంఘిక శాస్త్రాలపై ముఖ్యంగా చరిత్రపై ఎక్కువ ప్రభావాన్ని కనబరచాయి. శాస్త్రపరిశోధనల్లో అనుసరించిన పద్ధతులు, విశ్లేషణ మానవాళి కార్యకలాపాలను అధ్యయనం చేయడంలో ఉపయోగించారు. వీటి పర్యవసానంగా సమాజ స్వభావం, స్వరూప వివరణలో మార్పులు కన్పించాయి. సమాజాన్ని యంత్రంలా కాక ఒక జీవిలా భావించటం ఆరంభమయింది. డార్విన్ పరిశోధనలో శాస్త్రప్రయోగాన్ని చారిత్రక విశ్లేషణతో జత కలిపి పరిణామ సిద్ధాంతంలోని ప్రకృతివరణ సూత్రాన్ని, యోగ్యతను సార్థకజీవన భావనను రూపొందించాడు. ఈ విధంగా శాస్త్రం మార్పుకి, అభివృద్ధికి సంబంధించిందని నిరూపితం కావడంతో చరిత్రను శాస్త్రం పరిధిలోకి తీసుకువచ్చినట్లయింది.

## 3.3 చరిత్ర శాస్త్రమనే వాదన చరిత్ర :

శాస్త్రవిజ్ఞాన భావజాలాన్ని, పదాలను ఉపయోగించి, శాస్త్రీయ పద్ధతిలో సామాజిక విశ్లేషణను ముందుగా రాజకీయ - అర్థశాస్త్రజ్ఞులు ప్రారంభించి తమ పఠన విషయం కూడా శాస్త్రమే అని వాదించారు. గ్రేషామ్, ఆడమ్‌స్మిత్, మాల్థస్, కార్ల్‌మార్క్స్ ఈ కోవకు చెందినవారే. చివరగా చరిత్రకారులూ న్యూటన్ సిద్ధాంతాల వంటి శాశ్వత సిద్ధాంతాలను యదార్థాల ఆధారంతో నిగమన పద్ధతి (Deductive Method) లో రూపొందించటం తమ కర్తవ్యమని భావించారు.

ఆధునిక చరిత్రకు మూలపురుషునిగా ప్రసిద్ధుడైన జర్మన్ చరిత్రకారుడు రాంకె 1830 ప్రారంభంలో చరిత్ర రచనా విధానంలో క్రొత్త ఒరవడి ప్రారంభించాడు. చరిత్ర నీతిమంతం అనే అప్పటిదాకా వున్న భావనపై తిరుగుబాటు చేసి ఖచ్చితంగా యేమి జరిగిందో చెప్పడం మాత్రమే చరిత్రకారుని కర్తవ్యం అని చెబుతూ చరిత్రలో ఖచ్చితత్వం, ప్రామాణికతలు తప్పనిసరి అని మొదటిసారిగా చరిత్రను శాస్త్రంగానే భావించాడు. గణితశాస్త్ర ఆచార్యుడు, 'ఆధునిక సమాజశాస్త్ర నిర్మాత'గా ప్రసిద్ధుడైన ఆగస్ట్‌కోట్ కూడా యీ అభిప్రాయాన్ని సమర్థించాడు. పైగా సంఖ్యాశాస్త్ర లక్షణమైన "అవిచ్ఛిన్నత' సూత్రాన్ని చారిత్రక ప్రక్రియకు అన్వయించాడు. బకల్, యార్క్‌పవెల్, సీలీలు కూడా చరిత్రశాస్త్రం తప్పవేరొకటి కాదని నిర్ద్వంద్వంగా ప్రకటించారు.

చరిత్ర శాస్త్రమేనన్న భావనకు ప్రధాన పూజారి కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ చరిత్ర పీఠాధిపతి బ్యూరీ 1903 లో "చరిత్ర ఖచ్చితంగా శాస్త్రమే'' నని ప్రకటించి పెద్ద వివాదానికి దారి కల్పించాడు. దోషమనే కట్టును మనుషుల చూపుల నుండి తొలగించి, మేధో లేదా దాని పరిధిని సంబంధమైన, రాజకీయ సంబంధమైన స్వేచ్ఛను ముందుకు తీసుకుపోవడానికి క్రమేణా చరిత్ర యింకా శక్తివంతం కావాలంటే తక్షణ ప్రయోజనం గురించి ఆలోచించకుండా, లేదా దాని ఆదర్శాన్ని సర్దుబాటు చేయకుండా లేదా దానిని పరిమితం చేయకుండా కళ వంటి తాత్త్విక ఆలోచనలకు కావలసిన సమాచారాన్ని చేకూర్చినప్పటికీ చరిత్ర ఒక

శాస్త్రమనీ, అంతకంటే తక్కువకాదు ఎక్కువకాదని గుర్తుంచుకోవటం ద్వారా చరిత్ర తన విద్యార్థులను కార్యోన్ముఖులను చేయాలి' అని విశ్వవిద్యాలయంలో వుపన్యాసమిస్తూ అతడు చరిత్ర శాస్త్రమా ? కాదా ? అనే వివాదానికి తెరతీసాడు. అప్పుడు లేచిన దుమారం యిప్పటికీ యెంతో కొంత కొనసాగుతూనే ఉంది. చరిత్ర శాస్త్రం కాదని వాదిస్తున్నవారు శాస్త్రజ్ఞులుకారని బ్రిటిష్ చరిత్రకారుడు జోడ్ అభిప్రాయం.

## 3.4 శాస్త్రమంటే . . .

ఏది ఏదైనా తత్వవేత్త జోడ్ చెప్పినట్లు శాస్త్రానికి మనం యిచ్చే అర్థంపై యీ సమస్య ఆధారపడి వుంది. క్రమపద్ధతిలో యేర్పాటు చేయబడిన జ్ఞానాన్ని శాస్త్రమని పేర్కొనవచ్చు. అంటే కొన్ని సూత్రాలపై ఆధారపడి క్రమబద్ధమైన పద్ధతులు, మార్గాలను అనుసరించడం వలన యేర్పడేదే శాస్త్రం. ఈ నియమాన్ని కాదంటే జీవితం అర్థరహితమూ, శాస్త్రం నిరర్థకమూ అవుతాయి. శాస్త్రంలో మౌలికాంశాలు క్రమబద్ధంగా ఒక దానికొకటి కార్యాచరణ సంబంధంతో అనుసంధించటం కన్పిస్తుంది. సామాన్య సత్యాల సమూహం శాస్త్రం అని అరిస్టాటిల్ ప్రతిపాదన. 'ప్రమాణం మరియు వివేచనపై ఆధరపడిన సమస్త విజ్ఞానం శాస్త్రమే''నని హాక్స్లీ చెప్పాడు. సామాన్య సూత్రాలలో సోదాహరణంగా వివరించిన విశేష సత్యాలలో శాస్త్రజ్ఞులకి ఆసక్తి వుంటుంది. ఈ సత్యాలు పునరావృతాలు. సారూప్యత వీటి లక్షణం. అన్ని ప్రాంతాలకు, అన్ని కాలాలకు యివి వర్తిస్తాయి. శాస్త్రీయ విజ్ఞానం గొప్ప ఆచరాణాత్మక విలువతో వుంటుంది.

సార్వత్రిక కోణం నుంచి జ్ఞానాన్ని వీక్షించటం శాస్త్రలక్షణం. సాధారణీకరణం ద్వారా యిది సాధ్యం. శాస్త్రీయ వివరణలు వస్తుపరంగా వుంటాయి. శాస్త్రజ్ఞుని వ్యక్తిగత అభిప్రాయాలకు యిక్కడ తావులేదు.

## 3.6 చరిత్ర శాస్త్రమే :

శాస్త్రీయ విజ్ఞానానికి సంబంధించిన యీ ప్రమాణాలను చరిత్రకు అన్వయించి చరిత్రను శాస్త్రంగా పరిగణించవచ్చునో లేదో, శాస్త్రంగా పరిగణించటానికి దానికి వున్న అర్హతలు యేమిటో లోతుగా పరిశీలించవచ్చును.

జ్ఞానం ప్రత్యక్ష విషయాలపై ఆధారపడి వుండాలని నమ్మే ఆగస్ట్‌కోట్ వంటి ప్రత్యక్ష జ్ఞానవాదులు చరిత్రకు శాస్త్రస్థాయి కల్పించాలనే ఆశయం, ఆరాటాలతో విషయాల సిద్ధాంతీకరణ లేదా సూత్రీకరణను ఆదరించారు. చారిత్రక చింతన కూడా శాస్త్రీయ చింతనలానే వుంటుందేగాని వేరుగా దానికి ప్రత్యేక లక్షణాలంటూ లేవని వీరి భావన.

చరిత్ర అంటే అన్వేషణ లేదా పరిశోధన . . . దాని ఫలితంగా సమకూరిన విజ్ఞానం. ఆధారాల నుండి రాబట్టిన యదార్థాల నొకదానికొకటి కార్యకారణ సంబంధం రీత్యా సమన్వయించి ఒక క్రమపద్ధతిలో విషయాన్ని వివరించినప్పుడు చరిత్ర శాస్త్రమేనని అంగీకరించాలి. చరిత్ర శాస్త్రాలలో ఒకటిగా తన స్థానాన్ని తీసుకోవాలని కోడార్సే భావించాడు. మానవాళి జీవితం ఒక నిర్ణీత ధోరణిలోనే సాగిందనీ, సాగుతుందనీ చరిత్రను శాస్త్రంగా భావించేవారు వాదిస్తారు. దీనితో శాస్త్రీయపద్ధతిని చరిత్రకు అన్వయించడానికి మరింత గట్టినమ్మకంతోనే ప్రయత్నాలు జరిగాయి. ఇందులో భాగంగానే చరిత్రకు యితర విజ్ఞాన శాస్త్రాలకు లక్ష్యం ఒక్కటే . . . అది సత్యాన్ని శోధించటమేననే విషయం గుర్తించటం జరిగింది. సమతుల్యమైన ప్రాక్కల్పనలు (Hypotheses) మళ్ళీ మళ్ళీ ప్రయత్నించటం, సంతృప్తికరంగా లేకుంటే వాటిని కాదని మరికొన్నింటిని పరిశీలించటం జరుగుతుంది. ఒక ప్రాక్కల్పన సూత్రీకరించాలంటే అంతర్దృష్టి కూడా అవసరమే. విషయ నిష్ఠతతో కూడిన సత్యం కోసం తొందరపాటు లేని, తెరపిలేని, దారితప్పని శోధనశాస్త్రం యొక్క సారం. ఇదే చరిత్రకూ ఆదర్శంగా మారింది. చారిత్రక సత్యసంధత అనే భావన మొగ్గ తొడిగింది. లిఖిత ప్రమాణాన్ని తనిఖీ చేయటానికి, దానిని నిర్ధారించటానికి రికార్డులు క్షుణ్ణంగా

శోధించాలి. ప్రమాణాలను మదింపు చెయ్యాలి . . . సాక్ష్యాల ప్రామాణికతా స్థాయిని నిర్ణయించాలి అన్న ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. గతాన్ని యథాతథంగా పునర్నిర్మించటం, దాని నిజస్వరూపంలో అద్దంపట్టేలా చూపించటం చరిత్ర లక్ష్యంగా మారింది.

రాంకె పేర్కొన్నట్లు ఖచ్చితంగా ఏం జరిగిందో వివరించటం చరిత్రకారుని విధి. విజ్ఞానాన్ని వ్యవస్థీకరించే విధానంలో ఒక విషయానికి మరొక విషయానికి మధ్య తేడా వుంటుంది. చరిత్రకారుడు కేవలం గతాన్ని వర్ణించటం లేదు, గతం గురించి ఒక వివేకవంతమైన చిత్రాన్ని మన కళ్ళముందు నిలుపుతున్నాడు. ఒక సమగ్ర చరిత్రను అందిస్తున్నాడు. ఒక సంక్లిష్టమైన రచనాంశాన్ని అభివృద్ధిచేసి దానిని ఆకర్షణీయంగా వర్ణించటం అతని లక్ష్యంగా మారింది. శాస్త్రీయపద్ధతిని అనుసరించి సత్యాన్ని వివరించటానికి ప్రయత్నించిన మేరకు చరిత్ర ఒక శాస్త్రమే. అందుకే 'చరిత్రలో సత్యానికి సంబంధించిన విలువను పొందుపరచటం వలన 'చరిత్ర' ఒక శాస్త్రమే. చరిత్రకారులు శాస్త్రజ్ఞులే అని ట్రివిల్యన్ చెప్పిన మాట వాస్తవం.

భౌతిక విజ్ఞాన శాస్త్రవేత్త జిమాన్ నిపుణులచే బహిరంగంగా అంగీకరించబడిన ఒక ప్రవచనమే' శాస్త్రీయ సత్యమని పేర్కొన్నాడు. చరిత్రకారుడు బారక్లో 'మనం చదవే చరిత్ర యదార్థాలపై ఆధారపడినా నిజానికి అది యదార్థం కాదు . . . అంగీకార యోగ్యమైన తీర్పుల సముదాయం మాత్రమే'నని చరిత్ర గురించి చెప్పాడు. ఒక శాస్త్రవేత్త మరొక చరిత్రకారుడూ ఒకే రకమైన నిర్వచనాన్ని యించుమించు అవే మాటల్లో యివ్వటం చెప్పుకోవలసిన విషయం. చరిత్రకారుడు అనేకమంది నిపుణుల సహకారంతో యదార్థాలను నిరూపించటానికి, వ్యాఖ్యానించటానికి ప్రయత్నిస్తుంటాడు. కనుక చరిత్ర శాస్త్రమే అని అనేకులు వాదిస్తారు. పైగా ప్రకృతి శాస్త్రాల మాదిరే చరిత్రకారుడూ గతాన్ని వ్యాఖ్యానించి పునర్నిర్మించటానికి ముందు పరిశీలన, వర్గీకరణ, ప్రాక్కల్పనా సూత్రీకరణ, ప్రమాణ విశ్లేషణ వంటి అనేక శాస్త్రీయ విధానాలను అనుసరిస్తాడు. శాస్త్రానికి మూలం అయిన కార్యాచరణ నియమాన్ని చరిత్రకారుడూ అనుసరించి చారిత్రక సంఘటన వెనుక వున్న కారణాలను విశ్లేషిస్తున్నాడు.

ఫ్రెంచి గణితశాస్త్రవేత్త హెన్రి పాయిన్‌కరె శాస్త్రం ఏకం అనేకత; సరళత, సంక్లిష్టతల వైపు ఏకకాలంలో సాగుతుందని చెప్పాడు. పరస్పర విరుద్ధమైన యీ విషయాల వైపు పయనించటం అతని దృష్టిలో శాస్త్ర లక్షణం. ఇది చరిత్రకూ వర్తిస్తుంది. పెరుగుతున్న పరిశోధనా పద్ధతులు, విస్తరిస్తున్న విజ్ఞానం ద్వారా 'ఎందుకు ?' అనే ప్రశ్నకు చరిత్రకారునికి లభించే సమాధానాలు పెరిగినాయి. వాటి వైవిధ్యమూ ఎక్కువయింది. దీనితోపాటు శాస్త్రవేత్తలా చరిత్రకారుడూ తన సమాచారాన్ని సూక్ష్మీకరించాలని ప్రయత్నిస్తాడు. సంఘటనలను ఒక క్రమపద్ధతిని ఏర్పరుస్తాడు. కార్యాచరణ నియమంతో ఒక క్రమపద్ధతిలో లభిస్తున్న సమాచారాన్ని పొందుపరచటమే కాక శాస్త్రవేత్తలా సర్వకాల సర్వావస్థలలోను అన్వయించేలా కొన్ని సామాన్య సూత్రాలను లేదా సాధారణీకరణాలను రూపొందిస్తున్నాడు. చరిత్రలో యుగ విభజన, భౌగోళిక విభజన యిటువంటివే. నిగమన తర్కం ద్వారా చరిత్రకారుడు తనదైన ఒక ప్రాక్కల్పనను రూపొందించి అనంతరం అది ఋజువు చేసే సాక్ష్యాన్ని సేకరించటానికి చారిత్రక సంఘటనలను పరిగణనలోనికి తీసుకుంటాడు.

శాస్త్రం తన పూర్వసిద్ధాంతాల (Premises) ప్రామాణికత నిరూపణకు యెక్కువగా పరిశీలన, ప్రయోగాలపై ఆధారపడుతుంది. చరిత్రకూ యీ పద్ధతే ఆదర్శం. అయితే చరిత్రకారుడు తనకు తానుగా గతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించలేడు కాబట్టి సంఘటనలను చూసిన వారి ద్వారానో, విన్నవారి ద్వారానో, మరోరకంగానో, పరోక్షంగా పరిశీలిస్తాడు. ఎటువంటి ఆపేక్షణాలేని మౌలికాధారాలతోనే ముందుకు సాగుతాడు. శాస్త్రవేత్త విషయాలను ప్రత్యక్షంగా పరిశీలించటమేకాక మళ్ళీ ప్రయోగం ద్వారా తన నిర్ధారణలను నిరూపిస్తాడు. చరిత్రకారుడు ఒకదాని దృష్ట్యా మరొకదాని ప్రామాణికత తనిఖీని అనేక ఆధారాలను చూపించడం ద్వారా శాస్త్రవేత్తకు దగ్గరవుతున్నాడు. సామాన్య సూత్రాల ద్వారా శాస్త్రవేత్త భవిష్యత్తుని ముందుగా చెప్పగలుగుతుంటే చరిత్రకారుడు ప్రవక్త కాకున్నా ఒకదేశం గురించో, ఒక ఉద్యమం గురించో, మరోదాని గురించో చేసే అధ్యయనం ద్వారా దాని

భవిష్యత్తును ముందుగా వూహించే అవకాశం వుంది. ఏది ఏమైనా శాస్త్రానికి ఆదర్శాలైన ప్రాక్కల్పన, అంతర్దృష్టి, విషయ నిష్ఠత, సత్యం కోసం వేగిరపాటులేని, అవిశ్రాంతమైన, సక్రమమైన శోధనలతో వివేకవంతంగా చరిత్రను రూపొందిస్తున్నప్పుడు చరిత్రకారుణ్ణి శాస్త్రజ్ఞునిగా పరిగణించటంలో అనౌచిత్యం యేముంది ?

## 3.6 చరిత్రను శాస్త్రంగా పరిగణించటానికి ఉన్న ప్రధాన అభ్యంతరాలు :

చరిత్ర యెప్పటికీ నిజమైన శాస్త్రం అంటే ప్రామాణిక శాస్త్రంగా పరిగణించటానికి వీలులేదని వాదించేవారు అనేకమంది వున్నారు. ఈ విషయంలో బకల్, కోట్‌ల వాదాలను ఫ్రూడ్ గట్టిగానే ఖండించాడు. మానవ స్వభావం సంకీర్ణమైనది. ఎప్పుడు యెలా ప్రవర్తిస్తాడో, ఏ ఉద్దేశ్యాలతో పనిచేస్తాడో ముందుగా ఊహించటానికి అవకాశం లేదు. గతం గురించి సమగ్రంగా ఎప్పుడూ చెప్పలేం. పరిశోధించాల్సిన యదార్థాలు కొన్ని ఎప్పుడూ అపరిష్కృతంగానే వుంటాయి. అటువంటి వాటి నుండి పరిశోధకుడు తన అభిమతానికి అనుగుణమైన వాటిని ఎంచుకుంటాడు. సార్వత్రిక కోణం నుండి జ్ఞానాన్ని పరిశీలించటం, కొన్ని సాధారణీకరణాలను రూపొందిచటం వంటివి శాస్త్రవేత్త స్థాయిలో చరిత్రకారుడు ఎప్పటికీ చేయలేడు. దీనికి కారణం చరిత్ర ఏ సూత్రీకరణకు లొంగని మానవుల అనుభవాలకు సంబంధించినది. పైగా ఎటువంటి నిర్ధారణలను రాలేని అవ్యవస్థిత యదార్థాలకు సంబంధించినది. ప్రకృతి శాస్త్రాలలో యదార్థాలు ప్రత్యక్ష పరిశీలనకు, ప్రయోగాత్మక పరీక్షకు నిలుస్తాయి. చారిత్రక యదార్థాలు అలాకాదు. జరిగిపోయిన సంఘటనకు ప్రయోగం అసాధ్యం. పైగా మనిషి చేతల వెనుకవున్న అంతరార్థాలు ప్రత్యక్ష పరిశీలనకూ అందవు. కేవలం ఊహా ప్రక్రియ ద్వారానే అర్థం చేసుకోవాలి. మేధస్సు, ఆలోచనా శక్తితో మాత్రమే తెలుసుకోవాలి.

చరిత్రకు, శాస్త్రానికి మధ్యనున్న యీ మౌలిక భేదాలను పురస్కరించుకొని చరిత్రను శాస్త్రం కాదన్నవారి ప్రధానమైన ఆక్షేపణలు అయిదు కన్పిస్తున్నాయి. అవి :

1) చరిత్ర అద్వితీయమైన విషయాలను పట్టించుకుంటే, శాస్త్రం సాధారణ విషయాలను తెలియజేస్తుంది.
2) చరిత్ర ఎటువంటి పాఠాలూ నేర్పదు.
3) చరిత్ర భవిష్యత్తును ఊహించలేదు.
4) చరిత్రలో మనిషి తనను తాను పరిశీలించుకుంటాడు. గనుక చరిత్ర ఆత్మగతంగా ఉంటుంది.
5) చరిత్ర మతం, నీతి విషయాలను లోతుగా పట్టించుకుంటుంది.

### 3.6.1. చరిత్రలో సాధారణీకరణం :

శాస్త్రానికున్న కొన్నిప్రత్యేక లక్షణాలు చరిత్రకు లేవనే యీ ఆరోపణలను ఈ.హెచ్. కార్ తన గ్రంథం 'What is History' లో నిశితంగా పరిశీలించాడు. అందులో శాస్త్రం సాధరణం, సార్వత్రిక విషయాల గురించివి వరిస్తే చరిత్ర కేవలం ప్రత్యేక, అసదృశ్య విషయాలను వివరిస్తుంది అనేది మొదటిది. అయితే సారూప్యతగల సంఘటనల నుండి సాధారణీకరణం చేయకుండా చరిత్రకారుడు వుండలేడు. పై భావవ్యక్తీకరణకు భాషను ఉపయోగిస్తాడు. కనుక యిది తప్పదు (ఉదా॥ యుద్ధాలు, విప్లవాలు మొ॥నవి) కాని చరిత్రకారునికి "ప్రత్యేకతల్లో కాక ప్రత్యేకతల్లోని సాధారణ లక్షణాలతో ఆసక్తి ఎక్కువ. తన ఆధారాలను సరిచూచుకోవడానికి చరిత్రకారుడు సాధారణీకరణాన్ని ఉపయోగిస్తాడు. ఔరంగజేబు తన సోదరులను చంపాడా ? లేదా ? అనే అనుమానం వచ్చినప్పుడు మొఘలుల కాలంలో వారసులను హతమార్చే అలవాటుందా ? అనే సాధారణీకరణం గురించి చరిత్రకారుడు ఆలోచించక మానడు. చరిత్ర పాఠకుడూ చరిత్రకారుని పరిశీలనను తనకు

తెలిసిన సందర్భాలకు లేదా తన కాలానికీ వర్తింపజేసి సాధారణీకరణం చేస్తాడు. 'చరిత్రకారునికి, చారిత్రక యదార్థాలు సేకరించే వానికి వున్న తేడా సాధారణీకరణమే' నని ఎల్టన్ చెప్పిన మాట నిజం. చరిత్రకు సాధారణీకరణాలతో నిమిత్తం లేదనే మాట వాస్తవం కాదు. కార్ చెప్పినట్లు 'చరిత్ర సాధారణీకరణాలపై బ్రతుకుతుంది. సాధారణీకరణం పేరుతో అన్ని ప్రత్యేక సంఘటనలనూ ఒక సిద్ధాంతానికి అమర్చే ప్రయత్నం మాత్రం తప్పు. అటు చరిత్ర అనేది ప్రత్యేకతను, సాధారణీకరణకు గల సంబంధాన్ని తెలియజేస్తుంది. చరిత్రకారునికి యీ రెండింటినీ వేరు చేయడం కుదరదు.

## 3.6.2. చరిత్ర పాఠాలు నేర్పుతుంది :

చరిత్రను శాస్త్రంగా పరిగణించటానికి ఉన్న మరో ప్రధానమైన అభ్యంతరం 'చరిత్ర ఎటువంటి గుణపాఠాలూ నేర్పదు' అనేది. శాస్త్రం మనిషికి గుణపాఠాల నందిస్తుంది. చరిత్ర నేర్పదు అనే యీ ధోరణి సమంజసం కాదు. వాస్తవంలో సాధారణీకరణాల ద్వారా కొన్ని చారిత్రక సంఘటనల నుంచి నేర్చుకున్న పాఠాలను యితర చారిత్రక సంఘటనలకు వర్తింపజేయడం సర్వసాధారణంగా జరుగుతుంది. దీనికి చాలా ఉదాహరణలు కన్పిస్తాయి. ఫ్రెంచి విప్లవకారులు అమెరికా స్వాతంత్ర్య యుద్ధం నుంచి, రష్యా విప్లవకారులు ఫ్రెంచి విప్లవాల నుంచి, మొదటి ప్రపంచయుద్ధం తరువాత 1919 లో జరిగిన పారిస్ శాంతి సమావేశంలో పాల్గొన్న ఆయా దేశాల ప్రతినిధులు 1815 నాటి వియన్నాకాంగ్రెస్ అనుభవాల నుంచి అనేక పాఠాలు నేర్వడం వంటి నిదర్శనాలు కోకొల్లలు.

## 3.6.3 చరిత్ర భవిష్యత్తును సూచిస్తుంది :

ఇక చరిత్ర శాస్త్రంలా భవిష్యత్తును ఊహించలేదు అనే ఆరోపణ సరైన అవగాహన లేకపోవడంవల్ల ఏర్పడ్డ దురభిప్రాయం తప్ప మరొకటికాదు. చరిత్రకారుడు సాధారణీకరణ ద్వారా భవిష్యత్తుకు ఉపకరించే సూచనలు చేస్తాడు. అయితే యాదృచ్ఛికతకు ఎంతోకొంత అవకాశం వున్న చరిత్రలో ప్రత్యేక సంఘటనల గురించి ముందుగా చెప్పటం సాధ్యం కాకపోవచ్చు. కాని ఒకదేశంలో ఫలానా పరిస్థితులే కొనసాగినట్లైతే విప్లవం రావచ్చని తగిన సాక్ష్యాధారాలతో, యితర విప్లవాల నుంచి గ్రహించిన అనుభవాలతో చరిత్రకారుడు ఊహించవచ్చు. అలాగే జరగాలన్న నియమం లేదు. అనుభవం నేర్పిన పాఠంతో కొందరు జాగ్రత్త పడితే ఊహించిన సంఘటన జరుగకపోవచ్చు. అలాగని చరిత్రలో భవిష్యత్తును ఊహించటం జరుగదని చెప్పలేము. భూమ్యాకర్షణ శక్తి వల్ల ఆపిల్ చెట్టు నుంచి క్రింద పడుతుందని శాస్త్రం చెప్పినా మధ్యలో ఎవరైనా దానిని పట్టుకుంటే . . . '' అంతమాత్రాన ఆ సిద్ధాంతానికి విలువలేదని చెప్పలేం. హెన్రి పాయిన్‌కరి చెప్పినట్లు సిద్ధాంతాలు, సూత్రాలు సంభావ్యతను మాత్రమే సూచిస్తాయి. కాబట్టి అటు శాస్త్రంలోనైనా ఇటు చరిత్రలోగాని, పరిశీలన ఉద్దేశాలు, పద్ధతులు ప్రాథమికంగా ఒకే రకమని మనం గ్రహించవచ్చు.

## 3.6.4 చరిత్రలో విషయ నిష్ఠత :

చరిత్రలో పరిశీలకుడు, పరిశీలింపబడే విషయం రెండూ ఒకే వర్గానికి చెందినాయి. మనిషి చేసిన పనుల గురించి మరో మనిషి పరిశీలించటం. చరిత్రకారుడు గతంలో మానవాళి కార్యకలాపాలను అధ్యయనం చేస్తున్నాడు. ఆ పరిశీలనలో అతని అభిప్రాయాలు ప్రభావం చూపిస్తాయి. అంటే చరిత్రలో ఆత్మాశ్రయతకు తావుందని అంగీకరించాలి. చరిత్ర పునర్నిర్మాణంలో పక్షపాతానికి అవకాశం ఎక్కువే. కార్ చెప్పినట్లు సాంఘిక శాస్త్రాలన్నింటికీ యిది వర్తిస్తుంది. పైగా పరిశీలనా పద్ధతి కూడా పరిశీలనా విషయంపై ప్రభావం చూపిస్తుంది, మార్పును తెస్తుంది. ఇది శాస్త్రరంగంలో కూడా ఎంతో కొంత కన్పిస్తుంది. ఖగోళంలో కన్పించే మార్పులు లండన్‌లోని శాస్త్రవేత్తకు ఒకరకంగా, బెంగుళూరులోని శాస్త్రవేత్తకు మరోరకంగా కన్పించవచ్చు. అయితే చరిత్రకారుడైనా, శాస్త్రవేత్త అయినా, సత్యాన్వేషణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నప్పుడు విషయాన్ని ఆత్మగతంగాకాక

విషయపరంగా పరిశీలించాలి. విషయ నిష్ఠతలేని సత్యాన్వేషణ లోపభూయిష్టం కనుక శాస్త్రజ్ఞునిలా చరిత్రకారుడూ సాక్షికంగా పరిశీలన కొనసాగించటమనేది చరిత్రకు ఆదర్శం కావాలి.

## 3.6.5 చరిత్రలో మతం, నీతి స్థానం :

చరిత్రలో మతం, నీతి విషయాలకు ప్రముఖస్థానం యివ్వటం చరిత్రను శాస్త్రం అనటానికి ఉన్న మరో అభ్యంతరం. కొంతమంది చరిత్రకారులు యితరత్రా నిరూపించటానికి వీల్లేని వాటిని మతం సహాయంతో నిరూపించాలని ప్రయత్నిస్తారు. వారి దృష్టిలో మతం పేకముక్కల్లో జోకర్‌లాంటిది. ఎలా కావాలంటే అలా వాడుకోవచ్చు. అంతుతెలియని విషయాలకు మతాన్ని తురుపు ముక్కలా వాడుతారు. ఈ కారణంగానే చరిత్ర శాస్త్రంకాదని కొందరు భావిస్తారు. బెర్డయేవ్, నైబూర్, మార్టిటైన్ వంటి చరిత్రకారులు చరిత్ర స్వతంత్ర ప్రతిపత్తిని అంగీకరించినా చరిత్ర గమ్యం చరిత్రకు వెలుపల ఉందని భావించారు. కాని కార్ల్ బర్త్ అనే మతాధికారి, మతచరిత్ర వేరు, లౌకికచరిత్ర వేరు . . . చరిత్రకారుడు లౌకిక చరిత్ర మాత్రమే వ్రాయాలని, పేర్కొన్నాడు. చరిత్ర సమగ్రతకు, దైవశక్తికి లేదా మానవాతీత శక్తికి పొత్తు కుదరదని కార్ స్పష్టం చేసాడు. మానవాతీత శక్తుల సహాయం ఆశించకుండా చరిత్రకారుడు తన సమస్యలను తానే పరిష్కరించుకోవాలని, చరిత్ర జోకర్ లేకుండా ఆడే పేకాట వంటిదని అతని అభిప్రాయం.

చరిత్రకు, నీతికి మధ్య సంబంధం మరింత సంక్లిష్టమైన అంశం. చరిత్రకారుడు విషయాలను ఒక కారణం నుండి చూస్తే నీతిశాస్త్రవేత్త మరో కోణం నుండి చూస్తాడు. చరిత్రకారుడు చారిత్రక వ్యక్తుల వ్యక్తిగత విషయాలను గురించి తీర్పు చెప్పడు. వ్యక్తుల మంచీ చెడ్డలకన్నా వారి చేతలు, వాటి ఫలితాలే చరిత్రకారునికి ముఖ్యం. చారిత్రక వ్యక్తి నీతిపరమైన మంచీ చెడులు చారిత్రక సంఘటనలపై ప్రభావాన్ని చూపించినప్పుడు మాత్రమే చరిత్రకారుడు వాటి గురించి పట్టించుకుంటాడు. కాని 'చరిత్రకారుడు వివాదాలలో ఒకమధ్యవర్తి' లాంటివాడు, చారిత్రక వ్యక్తుల వ్యక్తిగత ప్రవర్తన గురించి తీర్పులు చెప్పే అధికారం, అవసరం చరిత్రకారునికి ఉందని ఆక్టన్ భావించాడు. ఇతనిలానే ఇసమా బెర్లిన్, చార్లీమాన్, నెపోలియన్ ఛెంఘిజ్‌ఖాన్ స్టాలిన్ వంటి చారిత్రక వ్యక్తులు చేసిన హత్యాకాండల ఆధారంగానే వారిని అంచనా వేయాలని పేర్కొన్నాడు. కాని యీ దృక్పధాన్ని నౌల్స్ వ్యతిరేకిస్తూ చరిత్రకారుడు మరణ శిక్ష విధించే న్యాయాధిపతి కాడని స్పష్టం చేసాడు. క్రోచె కూడా దీనిని సమర్థించాడు. కార్‌దీ ఇదే భావన. వ్యక్తుల నీతిని గూర్చికాక సంఘటనల, వ్యవస్థల విధానాల్లోని నీతిని గూర్చి వ్యాఖ్యానించటం చరిత్రకారునికి ముఖ్యం. చారిత్రక యదార్థాల విషయంలో యీ విధమైన వ్యాఖ్యానం కొంత తప్పదు. చారిత్రక వ్యాఖ్యానం విలువకు సంబంధించిన తీర్పులతో ఎప్పుడూ ముడిపడి వుంటుంది. చరిత్రకారుడెప్పుడూ వ్యక్తుల మంచి చెడ్డలకన్నా వారి చేతలు లేదా కార్యకలాపాల పట్లనే ఎక్కువ శ్రద్ధ చూపించాలి.

చరిత్ర భౌతిక శాస్త్రంలా, రసాయన శాస్త్రంలా నిజంగా ఒక శాస్త్రమా ? అనే ప్రశ్నకు కాదనే జవాబు చెప్పాలి. పైన చెప్పినవి ప్రామాణిక శాస్త్రాలు. చరిత్ర సాంఘిక శాస్త్రం. రెండుపాళ్ళు ఉదజని, ఒకపాలు ఆమ్లజని కలిపితే నీరవుతుందనే విషయం సార్వత్రికం. అన్ని దేశాల కాల పరిస్థితుల్లోను నిరూపించవచ్చు. ఇలాంటి నిర్దిష్ట సూత్రాలను చాటేవి ప్రామాణిక శాస్త్రాలు. చరిత్ర సాంఘిక జగత్తును అధ్యయనం చేస్తుంది. కనుక యిది సాంఘిక శాస్త్రం. ఎంతశాస్త్ర స్థాయిని కల్పించినా చరిత్రకు పరిమితులున్నాయి. ఇతర శాస్త్రాలతో వైరుధ్యాలూ వుంటాయి. అభ్యంతరాలు, ఆక్షేపణలూ ఎలా వున్నప్పటికీ "శాస్త్రజ్ఞులూ, సాంఘిక శాస్త్రజ్ఞులూ, చరిత్రకారులు - అందరూ మానవుణ్ణి, అతని పరిసరాలను, వాటి పరస్పర ప్రభావాన్ని గురించిన అధ్యయనం యొక్క భిన్న విభాగాలలో నిమగ్నమయ్యారు. వీరందరి ధ్యేయం పరిసరాలను గురించిన మనిషి పరిజ్ఞానాన్ని, తద్వారా పరిసరాలపై అతని ఆధిపత్యాన్ని పెంపొందించటమే" అనే విషయం గుర్తుంచుకోవాలి. చరిత్ర గతమైన ఆలోచన అంతర్దృష్టితో కూడినది.

కనుకనే కాలింగ్‌వుడ్ చరిత్రను మానవాళి అనుభవాలతో ముడిపడిన ఒక మూర్తశాస్త్రం (Concrete Science) అని వర్ణించాడు. మొత్తం మీద చరిత్ర రచనా స్థాయిని పెంచటానికి చరిత్రను మరింత శాస్త్రీయం చేయటమే కావలసినది.

## చరిత్ర ఒక కళ :

చరిత్ర శాస్త్రాల కోవకి చెందదని వాదించే వారు చరిత్రకున్న కొన్ని నిశ్చిత లక్షణాలను పరిగణలోనికి తీసుకొని చరిత్ర కళేనని పేర్కొంటున్నారు. ఇతర కళలలా చరిత్రకూడా మానవతా విలువలకు సంబంధించినది. కళాత్మక క్రియలకు పనికివచ్చే సమాచారంతో చరిత్ర నిండి వుంది కాబట్టి యిది సాహిత్యం లేదా సంగీతం వంటి కళకు సంబంధించిన విషయాల కంటే భిన్నమైనది కాదు 'చరిత్ర రచనలకు అనుబంధంగా శాస్త్రీయ పద్ధతులను, యితర అంశాలను ఎంత ఎక్కువ చేర్చినప్పటికీ చరిత్ర ఎప్పటికీ ఒక కళగానే మిగుల్తుంది' అని రౌజ్ స్పష్టం చేసాడు. బారక్లో కూడా అతనితో ఏకీభవిస్తూ చరిత్రను ఖచ్చితంగా కళేనని వర్ణించాడు

గతాన్ని పునర్నిర్మించే కర్తవ్యంలో భాగంగా చరిత్రకారుడు యదార్థాలను సేకరిస్తాడు గతం గురించిన యీ యదార్థాల సేకరణతోబాటు వాటికి సంబంధించిన ఆలోచనలను, అనుభూతులతో కూడా చరిత్ర ముడిపడి వుంది. వక్రీకరించబడిన వివరణలు, అసంపూర్ణ వర్ణనలు, ప్రమాదకరమైన ఉపేక్షలు మొదలైనవి చరిత్ర పరిశోధనలో చరిత్రకారునికి ఎదురయ్యే ముఖ్యమైన విషయాలు. ఈ ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి, తన అధ్యయన విషయానికి న్యాయం చేయటానికి ఒక కళాకారునికి ఉండవలసిన భావనాశక్తి, విలువల అవగాహన, సమన్వయం, భావస్వామ్యం, భావవ్యక్తీకరణ సామర్థ్యం చరిత్రకారునికి తప్పనిసరిగా అవసరం. ఇవి లేకుండా గతం గురించి వ్యాఖ్యానించటం, గతాన్ని సరిగ్గా చిత్రీకరించటం అసాధ్యం.

చరిత్ర ఖచ్చితంగా శాస్త్రమేనని ఉద్ఘాటించిన బ్యూరీయే సానుభూతి పూర్వకమైన, మానసికమైన భావనాశక్తి చరిత్ర పరిశోధకునికి తప్పనిసరిగా వుండాలని అంగీకరించాడు. చరిత్ర ఆధారాల నుండి సేకరించిన యదార్థాలతోనే గతాన్ని పునర్నిర్మించలేం. వాటిని విశ్లేషించాలి, వ్యాఖ్యానించాలి. ఇందుకు భావనాశక్తి, వివేచన కావాలి. గతాన్ని అర్థవంతంగా కన్పింపచేయటానికి నిశితాదృష్టి ఉండాలి.

కథన లక్షణం చరిత్రకు ఆభరణం. గతాన్ని చిత్రీకరించే విషయంలో చరిత్రను కళగానే భావించాలి. పాండిత్యం, భావ వ్యక్తీకరణ సామర్థ్యం వున్నప్పుడే చరిత్రకారుడు తన స్వీయ అంచనా ప్రకారం గతాన్ని చక్కగా చిత్రీకరించటం, తన ఆలోచనలను అందంగా ఆకర్షణీయంగా చెప్పగలగటం సాధ్యం. ఇవన్నీ చరిత్రను కళగానే నిలబెడ్తున్నాయి.

## చరిత్ర శాస్త్రం, కళల మిశ్రమం :

చరిత్రకున్న అనేక సంశ్లిష్ట గుణాలను పరిగణనలోనికి తీసుకున్నప్పుడు చరిత్రను శాస్త్రంగాను, కళగాను కూడా పేర్కొనవచ్చు. అదీ, యిదీ కూడా పాక్షికమే. చరిత్ర రెండింటి మిశ్రమమని ఆంగ్ల చరిత్రకారుడు జి.ఎం.ట్రివెల్యన్ కూడా భావించాడు. యదార్థాలను రాబట్టటంలో శాస్త్రీయత, వాటిని పాఠకునికి కథన రూపంలో రసరమ్యంగా వివరించటంలో కళాత్మకత రెండూ చరిత్రలో స్థానం కల్పించుకున్నాయి. చరిత్ర విశ్లేషణకు శాస్త్రీయ పరిశోధనా పద్ధతులు, సత్యాన్వేషణ విధానం తప్పనిసరి. ఆంట్యా చరిత్రశాస్త్రం కనుగొన్న సత్యాన్ని విపులీకరించే విధానంలో, కథనంగా, సాహితీరూపంకంగా, అర్థవంతమైన ప్రయోజనకారిగా మలచటంలో చరిత్ర కళే. చరిత్రకారుని గమ్యం గతంలో ఏం జరిగింది ? అని తెలుసుకోవటం కాబట్టి ఆ తెలసుకున్న దానికి సమర్థవంతమైన భావ వ్యక్తీకరణ అవసరం గనుక చరిత్ర శాస్త్రం, కళల మిశ్రమని చెప్పవచ్చు.

**సంక్షిప్తంగా . . .**

చరిత్ర రచనా పరిణామంలో 19వ శతాబ్దం ఒక మలుపు. హేతుబద్ధంగా, విమర్శనాత్మక ధోరణిలో వస్తుపరతతో శాస్త్రీయ ధోరణులు అన్ని రంగాలలో చోటుచేసుకున్నాయి. చరిత్ర పరిశోధనలో కూడా వచ్చిన యీ పరిణామాలు చరిత్రను శాస్త్రంగానే పరిగణించే స్థాయికి తీసుకువెళ్ళినాయి. ఏ ప్రాతిపదికన చరిత్రను బ్యూరీ ఖచ్చితంగా శాస్త్రమేనని పేర్కొన్నాడు. ఏ శాస్త్ర లక్షణాలు మనకు చరిత్రలో కన్పిస్తున్నాయి, ఏ మేరకు చరిత్రను శాస్త్రమనవచ్చు. చరిత్రను శాస్త్రంగా పరిగణించటానికున్న ప్రధాన అభ్యంతరాలు వాదనకు నిలబడతాయా ? చరిత్రకున్న కళాత్మక విలువలు ఏమిటి ? చరిత్ర శాస్త్రం, కళల మిశ్రమమనవచ్చునా ? వంటి అంశాలను విపులంగా తెలుసుకున్నాం.

## 3.10 మాదిరి ప్రశ్నలు

### ఎ) ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.

1. 'చరిత్ర ఒకశాస్త్రం అంతకంటే తక్కువకాదు, ఎక్కువకాదు' చర్చించండి.
2. చరిత్ర శాస్త్రమా ? కళయా ? విపులీకరించండి.

### బి) ఈ క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. చరిత్ర పాఠాలు నేర్పుతుందా ?
2. 'చరిత్ర ఎప్పుడూ కళే ? వివరించండి.
3. చరిత్రకు మతం, నీతితో గల సంబంధాన్ని వివరించండి.

## 3.11 ఉపయుక్త గ్రంథాలు :


| | | |
|---|---|---|
| Bury, J.B. | : | The Idea of Progress (New York, 1955) |
| Carr, E.H | : | What is History ? (Mac Millan, 1961) |
| Collingwood, R.G | : | The Idea of History (O.U.P., 1966) |
| Marwick, Arthur | : | The Nature of History (Mac Millan 1970) |
| Rowse, A.L. | : | The use of History (Penguin London, 1961) |
| Sheik Ali B. | : | History : Its Theory and Method (Mac Millan, 1978) |
| Durga Prasad, J. | : | Charitra Rachana Sastram (Tel.) (Telugu Akademi, Hyderabad, 1987) |

పాఠం - 4

# చరిత్ర తత్వం

**విషయక్రమం :**


4.0 లక్ష్యం
4.1 పరిచయం
4.2 చరిత్రతత్వం అంటే ఏమిటి ?
4.3 విమర్శనాత్మక చరిత్రతత్వం
4.4 పరిక్పన చరిత్రతత్వం
4.4.1 ప్రత్యక్షజ్ఞానవాదం
4.4.2 జర్మను భావావాదం
4.4.3 మార్క్సువాదం
4.4.4 చారిత్రకతావాదం
4.4.5 చక్రీయ సిద్ధాంతం
4.4.6 ఆస్తికవాదం
4.4.7 ప్రగతివాదం
4.4.8 యాదృచ్ఛికతావాదం
4.4.9 నియతివాదం
4.5 సంక్షిప్తంగా ....
4.6 మాదిరి ప్రశ్నలు
4.7 ఉపయుక్త గ్రంథాలు


## 4.0 లక్ష్యం :

ఈ పాఠం అధ్యయనం వలన మీరు

- చరిత్రతత్వం అంటే ఏమిటో, అందులో తాత్వికాణ్వేషణకు సంబంధించిన రెండు విభాగాలు 1) విమర్శనాత్మక చరిత్రత్వం 2) పరికల్పన చరిత్రతత్వం, వాటి ప్రయోజనాలు ఏమిటో వివరించగలగాలి.
- 17 వ శతాబ్దం వరకు చరితతత్వ పరిణామాలను విశదీకరించగలగాలి.
- 17 వ శతాబ్ధం నుండి 20 వ శాతాబ్దం వరకు వచ్చిన భిన్న చరిత్ర తాత్విక ధోరణులను విశ్లేషించగలగాలి.

## 4.1. పరిచయం :

తత్వవేత్తలతో చరిత్ర అధ్యయనంపట్ల ఆసక్తి పెరగడంతో చరిత్రతత్వం అనే భావన ప్రచారంలోకి వచ్చింది. చరిత్రను నిర్వచించటం, చరిత్ర స్వభావాన్ని వివరించటం ఎంత కష్టమో చరిత్ర తత్వాన్ని వివరించటమూ అంతే కష్టం. చరిత్ర తత్వాన్ని అనేకులు అనేక రకాలుగా వివరించటంతో చరిత్రతత్వ వివరణ సంక్లిష్టమయింది. తత్వశాస్త్రమంటే ప్రత్యక్ష అనుభవానికి,

పరిశీలనకు, శాస్త్రీయ పరిశోధనకు అందనటువంటి అసాధారణ విషయాలను వివేచన, తర్కం ఆధారంగా ప్రాక్కల్పనలతో, క్రమ బద్ధమైన ఆలోచనతో వివరించేది. చరిత్రకారుడు గతంలో ఏం జరిగిందో తెలుసుకోవటంతో సంతృప్తి చెందక ఏ ప్రయోజనంకోసం మనిషి పరిసరాలతో పోరాటం సాగిస్తున్నాడో తెలుసుకోవటం, తన జీవన విధానాన్ని మెరుగు పరచుకునే ప్రయత్నంలో ఎదురైన అనుభవాలు, అనుభూతులు, సంఘటనల తీరు తెన్నులు, వాటి అంతరార్థాన్ని వివరించటానికి పూనుకోవటంతో తత్త్వవేత్తగా మారుతున్నాడు. శ్రేష్టమైన జీవన గమ్యం ఏమిటనే విషయంలో భిన్నాభిప్రాయాలు నెలకొనటంతో చరిత్ర తత్వం సంకీర్ణమయింది.

## 4.2 చరిత్ర తత్వం అంటే ఏమిటి?

ఆధునికయుగంలో 'చరిత్ర తత్వం' అనే పదాన్ని మొదటిసారిగా ఫ్రెంచి తత్వవేత్త వోల్టేర్ ప్రయోగించాడు. విమర్శనాత్మకమైన లేదా శాస్త్రీయమైన చరిత్ర అనే భావంతో అతనీమాటను ఉపయోగించాడు. ఆ తరువాత 'సార్వత్రిక చరిత్ర' అనే అర్థంలో జర్మను తత్వవేత్త హెగెల్ వాడాడు. చరిత్ర వివరించే సంఘటనల క్రమాన్ని నియంత్రించే సాధారణ నియమాలను కనుక్కోవటం అనే భావంతో ఆగస్టీకోట్ వంటి వాస్తవిక వాదులు ఉపయోగించారు. బ్రిటిషు చరిత్ర తత్వవేత్త కాలింగ్‌వుడ్ 'చరిత్ర అంటే ఏమిటి ?' అనే ప్రశ్నకు జవాబిచ్చే ప్రయత్నమే చరిత్రతత్వమని పేర్కొన్నాడు. కార్ కూడా యిదే అభిప్రాయం వెలిబుచ్చాడు. కాలిన్ వుడ్ మరింత వివరిస్తూ' చరిత్రతత్వం గతంలోకాని, గతంలో గురించి 'చరిత్రకారునికున్న భావాలతోగాని ఏకపక్షంగా కాక యీరెండు విషయాల పరస్పర సంబంధంతో ముడిపడి ఉంది' అంటూ 'చరిత్రకారుడు పరిశీలించేది నిర్జీవమైన గతాన్ని కాదు, సమకాలంతో ఏదో విధంగా సజీవ సంబంధం ఉన్నగతం' అనీ, 'భావాల చరిత్రే చరిత్ర' అనీ పేర్కొన్నాడు. చరిత్ర అనే పదానికి 'అన్వేషణ' అన్వేషణ, ఫలితంగా రూపుదాల్చిన 'వర్ణన' లేదా 'రికార్డు' అని రెండు అర్థాలు ఉన్నట్లే చరిత్రతత్వం అనే మాటనూ రెండర్థాలలో తీసుకోవచ్చు, జరిగినవి జరిగినట్లు వాస్తవిక సంఘటనకు సంబంధించినదనీ, వాటి అర్థాన్ని, ప్రయోజనాన్ని కనుక్కునే ప్రయత్నమే యిదనీ మొదటి అర్థం, ఇక రెండో అర్థం చరిత్రకారుని ఆలోచనా స్వభావం, అతని విధాన విలక్షణాన్ని తెలుసుకోవటానికి సంబంధించినది.

ప్రత్యక్ష పరిశీలనకు, శాస్త్రీయ అధ్యయనానికి అందని విషయాలను వివరించే క్రమబద్ధమైన ఆలోచనే చరిత్రతత్వం, అంటే తెలియని దాని గురించిచేసే ఒక ఊహా వ్యాఖ్యానం. కన్పించే విషయాల స్వభావం తెలియకపోయినా తత్వవేత్త వాటి సాధన స్వాభావం వివరించటానికి వివేచన, తర్కం ఆధారం చేసుకుని ప్రాక్కల్పనతో ముందుకు వెళ్తాడు. చరిత్రకారుడు యీ విధంగానే తత్వవేత్తగా మారతాడు. ఈ కారణంగానే మనిషి జీవితానికి ఒక ప్రయోజనం, ఒక పరమార్థం వున్నప్పుడు ఆ మనిషితో ముడిపడి వున్న చరిత్రకూ ప్రయోజనం వుంటుందనే నమ్మకం మామూలుగానే యేర్పడింది. మెరుగైన జీవితానికై మనిషి మొదటినుండీ పోరాటం చేస్తూనే వున్నాడు... కష్టాల నెదుర్కొంటూ వున్నాడు. చరిత్రకారుడు వర్ణించే యీ పోరాటానికి, కష్టాలకు ఏదో ఒక ప్రయోజనం ఉండే వుంటుంది. వీటిని చిత్రిస్తున్న చరిత్రకారులకు మెరుగైన జీవనగమ్యం ఏమిటనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. బటర్‌ఫీల్డ్ చరిత్రను తనకు తానుగా ముందుకు సాగే ఒక శక్తిగా వ్యాఖ్యానించాడు. బ్యూరీ, బ్లాక్, బెకర్, బియర్డ్‌ల దృష్టిలో చారిత్రక సంశ్లేషణం కాలావసరాలతో సంబంధం కలిగినటువంటిది. చరిత్రకు గమ్యం సెయింట్ ఆగస్టీన్ దృష్టిలో 'భగవన్నగరం' (చర్చి). హెగెల్‌కి అది 'పరిపూర్ణరాజ్యం', క్రోచెకు 'బౌద్ధిక అంతర్దృష్టి', కార్ల్‌మార్క్స్ చరిత్ర గమ్యాన్ని 'అర్థిక నియతివాదం' దృష్ట్యా పరికించాడు. 20 వ శతాబ్దపు ఆలోచనా శీలుర కిది 'చారిత్రక సాపేక్షవాదం' (Historical retalierism) ఈ విధంగా 'చరిత్రతత్వం' అనే మాటకు అనేక వ్యాఖ్యానాలు వెలువడినాయి.

చరిత్రతత్వం ప్రాధమికంగా తాత్విక అన్వేషణకు సంబంధించిన రెండు విభాగాలతో ముడిపడివుంది. ఈ రెండు విభాగాలూ భిన్నమైనవే అయినా పరస్పరం సంబంధం ఉన్నటువంటివి. వీటిలో మొదటిది విమర్శనాత్మక చరిత్రతత్వం. ఇది

చరిత్ర రచనను తార్కికంగా విశ్లేషిస్తుంది. ఇక రెండవది పరికల్పక చరిత్రతత్వం. ఇది సామాన్య చరిత్రగ్రంథాలు తెలిపే సమాచారాన్ని మించి చారిత్రక సంఘటనల తీరు తెన్నుల్నీ, వాటి అంతరార్థాన్ని ప్రాముఖ్యాన్ని గ్రహించటానికి ప్రయత్నిస్తుంది.

## 4.3 విమర్శనాత్మక చరిత్రతత్వం :

తార్కికమైన జ్ఞాన మీమాంసకు సంబంధించిన లక్షణాన్ని చిత్రించటం గురించి పరిశీలించే విమర్శనాత్మక చరిత్రతత్వాన్ని శాస్త్రీయ లేదా విశ్లేషణాత్మక లేదా స్థూల పరిశీలనాత్మక చరిత్రతత్వం అని కూడా వ్యవహరిస్తారు. 19 వ శతాబ్దం నుండి మాత్రమే యిది అభివృద్ధి చెందింది. విమర్శనాత్మకంగా చరిత్రను అధ్యయనం చేయటం వలన చరిత్ర విషయస్వభావం గురించిన, చారిత్రక చింతనా లక్షణం గురించిన అనేక చిక్కుసమస్యలు పరిష్కారమయ్యాయి. కాని కొన్ని యిబ్బందులూ వున్నాయి. చరిత్ర స్వభావానికి సంబంధించి విమర్శనాత్మక అధ్యయనానికి యోగ్యమైన నిరుపమానమైన సమస్యలలో ముఖ్యమైనవి - చరిత్ర శాస్త్రమా ? చరిత్రలో యదార్థాల, వివరణల స్థానం ఏమిటి ? చరిత్రలో విషయనిష్ఠత సాధ్యమా ? మొదలైనవి. వీటికి సంబంధించిన వివరణలు వేర్వేరుగా ఆయా పాఠాలలో యివ్వటం జరిగింది.

## 4.4 పరికల్పక చరిత్రతత్వం :

చరిత్ర తాత్విక అన్వేషణకు సంబంధించిన రెండవ విభాగం పరికల్పక చరిత్రతత్వం. దీనినే కాల్పనిక లేదా భావనాత్మక చరిత్రతత్వం అనికూడా పేర్కొంటారు. ముందే చెప్పినట్లు సామాన్య చరిత్ర రచనలు తెలిపే సమాచారాన్ని మించి ఆయా చారిత్రక సంఘటనల తీరు తెన్నుల్ని వాటి అంతరార్థాన్ని, ప్రాధాన్యతను వెలికి తీయటానికి యీ పరికల్పక చరిత్ర తత్వం ప్రయత్నిస్తుంది. చరిత్ర యించుమించు 19 వ శతాబ్దం వరకు తత్వశాస్త్రంలోనో, సాహిత్యంలోనో భాగంగా పరిగణించబడింది. చరిత్ర పరిగణతితో చరిత్రతత్వం కూడా సమానంగా అభివృద్ధిచెందింది. చారిత్రక ప్రక్రియ అర్థం, ప్రయోజనాలను కనుగొనటానికి కొంతమంది తత్వవేత్తలు ఆసక్తి చూపించటంతో చారిత్రక సంఘటనలను, వాటిలో అంతర్గతంగా వున్న యితివృత్తం ప్రాధాన్యతను వివరించే ప్రయత్నాలు జరిగినాయి. 'చారిత్రకమైన మార్పుకు సంబంధించిన ధోరణులు, సూత్రాల అస్తిత్వం యెటువంటి అసందిగ్ధంతోనైనా ఋజువు చేయ్యటం అసాధ్యమే అయినా అటువంటి వాటి గురించి పరికల్పన చేయటం న్యాయసమ్మతమే'నని ఏ.ఎల్. భాషాయ్ సమర్థించాడు. చరిత్ర రహస్యం కనిపెట్టి వ్యాఖ్యానించాలనే కోరిక అపారమైన సాహిత్యాన్ని సృష్టించింది.

చరిత్ర కొకరీతి వుందనే నమ్మకం ప్రాచీనకాలం నుండి ఉంది. ప్రాచీన గ్రీకు చరిత్రకారుడు డయొనీషియస్ చరిత్రను 'నిదర్శనాల ద్వారా బోధించే తత్వశాస్త్రం' అన్నాడు. హెపియాడ్, సెయింట్ ఆగస్టీన్‌లు చరిత్ర దైవనిర్దేశం ప్రకారం జరిగిందని భావించారు. అయితే దీనిని చరిత్రతత్వమని పిలవటం అసమంజసం, కారణం అతీతశక్తుల ప్రభావాన్ని చరిత్ర తత్వం గుర్తించదు. ప్రాచీన భారతీయులకు తమదైన ప్రత్యేక చరిత్రతత్వం వుంది. వాళ్ళదృష్టిలో పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ, మోక్షాల గురించిన ఉపదేశంతో కూడిన పూర్వగాథని కథాయుక్తంగా చెప్పటమే ఇతిహాసం లేదా చరిత్ర. జీవిత విలువల్నీ, వాటిని వాస్తవం చేసే ప్రయత్నాలను, ప్రజలు తెలివితేటలతో సాధించిన విషయాలను విపులీకరించే సమగ్ర చరిత్ర వారి లక్ష్యం. మన ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, శాసనాలు - అన్నీ సమగ్ర లేదా సార్వత్రిక చరిత్ర అనే దృక్పథాన్నే శ్వాసించినాయి. ఈ ధృక్పథం వారి అసమాన చరిత్ర తత్వం నుండి పుట్టింది. సృష్టి, స్థితి, లయలకు బ్రహ్మే మూలమనే విశ్వాసాన్ని మన ప్రాచీన సాహిత్యం ప్రతిబింబించింది. ఈ విశ్వాసమే కల్పాలు, యుగాలు, కర్మ, పునర్జన్మ, అవతారాలు, వర్ణాశ్రమ ధర్మం పురుషార్థ లక్ష్యం - యివన్నీ హిందువులు చరిత్రను కేవలం గతం గురించిన కథగాకాక భవిష్యత్తులో కొనసాగుతుందన్న ఆలోచనతో కూడిన ఒక అర్థవంతమయిన సజీవ వర్తమానంగా భావించారు. వైయక్తికమైనది సార్వత్రికం చేయబడుతుంది. వ్యక్తి పరిసరాల పరిమితులకు అతీతంగా ఎదగాలి. ఈ చరిత్ర తత్వాన్నే మన ప్రాచీన సాహిత్యం విశదీకరిస్తుంది.

ఆధునిక యుగంలో ఇటలీ తత్వవేత్త, న్యాయశాస్త్ర ప్రవీణుడు వీకో (1668 - 1744) చరిత్రతత్వానికి గట్టి పునాదిని ఏర్పరచాడు. 1725 లో 'New Science' అనే గ్రంథాన్ని అతడు వెలువరించాడు. తెలివైన పరిశోధకుని శాస్త్రీయమైన శ్రద్ధతో కూడిన ఒక సృజనాత్మక సమన్వయవాది సంపూర్ణ సాధన సంపత్తి అతనిలో మనకు కన్పిస్తుంది. నిగూఢమైన భాష, భావగర్భిత అంతర్దృష్టి, డేకార్ట్ హేతువాద నిరాకరణ, సమకాలీన ప్రజలకంటే ముందుడటం వంటి కారణాలవల్ల యీ ఆలోచనాశీలి ప్రభావం సమాజంపై ఏమీ కన్పించలేదు. వీకో పేరు ముఖ్యంగా 'చరిత్ర పునారావృతమవుతుంది' అనే సిద్ధాంతంతో జతకలపబడింది. గతకాలం పునరావృతం అవటమేకాక దైవాధీ గమ్యం వైపు పురోగమిస్తుందని అతని భావన. జ్ఞానవికాసం, కాల్పనికవాదం అనే రెండు పరస్పర విరుద్ధ భావాలు ప్రస్ఫుటంగా కన్పించినాయి. తత్వశాస్త్ర రంగాల్లో సాధించిన ఘనకార్యాలు, వీటి ఫలితంగా వచ్చిన నూతన ధోరణులు కలసిన భావ విప్లవమే జ్ఞానవికాసం, ఇది చరిత్రను మానవ ప్రగతివైపు సాగే రేఖీయగమనం (Linear movement) గా పరిగణించింది. 17 వ శతాబ్ద మధ్య నుండి 18 వ శతాబ్ది చివరివరకు చరిత్ర రచనలో విలసిల్లిన యీ జ్ఞాన వికాస సంప్రదాయానికి చెందిన మేధావుల్లో డేవిడ్ హ్యూమ్, ఆడమ్‌స్మిత్, వోల్టేర్, గిబ్బన్‌లు ప్రసిద్ధులు. 18 వ శతాబ్దం చివరిలో 19 వ శతాబ్దం ఆరంభంలో జ్ఞాన వికాసయుగ తీవ్ర వివేచనాత్మక భావధోరణికి ప్రతిస్పందనగా కాల్పనిక వాదం ఆవిర్భవించింది. ఈ కొత్త సంప్రదాయంలో హేతువు స్థానంలో ఊహ చోటు చేసుకుంది. తర్కబద్ధమైన ఆలోచనలకంటే అనుభూతికి ప్రాముఖ్యం పెరిగింది. ఈ సంప్రదాయం చరిత్రను 'చక్రీయగమనం' (Cyclical Movement) గా తీసుకుంది. కాంట్, కోడార్సేలు చరిత్రను మానవ విచక్షణా జ్ఞానం యొక్క ప్రగతిశీల ప్రత్యక్ష స్వరూపం (Progressive Manifestation) గా వర్ణించారు.

## 4.4.1 ప్రత్యక్ష జ్ఞానవాదం :

18, 19 శతాబ్దాల్లోని పరికల్పక చరిత్రతత్వ అధ్యయనాలను ప్రత్యక్ష జ్ఞానవాదం (Positierisen) భావవాదం (Idealism) చారిత్రకతావాదం (Historicism) అని మూడు రకాలుగా విభజించవచ్చు. ఇవికాక ప్రత్యక్ష జ్ఞానవాద, భావవాదాలనుండి మార్క్సువాదం అభివృద్ధి చెందింది.

జ్ఞానం ప్రత్యక్ష విషయాలపై ఆధారపడాలని విశ్వసించే తాత్విక సిద్ధాంతమే ప్రత్యక్ష జ్ఞానవాదం. ఏ విశ్లేషణైనా, ఏ వివేచనైనా అనుభవంపై ఆధారపడాలి, శాస్త్రీయ విజ్ఞానానికి ప్రాధాన్యతనివ్వాలి, లోకజ్ఞతకు దగ్గరగా వుండాలి. ఊహ, అనుభూతి, భావుకతలను ఆలంబన చేసుకున్న కాల్పనిక వాదానికి ప్రతిస్పందనగా 19 వ శతాబ్దంలోనే ఆవిర్భవించిన యీ ప్రత్యక్ష జ్ఞానవాదం పరిశీలన అనేది శాస్త్రీయ విధానానికి పరిమితం కావాలని నమ్ముతుంది. ప్రకృతి రహస్యాలను కనుగొనే, ప్రకృతిని స్వాధీనం చేసుకునే మార్గాన్ని ఆలోచించే యీ తాత్విక చింతనకు, ప్రధాన పూజారి ఆగస్ట్‌కోట్. ప్రాపంచిక సంఘటనలను మనిషి ప్రత్యక్ష అనుభవం దృష్ట్యా చెప్పాలని అతడు పేర్కొన్నాడు. చరిత్రను సూత్రబద్ధమైన శాస్త్రంగా తీర్చిదిద్దుట యీ ప్రత్యక్ష జ్ఞానవాదుల ఆశయం. ఆగస్ట్‌కోట్ చెప్పిన 'త్రిదశానియమం' మొదటి దశలో మనిషి ప్రాపంచిక సంఘటనలను మత దృష్టితోను, రెండవ దశలో అధిభౌతిక దృష్టితోను వివరిస్తాడు. ఇక మూవడదైన ప్రత్యక్ష అనుభవదశలో నియమాలతో సంతృప్తి చెందుతాడు. సామాజిక సంఘటనలను యీ మూడవదశలోకి తెచ్చే ప్రయత్నం నుంచే భౌతిక శాస్త్రాలు ఆవిర్భవించాయి.

శాస్త్ర పరిభాషలో చరిత్రను చక్కగా వ్యాఖ్యానించిన మేధావి వాల్టర్ బేజ్‌హాట్. అర్థశాస్త్రవేత్త, రాజనీతి విశారదుడు, సమాజ శాస్త్రజ్ఞుడూ అయిన ఇతను తన 'Physics and Politics' (1872) గ్రంథంలో సమాజాల మూలం, క్రమ ఆవిర్భావాలకు డార్విన్ పరిణామ సిద్ధాంతాలను చక్కగా అన్వయించాడు. ఆంగ్ల చరిత్రకారుడు బకల్, ఫ్రెంచి చరిత్రకారుడు టైనెలుకోట్ భావాలను చరిత్ర వ్యాఖ్యానికి అన్వయించటాన్ని బలపరచారు.

ఆధునిక విషయ గత చరిత్ర రచనా సంప్రదాయానికి మార్గ దర్శకుడైన జర్మనీ దేశస్తుడు రాంకె **(1795-1885)** జరిగింది జరిగినట్లు, విషయగతంగా నమ్మదగిందిగా, గతాన్ని వివరించటం చరిత్రకారుని లక్ష్యమని, తత్వశాస్త్రానికి భిన్నమైనది చరిత్ర అని గట్టిగా నమ్మిన ప్రత్యక్ష జ్ఞానవాదుల్లో ముఖ్యుడు. ఆగస్ట్‌కోట్, ఫిక్టె, నైబూర్‌ల రచనలచే ప్రభావితుడైన ఇతడు మౌలికాధారాల ప్రాతిపదికగా వాస్తవాన్ని ధృవీకరించుకోవాలనే పట్టుదలతో విమర్శనాత్మక పద్ధతిని మార్గదర్శకం చేసుకుని 'Histories of the Roman and Teletonic Peoples', 'History of the Popes', 'The History of the world' వంటి అనేక రచనలు చేసాడు. ఈ రచనలన్నింటా రాంకె నిష్పాక్షికత, అపురూపమైన విషయనిష్ఠత, ఖచితత్వం ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. 'విమర్శనాత్మక కౌశల్యం, పరిశ్రమ, పట్టువీడని పరిశోధనల ద్వారా రాంకి ఒక కొత్త, మరింత సంస్కరింపబడిన చరిత్ర రచనా విధానాన్ని సృష్టించాడు.' సమకాలీన సిద్ధాంతాల ప్రభావానికి చరిత్రకారుడు లోబడరాదని నమ్మాడు. సైబెల్, బర్కారోల్ట్, రేనాన్ తదితరులు రాంకె పంథాని అనుసరించినవారే, బ్రిటన్‌లో మాత్రం ఎంత విమర్శనాత్మక పద్దతులను గురించినా చరిత్ర సారస్వత ప్రక్రియగానే కొనసాగింది.

## 4.4.2 జర్మను భావవాదం :

18,19 శతాబ్దాల్లోని పరికల్పన చరితతత్వ అధ్యయనంలో రెండవరకం జర్మను భావావాదం. దీనికి ప్రతినిధులు ఇమ్మాన్యుయేల్ కాంట్, ఫిక్టె, హెగెల్‌లు వీరిలో కాంట్ కాల్పనిక ఆదర్శవాద ఉద్యమానికి స్ఫూర్తినిచ్చాడు. జ్ఞానం అతీంద్రియమే అంటూ ఇంద్రియాల ద్వారా సంవేదనం యేర్పడి, అవగాహన వల్ల రూపం యేర్పరచబడినప్పుడు అది జ్ఞానమై అనుభవ ప్రపంచం గురించి తెలుపుతుంది. అవగాహాన భావకల్పన ద్వారా జ్ఞానాన్నిస్తుంది. కనుకనే యిది భావవాదమయింది.

'Lectures on the Philosophy of History' అనే గ్రంథం హెగెల్ ముఖ్యమైన రచన. అందులో అతడు చారిత్రక ప్రక్రియను తర్కంతో గుర్తించాడు. తర్కం ఆలోచనకు సంబంధించిన ఏ రూపమూలేని ఒక ప్రక్రియ కాదు. హెగెల్ దృష్టిలో అది నిర్దిష్టమైన చారిత్రకగమనం. ప్రపంచాన్ని పాలిస్తున్నది హేతువు అని అతని గట్టి నమ్మకం కనుక ప్రపంచ చరిత్ర ఒక వివేచనాత్మక ప్రక్రియ అని చెప్పాడు. 'హేతువాదం' అనే మాటలో అతని చరిత్రతత్వాన్ని సంక్షిప్తీకరించవచ్చు. హెగెల్ జాతికి ప్రాధాన్యాన్నిస్తూ చరిత్రను గతితార్కిక పద్ధతిద్వారా వ్యాఖ్యానించాలన్నాడు ప్రతి విషయంలో హేతువు గమ్యాన్ని చేరినప్పుడు దానిలో గోచరించేవి (యథార్థాలు), అగోచరమైనవి కూడా వుంటాయి. ఏ విషయాన్నైనా అర్థం చేసుకోవాలంటే యీ రెండింటిని - అంటే యదార్థమైనది, దానికి వ్యతిరేకమైనది - అవగాహన చేసుకోవాలి. ఈ రెండింటినీ సమన్వయపరిస్తే వాస్తవికత నిర్ధారించబడుతుంది. దీనిని యింకో రకంగా చెప్పొచ్చు. వాదప్రతివాదాల మధ్య సంఘర్షణ ఫలితంగా సమన్వయం రూపుదిద్దుకుంటుంది. ఈ సమన్వయం రెండింటిలోని నుంచి గ్రహించి పొందుపరుస్తుంది. ఇది మళ్ళీ క్రొత్త వాద, ప్రతివాదాలకు దారి తీస్తుంది. భావానికి పరిపూర్ణత వచ్చేదాకా యిలా మార్పులు వస్తాయని హెగెల్ వివరించాడు. ఈ వాద ప్రతివాదాల సంఘర్షణ, సమన్వయం, మళ్ళీ క్రొత్త వాద ప్రతివాదాలకు దారితీయటం - ఈ ప్రక్రియనంతటినీ గతి తార్కిక పద్ధతి అని అతడు విశ్లేషించాడు. సత్యాన్ని అర్థం చేసుకోవటానికి ముఖ్యమైన అసంగతాలను గతితార్కిక చర్చ ద్వారా విశ్లేషిస్తే పురోగమనం సాధ్యమని అతని వాదన. హెగెల్ తత్వవిచారం, గతితార్కిక పద్ధతి మార్క్స్‌పై బాగా ప్రభావం కనబరచాయి. పర్యవసానంగా సామ్యవాద చరిత్రలో నూతన దృక్పథం ఏర్పడింది.

## 4.4.3 మార్క్స్ వాదం :

పైన పేర్కొన్న ప్రత్యక్ష జ్ఞానవాదం, భావవాదాల నుండి ఆవిర్భవించినది మార్క్స్‌వాదం. జర్మను యూదు కార్ల్‌మార్క్స్ **(1818-1883)**, అతని సన్నిహిత జీవిత కాల స్నేహితుడు ఎంగెల్స్‌లు హెగెల్ భావవాదాన్ని వ్యతిరేకించినా అతడు ఉపయోగించిన

గతి తార్కిక పద్ధతికి విప్లవాత్మక అర్థాన్నిచ్చి, మానవ సమాజ పరిణామంలోని వివిధ దశలను కార్యకారణ సంబంధం ద్వారా విశ్లేషించి గతితార్కిక చారిత్రక భౌతిక వాదానికి (Dialectical Historical Materalism) పునాది వేసారు. దీనినే మార్క్సువాదం (Marxism) గా ప్రపంచం గుర్తించింది. చరిత్రలో వచ్చిన మార్పులన్నీ భౌతిక పరిస్థితుల ప్రభావం వల్లనే అనేది వారి అభిప్రాయం వారు ప్రతిపాదించిన ఆర్థిక నియతి సూత్రం ప్రకారం చరిత్ర మొత్తం వర్గపోరాటమే. ఉత్పత్తి సాధనాలను అధీనంలో ఉంచుకునే పాలక వర్గం (దోపిడి వర్గం), పాలితవర్గాల మధ్య సంఘర్షణ అనివార్యమనీ, యీ సంఘర్షణలో దోపిడీ వర్గం అంతరించి దోపిడీలేని సమసమాజం ఏర్పడుతుందని వారి ప్రగాఢ విశ్వాసం. మార్క్సు సిద్ధాంతంలోని పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి, శ్రామిక నియంతృత్వం గురించి ('State and Revolution) అనే తన గ్రంథంలో కూలంకషంగా చర్చించిన లెనిన్ శ్రామిక నియంతృత్వం ద్వారానే సామ్యవాద సమాజం సాధించడం వీలవుతుందనీ, చివరికి కమ్యూనిస్ట్ వ్యవస్థ పూర్తిగా స్థాపించాక రాజ్యం అవసరమే ఉండదని భావించాడు.

చరిత్ర గతి కేవలం ఆర్థిక పరిస్థితులపైనే ఆధారపడినట్లు మార్క్సు చెప్పినట్లు భావించిన కొందరు అది అసమంజసమనీ మానవ పురోగతికి కేవలం ఆర్థిక స్థితిగతులే కాక అనేక యితర కారణాలూ వుంటాయనే విషయాన్ని అతడు పూర్తిగా నిర్లక్ష్యం చేసాడని విమర్శించారు. అతని వర్గరహిత సమాజ ప్రతిపాదన కేవలం అతని ఊహా ప్రపంచమనీ, అటువంటి సమాజం యింతవరకూ ఎక్కడా ఏర్పడలేదు. యిక ముందూ అవకాశం లేదని మరికొందరు పేర్కొన్నారు. ఏది ఏమైనా చరిత్రలో మార్క్సు వాదం గొప్ప సంచలనం తెచ్చింది. సామ్యవాద సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా ప్రతిపాదించి, 'ప్రపంచ కార్మికులారా!' ఏకం కండి' అనే నినాదం ప్రబోధించి కోట్లాది ప్రజలకు మార్క్సు మాహా ప్రవక్త అయినాడు.

### 4.4.4 చారిత్రకతావాదం :

ప్రత్యక్ష జ్ఞానవాదానికి, జర్మను భావవాదానికి భిన్నమైన మూడవరకం పరికల్పక చరిత్రతత్వం చారిత్రకతావాదం. 'వికాసం, అవిచ్ఛిన్నత ప్రధాన లక్షణాలుగా గల చారిత్రక ప్రక్రియే' చారిత్రకత అని బారక్లో 'History in a changing world' అనే గ్రంథంలో చెప్పాడు. కాని యీ వికాసం, అవిచ్ఛిన్నతలు పూర్తిగా నిజంకావు. చరిత్రలో కొంత ప్రాగుక్తీకరణ (జరగబోయేది ముందుగా ఊహించడం) సాధ్యమేననే విషయాన్ని వివరించేదే 'చారిత్రకత' అని కార్ల్ పోపర్ అభిప్రాయం. ఇటలీకి చెందిన చరిత్ర తత్వవేత్త క్రొచె 'Philosophy of the Spirit' అనే తన గ్రంథంలో చారిత్రకతపై తన అభిప్రాయాలను వెలిబుచ్చాడు. ఏదైనా విషయానికి సంబంధించిన స్వభావం గురించి తగినంత అవగాహన, దాని విలువ గురించి తగినంత నిర్ధారణలను వికాస ప్రక్రియలో ఆ విషయం ఆక్రమించిన స్థానం, నిర్వహించిన పాత్రల దృష్ట్యా ఆలోచించటం ద్వారా సాధించవచ్చుననే నమ్మకమే చారిత్రకత. అంటే ఆర్థిక లేదా సామాజిక లేదా సాంస్కృతిక దృగ్విజయం లన్నింటినీ చారిత్రక పరిజ్ఞానం తగినతంగా ఉపయోగించటమే చారిత్రకత. చరిత్ర ఒక అర్థవంతమైన, వివేచనాత్మకమైన ఒక ప్రక్రియ అని చారిత్రకతావాదులు నమ్మారు. వీరు చరిత్రలో ఏక రేఖీయ నిర్ధేశాన్ని (unilinear direction) వ్యతిరేకించారు. డ్రోయిజన్, డిల్తీ, ట్రోయెల్ష్, మైనెక్ వంటి చరిత్రకారులు, సామాజిక సైద్ధాంతికులు చారిత్రకతావాదాన్ని ప్రచారం చేసారు.

### 4.4.5 చక్రీయ సిద్ధాంతం :

చరిత్రతత్వంలో పేర్కొనదగిన మరొక భావన చక్రీయ సిద్ధాంతం. కొందరు చరిత్రకారులు, తత్వవేత్తలు చరిత్ర పునరావృతమౌతుంది' అని ప్రతిపాదించారు. మరికొందరు కాదన్నారు. ఈ రెండు భావాలు కొంతవరకు నిజమే కావచ్చు. మానవ సమాజానికి సంబంధించిన ప్రాపంచిక విషయాలు అన్ని కాలాల్లోను ఒకేలా వుంటాయి. కాని ప్రతిసారి మార్గాలే వేరు అనే భావనలో చరిత్ర పునరావృతమౌతుంది. చారిత్రక సంఘటనల తీరు చరిత్ర పునరావృతమౌతుందనే భావాన్ని కలిగిస్తుంది.

చారిత్రక సంఘటనలు ఒకేరీతిగా, ఒకేచోట జరగకపోయినా సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే ఆ సంఘటనల వెనుక ఒక ఏకత్వం, ఒక నమూనా కన్పింస్తుందనే భావన యీ ఆలోచనకు దారితీసింది. ప్రతి సంవత్సరం ఋతువులు పునావృతమైనట్లే చరిత్రలో వచ్చే మార్పులు రూపాలు, ప్రక్రియల పునరావృతమని ప్రాచీనులు భావించారు. గ్రీకు, రోమను, హిందూ సంప్రదాయాలు చారిత్ర ఆవృత్తులను (Historical Cycles) తెలిపాయి.

చరిత్ర చక్రీయమని, సంఘటనలు పునరుక్తాలని అవే పర్యావసానాలు సంభవమని చరిత్ర పునరావృత మౌతుందనే అభిప్రాయం వ్యక్తం చేసిన బహుశ మొదట చరిత్రకారుడు ధూపిడైడస్. అయితే మధ్యయుగములో క్రైస్తవం ప్రభావంలో మరుగునపడిన యీ భావన మళ్ళీ సాంస్కృతిక పునరుజ్జీవనం అనంతరం తిరగదోడారు. నాగరికతల, సామ్రాజ్యాల పుట్టుక, పెరుగుదల, ఉచ్ఛస్థితి, పతనాల సాదృశ్యాలను (Similarities) తీసుకొని చరిత్ర పునరావృతమౌతుందన్నారు. మొత్తం విశ్వాసమే సృష్టి, స్థితి, లయల వలయాన్ని తిరిగి చుడుతూ వుంటుందనే రోమను కవి వర్జిల్ భావాన్ని నమ్మిన ఇటలీ తత్త్వవేత్త వికో, జర్మను తత్త్వవేత్త నీచె, ఫ్రెంచి రచయిత బాసువా, జర్మనీకే చెందిన హెర్డర్లు యీ సిద్ధాంతాన్ని విశ్వసించారు. 20వ శతాబ్దంలో జర్మన్ స్పెన్గర్, ఆంగ్లేయుడు టాయన్బీలు సాంస్కృతిక, నాగరికతా వ్యవస్థల నధ్యయనం చేసి చరిత్ర చక్రీయమని తేల్చారు. కలియుగం అంతమైతే తిరిగి కృతయుగం ప్రారంభమౌతుందనే హిందువుల విశ్వాసం మనకు తెలిసినదే కదా !

ఇటువంటి తులనాత్మక అధ్యయనాలు భూత భవిష్యద్ఘటనలను లోతుగా పరిశీలించటానికి తోడ్పడతాయి. కాని నాగరికతా చక్రమనే క్రమంతో చరిత్ర పునరావృతమౌతుందని చెప్పటానికి చరిత్రలో సాక్ష్యాలు లభించవు. ప్రతి సంఘటనా దేనికదే ప్రత్యేకమైనది. కాని పూర్వాపరాలతో కార్యాచరణ సంబంధ రీత్యా సంఘటనలు ఒకదానితో మరొకటి ముడిపడి వుంటాయి. మార్క్స్ చెప్పినట్లు "ఎంతో పోలిక వున్నా వేరు వేరు చారిత్రక పరిస్థితుల్లో జరిగిన సంఘటనలు వేర్వేరు ఫలితాలకు దారితీస్తాయి. ఈ పరిణామాలను వేరువేరుగా పరిశీలించి, అనంతరం వాటిని ఒక దానితో మరొకదాన్ని పోల్చి చూడటంవల్ల ఆ పరిణామాలకు కీలక ఏమిటో చాలా సులభంగా తెలుసుకోవచ్చు. కాని చరిత్రకు అతీతమైన ఏదో తాత్త్విక సిద్ధాంతాన్ని పరిష్కార మార్గంగా భావించి ఉపయోగిస్తే యీ అవగాహనకు రావటం యెప్పుడూ సాధ్యం కాదు" మనకు చరిత్రలో సాదృశ్య (Similar) సంఘనటలు ఎదురవ్వవు. పునరావృతం అనే మాటను కేవలం ఏకరూప (Identical) సంఘటనలు జరిగితేనే ఉపయోగించాలి. ప్రాచీన గ్రీకు తత్త్వవేత్త హెరాక్లిటస్ చెప్పినట్లు "ఒకే ప్రవాహంలో రెండుసార్లు మునగలేము" కారణం పాతనీటిని తరిమేస్తే కొత్త నీరు ఎల్లప్పుడూ ప్రవహిస్తూనే వుంటుంది" చారిత్రక సంఘటనల విషయమూ అంతే. సాదృశ్యాల ప్రాతిపదికగా సంఘటనలు పునరావృతమౌతున్నట్లు కన్పించినా నిజానికది 'చక్రీయ గమనం కాదు . . . సర్పిలగమనం' (Not cyclical movement but spiral movement) అని కాలిన్గ్వుడ్ చెప్పినది వాస్తవం. కార్ కూడా "చారిత్రక పరిజ్ఞానం వున్న ప్రజల్లో చరిత్ర పునరావృతం కావటం చాలా దుర్లభం, కారణం గతంలో ఒక చారిత్రక సంఘటన ఎలా ముగిసిందో తరువాత తరాల వారికి తెలిసినప్పుడు వారి ప్రవర్తన ఆ పరిజ్ఞానం వల్ల ప్రభావితం అవుతుంది" అని స్పష్టీకరించాడు. నిజానికి చరిత్ర పునరావృత మౌతుందని భావిస్తే, యింక 'ప్రగతి' అనే ఆలోచనకు గాని, మానవుల సృజనాత్మక క్రియాశక్తులకు గాని చరిత్రలో చోటులేనట్లే.

### 4.4.6 ఆస్తికవాదం :

చరిత్రతత్వంలో మరో దృక్పథం ఆస్తికవాదం లేదా దైవవాదం. చరిత్రలో రీతిని నమ్మే కొందరు ఆ రీతి దైవసంకల్పం అన్నారు. చరిత్రగతిని నిర్దేశించేది ఆ దైవమేనని వారి వాదన. యూదులకు చరిత్ర మతంలో ఒకభాగం. "పాత నిబంధన" రచయితలు చరిత్రగతి దైవసంకల్పాన్ని, ఆయన ప్రణాళికను బహిర్గతం చేస్తుందని నమ్మారు. ఈ దృష్టితో చరిత్రపై వెలువడిన అనేక తాత్త్విక వ్యాఖ్యానాలతో తరువాత తరాలపై ఎక్కువ ప్రభావాన్ని చూపిన వ్యాఖ్యానం సెయింట్ ఆగస్టీన్‌ది. అతడు తన

"The City of God" అనే గ్రంథంలో చరిత్రాధారాలు ఉపయోగించుకొని పేగన్లల విమర్శలు ఖండిస్తూ క్రైస్తవాన్ని సమర్థించుకున్నాడు. ప్రతి విషయంలోనూ దైవ సంకల్పానికే ప్రాబల్యం వుందని వాదించాడు. మంచీ చెడుల సంఘర్షణే మానవ చరిత్ర అనీ, దుష్టశక్తులకు ప్రాతినిధ్యం వహించే అశాశ్వత ఐహిక సామ్రాజ్యాల స్థానంలో శాశ్వత 'భగవన్నగరం' (ఈ లోకంలో క్రైస్తవాలయం) స్థాపించాలని అతడు చెప్పాడు. ఈ భావాలు మధ్యయుగంలోను, మత సంస్కరణోద్యమ కాలంలోను బాగా ప్రభావం చూపించాయి. ఆధునిక యుగంలో నైబూర్, బటర్‌ఫీల్డ్ వంటి చరిత్రకారులూ చరిత్రలో భగవంతుని అదృశ్యహస్తం కనుక్కోవాలన్నారు. అయితే కార్యకారణ సంబంధంతో శాస్త్రీయంగా అధ్యయనం చేయవలసిన చరిత్రను మత దృక్పథంతో మరీ సాగదీస్తే అసలు చరిత్ర నర్థం చేసుకోవటమే అసాధ్యం అవుతుంది.

### 4.4.7 ప్రగతివాదం :

చరిత్రతత్వంలో మరోదృక్పథం ప్రగతివాదం. డార్విన్ 'పరిణామ' భావం చరిత్రలో 'ప్రగతి' భావానికి దారితీసింది. అయితే పరిణామ వాదానికి ఆధారమైన జీవశాస్త్ర వారసత్వం చారిత్రక ప్రగతికి ఆధారమైన సామాజిక సంపాదన ఒకటి కావు. ఉదాహరణ చెప్పాలంటే ఐరోపాలో పుట్టిన శిశువుని చైనీయుల కుటుంబంలో పెంచితే, ఆ శిశువు జీవిక వారసత్వమైన తెల్ల చర్మంతోనే వుంటుంది కాని, మాట్లాడేభాష చుట్టూ వున్న సమాజం అలవరచిన చైనాభాష. పరిణామ వారసత్వాన్ని మిలియన్ల సంవత్సరాలలో కొలిస్తే సామాజిక అభివృద్ధిని తరాల పరిమాణంలో కొలుస్తాం. కార్ చెప్పినట్లు తాను సముపార్జించిన కౌశల్యాన్ని, నేర్పరితనాన్ని ఒక తరం తన ముందు తరానికి అందించటం వల్ల వచ్చే ప్రగతే చరిత్ర. అంటే చరిత్ర ప్రగతికి సంబంధించిన రికార్డ్. ప్రగతికి మొదలు, తుది లేదు. అలా వున్నాయని చరిత్రకారుడూ నమ్మడు. యుగం తరువాత యుగం తమ అవసరాలకు, పరిస్థితులకు కావలసిన ప్రత్యేక వస్తువు (Content) చరిత్రకు కలుస్తూ వుంటుందని, ప్రగతివాదాన్ని నమ్మే చరిత్రకారుడు అంగీకరించాలి. కనుకనే ఆక్టన్ చరిత్రను ప్రగతి శాస్త్రమని వర్ణించాడు. చరిత్ర ప్రగతిశీలమైనది అంటే అది అవిచ్ఛిన్నంగా ముందుకు సాగుతుందని భావింపనక్కరలేదు. చరిత్ర గమ్యం ఏమిటో, ఏది ప్రగతో, దేనిపై యీ ప్రగతి ఆధారపడి వుందో చరిత్రకారుడు నిర్ణయిస్తాడు. అతడే సంఘటనల్లో పాల్గొన్న వ్యక్తుల చేతలకు ప్రగతి సిద్ధాంతాన్ని అన్వయించి వ్యాఖ్యానిస్తాడు. భవిష్యత్తులో ప్రగతిపై నమ్మకం అందరికీ వుండాలి, ఇదే మనిషిని ముందుకు నడిపిస్తుంది. నాటి నుండి నేటి వరకు యీ ఆశావాదమే ఊపిరి.

### 4.4.8 యాదృచ్ఛికతావాదం :

క్లియోపాత్ర నాసిక మరికాస్త పొడవుగా వుండి వుంటే ప్రపంచ చరిత్ర స్వభావమే మారి వుండేది అని ప్రసిద్ధ ఫ్రెంచి రచయిత పాస్కల్ వ్యాఖ్యానిస్తే ఈ ప్రాతిపదికపై చరిత్రతత్వానికి సంబంధించి మరో ధృక్పథం 'యాదృచ్ఛికతావాదం' (Accidentalism) రంగంలోకి వచ్చింది. దీని ప్రకారం చరిత్ర ముందుగా ఊహించలేని యాదృచ్ఛికాల ప్రకరణం, సంఘటనలు కాకతాళీయంగా జరిగినటువంటివి. వీటికి యిదిమిత్తమైన కారణాలంటూ వుండవు. ఎక్కువ క్రమరహితమైన కారణాలకు సంఘటనలను ఆపాదించటం జరుగుతుంది. అనుకోని సంఘటనలకు ప్రాముఖ్యాన్ని కల్పించటమే యీ వాదంలోని సారాంశం.

క్రీ.పూ. 2వ శతాబ్దంలో ఏలీబియస్‌తో ఆరంభమైన యీ వాదానికి రోమన్ చరిత్రకారుడు టాసిటస్ కూడా మద్దతునిచ్చాడు. 20వ శతాబ్దం మొదట్లో వున్న అస్థిర పరిస్థితులకు బ్రిటిషు చరిత్రకారులు యాదృచ్ఛిక వాదులయ్యారు. 'క్లియోపాత్ర నాసిక' అనే శీర్షికతో జె.బి. బ్యూరీ ఏకంగా 1916 లో ఒక ప్రత్యేక వ్యాసాన్నే వెలవరించాడు. ఫిషర్ కూడా యీ వాదాన్ని సమర్థించాడు. ఫ్రాన్స్‌లోను, జర్మనీలోను మరికొందరు మద్దతునిచ్చారు. కాని యాదృచ్ఛిక సంఘటనల అధ్యయనంలో పనికిరాని చిన్న విషయాలకు ప్రాధాన్యత ఎక్కువై ముఖ్యమైన విషయాలు మరుగునపడే ప్రమాదం వుంది. 'లెనిన్ అకాలంగా మరణించకుంటే

రష్యా చరిత్ర మరో తీరులో వుండేది' 'లాల్‌బహదూర్‌శాస్త్రి అకాలంగా మరణించకపోతే కాంగ్రెస్‌లో చీలిక వచ్చేదికాదు' వంటి ప్రతిపాదనలు చరిత్ర తీరుతెన్నుల్ని పరిణామాలను, విశదం చేయలేవు. తర్కబద్ధమైన వివరణకు, వ్యాఖ్యానానికి లొంగని యాదృచ్ఛికత వల్ల గతానికి గాని, వర్తమానానికిగాని ఎటువంటి ఉపయోగం లేదు. ఎందుకంటే యాదృచ్ఛికతల నుండి సామాన్య సూత్రాలను సాధారణీకరణం ద్వారా రూపొందించటం, వాటి నుండి పాఠాలను నేర్చుకోవటం వీలుకాదు. చరిత్రగతిని మార్చినట్లుగా చెప్పబడుతున్న యాదృచ్ఛిక సంఘటనలకు చరిత్రకారుని తర్కబద్ధమైన వ్యాఖ్యానంలో చోటేలేదు. చరిత్రలో కార్యకారణ సంబంధం విలువకు సంబంధించిన తీర్పులతో ముడిపడి వుంది. కార్యాకరణ సంబంధం కోసం అన్వేషణ అంటే విలువ కోసం అన్వేషణ. మరి యీ ప్రయోజనాన్ని నెరవేర్చని యాదృచ్ఛికతావాదం నిష్ఫలం.

### 4.4.9 నియతివాదం :

'జరిగే ప్రతి సంఘనటకూ ఆ విధంగా జరగటానికి కారణాలుంటాయనీ, అది మరోవిధంగా జరిగిందంటే కారణాలు వేరే ఉంటాయ'నే నమ్మకం నియతివాదం. చారిత్రక ప్రక్రియ ముందుగానే నిర్ణయించబడిందని యీ నియతివాదం ప్రతిపాదన. ప్రపంచంలో జరిగే ప్రతి సంఘటనా ఏదో ఒక నియమానుసారం జరుగుతుందనేది నియతివాదుల నమ్మకం. మానవ చరిత్రలో కన్పించే యదార్థాలు కార్యాకారణ నియతిని అనుసరించే జరుగుతాయని వీరు చెప్తారు. చరిత్ర గతి ముందుగానే నిర్దేశింపబడింది. కనుక మనిషి స్వేచ్ఛా సంకల్పానికి అవకాశం లేదనీ, వ్యక్తి స్వతంత్రుడు కాడని, అతని సంకల్పానికి ఏదో బయటిశక్తి కారణమని వీరి భావన.

క్రీ.పూ. 4వ శతాబ్దం నుండే యీ వాదం కన్పిస్తున్నా 19వ శతాబ్దంలో స్కాటిష్ తత్త్వవేత్త హామిల్టన్ 'నియతివాదం' అనే పదాన్ని మొదట ఉపయోగించాడు. ప్లేటో, హెగెల్, కార్ల్‌మార్క్స్, టాయన్బీల వాదాలు నియతివాద తత్వాల క్రిందికే వస్తాయి. వ్యక్తేతర శక్తుల కార్యవర్తనం వల్ల ఉత్పన్నమైనదే యీ పండితుల దృష్టిలో చరిత్ర అవుతుంది. నియతివాదాన్ని సవాలు చేస్తూ జర్మను మేధావి కార్ల్‌పోపర్, బ్రిటిష్ చరిత్రకారుడు ఇసయా బెర్లిన్, వారి శిష్యులు కారణాల ఆధారంగా సంఘటనలను వ్యాఖ్యానించటం అంటే మనిషి స్వయం నిర్ణయశక్తిని కాదనటమేననీ, చరిత్రలో యాదృచ్ఛికతకు అసలు స్థానమే లేదనటమేనని విమర్శించారు. నియతివాదాన్నీ పూర్తిగా కొట్టివేయలేం. అలాగని వ్యక్తి స్వేచ్ఛా సంకల్పాన్నీ కాదనలేం. సామాన్యమానవునిలా చరిత్రకారుడూ మనిషి ప్రవర్తనకు కారణాలుంటాయని, వాటిని తెలుసుకోగలమని నమ్ముతాడు. అలాగే మనిషి స్వేచ్ఛా సంకల్పాన్నీ కొట్టివేయడు. అలాగని మనిషి ప్రవర్తనలో ఏదీ అసాధ్యం కాదని ఊరుకనే వుండిపోడు. మనిషి స్వేచ్ఛా సంకల్పానికీ పరిమితులుంటాయి. చరిత్రలో దేనినీ అనివార్యమని తప్పించుకోలేనిదనీ చెప్పలేం. ఏ వాదం అయినా ఒక క్రొత్తకోణం నుండి చరిత్రను వీక్షించి ఊహాత్మక అవగాహనను పెంపొందించుకునే ప్రక్రియగా భావించవచ్చు.

## 4.5 సంక్షిప్తంగా . . .

చారిత్రక చింతనల, పరిజ్ఞానాల ప్రత్యేక స్వభావాన్ని స్పష్టంగా వివరించే ఒక సముచిత ప్రయత్నమే చరిత్రతత్వం. శ్రేష్ఠమైన జీవన గమ్యం ఏమిటనే విషయంలో చరిత్రకారులకు భిన్నాభిప్రాలుండటంతో చరిత్రతత్వమూ సంకీర్ణంగా మారింది. ఇందులో రెండు విభాగాలున్నాయి. 19వ శతాబ్దం నుండి వృద్ధి చెందిన విమర్శనాత్మక లేదా శాస్త్రీయ చరిత్రతత్వం మొదటిది. ఇది చరిత్రకారులు చేసే తార్కిక జ్ఞానమీమాసంకు సంబంధించిన లక్షణం చిత్రీకరించటాన్ని పరిశీలిస్తుంది. పరికల్ప లేదా భావనత్మాక చరిత్రత్వం రెండవది. ఇది చారిత్రక సంఘటనల తీరుతెన్నుల్ని, వాటి అంతరార్థాన్ని, ప్రాముఖ్యాన్ని గ్రహించటానికి ప్రయత్నిస్తుంది. ఇందులో మళ్ళీ వేరు వేరు దృక్పథాలు వున్నాయి. ప్రాచీన భారతీయులకు వారిదైన ప్రత్యేక చరిత్రతత్వం వుంది. ఆధనిక యుగంలో బేకన్, వీకోలు చరిత్రతత్వానికి రూపమిచ్చి, బలంగా పునాదులు వేసారు. 18వ శతాబ్దంలో

జ్ఞానవికాస ధృక్పథంలో చరిత్రను ప్రగతివైపుకి సాగే రేఖీయ గమనంగా తీసుకున్నారు. ప్రగతిశీల ప్రత్యక్షరూపమని మరికొందరు వర్ణించారు. ప్రత్యక్ష జ్ఞానవాదం, భావవాదం, మార్క్సువాదం, చారిత్రకతావాదం, ఆస్తికవాదం, ప్రగతివాదం, యాదృచ్ఛికతావాదం, నియతివాదం వంటి చరిత్ర తాత్విక చింతనా ధోరణుల్లో వచ్చిన పరిణామాలు చరిత్ర రచనావృద్ధిని సంపన్నం చేసాయనే చెప్పాలి.

## 4.6 మాదిరి ప్రశ్నలు :

**ఎ) క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలివ్వండి.**

1. చరిత్రతత్వమును వివరించండి.
2. పరికల్పక చరిత్రతత్వ ధోరణులను సమీక్షించండి.

**బి) క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను వ్రాయండి.**

1. విమర్శనాత్మక చరిత్రతత్వాన్ని వివరించండి.
2. చారిత్రక గతితర్కాన్ని వివరించండి.
3. ప్రగతివాదాన్ని విశ్లేషించండి.
4. యాదృచ్ఛిక వాదానికి ప్రాధాన్యత ఉందా ?

## 4.7 ఉపయుక్త గ్రంథాలు :


| | | |
|---|---|---|
| Aron, Rayemond | : | Introduction to Philosophy of History (Tr. G.J. Irwin) (Weidon feld Necolson, London) |
| Barraeloegh, G. | : | Main Trends in History (New York, 1979) |
| Danto, Arther, C. | : | Analytical Philosophy of History (Cambridge, 1965) |
| Dray, Willan | : | Philosophy of History (Prentice Hall, 1964) |
| Durga Prasad, J. | : | Charitra Rachana Sastran (Tel.) (Telugu Akademi, Hyderabad, 1987) |
| Gardiner, Patrick (ed) | : | The Philosophy of History (O.U.P. 1974) |
| Gooch, G.P. | : | History and Historians in the Nineenth Century (Loggmans Green &Co., London) |
| Hale, J.R. | : | Evoluation of British 1955 graphy from Bacon to Namier (Mac MIllan, London, 1967) |
| manuel, Frank E., | : | Shapes of Philosophical History (Allen & Unwin, 1964) |
| Shaik Ali, B. | : | History : Its theory and Method (Mac Millan, 1978) |
| Walsh, W.H. | : | Introduction to Philosophy of History (Helchinson, Lon don 1951) |


**రచయిత : జి. దుర్గాప్రసాద్**

పాఠం - 5

# హీరిస్టిక్స్ - విమర్శనం - సంశ్లేషణం - వివరణం

**విషయక్రమం :**


**5.0** లక్ష్యం

**5.1** పరిచయం

**5.2** 'చారిత్రక పద్ధతి' అంటే ఏమిటి ?

**5.3** హీరిస్టిక్స్

**5.4** విమర్శనం

**5.4.1** బాహ్య విమర్శనం

**5.4.2** అంతర్విమర్శనం

**5.4.2.1** అనుకూల వ్యాఖ్యానాత్మక విమర్శనం

**5.4.2.2** వ్యతిరేక వ్యాఖ్యానాత్మక విమర్శనం

**5.5** సంశ్లేషణం

**5.6** వివరణం

**5.7** ముగింపు

**5.8** సంక్షిప్తంగా

**5.9** పరీక్ష నమూనా ప్రశ్నలు

**5.10** ఉపయుక్త గ్రంథాలు


## 5.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని చదవటం వల్ల మీరు

- చారిత్రక పద్ధతి అంటే ఏమిటో, దాని అభివృద్ధి ఏవిధంగా వచ్చిందో తెలుసుకోగలుగుతారు.
- చరిత్ర రచనా విధానంలో వున్న వివిధ దశలను విపులంగా అర్థం చేసుకోగలుగుతారు.
- చరిత్రలో ఒక సిద్ధాంత వ్యాసాన్ని ఏవిధంగా సమర్పిస్తారో వివరించగలుగుతారు.

## 5.1 పరిచయం :

చరిత్ర మూల పదమైన 'ఇస్తోరియా' అంటే పరిశోధన అని తెలుసుకున్న విషయమే గదా ! పరిశోధన అంటే ఏదైనా ఒక అంశం గురించి మెలకువతో చేసే అన్వేషణ లేదా విచారణ. సాధారణంగా తమకు తెలిసిన జ్ఞానపరిధిని విస్తృతం చేసుకోవడానికి లేదా ఏదో ఒక విషయంపై సమగ్రమైన అవగాహన పెంచుకోవడానికి చేసే ప్రయత్నమది. స్వీయ ప్రతిభతో పరిశోధకుడు తనకు ముందు వాళ్ళుచేయని రీతిలో తనకు తానుగా ఆలోచిస్తూ కొత్త సమాచారం కనుక్కోవటం, ముందే తెలిసిన సమాచారానికి కొత్త వ్యాఖ్యానం చేయటం, సమాచారాన్ని సూత్రబద్ధం చేయటం ద్వారా విజ్ఞాన పరిధిని విస్తరిస్తాడు. గతాన్ని సమగ్రంగా జరిగింది

జరిగినట్లు పునర్నిర్మించటానికి, ఉన్న దురభిప్రాయాలను సరిదిద్దటానికి ఉన్న పరిజ్ఞానం దృష్ట్యా భావాలను విస్తరించటానికి, విశ్లేషించి సమన్వయపరచటానికి, సిద్ధాంతీకరించటానికి చరిత్ర పరిశోధన లోతుగా గతాన్ని పరిశీలిస్తుంది. విసుగు విరామం లేకుండా కష్టించి పనిచేసే మనస్తత్వం, వ్యక్తిగత నిజాయితీ, సునిశిత మేధస్సు, వివేచనాశక్తి, లోకజ్ఞానం, కుతూహలం, అన్వేషణాతత్వం, సత్యసంధత, సహనం, ఊహా, భావవ్యక్తీకరణ సామర్థ్యం - యివన్నీ సమృద్ధిగా వున్న పరిశోధకుడు నిర్దిష్టమైన నియమాలను అనుసరిస్తూ నాలుగు దశలలో సాగే చారిత్రక పద్ధతి ద్వారా తాను కనుగొన్న సత్యాన్ని పాఠకుల ముందు రసరమ్యంగా ఉంచటానికి ప్రయత్నిస్తాడు.

## 5.2 చారిత్రక పద్ధతి అంటే ఏమిటి ?

సమాచారాన్ని సేకరించటం, సేకరించిన సమాచారాన్ని విమర్శనాత్మంగా విలువకట్టి చక్కటి సమన్వయంతో దానిని అందంగా పాఠకులకు అందించటం చరిత్ర పరిశోధనలో, రచనలో ప్రధాన దశలు. చారిత్రక సత్యాన్వేషణలో, సమర్పణలో అనుసరించబడే యీ ప్రక్రియను 'చారిత్రక పద్ధతి'గా అభివర్ణించవచ్చు. గతంలో జరిగిన సంఘటనలను వాటి సరైన అవలోకనంలో వివరించటానికి అభివృద్ధి చేయబడిన ఒక ప్రయోగ విధానమే యీ ప్రక్రియ. హాకెట్ చెప్పినట్లు "కచ్చితంగా చెప్పాలంటే చారిత్రక పద్ధతి అంటే యే పద్ధతి ద్వారా అయితే యితరులు చేసిన పరిశీలనల, నివేదికల సత్యసంధతను పరీక్షించటానికి చరిత్రకారుడు ప్రయత్నిస్తాడో ఆ విధానమైన పరిశీలనలకు అనుబంధ ప్రక్రియ. శాస్త్రవేత్తలా అతడు తన వివరాలను పరిశీలించి ప్రాక్కల్పనలను (పరీక్షాత్మక నిర్ధారణలను) రూపొందిస్తాడు. అతడు తాజా సాక్ష్యం వెతకటం ద్వారానో లేదా ఉన్న సాక్ష్యాన్ని తిరిగి పరిశీలించటం ద్వారానో యీ ప్రాక్కల్పనలను పరీక్షిస్తాడు. లభించే మొత్తం సాక్ష్యం వెలుగులో ఆ ప్రాక్కల్పనలు అంగీకరింప తగినవికావని తోసిపుచ్చేవరకో లేదా లభించే సాక్ష్యానికి సరిపోయేలా వాటిని సరిదిద్దే వరకో అతడు యీ ప్రక్రియను కొనసాగించాలి. మరింత సూక్ష్మంగా గోషక్ చారిత్రక పద్ధతిని 'గతకాలపు రికార్డుల, అవశేషాల సూక్ష్మ పరిశీలన, విశ్లేషణల ప్రక్రియ' అని పేర్కొన్నాడు.

చారిత్రక యదార్థాల స్వభావ సంకీర్ణత, సంశ్లిష్టతల కారణంగా చరిత్ర రచన అంత సులభం కాదనేది స్పష్టమే. అటువంటి చరిత్రరచన ఎలా చేయాలో గ్రహించటానికి యీ చారిత్రక పద్ధతి ఒక సాధనంగా సాయపడుతుంది. గతంలో ఏం జరిగిందో, ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో వివరించేందుకు అవసరమైన వివేచన, ఊహ, నేర్పు, ముందు చూపు, తార్కికత, అంతర్దృష్టి పెంపొందించటానికి యీ పద్ధతి తోడ్పడుతుంది. ఏదైనా చరిత్ర అంశంపై పరిశోధనకు పూనుకొన్నప్పుడు ఏ పరిశోధకుడైనా అనుసరించాల్సిన నియమాలను యిది నిర్దేశిస్తుంది.

క్రీ.పూ. 5వ శతాబ్దపు గ్రీకు చరిత్రకారుడు దూసి డైడిస్ తన 'History of the Pelopponesian War' అనే గ్రంథంలో తన పరిశీలనకు యితర సాక్షుల కథనాలను జోడించినట్లు పేర్కొనటం ద్వారా చారిత్రక పద్ధతిని తొలిసారిగా సూచించాడు. గ్రంథాల వంటి ఆధారాల నుండి సంగ్రహించి రాసే పద్ధతిని పలీబియస్ అనుసరించాడు. రోమ్ చరిత్రను రాయటంలో లివీ పూర్వ చరిత్రకు సంబంధించిన సాంప్రదాయిక రికార్డులను ఒకటిగా కూర్చాడు. మధ్యయుగంలో మతాధిపతులు శోధనా తత్వం అణచివేయడంతో చారిత్రక పద్ధతికి ఆటంకం ఏర్పడింది. కాని ఆ తరువాత వివేచనాతత్వం శాస్త్రీయ చింతనకు దారితీసింది. 19వ శతాబ్దంలో జర్మను చరిత్రకారుడు రాంకె, అతని శిష్యులు చరిత్ర పరిశోధనకు చారిత్రక పద్ధతి నియమాలను అన్వయించారు. చారిత్రక పద్ధతి పై తొలిరచన డ్రోయిజన్ రాసిన 'Historik' అనంతరం ఎర్నెస్ట్ బెర్న్‌హీమ్, విల్‌హెల్మ్ జౌర్‌లు శాస్త్రీయ గ్రంథాలు రాసారు. ఇంకా లాన్ లాయిస్, సీనొబోస్‌లు, నెవిన్స్, హాకెట్, గస్టావ్‌సన్, గోషక్, రేనియర్ లాంటి వారు సంగ్రహంగాను, సులభతరంగాను వుండేలా చక్కటి రచనలు వెలువరించారు.

అసలు సిసలు మానవ నిర్మిత ప్రమాణంపై ప్రకృతి శాస్త్రాల ప్రయోగ విధానాన్ని ఉపయోగిస్తూ బెర్న్‌హీమ్ చారిత్రక పద్ధతిని నాలుగు దశల క్రింద వివరించాడు. గోషక్ కూడా చారిత్రక పద్ధతికి నాలుగు అత్యంత ఆవశ్యకమైన అంశాలు ఉన్నాయన్నాడు. వీటినే స్పష్టంగా, సంగ్రహంగా, సూటిగా చెప్పాలంటే చారిత్రక పద్ధతి నాలుగు దశలలో కొనసాగుతుందని చెప్పాలి. అవి : 1) హీరిస్టిక్స్ (Heuristics), 2) విమర్శనము (Criticism), 3) సంశ్లేషణము (Synthesis), 4) వివరణము (Exposition). ఈ నాలుగూ చరిత్ర పరిశోధనలో, రచనలో చరిత్రకారుని ప్రధాన విధులని చెప్పాలి. మొదటిది పరిశోధక విషయానికి సంబంధించి రకరకాల ఆధారాలను లేదా సాక్ష్యపత్రాలను అన్వేషించి, సమీకరించటం, రెండవది సేకరించిన సాక్ష్యపత్రాలను విమర్శనాత్మకంగా సూక్ష్మపరిశీలన చేసి యదార్థాలను రాబట్టటం. జల్లెడ పట్టిన చారిత్రక యదార్థాలను కార్యకారణ సంబంధంలో సమగ్ర సమరస రూపంగా సమన్వయీకరించటం మూడో దశ. ఇంక నాలుగవది నిర్ధారించిన యదార్థాల సమన్వయీకరణతో శోధించి సాధించిన చారిత్రక సత్యాన్ని తనదైన శైలితో భాషారూపంలో పాదవివరణల ప్రమాణంతో చదివింపజేసేలా గ్రంథస్థం చేయడం.

## 5.3 హీరిస్టిక్స్ :

హీరిస్టిక్స్ అనే ఆంగ్లపదం జర్మన్ భాషలోని 'Heuristik' నుండి వచ్చింది. దీని అర్థం 'కనుగొనడానికి తోడ్పడేది' లేదా 'పరిశోధనను ప్రేరేపించేది' అని రకరకాల చరిత్ర ఆధార సామగ్రిని శోధించి సమీకరించటం, భద్రపరచటం చరిత్రకారుని ప్రథమ కర్తవ్యం. దీనినే హీరిస్టిక్స్‌గా వ్యవహరిస్తున్నారు. చారిత్రక పద్ధతిలో మొదటి దశ యిది. గతకాలపు మానవాళి ఆలోచనలకు, కార్యకలాపాలకు ప్రతీకలుగా మిగిలిన యీ చరిత్ర ఆధారాలే గతానికి సాక్ష్యాలు. వీటి ఆధారంగానే గతాన్ని మనముందు నిలపాలని చరిత్రకారుడు ప్రయత్నిస్తున్నాడు. ఈ అవశేష దృశ్య చిహ్నాలతోనే అతడు ప్రత్యక్షంగా పనిచేస్తూ గతకాలపు సంఘటనలను గురించి ఆలోచిస్తాడు. వీటి ఆధారంతోనే క్రమబద్ధంగా తార్కికమైన చరిత్ర కథనాన్ని పునర్నిర్మిస్తున్నాడు. ఇలా నిర్మించే కథనం ప్రామాణికత లభిస్తున్న వివాదరహితమైన, నిర్దుష్టమైన మౌలిక, మాధ్యమిక ఆధారాలపై ఆధారపడి వుంది. చరిత్ర ఆధారాలు అనేక రూపాలలో లభిస్తున్నాయి. అవి శాసనాలు, నాణాలు, కట్టడాలు, శిల్పాలు, చిత్రలేఖనాలు, మృణ్మయ పాత్రల వంటి భౌతిక అవశేషాలు కావచ్చు లేదా లిఖిత పూర్వకమైన రికార్డులు కావచ్చు. వీటన్నిటినీ శోధించి సమీకరించటం, భద్రపరచటం చరిత్ర పరిశోధకుని ప్రథమ కర్తవ్యం. ఇది పూర్తికాకుండా అతడు పరిశోధనలో ముందుకు సాగటం సాధ్యం కాదు.

అయితే యీ చరిత్ర ఆధారాల శోధన, సమీకరణ, భద్రపరచటం వంటి కార్యకలాపాల్లో ఆయా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు పరిశోధకునికి చేయూతనందిస్తున్నాయి. ఉదాహరణకు ప్రాచీన భారత చరిత్రకు సంబంధించిన ఏదైనా విషయంపై పరిశోధన చేసే చరిత్రకారుడు భారత పురాతత్వ సర్వే, ఆయా రాష్ట్రాల పురాతత్వ శాఖల నివేదికలపై ఆధారపడవచ్చు. ఇక ఆధునిక భారత చరిత్రకు ముఖ్యమైన రికార్డులను సమీకరించి, భద్రపరచటంలో, వాటి జాబితాలను రూపొందించటంలో భారత 'జాతీయ ప్రాచీనపత్ర నిలయం' (National Archives) ఆయా రాష్ట్రాల సంస్థలు చక్కటి సేవలందిస్తున్నాయి. వీటితోబాటు ప్రత్యేకంగా ఆయా వ్యక్తుల, ఉద్యమాల, వ్యవస్థల పరిణామాల అధ్యయనానికి తోడ్పడే సంస్థలు న్యూఢిల్లీ లోని నెహ్రూ మ్యూజియం లైబ్రరీ, గాంధి స్మారక నిధి, లక్నోలో వున్న ఆచార్య నరేంద్రదేవ్ గ్రంథాలయం డెహ్రాడూన్‌లో ఎం.ఎన్.రాయ్ సేకరణలు, సిమ్లా లోని సంస్థ, మన రాష్ట్రంలోని వేటపాలెం, రాజమండ్రి గ్రంథాలయాలు మొదలైన వాటిని అనేకం ఉదహరించవచ్చు. కథాగేయాలు, జానపద వీర గాథలు, యక్షగానాలు, పదాలు, అధికార నివేదికలు, న్యాయస్థానాల తీర్పులు, జ్ఞాపకాలు, స్వీయ చరిత్రలు, డైరీలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, ఒడంబడికలు, దస్తావేజులు, వీలునామాలు, అనుజ్ఞాపత్రాలు, ధృవపత్రాలు, రేఖాపటాలు, చిత్రపటాలు, గ్రంథాలు, కరపత్రాలు, జాబితాలు, వర్ణ చిత్రాలు, హక్కుల పత్రాలు, గెజిటీర్లు, వార్తాపత్రికలు, సైనిక

దౌత్యసంబంధమైన రహస్య నివేదికలు, డిస్పాచ్‌లు, ప్రశ్నావళులు, పత్రికల సంపాదకీయాలు, ప్రజాభిప్రాయ ఎన్నికలు, సామెతలు, మౌఖిక సంప్రదాయాలు, ముఖాముఖీ ఇంటర్వ్యూలు వంటి అనేకరకాల సాక్ష్యపత్రాలను సమీకరించి నివేదికలు రూపొందించే ఆయా సంస్థల సేవలకు ఆధునిక భారతదేశ చరిత్రలో పరిశోధనలు చేసే చరిత్రకారులు ఎంతైనా ఋణపడివుంటారు.

చరిత్ర పరిశోధకుడు తనకు ప్రవేశం, ఆసక్తి ఉన్న విభాగంలో సరైన అవగాహనతో ఎంతో జాగ్రత్తగా తగిన పరిశోధన అంశాన్ని ఎంచుకున్నాక దానిపై అవసరమైన, పరిశోధించాల్సిన సామగ్రి పరిధిపై ఒక అవగాహన కలిగించే అనేక ఆధారాలపై ఒక గ్రంథసూచి (Bibliography) తయారు చేస్తాడు. ఇది ప్రాథమిక గ్రంథసూచి. తాత్కాలికమైనది. ఎందుకంటే పరిశోధనలో ముందుకు సాగే కొద్దీ యిందులో మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటాయి. గ్రంథసూచి తయారు చేసాక పరిశోధకుడు తన మొత్తం రచనను సూచించే తార్కికంగా ఒక తాత్కాలిక సంక్షిప్త స్థూల వివరణ (Synopsis or Outline) ను రూపొందిస్తాడు. ఇది మొత్తం పరిశోధక ప్రణాళికకు ఒక బ్లూప్రింట్. అనంతరం వీటి ప్రాతిపదికతో తన పరిశోధక విషయానికి అవసరమైన ఆధారాలన్నింటినీ సమీకరించి భద్రపరుస్తాడు.

## 5.4 విమర్శనము :

చారిత్రక పద్ధతి మొదటి దశలో సేకరించిన ఆధారాలు లేదా సాక్ష్యపత్రాలు అసలువో, నకిలీవో, వాటిని సాక్ష్యంగా నమ్మవచ్చో లేదో చరిత్రకారుడు పరిశీలించాలి. ఒక్కోపత్రాన్ని అనేక భాగాలు చేసి దాని ప్రామాణికతను పరీక్షించాలి. ఇదీ ఒక్కొక్క భావన ఒక్కొక్క భాగం ప్రతిబింబించే విధంగా సాక్ష్యపత్రాన్ని నూలుపోగులుగా విడదీసి పరీక్షించి పత్రం ప్రామాణికతను నిర్ణయించాలి. కనుకనే చరిత్ర పరిశోధనలోని యీ రెండవదశను విమర్శనము అనేకాకుండా 'విశ్లేషణాత్మక విమర్శనము' (Analytical Criticism) లేదా 'వ్యాఖ్యానాత్మక విమర్శనము' (Interpretative Criticism) గా కూడా పేర్కొనవచ్చు. ఎవరి అనుభవంలోనో ఎదురైన, ఎవరో చూసిన, ఎవరో విన్న, నివేదించిన సంఘటన గురించి రాసే చరిత్రకారుడు ఆ పూర్వీకులు అందించిన వివరాలను పరీక్షించటం, లభిస్తున్న సమాచారం సంపూర్ణ భాగాల వాస్తవికతనో లేదా వాటి సంభావ్యతనో చరిత్రకారుడు విమర్శనం ద్వారా నిర్ణయిస్తాడు. విమర్శనం కొత్తగా ఏ విషయాలనూ చెప్పదు. ఒక్కొక్క విషయ సాధ్యాసాధ్యాలను నిర్ధారిస్తుంది. సాక్ష్యపత్రంలో తప్పులేమి దొర్లాయో మరో పత్రం సహాయంతో తెలుపుతుంది. చరిత్ర ఆధారాలలో దొర్లిన తప్పులన్నింటినీ వేలెత్తి చూపించి వాటిని ప్రక్కకు తప్పించటయే విమర్శనం పని. చరిత్ర పరిశోధన అనుమానంతో ప్రారంభమయి స్పష్టతకు దారితీయాలి. ఒక డాక్టరు ఏ విధంగా అయితే రోగి శరీరంలోని అసాధారణతను తొలగించి ఆ రోగికి స్వస్థత చేకూరుస్తాడో అదేవిధంగా చరిత్ర పరిశోధకుడూ సాక్ష్య పత్రాలలోని దోషాలను తొలగించి దేనిని ఎంతవరకు అంగీకరించవచ్చో విడివిడిగా విశ్లేషించి చరిత్రకు ముడిసరుకైన యదార్థాలను వెలికి తీస్తాడు. సరైన శాస్త్రీయ విమర్శనంపై ఆధారపడకుంటే యీ యదార్థాలకు విలువ ఉండదు. ఆ తరువాత దశల్లో చరిత్ర పరిశోధకుడు పడే శ్రమ మొత్తం బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

విమర్శన ప్రక్రియ మొత్తం బాహ్య విమర్శనం (External Criticism), అంతర్విమర్శనం (Internal Criticism) అని రెండు ఉపదశల్లో సాగుతుంది. ఇందులో ఆధారాల లేదా సాక్ష్యపత్రాల ప్రామాణికతను నిర్ణయించేది బాహ్యవిమర్శనం. వాటి విలువను నిర్ణయించేది అంతర్విమర్శనం.

### 5.4.1 బాహ్య విమర్శనం :

మౌలిక, మాధ్యమిక చరిత్ర ఆధారాల ప్రామాణికతా స్థాయిని నిర్ణయించేందుకు చరిత్రకారునికి బాహ్యవిమర్శనం సహాయపడుతుంది. ఒక సాక్ష్యపత్రం లేదా ఒక చరిత్రాధార భౌతిక అవశేషం అసలైనదో, నకిలీదో యిది పరీక్షిస్తుంది. ఈ

ప్రక్రియ ప్రధానంగా సాక్ష్యపత్రాల బాహ్యాంశాలకు సంబంధించినది. హాకెట్ దృష్టిలో "వ్రాతప్రతులు, గ్రంథాలు, కరపత్రాలు, మ్యాపులు, ప్రాచీన శాసనాలు, కట్టడాల వంటి ఆధారాలను వాటి మూలం గురించి, అవసరమైతే వాటిని మూలరూపంలో పునరుద్ధరించటానికి ఏమాత్రం ప్రాముఖ్యం వున్న సమాచారాన్నైనా సాధ్యమైనంత మొత్తంలో రాబట్టే దృష్టితో బాహ్య విమర్శనం ద్వారా చరిత్ర పరిశోధకుడు పరిశీలిస్తాడు."

చరిత్ర ఆధారాల ప్రామాణికతా స్థాయిని నిర్ణయించే బాహ్య విమర్శన ప్రక్రియ ప్రశ్నా పూర్వక విచారణతో ఆరంభమవుతుంది. తాను విన్న తాను నమ్ముతున్న, తనకు కావలసిన సాక్ష్యపత్రం అదేనా? కాదా? వంటి ప్రశ్నలు వేసుకుని చరిత్రకారుడు ఆ పత్ర ప్రామాణికత్వాన్ని నిర్ధారించేందుకు ప్రయత్నిస్తాడు. మామూలుగా అతడు సేకరించే ఆధారాలు అసంపూర్ణంగా, అసమగ్రంగా, తప్పొప్పులతో దోషభూయిష్ఠంగా వుంటాయి. సేకరించిన పత్రాలు అసలువో, నకిలీవో నిర్ధారించుకోవాలి. మన ప్రాచీన గ్రంథాలు అనేకం వాటి మూలప్రతులను కోల్పోయాయి. వాటికి తరతరాలుగా వేరే ప్రతులు రాయబడుతూ వచ్చాయి. ఈ ప్రక్రియలో అనేక రకాల మార్పులు, చేర్పులు చోటుచేసుకుంటాయి. కొన్ని సార్లు అసలు స్వరూపమే మారిపోవచ్చు. మన ఇతిహాసాలు, పురాణాలు తరతరాల అనేక అంతర్నివేశనాల (interpolations) తో, చేర్పులతో యీ రోజు మనకు లభిస్తున్నాయి. ఇటువంటివి కేవలం ప్రాచీన గ్రంథాలకు మాత్రమే కాక, శాసనాలకు, నాణేలకూ వర్తిస్తుంది (పశ్చిమ గాంగ వంశచరిత్రకు ముఖ్యమనుకున్న మెర్కరా తామ్రశాసనాలు నకిలీవని తేలింది కదా!. ప్రభుత్వ ఘోర వైఫల్యాలను చాటుతూ యీ రోజు దొంగనోట్లు, వీడియో పైరసీ . . ఒకటేమిటి? అన్నిటికీ నకిలీలు మార్కెట్‌ను ముంచెత్తటం తెలిసిందే. చరిత్ర రికార్డుల విషయంలో ఫోర్జరీలు మరింత సులువు. తప్పుడు హక్కులు చూపించటానికో, అపూర్వమైన అరుదైన ప్రాచీన పత్రాలకున్న గిరాకీని సొమ్ము చేసుకోవాలనే కోరిక, అభిజాత్యం, స్వాతిశయం, సానుభూతి, అనిష్టత, వ్యక్తిగత స్పర్థ, రాజకీయ విభేదాలు, సాంఘిక అసమానతలు, మత వైషమ్యాలు, తీవ్ర జాతీయాభిమానం వంటివి ఏవైనా చరిత్ర రికార్డుల యీ అక్రమ ఫోర్జరీలకు, దిద్దుబాట్లకు కారణాలు కావచ్చు. మెర్కరా శాసనాలతో బాటు మధ్యయుగపు ప్రఖ్యాత తైలవర్ణ చిత్రాలు, ఫ్రెంచ్ రాణి మేరీ ఆంటాయినెట్ లేఖలు, ముస్సోలినీ హిట్లర్‌ల డైరీలు వంటి అనేక ఉదాహరణలు యీ అక్రమ ఫోర్జరీలకు పేర్కొనవచ్చు.

చరిత్ర పరిశోధనలో నిమగ్నమైన చరిత్రకారుడు యిటువంటి దోషభూయిష్టమైన ఆధారాలతో ఎలా ముందుకు సాగుతాడు? మరి రికార్డుల్లో జరిగే యీ మార్పు చేర్పుల్ని, నకిలీ తయారీలను అపరాధ పరిశోధకునిలా అనేక పరీక్షలకు గురిచేసి కనిపెట్టటమే బాహ్యవిమర్శనంలో అతడు నిర్వర్తించే విధులు. ఈ విషయంలో అతనికి పురాతత్వశాస్త్రం, ప్రాచీన లిపి శాస్త్రం, భూవిజ్ఞాన శాస్త్రం, భౌగోళికశాస్త్రం వంటి అనేక ఆనుషంగిక శాస్త్రాలు (auxiliary sciences) చరిత్ర ప్రమాణాల నిజస్వభావాన్ని స్పష్టీకరించి, నిరూపించడానికి ఎంతో సహాయపడుతున్నాయి. ఇటీవల 'మూల పాఠ నిర్ణయ సంబంధ విమర్శనం' (textual criticism) కూడా తోడ్పడుతున్నది. రికార్డుల్లో యిచ్చిన సమాచారం ద్వారానే ఆ రికార్డుల నకిలీ స్వభావాన్ని గుర్తించే పద్ధతి యిది.

సాక్ష్యపత్ర కర్తృత్వం, ఆ పత్రం లభించిన చోటు ఆ పత్రం ఏ కాలానిది అనే విషయాలు చరిత్రాధారాల బాహ్యాంశాలు. బాహ్యవిమర్శనం దశలో చరిత్ర పరిశోధకుడు అధ్యయనం చేసేది యీ విషయాలనే. ఈ విషయాలు చరిత్ర ఆధారాల ప్రామాణికతతో బాటు చరిత్ర పునర్నిర్మాణంలో వాటి విలువను కూడా నిర్ణయిస్తాయి. సాక్ష్యపత్రం కర్త ఎటువంటివాడో, అతని మనస్తత్వం ఏమిటో అనే దానిపైనే అతడిచ్చిన సమాచారం ప్రాధాన్యత, ఆ పత్రం విలువ ఆధారపడి వుంటాయి. అతడు నమ్మదగినవాడు కాకుంటే ఆ పత్రంలో అతనిచ్చిన సమాచారమూ నమ్మలేం. అలాగే సాక్ష్యపత్రం లభించినచోటు, ఆ పత్రం రాసిన కాలం పరిగణనలోకి తీసుకుంటే ఆపత్రం విలువ ఎక్కువో, తక్కువో గ్రహించవచ్చు. ఈవిధంగా బాహ్యవిమర్శనం ఆధారాల బాహ్యరూప ప్రామాణికతను నిర్ధారించి చరిత్ర పరిశోధకుణ్ణి ముందు నిర్వహించబోయే కార్యభారానికి సంసిద్ధుణ్ణి చేస్తుంది.

## 5.4.2 అంతర్విమర్శనం :

చరిత్ర ఆధారాల ప్రామాణికత నిర్ధారించబడ్డాక, వాటి ప్రచురణ కాలం, ప్రాంతం తెలుసుకొన్నాక అంతర్విమర్శనం సాక్షపత్రాల్లో ఉన్న విషయాల విశ్వసనీయతను అధ్యయనం చేస్తుంది. బాహ్య విమర్శనంలో సాక్ష్యపత్రం బాహ్యరూపం గురించే అధ్యయనం జరుగుతుంది. అందులో చెప్పబడ్డ విషయాలు ఏది ఎంతవరకు నిజమో తెలుసుకోవాలి. మరి దీని ఆధారంతోనే చారిత్రక కథనం రూపొందుతుంది. సాక్ష్యపత్రం అంతరార్థం, సత్యసంధతలకు సంబంధించిన యీ ప్రక్రియను అంతర్విమర్శనం నిర్వహిస్తుంది. చరిత్ర పునర్నిర్మాణంలో చాలా కీలమైన అంశం యిదే కాబట్టి చారిత్రక పద్ధతిలో యీ అంతర్విమర్శనం ఒక యిరుసులా వుంది. అందుచేతనే దీనిని 'అత్యుత్తమ విమర్శనం' (higher criticism) అని పేర్కొంటారు. ఇది వ్యాఖ్యానాత్మకం కూడా. ఈ అంతర్విమర్శనం రెండు ఉపదశల్లో సాగుతుంది. మొదటిది 'అనుకూల వ్యాఖ్యానాత్మక విమర్శనం'. రెండవది 'వ్యతిరేక వ్యాఖ్యానాత్మక విమర్శనం'. మొదటి దానిలో సాక్ష్యపత్రంలోని విషయాలను శబ్దార్థం (నిఘంటు అర్థం), వాస్తవిక అర్థం తెలుసుకోవడానికి విశ్లేషించటం జరుగుతుంది. ఇక రెండో దానిలో సాక్ష్యపత్రకర్త సత్యసంధతను (ఏ పరిస్థితుల్లో ఆ పత్రం రాయబడిందో, ఆ రచయిత చెప్పింది వాస్తవానికి అనుగుణంగా ఉందో లేదో) పరిశీలించటం జరుగుతుంది. కథనంలో దోషాలు దొర్లే అవకాశాలు లేకుండా చేయడమే యిక్కడ ప్రధానం.

### 5.4.2.1 అనుకూల వ్యాఖ్యానాత్మక విమర్శనం :

అంతర్విమర్శనం మొదటిదశ యీ అనుకూల వ్యాఖ్యానాత్మక విమర్శనం. సేకరించి నిర్ధారించిన ఆధారాలు ఏ భాషలో వున్నాయో ఆ భాష, భాషా పరిణామం తెలిస్తే గాని పాఠాన్ని అర్థం చేసుకోలేం. కాలాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి సమాజంలో వర్గాలను బట్టి పాఠాన్ని అర్థం చేసుకోడానికి భాషా ప్రావీణ్యం కావాలి. ఒకే పదానికి అనేక అర్థాలు ఉంటాయి. సందర్భాన్ని బట్టి అర్థాలు మారతాయి. ఒకే భాషలో ప్రాంతీయ, మాండలిక భేదాలు, అలాగే నాగరికుడికి, గ్రామీణునికి, ఇదేవిధంగా ఒక సామాజిక వర్గానికి, మరో సామాజిక వర్గానికి తేడాలు కన్పిస్తాయి. లిపి పరిణామాలు తెలుసుకోగలగాలి. సాక్ష్యపత్రం శబ్దార్థం లేదా నిఘంటు అర్థం యీ అనుకూల వ్యాఖ్యానాత్మక విమర్శనం ద్వారా తెలుసుకోవడం చరిత్రకారుని మొదటి విధి. దీనికి అతడు శాసనశబ్దకోశం లాంటి చారిత్రక నిఘంటువుల సహాయం తీసుకుంటాడు. శబ్దార్థం గ్రహించాక సాక్ష్యపత్రంలోని పదాల వాస్తవిక అర్థం తెలుసుకోవడం అతని రెండో విధి. పత్రరచయిత తాను చెప్పదలచిన భావాన్ని పరోక్షంగా పరిహాస రూపంలోనో, వ్యంగ్యంగానో, ఆలంకారికంగానో, సాదృశ్యకంగానో చెప్పి ఉండవచ్చు. రూసో స్వేచ్ఛా ప్రాముఖ్యాన్ని, ప్రజాస్వామ్య ఆవశ్యకతను నొక్కి చెప్పడానికి తన 'Social contract' లో 'పుట్టుకతో స్వేచ్ఛా జీవి అయిన మనిషి సర్వత్రా శృంఖలాబద్ధుడై వున్నాడ'ని పేర్కొంటాడు. రచయితలు భావాలను సూటిగా వ్యక్తం చేయకపోవచ్చు. మతగ్రంథాల నర్థం చేసుకోవడం మరీ కష్టం. ఈ అర్థాలు, అంతరార్థాలు గ్రహించటానికి భాషాపాండిత్యంతో బాటు విమర్శనాత్మక దృక్పథమూ వుండాలి. సాక్ష్యపత్రం పాఠం మొత్తం అధ్యయనం చెయ్యాలి. సమకాలిక శబ్దార్థాలు తెలుసుకోవాలి. సమన్వయం కుదరని కాల ప్రస్తావనలు, పత్ర రచయిత పక్షపాతం, విలక్షణతలు కనిపెట్టాలి. పాఠం విలువను మదింపు వేయాలి. అస్పష్టమైన విషయాను వెలికితీయాలి. శబ్దార్థం, వాస్తవిక అర్థాలను అవగాహన చేసుకోవటమే యీ దశలో చరిత్ర పరిశోధకుని పని.

### 5.4.2.2 వ్యతిరేక వ్యాఖ్యానాత్మక విమర్శనం :

సాక్ష్య పత్రంలోని పదాలకు నిఘంటు అర్థాలు, వాస్తవిక అర్థాలు తెలుసుకొన్నాక ఆ పత్రంలో చెప్పిన విషయాలు ఎంతవరకు నిజం అనేది వ్యతిరేక వ్యాఖ్యానాత్మక విమర్శనంలో చరిత్ర పరిశోధకుడు తేల్చుకుంటాడు. ఆ పత్రకర్త లేదా

రచయిత సత్యసంధత, విషయ ప్రామాణికతలకు సంబంధించిన విషయమిది. గ్రంథంలో లేదా సాక్ష్యపత్రంలో చెప్పిందంతా నిజమని చెప్పలేం. పరస్పర విరుద్ధమైన ఆధారాలూ వుంటాయి. అన్నింటినీ అనుమానించాలి. అనుమానాలను నివృత్తి చేసుకోవాలి. యదార్థాలను తెలుసుకోవడంలో సాక్ష్యపత్రకర్త అశక్తత, నిజం తెలిసీ చెప్పలేని అతని అసత్యవాదం వల్ల యీ అనుమానాలు ఉత్పన్నమవుతాయి. ఏ పరిస్థితుల్లో అతడు రాసాడో ముందు తెలుసుకోవాలి. సాక్ష్యపత్ర విశ్వసనీయత ఆ పత్రకర్తకి నిజం చెప్పే సమర్థత ఉందా? నిజం చెప్పటానికి యిష్టపడుతున్నాడా? తాను నమ్మినదాన్నే కచ్చితంగా నివేదిస్తున్నాడా? స్వార్థ ప్రయోజనాలకోసం తప్పుడు సమాచారం యివ్వటంలో అతనికి ఆసక్తేమైనా వుందా? ప్రతికూల ప్రజాభిప్రాయానికి తలొగ్గి స్వీయాభిప్రాయాన్ని స్వేచ్ఛగా ప్రకటించే స్థితిలో లేడా? వ్యక్తిగత, వర్గ దురభిమానాలు, పక్షపాతంతో విషయాలను వక్రీకరిస్తున్నాడా? అహంభావంతోనో, ఎదుటి వాళ్లను సంతోష పెట్టాలనో లేదా విసుగు కలిగించకూడదనో లేదా నాటకీయ కథనంతో పాఠకుల్ని రంజింపచేయాలనో వివరాలను విరూపం చేస్తున్నాడా? అనే అనేక అంశాలపై ఆధారపడి వుంది. ఇదంతా సాక్ష్యపత్రకర్త సత్యసంధతకి సంబంధించినది.

తరువాత సమస్య విషయ ప్రామాణికతకు సంబంధించినది. ఇక్కడ సాక్ష్యపత్రకర్త సత్యసంధతపై అనుమానం లేదు. కాని తనకే తెలియని కారణాల వల్ల లభించిన తప్పుడు సమాచారాన్ని అతడు మనకి అందించవచ్చు. సంఘటనను తానే చూసాడా? ఇతరుల నివేదికలపై ఆధారపడ్డాడా? తానే చూస్తే అది అసాధారణ పరిస్థితుల్లో చేసాడా? విషయాలను సరిగ్గా పరిశీలించే అలవాటుందా? అర్థం చేసుకోవడానికి అవసరమైన అనుభవం, తెలివితేటలు ఉన్నాయా? బద్ధకం, నిర్లక్ష్యం వల్ల సంఘటనలను సరిగ్గా రికార్డ్ చెయ్యలేదా? అతనిస్తున్న సమాచారాన్ని ధృవీకరించే వేరే యితర సాక్ష్యం వుందా? వంటి అనుమానాలను నివృత్తి చేసుకోవటం ద్వారా విషయ ప్రామాణికతను నిర్ధారించవచ్చు.

ఈవిధంగా బాహ్య, అంతర్విమర్శన ప్రక్రియల ద్వారా చరిత్రాధారాలన్నిటినీ జల్లెడపడితే వేటికవే విడివిడిగా వున్న, నమ్మదగిన, సంభావ్యమైన అనేక యదార్థాలు పోగుపడతాయి.

## 5.5 సంశ్లేషణం :

విశ్లేషణాత్మక, విమర్శనాత్మక ప్రక్రియల ద్వారా జల్లెడపట్టి రాబట్టిన, దేనికదే విడివిడిగా ఉన్న నమ్మదగిన, సంభావ్యమైన అనేక చారిత్రక యదార్థాలను శాస్త్రీయ కార్యకారణ ప్రక్రియలో పరస్పర సంబంధం కలవిగా ఒక క్రమపద్ధతిలో వ్యాఖ్యానాత్మకంగా వర్గీకరించి ఒక అర్థవంతమైన ఆకారాన్ని కల్పించటమే చారిత్రక పద్ధతిలోని మూడోదశయైన 'సంశ్లేషణం' లేదా 'సమన్వయం'. నానాజాతి సమితిగా వున్న వివరాలకు ఒక ఆకారాన్ని ఇవ్వటం యీ దశలో చరిత్ర పరిశోధకుని కర్తవ్యం. ష్లింగ్ చెప్పినట్లు విడివిడిగా కలగాపులగంగా వున్న యదార్థాలను పరస్పర కార్యకారణ సంబంధంతో హేతుబద్ధంగా వుండేలా సంశ్లిష్టంగా, నిరుపమానంగా రూపుదిద్దుకుంటున్న ఒక మొత్తంగా చరిత్రకారుడు క్రమబద్ధీకరిస్తాడు. చారిత్రక పద్ధతిలో విమర్శనం దశలో చరిత్రకారుడు నిర్వహించే సాక్ష్యపత్రాల ప్రామాణిక పరీక్షలు, వాటి రచయితల విశ్వసనీయత, వాటిలో చెప్పిన విషయాల ప్రామాణికతా నిర్ధారణ వంటి కార్యకలాపాలు సాధారణంగా యితర విజ్ఞాన విభాగాల్లో అనుసరించేటువంటి శాస్త్రీయ ప్రక్రియలే. కాని సంశ్లేషణాత్మక ప్రక్రియ అటువంటిది కాదు. చరిత్ర కథనాన్ని అర్థవంతంగా ఆసక్తికరంగా చేయటానికి పూనుకునే యీ ప్రక్రియ చాలావరకు యదార్థాల కలయిక, వర్గీకరణ, క్రమత, వివరణ, వ్యాఖ్యానాలకు సంబంధించింది కనుక ఎటువంటి నియమ నిబంధనలకు లోబడదు. అంటే యిది అంత శాస్త్రీయం కాదు. కథనాన్ని ఒక కళాఖండంగా రూపుదిద్దటంలో చరిత్రకారుని విచక్షణా సామర్థ్యమే యిక్కడ ప్రధానం. సంశ్లేషణాత్మక ప్రక్రియల్లో ప్రధానంగా పరిశోధక విషయానికి హద్దుల్ని ఏర్పరచటం, అనేక దశలు, ఉపదశలుగా విభజించటం, ఏ యదార్థం ఏ వరుసలో రావాలో, దేనిని వదిలేయాలో, యదార్థాల

మధ్య కార్యకారణ సంబంధాన్ని నిర్ధారించటం, కథనంలో దీనికి ప్రాధాన్యత నివ్వాలో, దీన్ని ప్రాసంగికంగా చెప్పి వదిలేయాలో అంతర్భాగం.

యదార్థాలను అర్థవంతంగా వర్గీకరించాలి. సమగ్ర రూపాన్ని కల్పించాలి. ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరగాలి. వివరాలను పొందికగా ఏర్పాటు చేయడానికి ఎక్కువ మంది చరిత్రకారులు అనుసరించే పద్ధతి కాలక్రమణిక (Chronology) కు సంబంధించినది. తేదీలవారీగా సంఘటనలను కూర్చడమన్నమాట. నాటి థూసిడైడిస్ నుండి మొన్న వి.ఏ.స్మిత్ ('అక్బర్' గ్రంథం) వరకు తమ రచన అనుసరించింది యీ పద్ధతినే. ఆధునిక దైత్య, రాజకీయ చరిత్ర రచనలకు యిదే సంతృప్తికరమైన పద్ధతి. విషయానుక్రమంలో వర్గీకరించటం (కేంబ్రిడ్జ్ 'History of India Vol. I') మరో పద్ధతి. కాలంతో వచ్చే మార్పు యీ పద్ధతిలో విస్మరించబడే అవకాశం ఉంది. భౌగోళిక విధానంలో యదార్థాలను వర్గీకరించటం మూడోపద్ధతి. ఇదీ స్థిరమైనది కాదు. ప్రతి పద్ధతిలో ఏదో ఒక లోపం ఉండటం వల్ల విషయానుక్రమ, కాలక్రమ విధానాలు రెండింటినీ కలపడమే మంచిదని చెప్పాలి. వ్యక్తుల గురించిన సామాజిక ఆర్థిక అంశాల గురించిన అధ్యయనాలలో వర్గీకరణం తదనుగుణంగా వుంటుంది. ఏ పద్ధతి అనుసరించినా అనుమానాలకు, వివాదాలకు సంతృప్తికరంగా సమాధానం వచ్చేలా సమగ్రంగా వర్గీకరించాలి. నిర్ధారించిన శీర్షికలు, ఉపశీర్షికల క్రింద వర్గీకరించి, నిర్మాణాత్మక వివేచనతో ఖాళీలుంటే పూరించి, భావాలను విశ్లేషించి వ్యాఖ్యానిస్తూ కథనాన్ని రూపొందించాలి. ఈ దశలో కథనం వివరాలన్నీ ముఖ్యమైన ఫలితాలునిచ్చేలా ఏకోన్ముఖం చేస్తూ ఒక సూత్రం రూపొందించటమో, సాధారణీకరణం చేయటమో జరుగుతుంది. ఇదే మొత్తం రచనకు తుది నిర్ధారణ లేదా అంచనా అవుతుంది. ఇదే పరిశోధన సారాంశం. చరిత్రకారుడు కనుగొన్న సత్యం. ఈ సంశ్లేషణాత్మక ప్రక్రియలు పూర్తయ్యేసరికి చరిత్రరచనకు లేదా పరిశోధక వ్యాసానికి ఒక స్పష్టమైన రూపం వచ్చినట్లే.

## 5.6 వివరణం :

పరిశోధక విషయంపై తత్సంబంధమైన చరిత్ర ఆధారాలు అన్నింటిని శోధించి సమీకరించేక వాటి నుండి విమర్శన ప్రక్రియల ద్వారా జల్లెడపట్టి రాబట్టిన యదార్థాలను శాస్త్రీయ కార్యకారణ ప్రక్రియలో పరస్పర సంబంధం కలవిగా విషయక్రమ, కాలక్రమాల సమ్మేళనంలో వర్గీకరించి ఒక సమగ్ర సమరసరూపంగా తీర్చి చారిత్రక వివరాల పరమార్థాన్ని సూచించే సాధారణీకరణాలు లేదా సూత్రీకరణలతో మేళవించి విషయాలను సత్యమే పరమావధిగా పాదవివరణల ప్రమాణంతో చరిత్రకారుడు తనదైన శైలిలో భాషారూపంలో అందంగా, చదివింపజేసేలా గ్రంథస్థ చేయటమే 'వివరణం'. చారిత్రక పద్ధతిలో ఇది చివరిదశ. చరిత్ర రచనకే మకుటాయమానమైనది. చరిత్రకారుడు సాహితీవేత్తగా మారేది యీ దశలోనే. దీనిని 'అభివర్ణనం' లేదా 'కథనం' అని కూడా వ్యవహరించవచ్చు.

చరిత్ర శాస్త్రం కావచ్చు. చరిత్ర పరిశోధన శాస్త్రీయం కావచ్చు. కాని చరిత్ర రచన యీ 'వివరణం' దశలో పూర్తిగా ఒక కళ. ఇది చాలావరకు వైయక్తికం. చరిత్రకారుని స్వీయప్రతిభ, పాండిత్య ప్రకర్షలే ముఖ్యం. పరిశోధనా ఫలితాల్ని భాషారూపంలోకి పెట్టే సమయంలో వీలయినంతవరకు అతడు వస్తుగతంగానే వ్యవహరించాలన్నదే ముఖ్యమైన మార్గదర్శక సూత్రం. ఏకకాలం గురించి రచన చేస్తున్నాడో ఆ కాలం గురించి చక్కని అవగాహన అవసరం. అలాగే ఏ భాషలో రాస్తున్నాడో అందులో పాండిత్యం, శక్తివంతమైన శైలీ అవసరమే. కాని చారిత్రక కథనంలో సత్యానిదే పై చేయి కావాలి. శైలికే ప్రాధాన్యతనిచ్చారు కాబట్టే 19వ శతాబ్దం వరకు చరిత్ర సాహిత్యంలో భాగంగానే ఉండిపోయింది. 19వ శతాబ్దంలో శాస్త్రీయ ధోరణుల పర్యవసానంగా శైలి యదార్థతకు లోబడింది. చరిత్రకథనంలో నీతి ప్రబోధం అంతర్లీనంగా ఉంటుంది. తప్పదు. కథనంలో చరిత్ర ఆధారాల ప్రసక్తి చోటుచేసుకోవడంతో అవసరమై ప్రమాణాలు పాదవివరణలు (Foot-notes) గా రూపొందాయి. హాకెట్ చెప్పినట్లు

'గ్రంథ పాఠంలోని విషయాలకు ప్రమాణాన్ని లేదా ఆధారాన్ని ఉదాహరించటానికి, సాగిపోయే కథనంలో అనవసర జోక్యంగా అన్పించి పాఠకుని దృష్టిమళ్ళించే లేదా ఆసక్తిని తగ్గించే సాంకేతికమైన చర్చలు, అప్రధాన వ్యాఖ్యలు వంటి సమాచార భారం నుండి గ్రంథ పాఠాన్ని తప్పించటానికి, గ్రంథ పాఠంలో యితర చర్చలను ఉదహరించటానికి లేదా అందులోని విషయాలపై అదనపు సమాచారాన్ని యివ్వడానికి ప్రతి నిర్దేశాలకు (Cross-references), లేదా యీ ప్రయోజనాలలో రెండు లేదా అంతకంటే ఎక్కువ వాటి ఏకీకరణకు పాదవివరణలు వుపయోగపడతాయి.

## 5.7 ముగింపు :

చరిత్ర పరిశోధన, రచనకు సిద్ధాంత వ్యాస (Thesis) సమర్పణకు మధ్య తేడాలేమీ లేవు. ఉన్నా అవి ఉపక్రమణకు, ముగింపుకు సంబంధించిన విషయాలలోనే. నిజానికి యిది తేడాలు కూడా కాదు. కేవలం సిద్ధాంత వ్యాససమర్పణకు సంబంధించిన కొన్ని లాంఛనాల విషయం మాత్రమే. అదీ ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి పరిశోధనలో ఆసక్తి వున్న విద్యార్థి ఎం.ఫిల్. లేదా పి.హెచ్.డి కి ఏదైనా విశ్వవిద్యాలయంలో నిర్దేశిత సమయంలో తన పేరు, పరిశోధక విషయం, పరిశోదక మార్గదర్శకుని పేరు తదితర వివరాలతో నమోదు (register) చేసుకోవడానికి సంబంధించి, పరిశోధన పూర్తయ్యాక ఆఖరులో అనుసరించాల్సిన కొన్ని లాంఛనాలకు సంబంధించి పరిశోధక విద్యార్థిగా పేరు నమోదు చేయించుకున్నాక ఎంచుకున్న పరిశోధక విషయంపై తన గైడ్ తోడ్పాటుతో చారిత్రక పద్ధతికి సంబంధించిన నాలుగు దశలనూ ఎవరైనా సంతృప్తికరంగా పూర్తి చేయవలసిందే. అనంతరం సిద్ధాంత వ్యాసానికి తయారు చేసుకున్న చిత్తు ప్రతిలో తాను చెప్పాలనుకున్న విషయాలను ఆయా ప్రకరణాలతో శీర్షికలు, ఉపశీర్షికల క్రింద క్రమబద్ధంగా చెప్పాడో లేదో, ఎక్కడైనా కప్పదాట్లు ఉన్నాయా? చేసిన వ్యాఖ్యానాలకు ఆధారాలను చూపించాడా? లేదా? అనే విషయాలను గమనించాలి. లోటుపాట్లను సరిదిద్దాలి. క్షుణ్ణంగా మరోసారి మొదటి నుండి చివరివరకు నిర్ధారించుకొని పరిశోధక సారాంశాన్ని చివరి ప్రకరణంగా తీర్చిదిద్ది పాదవివరణలు యిచ్చి, వ్యాసం చివర మౌలిక, మాధ్యమిక ఆధారాలతో కూడిన అంతిమ గ్రంథ సూచీని పొందుపరచి సిద్ధాంత వ్యాసాన్ని రూపొందించాలి. నిర్దేశిత రీతిలో వ్యాసాన్ని విశ్వవిద్యాలయంలో సమర్పించాక పరీక్షకుల ఆమోదంతో తత్పరిశోధక విద్యార్థికి డాక్టరేట్ పట్టా అర్హత ప్రకటింపబడుతుంది. సిద్ధాంత వ్యాసం విలువ ఆ పరిశోధకుని సునిశిత మేథాసంపత్తి, ఆలోచనా విధానం, మెలకువ, నేర్పు అనుసరించిన పద్ధతి వంటి వాటిపై ఆధారపడివుంది.

## 5.8 సంక్షిప్తంగా :

చారిత్రక సత్యాన్వేషణలో, పరిశోధనలో, కనుగొన్న సత్యాన్ని పాఠకులకు రచనా రూపంలో సమర్పించే ప్రక్రియే చారిత్రక పద్ధతి. కొత్త సమాచారం కనుక్కోవడానికో, ముందే తెలిసినదానికి కొత్త వ్యాఖ్యానం చేయడానికో లేదా సమాచారాన్ని సూత్రీకరించడానికో పరిశోధనకు పూనుకున్న చరిత్రకారుడు అనుసరించాల్సిన నియమావళిని యిది నిర్దేశిస్తుంది. 19వ శతాబ్దంలో యీ చారిత్రక పద్ధతి ప్రాధాన్యతను గుర్తించిన వాళ్ళు జర్మన్లు. చారిత్రక పద్ధతిలో నాలుగు దశలున్నాయి. 'హేరిస్టిక్' దశలో చరిత్ర పరిశోధకుడు తానెంచుకున్న పరిశోధక విషయంపై రకరకాల మౌలిక, మాధ్యమిక సాక్ష్యపత్రాలు, అవశేషాలు సేకరించి పదిలపరుస్తాడు. వివిధ ప్రక్రియల్లో సాగే రెండోదశ 'విమర్శనం' లో చరిత్రాధారాల ప్రామాణికతను నిర్ధారించి, వాటిలోని వివరాల అంగీకార యోగ్యతను నిర్ణయించటం ద్వారా యదార్థాలను వెలికితీస్తాడు. మూడోదశ 'సంశ్లేషణం' లో జల్లెడ పట్టి రాబట్టిన యదార్థాలను వాటి విలువను బట్టి శాస్త్రీయ కార్యకారణ ప్రక్రియలో పరస్పర సంబంధం ఉన్నవిగా ఒక క్రమపద్ధతిలో వ్యాఖ్యానాత్మకంగా వర్గీకరించి, నిర్మాణాత్మక వివేచనతో ఖాళీలను పూరించి, వివరాలను ఏకోన్ముఖం చేయడం ద్వారా పరిశోధన సారాంశాన్ని సూత్రీకరణ లేదా సాధారణీకరణంతో అర్ధవంతమైన కథనాన్ని రూపొందిస్తాడు. చివరిదశ 'వివరణం' లో పరిశోధనా

ఫలితాలను భాషారూపంలో తనదైన శైలిలో వస్తుగతంగా అవసరమైన ప్రమాణాలను పాదవివరణల రూపంలో పొందుపరుస్తూ అందంగా చదివింపజేసే రీతిలో గ్రంథస్థం చేస్తాడు.

### 5.9 పరీక్ష నమూనా ప్రశ్నలు :

**I ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. చారిత్రక పద్ధతి అంటే ఏమిటో వివరించి, దానిలోని వివిధ దశలను వర్ణించండి.
2. చరిత్ర పరిశోధన అంటే ఏమిటి? సిద్ధాంత వ్యాసాన్ని (thesis) యే విధంగా రూపొందిస్తారో వివరించండి.

**II క్రింది వాటికి లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. చరిత్ర పరిశోధకునికి ఉండవలసిన లక్షణాలను వివరించండి.
2. 'హీరిస్టిక్స్' అంటే ఏమిటి?
3. 'అంతర్విమర్శన' ప్రక్రియల్ని వివరించండి.
4. చరిత్ర రచనలో లేదా సిద్ధాంత వ్యాసంలో పాదవివరణల అవసరాన్ని వివరించండి.

### 5.10 ఉపయుక్త గ్రంథాలు :


| | | |
|---|---|---|
| Ali, Shaik B. | : | History : Its Theory and Method (Macluillan India, 1978). |
| Barnes, H.E. | : | A History of Historical writing (Dover, New York, 1962). |
| Bargun, J and Graff, Henry F. | : | The Modern Researcher. |
| Chitnis, K.N. | : | Research Methodology in History (Atlantic, N. Delhi, 1990). |
| Durgaprasad. J | : | Charitra Rachana Sastramu (Tel.) (Telugu Akademi, హైదరాబాద్,1987). |
| Elton, G.R. | : | The Practice of History (Fontana, 1969). |
| Gardiner, Patrick | : | The Nature of Historical Explanation (O.U.P., 1968) |
| Hocket, H.C. | : | The Critical Method in Historical Research and writing |
| Kent, Sherman | : | Writing History (2nd. Ed) (Appleton Century Crofts, N.York, 1967) |
| Langlois, C.V. and Seignobos, Ch. | : | Introduction to the Study of History (Bewy's Tr.) London. |
| Marwick, Arthur | : | The Nature of History (Macmillan, London, 1970). |
| Shotwell, James T. | : | Introduction to the History of History (Columbia, 1939). |
| Subrahmanian,N. | : | Historiography (Koodal, Madurai, 1973). |
| Webster John C.B. | : | An Introduction to History (Macmillan India, 1977). |


**- డా॥ జె. దుర్గాప్రసాద్**

పాఠం - 6

# చరిత్రలో విషయ నిష్ఠత

**విషయక్రమం :**


6.0 లక్ష్యం
6.1 పరిచయం
6.2 చారిత్రక విషయ నిష్ఠత అంటే ఏమిటి ?
6.3 ఆత్మాశ్రయత
6.4 దురభిమానం, పక్షపాతం
6.5 చారిత్రక ఆభాసలు . . . దోషాలుత
6.5.1 ఉపదేశాత్మక దోషం
6.5.2 స్వదేశాభిమాన దోషం
6.5.3 పక్షపాత దోషం
6.5.4 ఫ్రూడ్ జాడ్యం
6.6 చారిత్రక విషయ నిష్ఠత ఆవశ్యకత
6.7 సంక్షిప్తంగా . . .
6.8 పరీక్ష నమూనా ప్రశ్నలు
6.9 ఉపయుక్త గ్రంథాలు


## 6.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని అధ్యయనం వలన మీరు

- చరిత్రలో విషయ నిష్ఠత అంటే ఏమిటో వివరించగలగాలి.
- చరిత్రకారుని ఆత్మాశ్రయత చరిత్రరచన ఎటువంటి చెరుపు చేస్తుందో వివరించగలగాలి.
- చారిత్రక అభ్యాసాలు, దోషాలు రచనలలో ఏవిధంగా చోటు చేసుకుంటాయో చెప్పగలగాలి
- చారిత్రక విషయనిష్ఠత ఆవశ్యకతను విశ్లేషించగలగాలి.

## 6.1. పరిచయం :

చరిత్ర తత్వంలో విమర్శనాత్మక ధోరణికి ఒక ప్రతీక విషయ నిష్ఠత. చరిత్ర రచనలలో ఉన్నత ప్రమాణాలు సాధించటానికి దీనిని ఒక ముఖ్యసాధనంగా చరిత్రకారులు ఉపయోగిస్తారు. చరిత్ర స్వభావాన్ని అర్థం చేసుకోవటంలో దీనికి ప్రాధాన్యత వుంది. చరిత్ర అధ్యయనం ఆరోగ్యదాయకంగా అభివృద్ధి చెందటానికి యీ సమస్యకు ప్రాధాన్యం యివ్వబడింది. వాస్తవికమైన దానికి, సత్యమైన దానికి యీ విషయనిష్ఠత ప్రతీక. వ్యక్తిగత దురభిమానాలు, పక్షపాతం, భావుకతలకు దూరంగా వుండే స్థితిని యిది తెలియజేస్తుంది.

## 6.2 చారిత్రక విషయ నిష్ఠత అంటే ఏమిటి ? :

'ఏ విధంగా అయితే ఒక న్యాయాధీశుడు ఎటువంటి భయ, పక్షపాతాలు లేకుండా అత్యంత నిష్పాక్షిక పద్ధతిలో తన తీర్పును ప్రకటిస్తాడో అదేవిధంగా ఒక చరిత్రకారుడు గత సంఘటనలను చిత్రీకరించేటప్పుడు ఉద్వేగరహితంగా, నిరాసక్తంగా, శాస్త్రీయంగా ఆ సంఘటనలు అన్నింటిపట్ల వ్యవహరించే తీరునే చరిత్రలో 'విషయనిష్ఠత' అని తీసుకోవచ్చు. విషయనిష్ఠతనే 'వస్తుపరత' లేదా 'విషయాత్మక' అని కూడా వ్యవహరించవచ్చు. చరిత్రకారుడు గతంలో జరిగిన దానిని చిత్రించినపుడు ఎటువంటి ఉద్వేగం లేకుండా, భయం, పక్షపాతం, దురభిమానాలకు లోనవ్వకుండా శాస్త్రీయంగా విశ్లేషించి వ్యాఖ్యానించే విధానమిది. సంక్లిష్టమైన చరిత్ర స్వభావాన్ని అర్థం చేసుకోవటానికిగాని, ఆరోగ్యదాయకమైన చరిత్ర అధ్యయనం అభివృద్ధిచెందటానికి గాని విషయనిష్ఠతకు ప్రాధాన్యం యివ్వాలి. విలువకు సంబంధించిన తీర్పుకి యిది సన్నిహితంగా కూడా ఉంటుంది. గతంలో జరిగినదానిని చిత్రించేటప్పుడు చరిత్రకారుడు ఎటువంటి యిష్టానిష్టాలకు, అభిమాన దురభిమానాలకు, పక్షపాతానికి తావివ్వకుండా వుండటమే కాకుండా పదిమందికీ మేలుచేసేరీతిలో, ఉత్కృష్టమైన భవిష్యత్సమాజ నిర్మాణానికి దోహదం చేసే రీతిలో గతాన్ని వ్యాఖ్యానించటం కూడా చారిత్రక విషయనిష్ఠతలో భాగమేనని చెప్పాలి.

## 6.3 ఆత్మాశ్రయత :

చరిత్రకారుడు చరిత్ర పరిశోధనలో తన పూర్వీకుల గురించి పరిశీలిస్తాడు. మానసవికాస పరిణామాన్ని అధ్యయనం చేస్తాడు. సంఘజీవియైన అతడు తన తోటివారి గురించే అధ్యయనం చేస్తున్నాడు. అంటే అధ్యయనం చేస్తున్న వ్యక్తి, అధ్యయనం చేయబడుతున్న విషయం ఒకే తరగతికి చెందుతున్నట్లయింది. అంటే చరిత్రలో కర్త, కర్మ రెండూ మానవుడే. దురభిమానం మానవునిలో వుండే సహజ లక్షణం. అటువంటప్పుడు మానవ స్వభావాన్ని పరిగణలోనికి తీసుకుంటే చరిత్రకారుడు ఎంతవరకు విషయనిష్ఠతతో చరిత్ర నధ్యయనం చేస్తాడు ? ప్రతి చరిత్రకారుడు ఎంతో నమ్మకంతో ప్రతీ విషయాన్నీ యదార్థమనే ప్రకటిస్తుంటాడు. అయితే యీ ఆరోపిత యదార్థాలు చాలావరకు అతనిస్వంత అభిప్రాయాలు, పరిశీలనలు, వ్యాఖ్యానాలే. అవి యదార్థాల మూలంగా వచ్చిన తీర్పుల ఫలితాలు కాకపోవచ్చు. గ్రంథకర్త మానసికస్థితి నుంచి ఆవిర్భవించి ఉండవచ్చు. తన పూర్వీకుల చేతిలో వెనుక వున్న ఆలోచనలు ఏమిటో అని ఆలోచించే చరిత్రకారుడు తన సమకాలీనం దృష్ట్యానే, వ్యక్తిగత అభిరుచులు, యిష్టానిష్టాలు ప్రతిబింబిస్తూనే సంఘటనలను చూడటం జరుగుతుంది. అతడిచ్చే ప్రాధాన్యతను బట్టే యదార్థాలు చారిత్రక యదార్థాలవుతాయి. అతని ఆలోచనపైనే సంఘటనల అస్తిత్వం ఆధారపడి ఉంటుంది. అతడు పరిశీలించే విషయంపై అతని వ్యక్తిత్వం ఆవిధంగా పరోక్షంగానైనా ప్రతిఫలిస్తుంది. ఈ విషయాన్నే జి.ఎమ్.ట్రెవెల్యన్ ఎవరైనా రచన చేస్తున్నప్పుడు రచయిత ఆ రచయిత స్వభావం, వివేకం, వర్గ చైతన్యాలతో సహా పూర్తి వ్యక్తిత్వంతో అతని ఉనికి ఆ రచనలో ఉంటుంది' అని స్పష్టీకరించాడు.

## 6.4 దురభిమానం, పక్షపాతం :

చరిత్రకారులు వ్యక్తులను, ఆయా సంఘటనలను యదాతథంగా చిత్రిస్తారని అనుకోవలసిన పనిలేదు. గతాన్ని తన మనస్సులోనే తిరిగి జీవింపజేసే చరిత్రకారుడు ఆ గత సంఘటనలపై తన భావాలను ఎంతో కొంత రుద్దుతాడు. ఇది ఒక ప్రేరక ప్రక్రియ. ఈ ప్రేరణ ఆత్మాశ్రయతకు దారితీస్తుంది. దీనికి అనేక కారణాలండవచ్చు. దురభిమానం అంటే ఎటువంటి పరిశీలన లేకుండానే ఏర్పరచుకొన్న భావన - అనేక రూపాలలో ఆత్మాశ్రయతకు అవకాశం ఇస్తుంది. రచనా విషయం ఎంచుకునే దశనుండి ఆ విషయాన్ని అందంగా పాఠకులకు అందించే వరకు అభిమానం పక్షపాతం అనేవి చరిత్రకారునికి తప్పించుకోలేని

విషయాలయ్యాయి. సిద్ధాంతపరంగా సంఘటనలను చూడటం లేదా వ్యక్తిగత కృతజ్ఞతాభావంతో కూడిన రాజకీయ నిబద్ధత బాణుడు, ఫెరిష్టా వంటి ఆస్థాన కవులు, చరిత్రకారులు, ఆయా ప్రభువుల ఆదరణలో ఉన్నతస్థాయికి వచ్చి తమ ప్రభువుల గురించి రాసేటప్పుడు కనపరచే కృతజ్ఞతాభావం) లేదా వ్యక్తిగత దురభిమానాలు (మత విశ్వాసాలు, జాతివిభేదాలు, దేశాభిమానం, జాతీయవాదం, సామ్రాజ్యవాదం వంటివే కాకుండా కుల, ప్రాంతీయ, భాషాభిమానాలు కూడా యీ కోవకే వస్తాయి, ఇవన్నీ చరిత్ర రచనలను ప్రభావితం చేసే అంశాలు. చరిత్రకారుడూ, సామాన్య మానవునిలా సంఘజీవే. ఈ రకమైన దురభిమాన, పక్షపాతాలకు అతణ్ణి అతీతునిలా చూడలేం. చరిత్ర పుటల నిండా అనేక ఉదాహరణలు కన్పిస్తున్నప్పుడు వేరే విధంగా ఎలా వివరించగలం ? గ్రీస్ చరిత్ర గ్రంథాలు రాసిన గ్రోట్, మిట్‌ఫర్డ్ (యిద్దరూ ఆంగ్ల చరిత్రకారులే)లు. భిన్నవైఖరులు ప్రదర్శించినా, బ్రిటిష్ చరిత్రకారులు మనదేశం పట్ల అనుచితవైఖరి చూపినా, జాతీయవాదులైన భారతీయ చరిత్రకారులు బ్రిటన్ వ్యతిరేక వైఖరి ప్రదర్శించినా వారి వారి వ్యక్తిగత, వర్గ దురభిమానం, పక్షపాతాల కారణంగానే జరిగింది.

చరిత్ర పరిణాత్మం (Selective) అని అందరూ అంగీకరించే విషయమే. చరిత్రకారుడు తన రచనా విషయంపై కొన్ని అంశాలనే వివరించగలడు కాని విశేష సమగ్రరచనను అందించలేడు. ఒకే రచనా విషయంపై భిన్న చరిత్రకారులు భిన్న రీతులలో స్పందించటం కన్పిస్తుంది. కొన్ని పరస్పర విరుద్ధంగానూ వుంటాయి. ఒక్కొక్కరు ఒక్కో రీతిలో 'భిన్న దృక్పథాలను వెలిబుచ్చుతారు. దీనికి ఉదాహరణగా మనదేశ చరిత్రలోని '1857 సంఘటనల'నే తీసుకోవచ్చు. ఈ సంఘటనలపై 300 పైగా రచనలు భిన్న కోణాల నుండి వెలువడ్డాయి. ఈ రచనలలో కన్పించే వైవిధ్యానికి, వైరుధ్యాలకు కారణం బ్రిటిషు, భారతీయ చరిత్రకారులుపైన పేర్కొన్న వరదురభిమానాలకు, పక్షపాతానికి లోనుకావటమే. బ్రిటిషు చరిత్రకారుల్లో ఎక్కువమంది కంపెనీ అధికారులుగా ఆనాటి సంఘటనల్లో పాల్గొనటమో, వాటికి బాధితులు కావటమో జరిగింది. కనుకనే కేయో, మాలెసన్, ట్రెవెల్యన్, లారెన్స్, హోమ్స్, సీలీలు 1857 ఘట్టాన్ని సైన్యానికి పరిమితమైన కలహంగా చిత్రించారు. రీస్ క్రైస్తవ వ్యతిరేక మతయుద్ధమన్నాడు. మడ్లాయ్ నల్లవాళ్ళకి, తెల్లవాళ్ళకీ మధ్య ఆధిక్యతకై సాగిన జాతిపోరాటమన్నారు. మరికొంతమంది ప్రాచ్య, పాశ్చాత్య నాగరికతా సంస్కృతుల మధ్య పోరాటమన్నారు. అశోక్ మెహతా వంటి భారత జాతీయవాదులు' జాతీయ మహావిప్లవం' అని చిత్రిస్తే వీర్ సావర్కర్ 'మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామం' అన్నాడు. మార్క్సిస్టుల దృష్టిలో అది 'రైతుల తిరుగుబాటు'. 1857 ఘట్టంపై లభించే సమాచారం అందరికీ ఒక్కటే. చరిత్రకారుల వ్యాఖ్యానాల్లో యీ వైవిధ్యం, వైరుధ్యాలకు కారణం ఆయా చరిత్రకారుల వ్యక్తిగత, వర్గ దురభిమానాలు, పక్షపాత ధోరణులే.

ఇక ప్రాంతీయ దురభిమానానికి ఉదాహరణగా ప్రసిద్ధ రాజవంశాల ఆవిర్భావం గురించిన వివాదాలను చెప్పవచ్చు. భూమిపుత్రుల సిద్ధాంతం ప్రభావం ఎలాగా విస్మరించలేం. విజయనగర రాజ్యస్థాపకులు కన్నడిగులా ? ఆంధ్రులా ? వంటి వివాదాలలో ఆంధ్ర, కర్ణాటక చరిత్రకారుల వైఖరులు తెలిసినదే గదా ! అలాడే యిరుగుపొరుగు రాజ్యాల పరస్పర సైనికదాడులు విషయంలోనూ చరిత్రకారుల ప్రాంతీయ పక్షపాతాన్ని అర్థం చేసుకోవచ్చు. చరిత్రలో ఆత్మాశ్రయతకు దారితీస్తున్న అంశాలలో దురభిమానం, పక్షపాతాలేకాక చరిత్రకారుల అజ్ఞానం (సింధు లిపి), భయం (కమ్యూనిస్ట్ దేశాలు) ప్రేరణల వంటి యితర కారణాలూ ఉండటానికి అవకాశం ఉంది.

## 6.5 చారిత్రక ఆభాసలు . . . దోషాలు :

మామూలుగా గ్రహించటానికి సాధ్యంకాని, సులభంగా స్పష్టంగా గుర్తించి, త్రోసిపుచ్చే అవకాశం లేని తార్కిక దోషాన్ని 'ఆభాస' అంటారు. చరిత్ర రచన పద్ధతిలో మొదటి నుండి చివరి వరకు ఏదశలోనైనా ఏదో రకమైన దోషం ఎక్కడైనా, ఎప్పుడైనా అంతర్గతంగా దొర్లే అవకాశం వుంది. చరిత్రకారుని ఆత్మాశ్రమత, పక్షపాతాలు ఏ రూపంలోనైనా అతని రచనలో ప్రతిబింబించే అవకాశం వుంది. ఏ లోపమూ లేని పరిపూర్ణ మానవుడు ప్రపంచంలో ఉండడు. అలాగే చరిత్రకారుడూను.

తార్కిక దోషాలను కొంతమంది మామూలుగానే చేస్తారు. కాని వాటిని చేస్తున్నట్లు లెఖ్ఖ చేయరు. అటువంటి వారిని తర్కద్వేషులనవచ్చు. తర్కద్వేషంలో యదార్థాల కూర్పులో అజాగ్రత్త, ఉపేక్షతో కూడిన పేర్పు, అసంబద్ధమైన ఆలోచనలు ఉన్నాయి. డి.హెచ్. ఫిషర్ తన గ్రంథం "Historian's Fallacies toward a Logic of 'Historical Thought" లో చరిత్రకారుడు చేసే అవకాశం వున్న అనేకమైన పొరబాట్ల జాబితానిచ్చాడు. ప్రశ్నలను రూపొందించటం, యదార్థాల సరినిరూపణం, వాటి ప్రాధాన్యత, సాధారణీకరణం, కథనం, కార్యకరణ సంబంధం, ప్రేరణ, కృత్రిమ సారూప్యత, సిద్ధాంతరూపక విధ్వంసకత మొదలైన వాటికి సంబంధించిన ఆభాసలు ఫిషర్ ఆ జాబితాలో పేర్కొన్నాడు. వీటన్నింటిని అతడు పరిశీలన వివరణ, వాదాలకు సంబంధించిన ముఖ్యమైన ఆభాసలుగా వర్గీకరించాడు.

చరిత్ర రచనలలోనూటికి నూరుపాళ్ళు నిష్పాక్షికత, విషయ నిష్ఠతలు లేకపోవటం చరిత్రరచనా విధానంలో కల్పించే ఒక ప్రధానలోపం; చరిత్రకారుని పక్షపాత, దురభిమానాలతోబాటు అతని తాత్త్విక, మనోవైజ్ఞానిక విశ్వాసాలు అతనికి తెలియకుండానే అతని ఆలోచనల్ని ప్రభావితం చేస్తాయి. వాస్తవిక విశ్లేషణ చరిత్ర రచనలలో నిర్లక్ష్యానికి గురికావటం, ప్రాచీన భారతదేశంలాగా కన్పిస్తుంది. ఎప్పుడైతే యదార్థ విశ్లేషణ నిర్లక్ష్యం చేయబడిందో దృక్పథంలో అనిశ్చితి చోటు చేసుకుంటుంది. గతాన్ని పునర్నిర్మించటంలో చరిత్రకారుడు పురావస్తు, భౌతిక ప్రమాణాలు, లిఖితపూర్వక ఆధారాల సహాయంతో అనేక తంటాలు పడుతున్నాడు. ఆధారాలలో చెప్పిన విషయాలు నమ్మదగినవి కాకపోవచ్చు. నకిలీ పత్రాలు, దొంగరాతలు వాటిలో వుండవచ్చు. ప్రమాణ పూర్వక కథనానికి లభించిన ఆధారాలు సంతృప్తికరం కాకపోవచ్చు. స్వల్పం కావచ్చు. ఈ యిబ్బందులన్నింటికీ తోడు చరిత్రకారుని బలహీనతలు వివరించినట్లు ఎక్కువే. ఈ పరిస్థితులలో యింతకు ముందే చెప్పినట్లు చరిత్ర రచనా విధానంలో మొదటి నుండి చివరి వరకు ఏ దశలోనైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా ఏదోరకమైన తప్పులు దొర్లే అవకాశం వుంది. చరిత్ర రచనలో ప్రధానంగా కన్పిస్తున్న నాలుగు దోషాలు. 1) ఉపదేశాత్మక దోషం, 2) స్వదేశాభిమాన దోషం, 3) పక్షపాత దోషం, 4) ఫ్రూడ్ జాడ్యం.

### 6.5.1. ఉపదేశాత్మక దోషం :

కొంతమంది చరిత్రకారులు తాము బోధింపదలచిన నీతిని లేదా పాఠాలను చరిత్రలో కనుగొనే ప్రయత్నం చేస్తారు. దీనినే 'ఉపదేశాత్మక దోషం' (didactical error) లేదా 'నీతిబోధక దోషం' అని పిలవవచ్చు. ఏదైనా ఒక ప్రత్యేక కోణం నుండి విషయాన్ని పరిశీలించే ప్రయత్నమిది. ఇది సాధారణంగా చరిత్రసంబంధాలు అన్నింటిలోను కన్పించే దోషమే. అందులోనూ ముఖ్యంగా సంక్షిప్తంగా రాసే విస్తృత విషయపరిధి గల గ్రంథాలలో మరీ స్పష్టంగా యిది కన్పిస్తుంది. ఉదాహరణకు హెచ్.జి.వెల్స్. రాసిన 'History of the World' వంటి సంక్షిప్త క్లుప్తీకరణలతో తప్పుదోవ పట్టించే పరిశీలనా దోషాలు దొర్లుతాయి. 16వ శతాబ్దపు జర్మన్ ప్రొటిస్టాంట్ ఉద్యమనాయకుడు మార్టిన్ లూథర్ ఆధునిక ప్రపంచ స్వాతంత్ర్యానికి, లౌకికీకరణకు కారకుడని వెల్స్ తన గ్రంథంలో చెప్పటం వాస్తవ విరుద్ధమే అవుతుంది. అలాగే హె.జె. లాస్కి ఉదారతావాద చరిత్రను సామ్యవాద అనుకూల ధోరణికి అనుగుణంగా అవలోకించటం కన్పిస్తుంది. చరిత్రకారుడు జరిగింది మాత్రమే వివరిస్తే (విశ్లేషణ లేకుండా) అది అసమగ్రమవుతుంది అనేది నిజమే కాని విశ్లేషణ చరిత్రకారుని సమకాలీన దృక్పథం, సమకాలీన ఆలోచనల వల్లకాక సంఘటనల కాలంనాటి దృక్పథంలో జరిగితే యీ ఉపదేశాత్మక దోషానికి చరిత్రరచనలో అవకాశం వుండదు.

### 6.5.2. స్వదేశాభిమాన దోషం :

ప్రతి మనిషికి తన దేశమంటే అభిమానం సహజంగానే వుంటుంది. ఇది సమర్థనీయం కూడా, కాని యీ అభిమానం దురభిమానం కాకూడదు. కాని యీ అభిమానం దురభిమానం కాకూడదు. చరిత్రకారుడూ మానవమాత్రుడే. అతడూ స్వదేశాభిమానంతో గతాన్ని వీక్షించినప్పుడు అతని రచనా 'స్వదేశాభిమాన దోష' (Patriotic error) భూయిష్టమే అవుతుంది. ఈ స్వదేశీ దురభిమానం మనిషి వివేచనాశక్తిని, తార్కిక బుద్ధిని మందగింప చేస్తుంది. చరిత్రకారుడు స్వదేశం లోపాలను, యితరుల సుగుణాలను విస్మరింపజేస్తుంది. ప్రపంచంలో గొప్ప గొప్ప విషయాలను తన దేశం గతంలోనే కనుగొనే ప్రయత్నం

యీ దోషం వల్ల జరుగుతుంది. ద్విశాసన సభావిధానం, అధికార పృథక్కరణ సిద్ధాంతం వంటివి ప్రాచీన వేదకాలంలోనే వుండేవి యీ కోవలోకి వస్తాయి. నేటి శాస్త్రీయ రాజకీయ సాధానాలను అత్యంత ప్రాచీన కాలానికి చెందిన వాఙ్మయంలో, సంస్థలలో కనుగొనే ప్రయత్నం యీ దోషం పర్యవసానమే. రామాయణంలో చెప్పిన పుష్పక విమానం దృష్ట్యా విమానాల తయారీ ప్రాచీన కాలంలోనే మనదేశంలో వుండేదని వాదించటం కూడా దీని క్రిందకే వస్తుంది. కాని వీటికి ఆధారమైన సాక్ష్యాలు ప్రామాణికంగా పరీక్షలకు నిలవగలవా అంటే లేదనే చెప్పాలి.

## 6.5.3 పక్షపాత దోషం :

చరిత్ర రచనల్లో కన్పించే అనేక రకాలైన దోషాలలో మూడవరకం 'పక్షపాత దోషం' (Partian Error)' చారిత్రక వివాదాల్లో ఏదో పక్షం వహించి ఆ పక్షం దృక్కోణం నుంచే యించుమించు పూర్తిగా కథనాన్ని విన్పించటమే పక్షపాత దోషమని నీలకంఠశాస్త్రి పేర్కొన్నాడు. ఇది ప్రాచీన కాలం నుండీ కన్పిస్తున్న దోషమే. గ్రీకు చరిత్రకారుడు పలీబియస్ క్రీ.పూ. 2వ శతాబ్దంలోనే యీ రకం దోషానికి వ్యతిరేకంగా స్పష్టమైన హెచ్చరిక చేసాడు. మొదటి ప్యూనిక్ యుద్ధం గురించి తనకు ముందు రచనలు చేసిన యిద్దరు చరిత్రకారుల వైఖరిపై వ్యాఖ్యానిస్తూ ఫిలినస్ కార్తాజీనియన్లు ప్రతి విషయంలోను తెలివితేటలతో, చక్కగా, సాహసోపేతంగా వ్యవహరిస్తే రోమను దీనికి వ్యతిరేకంగా వ్యవహరించారని స్థిరపక్షపాతంతో నమ్మకంగా చెప్తే ఫేబియస్ రోమను పక్షపాతిగా ఫిలినస్‌కి పూర్తి భిన్న వైఖరి నవలంబించాడని పేర్కొన్నాడు. జీవితంలో మంచివాడు తమ మిత్రుల్ని, దేశాన్ని ప్రేమించాలి. వాళ్ళమంచీ చెడుల్ని పంచుకోవాలి. నిజమే . . . అటువంటి పక్షపాతాన్ని బహుశ తప్పించలేం . . . కాని చరిత్రకారుని పాత్ర నిర్వహించే వ్యక్తి యిటువంటి ధోరణిని విస్మరించి అవసరమైతే తన శత్రువుల కార్యకలాపాల్ని బట్టి వాళ్ళ గురించి మంచిగా చెప్పొచ్చు. ఉన్నతంగా కీర్తించవచ్చు. అలాగే తనకత్యంత సన్నిహిత మిత్రుల్ని వాళ్ళు తప్పుచేసినప్పుడు విమర్శించవచ్చు. యింకా తిట్టవచ్చు కూడా. ఎవరినైతే విమర్శించాడో వాళ్ళనే ఆ తరువాత వాళ్ళ ప్రవర్తనను బట్టి పొగడవలసి రావచ్చు.

ఈ పక్షపాత దోషానికి గ్రీకు చరిత్ర రచనల్లో ఒక చక్కటి ఉదాహరణ వుంది. గ్రీకుదేశ చరిత్రపై రచనలు చేసిన మిట్‌ఫర్డ్, గ్రోట్, థిర్ల్‌వాల్ అనే ముగ్గురు చరిత్రకారుల్ని పరిగణలోనికి తీసుకుంటే వీరిలో మిట్‌ఫర్డ్ దృఢమైన సనాతనవాది. స్పార్టా సంస్థల పట్ల బాగా అనురక్తి పెంచుకున్న వ్యక్తి. . . దీనికనుగుణంగానే గ్రీకు చరిత్ర రాసాడు. దీనికి పూర్తి భిన్నధోరణి గ్రోట్‌ది. అతని గ్రీకు చరిత్ర రచనను ప్రజాస్వామ్యంపై సుదీర్ఘమైన ప్రకటన పత్రం అని వ్యాఖ్యానించటం నిజమేనన్పిస్తుంది. ఇక మూడోవాడు థిర్ల్‌వాల్. మిగతా యిద్దరు చరిత్రకారుల కంటే భిన్నంగా నిష్పాక్షికంగా కాల పరీక్షకు నిలబడగలిగిన చక్కటి రచన చేసిన వ్యక్తి. ఎంతో విస్తృత పరిధిగల వైదుష్యం, దీనికి దీటైన న్యాయమూర్తిత్వం పుణికి పుచ్చుకున్న వ్యక్తి. మిగతా యిద్దరి కంటే పేరు ప్రఖ్యాతులు పొందవలసిన నిజమైన చరిత్రకారుడు. కాని యీ థిర్ల్‌వాల్ అంతగా ప్రసిద్ధుడు కాలేదు.

మనదేశంలో యీ పక్షపాత దోషానికి అవకాశం మరింత ఎక్కువ కన్పిస్తుంది. అందులోనూ వర్తమాన వివాదాలను గత చరిత్రలోకి జొప్పించటం - నిజంగా వదలిపెట్టవలసిన విషయం. గత చరిత్రలో బ్రాహ్మణుని పాత్ర, తమిళ భూమిలో ఆర్యుల పాత్ర వంటి వాటికి సంబంధించిన అనేక వర్తమానపు అంచనాలను యీ ధోరణిని ప్రతిబింబించే ఉదాహరణలుగా చెప్పవచ్చు. భారతదేశ చరిత్ర రచనలు చేసిన బ్రిటిషు చరిత్రకారులూ యిటువంటి ధోరణిలో స్పందించినవారే. అందులోనూ 20వ శతాబ్దం ప్రథమార్థంలో రచనలు చేసిన వారైతే సమకాలీన రాజకీయ అవసరాల దృష్ట్యా పక్షపాత ధోరణి ప్రదర్శించినవారే.

## 6.5.4. ఫ్యూడ్ జాడ్యం :

కొంతమంది చరిత్రకారులకు దోషానికి దూరంగా ఉండటం వారి మనస్తత్వానికే విరుద్ధమూ, అసాధ్యం కూడా. ఖచ్చితత్వాన్ని పరిశీలించి, నిరూపించే అవకాశం వున్నా దాని జోలికి వెళ్ళరు. మేధావి కాడా ? శ్రమ పడలేదా ? సమర్థత లేదా ? అవకాశం లేదా? అంటే అవేమీ కావు. మరేమిటి ? అంటే అదొక దీర్ఘకాలిక జాడ్యం లాంటిది. తప్పులు దొర్లించకుండా వుండలేరు. ఇటువంటి దోషాన్ని ఫ్రెంచి చరిత్రకారులు లాన్గ్‌లాయిస్, సినోబోస్‌లు 'ఫ్యూడ్ జాడ్యం' అని సాహసించి వర్ణించారు.

ఫ్రూడ్ 19వ శతాబ్దపు ఆంగ్ల చరిత్రకారుడు. అతడు ప్రతిభావంతుడు. సమర్థుడైన రచయిత. కాని ఏం చెప్పినా తప్పుల తడకే ఖచ్చితత్వం, ప్రామాణికతలు పాటించకపోవటం, లేనిది వున్నట్లు, వున్నది లేనట్లు లేదా రెట్టింపు చేసి చెప్పటం అతని నైజం. అయితే మన అదృష్టం కొద్దీ యిటువంటి జాడ్యం వున్న చరిత్రకారులు ఎక్కడో కాని కన్పించరు.

ఇటువంటి దోషాలతో చరిత్రరచనలు వుంటే లేదా వెలువడితే వాటికి విశ్వసనీయత, ప్రామాణికతలు ఉండవు. కాని డి.హెచ్.ఫిషర్ చెప్పినట్లు ప్రతి ఆటకూ నియమాలు ఉన్నట్లే చరిత్ర రచనకూ నియమాలు ఉన్నాయి. ఆ నియమాలను అనుసరించి చరిత్ర రాయకపోతే అది చరిత్రరచన అన్పించుకోదు. శాస్త్రీయంగా చరిత్ర రూపొందుతున్న యీ రోజుల్లో చరిత్ర కూడా శాస్త్రంలా యదార్థాలను యథాతథంగానే సేకరించి, విశ్లేషించి, కార్యకారణ సంబంధంతో సమన్వయించాలి. ఈ శాస్త్రీయ చరిత్ర నుండి సహజసిద్ధంగానే తాత్వికత రావాలి. చరిత్రకారుని అసమానమైన నేర్పు ఆధారపత్రాలతో ఉన్న విషయాన్నంతా రాబట్టటంలో ఉంది. నీలకంఠశాస్త్రి అత్యుత్తమ చరిత్రకారుని గురించి వ్యాఖ్యానిస్తూ "(సాక్ష్యపత్రాల) పాఠాలకు మరీ దగ్గరగా తనను తాను నిలువరించుకునే వాడు, అత్యంత న్యాయంగా వాటిని వ్యాఖ్యానించేవాడు, వాటికి అనుగుణంగా మాత్రమే రాసేవాడు, యింకా చెప్పాలంటే ఆలోచించేవాడే ఉత్తమోత్తమ చరిత్రకారుడు" అన్నది వాస్తవం.

## 6.6. చారిత్రక విషయనిష్ఠత - ఆవశ్యకత :

నూటికి నూరుపాళ్ళు నిష్పాక్షికంగా, దురభిమాన రహితంగా చరిత్రరచన సాగించటం అసాధ్యం కావచ్చు. ట్రెవెల్యన్ చెప్పినట్లు చరిత్రకారుడు గతంలో జీవించిన ప్రజల ఆలోచనలను, అనుభూతుల్ని, సానుభూతితో అర్థంచేసుకోవడానికి కొంతవరకు పక్షపాతవైఖరి సాయపడుతుంది. నిజమే, అయితే యిది అంతర్గతంగా వుంటేనే బావుంటుంది. పైగా చరిత్ర రచనను ఊహాత్మకంగా, మనోజ్ఞంగా తీర్చిదిద్దేది యిదే. రచనలో ఎంతో కొంత యీ వైఖరి లేకుంటే అది రసహీనమూ, జీవరహితమూ, స్వారస్యరహితముగా అవుతుందనే విషయం మనం అంగీకరించక తప్పదు. అలాగని చరిత్రకారుడు అపరిమిత ఆత్మాశ్రయతకు, పక్షపాతానికి తావిస్తే చరిత్ర పూర్తి విరూప చిత్రంగా మలచినట్లవుతుంది. అటువంటి రచనకు విలువ శూన్యం. చరిత్ర విషయ గతంగా వుంటేనే దాని వాస్తవిక విలువను అర్థం చేసుకోగలం. పైగా ఎంత వస్తుపరత సాధిస్తే అంతగా అది శాస్త్రీయంగా రూపొందుతుంది. ఒక శాస్త్రంగా చరిత్ర సత్యాన్ని వెలికితీయాలి. సత్యమనేది సార్వజనీనమైనది. నిత్యజీవితంలో దానికి ఒక అర్థం, పరమార్థం వుంటాయి. ప్రామాణికత విషయంలో ఎటువంటి అనుమానాలు ఉండకూడదు. అలా అయితేనే చరిత్రకు ప్రయోజనం వుంటుంది.

విషయ నిష్ఠత అన్నప్పుడు చరిత్రకారుడు ఆత్మాశ్రయతను, పక్షపాతం, దురభిమానం వంటి వాటినీ దూరంగా వుంచి విషయాన్ని వస్తువుగా చూడటం అనేది ఏభై శాతమైతే మరోఏభై శాతం యదార్థాలకు, వ్యాఖ్యానానికి మధ్య ఉన్న సంబంధానికీ సంబంధించినది. ఇంకో రకంగా గతం, వర్తమానం, భవిష్యత్తులకు మధ్య ఉన్న సంబంధానికి సంబంధించినది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవటం ద్వారానే చరిత్రకారుడు గతాన్ని వర్తమాన పరిధిలో క్రమబద్ధంగా పరిశీలించి వ్యాఖ్యానించగలడు. అది అతని బాధ్యత కూడా. కాలగతిలో గతాన్ని గురించిన అతని వ్యాఖ్యానం, లక్ష్యం ప్రగతిశీలంగా పరిణామం చెందుతాయి. భవిష్యదావిర్భూతి గురించి అతనికి ఉన్న భావన ద్వారా గతాన్ని అతడు విలువ కడతాడు. కనుకనే కార్ చరిత్రను 'గతకాలపు సంఘటనలకు, క్రమక్రమేణా రూపొందే, లక్ష్యాలకు మధ్య జరిగే సంభాషణ కూడా" అని పేర్కొన్నాడు. ఈ దృక్పథంలోనే మార్క్స్ 'వర్గరహిత సమాజం' గురించి చెప్పాడు. నేమియర్ 'చరిత్రకారులు గతాన్ని ఊహిస్తారు, భవిష్యత్తును జ్ఞాపకం ఉంచుకుంటారు అన్నాడు. అంటే గతకాలం తలుపుల్ని తెరిచే తాళంచెవి భవిష్యత్తేనని స్పష్టమవుతుంది. ఈ దృష్ట్యానే చరిత్రలో విషయ నిష్ఠత గురించి చెప్పుకోవటం జరుగుతుంది. గతాన్ని గురించి చరిత్రకారునికి నిర్మాణాత్మక దృక్పథం ఉండటం అంటే యిదే. సమాజంలో, చరిత్రలో తన స్థితిగతుల్ని అధిగమించి ఏ విషయాన్నైనా చూడగలిగిన సామర్థ్యం, గతం గురించి ఎక్కువ బుద్ధి సూక్ష్మత కలిగినట్టి. ఎక్కువ శాశ్వతమైన అంతర్దృష్టిని తనకు ప్రసాదించేలా భవిష్యత్తులోకి తన దృష్టిని సారించే సామర్థ్యం కలిగిన చరిత్రకారుడే విషయనిష్ఠత గల చరిత్రకారుడవుతాడు. సామాజిక స్పృహ గల చరిత్రకారుడవుతాడు. నేటి సమాజానికావశ్యకమైన చరిత్రనందిస్తాడు.

## 6.7 సంక్షిప్తంగా . . . .

వ్యక్తిగత పక్షపాతం, దురభిమానం, భావుకతలకు దూరంగా, వస్తుపరంగా లేదా విషయగతంగా, విశ్వసనీయంగా, శాస్త్రీయంగా, సత్యాన్ని బహిర్గతం చేసేలా, భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకోవటం ద్వారా గతాన్ని వర్తమాన పరిధిలో క్రమబద్ధంగా పరిశీలించి ప్రగతిశీలంగా వ్యాఖ్యానించటం జరిగిన చరిత్రరచనే విషయనిష్ఠత కలిగిన రచన అవుతుంది. సామాజిక శాస్త్రాలలో అందులోనూ ముఖ్యంగా చరిత్రలో కర్తకర్మలు ఒకే వర్గానికి చెందినవి కావటంతో పరస్పరం ప్రభావితమౌతాయి. సమకాలిక కోణం నుండి గతాన్ని చరిత్రకారుడు ఆత్మగతంగా వీక్షించటంవల్ల చరిత్ర విరూప చిత్రంగా తయారవుతుంది. చరిత్రలో యీ ఆత్మాశ్రయతకు కారణాలు వ్యక్తిగత యిష్టానిష్టాలు, అనేకరకాల వర్ణ దురభిమానాలు, మత విశ్వాసాలు, జాతీయ, ప్రాంతీయ, భాషా విభేదాలు, పక్షపాతం వంటివి. వీటిని ప్రతిబింబిస్తూనే చరిత్ర రచనలు కొల్లలుగా వచ్చాయి . . . వస్తున్నాయి. విషయ గతంగా ఉంటేనే చరిత్రకు విలువ పెరుగుతుంది. శాస్త్రీయంగా సత్యాన్ని బహిర్గతం చేస్తుంది. అనుగమించవలసిన లక్ష్యాన్ని, ఆ లక్ష్యానికి మార్గాన్ని నిర్దేశిస్తుంది. సమాజాన్ని ప్రగతిపథంలో ముందుకు నడిపిస్తుంది.

## 6.8 పరీక్ష నమూనా ప్రశ్నలు :

### ఎ) క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.

1. విషయ నిష్ఠత అంటే ఏమిటో వివరించి దాని సాధనలో చరిత్రకారుని కెదురయ్యే యిబ్బందులను పరిశీలించండి.
2. చరిత్రకారుని పక్షపాత ధోరణి భారతదేశ చరిత్ర రచనల్ని ఏవిధంగా ప్రభావితం చేసిందో ఉదాహరణలతో వివరించండి.
3. చారిత్రక ఆభాసలు, దోషాలు చరిత్రకే విధంగా చెరుపు చేస్తున్నాయో వివరించండి.

### బి) క్రింది వాటికి లఘు వ్యాఖ్యల నివ్వండి.

1. చరిత్రలో ఆత్మాశ్రయత అంటే ఏమిటి ?
2. చరిత్రలో విషయ నిష్ఠత ఆవశ్యకతను గురించి వ్రాయండి.
3. చరిత్ర రచనల్లో వర్గదురభిమానాలను గురించి వ్రాయండి.

## 6.9 ఉపయుక్త గ్రంథాలు :


| | | |
|---|---|---|
| Burcharatt, Jacob | : | Judgements of History and Historians Tr.) (George & Unwin Ltd., London, 1959) |
| Carr, E.H. | : | What is History ? (Mac millan, 1961) |
| Devacheti (Ed). | : | Bias in Indian Histographic (D.K. Publs, Delhi, 1980) |
| Durga Prasad. J | : | Charitra Rachana Sastrame (Tel)000 |
| Fischar, D.H. | : | Historians Fallacies toward a Logic of Historical Thought (Routledge and Kegan Paul, London, 1971) |
| Nilakanta Sastri, K.A.N. & Ramana, H.S. | : | Historical Method in Relative to Indian History (S. Vishwanadhan, Madras, 1959) |
| Thapar, Ravilla | : | The Past and Prejectice (NBT, N.Delhi, 1975) Thapar, Ravilla, Mukhia |
| Harbars & Bipinchandra | : | Communalism and the writing of Indian History (P.P.H., N.Delhi, 1969) |


**డా॥ జె. దుర్గాప్రసాద్**

పాఠం - 7

# ప్రాచీన భారతదేశ చరిత్ర ఆధారాలు

**విషయక్రమం**


7.0 లక్ష్యం

7.1 పరిచయం

7.2 చరిత్ర ఆధారాలు

7.2.1 మౌలికాధారాలు

7.2.2 మాధ్యమికాధారాలు

7.3 చారిత్రకయుగ విభజన

7.3.1 ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ఆధారాలు

7.4 పురావస్తు ఆధారాలు

7.4.1 నిర్మాణాలు

7.4.2 శాసనాలు

7.4.3 నాణేలు

7.5 దేశీయ వాఙ్మయం

7.5.1 వైదిక వాఙ్మయం

7.5.2 ఇతిహాసాలు, పురాణాలు

7.6 బౌద్ధ వాఙ్మయం

7.7 జైన వాఙ్మయం

7.8 లౌకిక వాఙ్మయం

7.9 విదేశీయ వాఙ్మయం

7.10 సంక్షిప్తంగా

7.11 మాదిరి ప్రశ్నలు

7.12 ఉపయుక్త గ్రంథాలు


## 7.0 లక్ష్యం :

ఈ పాఠం అధ్యయనం వలన మీరు

- చరిత్ర రచనకుపయోగపడే ఆధారమనగా ఏమిటో, మౌలిక, మాధ్యమిక ఆధారాలను వివరించగలగాలి,
- చరిత్ర నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలు, చారిత్రక యుగ విభజన విశ్లేషించాలి,
- పురావస్తు ఆధారాల ప్రాముఖ్యత, వాఙ్మయాధారాల వివరణ వివరించగలగాలి.

## 7.1 పరిచయం :

భారతీయ సంస్కృతి అత్యంత ప్రాచీనమైన సంస్కృతుల్లో ఒకటిగా భాసిల్లి, విశిష్ఠతను సంతరించుకొంది. ప్రపంచంలో ఏదేశానికీ లేనీ, 5 వేల సంవత్సరాల అవిచ్ఛిన్న సంస్కృతి భారతదేశానికి మాత్రమే ఉంది. భారతదేశానికి వచ్చి స్థిరపడి శతాబ్దాలుగా, సహజీవనం చేసిన విదేశీయుల సంస్కృతీ ప్రభావంతో భారతీయ సంస్కృతి సుసంపన్నమైనది. భారతదేశ చరిత్రలో ప్రతితరం తన తరువాతి తరం వారికీ, సంస్కృతీ వారసత్వాన్ని అందిస్తూ వచ్చినదీ. ప్రపంచదేశాల్లో, మహోన్నత స్థానం ఉన్న భారతీయ సంస్కృతీ ప్రత్యేక లక్షణాలు; భిన్నత్వంలో ఏకత్వం, అవిచ్ఛిన్నత, శాంతికాముకత, సహనం, సమన్వయం, విలీనీకరణ.

మనిషి సాధించిన ప్రగతిపధానికీ, అద్దం పట్టే ఒక స్మృతి చరిత్ర. చరిత్ర అంటే పరిశోధన, పరిశీలన, విచారణ అని అర్థం. ఇది మనిషి యొక్క సంస్కృతీ పరిణామాన్ని, వివరించే పరిశోధన అని చెప్పవచ్చు. అనేక విధాలుగా, విషయ పరిశీలన చేసిన తరువాత ఒక క్రమపద్ధతిలో, మనిషి పరిణామాన్ని, అతనిపైన పరిసరాల ప్రభావాన్ని, అతని అలవాట్లను, జీవన విధానాన్ని, తెలిపే శాస్త్రమే చరిత్ర. రినే అనే పండితుని మాటల్లో "ఒక సమాజముగా నివసించే మానవుల కథే చరిత్ర".

## 7.2 చరిత్ర ఆధారాలు :

చరిత్ర నిర్మాణం పూర్తిగా ఆధారాలపై ఆధారపడి ఉన్నది. ఏ దేశ చరిత్ర అయినా నిర్మాణానికి, పునర్ నిర్మాణానికీ ఆధారాలు ముఖ్యం. చరిత్ర నిర్మాణానికి పనికివచ్చు, చరిత్రకారుడు ఉపయోగించు ఆధారాలనే చరిత్ర ఆధారాలు అంటారు. చరిత్ర ఆధారాల ప్రామాణికత ఖచ్చితత్వం, విశ్వసనీయతపైనే, చరిత్ర వివరణ ఆధారపడి ఉన్నది. కనుక చరిత్ర నిర్మాణంలో, చరిత్ర రచనలో ఆధారాలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. మానవుడు సృష్టించి, ఉపయోగించి వదిలివెళ్ళిన అవశేషాలే చరిత్రకు ఆధారాలు. చారిత్రక సంఘటనలు ఒకప్పుడు నిజముగా జరిగినవే అయినా ఇప్పుడు కంటికి కనిపించేవి కావు. వాటి చిహ్నాలే వాటిని వాస్తవమైనవిగా చూపిస్తాయి. చరిత్రకారుడు ప్రత్యక్షంగా పనిచేసేది, ఈ చిహ్నాలతోనే, ఈ చిహ్నాల ద్వారానే అతడు గత సంఘటనల గురించి ఆలోచిస్తాడు. ఈ ఆధారాల సహాయంతోనే చరిత్రకారుడు గతకాల సంఘటనలను క్రమబద్ధమైన, తార్కికమైన, చరిత్ర కధనాన్ని పునర్నిర్మిస్తాడు. చారిత్రక కధనం నిర్దిష్టమైన ఆధారాలపై ఆధారపడింది.

చరిత్ర ఆధారాలను మౌలిక ఆధారాలు, మాధ్యమిక ఆధారాలు అనే రెండు రకాలుగా విభజింపవచ్చు.

### 7.2.1 మౌలిక ఆధారాలు :

గతకాలపు సంఘటనలు వదిలివెళ్లిన, అవశేష దృశ్య చిహ్నాలు మౌలిక ఆధారాలు. ఇవిగాక సంఘటనలతో ప్రత్యక్షముగా సంబంధం ఉన్నవారు లేదా ఆ సంఘటనలకు, ప్రత్యక్ష సాక్షులైనవారు, ఇచ్చిన వర్ణాలు మౌలిక ఆధారాలు. చెల్లాచెదురుగా ఉన్న క్లిష్టమైన, మౌలిక ఆధారాలను పొందికగా, అర్థవంతమైన, మాధ్యమిక ఆధారాలుగా మార్చుకోవడం చరిత్రకారుని పని. తనకు తానుగా మౌలిక ఆధారాల విషయంలో, కృషిచేయని వ్యక్తి, సమర్థుడైన చరిత్రకారునిగా రాణించడం కష్టం.

సులభంగా, సత్వరంగా లభించే అత్యధిక మౌలిక ఆధారాలు, పురావస్తు రూపంలో వున్న శిలాపనిముట్లు, బృహత్ సమాధులు, మట్టి పాత్రలు, హరప్పా, మెహంజదారో, లోధాల్ హస్తినాపుర, తక్షశిల, నలందా, విజయపురి అరికమేడు, లాంటి ప్రాచీన నగర నిర్మాణాలు. వేల సంఖ్యలో గుడి గోడలపై ఉన్న శిలాశాసనాలు, తామ్రశాసనాలు, త్రవ్వకాల్లో రాసులు, రాసులుగా లభ్యమయిన నాణేలు పురావస్తు వర్గం క్రిందకి వస్తాయి.

మౌఖికమైన లేదా లిఖితపూర్వకమైన సాక్ష్యరూపంలో లభించే, సమకాలిక సమాచారం కూడా మౌలిక ఆధారాలే. కథా గేయాలు, ఐతీహ్యాలు, జానపథ వీర గాధలు, యక్షగానాలు, ఆటవిక జాతుల వారితో లేక ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో జరిపే

ముఖాముఖి సమావేశాలు మౌఖిక సాంప్రదాయము క్రిందికి వస్తాయి. రాజ్యాంగాలు, సనదులు లేదా హక్కుల పత్రాలు, న్యాయస్థానం తీర్పులు, అధికార నివేదికలు, రికార్డులు, స్వీయచరిత్రలు, డైరీలు, ఉత్తర, ప్రత్యుత్తరాలు, ఒడంబడికలు, దస్తావేదులు, వీలునామాలు, అనుజ్ఞాపత్రాలు, వాజ్ఞ్మూలాలు, అధికార ప్రకటనలు, ధృవపత్రాలు, సచిత్ర సంచికలు, వార్తాపత్రికలు, చిత్రపటాలు, రేఖాపటాలు, గ్రంథాలు, కరపత్రాలు, చలనచిత్రాలు, జాబితాలు, వర్ణచిత్రాలు, పరిశోధన నివేదికలు మొదలగు లిఖిత పూర్వకమైన ఆధారాలు మౌలిక ఆధారాల క్రిందికే వస్తాయి.

### 7.2.2 మాధ్యమిక ఆధారాలు :

సంఘటనలతో ప్రత్యక్షంగా, సంబంధం ఉన్న వారు గాక సంఘటనకు, దేశ కాలాల రెండింటి దృష్ట్యా, దూరంగా వున్నవారు, ప్రత్యక్ష సాక్ష్యుల వర్ణనల సహాయంతో రూపొందించిన ఆధారాలను మాధ్యమిక ఆధారాలు అని పేర్కొనవచ్చు. ఈ మాధ్యమిక ఆధారాలు మౌలిక ఆధారాలపై, ఆధారపడినవే. సాధారణంగా చరిత్రకారుడు మొదట మాధ్యమిక ఆధారాలను అధ్యయనం చేస్తే, అతనికీ, నేపథ్యానికీ సంబంధించిన అవగాహన ఏర్పడుతుంది. అప్పుడే అతనికి మౌలిక ఆధారాలు, ఎక్కువగా ఉపయోగపడతాయి.

జె.యస్.మిల్ రచించిన 'హిస్టరి ఆఫ్ ఇండియా', ఓర్మ్ రచించిన మిలటరీ ట్రాన్‌సాక్షన్స్, డాడ్‌వెల్ రచించిన డూప్లే మరియు క్లైవును, హెచ్.టి.ప్రిన్సెస్ రచించిన "హిస్టరీ ఆఫ్ ది పొలిటికల్ యండ్ మిలటరీ ట్రాన్‌సాక్షన్స్ ఇన్ ఇండియా డ్యూరింగ్ ది ఎడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ది మార్క్విస్ హేస్టింగ్సు", జె.డి. కన్నింగ్ హామ్స్ రచించిన 'హిస్టరి ఆఫ్ ది సిక్స్", జేమ్సు ఫెర్గుసన్ 1875 లో రచించిన హిస్టరి ఆఫ్ ఇండియన్ అండ్ ఈస్టరన్ ఆర్కిటెక్చర్, వి.ఏ. స్మిత్ యొక్క ఎర్లి హిస్టరి ఆఫ్ ఇండియా, గ్రాండ్ డఫ్ యొక్క 'హిస్టరి ఆఫ్ ది మరఠాస్' ఎలిఫిన్ స్టన్ యొక్క హిస్టరి ఆఫ్ ఇండియా; కల్నల్‌టాడ్ యొక్క యానల్స్ యండ్ యాంటిక్విటీస్ ఆఫ్ రాజస్థాన్; ఆర్.జి. భండార్కర్ యొక్క 'యర్లి హిస్టరి ఆఫ్ ది డక్కన్; ఫ్లీట్ రచించిన ది డైనాస్టిస్ ఆఫ్ ది కనరీస్ డిస్ట్రిక్టు, ఈ.జే. రాపసన్ యొక్క 'ఇండియన్ కాయిన్స్ ఏంషియంట్ ఇండియా, మొదలగు గ్రంథాలు అన్ని ప్రామాణికమైన మాధ్యమిక ఆధారాలు.

మౌలిక, మాధ్యమిక ఆధారాల మధ్య ఉన్న తేడాను, ఆర్థర్ మార్విక్ తన గ్రంథమైన 'ది నేచర్ ఆఫ్ హిస్టరీ' లో ఈ క్రింది విధముగా తెలియచేసాడు. మౌలిక ఆధారం సామాన్య మానవుని కంటే నిపుణుడు అయిన చరిత్రకారునికి, ఎక్కువ అర్థవంతమైన ముడిసరుకు. ఒక క్రొత్త పరిశోధన అంశంపై, సాహసిస్తున్నప్పుడు, తన సామాన్య చరిత్ర జ్ఞానం విస్తృతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నపుడు చరిత్రకారుడు తాను చేపట్టబోయే కార్యానికీ, ప్రాతిపదిక చేసుకొనే చరిత్ర వ్యాసము లేదా గ్రంథము మాధ్యమిక ఆధారం.

## 3. చరిత్ర నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలు :

భారతదేశ చరిత్ర రచనకు, ఉపక్రమించే చరిత్రకారునికి, అనేక అడ్డంకులు ఎదురవుతాయి. ముఖ్యంగా ప్రాచీన కాలానికి సంబంధించిన చరిత్ర రచనలో ఈ ప్రతిబంధకాలు ఎక్కువ.

### 3.1 చారిత్రక గ్రంథాలు లేకపోవడం :

ప్రాచీన భారతదేశానికి సంబంధించిన అపారమైన సాహిత్యం సంస్కృత, , పాళ్ళి, ప్రాకృత భాషలో వుంది. కానీ ఈ మొత్తం సాహిత్యంలో కల్హనుని 'రాజతరంగిణి', మినహా ఇతర చారిత్రక గ్రంథాలు కనిపించవు. గజనీ మహమద్‌తోపాటు

భారతదేశానికి వచ్చిన, ముస్లీం చరిత్రకారుడైన ఆల్-బెరూనీ, "హిందువులు చారిత్రక విషయక్రమంలో తగు శ్రద్ధ చూపరు అనీ, ఎవరు రాజ్య పాలకులు అయినా వారు నిర్లక్ష్యంగా వున్నారని" తెలిపాడు. అపారంగా వున్న భారతీయ సాహిత్యంలోని విషయం ప్రధానంగా, మతపరంగానూ, తాత్వికముగానూ, పౌరాణికంగానూ, సాహితీ పరంగానూ మాత్రమే ఉంది. "సంస్కృత వాఙ్మయంలో గొప్ప మేధావులు ఉన్నా నిశిత దృష్టి కలిగిన చరిత్రకారుడు ఒక్కడు కూడా లేడు". అనీ ప్రముఖ సంస్కృత సాహిత్య చరిత్రకారుడైన కీట్ పేర్కొన్నాడు. సంస్కృత సాహిత్యంలో చారిత్రక అంశాలు, అక్కడక్కడ ఉదహరించబడటమో (లేదా) పరోక్షముగా పేర్కొనడమో జరిగనది. వేదాలు, ఇతిహాసాలు మొదలైనవి ఖచ్చితముగా, చారిత్ర అని చెప్పలేని విషయాలకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాయి. "చరిత్ర రచనపట్ల విముఖత, భారత సంస్కృతికి గొప్పలోపం" అనీ, ఆర్.సి. ముజుందర్ అన్నాడు. పుక్కిటి పురాణాల నుండి, మరిత్రాక్షరాల నుండి నిర్థిష్టమైన చరిత్రను గ్రహించడం, అంత తేలికైన పనికాదు. అందువల్లనే, అపారంగావున్న, సంస్కృత సాహిత్యంలో, చారిత్రక గ్రంథాలు లేకపోవటం బట్టి, ఆనాడు భారతీయులకు, చారిత్రక మనస్తత్వం లేదు అనే అనుమానం వస్తుంది. పైగా, పుట్టుకనుంచి చనిపోయేదాకా ఆనాటి ప్రజలకు, మతం, ఆధ్యాత్మికతలే పరమార్థమయ్యాయి. అందువల్ల వారికి చరిత్ర రచన వంటి లౌకిక, కార్యక్రమాలకు అవకాశం ఉండి, ఉండకపోవచ్చును అనీ కొందరు అభిప్రాయపడ్డారు. అయితే ప్రాచీన భారత సాహిత్యంలో చరిత్ర రచనకు పనికివచ్చే ముడిసరుకు చాలా వున్నది అని, ఆర్.సి. ముజుందర్, రోమిల్లా థాపర్ వంటివారు పేర్కొన్నారు.

### 7.3.2 ఆధారాలు సమగ్రముగా లేకపోవటం :

తక్షశిల, నలందా, పాటలీపుత్ర, నాగార్జుకొండ, కంచి మొదలగు చోట్లగల ప్రాచీన విశ్వవిద్యాలయాల్లో, పాశ్చాత్య పద్దతిలో చరిత్ర ఒక అధ్యయన విషయంగా, నిర్ణీత పాఠ్యక్రమంలో లేకపోవడం, దేశం రాజకీయంగా, సమైక్యముగా లేకపోవడంతో చరిత్రను రికార్డు చేయడంలో అనేక ఖాళీలు ఏర్పడటం, అంతేగాక కాలగతిలో అనేక చరిత్ర ఆధారాలు నాశనం కావడం, లభ్యమైన, లభ్యమవుతున్న ఆధారాలు, సమగ్రముగా లేకపోవడం మొదలగు కారణాలవల్ల, భారతదేశ చరిత్రకు సంబంధించి, అనేక అంశాలు నేటికీ, వివాదాస్పదంగానే మిగిలిపోవడం చరిత్రకారునికి అనేక సమస్యలను తెచ్చిపెడుతున్నది.

## 7.4 చారిత్రక యుగవిభజన :

చరిత్ర నిరాటంకముగా సాగే ప్రవాహం. అయితే చరిత్రకారుడు చరిత్రలో వచ్చిన మార్పులను వివరించడానికి సౌకర్యం కొరకు చరిత్రను యుగాలుగా విభజించాడు. భారతదేశంలో మానవుడు ఎపుడు అవతరించాడు అనేది స్పష్టముగా చెప్పలేము. బహుశా, మూడు లక్షల సంవత్సరాల క్రితం అంటే ప్లైస్టొసీన్ అనే హిమయగంలో ఆదిమమానవుడు ఆవర్జించి వుంటాడు. నాటి నుండి, నేటివరకు జరిగిన సంఘటనలను, చరిత్ర పూర్వయుగము (Pre Historic age), సంధి యుగం (Proto Historic age), చారిత్రక యుగం (Historic age) అని విభజించడం జరిగింది. మానవునికి చదవడం రాయడం (లిపి) తెలియని కాలాన్ని చరిత్ర పూర్వయుగమన్నారు. ఈ యుగ చరిత్రనే ప్రాక్ చరిత్ర అని కూడా అంటారు. ఈ యుగ చరిత్రకు నాటి మానవుడు ఉపయోగించి, వదిలివెళ్ళిన, భౌతిక అవశేషాలే ఆధారం. లిపి వాడకంతో చారిత్రక యుగం ప్రారంభమయ్యింది. అయితే 'లిపి' నాటి మానవునికి తెలిసిన, మనకు అర్థం కాకే కాలాన్ని అనగా హరప్పా సంస్కృతి కాలాన్ని (కాంస్య యుగం) సంధి యుగంగా పరిగణించబడింది.

భారతదేశ చరిత్ర కాలాన్ని సౌలభ్యం కొరకు ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాలుగా విభజించారు. అయితే ప్రాచీనయుగం ఎప్పుడు అంతమైంది, ఎప్పటి నుండి మధ్యయుగం ఆరంభమైంది, ఎప్పుడు మధ్యయుగం అంతమై ఆధునిక యుగం ఆరంభమైందనే విషయాల్లో చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. క్రీ.శ. 647 లో ప్రాచీన యుగం అంతమై, మధ్యయుగం ఆరంభమైనదని

కొందరు పండితులు పేర్కొనగా, మరికొందరు పండితులు మధ్యయుగము, క్రీ.శ. 1000 నుండి ప్రారంభమైందన్నారు. అయితే చరిత్ర రచనా సౌలభ్యం కొరకు, మధ్యయుగం క్రీ.శ. 1000 లో ఆధునిక యుగం క్రీ.శ. 1757 లో ప్రారంభమైనదిగా పరిగణించబడింది. ఈ విభజన ఖచ్చితమైనది కాదు.

### 7.4.1 ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు లభ్యమగు ఆధారాలు :

ప్రాచీన భారతదేశ చరిత్రకు లభ్యమగు ఆధారాలను, పురావస్తు, వాజ్మయ ఆధారాలనే రెండు ప్రధాన వర్గాలుగా విభజించవచ్చు. పురావస్తు ఆధారాలు తిరిగి మూడు వర్గాలుగా విభజింపబడినవి. అవి నిర్మాణాలు, శాసనాలు, నాణేలు. వాజ్మయ ఆధారాలనూ స్థూలముగా, దేశీయ వాజ్మయం, విదేశీయ వాజ్మయం అని రెండుగా విభజింపవచ్చు. దేశీయ వాజ్మయాన్ని మత వాజ్మయం, లౌకిక వాజ్మయం అని విభజింపవచ్చు. వైదిక వాజ్మయం, బౌద్ధ వాజ్మయం, జైన వాజ్మయం, మత వాజ్మయం క్రిందికి వస్తాయి. వైదిక వాజ్మయంలో వేదాలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు అను విభాగాలు కలవు. బౌద్ధ వాజ్మయంలో త్రిపీఠకాలు, నికాయలు, బుద్ధుని జీవిత చరిత్రలు, జాతక కధలు, సింహాళ బౌద్ధ గ్రంథాలు సాంప్రదాయాలు అనేవి, ఉప విభాగాలు. , జైన వాజ్మయంలో అంగాలు కల్పసూత్రాలు, సాంప్రదాయాలు మొదలగు విభాగాలు గలవు. లౌకిక వాజ్మయంలో చారిత్రక గ్రంథాలు, జీవిత చరిత్రలు, నాటకాలు, రాజకీయ గ్రంథాలు, శాస్త్రీయ సాంకేతిక గ్రంథాలు, తమిళ గ్రంథాలు కలవు. విదేశీ వాజ్మయంలో గ్రీకు, రోమన్, చైనా, ముస్లీం రచనలు కలవు.

బొమ్మ వేయవలెను

### 7.5 పురావస్తు ఆధారాలు :

ప్రాచీన భారతదేశ చరిత్రకు, పురావస్తు శాస్త్రం ప్రధానమైనది. పురాతన వస్తువులైన, రాతి పనిముట్లు, మట్టిపాత్రలు, లోహపరికరాలు, శిథిల కట్టడాలు, శిల్పాలు, చిత్రాలు, శాసనాలు, నాణేలు మొదలగువాటి గురించి వివరించే శాస్త్రాన్ని పురావస్తు శాస్త్రం అంటారు. లిపి ఆధారంగా చేసుకొని పురావస్తు శాస్త్రాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి చరిత్ర పూర్వయుగ పురావస్తు శాస్త్రం, చారిత్రకయుగ పురావస్తు శాస్త్రం. చరిత్ర పూర్వయుగంలోని మానవుని గురించి తెలుసుకోడానికి వారుపయోగించి వదిలిపెట్టి వెళ్ళిన సాధన సామగ్రియే అనగా వివిధరకాల రాతి పనిముట్లు ఆధారం. ఈ సాధన సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించి వారి జీవన విధానాన్ని తెలియచేసే శాస్త్రాన్ని, చరిత్ర పూర్వయుగ పురావస్తు శాస్త్రం అంటారు. ఈ కాలపు మానవునికి లిపి జ్ఞానం లేదు. లిపి జ్ఞానము అలవడినప్పటి నుండి, మానవుడు ఉపయోగించి, వదిలిపెట్టి వెళ్ళిన, అవశేషాల గురించి తెలియజేసే విభాగం చారిత్రక యుగ పురావస్తు శాస్త్రం. శాసనాలు, నాణేలు నిర్మాణాలు, శిల్పాలు, ఈ విభాగం క్రిందికి వస్తాయి. చరిత్ర పూర్వయుగ స్థావరాలను, చారిత్రక స్థలాలను, అన్వేషణ (ప్రాచీన వస్తువులు లభించే స్థలాల ఉనికిని కనుగొనడానికి చేసే ప్రయత్నాలే అన్వేషణ) ద్వారా కనుగొని అవసరం అయితే ఆ స్థలాల దగ్గర ఉత్ఖాతనాలు (ఒక నివేశన స్థలం దగ్గర నెలకొని ఉన్న సమాజం లేదా సమాజాల సంస్కృతి లేదా సంస్కృతుల గురించి జరుపు, త్రవ్వకపు పనే ఉత్ఖాతనం) జరిపి లభించిన వస్తువులను ఆధారంగా చేసుకొని ఆయా కాలాల సంస్కృతులను, పునర్ నిర్మిస్తారు. అందువల్లనే వీలర్ పండితుడు "పురావస్తు శాస్త్రజ్ఞుడు త్వ్వేది వస్తువులను కాదు ప్రజలను'' అని పేర్కొన్నాడు. అనగా పురావస్తు శాస్త్రజ్ఞుడు, ప్రాచీన కాలం నాటి ప్రజల జీవన విధానాన్ని వెలుగులోకి తెస్తాడు. పురావస్తు శాస్త్రజ్ఞుని సహాయంతో చరిత్రకారుడు అనేక ప్రాచీన చారిత్రక ఘట్టాలను వెలుగులోకి తెస్తాడు.

భారతదేశంలో పురావస్తు పరిశోధనలకు, ఐరోపావారు పునాదులు వేశారు. పురావస్తు సంబంధమైన పరిశోధనలు జరపడానికి, 1774 లో సర్.విలియమ్ జోన్స్ ఆధ్వర్యంలో కలకత్తాలో "ఏసియాటిక్ సొసైటి ఆఫ్ బెంగాల్" అనే సంస్థ స్థాపించబడింది. ఈ సంస్థ అనేక పురాతన శాసనాలను సేకరించింది. ఈ శాసనాలలోని బ్రాహ్మిలిపినే 1838 లో జేమ్స్ ప్రిన్స్‌ప్ పఠించడంతో శాసనాలు చరిత్ర రచనకు ఉపయోగపడ్డాయి. భారత ప్రభుత్వ పురావస్తు పర్యవేక్షకుడిగా, 1862 లో నియమించబడిన కన్నింగ్‌హామ్ పురావస్తు పరిశోధనా రంగంలో గొప్ప కృషి చేశాడు. ఖర్జన్ ప్రభువు భారత పురావస్తు శాఖను నెలకొల్పాడు. భారత స్వాతంత్ర్యానంతరం నెలకొల్పబడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో గల పురావస్తు శాఖలు, విశ్వవిద్యాలయాల్లో గల పురావస్తు శాఖలు పురావస్తు పరిశోధనల్లో గొప్ప కృషి చేస్తున్నాయి.

భారత చరిత్ర రచనకు, ఉపకరించే పురావస్తు ఆధారాలను నిర్మాణాలు, శాసనాలు, నాణేలు, అను మూడు భాగాలు చేయవచ్చు.

#### 7.5.1 నిర్మాణాలు :

రాతి పనిముట్లు, మట్టిపాత్రలు, శిథిలమైన కట్టడాలు, శిల్పాలు, చిత్రాలు,ఇతర భౌతిక అవశేషాలను, నిర్మాణ విభాగంలో చేర్చవచ్చు.

మద్రాస్ సమీపంలోని పల్లవరం వద్ద 1863 లో రాబర్ట్ బ్రూస్‌ఫ్యూట్ రాతి గొడ్డళ్ళు, ప్రథమంగా కనుగొనడంతో భారతదేశంలో చరిత్ర పూర్వయుగ చరిత్ర వెలుగులోకి వచ్చింది. ఆ తదుపరి కమియోడ్ బర్కిట్, మాండ్లీ, పీటర్‌సన్, కృష్ణస్వామి, సౌందర్ రాజన్, సరికాలియా, మొదలగువారు జరిపిన పరిశోధనల వల్ల, భారతదేశంలోని అనేక ప్రాంతాలలో శిలాయుగ పనిముట్లు, శిలాపనిముట్ల కర్తలు, వారు చంపి తినిన జంతు అవశేషాలు, మట్టిపాత్రలు, చిత్రాలు, మొదలగునవి వెలుగులోకి

వచ్చాయి. తద్వారా చరిత్ర పూర్వయుగ చరిత్ర పునర్ నిర్మించడం జరిగింది. ఆహర్, మాల్వా, కాయథా మొదలగుచోట్ల బయల్పడిన భౌతిక అవశేషాల సహాయంతో తామ్ర శిలాయుగ చరిత్ర తెలుసుకోగలుగుతున్నాం. బాబింగ్‌టన్, జేమ్స్ ఫెర్‌గ్యూసన్, కృష్ణస్వామి, మొదలగువారు. దక్షిణ భారతదేశంలో సమాధుల వద్ద జరిపిన త్రవ్వకాల ఫలితముగా, బృహత్ శిలాయుగ లేక అమోయుగ చరిత్ర వెలుగులోకి వచ్చింది.

ఆమ్రి వద్ద 1929లో ఎన్.సి. మజుందార్, కోట్ డిజియన్ వద్ద 1955-57 సంవత్సరాల్లో ఎఫ్.ఎ.ఖాన్, కాలిభంగన్ వద్ద, ఎ.ఘోష్ సాగించిన ఉత్ఖాతనాల వల్ల, పూర్వ హరప్పా నాగరికత వెలుగులోకి వచ్చింది. అంతేగాక ఇచ్చట జరిగిన పరిశోధనల వల్ల, హరప్పా నాగరికతా సింధులోయా వెలుపల ప్రాంతాల నుంచి, రాలేదు అని స్పష్టమౌతుంది.

హరప్పా, మెహంజిదారో, లోథాల్, కాళిబంగన్, దయిమాబాద్ దోల్‌వీరా, రూపార్, రంగపూర్ మొదలుగాగల 14 వందల స్థావరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ స్థావరాల్లో బయల్పడిన అవశేషాలు చరిత్ర గతినే మలుపుతిప్పాయి. ఇచ్చట బయల్పడిన ఆధారాల వల్ల భారతీయ సంస్కృతి అతి ప్రాచీనమైనదనీ ఈజిప్ట్, మెసపటోమియా, నాగరికతలకు సమకాలికం అనీ తేలింది. ప్రాచీన ప్రపంచంలో ఎక్కడాలేనటువంటి మురుగునీటి పారుదల సౌకర్యం ఈ స్థావరాల్లో బయల్పడటం, సువిశాల భూభాగంలో ఈ నాగరికత విస్తరించడం దీని విశిష్ట లక్షణాలు, సర్.జాన్. మార్షల్, ఆర్.డి. బెనర్జీ, దయారామ్ సాహినీ, వీలర్, మాసస్, కన్నింగ్‌హామ్, ఫ్లీట్, డేమ్స్, వాట్స్, గడ్స్, బ్రున్స్‌విగ్, పుసల్కర్, మాకే, మొదలగువారి కృషి ఫలితముగా ఈ నాగరికత వెలుగులోకి వచ్చింది.

తక్షశిల ప్రాంతంలో పురావస్తు శాస్త్రజ్ఞులు జరిపిన త్రవ్వకాల ఫలితంగా, కుషాణుల గురించి కొంత సమాచారం లభించింది. కుమ్రహార్, పాట్నా సమీపంలోని బులందిభాగ్ వద్ద జరిపిన పురావస్తు త్రవ్వకాల్లో, మౌర్యుల రాజప్రాసాదం బయల్పడింది. ఇది మౌర్యుల కాలం నాటి వాస్తు పద్ధతులను తెలియజేస్తుంది. అశోకుని స్థంబాలు వాటిపై జంతువుల శిరస్సుల చిహ్నాలు, స్థూపాలు, గుహలు, టెర్రాకోట్ (మట్టితో చేయబడిన) వస్తువులు, మొదలైనవి మౌర్యుల కళా సాంప్రదాయాలను తెలియజేస్తున్నాయి. బేస్‌నగర్, దిధార్‌గంజి లలో లభ్యమయిన శిల్పాలు, మౌర్యులనాటి జనప్రియ, కళకు నిదర్శనాలు.

నలందా, సారనాథ్, హస్తినాపురం, నాగార్జున కొండ, అరికమేడు, మొదలగు ప్రాంతాల్లో జరిపిన ఉత్ఖాతనాలు సమకాలికా, మతసాంఘిక జీవనాన్ని, ప్రాచీన భారతీయ, వాస్తు శిల్పకళా నైపుణ్యాలను ప్రతిబింబిస్తున్నాయి. ఇక్ష్వాకుల కాలంలో నాగార్జునకొండలో బౌద్ధ, శైవ, వైష్ణవ, శాక్తేయ మతాలవారు కలసి, సహజీవనం చేసినట్లు అచట బయల్పడిన నిర్మాణాలు ధృవపరుస్తున్నాయి. లాంగ్‌హర్ట్స్, రామచంద్రన్, రాయప్రోలు సుబ్రహ్మణ్యం జరిపిన ఉత్ఖాతనాల వల్లే నాగార్జున కొండలోని విజయపురి ఇక్ష్వాకుల చరిత్ర వెలుగులోకి వచ్చింది.

మౌర్య, కుషాణ్, శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలో సాంచి, సారనాథ్, తక్షశిల, బార్‌హుత్, అమరావతి, జగ్గయ్యపేట, ఘంటశాల, బట్టిప్రోలు, చందవరం మొదలగు అనేకచోట్ల స్థూపవిహారాలు నిర్మించబడ్డాయి. ఇవి బౌద్ధ వాస్తు చరిత్రకు సమకాలికా సంస్కృతికీ తార్కాణాలు. బీహార్‌లోని సుధామ, లోమస్ ఋషి గుహలు, మహారాష్ట్రలో భాజా, బేడ్‌సా, జున్నార్, కార్‌హి, కన్హెహెరి, ఎలిఫెంటా, నాసిక్, అజంతా, ఎల్లోరా, మొగల్‌రాజపురం, ఉండవల్లి, భైరవకోన, మహాబలిపురం, మొదలగుచోట్ల కొండలలో ఆలయాలు, విహారాలు తొలిపించబడ్డాయి. ఇవి నాటి మత విశ్వాసాలు, ఆచారాలు, నిర్మాణ కౌసల్యానికి సౌందర్యదృష్టికీ నిదర్శనాలు.

ఉత్తర భారతదేశంలో గుప్తయుగం నుండి, దక్షిణ భారతదేశంలో శాతవాహన, ఇక్ష్వాక యుగం నుండి, అనేకచోట్ల, ఆలయాలు నిర్మించబడ్డాయి. దేవఘర్‌లోని దశావతార ఆలయం, తిగావాలోని విష్ణుఆలయం, భూమ్రాలోని శివాలయం,

నాచనవద్ద గల పార్వతీ ఆలయం, గుప్త వాస్తు కళా సంపదకు తార్కాణాలు. నాగరశైలికి తొలిరూపం ఇచ్చింది గుప్తులే. గుప్తులు వైష్ణవానికి ఇచ్చిన ప్రాముఖ్యం ఉదయగిరి గుహలోని శిల్పాలను బట్టి గ్రహించవచ్చు.

భువనేశ్వర్, పూరి, కోణార్క్, మోడెరా, ఖజురహో, మహాబలిపురం, కంచి, తంజావూరు, గంగైకొండ చోళపురం, మధుర, చిదంబరం, బాదామి, పట్టడకల్, ఐహోల్, హాలెబీడు, బేలూరు, హంపి, హనుమకొండ, పాలంపేట, తిరుపతి, లేపాక్షి, మొదలగుచోట్ల గల ఆలయాలు, సమకాలిక సాంస్కృతిక వైభవంతో పాటు నాటి ప్రజా జీవనాన్ని సూచిస్తున్నాయి. ఈ ఆలయాల పరిశీలన ద్వారా భారతదేశ దేవాలయాల వాస్తు లక్షణాలను గ్రహించవచ్చును.

శిలావిగ్రహాలు, లోహ విగ్రహాలు కళా నైపుణ్యానికీ, సమకాలిక సంస్కృతికీ నిదర్శనాలు. దేవాలయాల స్థంభాల నిండా, కుడ్యభాగాల మీదా అపారమైన శిల్పసంపద వుంది. అజంతా, బాగ్, చిత్తనవాసల్, తంజావూర్, లేపాక్షి, బిల్లసర్గం మొదలగుచోట్ల గల వర్ణచిత్రాలు నాటి చిత్రకళా నైపుణ్యంతో పాటు సమకాలికా మతసాంఘిక పరిస్థితులను తెలియజేస్తున్నాయి.

ఆగ్నేయ ఆసియా దేశాల్లో, తూర్పు ఐరోపాదేశాల్లో లభ్యమౌతున్న భౌతిక అవశేషాలు, ప్రాచీన కాలంలో ఆయాదేశాలతో భారతదేశానికీ ఉన్న వర్తక, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలకు సాక్ష్యాలుగా నిలిచాయి.

ప్రాచీన భారతదేశ చరిత్రకు లభ్యమయ్యే పురావస్తు ఆధారాల్లో మృణ్మయ పాత్రలు, కుండ పెంకులు ప్రముఖంగా నిలుస్తాయి. ఇవి ముఖ్యంగా చరిత్ర పూర్వయుగానికీ, సంధి యుగ చరిత్రకు ముఖ్య ఆధారం. లభ్యమైన కుండపెంకుల సహాయంతో ఒక స్థావరంలో నెలకొన్న సంస్కృతి యొక్క కాలం నిర్ణయించవచ్చు. సింధూ త్రవ్వకాల్లో బయల్పడిన మట్టిపాత్రలపై, వివిధ రంగులతో, పశుపక్ష్యాదులు, లతలు కనిపిస్తాయి. ఇవి సింధూ ప్రజల కళాదృష్టికీ, నైపుణ్యానికీ నిదర్శనాలు. హస్తినాపురం వద్ద, తామ్రవిక్షేప, సంస్కృతికి చెందిన, ఓకర్ రంగు పాత్రలు లభించాయి. 'పెయింటెడ్ గ్రేవేర్' లభ్యమైన ప్రాంతాల ద్వారా ఆర్యుల వలసలు గ్రహించవచ్చు. 'నార్తరన్ బ్లాక్ పాలిష్‌డ్‌వేర్' లభ్యమైన స్థావరాలను బట్టి మౌర్య సామ్రాజ్య విస్తృతిని గ్రహించవచ్చు. అమరావతి, అరికమేడు వద్ద లభించిన 'రౌలెటెడ్‌వేర్' ద్వారా ప్రాచీన కాలంలో రోమ్‌కు, భారతదేశానికీ మధ్య గల వ్యాపార సంబంధం గ్రహించవచ్చు. గుప్తయుగానికి చెందని విష్ణు, కార్తికేయ సూర్య, దుర్గ కుబేరనాగ, మొదలగు వృణ్మయ విగ్రహాలు రాజిగిరి, హస్తినాపురం ఐహితత్రం మొదలగుచోట్ల లభించాయి. ఈ అవశేషాలను బట్టి నాడు బంకమట్టితో శిల్పాలు తయారుచేసేవారి నైపుణ్యం గ్రహించవచ్చు. ఈ కాలపు ఎర్రటి మృణ్మయపాత్రలు ప్రత్యేకంగా గమనించదగ్గవి.

సింధూ త్రవ్వకాల్లో బయల్పడిన ముద్రికలపై గల బొమ్మలను బట్టి నాటి మత విశ్వాసాలు గ్రహించవచ్చు. ఈ ముద్రికలపైనే సాంకేతిక పరమైన లిపి ఉంది. ఈ లిపి, ఇప్పటివరకు పరిష్కరింపబడలేదు. ముజఫర్‌పూర్ జిల్లాలోని వైశాలి వద్ద లభించిన ముద్రలు, ఆ కాలపు రాష్ట్రపాలనా శ్రేణుల కార్యకలాపాల గురించి, అవగాహన చేసుకోటానికీ ఉపయోగపడుతున్నాయి.

ఈ విధంగా గత మానవుడు వదిలివెళ్ళిన రాతి పనిముట్లు, మట్టిపాత్రలు, గృహ సమాధులు, బౌద్ధ, హిందూ నిర్మాణాలు వాటిలోని శిల్ప, చిత్రలేఖనాలు, భారతీయ సంస్కృతీ పరిణామక్రమాన్ని తెలియజేస్తున్నాయి. వీటివల్ల ఆనాటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను, కాళాభిరుచులను గ్రహించడానికీ వీలుగలుగుతుంది. స్థూపాలు ఆలయాలపై అలంకరించబడిన శిల్పాలు, చిత్రలేఖనాల వల్ల నాటి సాంఘిక జీవనం నాటి ప్రజలు వాడిన గృహోపకరణాలు, ఆభరణాలు, వస్త్రాలు, వాయిద్యాలు, ఆయుధాలు, మొదలగు వాటికి సంబంధించిన వివరాలు తెలుస్తున్నాయి.

### 7.5.2 శాసనాలు :

ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు, శాసనాలే ముఖ్య ఆధారాలు. "ఈ శాసనాలు ఏ దేశానికి చెందినవో ఆ దేశ ఆ కాలం నాటి రాజకీయ సాంఘిక, ఆర్థిక పరిస్థితులను తెలుసుకోడానికి అవి అమూల్యమైన ఆధారాలు'' అని 'రాప్సన్' పండితుడు

అన్నాడు. రాజులుగానీ, సామాన్యులు గాని, తాము సాధించిన విజయాలను, చేసిన దానాలను తెలియజేస్తూ, రాయి లేదా లోహం మీద రాయించిన ప్రకటనలను శాసనాలు అంటారు. ఇవి బ్రాహ్మీలిపిలో గానీ, ఖరోష్ఠి లిపిలో గానీ తెలుగు, కన్నడ, లేదా తమిళ లిపిలో గానీ వ్రాయబడ్డాయి. సంస్కృత, ప్రాకృత, పాళి, తమిళ, తెలుగు భాషలలో శాసనాలు కనిపిస్తాయి. ఇవి శిలాక్షరాలు అయినందువల్ల సంశయానికి తావులేని సాక్ష్యాలు. గ్రంథాలలో అయితే మార్పులకు చేర్పులకు అవకాశం ఉంది. కానీ శాసనాల్లో మార్పులకు చేర్పులకు అవకాశం లేదు. అందువల్లనే సాహిత్యం కంటే శాసనాలే ముఖ్య ప్రమాణాలు. కవిత్వపు వాసనలతో అతిసయోక్తులకు, ఉత్ప్రేక్షలకు, తావు ఉన్న కొన్ని సందర్భాల్లో పేర్కొన్న అంశాలు సమగ్రంగా లేకపోయినా ప్రాచీన భారతదేశ చరిత్రకు శాసనాలే ముఖ్య ఆధారాలు.

భారతదేశంలో ప్రథమంగా శాసనాలు వేయించినవాడు మౌర్య అశోకుడు. భారతదేశంలో దేవాలయాల్లో, వేలకొలది శాసనాలున్నాయి. ఇవి చరిత్ర రచనకు ముఖ్యంగా ప్రాంతీయ చరిత్ర రచనకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ శాసనాల్లో భౌగోళిక పరిస్థితి, రాజవంశంలో రాజు పేరు, పరిపాలనా కాలం, దండయాత్రలు, యజ్ఞయాగాదులు, పరిపాలనా వ్యవస్థ సమకాలికా ఆర్థిక, మత, సాంస్కృతిక విషయాలను పేర్కొన్నారు.

భారతదేశ చరిత్రకు ప్రామాణిక ఆధారభూతమైన, శాసనాలు లక్షకు పైగా లభించాయి. వీటికి తోడు, ఏటా వందల సంఖ్యలో లక్షకు పైగా లభించాయి. వీటికి తోడు ఏటా వందల సంఖ్యలో శాసనాలు లభిస్తూనే ఉన్నాయి. మొదట జేమ్స్ ప్రిన్స్‌ఫ్ శాసనాల్లోని బ్రాహ్మీ లిపినీ అర్థం చేసుకొన్నారు. బర్నేల్, **1878** లో దక్షిణదేశ లిపులను గురించి, ఒక గ్రంథం వ్రాసాడు. బుహ్లర్ జర్మన్ భాషలో వ్రాసిన లిపి - వివరాలను ఫ్లీట్ అను పండితుడు ఇండియన్ ఆంటిక్వేరి లో అనువదించి, ముద్రించాడు. గోపినాథరావు, టి.యన్. సుబ్రహ్మణ్యం, శివరామమూర్తి లిపి పుట్టుపూర్వత్తరాల గురించి గ్రంథాలు వ్రాశారు. 'ఎపిగ్రాఫియా ఇండికా' అనే పేరుతో **28** భాగాలలో దాదపు **40** వేల శాసనాల పాఠాలు ప్రచురింపబడ్డాయి. **1915** వరకు సంగ్రహించిన శాసనాలను రంగాచారి మద్రాస్ ప్రెసిడెన్సీ శాసనాలు అనే పేరుతో ప్రచురించాడు. దక్షణ దేశ చారిత్రక, శాసనాలు అనే పేరుతో సి.వేల్ ఒక గ్రంథం వ్రాసాడు. శాసనాల పరిశోధనలో డి.సి. సర్కార్ గొప్ప కృషి చేసాడు. వీరందరి కృషివల్ల, భారతదేశ చరిత్ర రచన నవీన పోకడలతో సజీవంగా సాగుతుంది.

శాసనాలను, వాటి విషయ విశ్లేషణను బట్టి అనేక వర్గాలుగా విభజింపవచ్చు. అవి పరిపాలనా శాసనాలు, ప్రశస్తులు, ప్రబోధాలు, అంకిత శాసనాలు, స్మారక శాసనాలు, దాన శాసనాలు, వ్యాపార శాసనాలు, మంత్ర శాసనాలు, మత శాసనాలు, సాహిత్య శాసనాలు, విదేశీ శాసనాలు.

భారతదేశంలో లభ్యమైన అనేక ప్రాచీన శాసనాలు శిలల మీద, లోహ రేకుల మీద రాయబడ్డాయి. ఇవిగాక ఇంకా భూర్జపత్రాల మీదా, తాళపత్రాల మీద అక్షరాలు రాసారు. లోహాలలో రాగి, వెండి, కంచు, ఇనుము ఉపయోగించారు. ప్రాచీన కాలంలో వ్రాతకు ఇటుకలు, మట్టి ముద్రలు, చర్మం, వస్త్రాలు కూడా ఉపయోగించారు.

శాసన రచనల్లో ముఖ్యంగా తామ్ర శాసనాల్లో సాధారణంగా ఒక క్రమపద్ధతిని అనుసరించారు. శాసనంలో మొదట మంగళవాచకం దైవ స్తుతి, తరువాత వంశ స్తుతి, విషయ ప్రస్తావన, దీవెన, శాపం, శాసనకాలం ఉంటాయి. వీటిలో వంశస్తుతి, విషయ ప్రస్తావన శాసనకాలం చరిత్రకు ముఖ్యం. శాసనం, దాన శాసనం అయితే అందులో దాత, దాని స్వీకర్త, దానం, దానకాలం లేఖకుని వివరాలు ఉంటాయి.

## రాజకీయ చరిత్ర :

ప్రాచీన భారతదేశ, రాజకీయ చరిత్ర రచనకు శాసనాలు ముఖ్య ఆధారం. శాసనాల వల్ల భిన్నకాలంలో పాలించిన రాజులు, వారి ఘనకార్యాలు తెలుసుకోగలుగుతున్నాము. "కేవలం శాసనాల శాస్త్రీయమైన పరిశోధనల వల్లనే ప్రాచీన భారతదేశ

రాజకీయ చరిత్ర వెలుగులోకి వచ్చింది''. అనీ ఫ్లీట్ అంటాడు. రాజకీయ చరిత్రకు ఉపయోగపడే శాసనాల్లో ముఖ్యమైనవి అశోకుని శిలాశాసనాలు, ఖారవేలుని, హాతిగుంఫాశాసనం, గౌతమి బాలశ్రీ నాసిక్ శాసనం, రుద్రదమనుని జోనాఘడ్ శాసనం, సముద్రగుప్తుని అలహాబాద్ శాసనం, చంద్రుని మేహారాలీ శాసనం, రెండో పులకేశి ఐహోల్ శాసనం మొదలగునవి.

అశోకుని 13వ శిలాశాసనం వల్ల కళింగ యుద్ధం గురించి తెలుస్తుంది. అశోకుడు ప్రతిష్టించిన శాసనాల స్థాలాల ఆధారంగా మౌర్య సామ్రాజ్య సరిహద్దులు నిర్ణయించడానికి వీలౌతుంది.

ఒరిస్సాలో ఉదయగిరి గుహలోగల హాతిగుంఫా శాసనం ద్వారా ఖారవేలునీ జీవిత విశేషాలు తెలుస్తున్నాయి. నాగనిక వేయించిన నానఘాట్ శాసనం వల్ల మొదటి శాతకర్ణి గొప్పతనం నాటి రాజకీయ ఆర్థిక పరిస్థితులు తెలుస్తున్నాయి. గౌతమి బాలశ్రీ వేయించిన నాసిక్ శాసనంలో, గౌతమి పుత్ర శాతకర్ణి దిగ్విజయాలు వివరించబడి ఉన్నది.

అలహాబాద్ ప్రశస్తి వల్లనే గుప్తరాజు అయిన సముద్రగుప్తుని దిగ్విజయాలు తెలుస్తున్నాయి. రవికీర్తి వేయించిన ఐహోల్ శాసనంలో బాదామి చాళుక్య వంశ వృక్షం. రెండో పులకేశి దిగ్విజయాలు వివరించబడి ఉంది. కులోత్తుంగుని శాసనాలు పారాంతకుని ఉత్తర మీరూర్ శాసనం, చోళుల పరిపాలనా విధానానికి ముఖ్య ఆధారాలు. బన్సిఖేర్, మధువన్ శాసనాలు హర్షుని రాజ్య ఆరంభకాలపు పరిస్థితులు తెలుసుకోడానికి ఉపయోగపడుతున్నాయి. నౌశాసి తామ్ర ఫలకం వల్లభి రాజ్యంపై హర్షుడు సాధించిన విజయం గురించి వివరిస్తుంది. ఇక్ష్వాకుల చరిత్రకు ముఖ్య ఆధారాలు రెంటాల, కేశనపల్లి వద్ద ఉనన శాంతమాలినీ శాసనాలు, నాగార్జునకొండ వద్ద ఉన్న శాంతి శ్రీ కొడబలిశ్రీ శాసనాలు, వీరపురుషదత్తుని నాగార్జున కొండ శాసనం. వీరపురుషదత్తుని జగ్గయ్యపేట శాసనం. చేజర్ల, గోరంట్ల మట్టిపాడు శాసనాలు, ఆనంద గోత్ర రాజుల చరిత్రను తెలియజేస్తున్నాయి. బృహత్‌పలాయన వంశ చరిత్రకు జయవర్మ వేయించిన కొండముది తామ్రశాసనం ఒక్కటే ఆధారం. శాలంకాయన వంశ చరిత్రకు ఎలూరు, కానుపొల్లు శాసనాలు, ఆదండవర్మ, నందివర్మ, కస్తి వర్మల శాసనాలు ఆధారాలు. గోవింద వర్మ, తుమ్మల గూడం శాసనం మాధవ వర్మ ఈపూరు శాసనం, వేల్పూరూ రామతర్థిం చిక్కుళ్ళ, ఇంద్రాపాలనగర శాసనాలు, విష్ణుకుండినల చరిత్రను తెలియజేస్తున్నాయి. ప్రాచీన పల్లవుల చరిత్రకు ఆధారాలు సింహవర్మ మంచి కల్ల శాసనం, శివస్కంధ మైధవోలు, హిరహడగళ్ళి శాసనాలు. ఇంకా అనేక సంస్కృత శాసనాలు కూడా ప్రాచీన పల్లవుల చరిత్ర గురించి తెలియజేస్తున్నాయి. వేంగి చాళుక్యుల చరిత్రకు ముఖ్య ఆధారం శిలా తామ్ర శాసనాలే.

శాసనాల ఉనికి, వాటిలోని విషయాలను బట్టి చక్రవర్తుల వ్యక్తిగత గుణగణాలు సైనిక దండయాత్రలు రాజ్య విస్తీర్ణం నిర్ణయించవచ్చు. రాజుల పాలనాకాలపు పరిస్థితులను తెలుసుకోవచ్చు. శాసన లిపి లక్షణాలను బట్టి, దేవాలయ కాల నిర్ణయం చేయవచ్చు. ఇంకా కొన్ని శాసనాల్లో, ప్రాంతీయ విభాగాల, వివిధ ఉద్యోగుల గురించి, వివరాలు కనిపిస్తాయి.

**ఆర్థిక చరిత్ర :**

శాసనాల ద్వారా ప్రాచీన భారత, ఆర్థిక చరిత్ర గ్రహించవచ్చు. శాతవాహనుల శాసనాల్లో కనిపించే కోలిక (సాలె), కులార (కమ్మరి), తిలపిశక (తైలపులు), కసకార (కంచరి), కమర (కమ్మరి), స్వవనక (స్వర్ణకార) అను చేతి పనివారి ప్రస్తావనలను బట్టి ఆ కాలంలో ఆయా పరిశ్రమలు విరివిగా సాగుతున్నట్లు, ప్రతీ పరిశ్రమలోని చేతిపనివారు ఒక శ్రేణిగా ఏర్పడినట్లు గ్రహించవచ్చు. ఈ శ్రేణులు నేటి బ్యాంకు వలె పనిచేసేవి అని ఋషభదత్తుని నాసిక్ శాసనం ద్వారా తెలుస్తుంది. రుద్రదాముని జునాఘడ్ శాసనంలో సౌరాష్ట్రంలో మౌర్యుల కాలంనాటి సుదర్శన తటాకాన్ని బాగుచేసినట్లు ప్రస్తావించబడి ఉన్నది. శాసనాలను బట్టి వ్యవసాయ అభివృద్ధికీ, మంచినీటి సౌకర్యం కొరకు కాకతీయ విజయనగర, రెడ్డి రాజులు కృషి చేసినట్లు గ్రహించవచ్చు. ఇందుకు చక్కటి నిదర్శనం కొండవీటికి సమీపంలో ఉన్న పెదకోమటి వేమారెడ్డి సంతాన సాగర శాసనం. కాకతి గణపతి దేవుని

విజయనగర మొదటి దేవరాయల, మోటుపల్లీ శాసనాల వల్ల స్వదేశీ, విదేశీ వ్యాపారం గురించి తెలుసుకోవచ్చు. శాసనాల్లో ఆనాడు వాడుకలో ఉన్నా నాణేల గురించి పేర్కొనబడింది. దేవాలయాల నిర్వహణ, వాటి ఆదాయ, వ్యయాలు శాసనాల ద్వారా తెలుస్తుంది.

## మత చరిత్ర :

శాసనాల ద్వారా ప్రాచీన భారత మత పరిస్థితులను గురించి తెలుసుకోవచ్చు. శాసనాలు దేవాలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన, దానధర్మాల గురించి వివరిస్తాయి. అశోకుని శాసనాల వల్ల అతడు బౌద్ధానికి చేసిన సేవ, ధర్మప్రచారం కోసం తీసుకున్న చర్యలు తెలుస్తుంది. శుంగులు, శాతవాహనులు బ్రాహ్మణ మతాభిమానులు అయినప్పటికీ వారు బౌద్ధాన్ని ఆదరించినట్లు శాసనాలనుబట్టి గ్రహించవచ్చు. హెవిడోరస్ అనే గ్రీకు రాయబారి వాసుదేవ భక్తుడై, గరుడ స్థంభాన్ని ప్రతిష్ఠించినట్లు, బేస్‌నగర్ గరుడ స్తంభ శాసనం వల్లన తెలుస్తుంది. శాతవాహన రాజు మూడో శాతకర్ణి వైదిక క్రతువులు చేసి, గోవులను, కార్షాపణాలను దానం చేసినట్లు నాన్‌ఘాట్ శాసనం వల్ల తెలుస్తుంది. గుప్త చక్రవర్తులు, పరమ భాగవతులమనీ, తన శాసనాల్లో చెప్పుకున్నారు. ఎర్రన్ శాసనంలో విష్ణుదేవాలయ ప్రశస్తి ఉంది. పద్మసాలీలు సూర్యునికి, ఆలయం నిర్మించినట్లు అది పాడుకాగా తిరిగి పునర్‌నిర్మించినట్లు మందసోర్ శాసనంలో ప్రస్తావించబడి వున్నది.

త్రిపురాంతకం, మల్కాపురం శాసనాలనుబట్టి కాకతీయుల కాలంలో శైవ మతంలో అనేక శాఖలు ఉన్నట్లు తెలుస్తుంది. రుద్రాంబ మల్కాపురం శాసనంలో 'గోళకీమఠం' చేపట్టిన ప్రజాహిత చర్యలు ప్రస్తావించబడినవి. తిరుపతి, తంజావూర్, కంచి మొదలగుచోట్ల గల శాసనాలు ఆలయ నిర్మాణం గురించి, దానాల గురించి, దేవాలయాలకు సంబంధించిన వివిధ అంశాలను తెలుపుతున్నాయి.

## సాహిత్య చరిత్ర :

ప్రాచీన భారతదేశంలోని భాషా సరస్వతాల గురించి, శాసనాల్లో ఉన్నా వివిధ భాషలవిపులు గురించి తెలియజేస్తున్నాయి. అశోకుని నాటి బ్రాహ్మి లిపి, అందులో వచ్చిన ప్రాంతీయ విభేధాలు శాసనాల వల్ల గ్రహించవచ్చు. తెలుగు, తమిళ, కన్నడ విపులు, ఏ రకంగా, బ్రాహ్మి నుంచి వేరు అయ్యిందో శాసనాల వల్ల తెలుస్తుంది. తెలుగు, కన్నడ లిపి, భాష పరిణామక్రమం, ప్రగతిని శాసనాలవల్ల గ్రహించవచ్చు. కొన్ని శాసనాలు చక్కగా కవిత్వంలో వ్రాయబడ్డాయి. అలహాబాద్, ప్రశ స్తి, ఐహోల్ శాసనం, ఈ వర్గానికే చెందినవి. ఐహోల్ శాసనకర్త, రవికీర్తి, తనకుతాను కాళిదాసుతో పోల్చుకుంటాడు. కొన్ని శాసనాల్లో ఆనాటి కావ్యాలు పూర్తిగా లిఖించబడ్డాయి. పల్లవరాజు మొదటి మహేంద్రవర్మ కుడిమియామిలై శాసనంలో సంగీత పాఠాలు ఉన్నాయి. ఆనాటి చోళుల శాసనాలు, జయసింహుని విప్పర్ల శాసనం, పాండురంగనీ అద్దంకి శాసనం, తెలుగుభాషా పరిణామ ప్రగతికి నిదర్శనాలు.

## వాస్తు, శిల్ప చరిత్ర :

శాసనాల ద్వారా బౌద్ధ స్థూపాల, దేవాలయాల నిర్మాణక్రమం, వాస్తుశిల్పశైలి, కాలక్రమంలో అందులో వచ్చిన మార్పులు తెలుసుకోవచ్చు. దేవాలయ స్థూపాల నిర్మాణం గురించి, విగ్రహ ప్రతిష్ఠాపన గురించి, దాన వివరాల గురించి శాసనాల్లో ప్రస్తావించబడింది. తద్వారా స్థూపాలను, దేవాలయాలనూ ఎవరు, ఎప్పుడు నిర్మించారు, ఎందుకోసం నిర్మించారు మొదలగు విషయాలు తెలుసుకోవచ్చు.

**విదేశీ శాసనాలు :**

విదేశాల్లో దొరికిన శాసనాలు కూడా భారతదేశ చరిత్రను పునర్ నిర్మించడంలో ఉపయోగపడుతున్నాయి. హరప్పా ప్రాంతం నుండి, దిగుమతి చేసుకుంటూ వచ్చిన ప్రత్యేక వస్తువులు సరుకుల గురించి, మెసపుటోమియా శాసనాల్లో పేర్కొనబడింది. దీనిద్వారా సింధూ, మెసపటామియాల మధ్యగల వ్యాపార, సంబంధం గ్రహించవచ్చు. అసియా మైనర్‌లోని, 'బోఘజ్‌కూయి'కీ చెందిన మిత్తని శాసనాల్లో (క్రీ.పూ. 1400 ప్రస్తుతం బలుచిస్తాన్ - ఇరాన్ ప్రాంతం) ఆర్యదేవతల పేర్లున్నాయి. దీనిద్వారా ఆర్యులు ఏ ఏ ప్రాంతాల్లో నివాసించారో తెలుస్తున్నది.

పారశీకరాజు మొదటి డరియస్ పెర్సిపోలిస్ శాసనాన్నిబట్టి అతడు పంజాబ్ ప్రాంతంపై అధికారం చలాయించినట్లు చెప్పవచ్చు. ఆగ్నేయ ఆసియాలో లభించిన శాసనాల వల్ల, భారతదేశానికీ, ఆగ్నేయ ఆసియాకు మధ్యగల రాజకీయ, సాంస్కృతిక వాణిజ్య సంబంధాలు తెలుస్తున్నవి.

### 7.5.3 నాణేలు :

ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు శాసనాలవలె, నాణేలుకూడా. అమూల్యమైన ఆధారాలు నిశ్చితమైన ఆకారం, తూకం కలిగి ప్రామాణానికీ నిదర్శనముగా అధికార లాంఛనం ఉన్న లోహ ఖండాలను నాణేలు అంటారు. ఈ నాణేలు ఆకాలమతందు ఉన్న పాలకుల చేత వెండి, బంగారం, రాగి, ఇనుము, లోహాలతో పోటిన్, బిల్లన్ అనే మిశ్రమ లోహాలతో ముద్రించబడ్డాయి. వీటిని ముఖ్యంగా ఆనాడు దేశంలో వర్తక వ్యాపారాలనూ, సులభతరం చేయడానికీ, వాటిని పెంపొందించడానికి, మారక ద్రవ్యంగా ఉపయోగించారు. ఈ నాణేల పైన లేఖనాలు, ప్రతిమలు, లాంఛనలు, చిహ్నాలు కలవు. ఇవి చరిత్రకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. భారతదేశంలో మలివేదకాలంలో నాణేలు ఉపయోగించినప్పటికీ, క్రీ.పూ. 6వ శతాబ్ది తరువాతి నాటి విద్ధాంక నాణేలే మనకు కనిపిస్తున్నాయి. ఇవి మౌర్యుల కాలంలో భారతదేశం మొత్తం వాడుకలో వున్నాయి. అయితే అశోకుని తరువాతనే, ముఖ్యముగా ఇండో బాక్ట్రియన్ రాజులతోనే, సరైన నాణేల ముద్రణ ప్రారంభమైంది. భారతదేశంలో ఉద్ఘాతనాలో వివిధ ప్రాంతాలలో వేలకొలది నాణేలు రాశులు,రాశులుగా దొరికాయి. నాణేల చరిత్రను వాటి రూపాలను, పరిశోధించే, శాస్త్రానికీ 'న్యూమిస్‌మాటిక్స్' అను పేరు. లభ్యమైన నాణేలు పరిశోధించే టంక నిపుణుల, చరిత్రలోని ఖాళీలను పూరిస్తున్నారు. నాణాల ద్వారా నాటి రాజకీయ, ఆర్థిక, మత, వాణిజ్య పరిస్థితులే కాక, ఆయా రాజుల గుణగణాలు, రాజ్య విస్తీర్ణం మొదలగు అంశాలు తెలుసుకోవచ్చు. శాసనాలకు ఉండే అసత్య అతిసయోక్తి దోషాలు నాణేలుకు ఉండవు. శాసనాల మీద వలె నాణేల మీదా విషయ, వివరణ ఉండదు. "సమకాలికా, వాస్తవ చరిత్రను తెలుసుకోడానికీ పురావస్తు ఆధారాల్లో శాసనాల కంటే, నాణేలే ప్రధానమైనవి'' అని డి.డి. కోసాంబి అభిప్రాయపడ్డాడు.

**రాజకీయ చరిత్ర :**

భారతదేశ రాజకీయ చరిత్రలోని అనేక ఘట్టాలకూ సాక్ష్యాలు నాణేలే. మౌర్యుల తరువాత భారతదేశాన్ని పాలించిన ఇండో గ్రీక్, నిధియన్, కృషాణ్, క్షాత్రప,రాజవంశాల చరిత్రకు ప్రధాన ఆధారం నాణేలే. మౌర్యుల తరువాత, ఉత్తర భారతదేశంలో, వివిధ ప్రాంతాల్లో రాజ్యమేలినా, యౌధేయులు, ఆర్జునాయనులు, మాళవులు మొదలగు గనరాజ్యాల వారి చరిత్రకు, వారి నాణేలే ముఖ్యఆధారం. నాణేలు దొరికినా ప్రాంతాలను బట్టి కొంతవరకు, రాజ్యసరిహద్దులను నిర్ణయించవచ్చు. కుషాణుల పతనానికీ యన్‌ధేయులే కారణం అని, నాణేల ద్వారా గ్రహించవచ్చు. మహారాష్ట్రలో 'జోగల్‌తంబి' వద్ద గౌతమిపుత్ర శాతకర్ణి పునర్ ముద్రించిన క్షాత్రపనహపాణుని నాణేలు లభించాయి. ఈ నాణేలను బట్టి, క్షాహరాటులపై గౌతమిపుత్రుడు విజయం

సాధించాడు అని గ్రహించవచ్చు. గుప్తచక్రవర్తి, మొదటి చంద్రగుప్తుడు ముద్రించిన నాణెల ద్వారా గుప్తరాజ్య సుస్థిరతలో విస్తరణలో, విచ్ఛినాలు ముఖ్యపాత్ర వహించారని తెలుస్తుంది. రెండో చంద్రగుప్తుని సింహముద్రిత నాణేలు అతని గుజరాత్ ఆక్రమణనను సూచిస్తాయి. శాతవాహన వంశంలో మొదటి రాజు అయిన శాతవాహణుడు, గుప్త వంశంలో, కచ రాజు పేర్లు నాణేల వల్ల వెలుగులోకి వచ్చాయి.

### ఆర్థిక చరిత్ర :

నాణేల ద్వారా, ఒక రాజ్యపు, ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవచ్చు. నాణేల తయారీకి వాడిన లోహాన్ని బట్టి ఆనాటి ఆర్థిక పటుత్వాన్ని గూర్చి చెప్పవచ్చు. తీరాంధ్రంలో రాజ్యమేలినా, విష్ణుకుండినులు, ఇనుప నాణేలు ముద్రించారు. ఇది నాటి ఆంధ్రదేశ ఆర్థిక దుస్థితికే నిదర్శనం. గుప్తచక్రవర్తులు, ప్రథమంలో ముద్రించిన బంగారు నాణేలలో, 10 శాతం మాత్రమే అపద్రవ్యం ఉండేది. గుప్తుల చివరి కాలంలో బంగారు నాణేల్లో ఏ ద్రవ్యం 46 శాతానికి చేరింది. దీనినిబట్టి ప్రథమంలో గుప్తరాజ్యం పటిష్టంగా వుంది. తరువాత హుణ దండయాత్రల వల్ల గుప్తరాజ్య ఆర్థికస్థితి దిగజారిందనీ తెలుస్తుంది. క్రీ.శ. 1, 2 శతాబ్దాల నాటి రోమన్ బంగారు నాణేలు ఆంధ్ర, తమిళనాడులలో ఎక్కువగా లభించాయి. వీటినిబట్టి భారతదేశానికీ, రోమ్‌కు మధ్య వ్యాపారం సాగినట్లు తెలిసింది. శాతవాహనుల నాణేలపై గల నౌకా ముద్రలను బట్టి వారికీ, నౌకాబలం ఉన్నట్లు స్పష్టమయింది. తూర్పు చాళుక్యరాజు మొదటి శక్తివర్మ, విడుదల చేసిన నాణేలు, ఆంధ్ర దేశంలోనేగాక, సయాంలో కూడా లభించాయి. ఆనాడు ఆంధ్రదేశం జరిపిన విదేశీ వ్యాపారానికి ఇది నిదర్శనం.

### మత పరిస్థితులు :

నాణేల ద్వారా రాజులు, రాజవంశాలు అవలంభించిన మతసాంప్రదాయాలు తెలుసుకోవచ్చు. అంతేగాక, నాణేల మీద ఉన్న దేవతల బొమ్మలను బట్టి, వివిధ మతాల చరిత్రను కొంతవరకు గ్రహించవచ్చు. మౌర్యుల తరువాత పశ్చిమోత్తర భారతంలో రాజ్యమేలిన విదేశీ రాజవంశాలయినా సిథియాన్, పార్థియన్, కుషాన్ నాణేల మీద హిందూ దేవతల ప్రతిమలున్నాయి. దీనినిబట్టి విదేశీయులైన వీరు, క్రమంగా హిందూ సాంప్రదాయాలను అనుసరించారని తెలిసింది. కనిష్కుని నాణాలపై గల బుద్ధుని ప్రతిమలనుబట్టి అతడు బౌద్ధమతాభిమాని అని తెలిసింది. గుప్తుల నాణెల మీద కనిపించే గరుడపక్షీ, లక్ష్మీదేవి బొమ్మలనుబట్టి వారు విష్ణుభక్తులు అని చెప్పవచ్చు. మొదటి కుమారగుప్తునీ నాణెలమీదా, నేమలి, కుమారస్వామి బొమ్మలు గలవు. దీనిని బట్టి అతడు కుమారస్వామి భక్తుడు అని చెప్పవచ్చు.

### రాజుల గుణగణాలు :

గుప్తరాజుల నాణేల మీద రాజు, సింహాన్ని చంపుతున్నట్లు, పులిని చంపుతున్నట్లు, గుర్రంపై స్వారీ చేస్తున్నట్లు కనిపిస్తుంది. దీనినిబట్టి గుప్తరాజుల వినోదాలు తెలుస్తున్నది. వీణ మీటె సముద్రగుప్తుని ప్రతిమగల బంగారు నాణేలు, అతని సంగీత పటిమను, అభిరుచిని చాటుతున్నాయి. నాణేలపై ముద్రించబడిన రాజుల బొమ్మలనుబట్టి నాటి రాజుల వస్త్రధారణ, ఆభరణాలు, భిన్నరకాల కిరీటాలు మొదలగు అంశాలే గాక వారియొక్క వినోదాలు కూడ తెలుసుకోవచ్చు. నా ణేలపై ముద్రించిన ప్రతిమలు, లాంఛనాలు, ఇతర చిహ్నాల ప్రతిమాలక్షణ శాస్త్ర అధ్యయనానికి దోహదపడుతున్నాయి.

## 7.6 దేశీయ వాఙ్మయం :

ప్రాచీన భారతదేశంలో పెక్కుమంది రచయితలు, గ్రంథకర్తలు మతపరమైన, సామాజికమైన, ప్రాపంచికమైన అంశాలతో రచనలు చేశారు. వారు చరిత్ర దృష్టితో రచించకపోయిన వారి రచనా కౌసల్యంతో ఆనాటి సమాజాన్ని ప్రతిబింబింపచేశారు.

అందువల్ల ఆ రచనలు చరిత్ర రచనా విధానానికీ పరికరాలుగా ఉపయోగపడ్డాయి. వారి రచనలను మతపరమైన, లౌకికమైనవిగా రెండు భాగాలుగా చేయవచ్చు. ఈ రచనలు సంస్కృత, పాళి భాషల్లో మిశ్రమ సంస్కృతి భాషలోనూ వున్నాయి. మతపరమైన వాఙ్మయములో వైదిక, బౌద్ధ, జైన వాఙ్మయాలు చేరతాయి.

### 7.6.1 వైదిక వాఙ్మయము :

వైదిక వాఙ్మయం ఆర్యుల చరిత్రకు ముఖ్య ఆధారం. వేదం అనగా జ్ఞానం అని అర్థం. వేదములు ఆ పౌరషేయాలు. వేద సాహిత్యంలో నాలుగు భాగాలున్నాయి. అవి ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదం, అదర్వణ వేదం, ప్రతి వేదంలో సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యాకాలు, ఉపనిషత్తులు అను నాలుగు భాగాలున్నాయి. ఆ తరువాత సూత్రవాఙ్మయం తయారయ్యింది. ఇందులోని భాగాలే వేదాంగాలు. శ్రౌత, గుహ్య,ధర్మసూత్రాలు, ఉపవేదాలు ఇతిహాస గ్రంధాలు అయినా రామాయణ, భారతాలు ముఖ్యమైన వైదిక వాఙ్మయాలు. ఈ వాఙ్మయం క్రీ.పూ. 2000 - క్రీ.పూ. 600 మధ్యకాలంలో తయారయ్యింది అని అంచనా.

### ఋగ్వేదము :

ఋగ్వేదం అత్యంత ప్రాచీనమైన వైదిక గ్రంథం. దీని ఆధారంగానే తొలి వేదయుగాన్ని తెలుసుకోవచ్చు. ఇందులో ఋక్కులనే ప్రార్థనా శ్లోకాలున్నాయి. ఇది పది మండలాలుగా విభజింపబడింది. ఇందులో 1017 ఋక్కులు గలవు. వీటి వలన ఆర్యుల తొలి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత, జీవన విధానం తెలుస్తున్నది. ఋగ్వేదంలో దేవతారాధనల గురించి (ఏకదేవతారాధన, బహుదేవతారాధన) వివరణ గలదు.

### సామవేదం :

గానం కోసం ఋగ్వేద మంత్రాలకు స్వరాన్ని అమర్చారు. ఈ క్రొత్త సంకలనానికి 'సామవేద సంహిత అని పేరు. ఇందులో 1549 ఋుక్కులు గలవు. ఈ ఋక్కులు శ్రావ్యమైన స్వరసంకలనం కలిగియున్నాయి. వీనిని యజ్ఞక్రతువులందు పాడెదరు. భారతీయ సంగీత చరిత్రకు మూలం సామవేదం.

### యజుర్వేదం :

యజుర్వేదం మంత్రాలు మాత్రమే కాకుండా అవి చదివేటప్పుడు అనుసరించాల్సిన నియమాలను, కర్మకాండలను గురించిన విషయాలను తెలుపుతున్నాయి. ఈ కర్మకాండకు సంబంధించిన ఆచారాలు అవి ఆవిర్భవించిన సామాజిక, రాజకీయ వాతావరణానికి అద్దం పడతాయి. ఇది పద్య, గద్య సంకలనం.

### ఆధర్వణ వేదం :

అధర్వణవేదంలో 731 ఋక్కులు గలవు. ఇవి 20 భాగాలుగా విభజించారు. ఇందులో భూత, పిశాచాలను పారద్రోలే మంత్రతంత్రాలు కలవు. అంతేకాక ఇందులో చెడును, వ్యాధులను దూరం చేయడానికి పనికి వచ్చు తాంత్రిక ప్రక్రియలున్నాయి. ఆధర్వణ వేదం ఆర్యులది కాదు అనే వాదన వుంది. ఇందుకు కారణం దీనిలోని విషయాలు ఆర్యేతరుల నమ్మకాలను, విశ్వాసాలను వ్యక్తం చేయడమే. ఇందులో ఇతివృత్తం గిరిజన జాతుల్లో ఉన్న మూఢనమ్మకాలకు ప్రతిరూపంగా ఉండటం వల్ల దీనిని కొంత అసహన భావంతో చూడటం జరుగుతుంది.

**బ్రాహ్మణాలు :**

బ్రాహ్మణాలు వేదాలపై వ్యాఖ్యానాలు. ఇందులో కర్మకాండ సూత్రాలున్నాయి. ఈ సూత్రాలు కర్మకాండల వెనుకవున్న సామాజిక, మత విషయాలను వివరిస్తాయి. ఇందులో యజ్ఞయాగాదులు, ప్రార్థనలు, ఏ విధంగా నిర్వహింపబడునో విపులంగా తెలియజేయడమయ్యింది. ఆనార్యులను తతత ఆర్యసంఘంలో చేర్చుకొను విధం, కర్మమార్గాన మోక్షం పొందు విధం ఇందులో వున్నాయి.

బ్రాహ్మణాల్లో ఋగ్వేదానికి ఐతరీయ, కేశితకి బ్రాహ్మణాలు అనుబంధమై ఉంటాయి. ఇవి యజ్ఞయాగాది కార్యక్రమాలను వివరిస్తున్నాయి. లూంధ్యిమాహా, జైమీనియా, చాందోగ్య, బ్రాహ్మణాలు సామవేదానికి అనుబంధం. ఈ బ్రాహ్మణాలకు మంత్రాలు ఉండటం ఒక ముఖ్య లక్షణం. శతపద బ్రాహ్మణం యజుర్వేదంతో అనుబంధమై వుంది. కురుపాంచాల నుంచి, వీదేహ వరకు ఉన్న సాంస్కృతిక ప్రగతి గురించిన సమాచారాన్ని ఇది తెలియజేస్తుంది. గోపథ బ్రాహ్మణాలు, ఆధర్వణ వేద పాఠాన్ని పూర్తిగా వివరిస్తాయి.

**అరణ్యకాలు :**

ఇవి వనాలలో ఏకాంతముగా చదువుకొనేవి. ఇందులో అడవుల్లో తపోమార్గం అవలంబించి మోక్షము పొందు విధం చర్చించబడింది. బ్రాహ్మణాలలోని కర్మ మార్గానికి, ఉపనిషత్తులోని జ్ఞానమార్గానికీ అరణ్యకాలు సంధానకర్తలు, అరణ్యకాలలో ఐతరీయ, తైతరీయా అరణ్యకాలు ముఖ్యమైనవి.

**ఉపనిషత్తులు :**

ఉపనిషత్ అనే పదం 'ఒకరి వద్ద కూర్చును' అను అర్థాన్ని ఇచ్చే ఉపనిషత్ అనే ధాతువు నుంచి ఉత్పన్నమైంది. గురువు వద్ద విద్యార్థులు కూర్చోని చదువు నేర్చుకోడాన్ని ఈ పదం సూచిస్తుంది. ఉపనిషత్తులన్నీ తత్వ సంబంధమైన గ్రంథాలు. వీటిలో విశ్వాయాద్మ, పరమభావన, వ్యక్తిఆత్మ, ప్రపంచం పుట్టుక, ప్రకృతి రహస్యాలు మొదలగు వాటిని వివరించబడింది. వేద యుగంలో ఉచ్ఛస్థాయిని అందుకొన్న భారతీయ ఆలోచన సరళికి, ఇవి పరాకాష్ట. మతపరమైన, తంతులను కర్మకాండలను ఇవి తీవ్రంగా వ్యతిరేకించాయి. ఉపనిషత్తులు 108 ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి 12 అవి ఐతరీయ, కేశితకి, చాందోగ్య, కేన, బృహదారణ్యక, తైతరీయ, కథ, శ్వేతస్వతార, ఇస, మండక, ప్రశ్న, మాండూక్య. ఉపనిషత్తుల ప్రకారం జ్ఞానం రెండు విధాలు అవి ఉత్తమస్థాయి జ్ఞానం, ఆధమస్థాయి జ్ఞానం.

## 5.2.1.8 వేదాంగాలు :

వేదాంగాలు 6. అవి శిక్ష, కల్ప, వ్యాకరణ, నిరుక్త, ఛందస్సు, జ్యోతిష్యం. ఇవి అన్ని వేదాలను సరిగా అధ్యయనం చేసేందుకు అర్థం చేసుకొనేందుకు, బలి కర్మాది క్రియల్లో వాటిని ఉపయోగించుకొనేందుకు ఉపయోగపడే విషయాలను బోధిస్తాయి. వేదాంగాలను స్మృతి అని వ్యవహరిస్తారు. ఇవి మానవులు సృష్టించినవి. వేదాంగాలు సూత్రాల రూపంలో ఉంటాయి. వేదసాహిత్యాన్ని అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. సూత్ర గ్రంథాల్లో కల్పసూత్రం అందుబాటులో ఉంది. వీటిని మూడు తరగతులుగా విభజించడం జరిగింది. అవి శ్రౌత, గృహ్య, ధర్మ సూత్రాలు. మొదటిది అగ్నికీ, సోముడికీ సంబంధించిన యజ్ఞయాగాదులను వివరిస్తుంది. రెండవది గృహములో చేయాల్సిన క్రతువులను తెల్పుతుంది. మూడో గ్రంథం నుండే ధర్మశాస్త్రాలు పుట్టాయి.

వేదసాహిత్యం చారిత్రక విలువ ఉన్న సాహిత్యం కాదు అని నమ్మదగినది కాదు అని పార్గిటర్ అభిప్రాయపడగా, వేదసాహిత్యాన్ని గొప్ప చారిత్రక విలువ ఉన్న సాహిత్యంగా ఎస్.ఎన్.ప్రధాన్ పేర్కొన్నాడు.

### 7.6.2 ఇతిహాసాలు :

రామాయణ, భారతాలు ఇతిహాసాలు. భారతీయుల జీవన ప్రవంతిలో ఈ ఇతిహాసాలు అంతర్ భాగమైపోయాయి. క్రీ.పూ. 500 - క్రీ.పూ. 200 మధ్య కాలంలో ఇతిహాసాలు గ్రంధస్థమయ్యాయి అని మాక్డోనాల్డ్ భావించాడు. మత వాఙ్మయములో చరిత్ర గ్రంథాలలో దగ్గర పోలిక ఉన్నవి ఈ ఇతిహాసాలే. ఆర్యుల, ఆనార్యుల మధ్య సంఘర్షణ, ఆనార్యులు ఆర్యసంఘంలో విలీనం కావడం. దక్షిణాదికి, ఆర్యుల విస్తరణ, నాటి రాజనీతి రాజవ్యవస్థ, కులవ్యవస్థ, సంఘపద్దతి మొదలగు విషయాలను రామాయణం చిత్రించింది. ప్రాచీన భారతదేశంలోని వివిధ రాజ్యాలు, రాజ్యతంత్రం నీతి నియమాలు, ఆధిక్యత కోసం ఆర్య రాజ్యాల మధ్య జరిగిన ఘర్షణ మొదలగు విషయాలు మహాభారతం వివరించింది.

### 7.6.2 పురాణాలు :

పురాణం అంటే పురాతన గాధ అని అర్థం. పురాణాలు క్రీ.శ. మొదటి శతాబ్దంలో వ్రాయబడ్డాయి అనీ పుసాల్కర్ అభిప్రాయపడ్డాడు. ఆస్టాదశ పురాణాలు అదే సంఖ్యలో ఉపపురాణాలు కలవు. వీటిలో భవిష్య, మత్యపురాణాలు అత్యంత ప్రాచీనమైనవి.

పురాణానికి 5 లక్షణాలు ఇవ్వటం జరిగింది. అవి సృష్టి, ప్రతిసృష్టి, వంశం, మన్వంతరం, వంశాను చరిత్ర. వీటిలో చివరిది చరిత్రకు ఎక్కువగా ఉపకరిస్తుంది. మొదట చరిత్రకారులు పురాణాలకు ప్రాముఖ్యత ఇవ్వలేదు. పురాణాలు, చరిత్ర రచనకు ఎంతో ఉపయోగపడుతుంది అని చెబుతూ పార్గిటర్ ఒక గ్రంథం ముద్రించడంతో పురాణాలకు చరిత్ర ఆధారాలుగా గుర్తింపు లభించింది. అయితే 18 పురాణాల్లో మత్య, విష్ణు, వాయు, స్కంథ, భవిష్య, మార్కండేయ, పురాణాలు చరిత్ర రచనకు ఎక్కువగా ఉపకరిస్తున్నాయి.

పురాణాలు తెలియజేసిన పాలకుల జాబితాల వల్ల, శైశునాగుల నుండి, గుప్తుల వరకు గల చారిత్రక రాజవంశాల వివరాలు తెలుసుకోగలుగుతున్నాం. పురాణాల్లో ఎక్కువ భాగం గుప్తుల యుగంలో పూర్తి చేయబడింది. ఆంధ్ర రాజవంశాల చరిత్రకు, విష్ణు పురాణం ఉపకరిస్తుంది. విష్ణు పురాణం ద్వారా మగధలో నందరాజుల అధికార స్థాపన తరువాత, వారిని కౌటిల్యుని సహాయంతో చంద్రగుప్తుడు ఓడించి, అధికారం స్వీకరించిన వివరాలు తెలుస్తున్నాయి. గుప్తుల వంశ క్రమాన్నే పాలనా కాలాన్ని గురించి మత్య, వాయు, విష్ణు పురాణాల్లో ప్రస్తావించబడింది. పురాణాల్లో పేర్కొన్న నగరాల, నదుల పర్వతాల ప్రాచీన నామాలు, ప్రాచీన భారత భౌగోళిక చరిత్రను అర్థం చేసుకోడానికీ ఉపయోగపడుతున్నాయి. హిందూమతంలో వేరు వేరు శాఖలను గురించిన వివరాలు వారి సాంఘిక, జీవనం పురాణాలు తెలియజేస్తున్నాయి. పురాణాల ఆధారంతో చరిత్ర రచనకు పూనుకొన్న చరిత్రకారుడు సమాచారాన్ని అప్రమత్తతతో, వివక్షతతో ఉపయోగించుకోవాలి.

### 7.7 బౌద్ధ వాఙ్మయం :

### త్రిపీఠకాలు :

బౌద్ధ మత ప్రామాణిక గ్రంథాల్లో ముఖ్యమైనవి త్రిపీఠకాలు. బుద్ధుని నిర్యాణానంతరం అతని సూక్తులు వినయ, సుక్త, అభిదమ్మ, పీఠకాలుగా పాళిభాషలో క్రోడీకరించబడ్డాయి. ఇవి బౌద్ధ మత ధర్మం గురించి ఆచార, వ్యవహారాల గురించి ఈ పీఠకాలు మతచరిత్రకు సంబంధించిన విషయాలనూ, కథలను పేర్కొంటాయి.

**జీవిత చరిత్రలు :**

బుద్ధుని జీవితము గురించి ఆశక్తికరమైన, విలువైన విషయాలతో జీవిత చరిత్రలు రచింపబడ్డాయి. వాటిలో పేర్కొనదగినవి మహావత్స, లలితా విస్తారము, బుద్ధచరిత్రము మొదలగునవి.

**నికాయాలు :**

బుద్ధుని సిద్ధాంతాలనూ, తాత్విక పరికల్పనలను నికాయాలు వివరిస్తాయి. దీఘ, మఝుమ, సంయుక్త, ఆంగుత్తర,ఖుద్దక అనునవి నికాయాలు. వీటిలో ఆంగుత్తర నికాయం, క్రీ.పూ. 6వ శతాబ్దం నాటి రాజకీయ, సాంఘిక, మత పరిస్థితులను గురించి విలువైన సమాచారం ఇస్తున్నది.

**జాతక కథలు :**

బుద్ధుని పూర్వజన్మల గురించి వ్రాయబడిన జాతక కథలు సాహిత్యపరంగా, కళాత్మక దృష్ట్యా ముఖ్యమైనవి. ఈ జాతక కథల వల్లన బౌద్ధయుగం నుండి, మౌర్యుల కాలం వరకు అవిచ్ఛిన్నముగా కొనసాగిన, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు వాణిజ్య సంఘాలు ప్రజల ఆధారాలు మత విశ్వాసాలు మొదలగు అంశాలు తెలుస్తున్నాయి.

మరో పాళి గ్రంథం మిళిందతహ్, అశోకుని తరువాతి కాలానికీ చెందిన రాజకీయ మత పరిణామాలను వివరిస్తుంది.

**సింహళ గ్రంథాలు :**

క్రీ.శ. 4,5 శతాబ్దాలకూ చెందిన పాళి భాషలో ఉన్న సింహళ బౌద్ధ గ్రంథాలు అయినా దీపవంశ, మహావంశ్య, మౌర్య, సుంగ వంశాలను గురించి శ్రీలంకలో బౌద్ధమతాన్ని వ్యాప్తిచేయడంలో అశోకుని పాత్ర గురించి వివరిస్తాయి.

మౌర్యుల రాజకీయ వ్యవస్థపై బౌద్ధమత భావాలు ఏర్పరచిన ప్రభావాన్ని నిర్ధారించడంలో 'దిగనికాయా' తోడ్పడుతుంది. టిబెట్‌లో లభ్యమయ్యే బౌద్ధ ఆధారాలు, మౌర్యుల చరిత్రకు ఉపయోగపడతాయి.

ఉదాహరణకు దివ్యవధ్య గ్రంథం అశోకుడు బౌద్ధమత వ్యాప్తికి చేసిన కృషి గురించి వివరిస్తుంది. మహాయాన బౌద్ధ గ్రంథమైన 'మంజుశ్రీమూలకల్పం' మౌర్యుల గురించి, నందుల గురించి ముఖ్యమైన సమాచారం అందిస్తుంది.

బౌద్ధంలో వచ్చిన పరిణామాల గురించి, వసుమిత్రుడు అశ్వఘోషుడు, ఆచార్య నాగార్జునుడు సంస్కృత భాషలో రచించిన గ్రంథాలు వివరిస్తాయి. బౌద్ధ సాంప్రదాయం కూడా ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ఉపయోగపడుతుంది.

## 7.8 జైన వాఙ్మయం :

**ద్వాదశాంగాలు :**

జైనమత ప్రామాణిక గ్రంథాలు, అంగాలు, ఉపాంగాలు మహావీరుని కాలంనుండి, చారిత్రక వివరాలనూ ద్వాదశ అంగాలు తెలియజేస్తున్నాయి.

బద్రబాహుని కల్పసూత్రాలు, ఆవశ్యక సూత్రాలు, ప్రాచీన భారతచరిత్ర రచనకు తోడ్పడుతున్నాయి. వీటిలో ఆవశ్యక సూత్రాలు శక దండయాత్రల విశేషాలనూ తెలుపుతున్నాయి.

**పరిశిష్ట పర్వణం :**

హేమచంద్రుని పరిశిష్ట పర్వణం, జైన వాఙ్మయంలో చారిత్రక ఆధారంగా అత్యంత ముఖ్యమైనది. ఈ గ్రంథం చంద్రగుప్తమౌర్యుని గురించి, అతడు మగథను ఆక్రమించడం. చివరి పాలనా కాలంలో రాజ్యాన్ని త్యజించి, జైన మతాన్ని స్వీకరించడం మొదలగు అంశాలనూ పేర్కొంటుంది. ఈ గ్రంథం ప్రకారం మయూర పోషణ జీవనంగా ఉన్న, ఒక గ్రామ పెద్ద కుమార్తె చంద్రగుప్తుని తల్లి. జైన సాంప్రదాయాలు కూడా చరిత్రకారునికి ఉపయోగపడుతుంది.

**చేద సూత్రాలు :**

చేదసూత్రాలను భద్రబాహుడు రచించినట్లు తెలుస్తుంది. ఇవి చాలా ప్రాచుర్యం సంతరించుకొన్న గ్రంథాలు. వీటిని మూడు భాగాలుగా చేశారు. మొదటి భాగం మహావీరుని జీవితాన్ని, జైనుల చరిత్రను తెలుపుతుంది. రెండు, మూడు విభాగాలు జైన పాఠశాలల పట్టికను, వాటిలోని గురువులు, మత ప్రచారకుల వివరణను తెలుపుతున్నాయి.

## 7.9 లౌకిక వాఙ్మయం :

చారిత్రక విలువ కలిగిన లౌకిక వాఙ్మయంలో వంశచరిత్రలు, రాజనీతి గ్రంథాలు, జీవిత చరిత్రలు, వ్యాకరణ గ్రంథాలు, శాస్త్రీయ సాంకేతిక గ్రంథాలు, సంస్కృత కావ్యాలు, ప్రాకృత గ్రంథాలు, తమిళ గ్రంథాలు చేరతాయి.

**వంశచరిత్రలు :**

క్రీ.శ. 12 వ శతాబ్దంలో కల్హణుడు సంస్కృత భాషలో వ్రాసిన 'రాజ తరంగిణి' వంశ చరిత్రలలో అత్యంత ప్రధానమైనది. నాటివరకు లభ్యమైన ఆధారాలను విమర్శనాత్మక దృష్టితో పరిశీలించి కాశ్మీర్ రాజుల చరిత్రను ప్రామాణిక చరిత్ర గ్రంథంగా కల్హణుడు రూపొందించాడు. గుజరాత్ రాజవంశావళులైన సోమేశ్వరుని 'రస్‌మాల', 'కీర్తికౌముది', అరసింహుని 'సుక్రిత సంకీర్తన వంటి రచనలు ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు అమూల్యాలు. పాళీభాషలో వ్రాసిన 'దీపవంశ', 'మహావంశ' లు శ్రీలంక చరిత్రను వివరిస్తాయి. ఈ గ్రంథాలు భారతదేశంలోని బౌద్ధమత వ్యాప్తిని, శ్రీలంకలోని బౌద్ధమత వ్యాప్తిని వివరించడమేగాక, దక్షిణ భారతదేశ చరిత్రను, రాజకీయ పరిస్థితులను తెలుపుతాయి.

**రాజనీతి గ్రంథాలు :**

చంద్రగుప్తమౌర్యుని ప్రధానమంత్రి అయిన కౌటిల్యుడు లేదా చాణక్యుడు రాసిన 'అర్ధశాస్త్రం' రాజనీతి గురించి తెలిపే అత్యంత ప్రసిద్ధిగాంచిన తొలి శాస్త్రీయ గ్రంథం, మౌర్యుల చరిత్ర పునర్నిర్మాణంలో ఈ గ్రంథం ఉపకరిస్తుంది. మౌర్యుల పరిపాలనా విధానం, నాటి సాంఘిక, ఆర్థిక అంశాలను గురించి ఈ గ్రంథం వివరిస్తుంది. వింటర్‌నిట్జ్ అను పండితుని మాటల్లో "భారతీయ సాహిత్య మొత్తం పరిధిలోనే ఇది ఒక అసదృశ గ్రంథం". గుప్తుల కాలంనాటి పరిపాలనా విధానం, రాజధర్మం, ప్రజల కర్తవ్యం మొదలైన విషయాల గురించి కామందకుని 'నీతిశాస్త్రం' తెలుపుతుంది. ధర్మశాస్త్రాలయిన కాత్యాయన, నారద, బృహస్పతి స్మృతులు వలన ఆనాటి న్యాయవిధానం, ప్రజల ధర్మాలు, ఆస్తి హక్కులు, సాంఘిక కట్టుబాట్లు మొదలైన అంశాలు విశదం కాగలవు.

**జీవిత చరిత్రలు :**

రాజుల, గురువుల జీవిత చరిత్రలను గురించి రాసిన సాహిత్యం ప్రాచీన యుగంలో చాలా కన్పిస్తుంది. వాటిలో ముఖ్యమైనవి అశ్వఘోషుడు రచించిన 'బుద్ధచరితం', బాణభట్టు రచించిన 'హర్షచరిత్రము', ప్రాకృత భాషలో ముంజరాజు రచించిన

'గౌడవహో', బిల్హణుడు రచించిన 'విక్రమాంక దేవచరిత్ర', హేమ చంద్రుని 'కుమార పాల చరిత్ర, పద్మగుప్తుని 'నవశశాంక చరిత్ర' ముఖ్యమైనవి. 'బుద్ధచరితం' కనిష్కుని కాలానికి సంబంధించినది. 'హర్షచరితం' హర్షుని చరిత్రను, 'గౌడవహో' కనోజ్ రాజైన యశోవర్ధుని కాలానికి సంబంధించిన వివరాలను తెలియచేస్తున్నాయి.

## వ్యాకరణ గ్రంథాలు :

ప్రాచీన భారతదేశ చరిత్ర ఆధారాలైన వ్యాకరణ గ్రంథాలలో పేర్కొనదగినవి పాణిని రచించిన 'అష్టాధ్యాయి', పాణిని గ్రంథంపై పతంజలి వ్రాసిన వ్యాఖ్యానం 'మహాభాష్యం', గార్గుడు రచించిన 'జ్యోతిష్య సంహిత'. పాణిని మౌర్యుల చరిత్ర గురించి వారి ముందు కాలాన్ని గురించి వివరించాడు. పతంజలి శుంగుల కాలాన్ని వివరించాడు. క్రీ.పూ. రెండో శతాబ్దంలో భారతదేశంపై గ్రీకుల దండయాత్రను గురించిన అమూల్యమైన వివరాలు కూడా పతంజలి 'మహాభాష్యం'లో లభిస్తున్నాయి. అమరసింహుడు 'అమరకోశాన్ని', చంద్రగోమయ 'చంద్ర వ్యాకరణం' రచించారు. ఈ రెండు గుప్తుల కాలంనాటివి.

## శాస్త్రీయ సాంకేతిక గ్రంథాలు :

భారతదేశంలో ప్రాచీన కాలంలో గణితం, ఖగోళం, వైద్యం మొదలైన రంగాలలో వచ్చిన పరిణామాలను అభివృద్ధిని శాస్త్రీయ సాంకేతిక గ్రంథాలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ కోవకు చెందిన గ్రంథాలలో పేర్కొనదగినవి వరాహమిహిరుని 'బృహత్సంహిత', వాగ్భటుని 'అష్టాంగ సంగ్రహ', 'అష్టాంగ బృహత్సంహితాలు', ఆర్యభట్టు రచించిన 'సూర్య సిద్ధాంతం', రోమక సిద్ధాంతాలు, బ్రహ్మగుప్తుని రచనలు. 'సూర్య సిద్ధాంతం' అనే గ్రంథంలో ఆర్యభట్టు సూర్యగ్రహణాలు, చంద్ర గ్రహణాలు ఏర్పడటానికి గల కారణాలను చర్చించాడు. ఆర్యభట్టు రచించిన 'ఆర్యభట్టీయం' లో సామాన్య గణితం, బీజగణితం, క్షేత్ర గణితం, త్రికోణమితి సిద్ధాంతాల వివరణ ఉంది. ఖగోళ, భౌతిక, వృక్ష, ప్రకృతి శాస్త్రాల విజ్ఞాన సర్వస్వమని 'బృహత్ సంహిత' ను పేర్కొనవచ్చు. బ్రహ్మగుప్తుడు న్యూటన్ సిద్ధాంతాన్ని ఆనాడే ప్రవచించాడు.

## సంస్కృత కావ్యాలు :

ప్రాచీన భారతదేశ సంస్కృత సారసత్వంలో కాళిదాసు, భవభూతి, హర్షుడు, భారవి, భట్టి రచనలకు విశిష్ఠస్థానం ఉంది. ఇవి కూడా చరిత్రరచనకు దోహదం చేస్తున్నాయి. శుంగుల పరిపాలనా కాలంలో విదిశ, విదర్భలకు మధ్య జరిగిన పోరాటం గురించి, సింధూనదీ తీరంలో గ్రీకుల పరాజయం గురించి కాళిదాసు తాను రచించిన 'మాళవికాగ్ని మిత్రమ్' అను గ్రంథంలో వివరించాడు. విశాఖదత్తుడు రచించిన 'ముద్రారాక్షసం' మౌర్యుల చరిత్రకు, 'దేవీ చంద్రగుప్తమ్' గుప్తుల చరిత్రకు ఆధారాలు. శకరాజు చేతిలో గుప్తరాజు రామగుప్తుని ఓటమి, రెండో చంద్రగుప్తుడు శకరాజును, తన అన్న రామగుప్తుని హత్యచేసి, అన్నభార్య ధృవాదేవిని వివాహమాడిన విషయం 'దేవీచంద్ర గుప్తమ్' వివరిస్తుంది. గుప్తుల నాటి అస్థిర రాజకీయ పరిస్థితులను గురించి, బ్రాహ్మణుడైన చారుదత్తుడు, రాజనర్తకి వసంతసేనల మధ్య ప్రేమాయణం గురించి 'మృచ్ఛకటికం' అనేనాటకంలో శూద్రకుడు వివరించాడు. మొదటి చంద్రగుప్తుడు రాజ్యానికి వచ్చిన విధం, అతను సాధించిన ఘనకార్యాలు వజ్జీకుని 'కౌముదీ మహోత్సవం' అనే నాటకం వివరిస్తుంది. మేరదత్తుని చింతామణి, రాజశేఖరుని 'ప్రబంధ కోశమ్'లు చారిత్రక నాటకాలు. హర్షుడు రాసిన 'నాగానందం', 'రత్నావళి' 'ప్రియదర్శిక' దండి రాసిన 'దశకుమార చరిత్ర' బాణుని 'కాదంబరి' హర్షుని నాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులను వివరిస్తున్నాయి. సుబంధుని 'వాసవదత్త' వాత్సాయనుని 'కామసూత్రాలు' చరిత్ర రచనకు ఉపకరిస్తాయి. 'పంచతంత్రం' 'హితోపదేశం' వంటి నీతి ప్రబోధ రచనలు సమకాలీన చరిత్రకు ఆధారాలు.

**ప్రాకృత గ్రంథాలు :**

ప్రాకృత భాషలో ఉన్న హాలుని 'గాథా సప్తపతి', గుణాఢ్యుని 'బృహత్కథ' కుతూహలుని 'లీలావతి' మొదలైన గ్రంథాలు ఆయా కాలాలలోని రాజకీయ, మత, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. ప్రత్యేకంగా ప్రాకృత భాషలోనే రచించిన నాటకాలు కూడా ఉన్నాయి. వీటిని సాంకేతికంగా 'శతకా'లంటారు. ఈ వర్గానికి చెందిన వాటిలో రాజశేఖరుడి 'కర్పూర మంజరి' అత్యంత ప్రముఖమైంది.

**తమిళ గ్రంథాలు :**

సంస్కృత, ప్రాకృత వాఙ్మయాలకు తోడు ద్రావిడ భాషలలోని రచనలు కూడా కొన్ని చారిత్రక విషయాలను తెలియజేస్తాయి. తమిళ సాహిత్య చరిత్రలోని అత్యంత ప్రాచీన దశను 'సంగం సాహిత్యం'గా వర్ణించడమైంది. ఈ సాహిత్యాన్ని క్రీ.శ. నాలుగైదు శతాబ్దాలలో ఈనాడు మనకు కన్పిస్తున్న రూపంలోకి సంకలనం చేసినప్పటికీ సంగం సాహిత్యంలో అధికభాగం మౌర్యానంతర కాలంలోనే ఉత్పత్తి అయినట్లు తెలుస్తుంది. 'సంగం' అంటే సాహితీమూర్తుల 'సమావేశ'మని అర్థం. పాండ్యుల రాజధాని అయిన మధురలో మూడు సమావేశాలు జరిగాయి. రెండో సమావేశంలో విస్తారమైన సాహిత్యసృష్టి జరిగినప్పటికీ 'తొల్కాప్పియం' మాత్రమే మనకు దక్కింది. మూడోసమావేశంలో సృష్టింపబడిన విస్తారమైన సాహిత్యంలో కూడా కొంత భాగం మాత్రమే లభిస్తుంది. ఈ భాగమే ప్రస్తుతం 'సగం సాహిత్యం'గా చెలామణి అవుతూ వుంది. ప్రస్తుతం మిగిలివున్న సగం సాహిత్యంలో అత్యంత ప్రాచీన తమిళ గ్రంథాలయిన 'ఎట్టుత్తొగై' (ఎనిమిది సంకలనాలు), 'పత్తుపాట్టు (పది గీతాలు), 'పదినేన్ కిలకనక్కు (18 చిన్న చిన్న గ్రంథాలు)తోబాటు మరో మూడు పురాణాలున్నాయి. అగత్తియార్ రచించిన 'అగత్తియాం' అనే అత్యంత ప్రాచీన తమిళ వ్యాకరణ గ్రంథం, మధ్యయుగపు వ్యాఖ్యాతలు చూపిన ఉదాహరణల రూపంలో మాత్రమే మనకు లభిస్తుంది. అగస్త్యముని 12 మంది శిష్యుల్లో ఒకడైన తొల్కాప్పియర్ రచనగా భావిస్తున్న 'తొల్కాపియమ్'ను ప్రాచీన తమిళ గ్రంథంగా పేర్కొనవచ్చు. తమిళ వ్యాకరణానికీ, సాహిత్య సంప్రదాయానికీ సంబంధించిన గ్రంథమిది. ప్రేమ, యుద్ధం, ప్రభుత్వం, లేఖనశాస్త్రం, నిర్మాణం, ఛందస్సు, అలంకారాలు, సామాజిక ఆచారాలు, సాహిత్య సాంద్రాయాలు ఇందులో వివరించడం జరిగింది. పత్తుప్పట్టులో 'మురుగగ్రుపాదై', 'మధురైక్కంజి' అనేవి చాలా ముఖ్యమైనవి. మొదటిది మురుగన్ భక్తులకు పూజనీయమైంది. రెండోది చారిత్రక వివరాలు అందిస్తుంది. పదినేన్ కిలకనక్కు' ప్రధానంగా నీతి బోధకమైంది. వీటిలో తిరువళ్ళువర్ రచించిన 'తిరుక్కురళ్' అత్యంత ప్రముఖమైన గ్రంథం. జీవితానికి, మతానికి సంబంధించిన ఎన్నో అంశాలను సంక్షిప్తంగా, ఛందోబద్ధమైన సామెతల రూపంలో వివరించిన గ్రంథమే 'తిరుక్కురళ్'. 'శిలప్పదిగారమ్', 'మణిమేఖలై' 'శివాగసిందామణి' అనే మూడు సంగం పురాణాలు కూడా తమిళ ప్రాంతంలోకి ఆర్యుల ప్రభావం క్రమంగా చొచ్చుకు రావడాన్ని నిర్ధారిస్తున్నాయి. ఈ మూడింటిలో ప్రాచీనమైంది, అత్యంత గొప్పది అయిన 'శిలప్పదిగారమ్' ను కరికాల చోళుని మనుమడయిన 'ఇళుగో వడిగల్' రచించాడు. సంగం కాలంనాటి సామాజిక, చారిత్రక సమాచారాన్ని గురించి ఈ కావ్యం వివరిస్తుంది. మధురైకి చెందిన సత్తనార్ రచించిన 'మణిమేఖలై' ఆనాటి సామాజిక, చారిత్రక పరిస్థితులకు అద్దం పడుతుంది. అంతేగాక, సంగం కాలంలోని లలితకళలు అభ్యున్నతికి సంబంధించి ఒక అవగాహన ఏర్పరిచే ముఖ్యమైన కావ్యం ఇదొక్కటే. జైనుడైన 'తిరుత్తక్క దేవర్' రచించిన 'శివాగ చింతామణి' అనేది సంగం పురాణాల్లో అత్యాధునికమైంది.

కన్నడభాషలో రాష్ట్రకూట అమోఘవర్షుని 'కవిరాజ మార్గం' పంపకవి 'విక్రమార్క విజయం' ఆనాటి దక్కన్ చరిత్ర, సంస్కృతులను ప్రతిబింబిస్తున్నాయి.

## 7.10 విదేశీయ వాఙ్మయం :

భారతదేశ ఆర్థిక, ఆధ్యాత్మిక సంపత్తికి ఆకర్షితులై ఇక్కడికి వచ్చిన విదేశీ యాత్రికులు, వర్తకులు తాము చూచినవి విన్నవి గ్రంథస్తం చేశారు. వీరిలో గ్రీక్, రోమన్, చైనా దేశాలవారు, ముస్లింలు ఉన్నారు. వీరి రచనలు భారతీయులు రచించిన వివిధ విశేషాలను ధృవపరచడమేగాక, ఇతరత్రా తెలియని విషయాలను కూడా తెలియజేస్తున్నాయి.

### గ్రీక్ - రోమన్ రచనలు :

గ్రీక్ - రోమన్‌ల రచనల్లో ప్రథమంగా ప్రస్తావించవలసింది. హెరోడోటస్, స్కైలాక్స్, టెసియస్‌ల రచనలు. హెరోడోటస్ ‾రాసిన 'హిస్టరీస్' అను గ్రంథంలో గ్రీకు - పర్షియా యుద్ధాల గురించి, భారత - పర్షియా సంబంధాల గురించి, వాయువ్య భారతదేశంలోని సమకాలీన రాజకీయ పరిస్థితుల గురించి, వాయవ్య భారతదేశంలోని సమకాలీన రాజకీయ పరిస్థితుల గురించి వివరించబడింది. పారశీక చక్రవర్తి డరియస్ సింధు ప్రాంతంలోని స్థితిగతులను తెలిసికొనడానికి నావికుడైన స్కైలాక్స్‌ను పంపాడు. స్కైలాక్స్ తన రచనల్లో కట్టుకథలతో కూడుకొన్నది గాక చరిత్ర రచనకు అంతగా ఉపకరించదు.

అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తి వచ్చినప్పుడు అతనితోబాటు కొందరు చరిత్రకారులు వచ్చి ఆనాటి పరిస్థితులను గ్రంథస్తం చేశారు. వారిలో పేర్కొనదగినవారు నియార్కస్, అరిస్టోబ్యులస్, ఒనెసిక్రిటస్, క్లిటార్కస్‌లు.

మెగస్తనీస్, డైమాకస్, డయోనిషియస్ అను గ్రీకు రాయబారులు మగధ అస్థానానికి వచ్చి తాము చూసినవి, విన్నవి గ్రంథస్థం చేసారు. వీరలో ముఖ్యుడు మెగస్తనీస్. ఇతడు గ్రీకురాజైన సెల్యుకస్ నికేటర్ రాయబారిగా మౌర్యచంద్రగుప్తుని పాటలీ పుత్ర ఆస్థానానికి వచ్చి 'ఇండిక' అను గ్రంథం రాసాడు. డైమాకస్ సిరియా నుంచి బిందుసారుని ఆస్థానానికి రాయబరిగా వచ్చాడు. ఈజిప్టు పాలకుడైన టాలమీ రాయబారిగా డయోనిషియస్ ఇండియాకు వచ్చాడు. 'ఇండిక' గ్రంథం నేడు మనకు లభ్యం కావడం లేదు. అయితే తరవాత రచయితల్లో రచనల దానికి సంబంధించిన భాగాలు ఉదహరించబడింది. డైమాకస్, డయోనిషియస్‌ల రచనలు పూర్తిగా పోయాయి.

అరియన్ తన రచనలలో అలెగ్జాండర్ భారత దండయాత్రా వివరాలు విపులంగా పేర్కొన్నాడు. పాత్రోకెస్, పాలీబియస్, స్ట్రాబో, ప్లినీ, డయోడోరస్, టాలెమీల రచనలు, అజ్ఞాత రచయిత రచన 'ది పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' ప్రాచీన భారతదేశ చరిత్ర నిర్మాణంలో ఎంతో ఉపయోగపడుతున్నాయి.

పైన పేర్కొన్న గ్రీకో - రోమన్ రచనలు వారి వారి దృక్పథాల నుంచి చాలావరకు విన్నదాని ఆధారంగా లభించబడ్డాయి. అందువల్ల ఈ రచనలు లోపరహితంగా ఉండటానికి అవకాశం లేదు. అయినప్పటికీ పారశీక, గ్రీకు భారత దండయాత్రల గురించి, భారత భౌగోళిక పరిస్థితి గురించి, మౌర్యుల పరిపాలనా వ్యవస్థ గురించీ, ఇండో బాక్ట్రియన్, ఇండో-పార్థియన్ యుగాల చరిత్ర గురించి వివరాలను గ్రీకో - రోమన్ రచనలే ఇస్తున్నాయి. భారతదేశ చరిత్రలో సంఘటనలను కాలానుగుణంగా నిర్ణయించటంలో గ్రీకో - రోమన్ రచనలే ప్రాతిపదికను ఏర్పరిచాయి.

### చైనీయుల రచనలు :

భారతదేశంలో ఆవిర్భవించిన బౌద్ధమతం అశోక, కనిష్క మొదలగు చక్రవర్తుల కృషివల్ల అంతర్జాతీయంగా వ్యాప్తిచెందినది. బౌద్ధం స్వీకరించిన చైనీయులు కొందరు బుద్ధుని జన్మభూమిని దర్శించాలన్న కుతూహలంతోనూ, బౌద్ధమత గ్రంథాలను అధ్యయనం చేయాలన్న ఆకాంక్షతోనూ భారతదేశానికి యాత్రికులుగా వచ్చారు. అట్టివారిలో ముఖ్యులు పాహియాన్, హుయాన్‌సాంగ్, ఇత్సింగ్‌లు.

**ఫాహియాన్ :**

భారతదేశాన్ని దర్శించిన చైనా బౌద్ధయాత్రికుల్లో ప్రథముడు ఫాహియాన్. క్రీ.శ. **399 - 414** మధ్యకాలంలో ఇతడు భారతదేశాన్ని దర్శించి, తన అనుభవాలను ముఖ్యంగా ఆనాటి గుప్త సామ్రాజ్య మత, సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను 'ఫో-కువో-కి' అను గ్రంథంలో వర్ణించాడు.

**హుయాన్‌సాంగ్ :**

చైనా బౌద్ధయాత్రికుడైన హుయాన్‌సాంగ్ క్రీ.శ. **629 - 645** మధ్యకాలంలో భారతదేశం దర్శించాడు. హర్షుని మత సభలలో పాల్గొన్నాడు. నలందా విశ్వవిద్యాలయం దర్శించాడు. భారతదేశమంతా పర్యటించి తాను చూసిన, విన్న విశేషాలన్నింటిని, అనుభవాలను, అనుభూతులను 'సి-యు-కి' అనే గ్రంథంలో పొందుపరిచాడు. ఈ గ్రంథం హర్షుని కాలంనాటి పరిస్థితులకు అద్దం పడుతుంది.

**ఇత్సింగ్ :**

హుయాన్‌సాంగ్ తరువాత భారతదేశాన్ని దర్శించిన చైనా యాత్రికుడు ఇత్సింగ్. ఇతడు క్రీ.శ. **671 - 695** మధ్యకాలంలో భారతదేశం దర్శించాడు. ఇతడు గుప్తుల తొలినివాసం గురించి కొన్ని వివరాలు ఇవ్వడమేకాక సమకాలీక ఆర్థిక, సాంఘిక వ్యవస్థలనూ, బౌద్ధ విశ్వవిద్యాలయాలను గురించి వర్ణించాడు.

పైన పేర్కొన్న చైనా యాత్రికులు వర్ణించినవి సమకాలీన సంఘటనలు కావడం, ఆ సంఘటనలు వారు కాలాగుణంగా వర్ణించటం వారి రచనల ప్రాముఖ్యాన్ని ఇనుమడింపజేసింది.

**ముస్లింల రచనలు :**

మహమ్మద్ ప్రవక్త ఇస్లాం మతం స్థాపించడంలో ముస్లింల చరిత్ర రచన ప్రారంభమయింది. ముస్లింలు ఇస్లాం మత దృష్టిలో చరిత్ర రచన ప్రారంభించారు. ఖలీఫాలు, ముస్లిం పాలకులు తమ ఆస్థానంలో సూతులను, చరిత్రకారులను ఆదరించి పోషించారు. ప్రాచీన భారతదేశ చరిత్రకు సంబంధించిన ముస్లిం రచనలు క్రీ.శ. **8**వ శతాబ్దం నుంచి లభ్యమవుతున్నాయి.

**ఆల్‌మసూది :**

ఆల్‌మసూది క్రీ.శ. **10**వ శతాబ్దికి చెందిన విజ్ఞాన ఖని. ఇతడు కనోజ పాలకుడైన మిహిరభోజుని పరిపాలనలోని ప్రజాజీవనం గురించి రాశాడు. ఇతనికి సమాచారం సేకరించడంలో ఉన్న ఉత్సాహాన్ని పురస్కరించుకొని కొంతమంది ఇతనిని అరబ్బులలో హెరెడోటస్‌గా కీర్తించారు.

**ఆల్‌బెరూనీ :**

గజనీ మహమ్మద్ ఆస్థాన విద్వాంసుడు ఆల్‌బెరూనీ. ఇతడు గజనీ మహమ్మద్‌తోబాటు భారతదేశం వచ్చాడు. ఇతడు తన గ్రంథం 'కితాబ్-ఉల్-హింద్'లో అత్యంత విశ్వాసనీయంగా నాటి భారత ప్రజాజీవనం, వారి నాగరికతల గురించి వివరించాడు. ఇతడు సంస్కృత విద్వాంసుల సహకారంతో అనేక ఖగోళ, గణిత తదితర శాస్త్ర గ్రంథాలను అరబ్బీ భాషలోకి అనువదించాడు.

**ఇతర ముస్లిం రచనలు :**

మిన్హాజుద్దీన్ తన ప్రసిద్ధ 'తబకత్-ఇ-నాసిరీ'లో భారతదేశంలో ముస్లింల తొలివిజయాల గురించి వివరించాడు. మధుర దేవాలయాల వైభావాన్ని గురించి ఆల్-ఉల్-బీర్ వర్ణించాడు. గజనీ ఆస్థాన కవియైన ఫిర్దౌసి తన 'షానామా'లో అలెగ్జాండర్, మౌర్య చంద్రగుప్తుల వివరాలు పొందుపరిచాడు.

## 7.11 సంక్షిప్తంగా . . .

పైన వివరించినట్లు ప్రాచీన భారతదేశ చరిత్ర పునర్నిర్మించడానికి అనేక ఆధారాలు గలవు. వాటిలో మతపరమైన, వాజ్మయపరమైన చారిత్రక గ్రంధాలు, స్వదేశ విదేశస్తులతో లిఖించబడి ప్రాచీన భారతదేశ చరిత్ర సమగ్రంగా తెలియజేయడానికి తోడ్పడుతున్నాయి. అంతేగాక వివిధ రాజుల కాలాల్లో జారీ చేయబడిన శాసనాలు, నాణేలు, భవన నిర్మాణాలు ప్రాచీన భారతదేవ చరిత్ర రచనకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

## 7.12 పరీక్ష నమూనా ప్రశ్నలు :

**ఎ) క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.**

1. ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ఉపకరించు పురావస్తు ఆధారాలను తెలపండి.
2. దేశీయ వాజ్మయం ప్రాచీన భారతదేశ చరిత్ర రచనకు ఎలా తోడ్పడునో వివరించండి.

**బి) ఈ క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. చరిత్ర నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను తెలపండి.
2. ప్రాచీన భారతదేశ చరిత్రకు శాసనాల ప్రయోజనం వివరించండి.
3. ప్రాచీన చరిత్ర రచనలో విదేశీయ వాజ్మయ ప్రాముఖ్యతను క్లుప్తంగా తెలపండి.

## 7.13 ఉపయుక్త గ్రంథాలు :


| | | |
|---|---|---|
| Ernst Brlisach | : | Histography, Ancient, Medieval and Modern India (Chicago, 1983) |
| V.N. Ghosal | : | The beginings of Indian Historiography and other essays (Calcutta, 1944) |
| Gopal S. and Romilla Thapar | : | Probems of Historical writing in India (New Delhi, 1963) |
| Ramanna A.S. | : | Historical mehods in relation to Indian History (Madras, 1956) |
| Kosambi D.D. | : | An Introduction to the study of Indian History (Bombay, 1985) |
| Circen D.C. | : | Indian Epigraphy (Delhi, 1965) |
| Ramesh K.V. | : | Indian Epigraphy (Delhi, 1984) |
| Robert Sewel | : | The Historical Inscriptions of South India (New Delhi, 1983) |
| Chattopadhyaya B.D. | : | Coins and Currency system in India (Delhi, 1978) |

పాఠం - 8

# మధ్యయుగ భారతదేశ చరిత్ర ఆధారాలు

**విషయక్రమం :**


8.0 లక్ష్యం

8.1 పరిచయం

8.2 తురుష్క యుగం

8.2.1 వాఙ్మయాధారాలు

ముస్లిం రచనలు

8.2.2 విదేశీయ రచనలు

8.2.3 ఇతర రచనలు

8.2.4 పురావస్తు ఆధారాలు

8.3. విజయనగర యుగం

8.3.1 పురావస్తు ఆధారాలు

8.3.2 వాఙ్మయాధారాలు

8.3.3 దేశీయ వాఙ్మయం

8.3.4 విదేశీయ వాఙ్మయం

8.4 మొగల్ యుగం

8.4.1 వాఙ్మయాధారాలు

8.4.2 పురావస్తు ఆధారాలు

8.4.3 విదేశీయ వాఙ్మయం

8.5 మరాఠా యుగం

8.5.1. సామ్రాజ్య యుగం

8.5.2 పీష్వాల యుగం

8.5.3 ఆధునిక రచనలు

8.6 సంక్షిప్తంగా

8.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

8.8 ఉపయుక్త గ్రంథాలు


## 8.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని అధ్యయనం వలన మీరు మధ్యయుగ భారతదేశ చరిత్ర రచనకుపయోగపడే ఆధారాలను విశ్లేషించి వివరించగలగాలి.

- తురుష్కయుగ స్థాపన, వెలువడిన రచనల ప్రాముఖ్యతను, పురావస్తు ఆధారాలను వివరించగలగాలి.
- విజయనగర యుగారంభం, పురావస్తు ఆధారాలు దేశీయ విదేశీయ వాజ్మయాలను విశ్లేషించాలి.
- మొగల్, మరాఠీ యుగాల రచనకుపయోగపడిన వాజ్మయాలను ఇతర ఆధారాలను పరిశీలించాలి.

## 8.1. పరిచయం :

సుదీర్ఘమైన, అవిచ్ఛిన్నమైన భారతదేశ చరిత్రను ప్రాచీన, మధ్య, ఆధునిక అని మూడు యుగాలుగా సౌలభ్యం కొరకు విభజించడం జరిగింది. అయితే ప్రాచీన యుగం ఎప్పటితో అంతమౌతుంది, ఎప్పటి నుండి మధ్య యుగం ఆరంభమౌతుంది, ఎప్పుడు మధ్యయుగం అంతమై, ఆధునిక యుగం ఆరంభమవుతుంది అన్న విషయంలో చరిత్రకారులలో ఏకాభిప్రాయం లేదు. హర్షుని మరణంతో క్రీ.శ. 647లో ప్రాచీనయుగం అంతమయిందని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. కాని హర్షుని తరువాత కూడా భారతదేశాన్ని రాజకీయంగా, సాంస్కృతికంగా సమైక్యం చేసి పాలించాలనే ఆశయంతో భారీఎత్తున ప్రయత్నాలు జరిగాయి. ప్రతీహారాలు క్రీ.శ. 10వ శతాబ్దం ఆరంభానికి ఉత్తరపథానికి సార్వభౌములయ్యారు. క్రీ.శ. 11వ శతాబ్దం ఆరంభంలో భారతదేశంపై తురుష్క దండయాత్రలు ఆరంభమవటంతో ప్రతీహారులు పతనమయ్యారు. భారతదేశంలో ముస్లిం రాజ్యస్థాపనకు దోహదం చేసిన ఘట్టం తురుష్క దండయాత్రల ప్రారంభమేననీ కనుక క్రీ.శ. 11వ శతాబ్ది ఆరంభమే భారతదేశ చరిత్రలో మధ్యయుగానికి నాంది అనీ కొందరు చరిత్రకారుల అభిప్రాయం. భారతదేశ చరిత్రలో ఆధునికయుగం క్రీ.శ. 1526లో ప్రారంభమయిందనీ, మధ్యయుగం క్రీ.శ. 1526లో ఢిల్లీ సుల్తాన్ పతనంలో అంతమయిందని కొందరు భావించారు. క్రీ.శ. 1757లో ఆంగ్ల రాజ్యా స్థాపనలో భారతదేశంలో ఆధునికయుగం ప్రారంభమయిందని మరికొందరి భావం. చారిత్రక ఆధారాల నమూనాను పోల్చినట్లయితే 1206 నుంచి 1757 వరకు సారూప్యం ఉంది. ప్రస్తుత సౌలభ్యం కొరకు క్రీ.శ. 10వ శతాబ్దం నుండి 1757 వరకు గల కాలాన్ని మధ్యయుగంగా స్వీకరించడమైంది. మధ్యయుగాన్ని తురుష్కయుగం, విజయనగరయుగం, మొగలాయి యుగం, మరాఠియుగంగా విభజించి చర్చించడమైంది.

## 8.2. తురుష్క యుగం :

క్రీ.శ. 11, 12 శతాబ్దాల కాలంలో ముస్లింలు గజనీమహమ్మద్, ఘోరీ మహమ్మద్ నాయకత్వంలో ఉత్తర భారతదేశంపై శక్తివంతమైన దాడులు నిర్వహించారు. ఈ దాడులు క్రీ.శ. 1206 లో స్వతంత్ర ఢిల్లీ సల్తనత్ స్థాపనకు దారితీసాయి. ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ సల్తనత్ పరిపాలనను సంఘటితపరచిన తరువాత, క్రీ.శ. 14వ శతాబ్దంలో దక్షిణ భారతదేశ భూభాగాలకు ఆక్రమించడానికి ముస్లింలు ప్రయత్నించారు. ఈ కాలంలోనే దక్కన్‌లో బహమనీ రాజ్యం, దక్షిణాన విజయనగర సామ్రాజ్యం స్థాపితమైంది. ఢిల్లీ సల్తనత్ బలహీనమవడంతో ఉత్తరభారతదేశంలో మొగలాయిలు అధికారాన్ని కైవసం చేసుకొని సమర్థవంతంగా పాలన సాగించారు. వీరి కాలంలో మహారాష్ట్రులు శివాజీ నాయకత్వాన విజృంభించి స్వతంత్ర రాజ్యాన్ని దక్కన్‌లో నెలకొల్పారు. మొగలాయిలు బలహీనం కావడంతో పీష్వాలు విజృంభించి భారత రాజకీయాలలో కీలకపాత్ర నిర్వహించారు. మూడవ పానిపట్టు యుద్ధంతో పీష్వాల బలం క్షీణించడంతో భారతదేశంపై ఆంగ్ల పెత్తనం ప్రారంభమయింది.

### 8.2.1 వాజ్మయ ఆధారాలు - ముస్లిం రచనలు :

భారతదేశంలో ప్రాచీన యుగంలో అపారమైన వాజ్మయం ఉన్నప్పటికీ, అందులో కల్పనలు, భ్రమలు, సాంప్రదాయాలు కలిసిపోయాయి. నిజంగా చారిత్రక ఆధారాలుగా గుర్తింపదగిన వాటిని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అందువల్లనే హిందువులకు చరిత్ర గురించిన ఆసక్తి లేదేమో అన్న అనుమానాన్ని వెలిబుచ్చే అవకాశం ఇవ్వబడింది. కాని మధ్యయుగంలో అలాకాదు.

ముస్లింలు నిజమైన చరిత్ర రచనపట్ల ఆసక్తి చూపారు. ఫలితంగా ముస్లిం పాలకుల ఆదరణలో అనేక చరిత్ర రచనలు వెలువడ్డాయి. రచనల్లో ఏవో కొద్దిమినహా సామాన్య ప్రజానీకానికి సంబంధించిన ప్రస్తావన ఇంచుమించు శూన్యం. మిగతా విషయాలు కూడా పాలకుల ధృక్పధం నుంచే వివరించబడ్డాయి. అంతేగాక మతవివక్షత కూడా ఈ రచనల్లో చోటుచేసుకుంది. ఏది ఏమైనా తురుష్క యుగ చరిత్రకు ప్రధాన ఆధారాలైన పారశీక చారిత్రక వచన రచనలను సమకాలిక విదేశీయుల వ్రాతలతోను, పురావస్తు ఆధారాలతోను సమన్వయిస్తే సమగ్రమైన చరిత్ర లభిస్తుంది.

ముస్లిం చరిత్రకారులు కాలానుక్రమ దృక్పధాన్ని అనుసరించారు. అందువల్ల ముస్లింల చరిత్ర పునర్ నిర్మాణానికి ఎంతో సౌలభ్యం ఏర్పడినది. వీరి కాలక్రమం క్రీ.శ. 622 నుంచి ప్రారంభమయింది. చరిత్రకారులందరూ హిజ్రాశకాన్నే ఉపయోగించడం వల్ల అయోమయానికి తావు లేకుండా పోయింది. సుల్తాను కొలువులో ఉండే ఐతిహాసిక లేఖలతోబాటు సూఫీ సాహిత్య, చరిత్ర కూడా ఎంతో విలువైన చారిత్రక సమాచారాన్ని అందజేస్తున్నాయి. వారి రచనల్లోని మిధ్యావాదం, మార్మికత, ఖగోళంపై చర్చ ఆనాటి మేధోవికాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ముస్లిం సమాజం ఆధ్యాత్మిక రంగంలో ఏస్థాయికి చేరుకుందో ఈ రచనలను బట్టి తెలుసుకోవడమే కాకుండా భారతీయ సమాజంలో జరుగుతున్న మార్పులను కూడా గుర్తించవచ్చు.

ముస్లింల చారిత్రక రచనలను సాధారణ చరిత్రలు, గద్య ప్రశంసలు, ప్రబోధాత్మక చరిత్రలు, కళాత్మక చరిత్రలు అని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. సాధారణ చరిత్రలో వంశావళి పద్ధతిలో నడిచాయి. సైనిక సంఘటనలను కాలక్రమపద్ధతిలో వివరించడం, సుల్తాన్ ఘనతను కీర్తించడం, భూగోళ వివరణ, ప్రజల ఆచార వ్యవహారాల వివరణ ఈ సాధారణ చరిత్రల్లో కనిపిస్తుంది. సుల్తానులను గానీ, కులీనులను కానీ ప్రశంసిస్తూ రచించినవే గద్య ప్రశంసలు. ఈ ప్రక్రియ సుల్తానుల కాలంలో చాలా ఉత్కృష్టస్థాయికి చేరింది. షమ్సుద్దీన్-సిరాజ్-అఫీఫ్ రచించిన 'తారిఖ్-ఇ-ఫిరోజ్ షాహి' అనే గద్యావళి ఈ కోవకు చెందిందే. ప్రబోధాత్మక చరిత్రలో చరిత్రకారుడు తన భావాల ద్వారా పాఠకులను ప్రభావితం చేయాలన్న ప్రయత్నం కనిపిస్తుంది. బరానీ రాసిన 'తారిక్-ఇ-షిరూత్ షాహి' ప్రబోధాత్మక చరిత్రకు తార్కాణం.

## అల్‌బెరూని :

తురుష్కయుగ చరిత్ర ఆధారాలలో ప్రథమంగా ప్రస్తావించవలసింది అరబ్బీ రచనలు. గజనీ మహమ్మద్‌తోబాటు భారతదేశం వచ్చిన అతని ఆస్థాన విద్వాంసుడు ఆల్-బెరూని ఆనాటి పరిస్థితులను 'కితాబ్-ఉల్-హింద్' అను గ్రంథంలో వివరించాడు.

## మిన్హాజ్-ఉస్-సిరాజ్ :

నాసర్ ఉద్దీన్ ఆస్థాన చిత్రకారుడు, ఢిల్లీ ప్రధాన ఖాజీ అయిన మిన్హాజ్-ఉస్-సిరాజ్ పారశీకంలో 'తబకాత్-ఇ-నాసిరీ' అను గ్రంథం రాసాడు. ఇందులో ఘోరీ మహమ్మద్ భారత దిగ్విజయాలను, క్రీ.శ. 1260 వరకు తురుష్కుల పాలన వర్ణించబడింది.

## అమీర్‌ఖుస్రూ :

తురుష్కయుగ పారశీక రచయితలందరిలో అత్యంత ప్రముఖుడు అమీర్ ఖుస్రూ. ఇతడు ఆరుగురు సుల్తానులకు సమకాలికుడు. కైకూబాద్, బుగ్రాఖాన్, జలాలుద్దీన్ ఖిల్జీ, అల్లాఉద్దీన్‌ఖిల్జీ, కుతుబ్‌ఉద్దీన్ ముబారక్‌షా, ఘియాజ్‌ఉద్దీన్ తుగ్లక్‌ల కాలంలో ఇతడు జీవించి యున్నాడు. ఇతడు 92 గ్రంథాలు రచించినట్లు ప్రసిద్ధి. ఖుస్రూ నిజానికి చరిత్రకారుడి కంటే కవిగా ఎక్కువ ప్రసిద్ధుడు. ఇతని రచనల్లో క్రమత, కాలక్రమపద్ధతి లోపించింది. ఇతనికి దైవభక్తి ఎక్కువ. చారిత్రక సంఘటనలకు ప్రేరకుడు భగవంతుడే అనే రీతిలో ఇ తడు చరిత్ర రచించాడు. ఇతరి చరిత్ర రచనల్లో ముఖ్యమైనవి జలాలుద్దీన్ ఖిల్జీ సైనిక కార్యకలాపాలపై రాసిన 'మిఫ్తాహ్-ఉల్-ఫుతూహ్'' (1291), ముబారక్ షా దండయాత్రపై 1318లో 'మహ్ సిపిహర్' 'ఘియాజ్

ఉద్దీన్ తుగ్లక్ ఢిల్లీ సింహాసనమధిష్టించడానికి దారితీసిన పరిస్థితులపై రచించిన 'తుగ్లక్ నామా', అల్లాఉద్దీన్ ఖిల్జీ తొలిపాలనకు సంబంధించిన సంఘటనలు ముఖ్యంగా మాలిక్‌కాఫర్ దక్షిణ దిగ్విజయ యాత్రపై రాసిన 'తారిఖ్-ఇ-ఆలై' మొదలగునవి. ఖుస్రూ తన రచనల్లో చారిత్రక సంఘటనలతోబాటు ఆనాటి సాంఘిక పరిస్థితులను, దేశంలోని ఇతర స్థితిగతులను వర్ణించాడు.

## జియాఉద్దీన్ బరనీ :

మధ్యయుగ ప్రసిద్ధ చరిత్రకారుల్లో ప్రథముడు జియాఉద్దీన్ బరనీ, చరిత్రపట్ల ఇతనికి ఉన్నతమైన చక్కని అవగాహన. ఉంది. ఉన్నది ఉన్నట్లు రాయడమే చరిత్రకారుని విధి అని ఇతడు విశ్వసించాడు. క్రీ.శ. 1358లో బరనీ 'తారిఖ్-ఇ-ఫిరూత్ షాహి' అనే గ్రంథాన్ని రచించాడు. ఇది 'తబకత్-ఇ-నాసిరీ'కి కొనసాగింపు. రాజకీయ సంఘటనలతోబాటు వ్యవసాయం, ఆర్థిక, పాలన సంబంధమైన అంశాలను బరనీ తన గ్రంథంలో ప్రస్తావించాడు. చరిత్ర తెలుసుకోవడం వల్ల ఏమీ ప్రయోజనాలున్నాయో వివరిస్తూ బరనీ తన చారిత్రక దృక్పథాన్ని వెల్లడించాడు. బాల్బన్ నుండి ఫిరోజ్‌షా తుగ్లక్ తొలి ఆరు సంవత్సరాల పరిపాలన వరకు చారిత్రక పరిణామాలను బరనీ వివరించాడు. గ్రంథంలో బాల్బన్, అల్లాఉద్దీన్ ఖిల్జీలకు ఎక్కువ సమయం, చోటు ఇవ్వడం జరిగింది. మహమ్మద్ బిన్ తుగ్లక్ పాలనకు సంబంధించిన వర్ణన సరిగ్గాలేదు. మంగోల్ దండయాత్రలు, దక్షిణ భారత దిగ్విజయ యాత్రలు, అల్లాఉద్దీన్ ధరల నిర్ణయం, మహమ్మద్ బిన్‌తుగ్లక్ నాణాల పద్ధతి మొదలగు అంశాలను కూడా బరనీ వర్ణించాడు. ఒక చరిత్రకారునికి ఉండకూడని భావవృత్తిపరమైన బలహీనత బరనీలో ఉన్నా 14వ శతాబ్దపు భారత చరిత్రకు బరనీ గ్రంథం ముఖ్యమైన ఆధారం.

## ఇసామీ :

ఇసామీ అనే చరిత్రకారుడు 'ఫుతూ-ఉస్-గులాతిన్' అనే గ్రంథాన్ని 1349లో రచించాడు. ఈ గ్రంథంలో పదకొండు వేల రెండు పంక్తులున్నాయి. గజనీ మహమ్మద్ కాలం నుంచి క్రీ.శ. 1349 వరకూ జరిగిన భారత చరిత్రను ఈ గ్రంథం ప్రస్తావిస్తున్నది. ఇసామీ దక్కన్‌లో ఉండి అల్లాఉద్దీన్ హసన్ బహమన్‌షా చరిత్రకూడా రాశాడు. ఢిల్లీ సుల్తానులంటే ఇసామీకి సానుభూతి ఉంది. మంగోలుల దాడిని సుల్తానులు ఎదుర్కొన్న పద్ధతిని ఇసామీ ప్రశంసించాడు. సంఘటనలను కథాభాగాలుగా ఇసామీ రచించాడు. ఇతని రచనాశైలిలో ప్రభోధాత్మక శైలి స్పష్టంగా కనిపిస్తుంది. దక్కన్‌పై సైన్యాన్ని పంపిన మహమ్మద్-బీన్-తుగ్లక్‌ను ఇసామీ విమర్శించాడు. త చరిత్రలో అనేక ఆసక్తికరమైన అంశాలను ఇమడ్చడం వల్ల ఇసామీ రచన ఇతిహాసంలా నడిచిపోతుంది.

## షమ్సుద్దీన్ సిరాజ్ అఫీఫ్ :

షమ్సుద్దీన్ సిరాజ్ అఫీఫ్ 'తారిఖ్-ఇ-ఫిరోజ్ షాహి' రచించాడు. భగవంతుని పేర ఆఫీఫ్ తన గ్రంథ రచన ప్రారంభించాడు. జీవితకథ రీతిలో రచన సాగింది. సుల్తానుల పాలన, ప్రవర్తన గురించి వివరిస్తూ మార్మికమైన పదజాలాన్ని ఉపయోగించాడు. తన సుల్తాన్ అయిన ఫిరోజ్‌షాకు ప్రబోధం చేయడానికి అఫీఫ్ ఈ గ్రంథాన్ని ఉద్దేశించాడు.

## యాహ్యా-ఇబిన్-అహ్మద్-సర్హిందీ :

సర్హిందీ 'తారిఖ్-ఇ-ముబారక్ షాహి' అనే గ్రంథాన్ని రచించాడు. క్రీ.శ. 1400 - 1434 మధ్యకాలపు సయ్యద్ రాజవంశీకుల గురించి ఈ గ్రంథం వివరిస్తున్నది. ఇది క్లుప్తంగా సాగిన చరిత్రరచన. సయ్యద్ వంశస్థుల కాలంలో జరిగిన ప్రధాన సంఘటనలు, తిరుగుబాట్లు, యుద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు, ఇతర సంఘటనల గురించి ఈ గ్రంథం వివరిస్తుంది. దీనికితోడు కొన్ని నైతిక వ్యాఖ్యానాలు జోడించి, అంతా భగవంతుని లీల అంటూ తన గ్రంథాన్ని సర్హిందీ ముగిస్తాడు. మధ్యయుగాల నాటి చారిత్రక రచనల్లో ఉండే లక్షణాలన్నీ ఈ గ్రంథంలో ఉన్నాయి.

**ఫెరిస్తా :**

ఫెరిస్తా దక్షిణాదికి చెందిన ప్రముఖ చరిత్రకారుడు. ఇతర చరిత్రకారుల వలే కాకుండా ఫెరిస్తా తాను ఎవరి వద్ద నుంచి సమాచారం సేకరించిందీ స్పష్టంగా పేర్కొన్నాడు. తన సమాచారాన్నీ ఫెరిస్తా పలుమార్లు పరీక్షించుకున్నాడు. తాను చూసిన సంఘటనల వివరాలు తెలియజేయటం పట్లనే ఫరిస్తా ఆసక్తి ప్రదర్శించాడు. తన వ్యాఖ్యానాలు జోడించటం పట్ల అతను ఆసక్తి ప్రదర్శించలేదు. ఆనాడు దేశంలో వివిధ ప్రాంతాల్లో స్వతంత్రంగా పాలిస్తున్న సుల్తానుల పాలనా చరిత్రను చాలా వరకు ఫెరిస్తా వ్రాసాడు.

**బక్రా మహ్మద్ మాసూమ్ :**

మాసూమ్ 'తారిఖ్-ఇ-మాసూమీ' అనే గ్రంథాన్ని వ్రాసాడు. మాసూమ్ ఈ పుస్తకాన్ని క్రీ.శ. 1600 సంవత్సరంలో సింధ్ ప్రాంతం పరిస్థితిని వివరిస్తూ రాశాడు. గజనీ మహమ్మద్ చరిత్రను వివరించే 'కితాబ్-ఉల్-యామిని' అను గ్రంథాన్ని కూడా మాసూమ్ రచించాడు.

**ఇతర గ్రంథాలు :**

మహమ్మద్-ఆలీ-బిన్ అబూ బకర్ కుఫీ రచించిన 'చాచ్‌నామా', అబ్దుల్ ఫజల్ మహ్మద్-విన్ హుసేన్ రచించిన 'తారిఖ్-ఇ-మసూదీ, షేక్ అబ్దుల్ హసన్ రచించిన 'కామిల్-ఉల్-తవారిఖ్' హసన్‌నిజామీ రచించిన 'తాజ్-ఉత్-మాసిర్' ఫిరోజ్ షా తుగ్లక్ రచించిన 'ఫుతూహత్-ఇ-ఫిరోజ్‌షాహి, అబ్బాస్ షేర్వాణీ రచించిన 'తారిఖ్-ఇ-షేర్ షాహి' కూడా ఢిల్లీ సుల్తాన్‌తో యుగ చరిత్రకు ఆధారాలే. బాల్బన్, ఇల్ టుట్ మిష్ కాలంనాటి సంఘటనల వివరాలు 'తాజ్-ఉల్-మాసిర్' పుస్తకంలో గలదు. లోడీలు, సుర్ ల గురించి వివరించే గ్రంథం 'తారిఖ్-ఇ-షేర్‌షాహి' సుల్తాన్ ఫిరోజ్‌షా కూర్చిన ఒక చిన్న పుస్తకం 'ఫుతూ-హాత్-ఇ-ఫిరోజ్‌షాహీ'. దీని విస్తృత కథనమే అజ్ఞాత రచయిత రచన 'సీరత్-ఇ-ఫిరోజ్‌షాహీ'. తుగ్లక్‌ల పాలనకు ఇంచుమించు చరమగీతం పాడిన తైమూర్ దండయాత్ర విశేషాలను తురుష్క భాషలో అతని స్వీయచరిత్ర 'మత్వాజాత్-ఇ-తైమూరీ' నుండి గ్రహించవచ్చు. నిజాముద్దీన్, బదౌనీల రచనలు తురుష్క యుగచరిత్ర పునర్నిర్మాణానికి తోడ్పడుతున్నాయి. ఇవిగాక కొన్ని స్వతంత్ర సుల్తానుల ప్రాంతీయ చరిత్ర రచనలూ లభిస్తున్నాయి. కాశ్మీర్, సింధ్, బెంగాల్, గుజరాత్, దక్కన్ ప్రాంతాల చరిత్రను తెలియజేసే ముస్లింల రచనలు గాక జొనరాజు వంటి హిందూ రచయితల వంశచరిత్రలు, స్థానిక కథాగేయాలు, ఇంకా అనేక ఇతర ఆధారాలు లభ్యమయ్యాయి.

## 8.2.2. విదేశీయ రచనలు :

ప్రాచీన కాలం నుంచి భారతదేశానికి పెక్కుమంది విదేశీ యాత్రికులు, తాత్వికులు, దౌత్యవేత్తలు, పండితులు వస్తూ వుండేవారు. వారు చేసిన రచనలు భారతదేశ చరిత్ర పునర్ నిర్మాణానికి ఎంతగానో ఉపకరిస్తున్నాయి. భారతదేశానికి వచ్చిన ముస్లిం సేవల వెంట కొందరు పండితులు, రచయితలు కూడా నచ్చారు. భారతదేశానికి వచ్చిన తొలి ముస్లిం యాత్రికుల్లో ఆల్‌బెరూనీని పేర్కొనవచ్చు. ఇతను 'కితాబ్-ఉల్-హింద్' అనే గ్రంథాన్ని రచించాడు.

**ఇబన్ బట్టూటా :**

'యాత్రికుల్లో రాజు''గా పరిగణించబడిన ఇబన్‌బట్టూటా క్రీ.శ. 1333లో భారతదేశానికి వచ్చి సుమారుగా 14 సంవత్సరాలు భారతదేశంలోనే గడిపాడు. మొరాకో దేశస్థుడైన ఇబన్‌బట్టూటా 8 సంవత్సరాలు ఢిల్లీలోనే గడిపాడు. అక్కడే ఖాజీగా ఇతన్ని సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ నియమించాడు. తరువాత చైనాకు రాయబారిగా పోతూ దక్షిణభారతం దర్శించాడు. నాటి దేశ

స్థితిగతులను 'కితాబ్-ఉల్-రహ్లాబ్' అనే గ్రంథంలో అరబ్బీ భాషలో పొందుపరిచాడు. ప్రజ్ఞావంతుడైన విస్తృత పర్యాటకునిగా, అనుభవజ్ఞునిగా, ఇబన్‌బటూటా వాస్తవం తెలుసుకోవడానికి తనకున్న అధికారం, అవకాశం వినియోగించుకొని రాసిన గ్రంథమిది. అందువల్ల అత్యంత వివాదాస్పదుడైన వ్యక్తి మహమ్మద్‌బిన్ తుగ్లక్ పాలనపై ఆ రచన అమూల్యమైనది. హిందూస్థాన్‌లో కట్టుబాట్లు, ఆచారాలు, అలవాట్లను గురించి బటూటా తన రచనల్లో పేర్కొన్నాడు. అయితే ఈ పుస్తకంలో చరిత్రతోబాటు వదంతులకు, పుకార్లకు ఎక్కువస్థానం ఇవ్వడంవల్ల అది కథల పుస్తకంలా కనిపిస్తుంది. స్థానిక భాషలు రాకపోవడం ఈ చరిత్రకారుడిలో పెద్దలోపం.

### మార్కోపోలో :

క్రీ.శ. 13వ శతాబ్దంలో వెనిస్ యాత్రికుడైన మార్కోపోలో దక్షిణ భారతదేశాన్ని దర్శించాడు. ఇతని రచనలు ఆనాటి ఆర్థిక, సామాజిక చరిత్ర రచనకు ఆధారంగా వున్నాయి. తూర్పుకోస్తాలో మోటుపల్లి గురించి మార్కోపోలో ప్రస్తావించాడు. కాకతీయ సామ్రాజ్యం గురించి, వారి విచిత్రమైన మత, సామాజిక ఆచారాల గురించి ఇతను వివరించాడు. ఆర్థిక చరిత్ర రచనకు మార్కోపోలో రచనలు చక్కగా ఉపకరిస్తున్నాయి.

### 8.2.3 ఇతర రచనలు :

ఇతర యాత్రా వృత్తాంతంలో ఇటలీ యాత్రికులు నికోలా కాంటి, వార్థెమాలు, పర్షియా రాయబారి అబ్దుల్ రజాక్, రష్యా వ్యాపారి నికితిన్, పోర్చుగీసు బార్బోసా, పేయస్‌ల రచనలు ముఖ్యమైనవి. విజయనగర రాజధానిలో రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక జీవనం ఎలా సాగుతున్నదీ రజాక్ వివరించాడు. కాంటి కృష్ణదేవరాయల కాలంలో విజయనగర రాజధానిని దర్శించాడు.

### 8.2.4 పురావస్తు ఆధారాలు :

పురావస్తు ఆధారాలైన శాసనాలు, నాణేలు ప్రాచీనయుగ భారతదేశ చరిత్రకు ఉపకరించినంతగా తురుష్క యుగానికి ఉపయోగకరం కాకపోయినా సంఘటనల కాలక్రమణికను నిర్ధారించడంలోను, వంశ చరిత్రలలో ఇవ్వబడిన పాలకుల జాబితాను, వారి తేదీలను సవరించడంలోనూ, రాజ్యసరిహద్దులను రమారమిగా నిర్ణయించటంలోనూ చాలా సహాయపడుతున్నాయి.

శాసనాలు, నాణేలు గాక నేటికి నిలిచివున్న ముస్లింల మినార్లు, ప్రాసాదాలు, మసీదులు, సమాధులు తురుష్కయుగ ప్రత్యేక ముస్లిం వాస్తు శిల్పకళారీతులకు అద్దంపడుతున్నాయి. స్థానిక సంప్రదాయాల ప్రభావాలకు లోనైన ముస్లిం వాస్తుకళ హిందూస్థానీ శైలిగా రూపొందించటం కూడా పలు ప్రాంతాలలోని నిర్మాణాలు సూచిస్తున్నాయి. తురుష్కయుగ నిర్మాణాలలో పేర్కొనదగినవి కుతుబ్‌మినార్, కువ్వత్-ఉల్-ఇస్లాం మసీదు, అథాయి-దిన్-కా-జోన్‌ప్రా మసీద్, ఆలయ్ దర్వాజా, ఘియాసుద్దీన్ సమాధి, ఫిరోజ్ నిర్మించిన కోట్లా అనే కోట మొదలగునవి.

## 8.3 విజయనగర యుగం :

క్రీ.శ. 1336లో స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యం క్రీ.శ. 17వ శతాబ్దం ద్వితీయార్థం వరకూ కొనసాగింది. సంగమ, సాళువ, తుళువ, ఆరవీటి వంశాలకు చెందినవారు ఈ సామ్రాజ్యాన్ని పాలించారు. సుమారు రెండు శతాబ్దాలకు పైగా దక్షిణపథంలోనేగాక మొత్తం భారతదేశంలోనే కీలకపాత్ర వహించిన విజయనగర సామ్రాజ్య చరిత్ర మౌలికాధారాలు అపారంగా లభిస్తున్నాయి. వీటిని ప్రధానంగా పురావస్తు, వాఙ్మయ ఆధారాలుగా విభజించవచ్చు.

### 8.3.1 పురావస్తు ఆధారాలు :

విజయనగర చరిత్ర పునర్ నిర్మాణానికి ఉపకరించే పురావస్తు ఆధారాలలో శాసనాలు, నాణేలు, నిర్మాణాలు ముఖ్యమైనవి.

**శాసనాలు :**

విజయనగర రాజ్య పూర్వచరిత్రకు, రాజ్య ఆవిర్భావం, పురోభివృద్ధికి సంబంధించిన చరిత్రకు శాసనాలు ఎంతో ఉపకరిస్తున్నాయి. విజయనగర సామ్రాజ్యానికి సంబంధించి శిలా, తామ్ర శాసనాలు 5 వేలకు పైగా లభించాయి. శ్రీరంగరాయలకు చెందిన ఒక వెండి శాసనం కూడా లభ్యమయింది. ఈ శాసనాలు అనేక భాషలలో ఉన్నాయి. నందీ నాగరి లిపిలో తామ్ర ఫలకాలపైన సంస్కృత భాషలో శాసనాలు చెక్కబడ్డాయి. శిలాశాసనాలలో సంస్కృతం, స్థానిక భాషలైన తెలుగు, తమిళ,కన్నడ భాషల్లో ఏదో ఒకటి కన్పిస్తున్నాయి.

క్రీ.శ. 1314 నాటి మొదటి బుక్కరాయల గోజలవీడు శాసనం దొరికిన ప్రాంతం, దానిలో ప్రస్తావించిబడిన సంవత్సరం పురస్కరించుకొని బుక్కరాయలు కాకతీయ రెండో ప్రతాపరుద్రుని సామంతునిగా నెల్లూరు ప్రాంతాలను పరిపాలించాడని, ఆ దృష్ట్యా విజయనగర స్థాపకులు ఆంధ్రులేనని నేలటూరి వెంకట రమణయ్య అభిప్రాయపడ్డాడు. క్రీ.శ. 1336 నాటి మొదటి హరిహరుని బాఘూపల్లి తామ్రశాసనం, క్రీ.శ. 1356 నాటి రెండో సంగముని బిట్రగుంట తామ్ర శాసనం సంగమ సోదరుల వంశాను క్రమణికకు ఆధారం' శ్రావణ బెళగోళలలో లభించిన క్రీ.శ. 1368 నాటి రామానుజ శాసనం మొదటి బుక్కరాయల మతసహన విధానాల్ని ప్రతిబింబిస్తున్నది. కుమార కంపనకు ఆపాదించబడిన సుమారు 132 శాసనాలు తమిళనాడు ప్రాంతాలను అతడు జయించి విజయనగర రాజు ప్రతినిధిగా పాలించిన వివరాలను తెలియజేసాయి. క్రీ.శ. 1378 నాటి రెండో హరిహరుని చెన్నరాయపట్టణ శాసనం విజయనగరాన్ని మొదటి బుక్కరాయలు రాజధానిగా చేసుకున్నాడని చెబుతున్నది. క్రీ.శ. 1434 నాటి రెండో దేవరాయల శ్రీరంగం తామ్రశాసనం రాజవంశ క్రమాన్ని, అనేక సుంకాల జాబితాను తెలుపుతుంది. విజయనగర సింహాసనాన్ని సాళువ నరసింహుడు ఆక్రమించడం, సాళువ వంశ క్రమం వివరాలు ఇమ్మడి నరసింహుని క్రీ.శ. 1504 నాటి దేవులపల్లి తామ్రశాసనం చెబుతుంది.

శ్రీకృష్ణదేవరాయలకు సంబంధించిన శాసనాలనేకం లభించాయి. వీటిలో తామ్ర, శిలాశాసనాలు గలవు. షిమోగా తామ్రశాసనం, సంగ్లీ మ్యూజియం తామ్రశాసనం కొన్ని ప్రధాన రాజకీయ సంఘటనలను తెలియజేస్తున్నాయి. క్రిస్నిపాడు, సెట్టూరు, రుద్రపుర, పెయ్యలబండ, నాగలాపురం తామ్రశాసనాలు కృష్ణరాయలు సింహాసనానికి రావడం, అతని పట్టాభిషేకం, సైనిక దండయాత్రలు, తీర్థయాత్రలు, కట్టడాల నిర్మాణం, ప్రజోపయోగకర కార్యాల గురించి వివరాలు తెలియజేస్తున్నాయి. హంపి, అమరావతి, మంగళగిరి, కొండవీడు, సింహాచలం శిలాశాసనాలు అతని తూర్పు దిగ్విజయయాత్ర, దేవాలయాలకిచ్చిన దానాల విశేషాలు, విధించిన సుంకాలు వివరిస్తున్నాయి. అచ్యుతరాయల కడలాడి తామ్రశాసనం అతడు సింహాసనాసీనుడైన సందర్భంలోని కొన్ని చిక్కులను పరిష్కరించడంలో తోడ్పడుతున్నది. ఆరవీటి వంశక్రమ వివరాలను కూడా శాసనాలు ఇస్తున్నాయి.

**నాణేలు :**

విజయనగర రాజుల నాణాలను 'పగోడా'లంటారు. ఈ నాణాలపై ఆఖ్యలు మొదట్లో తెలుగు లేదా కన్నడం లేదా నాగర లిపిలో ఉన్నా తరువాత కాలంలో కేవలం నాగరలిపిలోనే ముద్రించబడ్డాయి. విజయనగర చక్రవర్తులు ముద్రించిన బంగారు, వెండి నాణేలపై ఒకవైపు వృషభం, గజం, గండభేరుడం, హిందూ దేవతలు - వీటిలో ఏదో ఒక బొమ్మ, రెండోవైపు పరిపాలకానిపై ఆఖ్య లేక అతని బిరుదు ముద్రించబడ్డాయి. ఈ నాణేలను బట్టి ఆయా రాజుల మతాభిమానం, నాటి ఆర్థిక స్థితిగతులు తెలుసుకోగలం. కొన్ని సందర్భాలలో నాణాలకు రాజకీయ ప్రాముఖ్యం కూడా ఉండవచ్చు. ఉదాహారణకు బాలకృష్ణ ప్రతిమగల శ్రీ కృష్ణదేవరాయల నాణేలు అతని ఉదయగిరి దిగ్విజయాన్ని ధృవపరుస్తున్నాయి.

**నిర్మాణాలు :**

విజయనగర రాజుల ఆదరణలో అనేక నిర్మాణాలు జరిగాయి. ఈ నిర్మాణాలు ఆనాటి చరిత్ర నిర్మాణానికి ఉపకరిస్తున్నాయి. ఈ నిర్మాణాలు వారి వాస్తు కళాభిరుచికి, నాటి కళా నైపుణ్యానికి నిదర్శనాలు. అంతేగాక ఆనాటి మత, సాంస్కృతిక చరిత్ర నిర్మాణానికి కూడా ఈ నిర్మాణాలు దోహదం చేస్తున్నాయి. శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలో ప్రారంభమైన దేవాలయ వాస్తువు విజయనగర కాలంలో పరాకాష్ట చెందింది. విజయనగర రాజులు నిర్మించిన దేవాలయాలు కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలలో వున్నాయి. రాజధాని హంపిలో విరూపాక్ష, విఠల, హజార రామాలయాలు, ఏకశిలారథం, వినాయక ఉగ్రనరసింహ విగ్రహాలు, పద్మమహల్, గజశాలలు, విజయనగర సామ్రాజ్య ఐశ్వర్యానికి వైభవానికి నిదర్శనంగా నేటికీ వున్నాయి. ఆంధ్రలో వీరి నిర్మాణాలు పుష్పగిరి, తాడిపత్రి, లేపాక్షి, చంద్రగిరి, పెనుగొండ, కాళహస్తి మొదలగు చోట్ల తమిళనాడులో కంచి మొదలగుచోట్ల వీరి దేవాలయాలున్నాయి. లేపాక్షి వర్ణ చిత్రాలకు ప్రసిద్ధి. కళ్యాణమండపాలు, ఏత్తైన గోపురాలు, 1000 స్తంభాల మండపాలు, సప్తస్వరాలిచ్చే స్తంభ మండపాలు విజయనగర వాస్తువుకు ప్రత్యేకతలు. దేవాలయాలు, అందలి శిల్పాలు, వర్ణచిత్రాలు ఆనాటి సంగీతం, నాట్యం, వాస్తు శిల్ప వర్ణ చిత్ర కళలు, ఆర్థిక, మత, పరిస్థితులకు తెలుసుకోవడానికి ఉపకరిస్తున్నాయి.

## 8.3.2 వాఙ్మయాధారాలు :

విజయనగర యుగ చరిత్రకు పురావస్తు ఆధారాల కంటే వాఙ్మయ ఆధారాలే ఎక్కువ ప్రయోజనకరంగా వున్నాయి. వాఙ్మయాధారాలను దేశీయ, విదేశీయ అని రెండు తరగతులుగా విభజించవచ్చు.

## 8.3.3 దేశీయ వాఙ్మయం :

విజయనగర చరిత్రకు ఉపకరించే దేశీయ వాఙ్మయంలో వంశ చరిత్రలు, సాధారణ సాహితీ రచనలు, కైఫీయత్తులు లేక 'దండె కవిలెలె' అని వ్యవహరించబడే కార్యనిర్వాహక రికార్డులు ఉన్నాయి.

**వంశ చరిత్రలు :**

వంశ చరిత్రలలో కాలజ్ఞాన సాహిత్యం, అభుద్యయ కావ్యాలు అను రెండు తరగతులు గలవు. చరిత్రలోని కొన్ని చిక్కు సమస్యలను పరిష్కరించడానికి కాలజ్ఞానాలు సహాయపడుతున్నాయి. మహాపురుషులు ఘనకార్యాలు అభ్యుదయ కావ్యాలలో వర్ణించారు. క్రీ.శ. 15 వ శతాబ్దానికి పూర్వపు విజయనగర చరిత్రను 'విద్యారణ్య కాలజ్ఞానం' క్లుప్తంగా వర్ణిస్తుంది. విజయనగర రాజ్య స్థాపనకు దారితీసిన పరిస్థితులను 'విద్యారణ్య వృత్తాంతం' వివరిస్తుంది.

అభ్యుదయ కావ్యాల తరగతికి చెందిన 'కంపరాయ చరిత్ర'ను గంగాదేవి రచించింది. ఇందులో ఈమె తన భర్త కుమార కంపన మధుర విజయాన్ని అద్భుత కావ్యశైలిలో వర్ణించింది. డిండిముడు తన 'సాళువాభ్యుదయం'లో సాళువనరసింహుని యుద్ధాలను వర్ణించాడు. స్థానాపతినాయని విశ్వనాథ నాయకుని 'రాయ వాచకము' శ్రీ కృష్ణదేవరాయలకు వీరపూజ చేస్తుంది. ఆరవీటి రెండో వెంకటపతిరాయల ఆజ్ఞపై ఆథవణం ఉద్యోగులు తయారుచేసిన నివేదిక 'విజయనగరద సామ్రాజ్యపు ఇది మౌలికంగా అకౌంటు పుస్తకం. కాని దీని మొదటిపుటలో కృష్ణదేవరాయల పట్టాభిషేకం, ముస్లింలపైనా, గజపతులపైన అతడు చేసిన దాడులు, గజపతి రాకుమార్తెతో అతని వివాహం, కొన్ని తేదీలు ప్రస్తావించబడ్డాయి. 'నల సంవత్సర పంచాంగానికి' పీఠిక రాజనాధ డిండిముని 'అచ్యుత రాయాభ్యుదయం', తిరుమలాంబ రచించిన 'వరదాంబిక పరిణయం', రామభద్రాంబ రచన రఘునధాభ్యుదయం ఆయా రాజుల విజయాలను వర్ణిస్తున్నాయి. అయితే ఈ రచనల్లో చరిత్రకారుడు చారిత్రక యధార్థాలు వెతుక్కోవాలి.

తమిళభాషలో ఉన్న 'కొంగుదేశ రాజక్కల్' నుంచి కొన్ని విజయనగర చారిత్రక విషయాలను ముఖ్యంగా కృష్ణరాయల యుద్ధకార్యాలకు సంబంధించి గ్రహించవచ్చు. ఒరియాభాషలోని 'మాదలపాంజి' కూడా కృష్ణరాయల కాలం గురించి కొన్ని విశేషాలు తెలియజేస్తుంది.

## సాధారణ సాహితీ రచనలు :

విజయనగరరాజుల ఆదరణలో రూపం దిద్దుకొన్న సాధారణ సాహితీ రచనల్లో వ్యాఖ్యానాలు, కావ్యాలు, నాటకాలు, ప్రహసనాలు మొదలైనవి గలవు. ఇవి కూడా విజయనగర చరిత్ర నిర్మాణానికి ఉపకరిస్తున్నాయి.

మాధవాచార్యుడు, అతని సోదరుడు, సామనుడు, మాధవమంత్రి మొదలైన వ్యాఖ్యాతల రచనల్లో సంగమవంశ ఆవిర్భావం గురించీ, సంగమ పూర్వ పాలకుల గురించి వివరణ ఉంది.

సంస్కృత గ్రంథాలలోని లక్షణ పండితుని 'వైద్యరాజ్య వల్లభమ్' పీఠికలో రెండో బుక్కరాయల వంశ చరిత్ర ప్రస్తావించబడింది. శ్రీ కృష్ణదేవరాయలు రచించిన 'జాంబవతీ కల్యాణం' చివరలో రచయిత ఆశలు, ఆశయాలు ప్రతిబింబించబడ్డాయి. సోమనాథ కవి 'వ్యాసయోగి చరితమ్' రాశాడు. ఇందులో సాళువ నరసింహుని నాటినుంచి కృష్ణ దేవరాయల పాలన వరకు రాజగురువైన వ్యాసతీర్థునికి అతని పోషకులతో వున్న సంబంధాలను, ఆ పాలకుల వ్యక్తిత్వాలను పొందుపరచడం జరిగింది. కృష్ణదేవరాయల ఆస్థాన సంగీత విద్వాంసుడు లక్ష్మీనారాయణుడు రచించిన 'సంగీత సూర్యోదయం' పీఠిక భాగంలో కృష్ణదేవరాయలు రాయచూరు ముట్టడి, అతని ఇతర సైనిక కార్యకలాపాల గురించి ప్రస్తావించబడింది. నాదిండ్ల గోపమంత్రి, రామయామాత్య, మోహనాంగిల గ్రంథాలు కృష్ణదేవరాయలనాటి సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను వివరిస్తున్నాయి.

విజయనగర చరిత్ర నిర్మాణానికి ఉపకరించే వాఙ్మయం తెలుగు భాషలో అధికంగా ఉంది. సంగమ వంశానికి చెందిన మొదటి బుక్కరాయలు, రెండో హరిహరునికి సంబంధించిన విషయాలు కొన్ని వల్లభరాయని 'క్రీడాభిరామము'లో వర్ణితమయింది. మొదటి దేవరాయల కార్యకలాపాలు జక్కన రచించిన 'విక్రమార్క చరిత్ర'లో వివరించబడింది. రెండో దేవరాయల ఆస్థానవైభవం, నాటి ప్రజల సాంఘిక జీవనం శ్రీనాధుని చాటువుల్లో వర్ణించబడింది. సాళువ, తుళువ వంశ చరిత్రలకు పినవీరభద్రుని 'జైమినీ భారతము', నంది మల్లయ్య, ఘంట సింగయ్యల 'వరాహ పురాణం' ముఖ్యమైన ఆధారాలు. కృష్ణదేవరాయలు ప్రబంధశైలిలో రచించిన పద్యకావ్యం 'ఆముక్త మాల్యద' రాయల దండ్రయాత్రలను, రాజనీతిని, నాటి సారస్వత స్థాయిని తెలియజేస్తున్నది. కృష్ణరాయ ఆస్థానాన్ని అలంకరించిన పెద్దన వంటి 'అష్టదిగ్గజ' కావ్యాలు సమకాలీన సాంఘిక, మత, ఆర్థిక పరిస్థితులను వివరిస్తున్నాయి. ఈ కోవకు చెందిన కావ్యాలనేకం కృతిపతుల వంశ చరిత్రలను వివరిస్తున్నాయి.

## బిరుద గద్యాలు :

రాజప్రసాద వంది మాగధులు పోషకులైన రాజులను నిత్యం స్తోత్రం చేసేవారు. భట్టులు పఠించే ఈ బిరుద గద్యంలో ప్రభువుల విజయాలు ప్రస్తావించడం జరిగింది. ఈ బిరుద గద్యమే తరువాత వంశ చరిత్రగా పరివర్తన చెందింది. ఉదాహరణకు ఆరవీటి వంశంపై 'రామ రాజీయం' ఆరవీటి వంశ శాఖపై' ఆవుకు రాజుల వంశావళి రేచర్ల వెలయ నాయకులపై 'వెలుగోటివారి వంశావళి' అటువంటివే, ఈ కోవకే చెందిన కన్నడ భాషలోని 'చిక్కదేవరాయ వంశావళి', 'కేళది నృప విజయం', విజయనగర చరిత్రకు ఉపకరిస్తున్నాయి.

## కైఫీయతులు :

విజయనగర యుగ చరిత్ర పునర్‌నిర్మాణానికి ఎక్కువగా ఉపయోగపడుతున్న మరో ఆధారం 'కైఫీయతులు'. పూర్వం గ్రామకరణాలు రాసి వుంచే గ్రామ చరిత్రలే ఇవి. వీటిలో గ్రామం పుట్టు పూర్వోత్తరాలు, ఆస్తి, పన్ను, దేవాలయ లెక్కలు, గ్రామ

జీవనంలో వచ్చిన మార్పులు వివరించబడి ఉంటుంది. బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ ఉద్యోగి మెకంజీ సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం రాయించిన ఈ స్థానిక గ్రామచరిత్రల నకళ్ళు చరిత్రకారునికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఇవి గాక సాంప్రదాయికంగా చరిత్రాంశాలను వర్ణించే జానపద గేయాలు, సీసమూలికలు వంటివి లభిస్తున్నాయి.

**ముస్లిం రచనలు :**

పక్షపాత ధోరణిలో ఉన్నా ముస్లిం చరిత్ర రచనలు విజయనగర చరిత్ర పునర్నిర్మాణానికి ఉపయోగపడుతున్నాయి. ఇవి ప్రధానంగా ముస్లిం రాజ్యాల, రాజవంశాల చరిత్రలే అయినా క్రీ.శ. 14 వ శతాబ్ది నుంచి దక్షిణాదిన ముస్లింల ప్రాబల్యం అధికం కావడంలో వీటిలో హిందూ రాజ్యాల ముఖ్యంగా విజయనగర ప్రస్తావన తప్పలేదు. ఈ విధంగా విజయనగర చరిత్రకు కొంతవరకు ఉపయోగపడే ముస్లిం రచనల్లో ఇసామి రచించిన 'ఫుతూహ్ - ఉస్ - సలాతీ', జియా ఉద్దీన్‌బరనీ, షమ్స్ - ఇ - సిరాజ్ అఫీఫ్‌లు వేర్వేరుగా రాసిన 'తారిఖ్ - ఇ - ఫిరోజ్ షాహీ'లు, నిజాముద్దీన్ అహమ్మద్ బక్షి వ్రాసిన 'తబకాత్- ఇ - అక్బరీ', ఫెరిస్టా పూర్తి మత దురభిమానంలో వ్రాసిన 'తారీఖ్ - ఇ - ఫెరిస్టా' ముఖ్యమైనవి.

## 8.3.4 విదేశీయ వాఙ్మయం :

విజయనగరాన్ని దర్శించిన విదేశీయులలో రాయబారులు, వ్యాపారులు, మత ప్రచారకులు ఉన్నారు. వీరి రచనలు విజయనగర చరిత్రకు ముఖ్యంగా రాజధాని గురించి ఎంతో ఉపకరిస్తున్నాయి.

**ఇబన్ బతూతా :**

ఇబన్ బతూతా మొరాకో దేశస్థుడు. ఇతడు ఢిల్లీ నుంచి చైనాకు వెళ్తూ దారిలో దక్షిణ భారతదేశం దర్శించాడు. ఇతడు విజయనగర విశేషాలను తన పర్యటన చరిత్ర 'రిహ్లా'లో వివరించాడు. స్థానిక భాషలు రాకపోవడం, వదంతులకు, పుకార్లకు ఎక్కువ స్థానం ఇవ్వడం ఇతనిలోని లోపాలు.

**అబ్దుల్ రజాక్ :**

పారశీక చక్రవర్తి షారూఖ్ రాయబారిగా రజాక్ రెండో దేవరాయల ఆస్థానానికి వచ్చాడు. ఇతడు రాజధాని విజయనగరంలో కొన్ని నెలలు గడిపాడు. ఇతడు తన గ్రంథం 'మత - ఉస్ - స - ఆదీన్'లో విజయనగర వైభవాన్నీ, ప్రజల జీవనాన్ని, ఆస్థాన మర్యాదలనూ, పండుగలనూ, ఇతర విశేషాలను విపులంగా వర్ణించాడు.

**నికోలో కాంటి :**

విజయనగరాన్ని దర్శించిన తొలి ఐరోపావాసి ఇటలీ దేశస్తుడైన నికోలో కాంటి. ఇతడు క్రీ.శ. 1420-21 ప్రాంతంలో విజయనగరం పర్యటించి విజయనగర ఆస్థానం, వేడుకలను, ఇంకా అనేక విషయాలకు సంబంధించిన తన పర్యటన అనుభవాలను ఒక మతాధికారికి వివరించాడు.

**అథనేషియస్ నికితిన్ :**

క్రీ.శ. 1470 ప్రాంతంలో నికితిన్ బహమనీ రాజ్యానికి రష్యా వ్యాపారిగా వచ్చి, బీదర్‌లో చాలాకాలం నివసించాడు. ఇతడు తన పర్యటన చరిత్రలో సందర్భానుసారంగా విజయనగర పరిణామాలను పేర్కొన్నాడు.

**పోర్చుగీసు వారి రచనలు :**

క్రీ.శ. 1498 లో పోర్చుగీసు నావికుడైన వాస్కోడిగామా భారత పశ్చిమ సముద్రతీర ప్రాంతానికి వచ్చాడు. నాటి నుండి భారతదేశానికి ఐరోపావారి రాకపోకలు అధికమై, చివరకు భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగం అవడానికి పరిస్థితులు దారితీసాయి. మొదటి నుంచి పోర్చుగీసు వారికి విజయనగరంతో సఖ్యత ఏర్పడటంతో వారి రాజకీయోద్యోగులు, మత ప్రచారకులు, వర్తకులు తరచు విజయనగరం వచ్చేవారు. వారు తమ గ్రంథాలలో, నివేదికల్లో, ఉత్తర ప్రత్యుత్తరాలలో విజయనగర పరిస్థితుల గురించి వివరంగా రాశారు. అలా వచ్చిన పోర్చుగీసు వారిలో ముఖ్యులు వార్థెమా, లూయిస్, బర్బోసా, పేయస్, న్యూనిజ్‌లు. వీరి రచనలు కృష్ణరాయల వ్యక్తిత్వానికి, నాటి సామ్రాజ్య వైభవానికి, ప్రజాజీవనానికి అద్దం పడుతున్నాయి.

న్యూనిజ్ విజయనగర రాజ్యస్థాపన నుంచి అచ్యుత దేవరాయలకాలం వరకు ఆ రాజ్య చరిత్రను విన్నదాన్నిబట్టి, చూసిన దానిని బట్టి రాయడంలో అతని రచనే విజయనగర చరిత్రలో మొదటిదయింది. న్యూనిజ్ కథనం ప్రకారం క్విలన్, శ్రీలంక, పులికాట్, పెగురాజులు రెండో దేవరాయలకు కప్పం చెల్లించేవారు. రాజాంతఃపురంలో నృత్యకారిణులుగా, సేవకురాళ్ళుగా, పల్లకీమోసే వారుగా పెద్ద సంఖ్యలో స్త్రీలకు నియమించే పద్ధతి ఉన్నట్లు న్యూనిజ్ రచనలవల్ల తెలుస్తుంది.

బార్బోసా కథనం ప్రకారం కృష్ణదేవరాయల కాలంలో విజయనగరానికి ఎవరైనా రావచ్చు. ఎవరైనా పోవచ్చు. తమ అభీష్టానికి, విశ్వాసాలకు అనుగుణంగా జీవించవచ్చు. ఎవరూ ఎవరినీ బాధించేవారు కాదు. వేదించేవారు కాదు. అశోకుడు, అక్బర్ చక్రవర్తులులాగా సామాజిక జీవనంలోనూ, మతాచారాలలోను ఉన్న దోషాలను తొలగించడానికి, సంస్కరించడానికి కృష్ణరాయలు ఏమాత్రం ప్రయత్నించలేదు. సమకాలీన సమాజంలో ఆచరిస్తున్న అన్ని ఆచారాలనూ చక్రవర్తి అనుసరించాడు. నరబలివంటి ఆనాచారాలను ఆ కాలంలో ఆచరించేవారు. ఆనాటి సామాజిక పరిస్థితుల గురించి బార్బోసా రచనలు ఆసక్తికరంగా తెలుపుతున్నాయి.

బర్రాడాస్ కొచ్చిన్ నుంచి వ్రాసిన లేఖలో క్రీ.శ. 1614 నుండి విజయనగర రాజవంశంలో సింహాస వారసత్వానికై జరుగుతున్న అంతర్యుద్ధాన్ని చక్కగా విశ్లేషించి, విపులంగా వర్ణించాడు. రాక్షసతంగడి (బన్నిహట్టి) యుద్ధానంతరం విజయనగరాన్ని దర్శించిన సీజర్ ఫ్రెడరిక్ శిధిలనగర వైభవాన్ని వర్ణించాడు. క్రీ.శ. 17 వ శతాబ్దంలో వచ్చిన పోర్చుగీస్ జెస్యూట్ ఫాదరీలైన రుబినో మొదలైన వారు వ్రాసిన యాత్రా వృత్తాంతాలకు సంబంధించిన లేఖలు కడపటి విజయనగర యుగ చరిత్రకు ఉపకరిస్తున్నాయి.

విజయనగర వైభవాన్ని వెలుగులోకి తెచ్చిన రాబర్ట్ సూయల్ తన గ్రంథం 'విస్మృత విజయనగర చరిత్ర'లో న్యూనిజ్ రచనలకు సాధ్యమైనంత ఎక్కువగా ఉపయోగించుకొన్నాడు. 'ఆరవీడు వంశం' అను గ్రంథం వ్రాసిన ఫాదర్ హీరాస్ జెస్యూట్ లేఖలనుంచి ఎక్కువ సమాచారం గ్రహించాడు.

## 8.4 మొగల్ యుగం :

భారతదేశ చరిత్రలో మొగల్‌యుగం అత్యంత వైభవోపేతమైన ప్రకరణాలలో ఒకటి. ఈ యుగ చరిత్ర పునర్‌నిర్మాణానికి లభించినంత సాధన సామగ్రి భారతదేశ చరిత్రలో మరే ఇతర యుగానికి లభించలేదు. బాబర్ నుంచి ఔరంగజేబు వరకు పాలించిన ప్రతి ఒక్క మొగల్ చక్రవర్తి వారిపాలన గురించి తెలుసుకోవడానికి చరిత్ర రచనలున్నాయి. ఇవన్నీ చాలా వరకు సమకాలిక రచనలే. మొగల్ చక్రవర్తులలో అధికులు సాహితీవేత్తలు. అందువల్ల వారి సమకాలిక సంఘటనల రికార్డులు మనకు లభించాయి. రాజవంశంలోని ఇతర సభ్యులూ సమకాలిక చరిత్రలు రాశారు.

మొగల్ పాలకులు నియమబద్ధంగా ఆస్థానంలో చరిత్రకారులను పోషించి వారిని ప్రోత్సహించి సమకాలిక అధికార చరిత్రలు రాయించారు. ఈ ఆస్థాన చరిత్రకారులకు ప్రభుత్వరికార్డులు, ఇతర సాక్ష్యపత్రాలు అందుబాటులో ఉంచబడ్డాయి. వీరి రచనలు ఎక్కువగా పారశీక భాషలో ఉన్నాయి. ఇవికాక ముస్లిం పరిపాలన గురించి కొన్ని సాధారణ చరిత్రలూ వ్రాయబడ్డాయి. వీటికితోడు అక్బర్ కాలం నుంచి చక్రవర్తుల ఫర్మానాలు, వివిధ రకాలైన ప్రభుత్వ ఆజ్ఞాపత్రాలు, ఆస్థాన ప్రకటన ప్రతికలు లభిస్తున్నాయి. అనేక ముఖ్య అధికారులు, మున్షీలు సేకరించిన చారిత్రక లేఖల పరంపరలు ఇన్షాపేర చరిత్రకు ఆధారాలుగా ఉన్నాయి. మొగల్‌యుగ సాంఘిక, మత జీవనాన్ని చిత్రించే మత వాఙ్మయం కూడా ఎక్కువగా లభిస్తున్నది.

ఇస్లాం దేశాలనుంచి వచ్చిన వారే గాక మత ప్రచారకులుగా, యాత్రీకులుగా, పెక్కుమంది మొగల్ యుగంలో భారతదేశం దర్శించిన యూరోపియన్‌లు తమ అనుభవాలను, పరిశీలనను గ్రంథస్థం చేశారు. అనేక భాషల్లో లభించిన ఈ వర్ణనలు మొగల్ చరిత్ర ఆధారాల ప్రామాణికతను ఇనుమడింప జేస్తున్నాయి.

మొగల్ యుగం వచ్చిన తరువాత ముస్లిం చరిత్ర రచనల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. చరిత్రకారుల ధృక్పథంలో మార్పు వచ్చింది. వారి రచనా పద్ధతిలోనూ మార్పు వచ్చింది. విషయంలో కూడా మార్పు వచ్చింది. ఢిల్లీ సల్తనతో యుగం కేవలం ఉపోద్ఘాతంలా కన్పించగా, మొగల్ యుగ చరిత్ర రచనలో ప్రజల గురించి, ప్రజల సామాజిక సంస్థల గురించి, నాగరికత అభివృద్ధి గురించి, ఆలోచన ధోరణిలోని పరిణతి గురించి ప్రస్తావనలు కన్పిస్తాయి. జె.ఎన్. సర్కార్ మాటల్లో, "మొగల్ యుగంలో చరిత్ర లౌకికం కావటం అత్యంత విశేషమైన మార్పు".

మొగల్ చరిత్రకు లభ్యమగు ఆధారాలను మూడు తరగతులుగా విభజింపవచ్చును. అవి : వాఙ్మయ ఆధారాలు, పురావస్తు ఆధారాలు, విదేశీ రచనలు.

### 8.4.1 వాఙ్మయాధారాలు :

**బాబర్ హుమయూన్‌ల కాలం :**

**తుజుక్ - ఇ - బాబరీ :**

మొగల్ యుగంలో లిఖించబడిన ప్రథమ ప్రధాన చరిత్రగ్రంథం 'తుజుక్ - ఇ - బాబరీ' లేదా 'బాబర్ నామా' బాబర్ తురుష్కభాషలో వ్రాసిన స్వీయచరిత్ర ఇది. దీనిని పోలిన మరో రచన టర్కీ భాషలో లేదు. ఇందులోని భాష ఎంతో సున్నితంగా, స్పష్టంగా ఉంది. బాబర్ పరిపాలనకు, హుమయూన్ జీవితంలో తొలిదశకు అత్యంత ప్రధాన ప్రామాణిక గ్రంథం ఇది. ఇందులో దేశ నైసర్గిక స్వరూపం, సాంఘిక ఆర్థిక పరిస్థితులు, రాజకీయ, సైనిక సంఘటనల గురించి విపులంగా బాబర్ వర్ణించాడు. బాబర్ తన తప్పులను, పొరబాట్లను, సుగుణాలను, దుర్గుణాలను నిష్కపటంగా పేర్కొన్నాడు. ఇతని రచనల్లో ఎంతటి నిష్పక్షపాత ధోరణి కనబరచినా ఈ దేశం ప్రజలు, నాగరికత గురించి అక్కడక్కడ ఒక విదేశీయుని మనస్థత్వం కన్పిస్తుంది. అయినప్పటికి ఆనాటి చరిత్రకు బాబర్‌నామా అమూల్యమైన ప్రామాణికమైన ఆధారం.

**తారీఖ్ - ఇ - రషీదీ :** బాబర్ బంధువు అయిన మీర్జా మహమ్మద్ హైదర్ దుఘ్లాత్ 'తారీఖ్ - ఇ - రషీదీ' గ్రంథాన్ని రచించాడు. ఇందులో ఇతడు బాబర్ పోరాటాలు, పేర్షాలో హుమయూన్ ఘర్షణ, బిల్గ్రాం యుద్ధం, హుమయూన్ పలాయనం, కాశ్మీర్ సంగతుల వివరాలను ప్రత్యక్ష సాక్షిగా వర్ణించాడు. ఇతని రచన బాబర్‌నామా, హుమయూన్ నామాలకు మరింత బలాన్ని చేకూర్చింది.

**హబీబ్ - ఉస్ - సియర్ :** ఈ గ్రంథాన్ని ఖ్వాంద్ అమీర్ రచించాడు. బాబర్, హుమయూన్ మొదటి మూడు సంవత్సరాల పాలన గురించి ఈ గ్రంథం వివరిస్తుంది. ఇతడు హుమయూన్ నామా అనుగ్రంథం కూడా వ్రాశాడు. ఇది హుమయూన్ తొలి చరిత్రకు ప్రామాణిక గ్రంథం.

**అహ్సాన్ - ఉస్ - సియర్ :** 'అహ్సాన్ - ఉస్ - సియర్' గ్రంధాన్ని మీర్జా బర్ఖుర్ధార్ టర్క్ మాన్ రచించాడు. ఇందులో పర్షియా ఇస్మాయిల్‌తో బాబార్‌కు గల సంబంధాలు వర్ణించబడింది.

**షైబానీ - నామా :** ఉజ్బెగ్ పాలకునితో బాబర్ సంబంధాల గురించి తురుష్క భాషలో మహమ్మద్ సాలిహ్ వ్రాసిన 'షైబానీ - నామా' అమూల్యమైన సమకాలీన రచన.

**తారీఖ్ - ఇ - ఆలమారై అబ్బాసీ :** ఈ గ్రంథాన్ని ఇస్కందర్ మున్షీ పారశీకంలో వ్రాశాడు. క్రీ.శ. 16 వ శతాబ్దంలో భారత, పారశీక దేశాల మధ్య సంబంధాలు ఈ గ్రంథంలో వివరించబడింది.

**తారీఖ్ - ఇ - షాహి :** ఈ గ్రంథాన్ని అహమ్మద్ యాద్గర్ వ్రాసాడు. ఇందులో ఆఫ్ఘనులు బాబర్, హుమయూన్‌లతో పోరాడి తిరిగి అధికారాన్ని పొందిన విధము వర్ణించబడింది.

**హుమయూన్ నామా :** బాబర్ కుమార్తె గుల్‌బదన్ బేగమ్ క్రీ.శ. 1587 లో 'హుమయూన్ నామా' రచించింది. ఈ గ్రంధం హుమయూన్ జీవితానికి అద్దం పట్టుతుంది. బాబర్, హుమయూన్‌ల సతీ, సుత, సుతులతో వారి గృహ సంబంధాలపై, వారి సాంఘిక, అంతఃపుర జీవితంపై ఇది ఉత్తమ ప్రామాణిక రచన.

**తజ్కిరాత్ - ఉల్ - వాకి ఆత్ :** అక్బర్ ఆజ్ఞానుసారం క్రీ.శ. 1587 లో హుమయూన్ పరిపాలనపై అతని యుద్ధ రాజకీయ కార్యకలాపాలన్నింటా, నిరాశ్రయంగా తిరిగినపుడు అతనినే అంటిపెట్టుకొని ఉన్న అతని సేవకుడు జౌహరు వ్రాసిన చారిత్రక రచన 'తజ్కిరాల్ - ఉల్ - వాకి ఆత్' అయితే జౌహార్ జ్ఞాపక శక్తి తరుగుతున్న స్థితిలో సంఘటనలను తారుమారు చేస్తూ రాసినందున ఈ రచనకు అంత ప్రాముఖ్యంలేదు.

### ఇతర రచనలు :

హుమయూన్ చరిత్రకు ఉపకరించే ఇతర రచనల్లో పేర్కొనదగినవి 'తజ్కిరాత్ - ఇ - తహ్మాస్ప్'. తారిఖ్ - ఇ - హుమయూన్,' 'కానూన్ - ఇ - హుమయూనీ' మొదలగునవి.

### షేర్షాకాలం :

అబ్బాస్ సర్వానీ రచించిన 'తారీఖ్ - ఇ - షెర్‌షాహీ' ప్రధానంగా షేర్షా ఏలుబడి, పరిపాలన తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.

### అక్బర్ కాలం :

#### తారీఖ్ - ఇ - అక్బర్ షాహీ :

అక్బర్ వజీర్ ముజఫర్‌ఖాన్ క్రింద రెవెన్యూ శాఖలో ఉద్యోగి అయిన హాజీ మహమ్మద్ ఆరిఫ్ కందాహారీ 'తారీఖ్ - ఇ - అక్బర్ షాహీ' అను గ్రంధాన్ని వ్రాశాడు. ఈ గ్రంధం అక్బర్ పరిపాలనకు సంబంధించి ప్రథమ రచన. ఇతడు అక్బర్ మతాభిప్రాయాలను అంతగా పరిగణనలోకి తీసుకోలేదు. అక్బర్ వ్యక్తిత్వం మీద, పరిపాలన మీద ఈ గ్రంథం కొత్త కాంతిని ప్రసరింపజేస్తున్నది. అబుల్ ఫజల్ ఇచ్చిన అక్బర్ పరిపాలనా కాలక్రమణికతో ఇది కచ్చితంగా పొసగుతుంది. అయితే రచయిత తన పోషకుడు ముజఫర్ ఖాన్ పరిపాలనను పక్షపాతంలో పొగుడుతూ అధికంగా వర్ణించాడు.

**అక్బర్ నామా :**

అబుల్ ఫజల్ రచించిన అక్బర్ జీవిత చరిత్ర 'అక్బర్ నామా' అత్యద్భుత అధికారిక చరిత్రగా భావించవచ్చు. అక్బర్‌కు సన్నిహితుడైన అబుల్ ఫజల్ పాండిత్యంలోనూ, రాజకీయాల్లోనూ, దౌత్యంలోనూ, యుద్ధంలోను అందె వేసిన చేయి. అతనిది శక్తివంతమైన కలం. అనేక వ్యవ ప్రయాసల కోర్చి అబుల్ ఫజల్ అనేక ప్రతాలను, సమాచారాన్ని సేకరించాడు. అనేకమంది అధికారులతోనూ, కులీనులలోనూ చర్చలు జరిపాడు. ప్రాథమిక సమాచారం సేకరించడానికి అనేకమంది ప్రముఖులలో మంతనాలు చేశాడు. సామ్రాజ్యంలోని ప్రజల ఆర్థిక, సామాజిక జీవితం గురించి తెలుసుకోవడానికి సమాచారం సేకరించి సహాయపడ వలసిందిగా అక్బర్ తరపున రాజోద్యోగుల కందరికీ ఆదేశాలు జారీ చేశాడు. మొత్తం అధికార ప్రతాలన్నింటినీ అబుల్ ఫజల్ సేకరించాడు. మంత్రులనుంచి నివేదికలు సంపాదించాడు. అక్బర్ నామా ముసాయిదా ప్రతిని ఐదుసార్లు మార్పులు చేశాడు. పరిపాలనకు సంబంధించిన గ్రంథ రచన భాగం క్రీ.శ. 1593 లో పూర్తయింది. విశ్వసనీయమైన సమాచారం పొందుపరచడంలోనూ, చర్చించిన విషయాల వైవిధ్యంలోనూ, క్లిష్టమైన విశ్లేషణ పద్ధతిని పాటించడంలోనూ, చిత్తశుద్ధిలోనూ ఈ గ్రంథాన్ని ప్రత్యేకంగా పేర్కొనవలసి ఉంటుంది. అక్బర్ నామా మొదటి భాగంలో బాబర్, హుమయూన్‌ల గురించి, రెండోభాగంలో అక్బర్ పరిపాలన గురించి ప్రస్తావించడం జరిగింది. మూడోబాగం 'అయిన్ - ఇ - అక్బరీ ' లో పరిపాలన యంత్రాంగంపై విపులమైన చర్చ సాగింది. సామ్రాజ్యంలో వనరులు, సమాజ పరిస్థితి, జనాభా, పరిశ్రమలు, వాణిజ్యం పాలనా విభజనల గురించి ఈ మూడో భాగం విపులంగా వివరిస్తుంది. ఆ కాలపు ప్రజల ఆచార వ్యవహారాలను, ఆలోచనా ధోరణులకు అబుల్ ఫజల్ తన గ్రంథంలో ప్రస్తావించాడు. లూనియా మాటల్లో, "మొగల్ చరిత్ర వ్రాసే ఏ చరిత్రకారుడైనా ఈ గ్రంథం లేకుండా రాయలేడు".

**ముంతకాబ్ - ఉల్ - తవారిక్ :**

ఈ గ్రంథాన్ని బదౌనీ రచించాడు. ఇతడు అబుల్ ఫజల్‌కు పూర్తి వ్యతిరేకి ఇతడు అక్బర్ గురించి నిశితంగా విమర్శించాడు. అక్బర్‌కు అబుల్ ఫజల్ సన్నిహితుడు కావడం ఇతనికి నచ్చలేదు. అక్బర్ ఉదారవాదం కానీ, రాజపుత్రవిధానం కానీ ఇతనికి నచ్చలేదు. అందువల్ల ఇతను రచించిన గ్రంథం చారిత్రక దృష్టితో కాకుండా కక్షసాధింపు ధోరణిలో రచింపబడింది.

**తబాకత్ - ఇ - అక్బరీ :** క్రీ.శ. 1592 లో నిజాముద్దీన్ భక్షి రచించిన 'తబాకత్ - ఇ - అక్బరీ' అక్బర్ కాలంలో రచించిన మరో చక్కని గ్రంథం. గజనీమహ్మద్ దండయాత్ర కాలం నుంచి అక్బర్ కాలం వరకు దేశ చరిత్రను వివరించే సాధారణ చరిత్ర గ్రంధమిది. అక్బర్ పాలనా కాలంలో గుజరాత్ చరిత్రకు ఈ గ్రంథం ప్రత్యేకంగా గణనీయమైన ప్రాముఖ్యం కలిగి ఉంది.

**తక్మీల్ - ఇ - అక్బర్‌నామా :** అబుల్ ఫజల్ రచించిన 'అక్బర్ నామా'కు కొనసాగింపే ఇనాయత ఉల్లా రచించిన 'తక్మీల్ - ఇ - అక్బర్‌నామా'. అబుల్ ఫజల్ మరణం కారణంగా ఆగిన రచన 1605 లో అక్బర్ చనిపోయేంత వరకు జరిగిన చారిత్రక పరిణామాల వరకు కొనసాగించబడింది.

**రుక్ - ఆల్ - ఇ - అబుల్ ఫజల్ :** ఇది అక్బర్ పరిపాలనకు తోడ్పడే మరో చారిత్రక ఆధారం. దీనిని అబుల్ ఫజల్ సంకలనం చేశాడు. ఇది అబుల్ ఫజల్, అక్బర్, అతని కుటుంబ సభ్యులకు, తన కుటుంబ సభ్యులకు, ఇతర ముఖ్యులకు రాసిన లేఖల సంకలనం.

అబుల్ ఫజల్ రాసిన అధికారిక వార్తల సంకలనం 'ఇన్షా - ఇ - అబుల్ ఫజల్' లేక 'మక్తూబాత్ - ఇ - అల్లామీ' కూడా చరిత్ర రచనకు అమూల్యమైనదే.

**జహంగీర్ కాలము :**

**తుజుక్ - ఇ - జహంగీరీ :**

జహంగీర్ కాలం నుంచి చరిత్ర రచనల్లో మంచి ఊపు కన్పిస్తుంది. జహంగీర్ కాలంలో చక్రవర్తి స్వయంగా 'తుజుక్ - ఇ - జహంగీరీ' అనే గ్రంథం రచించాడు. జహంగీర్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి 12 సంవత్సరాల పాలనవరకూ ఈ గ్రంథంలో చర్చించాడు. ఈ గ్రంథం చరిత్ర రచనకు చక్కగా ఉపయోగపడుతుంది. జహంగీర్ తనలో పాలనను ఎత్తి చూపి, వాటిని అంగీకరించడం ఈ గ్రంథంలో కన్పిస్తుంది. రాజకీయ, సైనిక సంఘటనలే కాకుండా నాటి రచనల్లో, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితల గురించి కూడా చర్చ కన్పిస్తుంది. జహంగీర్‌కు వ్యక్తులపైనా, ఆచారాలపైనా, సంఘటనలపైనా ఉన్న అభిప్రాయాలను ఈ గ్రంథంలో చూడవచ్చు.

**తారీఖ్ - ఇ - ఫెరిస్టా :**

మహమ్మద్ కాశిం ఫెరిస్టా రచించిన 'తారీఖ్ - ఇ - ఫెరాస్టా' గ్రంథం, జహంగీర్ సింహాసనాసీనుడు అయ్యేవరకు భారత దేశంలో ముస్లింల పాలన గురించి వివరించే సాధారణ చరిత్ర గ్రంథం. ప్రాంతీయ రాజ్యాల గురించి, ప్రత్యేకించి మధ్యయుగ దక్కన్ సుల్తానుల గురించి కూడా ఈ గ్రంథం తెలియజేస్తుంది.

**ఇతర రచనలు :**

జహంగీర్ నాటి చరిత్రకు ముతమిద్ ఖాన్ రచించిన 'ఇక్బాల్ నామా', మహమ్మద్ హాదీ రచించిన 'వాకీ-ఆత్-జహంగిరీ' ఖ్వాజా కాప్‌గర్ ఫైరత్‌ఖాన్ రచించిన 'య అనిఖ్వా-ఇ-జహంగీరీ' అజ్ఞాత రచయిత యొక్క 'ఇన్తిఖాబ్-ఇ-జహంగీర్ షా'లు కూడా ముఖ్యమైనవి.

**షాజహాన్ కాలము :**

షాజహాన్ కాలంలో చారిత్రక రచనలు మరింత ఎక్కువగా వెలువడ్డాయి. ఆనాడు చరిత్ర రచనను మహత్తర కార్యంగానూ, అద్భుత పాండిత్యంగానూ, అత్యున్నత శాస్త్రంగాను పరిగణించేవారు.

**పాదుషా నామా :**

అబ్దుల్ హమీద్ లా హూరీ రచించిన 'పాదుషానామా' అధికారిక చారిత్రక గ్రంథం. ఇతను అబుల్‌ఫజల్ అనుసరించిన రీతిలో చరిత్రరచన చేశాడు. అయితే అబుల్ ఫజల్ లాగాకాక ఇతను సామాన్యులకు అర్థమయ్యేరీతిలో రచన చేశాడు. సామాజిక, రాజకీయ పరిణామాలను చర్చిస్తూనే పండితులు గురించి, ముస్లిం సన్యాసుల గురించి వివరించాడు. అక్బర్ కాలం నాటి ఉదారవాదాన్నుంచి సనాతన మార్గంవైపు షాజహాన్ మళ్ళడం ఈ చరిత్ర గ్రంథంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

**మహాసముద్ర సంగమము :**

షాజహాన్ పెద్ద కుమారుడైన దారాసుఖోవ్ పారశీక, సంస్కృత భాషల్లో గొప్ప విద్వాంసుడు. ఇతడు వ్రాసిన 'మహాసముద్ర సంగమము' హిందూ ముస్లిం సమన్వయము. ఇతని పోషణలోనే ఉపనిషత్తులు, భగవద్గీత, రామాయణము మొదలగు హిందూ గ్రంథాలు పారశీక భాషలోకి అనువదింపబడినది.

**ఇతర రచనలు :**

షాజహాన్ చరిత్రను తెలియజేసే ఇతర గ్రంథాలలో ప్రముఖమైనవి అమీనాయి కజ్వీనీ రచించిన 'పాద్షా-నామా', ఇనాయత్‌ఖాన్ రచన 'షాజహాన్‌నామా' 'మహమ్మద్ సాదిక్‌ఖాన్ రచన 'షాజహాన్‌నామా', మహమ్మద్‌సాలి రచన 'అమల్-ఇ-సాలీ', జగన్నాధ పండితుని 'రసగంగాధరం' 'గంగా లహరి' మొదలగునవి.

**ఔరంగజేబు కాలం :**

ఔరంగజేబు సనాతనవాదాన్ని అనుసరించడంవల్ల చరిత్ర రచనకు గట్టి దెబ్బ తగిలింది. తనకాలం నాటి సంఘటనలు గురించి ఏ చరిత్రకారుడు వ్రాయరాదని ఔరంగజేబు ఆదేశించాడు. అయితే అప్పటికే పండితుల్లో చారిత్రక దృక్పథం పెరగడం వల్ల చక్రవర్తి నిరుత్సాహపరచినా వారు తమ చరిత్ర రచనను ఆపలేదు.

**ఆలంగీర్ నామా :**

ఔరంగజేబు కాలంలో వెలువడిన తొలిగ్రంథం మీర్జా మహమ్మద్ ఖాసిం రచించిన 'ఆలంగీర్ నామా'. ఇది ఔరంగజేబు తొలి 10 సంవత్సరాల పాలనకు సంబంధించి ప్రామాణికమైన అధికారిక చరిత్ర.

**మసీర్-ఇ-ఆలంగీర్ :**

మహ్మద్ సాకీ ముస్తాయిద్‌ఖాన్ 'మసీర్-ఇ-ఆలంగీర్' అనే గ్రంథాన్ని రచించాడు. ఇతడు ఔరంగజేబు కొలువులో నలభై సంవత్సరాలు పనిచేశాడు. ఇతడు సమకాలీన సంఘటనలకు ప్రత్యక్షసాక్షి. ఔరంగజేబు అధికారికంగా తయారుచేసిన చరిత్ర లభ్యం కాకపోయినా ఔరంగజేబు వ్రాసిన లేఖలు చరిత్రకారులకు అందుబాటులో ఉండడంవల్ల అధికారిక చరిత్ర లేనిలోటు తీరుతున్నది.

**ఇతర రచనలు :**

మహమ్మద్ సాకీ ముస్తయిద్ వ్రాసిన 'మ ఆసిర్-ఇ-ఆలంగీరీ' ఆకిల్‌ఖాన్ రాజీ రచన 'జఫర్-నామ-ఇ-ఆలంగీరీ', హకీర్ వ్రాసిన 'ఔరంగజేబ్ నామా' భాబాఖాన్ రచన 'మున్తఖాబ్-ఉల్-బఫీబ్'లు ఔరంగజేబు పాలనకు ఆధారాలుగా వున్నాయి. క్రీ.శ. 1670 నుంచి 1707 వరకు దక్కన్‌లో మొగలుల కార్యకలాపాలను భీమసేనుని 'నుష్క-ఇ-దిత్కాషా' వివరిస్తుంది. క్రీ.శ. 1657 నుంచి 1698 వరకు గల రాజస్థాన్ చరిత్రను ఈశ్వరదాసు రచన 'ఫతూహాత్-ఇ-ఆలంగిరీ' తెలియజేస్తుంది. టాడ్ రచన 'రాజస్థాన్ కథావళి' రాజస్థాన్ చరిత్రకు ప్రామాణిక మూలాధారం. ఆంగ్ల ఉద్యోగి టాడ్ రాజస్థాన్ అంతా తిరిగి అనేక చరిత్రలు సేకరించి, పండితులను రప్పించి, వారి సహాయంతో ఈ గ్రంథం రచించాడు. ఔరంగజేబు పాలనలో మొగల్ సామ్రాజ్య పరిపాలనా విధానానికి 'దస్తూర్-ఉల్-అమల్' ఆధారం. ఇవిగాక సమకాలిక దక్కన్ తదితర ప్రాంతీయ రాజ్యాల చరిత్రకు ఉపకరించే అనేక వాఙ్మయ ఆధారాలు ఆయా ప్రాంతాలలో మొగలుల సంబంధాలను తెలియజేస్తాయి.

**ఔరంగజేబు తరువాత కాలం :**

ఔరంగజేబు తరువాత కాలంలో హాషిం కాఫీఖాన్' 'ముంతా కబ్-ఇ-లుబాబ్' లేదా 'తారిఖ్-ఇ-కాఫీ' అనే గ్రంథాన్ని రచించాడు. గోరీ మహమ్మద్ దాడి సమయం నుంచి క్రీ.శ. 1733 వరకు జరిగిన సంఘటనలను ఈ గ్రంథం వివరిస్తుంది. ఈ గ్రంథం మూడు భాగాల్లో వుంది. మూడోభాగం ఆలంగీర్‌కు ప్రత్యేకంగా కేటాయించడమైనది.

**మొగల్ చరిత్రకు ఇతర ఆధారాలు :**

ఫర్మానాలు, దీవాన్‌లు, మధ్నవిస్‌లు, కుల్లియాత్‌లు కూడా మొగల్ యుగ చరిత్ర పునర్ నిర్మాణానికి ఉపయోగపడుతుంది. ఇవి ఆనాటి సాహితీ ప్రగతిని, సాంఘిక, మతపరిస్థితులను తెలియజేస్తున్నాయి. పారశీక సాహిత్యంలో ముస్లిం మతాచార్యులు, సూఫీల జీవితాలను గురించి వివరించే మరోతరగతి 'మల్ఫూజాత్' కూడా మొగల్ చరిత్ర రచనలో తోడ్పడుతున్నాయి. సంస్కృత విద్వాంసుల కావ్యాలు, చరిత్రలు కూడా మొగల్ చరిత్ర రచనకు ఉపయోగపడుతున్నది. ఇదేవిధంగా హిందీ, బెంగాలీ, ఒరియా, గుజరాతీ, అస్సామీ భాషల్లోనూ సమకాలీనంగా గ్రంథాలు లిఖించబడ్డాయి. షాజహాన్ కాలం నుంచి మరాఠీ భాషలోని చరిత్ర ఆధారాలకు ప్రాధాన్యత హెచ్చింది. ఔరంగజేబు పాలనకు ఇవి తప్పనిసరి అయ్యాయి. కృష్ణాజీ అనంత్ సభాసద్ రచన 'శివఛత్రపతి చెస్ చరిత్ర' కూడా ఔరంగజేబు పరిపాలనకు ఆధారమే.

మొగలాయిల కాలంలో చారిత్రక గ్రంథాలు అనేకం లభిస్తాయి. మొగల్ చరిత్రకారులు ఎంతో కష్టించి సమాచారం సేకరించి, వాటిని తెలివిగా ఉపయోగించినా, చక్కటి భాషలో పొందుపరిచినా ఇంకా జరగాల్సింది చాలా వుంది. నాటి పరిస్థితుల గురించి, ఆ పరిస్థితులు ఏర్పడటానికి గల కారణాల గురించి, ఏయే కారణాల వల్ల ఏయే సంఘటనలు జరుగుతాయనే అంశం గురించి ఈ చరిత్రకారులకు అవగాహన లేదు. అధికారిక చరిత్రలు కాబట్టి మొగలుల చరిత్రలు ఎక్కువగా చక్రవర్తుల కార్యకలాపాలకు ప్రాధాన్యమిచ్చాయి. నాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల గురించి వీరు ఎక్కువగా పట్టించుకోలేదు. అయితే ప్రపంచంలో ఇతర ప్రాంతాలలో ఇదే కాలంలో జరుగుతున్న చరిత్ర రచనలతో పోలిస్తే ఈ చరిత్రలు గొప్పవనే చెప్పాలి.

**8.4.2 పురావస్తు ఆధారాలు :**

మొగల్ చరిత్ర పునర్ నిర్మాణానికి లభ్యమయ్యే పురావస్తు ఆధారాలలో శాసనాలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి, ఉన్నవి కూడా. ఆనాటి చరిత్రకు ప్రాథమిక ఆధారాలుగా అంతగా ఉపయోగపడదు. అయితే మొగల్ చక్రవర్తుల నాణేలు చరిత్ర రచనకు ఎంతగానో ఉపకరిస్తాయి. వివాదాస్పదమైన తేదీలను నిర్ధారించటంలోను, నాటి ఆర్థిక స్థితిగతులను, చక్రవర్తుల వ్యక్తిగత గుణగణాలను తెలుసుకోవడానికి నాణాలు ఉపయోగపడుతున్నాయి. షేర్షా, అక్బర్‌లు నాణాల విషయంలో అనేక మార్పులు చేశారు. షేర్షా ప్రవేశపెట్టిన వెండి రూపాయి 'దామ్' తరువాత కాలంలో కూడా కొనసాగింది. జహంగీర్‌కు నూర్జహాన్‌మీద, మద్యం మీద ఉన్న ప్రేమాతిశయాన్ని అతని నాణేలు తెలియజేస్తున్నాయి.

మొగల్ చక్రవర్తుల కళాపోషణకు నిదర్శనంగా నేటికి అనేక కట్టడాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. వాస్తుకళలో షేర్షా క్రొత్త పోకడ ప్రారంభించాడు. ఇతడు ప్రవేశపెట్టిన ముస్లిం పద్ధతిలో భారతీయ పద్ధతిని ఢిల్లీలో షేర్షా దర్వాజాలు, పురానా ఖిల్లా, ససరామ్‌లోని ఇతని సమాధి తార్కాణాలు. అక్బర్ హిందూ - ముస్లిం పద్ధతులను మేళవించి అనేక కట్టడాలు నిర్మించాడు. ఫతేపూర్ సిక్రికోట, అందులోని భవనాలు అందుకు సాక్ష్యాలు. ఆగ్రాలోని జహంగీర్‌మహల్ గోడలు హిందూ, జైన పద్ధతులలో అలంకరింపబడ్డాయి. ఢిల్లీ, లాహోర్, అలహాబాద్ కోటలు, అక్బర్ సమాధి, హుమాయూన్ సమాధి, ఇత్‌మాద్ ఉద్‌దౌలా సమాధి, తాజ్‌మహల్, ఢిల్లీలోని ఎర్రకోట, అందలి దివానీఖాస్, దివానీఆమ్, ఆగ్రాకోటలోని దివానీఆమ్, దివానీఖాస్, ఆగ్రాలోని మోతీమసీదు, ఢిల్లీలోని జుమ్మామసీదు, మయూరసింహాసనం నాటి వాస్తు కళాభివృద్ధికి నిదర్శనాలు. ఖురాన్ చిత్రలేఖనాన్ని నిషేధించినా మొగల్ చక్రవర్తులు చిత్రలేఖనం పట్ల ఆసక్తి ప్రదర్శించారు. జహంగీర్ కాలంలో చిత్రలేఖనం ఉన్నత స్థాయికి చేరుకున్నది.

### 8.4.3 విదేశీయ వాఙ్మయం :

మొగల్ యుగంలో పెక్కుమంది యూరోపియన్లు భారతదేశాన్ని దర్శించారు. అందులో కొందరు తమ అనుభవాలకూ, పరిశీలనకూ సంబంధించిన అమూల్యమైన వర్ణనలు ఇచ్చారు. యూరప్‌లో చరిత్ర రచనకు విశేషమైన ప్రాముఖ్యం ఉంది. ఆ సంప్రదాయాన్నే యూరోపియన్లు రచనకు విశేషమైన ప్రాముఖ్యత ఉంది. ఆ సంప్రదాయాన్నే యూరోపియన్లు భారతదేశానికి తీసుకువచ్చారు. ఈ యూరోపియన్లు భారతదేశంలో వాణిజ్యం ప్రధానం కాబట్టి వారి వ్యాఖ్యానాలు చాలావరకు ప్రజల ఆర్థిక పరిస్థితి గురించి, కొంత సామాజిక పరిస్థితి గురించి ఉంటాయి. భారత ఆర్థిక చరిత్ర రచనకు ఇప్పటికే ఈ యూరోపియన్ల వ్యాఖ్యానాలే ప్రధానమైనవి. స్థానిక పక్షపాతాలకు అతీతంగా ఈ వ్యాఖ్యానాలు, రచనలు ఉండటం వాటి ప్రత్యేకత. వీరు ఎవరిపట్ల ప్రత్యేకమైన అభిమానం లేదా దురభిమానం ఉన్నవారు కాదు. స్థానిక మతాలు, విశ్వాసాలు, రాగద్వేషాలు వీరి రచనలను తాకలేదు. అందువల్ల ఆనాటి భారతదేశ పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి చాలావరకు యూరోపియన్ల రచనలపై ఆధారపడవచ్చు.

### జెస్యూట్ రికార్డులు :

మొగల్ యుగంలో భారతదేశాన్ని దర్శించిన విదేశీయుల రచనల్లో ప్రథమంగా ప్రస్తావించవలసింది, జెస్యూట్ రికార్డులు. అక్బర్, జహంగీర్‌ల కాలం చరిత్రకు ఈ పత్రాలు కొంత సమాచారాన్ని అందిస్తున్నాయి. కాథలిక్ సంఘ సభ్యులు గోవా నుంచి తొలిసారిగా మొగల్ ఆస్థానానికి వచ్చి అక్బర్‌ని దర్శించారు. మాన్‌సరట్ దీని గురించి ఒక గ్రంథం వ్రాశాడు. జెస్యూట్ లేఖల ఆధారంగా ఫ్రెంచి చరిత్రకారుడు 'డు జారిక్' ఒక రచన చేశాడు. అక్బర్ మతవిధానం, కార్యకలాపాల గురించి ఈ గ్రంథం విలువైన సమాచారం ఇస్తుంది.

జహంగీర్ కాలం నుంచి యూరోపియన్లు ముఖ్యంగా డచ్‌వారూ, ఇంగ్లీషువారు భారతదేశానికి రావడం ఎక్కువైంది. విలియం హాకిన్స్, రాల్ఫ్‌ఫిచ్, జాన్‌మిల్డన్‌హాల్, విలియం ఫెన్చ్ అనేవారు జహంగీరు కాలంలో భారతదేశాన్ని దర్శించారు. వీరిలో కొందరు వ్యాపారులు, మరికొందరు దౌత్యవేత్తలు. హాకిన్స్ జహంగీర్‌ను దర్శించి సూరత్‌లో వ్యాపారం చేసుకోవడానికి కొన్ని రాయితీలతో ఫర్మానాను సంపాదించాడు.

### సర్. థామస్‌రో రచనలు :

క్రీ.శ. 1615లో జహంగీర్‌ను సందర్శించిన సర్‌థామస్‌రో సూరత్ రేవు గురించి, మొగలుల వాణిజ్య పద్ధతుల గురించి విపులంగా తన వ్యాఖ్యానాలలో ప్రస్తావించాడు. సూరత్‌రేవు పట్టణాన్ని వర్ణించడమేగాక మొగల్ చక్రవర్తుల కొలువు కూటమి ఘనత గురించి, భారతదేశంలో వ్యాపారం చేస్తున్న ఇతర యూరప్ కంపెనీల గురించి రో తన రచనల్లో వివరించడం జరిగింది.

### ట్రావెల్స్ ఇన్ మొగల్ ఎంపైర్ :

క్రీ.శ. 1656 - 58 మధ్యకాలంలో భారతదేశాన్ని సందర్శించిన ఫ్రాంకోయిస్ బెర్నియర్ 'ట్రావెల్ ఇన్ మొగల్ ఎంపైర్' అను చక్కని చారిత్రక గ్రంథం వ్రాసాడు. మొగల్ సామ్రాజ్యమంతా పర్యటించి రైతుల జీవితం గురించి, వారి పేదరికం గురించి, పట్టణాల గురించి, పారిశ్రామిక జీవితం గురించి, పల్లెల్లో పరిస్థితుల గురించి, పట్టణాల్లో సాంస్కృతిక జీవనం గురించి, ముఖ్యంగా భారతదేశంలోని ప్రధాన ఉత్పత్తుల గురించి బెర్నియర్ తన రచనలో వివరించాడు. ఇది నాటి చరిత్రను వెల్లడించే సమగ్ర రచన.

**ట్రావెల్స్ ఇన్ ఇండియా :**

క్రీ.శ. 1640 - 67 మధ్యకాలంలో భారతదేశాన్ని సందర్శించిన టెవిర్నియర్ 'ట్రావెల్ ఇన్ ఇండియా' అనే పుస్తకాన్ని రెండు భాగాల్లో రచించాడు. టెవిర్నియర్ వజ్రాల వ్యాపారి. వజ్రాల వ్యాపారంలో ఆసక్తి ఉండడం వల్ల వజ్రాల గనులున్న ప్రాంతాలను సందర్శించాడు. ముఖ్యంగా దక్కన్‌లో పర్యటించాడు. గోల్కొండ రాజ్యంలో పర్యటించి, అక్కడ వివిధ వస్తువులను తయారు చేసే వారితో చర్చలు జరిపాడు. అక్కడ పండేపంటల గురించి, వాటిని ఎలా పరిశుద్ధం చేస్తారో చూసి వివరించాడు. ప్రజలు అనుసరించే విచిత్ర ఆచారాల గురించి రికార్డు చేశాడు. ఆనాడు చెలామణిలోవున్న 'కరెన్సీ' గురించి చెబుతూ, వాటిని యూరోపియన్ కరెన్సీతో ఎలా పోల్చాలో వివరించాడు.

**ది ట్రావెల్ ఆఫ్ అబ్బికారే ఇన్ ఇండియా అండ్ నియర్ ఈస్ట్ :**

క్రీ.శ. 1672 - 74 మధ్యకాలంలో మొగల్ సామ్రాజ్యాన్ని సందర్శించిన ఫ్రెంచి యాత్రికుడు అబ్బికారే ఈ గ్రంథాన్ని రచించాడు. ఇతడు ప్రధానంగా రేవు పట్టణాల గురించి చర్చించాడు. కొత్తగా భారతదేశంలో ప్రవేశించిన ఫ్రెంచి ఈస్టిండియా కంపెనీ పురోగతి గురించి వీరి రచనల్లో ప్రధానంగా కన్పిస్తుంది.

**ఏ న్యూ అకౌంట్ ఆఫ్ ఈస్ట్ ఇండీస్ :**

ఈ పుస్తకాన్ని జాన్ ఫ్రయర్ రచించాడు. క్రీ.శ. 1672 - 81 సంవత్సరాల మధ్య కాలంలో ఇతడు భారతదేశంలో ప్రయాణం చేసి తన అనుభవాలను గ్రంథస్థం చేశాడు. యూరోపియన్, భారతీయ వర్తకురువురూ భారతీయ రేవుపట్టణాల్లోనూ, దూర, ప్రాచ్య, రేవు పట్టణాల్లోనూ కలిసి వ్యాపారం చేయడం గురించిన ప్రస్తావనలు ఈ గ్రంథంలో కలవు.

**స్టోరియో డెమొగోల్ :**

మొగల్ కొలువులో దీర్ఘకాలం ఉన్న ఇటలీ వ్యాపారి నిక్కోలాయ్ మన్నూకి 'స్టోరియా డెమొగోర్' అనే గ్రంథంలో తన అనుభవాలను పొందుపరిచాడు. క్రీ.శ. 1653 - 1702 సంవత్సరాల మధ్య కాలంలో భారతదేశంలో ఉన్న ఇతని రచన ఔరంగజేబు కాలంపై ప్రామాణిక గ్రంథం. అంతఃపుర కుట్ర గురించి, రాజుల వ్యక్తిగత జీవితాల గురించి ఈ పుస్తకంలో అనేక పుకార్లు ఉన్నప్పటికీ సమకాలీన జీవితాన్ని చర్చించడానికి ఈ గ్రంథం చాలా విలువైనది. దక్కన్‌పై ఔరంగజేబు దాడి చేసినపుడు చక్రవర్తి వెంట ఇతను కూడా వున్నాడు. గోల్కొండ ముట్టడిని, మద్రాస్ పట్టణ సౌందర్యాన్ని మన్నూకి చాలా విపులంగా వర్ణించాడు.

**ఇతరుల రచనలు :**

ఇంకా నికోలస్ విల్లింగ్టన్, థామస్ కార్యత్, ఎడ్వర్డ్‌టెర్రీ మొదలగు ఆంగ్లేయుల రచనలు, డిలాట్ అనే డచ్చి దేశస్థుడు, పీట్రో డెల్లావల్లీ, పీటర్ మండీ అనే ఇటలీ యాత్రికులు, మాండెల్స్లో అనే జర్మన్ యాత్రికుడు, ధెవెనాటి అను ఫ్రెంచి యాత్రికుడు మొదలగు వారి రచనలు,నికితిన్, బార్బోసా, పీటర్ ఫ్లోరిస్, ఫ్రాన్సిస్కో పాల్సీర్ట్ వంటి యాత్రికుల రచనలు కూడా మొగల్ యుగ పరిస్థితులను వివరిస్తున్నాయి.

యూరోపియన్ల రచనలు భారత చరిత్ర రచనకు ఆధారభూతంగా ఉన్నాయి. వీరి రచనల్లో నాటి ప్రజల స్థితిగతుల వివరణ కన్పిస్తుంది. అందువల్ల ప్రజల చరిత్రను రాయడానికి వీరి రచనలు తోడ్పడుతున్నాయి. అయితే వీరు తమ

స్థావరాలు ఏర్పరచుకొన్న కోస్తా ప్రాంతాల్లోని ప్రజల జీవితాలను మాత్రమే ప్రస్తావించారు. ఇతర ప్రాంతాల చరిత్రకు ఇతరులపై ఆధారపడ్డారు. అందువల్ల ముస్లిం రచనలను యూరోపియన్ యాత్రికుల రచనలను కలిపి మొగల్ చరిత్రను చక్కగా పునర్నిర్మించవచ్చు.

## 8.5 మరాఠా యుగం :

క్రీ.శ. 17వ శతాబ్ది ద్వితీయార్థంలో మరాఠాల వృద్ధి భారత రాజకీయాల్లో ఒక ప్రధానఘట్టం. అంతకుపూర్వం ఢిల్లీ సుల్తానత్ యుగంలో హైందవ ధర్మరక్షణ కోసం విజయనగర సామ్రాజ్యం నిర్వహించిన పాత్రనే మొగల్ యుగంలో మరాఠాల స్వరాజ్యం నిర్వహించింది. మరాఠాల స్వరాజ్య స్థాపకుడు శివాజీ. శివాజీ వారసులు బలహీనులు కాగానే వారి ప్రధానమంత్రులయిన పీష్వాలు క్రీ.శ. 18వ శతాబ్దిలో విజృంభించి సువిశాల సామ్రాజ్యం స్థాపించి చరిత్రలో మరాఠులను ఒక గొప్ప జాతిగా రూపొందించారు. అయితే చరిత్ర సృష్టించటంలో నిమగ్నులైన మరాఠులు ఆ చారిత్రక ఘట్టాలను నమోదు చేయడంలో, చరిత్రను రాయడంలో శ్రద్ధ చూపలేదు. చరిత్రను రాయటం ఆరంభించడానికి చాలాకాలం తీసుకున్నారు. చాలా మరాఠా కుటుంబాలు తమ చుట్టూ సంభవిస్తున్న చారిత్రక సంఘటనలను ప్రాముఖ్యాన్ని గుర్తించాయి. ఇందులో కొందరు జరిగే వాటిని రికార్డు చేయడం ప్రారంభించారు. సంఘటనల్లో నిజంగా పాల్గొన్న కొంతమంది వారి అనుభవాలను తమ డైరీలలో రాసుకున్నారు. అనేక చారిత్రక సాహసకృత్యాలు, జానపద వీరగాథలు, కథాగేయాల రూపంలో తరతరాలకు సంక్రమించాయి. వీటి పారశీక రూపాంతరమే 'బఖర్లు'. సమకాలీన స్వదేశీ, విదేశీ రచనల్లో కూడా మరాఠుల ప్రస్తావనలు కలవు.

మరాఠాయుగ (సామ్రాజ్య, పీష్వా యుగాలు) చరిత్ర ఆధారాలను స్వదేశీరచనలు, విదేశీ రచనలు అని రెండు తరగతులుగా విభజించవచ్చును.

### 8.5.1 సామ్రాజ్యయుగం :

#### స్వదేశీ రచనలు : సుబాసద్‌సదర్ :

మహారాష్ట్రులు తమ సామంతులతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, బఖర్లు స్వదేశీ రచనల్లో ముఖ్యమైనవి. వీటిలో అమూల్యమైనవి జింజిలో రాజరాం ఆజ్ఞానుసారం 1694లో వ్రాయబడిన 'సుబాసద్ బఖర్'. దీనిలో దేశకాల వర్ణన విషయాల్లో తప్పులు దొర్లినా మరాఠీ భాషలో ఉన్న శివాజీ జీవితచరిత్రపై ఇది ఉత్తమ గ్రంథం. ఈ తరువాత వచ్చిన జీవిత చరిత్రలు దీనిపై ఆధారపడి వ్రాసినవే.

#### జేధి శకావళి, జేధె కరిణ :

క్రీ.శ. 1618 - 1697 మధ్యకాలంలో జరిగిన సంఘటనలను కన్హోజీ జౌడె కుటుంబం, కాలక్రమంలో 'జేడెశకావళి' అనే పేరుతో నమోదు చేసింది. ఈ గ్రంథానికి అవసరమైన అనుబంధం 'జౌఢె కరిణ' నుంచి శివాజీ కార్యకలాపాలలో కొన్నింటిని తెలుసుకోవచ్చు. ముఖ్యంగా శివాజీ అతని తండ్రికి, అధికారులకు రాసిన లేఖలు స్వతంత్ర మరాఠి రాజ్యం స్థాపించాలనుకోవటంలో అతని మనోభావాలను వెల్లడిస్తున్నాయి.

#### సంస్కృత రచనలు :

సంస్కృత భాషలో జయరాం పింద్యే రాసిన 'రాధామాధవ విలాస చంపూ', పరమానంద్ రాసిన 'శివభారతామ్' ద్వారా శివాజీ జీవితం, సైనిక విజయాలు, పట్టాభిషేకం వివరాలు గ్రహించవచ్చు. ఇవిగాక 'శివరాజ్ రాజ్యాభిషేక కల్పతరు' గ్రంథాలపై

కొంతమంది ఆధారపడవచ్చు. శివాజీ కోరిన మేరకు రాజకీయ పదజాలంపై రఘునాధ్ హన్మంతే 'రాజవ్యవహార కోశము' అనే పారశీక-సంస్కృత నిఘంటువును సంకలనం చేశాడు. శివాజీ పౌర, సైనిక వ్యవస్థాపనం అర్థం చేసుకోడానికి ఈ నిఘంటువు ఉపయోగపడుతుంది. హిందీ కవులు భూషణ్, లాల్‌కవి శివాజీని తమ రచనల్లో అపరిమితంగా పొగిడారు.

**పారశీక రచనలు :**

ఔరంగజేబు కాలంలో పారశీక భాషలో రాసిన అధికారిక, వైయక్తిక చరిత్ర రచనలలో అధికభాగం శివాజీ జీవితం గురించి, అతని విజయాల గురించి కూడా వివరాలు ఇస్తున్నాయి. వీటిలో ఖాఫీఖాన్, భీమసేనుల రచనలు చాలా ముఖ్యమైనవి.

**కన్నడ రచనలు :**

18వ శతాబ్దపు కొన్ని కన్నడ రచనలు షాజీ, శివాజీ, అతని వారసుల గురించి కొన్ని వివరాలు తెలియజేస్తున్నాయి. వీటిలో లింగన్న 'కేళది నృప విజయం' అజ్ఞాత రచయిత యొక్క 'హైదర్‌నామా'లు ముఖ్యమైనవి. ఇందులో లింగన్న రచన శివాజీ తల్లిదండ్రుల గురించి, వంశం గురించి తెలియజేస్తుంది. మరాఠుల చివరిదశ గురించి హైదర్‌నామా ప్రస్తావిస్తుంది.

**విదేశీ రచనలు :**

సామ్రాజ్య యుగ చరిత్రను పునర్నిర్మించటంలో యూరోపియన్ల రచనలు కూడా ఉపకరిస్తున్నాయి.

**ఇంగ్లీష్ రికార్డులు :**

బొంబాయి ప్రాంతంలోవున్న ఇంగ్లీష్ ఫ్యాక్టరీలు రికార్డులు ద్వారా క్రీ.శ. 1659 నుంచి శివాజీ గురించి గ్రహించగలుగుతున్నాం. వీటిలో సంఘటనలు ఏ విధంగా నివేదించబడ్డాయో అలాగే నమోదయ్యాయి. రాజ్‌పూర్, కరెవారెలలోని ఆంగ్లేయుల పత్రిక వలన శివాజీకి ఆంగ్లేయులతో గల సంబంధాలను గురించి కొంత తెలుసుకోవచ్చు. శివాజీ సైన్యం గురించి సూరత్‌లో ఉన్న ఫ్రెయర్ విపులంగా వర్ణించాడు.

**విదేశీ యాత్రికుల రచనలు :**

క్రీ.శ. 17వ శతాబ్దిలో భారతదేశాన్ని దర్శించిన బెర్నియర్, టేవర్నియర్, థెవెనాట్ వంటి విదేవీ యాత్రికులు శివాజీని వ్యక్తిగతంగా బాగా తెలిసి ఉండటం లేదా దక్షిణాదిన అతని కార్యకలాపాల గురించి విని ఉండటం జరిగింది. అందువల్ల వీరి ముద్రిత, అముద్రిత రచనలలో శివాజీ చోటుచేసుకున్నాడు. అయితే వీరు పేర్కొన్నదంతా నిజమని చెప్పలేము.

**ఫ్రెంచి రచనలు :**

ఫ్రెంచి ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగిగా వున్న మార్టిన్ పాండిచ్చేరి నుంచి 1670లో సూరత్ వచ్చినపుడు అక్కడ జరుగుతున్న రాజకీయ పరిణామాలను నిశితంగా గమనించాడు. తన జ్ఞాపకాలతో వీటిని రికార్డు చేశాడు. శివాజీ కర్ణాటక దండయాత్రకు ఈ రచనే ముఖ్యమైన సమకాలిక చరిత్రాధారం.

**డచ్చి రచనలు :**

శివాజీ మొదట సూరత్ ముట్టడి గురించి డచ్ రచయిత షాటెన్ వివరించాడు. క్రీ.శ. 1665 వరకు జరిగిన సంఘటనలను ఒటేవియా డైరీ వివరిస్తుంది. సూరత్, వెంగుర్ల, కరెవార్‌లలో ఉన్న డచ్చిఫాక్టరీల లేఖలూ శివాజీ చరిత్రకు సహాయపడుతున్నాయి.

**పోర్చుగీస్ రచనలు :**

డి.గార్డా క్రీ.శ. 1695లో పోర్చుగీస్ భాషలో శివాజీ జీవిత చరిత్రను రాశాడు. అయితే ఇది 1730 వరకు వెలుగులోకి రాలేదు. ఇదికాక గోవా, పోర్చుగీస్ రికార్డులు కూడా శివాజీ చరిత్రకు ఆధారంగా ఉన్నాయి.

శివాజీ చరిత్రకు మరాఠీ, సంస్కృత, హిందీ, పారశీక, ఆంగ్ల, ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీస్, కన్నడ భాషలలో ఆధారాలున్నా ఇప్పుడు లభించే ప్రామాణికమైన, సమకాలీన ప్రధాన ఆధారాలు ఆంగ్ల, పారశీక భాషలలోనే ఉన్నాయి.

## 8.5.2. పీష్వాల యుగం :

పీష్వాయుగ చరిత్రకు లభ్యమయ్యే ఆధారాలు ఎక్కువగా లభ్యం కావడమేగాక అత్యంత ప్రామాణికాలు. శివాజీ వారసులు బలహీనులు కావడంతో వారి ప్రధానులైన పీష్వాలు విజృంభించి సువిశాల సామ్రాజ్యం నిర్మించారు. వీరు పూనాలో పెద్ద కార్యనిర్వాహక శాఖను ఏర్పరచి దేశం వివిధ ప్రాంతాలలో ఉన్న తమ ప్రతినిధులతోను, ఇతర స్వదేశీరాజులతోను ఉత్తర ప్రత్యుత్తరాలు ఆరంభించారు. ఇది క్రమబద్ధమైన దినచర్యంగా మారింది. పీష్వాయుగ మరాఠుల చరిత్రకు ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు ఇతర అధికారిక రికార్డులు, సమకాలిక ఈస్ట్ఇండియా కంపెనీ ఉత్తర ప్రత్యుత్తరాలు ఆధారంగా ఉన్నాయి. ఈ మౌలిక ఆధారాలను మూడు తరగతులుగా విభజించవచ్చు. అవి 1) పీష్వా దఫ్తర్లు (మరాఠీ అధికార రికార్డులు) 2) పారశీక రికార్డులు 3) ఇంగ్లీషు రికార్డులు. ఇవిగాక మూడో పానిపట్టు యుద్ధంపై సమకాలీన చరిత్రకారులు, ఇతరులు అనేక విషయాలను తెలియజేసారు. మహమ్మద్ జాఫర్ షామ్లూ రచించిన 'తారీఖ్-ఇ-మనాజిల్-ఉల్-ఫతూ' గ్రంథం అటువంటిదే.

## 8.5.3 ఆధునిక రచనలు :

మరాఠుల ప్రాభవాన్ని తెలియజేసే మౌలిక ఆధారాలను పెక్కుమంది పండితులు శోధించి, సేకరించి, పరిష్కరించి సమన్వయంతో సమగ్రంగా మరాఠా చరిత్రను రూపొందించారు. ఇవి ప్రామాణిక మాధ్యమిక, ఆధారాలుగా గుర్తించదగిన గ్రంథాలు. అవి ఎడ్వర్డుస్కాట్ వారింగ్ 1810లో రాసిన 'హిస్టరీ ఆఫ్ ది మరాఠాస్' గ్రాంట్ డఫ్ 1826లో మూడు సంపుటాలలో రచించి లండన్‌లో ప్రచురింపబడిన 'హిస్టరీ ఆఫ్ మరాఠాస్' 1901లో మహాదేవ గోవింద రెనడే వ్రాసిన 'రైస్ ఆఫ్ ది మరాఠపవర్', కిన్‌కేడ్, పారస్నీస్‌లు 1918లో రచించిన 'ఏ హిస్టరీ ఆఫ్ ది మరాఠా పీపుల్' మొదలైనవి. ఇంకా జె.ఎన్.సర్కార్, జి.యస్.సర్.దేశాయి, రాలిన్‌సన్, సురేంద్రనాథ్‌సేన్, కీర్తనే, రాజ్వాడే, ఖరేలు వ్రాసిన గ్రంథాలు మరాఠా చరిత్రకు పనికివచ్చు ప్రామాణికములైన చారిత్రక గ్రంథాలు.

## 8.6 సంక్షిప్తంగా :

మధ్యయుగంలో భారతదేశంలో ఇస్లాం వ్యాప్తి చెందినందువల్ల చరిత్ర రచనలో అనేక మార్పులు వచ్చాయి. శాస్త్రీయంగా చరిత్ర వ్రాయాలన్న ఆలోచన భారతీయుల్లో ఏర్పడింది. సుల్తానులు తమ కొలువుల్లో చరిత్ర రాయించేవారికి ప్రత్యేక స్థానం కల్పించారు. వీరు రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక వ్యవహారాల గురించి తమ రచనల్లో పొందుపరచారు. అంతేగాక ముస్లిం చరిత్రకారులు కాలానుక్రమ దృక్పధాన్ని అనుసరించడం వల్ల మధ్యయుగ భారతచరిత్ర పునర్ నిర్మాణానికి ఎంతో సౌలభ్యం ఏర్పడింది. మొగలుల కాలం వచ్చిన తరువాత ముస్లిం చరిత్ర రచనల్లో మరింత స్పష్టమైన మార్పు కనిపించింది. ఈ కాలపు చరిత్ర రచనలో ప్రజల గురించి, ప్రజల సామాజిక సంస్థల గురించి, నాగరికత అభివృద్ధి గురించి ప్రస్తావనలు కన్పిస్తాయి. ఈ కాలంలో వృత్తిపరమైన చరిత్రకారులు కాకుండా చరిత్రను సృష్టించే చక్రవర్తులే స్వయంగా చరిత్ర రచన

చేశారు. మధ్యయుగంలో అసంఖ్యాకంగా విదేశీయాత్రికులు భారతదేశం వచ్చారు. రాగద్వేషాలకు అతీతంగా వీరు చేసిన రచనలు మధ్యయుగ భారతచరిత్ర పునర్ నిర్మాణానికి ఎంతగానో ఉపకరిస్తున్నాయి. యూరోపియన్ల రాకతో చరిత్ర రచనలో మరింత మార్పు వచ్చింది. వీరి రచనలు చాలావరకు ప్రజల ఆర్థిక పరిస్థితి గురించి, కొంత సామాజిక పరిస్థితి గురించి వివరిస్తున్నాయి. భారత పరిస్థితులు అవగాహన చేసుకోవడానికి వీరు రచనలు చాలా ఉపయోగపడతాయి.

ఈ విధంగా మధ్యయుగానికి సంబంధించి తురుష్క, విజయనగర, మొగల్, మరాఠా యుగచరిత్ర పునర్‌నిర్మాణానికి అపారమైన స్వదేశీ, విదేశీ వాఙ్మయంతోబాటు పూరావస్తు ఆధారాలు గలవు. వీటి సహాయంతో సమగ్రమైన, సంపూర్ణమైన, ప్రామాణికమైన, శాస్త్రీయమైన మధ్యయుగ భారతదేశ చరిత్రను పునర్నిర్మించవచ్చు.

## 8.7 పరీక్ష నమూనా ప్రశ్నలు :

**ఎ) ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

1. తురుష్కయుగంనాటి ముస్లిం రచనల ప్రాముఖ్యతను తెలుపండి.
2. మొగల్ కాలంనాటి పురావస్తు, విదేశీ రచనల గురించి వివరించండి.

**బి) ఈ క్రింది వాటిపై లఘువ్యాఖ్యలను రాయండి.**

1. ఢిల్లీ సుల్తానుల కాలంనాటి విదేశీ రచనలను వివరించండి.
2. సాధారణ సాహిత్యం విజయనగర రచనకు ఎలా తోడ్పడిందో వివరించండి.
3. మరాఠా యుగంనాటి రచనలను క్లుప్తంగా తెలుపండి.

## 8.8 ఉపయుక్త గ్రంథాలు :


| | | |
|---|---|---|
| Linia. B.N. | : | Some Historians of Medieval India (Agra, 1969) |
| Mehata. J.L. | : | Advanced Study in the History in Medival India, (New Delhi, 1980) |
| Sirkar. J.N. | : | History of History writing in Medival India, (Calcutta, 1977) |
| Khan. M.H. (Ed.,) | : | Historians of Medival India (Murut, 1968) |
| Peter Hardy | : | Historians of Medival India (London, 1956) |
| Vinod Chand Pandy & Vinod Behan Lal | : | The Medival India, (Lucknow, 1983). |


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 9

# ఇతిహాస - పురాణ సాంప్రదాయం

## (ప్రాచీన భారతదేశ చరిత్ర రచనా సంప్రదాయం)

### 9.0 లక్ష్యం :

ఈ పాఠ్య అధ్యయనం వలన మీరు -

* ప్రాచీన కాలంలోని భారతీయుల చారిత్రక దృష్టి గురించి తెలుసుకోగలగాలి
* ఇతిహాస పురాణ సంప్రదాయం గురించి అర్థం చేసుకోగలగాలి
* క్రీ.శ. 7వ శతాబ్ది నుండి వెలువడిన రచనా పద్ధతులను తెలుసుకోగలగాలి.

### విషయసూచిక


9.1 పరిచయం
9.2 ప్రాచీన కాలంలో భారతీయులకు చారిత్రక దృష్టి లేదు
9.3 చారిత్రక దృష్టి లోపించడానికి కారణాలు
9.4 ప్రాచీన భారతీయులకు చారిత్రక దృష్టి లోపించలేదు
9.5 ఇతిహాస పురాణ సంప్రదాయం
9.6 ఇతిహాస పురాణ సంప్రదాయంలోని అంశాలు
9.7 క్రీ.శ. 7వ శతాబ్ది నుంచి రచనా పద్ధతి
9.8 క్రీ.శ. 12, 13 శతాబ్దాలలో ఇతిహాస పురాణ సంప్రదాయం
9.9 సంక్షిప్తంగా
9.10 నమూనా ప్రశ్నలు
9.11 ఉపయుక్త గ్రంథాలు


### 9.1 పరిచయం :

భారతదేశ చరిత్ర రచనా సంప్రదాయం చాలా బలహీనమయింది. భారతదేశంలో మధ్య యుగాల దాకా కల్హణుని 'రాజ తరంగిణి' మినహా మరో ప్రామాణిక గ్రంథం లేదు. అదీ, ఒక ప్రాంతీయ రాజ్యాన్ని గూర్చిన గ్రంథం. కాశ్మీర్‌ను పరిపాలించిన రాజవంశాల పట్టిక తప్ప అందులో అప్పటి చారిత్రకాంశాలు కొద్ది మాత్రమే. మధ్య యుగాలకు సంబంధించి చరిత్రకారులు, విదేశీయాత్రికులు రాసిన అంశాలు 'పాక్షిక' దృష్టితో రాసినవే. భారతదేశ చరిత్ర రచన ఒక పద్ధతి ప్రకారం నిర్దుష్టంగా, ఆధునిక

రీతిలో రాయడం ఆరంభమైంది క్రీ.శ. 19వ శతాబ్దంలోనే. దీనికి ఆద్యుడు జేమ్స్ మిల్. వలస పాలనను పరోక్షంగా సమర్థించడానికి, బ్రిటిష్ ప్రభుత్వంలో పనిచేస్తున్న సివిల్ సర్వెంట్స్‌కు ఉపయోగపడ్డానికి దీనిని మిల్ రాశాడు. భారతదేశానికి చెప్పుకోదగ్గ, పాశ్చాత్య దేశాలతో సరితూగగల గత చరిత్ర లేదని మిల్ అభిప్రాయపడ్డాడు. ఒక వేళ చరిత్ర ఉందని అంగీకరించినా అది కేవలం మతపరమైనదనీ, వట్టి రాజకీయ సంఘటనలు మినహా మరొకటి కాదని పేర్కొన్నాడు. వలసవాద చరిత్ర రచనకు వ్యతిరేకంగా, జాతీయ వాదాన్ని ఆలంబనగా చేసికొని సాగిన చరిత్ర రచన భారతదేశ చరిత్రను సుసంపన్నం గావించింది. మతం, రాజకీయం మినహా మరొకటి లేదన్న వలస చరిత్రకారులకు కనువిప్పు కలిగించేలా, గత కాలపు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలతోబాటు, పరిపాలనాపరమైన రాజ్యసంబంధమైన అనేకానేక సూక్ష్మాంశాలను వెలుగులోకి తెచ్చింది. అంతేగాక, దేశీయ చారిత్రక ఆధారాలు విశ్వసనీయాలు కావన్న విమర్శను కూడా వీరు తిప్పి కొట్టి, పురావస్తు, శాసన, సాహిత్య మొదలగు అనేక ప్రామాణిక ఆధారాలను వెలుగులోకి తెచ్చారు.

## 9.2 ప్రాచీన కాలంలో భారతీయులకు చారిత్రక దృష్టి లేదు (లేదా) హెరొడోటస్, థూసిడైడిస్ లాంటి చరిత్రకారులు లేరు :

భారతీయ చరిత్ర రచనా మూలం, క్రమవికాస పరిణామం గురించి విశ్లేషణ చేసిన పెక్కు మంది చరిత్రకారులు ప్రాచీన కాలంలో భారతీయులకు చారిత్రక దృష్టి, నేడు అర్థం చేసుకుంటున్న రీతిలో చరిత్ర రచనా సంప్రదాయం లేదనే అభిప్రాయం వెలిబుచ్చారు. అంతేగాక ప్రాచీన గ్రీకుల చైనీయుల చరిత్ర రచనా సంప్రదాయంతో పోల్చి ప్రాచీన భారతీయ చరిత్రకారుల్లో హెరొడోటస్, లేదా థూసిడైడిస్ లేదా లివి లేదా టాసిటస్ లేదా ఇబన్ ఖల్దూన్‌లతో సరితూగే చరిత్రకారుడు లేడు అని ఈ కోవకు చెందిన పండితులు అభిప్రాయపడ్డారు. ఆల్‌బెరూనీ మాటల్లో "హిందువులు చారిత్రక విషయక్రమంలో తగు శ్రద్ధ చూపరు అనీ, ఎవరు రాజ్యపాలకులు అయినా వారు నిర్లక్ష్యముగా ఉంటారు". "సంస్కృత వాఙ్మయంలో గొప్ప మేధావులు ఉన్నను నిశిత దృష్టి కల్గిన చరిత్రకారుడు ఒక్కడు కూడా లేడు" అని కేత్ పండితుడంటాడు. "చరిత్ర రచన పట్ల విముఖత, భారతీయ సంస్కృతికి గొప్ప లోపం" అని ఆర్.సి. మజుందార్ అంటాడు.

ప్రాచీన భారతీయులకు చారిత్రక దృక్పథం, రచనా సంప్రదాయం ఉన్నాయా లేవా అన్న ప్రశ్నకు సరియైన సమాధానం కావాలంటే వారి మనస్తత్వం, ఆలోచనా ధోరణి, విశ్వాసాలు, సంప్రదాయాలు తెలుసుకోవాలి. ప్రాచీన భారతీయ సంస్కృతి, చరిత్ర, చరిత్రకారుల గురించి ఆంగ్లేయులు తెలియజేసిన దానికంటే ఎక్కువ భారతీయులకు తెలియదు. వాటి వివరాలు తెలుసుకోవలసింది ఇంకా చాలా వుంది. ప్రాచీన భారతీయ పండితులు వారసత్వంగా అందించిన సంస్కృత సాహిత్యం భిన్న రంగాలలో మానవుడు సాధించిన అభివృద్ధి గురించి విపులంగా ఉంది. అయితే గత కాలం గురించి ఆధునికులు అలవాటు పడిన, నిర్ధారణగా చెప్పడానికి వీలయిన చరిత్ర ఈ సంస్కృత సాహిత్యంలో ఎంత వుందో ఇంకా పూర్తిగా తెలియదు. చరిత్రకు కాలక్రమణిక ఒక కన్ను అనుకున్నట్లైతే ప్రస్తుతమున్న ఆధారాలను బట్టి ప్రాచీన భారతీయ చరిత్ర చూపులేనిది అని అం[illegible]రు. భారత, రామాయణ, పురాణాలలోని వివరాలకు కాలక్రమణిక ఆధారాలు సమకూరితే ఈ వాదం పూర్తిగా తప్పని తే[illegible]. చరిత్రను సమగ్రమైన మానవ ప్రగతిని ఆధునిక శాస్త్రరీతిలో వివరించే ప్రత్యేక సంఘటనలు సముదాయపట్టిక అని నిర్వచించినట్లయితే ప్రస్తుతం మన విజ్ఞానాన్ని బట్టి భారతీయులలో అటువంటి చారిత్రక దృష్టి లోపించింది అని చెప్పవచ్చు. చరిత్రను గతాన్ని అర్థం చేసుకోవడానికి హేతువాద దృక్పథంలో కార్యకారణ సంబంధాల ఫలితాల అవగాహనలో శోధించిన వివరణ అని అనుకున్నట్లయితే, అటువంటి చారిత్రక భావన ప్రస్తుతం మనం అనుకుంటున్నట్లు మన ప్రాచీనులకు లేదేమో అనిపిస్తుంది.

## 9.3 చారిత్రక దృష్టి లోపించడానికి కారణాలు :

ఈ భూమిపై ప్రాచీన భారతీయులు సాధించిన అభివృద్ధి అశాశ్వతమని విశ్వసించడం వల్ల, ప్రాచీన భారతీయులకు సామ్రాజ్యవాద కాంక్ష లోపించడం వల్ల, భారతదేశం వెలుపల వస్తున్న నూతన భావాల తాకిడికి భారతీయులు ప్రభావితం కాకపోవడం వల్ల, ప్రాచీన చారిత్రక గ్రంథాలు కాలగర్భంలో కలసిపోవడం వల్ల, ఇంకా ఎన్నో ఆధారాలు వెతికి తీయవలసి వుండటం వల్లను, ప్రాచీన భారతీయులకు చరిత్ర రచనా సాంప్రదాయం లేదని భావించవలసి వస్తుందని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. ప్రాచీన భారతదేశానికి సంబంధించి చారిత్రక గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోవడం వల్ల చరిత్ర రచనా సంప్రదాయం భారతీయులకు లేదని భావించవలసి వస్తుందని సురేంద్రనాథ్ బెనర్జీ అంటాడు.

## 9.4 ప్రాచీన భారతీయులకు చారిత్రక దృష్టి లోపించలేదు :

ప్రాచీన హిందూ సాహిత్యంలో చరిత్ర రచనకు పనికివచ్చే ముడిసరుకు అపారంగా వుందని ఆర్.సి. మజుందార్, రోమిల్లా థాపర్‌లు అభిప్రాయపడ్డారు. హైందవ పురాణాలు, బౌద్ధ జాతక కథలు, జైన ప్రబంధాలు, వీరశైవ వచనాలు, వైష్ణవ భక్తి గీతాలు, సంగం వాఙ్మయం, సింహళ బౌద్ధ గ్రంథాలైన దీపవంశ, మహావంశ మొదలగుగల సారస్వతంలో ఆయా కాలాలలోని భారతీయుల ఆలోచన ధోరణి, సామాజిక మార్పు కోరుకున్న విధానాలు, నాటి సామాజిక రుగ్మతలు ప్రతిబింబించాయని వీరు భావించారు.

## 9.5 ఇతిహాస - పురాణ సంప్రదాయం :

చరిత్ర అంటే నడత, నడవడి, కథ, ఉపాఖ్యానం, పురాణం, వర్ణన అని మన నిఘంటువులు చెబుతున్నాయి. మనిషి మనుగడకు సంబంధించి మంచీ చెడుల కలయికగా మానవాభ్యున్నతి కోసం ముందుకు సాగుతున్న పయనాన్ని చరిత్రగా భావించవచ్చు. చరిత్ర అనగా 'సంఘటనలను వివరించే కాలం' అన్న అర్థంలో 'తారిఖ్'గా పిలవబడుతున్నది. దీనినే సంస్కృత భాషలో 'పురాణం', 'ఇతిహాసం' అని వాడారు. ఇతిహాసం అనగా ధర్మ, అర్థ, కామ, మోక్షాలతో కూడిన మానవ జీవితాన్ని గురించి జరిగిన కథలాగా చెప్పటం అన్ని విశాల భావనలో ఉపయోగించారు. దీనిని బట్టి మానవుడు భూమి మీద అడుగుపెట్టినప్పటినుంచి (ప్లైస్టసీన్ యుగం) మానవ జీవితానికి సంబంధించిన సర్వ విషయాలు, మానవ పురోగతి కొరకు ముందుకు సాగుతున్న ప్రయాణాన్ని వివరించేదే చరిత్ర అని చెప్పవచ్చు.

ప్రాచీన భారతీయులు ఇతిహాస - పురాణ సంప్రదాయం అనుసరించి చరిత్ర రచన సాగించారని రొమిల్లా థాపర్ అభిప్రాయపడినారు. ఈమె ప్రాచీన భారతీయ చరిత్ర, సంస్కృతులపై సంపూర్ణ అధికారంలో విశ్లేషించగలిగిన దిట్ట. ప్రతి సమాజానికి గతం గురించిన భావన ఉండితీరుతుందని విశ్వసిస్తూ, ఏ సమాజాన్ని చారిత్రక దృక్పథం లేనిది అని చెప్పకూడదని ఈమె పేర్కొన్నారు. చారిత్రక దృక్పథం లేదా భావన అనేది ఆ ప్రత్యేక సమాజానికి పనికివచ్చే, ఆ సమాజం అవసరాలు తీర్చడానికి ఉపయోగపడే కాలక్రమణిక చట్రంలో బిగించబడిన గల సంఘటనల 'చైతన్యమే' అని నిర్వచించారు.

**ఇతిహాసం :** ప్రాచీన భారతీయుల చరిత్రరచనా సంప్రదాయాన్ని తెలియజేసే ఆధారాలలో సంస్కృత వాఙ్మయం ముఖ్యమైనది. ఈ సంస్కృత వాఙ్మయంలో చరిత్ర అర్థము వచ్చేటట్లు ఉపయోగించబడిన పదం 'ఇతిహాసం'. 'ఇతిహాసం' అన్న పదానికి మన నిఘంటువులు ఇస్తున్న అర్థం 'తొల్లిటి కథ' 'ఆ విధంగా' అని కూడా ఈ పదానికి అర్థం చెప్పబడింది. ఋగ్వేదంలోను, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులలోను ఈ పదం వాడబడిన సందర్భాలను పరికిస్తే 'ఇతిహాసం' ఒక ప్రయోజనకరమైన కథనంగా, గత సంఘటనల వర్ణనగా కనిపిస్తున్నది. ఏదో దాగి వున్న అర్థాన్ని వివరించడానికై చెప్పే కథనమనీ, నీతిబోధ చేసే వెతిహ్యామైన 'ఆభాన్యం' లేదా 'ఆభ్యాయిక'కు భిన్నమైనదనీ అర్థమవుతుంది. ప్రయోజనకరమైన గాథగా ఇతిహాసానికి ఇచ్చిన ఈ అర్థాన్ని రామాయణ భారతేతిహాసాల రచయితలు మరింత విస్తృత భావంలో వివరించారు.

ఇతిహాస సంప్రదాయానికి ప్రతీకగా భావించబడుతున్న మహాభారతాన్ని నమూనాగా తీసుకొన్న కౌటిల్యుడు దానిని పంచమ వేదంగా వర్ణించాడు. అంతేగాక పురాణం, ఇతివృత్తం, ఆఖ్యాయిక, ఉదాహరణం, ధర్మ శాస్త్రం, అర్థ శాస్త్రాలు ఇతిహాసంగా ఏర్పడ్డాయని కౌటిల్యుడు పేర్కొన్నాడు. కౌటిల్యుని ఈ వ్యాఖ్యానాలు ప్రాచీనకాలంలో విద్యలలో అత్యున్నత స్థానం చరిత్రకు ఇవ్వబడిందని సూచిస్తున్నాయి. చరిత్ర ప్రయోజనం, ప్రాధాన్యతలు పూర్తిగా గ్రహించబడ్డాయి. చరిత్ర విషయ పరిధి కూడా సర్వతోముఖమనీ, చారిత్రక వ్యక్తులు, సంఘటనలే గాక రాజకీయ, ఆర్థిక, మత, సామాజిక, నైతిక సిద్ధాంతాలు, సంప్రదాయాలు, న్యాయవ్యవహారాలు, సంస్థలు - క్లుప్తంగా చెప్పాలంటే మొత్తం నాగరికతకు సంబంధించిన సమగ్రమైన వర్ణనే చరిత్ర అనే భావన ఏర్పడింది. కొద్ది కాలంలోనే చరిత్రకు కచ్చితమైన నిర్వచనం ఇవ్వడం జరిగింది. 'ధర్మార్థకామ మోక్షాణామ్ ఉపదేశ సమన్వితమ్, పూర్వవృత్తమ్ కథాయుక్తమ్ ఇతిహాసమ్ ప్రచక్షతే' అనేది ఆ నిర్వచనం. అనగా ధర్మార్థ కామమోక్షోపదేశ సమన్వితమయిన పూర్వ వృత్తాన్ని కథాయుక్తంగా చెప్పడమే ఇతిహాసము. ఈ విధంగా పురుషార్థాలను ఆ విలువలకు జీవితంలో వాస్తవ రూపంలోకి తెచ్చే ప్రయత్నాలను, ప్రజల మేథా సంబంధంగా సాధించబడిన అంశాలను నొక్కి వక్కాణించడం ప్రాచీన భారతీయులకు సమగ్రమైన చరిత్ర యొక్క ఆదర్శమైనది. చరిత్ర యొక్క ఈ సమగ్ర దృష్టి చాలా కాలం కొనసాగింది. మన భారత, రామాయణాలు, పురాణాలు, కావ్యాలు, శాసనాలు సమస్తం ఈ భావననే ఊపిరిగా చేసుకొన్నాయి. ఇవన్నీ ఈ దృష్ట్యా అధ్యయనం చేసినపుడు మాత్రమే అర్థవంతంగా కన్పిస్తాయి. ఈ విధంగా ప్రాచీన భారతీయుల దృక్పథంలో ఇతిహాసమే చరిత్ర.

**పురాణం :** చరిత్రకు మరో వైపు పురాణముంది. సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం అను ఐదు భాగాలతో పురాణం సాంస్కృతిక చరిత్ర యొక్క సంశ్లేషణను మన కందిస్తుంది. జీవితంలోని పలు రంగాలలో ప్రజల మహత్కార్యాలను, విలువలను ఈ విధంగా నొక్కి చెప్పడం ప్రాచీన భారతీయ చరిత్ర రచన లక్షణమయింది. వైదిక కాలం నుంచి ప్రచారంలో ఉన్న పాటలు, నాయకుల పొగడ్తలు, నాటకీయ వర్ణనలు వంటి అనేక సాహిత్య ప్రక్రియలను ప్రారంభంలో వివిధ తెగలకు చెందిన పురోహిత కవులు సంకలనం చేసేవారు. సమావేశాలలో వీటిని పాడేవారు. అనేక వందల సంవత్సరాల తర్వాత ఇవన్నీ గ్రంథస్థం చేయబడ్డాయి. ప్రథమంలో సూతులు, మాగధులు దేవతల, ఋషుల, యోధుల వంశావళులను భద్రపరచి అవసరమైనపుడు వాటిని వినిపించేవారు.

ఈ వంశావళులు చరిత్ర రచనా సాంప్రదాయంలో ప్రధానమైనవి. ఎందుకంటే చట్టబద్ధమైన హక్కులను, సామాజిక అంతస్థును రుజువు పరచడానికి, తెగల గుర్తింపు కాపాడడానికి ఇవే సాధనాలవడంతో క్రీ.శ. 4వ శతాబ్దంలో ఈ గాథలను క్రోడీకరించి పురాణాలుగా గ్రంథస్థం చేయగా ప్రసిద్ధికెక్కాయి. 'పురాణం' అంటే 'పురాతనం' అని అర్థం. పురాణాలలో సాంఘిక, మత విషయాలు, సాంప్రదాయక చరిత్రలు ఉన్నాయి. చారిత్రకాంశాలు విడిగా ఒక ప్రత్యేక భాగంగా ఇవ్వలేదు. ఎప్పుడో జరిగిన విషయాలను వంశ పారంపర్యంగా జ్ఞాపకం ఉంచుకొన్న సూతులు, మాగధులు కాక ఎందరో ఋషులు ఈ పురాణాలను మతపరంగా రచించడంతో వాటి సంబంధిత కాలక్రమం తెలుసుకోవడం కష్టమై వీటి చారిత్రక విలువ పరిమితమయింది.

## 9.6 ఇతిహాస - పురాణ సంప్రదాయంలోని అంశాలు :

ఇతిహాస - పురాణ సంప్రదాయంలో కట్టుకథ, వంశావళి, చారిత్రక వివరణము అను మూడు కీలక అంశాలున్నాయి. సాధారణంగా చరిత్ర సాంఘికంగా, రాజకీయంగా ఉన్నతులయిన వర్గాల వారి కార్యకలపాల పట్టిక అని చెప్పవచ్చు. భారతీయ సమాజంలో పుట్టుకను బట్టి అంతస్థు ఏర్పడడం వల్ల సామాజిక చలనం వ్యక్తిపరంగా కాక వర్గపరంగా జరగడం వల్ల వంశావళులకు చారిత్రకంగా ప్రాధాన్యత ఇవ్వబడింది. రాజకీయ సంఘటనలు వరుసక్రమంలో పేర్కొనబడటానికి బదులుగా వంశపారంపర్యతకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. భారతీయ చారిత్రక సంప్రదాయంలో రాజకీయ చరిత్ర కీలకమైన అంశం కాదని రొమిల్లా థాపర్ అంటారు. కాని కాలక్రమేణా గుప్తుల అనంతర కాలంలో చారిత్రక వాఙ్మయంలో రాజకీయ చరిత్రకు ప్రాముఖ్యం ఇవ్వబడింది. ప్రాచీన భారతీయుల ఇతిహాస పురాణ సంప్రదాయంలోని చారిత్రక వివరణ ఆనాటి సమాజంలోని ఆదర్శాల చేత ప్రభావితమవడం వల్ల సమకాలిక, గ్రీక్, చైనీయుల చారిత్రక ధోరణికి భిన్నంగా ఉంది. ప్రాచీన భారతీయ చరిత్ర రచనా సంప్రదాయానికి చరిత్రతత్వానికి

గల తేడాలను గమనించాలి. ప్రాచీనుల చారిత్రక దృష్టి కాలానుక్రమానికి సంబంధించినంత వరకు అపరిపూర్ణం అనవచ్చు. అయితే చారిత్రక సంప్రదాయం ఆనాటి సాంస్కృతిక విలువలపై ఆధారపడింది.

## 9.7 క్రీ. శ. 7వ శతాబ్దం నుంచి రచనా పద్ధతి :

క్రీ.శ. 7వ శతాబ్దం నుంచి ఇతిహాస పురాణ సంప్రదాయం విస్తృతమయింది. ప్రతిరాజ్యం తమ పాలకుల వంశావళిని అతి జాగ్రత్తగా భద్రపరచడమే గాక చరిత్ర రచనా సంవిధానంలో ఒక నూతన ప్రక్రియ 'చారిత్రక వ్యక్తుల జీవిత చరిత్రలు రచించడం' అనేది ఆరంభమయింది. ఈ ప్రక్రియ ఆవిర్భావానికి అనేక కారణాలు దోహదం చేశాయి. చిన్న ప్రాంతీయ రాజ్యాలు విరివిగా ఏర్పడిన ఫలితంగా స్థానిక విధేయత పెరిగి స్థానిక విశేషాలు గ్రంథస్థం చేయాలనే కాంక్ష పెరిగింది. ఈ చిన్న ప్రాంతీయ రాజ్యాల అవతరణలో చరిత్రకారుని దృష్టి తెగనుంచి పాలకుని వైపుకు, ఆస్థానం వైపుకు మరలింది. పర్యవసానంగా చారిత్రక సాంప్రదాయంలో సూతుడు మరుగునపడి ఆస్థానకవి ప్రముఖస్థానం ఆక్రమించాడు.

క్రీ.శ. 600 - 1200 మధ్య కాలంలో అనేక మంది పాలకుల జీవిత చరిత్రలు గ్రంథస్థం అయినాయి. బాణుని 'హర్ష చరిత్ర', బిల్హణుని 'విక్రమాంక దేవచరిత', చాంద్ బర్దాయ్ 'పృథ్వీరాజ్ రాసో' అనేవి ప్రముఖమయిన గ్రంథాలు. పాలకులతోబాటుగా అరుదుగానే అయినప్పటికీ అమాత్యుల జీవిత చరిత్రలు కూడా వ్రాయడం జరిగింది. ఈ గ్రంథాలు లౌకిక అధికారం మీద పెరుగుతున్న అభిలాషను వ్యక్తం చేస్తాయి. ఈ గ్రంథాలలో పాలకుని పొగడ్తకే ప్రాముఖ్యం ఇచ్చారు. గ్రంథకర్త పాలకుని ఆదరణ వాంఛించగా పాలకుడు తనకు శాశ్వత స్థానం కావాలని కోరుకున్నాడు. ఫలితంగా రచనలో కొంత చారిత్రక వాస్తవికత లోపించింది. కాని ఈ గ్రంథకర్తలకు ఇతిహాస - పురాణ సంప్రదాయంతో పరిచయం ఉందని పురాణాలకు, జీవిత చరిత్రలకు గల సంబంధం స్పష్టం చేస్తుంది. పురాణాల, జీవిత చరిత్రల గ్రంథకర్తలు ఒకే విధమైన ఆలోచనా ధోరణికి, సాంఘిక వ్యవస్థకు చెందిన వారు కావడం చేత రచనా పద్ధతిలో మార్పు కన్పించినప్పటికీ మౌలిక చట్రంలో పెద్ద మార్పులేదు.

## 9.8 క్రీ.శ. 12, 13వ శతాబ్దాలలో ఇతిహాస - పురాణ సంప్రదాయం :

కాశ్మీర్ రాజవంశ చరిత్ర అయిన 'రాజతరంగిణి' రచయిత కల్హణుడు ఇతిహాస-పురాణ సంప్రదాయం అవలంబించినప్పటికీ ఆ సంప్రదాయానికి భిన్నంగా కూడా రచన సాగించాడు. 'రాజతరంగిణి' గ్రంథాన్ని మూడు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు. మొదటి భాగంలో ఇతిహాస-పురాణ సంప్రదాయంపై ఆధారపడటం కన్పిస్తుంది. రెండవ భాగంలో చారిత్రక అంశాలను ధృవపరచడానికి వీలయినట్లు వివిధ ఆధారాల నుంచి సేకరించడం కనిపిస్తుంది. మూడవ భాగంలో క్రీ.శ. 8 - 12 శతాబ్దాల మధ్య గల చరిత్ర వర్ణించబడింది. ఈ మూడవ విభాగమే కల్హణుని విమర్శనాత్మక దృక్పథం గల చరిత్రకారునిగా గుర్తింపు లభింపచేసింది. కల్హణునిపై గ్రీకుల లేదా మధ్య ఆసియాలోని తురుష్కుల చరిత్ర రచనా ప్రభావం పడిందని కొందరు ఆధునిక చరిత్రకారుల అభిప్రాయం. రాజతరంగిణిని తొలి భారతీయ చరిత్ర రచనా పరిణామం దృష్ట్యా పరిశీలిస్తే భారతీయ సంప్రదాయ పరిధిలోనిదే అన్న అభిప్రాయాన్ని రొమిల్లా థాపర్ తెలియజేశారు. కల్హణునిపై పరోక్ష ప్రభావం ఏదైనా ఉంటే అది బౌద్ధ సంప్రదాయం అవుతుందేమో పరిశీలించవలసి వుందని ఆమె అభిప్రాయపడ్డారు.

పశ్చిమ భారతంలోని జైన పండితులు రచించిన 'పరిశిష్ట పర్వణం', 'ప్రబంధ చింతామణి', 'హమ్మీర' మహాకావ్యాలు సంస్కృత భాషలో భారతీయ సంప్రదాయాన్ని కొనసాగించాయి. బౌద్ధ గ్రంథాలయిన 'దీపవంశ', 'మహావంశాలు' కూడా ప్రాచీన భారతీయ చారిత్రక సంప్రదాయంతో ముడిపడ్డాయని రొమిల్లా థాపర్ అభిప్రాయం. ఇవి చరిత్ర పట్ల బౌద్ధుల దృక్పథాన్ని, ముఖ్యంగా థేరవాద బౌద్ధుల దృక్పథాన్ని వివరిస్తాయి.

## 9.9 సంక్షిప్తంగా :

ప్రాచీన యుగంలో భారతదేశంలో నెలకొన్న చారిత్రక సంప్రదాయాన్ని ఆనాటి సామాజిక ఆదర్శం, మత విశ్వాసాలు ప్రభావితం చేయడంతో, ఆ సమాజానికి అవసరమైన, ఉపయోగపడే ఇతిహాస - పురాణ సంప్రదాయం ధోరణిలో చరిత్ర రచనలు చేయబడ్డాయి. కనుక ప్రాచీన భారతదేశంలో ఆధునిక చరిత్ర రచనా ధోరణికి సరిపడే లేదా దగ్గరగా రాగల చరిత్రకారుడు ప్రస్తుత ఆధారాలతో పరిశీలిస్తే కనిపించకపోవచ్చు. కాని ప్రాచీన భారతీయులు చరిత్ర తత్త్వాన్ని సరిగానే అర్థం చేసుకొన్నారని భావించవచ్చు.

## 9.10 నమూనా ప్రశ్నలు :

(i) ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.

1. ప్రాచీన కాలంలో భారతీయుల చారిత్రక దృష్టిని గురించి విమర్శించండి.
2. క్రీ.శ. 7వ శతాబ్ది నుంచి భారతీయుల చారిత్రక దృష్టిలో వచ్చిన మార్పును పరిశీలనాత్మకంగా వివరించండి.

(ii) ఈ క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. ప్రాచీన కాలంలో భారతీయుల చారిత్రక దృష్టి లోపించడానికి గల కారణాలు తెలుపండి.
2. ఇతిహాస - పురాణ సంప్రదాయంలోని అంశాలను పరిశీలించండి.
3. క్రీ.శ. 12 - 13 శతాబ్దాలలో ఇతిహాస పురాణ సంప్రదాయ రచనా పద్ధతిలోని మార్పును తెలుపండి.

## 9.11 ఉపయుక్త గ్రంథాలు :


1. Gopal. S & Romilla Thapar : Problems of Historical Writing in India, (New Delhi, 1963)
2. Sheik Ali. B. : History : Its Theory and Method, (Mackillan, 1978)
3. Ramanna A.S : Historical Method in relation to Indian History (Madras, 1956)
4. Thomson, J.W. : History of Historical Writings (2 Vols) New York, 1942)



పాఠ్య రచయిత

- డాక్టర్ వి.కె. మోహన్.

పాఠం 10

# కల్హణుడు - ఆల్‌బెరూని

## 10.0 లక్ష్యం :

ఈ పాఠ్య అధ్యయనం వలన మీరు ప్రాచీన భారతీయ చరిత్ర రచయిత అయిన కల్హణుని గురించి, తొలి మధ్యయుగ ముస్లిం చరిత్రకారుడైన ఆల్‌బెరూని గురించి తెలుసుకోగలగాలి.

* ప్రాచీన భారతీయుల చరిత్ర రచయితలలో విశిష్ట స్థానం ఆక్రమించిన కల్హణుడు సంస్కృత భాషలో వ్రాసిన 'రాజతరంగిణి' విమర్శనాత్మక దృష్టితో పరిశీలించాలి.
* తొలి మధ్యయుగ చరిత్రకారులలో ప్రఖ్యాతిగాంచిన ఆల్‌బెరూని రచించిన 'కితాబ్ - ఉల్ - హింద్'ని విశ్లేషించి మధ్యయుగ సమాజ స్థితిని తెలుసుకోవాలి.

## విషయసూచిక


10.1 కల్హణుడు

10.1.1 పరిచయం

10.1.2 ప్రాచీన భారత రచనా సాంప్రదాయం

10.1.3 కల్హణుని విశిష్టత

10.1.4 రాజతరంగిణి లోని విషయవివరణ

10.1.5 కల్హణుని స్థానం

10.2 ఆల్‌బెరూని

10.2.1 పరిచయం

10.2.2 ఆల్‌బెరూని భారత రాక

10.2.3 కితాబ్ - ఉల్ - హింద్‌లోని విషయ వివరణ

10.2.4 ఆల్‌బెరూని రచనల ప్రాముఖ్యం

10.3 నమూనా ప్రశ్నలు

10.4 ఉపయుక్త గ్రంథాలు

## 10.1 కల్హణుడు :

**10.1.1 పరిచయం :** క్రీ.శ. 12వ శతాబ్దంలో కల్హణుడు సంస్కృత భాషలో వ్రాసిన 'రాజతరంగిణి' అత్యంత ప్రధానమైనది. కాశ్మీర్ రాజుల చరిత్రను ఆనాటికి లభ్యమైన ఆధారాలను విమర్శనాత్మక దృష్టితో పరిశీలించి ప్రామాణిక చరిత్ర గ్రంథంగా కల్హణుడు రూపొందించాడు. ముస్లింలకు ముఖ్యంగా మధ్య ఆసియా ప్రజలకు చారిత్రక దృష్టి చాలా ఎక్కువ. వీరు ఇస్లాం మతాన్ని భారత దేశంలో వ్యాప్తి చేయడంతో భారత చరిత్ర రచనలో మార్పులు వచ్చాయి. శాస్త్రీయంగా చరిత్ర రచించాలన్న ఆలోచన భారతీయులకు కలిగింది. దీని ప్రభావం మొదటిసారిగా కాశ్మీరుపై పడింది. ఈ ప్రభావ ఫలితమే కల్హణుని 'రాజతరంగిణి' అనే చారిత్రక గ్రంథం అని కొందరు పండితుల అభిప్రాయం. 'రాజతరంగిణి'ని తొలి భారతీయ చరిత్ర రచనా పరిణామం దృష్ట్యా పరిశీలిస్తే భారతీయ సంప్రదాయ పరిధిలోనిదే అన్న అభిప్రాయాన్ని రొమిల్లా థాపర్ వ్యక్తం చేశారు. అంతేగాక కల్హణునిపై పరోక్ష ప్రభావం ఏదైనా ఉంటే అది బౌద్ధ సాంప్రదాయం అవుతుందేమో పరిశీలించవలసి వుందని ఆమె తన అభిప్రాయం వెలిబుచ్చారు.

**10.1.2 : ప్రాచీన భారత రచనా సాంప్రదాయం :** భారతీయులకు చారిత్రక దృష్టి, చారిత్ర దృక్పథము, చరిత్ర రచనా సాంప్రదాయం లేదని పెక్కు మంది పండితులు అభిప్రాయపడ్డారు. అంతేగాక ప్రాచీన భారత రచయితల్లో గ్రీక్ - రోమన్ చరిత్ర రచనా సంప్రదాయ ప్రతినిధులైన హెరొడోటస్ లేదా థూసిడైడిస్ వంటి చరిత్రకారులు లేరని వీరి వాదం. కాని ప్రాచీన భారతీయులు ఇతిహాస - పురాణ సంప్రదాయం ప్రకారం చరిత్ర రచన సాగించారని రొమిలా థాపర్ పేర్కొన్నారు. ప్రతి సమాజానికి, ఆ సమాజం అవసరాలు తీర్చడానికి ఉపయోగపడే చారిత్రక దృక్పథం వుంటుందని ఈమె స్పష్టం చేశారు. ఇతిహాస - పురాణ సాంప్రదాయంలో కట్టు కథ, వంశావళి, చారిత్రక వివరణ అనే మూడు కీలక అంశాలున్నాయి. ఈ మూడింటిలో చరిత్ర రచనకు ముఖ్యమైనవి వంశావళులు, చారిత్రక వివరణలు. ఆనాటి భారతీయ సమాజం యొక్క విశ్వాసాలు, సంప్రదాయాల కనుగుణంగా వంశావళులకు ప్రాముఖ్యమివ్వడం జరిగింది. అయితే ప్రాచీన భారతీయుల చారిత్రక దృష్టి కాలక్రమానికి సంబంధించినంత వరకు అపరిపూర్ణమే.

క్రీ.శ. 7వ శతాబ్దం నుంచి ఇతిహాస - పురాణ సంప్రదాయం విస్తృతమైంది. చారిత్రక వ్యక్తుల జీవిత చరిత్రలు రచించడం అనే కొత్త చారిత్రక రచనా ప్రక్రియ ప్రచారంలోకి వచ్చింది. ప్రాంతీయ పాలకులచే పోషింపబడిన ఆస్థాన కవులు తమ పాలకుల జీవిత చరిత్రలకు, విజయాలను గ్రంథస్తం చేశారు. అయితే వీనిలో చారిత్రక పద్ధతి లోపించింది. ప్రథమంలో సూతులు, మాగధులు పాడిన పాటలు, సంకలనాలు పురాణాలుగా మారగా, తరువాత ఆస్థానకవులు వారి స్థానాన్ని ఆక్రమించారు. ఫలితంగా రచనా పద్ధతిలో మార్పు వచ్చినా, మౌలిక చట్టమైన ఇతిహాస - పురాణ పద్ధతిలో మౌలికమైన మార్పు రాలేదు. ఈ కోవకే చెందినప్పటికి, కొంతవరకు భిన్నమైనది కల్హణుని 'రాజతరంగిణి'.

**10.1.3 కల్హణుని విశిష్టత :** కల్హణుడు ఆధునిక చారిత్రక పద్ధతిలోని సూత్రాలైన విశ్వసనీయమైన, ప్రామాణికమైన ఆధారాల సేకరణ, ఆధారాలను విమర్శనాత్మకంగా సూక్ష్మంగా పరిశీలించి, వివరాలను క్రమబద్ధంగా ఏర్పరచి విషయ విశ్లేషణకు పూనుకోవడం చేత ప్రాచీన భారతీయ చరిత్రకారులలో కల్హణునకు, చరిత్ర రచనల్లో 'రాజతరంగిణి'కి ఒక విశిష్ట స్థానం ఇవ్వబడింది. అంటే ఆధునిక చరిత్ర రచనా లక్షణమైన విషయ నిష్టత, కచ్చితత్వము, ప్రామాణికత, చరిత్రతత్వం, శాస్త్రీయ దృక్పథంతో కూడిన విశ్లేషణ ఉండినదని కాదు. ఇతిహాస - పురాణ సంప్రదాయంలోని కట్టుకథ వంశావళి, కాలక్రమం లేని చారిత్రక వివరణం నుండి కాలక్రమమునకు ప్రాధాన్యమిచ్చి కట్టుకథలను, యధార్ధ సంఘటనలను వేరు చేసి, కాశ్మీర్ చరిత్రలో జరిగిన సంఘటనలకు ప్రాధాన్యమిచ్చి, తన వ్యాఖ్యానాలను జోడించి రచన చేశాడు. అందుచేత కల్హణుని 'రాజతరంగిణి' చారిత్రక గ్రంథంగా ప్రాచీన కాలంలో ఒక ప్రత్యేక స్థానమును సంపాదించుకొన్నది.

**10.1.4 రాజతరంగిణిలోని విషయ వివరణ :** 'రాజతరంగిణి'ని కల్హణుడు క్రీ.శ. 1149లో సంస్కృత భాషలో రచించాడు. ఇందులో 8 వేల పద్యాలు గలవు. ఇవి కాశ్మీర్ రాజవంశ చరిత్రను తెలియజేస్తుంది. ఇందులో ఆది నుండి క్రీ.శ. 12వ శతాబ్ది వరకు కాశ్మీర్ చరిత్ర వర్ణించబడిరది. కల్హణుడు ఇతిహాస - పురాణ సంప్రదాయాన్ని అవలంబించినప్పటికీ, ఆ సంప్రదాయానికి భిన్నంగా కూడా

రచన సాగించాడు. తన రచనకు ఆధారంగా కల్హణుడు ప్రాచీన చారిత్రక సాంప్రదాయాన్నే గాక ప్రాంతీయ మత, లౌకిక వాఙ్మయం, శాసనాలు, ఇతర చారిత్రక అవశేషాలు కూడా ఉపయోగించాడు.

'రాజతరంగిణి' గ్రంథాన్ని మూడు ప్రధాన భాగాలుగా విభజించి పరిశీలించవచ్చు. మొదటి భాగంలో ఇతిహాస - పురాణ సంప్రదాయంపై ఆధారపడటం కనిపిస్తుంది. రెండవ భాగంలో చారిత్రక అంశాలను ధృవపరచడానికి వీలయినట్లు వివిధ ఆధారాల నుంచి సేకరించడం కనిపిస్తుంది. మూడవ భాగంలో క్రీ.శ. 8వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు జరిగిన చరిత్ర వర్ణించబడింది. ఈ మూడవ భాగమే కల్హణునికి విమర్శనాత్మక దృక్పథం గల చరిత్రకారునిగా గుర్తింపు లభింపజేసింది.

రాజతరంగిణి గ్రంథంలోని ఉపోద్ఘాత పద్యాలలో కల్హణుడు తాను రచన చేయుటకు పాటించిన పద్ధతిని ప్రస్తావించి, తన గ్రంథరచనకు ఆధారాలను వివరించుటయేగాక, ఆయా ఆధారాల ప్రామాణికతను కూడా చర్చించాడు. తనకు పూర్వము రచింపబడిన పదకొండు క్రానికల్స్‌ను పరిశీలించినట్లు, నీలమేట పురాణమును, సువ్రతుని రచనలను, క్షేమేంద్రుని కాశ్మీర్ క్రానికల్‌ను, శాసనాలను, నాణేలను, రాజ్యాధికార పత్రాలను, మౌఖిక సంప్రదాయాలను పరిశీలించినట్లు చెప్పుకొన్నాడు. ఈ ఆధారాలతోపాటుగా తనకు తెలిసిన విషయాలను కలిపి గ్రంథ రచన చేశాడు. కల్హణుడు పూర్వ కాలపు రచయితల సమాచారాన్ని సరియైనదని అంగీకరింపక, ఆ సమాచారములో నిజమెంత ఉన్నదో తెలుసుకొనుటకు విమర్శనా ప్రక్రియను ఉపయోగించాడు. అందువల్లనే సువ్రతలోని సమాచారమునందలి, క్షేమేంద్రుని రచనయందలి దోషాలు గుర్తించి, వాటిని సరిచేయుటకు ప్రయత్నించాడు. సాంప్రదాయాలను నమ్మక, తన వ్యాఖ్యానాలను ఆ సాంప్రదాయాలతోబాటుగా పేర్కొన్నాడు. లలితాదిత్య మరణ విషయంలోనున్న మూడు సంప్రదాయాలు పేర్కొని, గొప్పవారు మరణించినపుడు వారికి లేని ఘనతను ఆపాదిస్తారన్న తన వ్యాఖ్యను జోడించాడు. కాని కొన్ని సందర్భాలలో కట్టుకథలను విమర్శనాత్మకంగా పరిశీలించాక అలాగే పేర్కొన్నాడు. ఉదాహరణకు లలితాదిత్యుడు 300 సంవత్సరాలు పరిపాలించాడని, లలితాదిత్యుడు ఇంద్రుని ఉద్యానవనం నుండి భగవత్ ప్రసాదమైన పండును తీసుకువచ్చాడని, వరుణుడు సముద్రమును కదల ప్రాంతంగా చేయుటచే మేఘవాహనుని సైన్యాలు సింహళముపై దండెత్తాయని మొదలయినవి.

కల్హణుడు కర్మ సిద్ధాంతాన్ని, పూర్వజన్మ సిద్ధాంతాన్ని నమ్మాడు. ఉదాహరణకు లలితాదిత్యుడు పాలకుడుగా విజయం పొందుటకు పూర్వజన్మలో బ్రాహ్మణులకు ఇచ్చిన దానాలే కారణమన్నాడు. ఇంకా భగవంతుడే చరిత్ర గమనాన్ని నిర్దేశిస్తాడు అని కూడా పేర్కొన్నాడు. ఇతని అభిప్రాయం ప్రకారం మిహిరకులుడు నియంత అయినప్పటికి, భగవంతుని ఆశీర్వచనం కలిగినవాడగుటచే చంపబడలేదు. అయితే ఈ అతీత శక్తుల మీద నమ్మకాలు ఇతని రచనను మొత్తం ప్రభావితం చేయలేదు. ఉదాహరణకు పాలకులు బలవంతులుగా ఉండాలని, దృఢమైన నిర్ణయం కలిగి వుండాలని అంటూనే, పాలనాసంబంధ విషయాల్లో మేధావుల, జ్ఞానవంతుల సలహాలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగులపై తగినంత అధికారం కలిగి ఉండాలన్నాడు. పాలకుల పీడనను ఖండించాడు. ఈ విధంగా రాజతరంగిణిలో మెచ్చదగిన, విమర్శించదగిన అంశాలు గలవు.

**10.1.5 కల్హణుని స్థానం :** కల్హణుడు అత్యంత శోభాయమానంగా రాజతరంగిణి రచించాడు. ఇందులో మూడో భాగంలోని చారిత్రక యదార్థత, ముచ్చటగొలిపే రచనాశైలి కల్హణునికి విశిష్టతను చేకూర్చాయి. ఈ రకమైన గ్రంథం, చరిత్రకారుడు లేనందువల్లనే ప్రాచీన భారతదేశ చరిత్రలో కల్హణుడు ఒక్కడే నిజమైన చరిత్రకారునిగా పరిగణింపబడుతున్నాడు.

## 10.2 అల్‌బెరూని :

**10.2.1 పరిచయం :** ప్రాచీన కాలం నుంచి భారతదేశానికి ఎంతో మంది విదేశీ యాత్రికులు, తాత్వికులు, దౌత్యవేత్తలు, పండితులు, విద్యాన్వేషకులు వస్తూ ఉండేవారు. వారు చేసిన రచనలు భారతదేశ చరిత్ర పునర్ నిర్మాణానికి నేటికీ ఎంతగానో ఉపకరిస్తున్నాయి. భారతదేశానికి వచ్చిన ఇస్లాం సైన్యాల వెంట కొందరు పండితులు, రచయితలు కూడా వచ్చారు. భారతదేశం వారికి ఎంతో ఆశ్చర్యకరంగా కన్పించింది. ఉత్తర భారతంలో హిందూ రాజ్యాల పతనం, ముస్లింల రాక, అరబ్బులకు, పారశీకులకు మార్గం సుగమం చేసింది. మొదట వీరు దండయాత్రికులుగా వచ్చినా ఇక్కడే స్థిరపడిపోయారు. ఈ దండయాత్రల వెంట అనేక ఇతర నైపుణ్యాలున్న వారు

కూడా భారతదేశానికి వచ్చి స్థిరపడిపోయారు. అలాంటి వారిలో చరిత్ర రచయితలు, పండితులు కూడా వున్నారు. అలా భారతదేశానికి వచ్చిన తొలి ముస్లిం యాత్రికుల్లో ఆల్‌బెరూనీని పేర్కొనవచ్చు.

మహమ్మద్ ప్రవక్త ఇస్లాం మతం స్థాపించడంతో ముస్లింల చరిత్ర రచన ప్రారంభమయ్యింది. ముస్లింలు ఇస్లాం మత దృష్టిలో చరిత్ర రచనా సంప్రదాయం ప్రారంభించారు. తొలి ఖలీఫాలు తమ ఖచ్చితమైన వంశపారంపర్య హక్కును రుజువు చేసుకోవడానికి ప్రవక్తతో తమకు గల సంబంధ బాంధవ్యాలను తెలుసుకొని రికార్డు చెయ్యాలని ఉత్సాహపడ్డారు. దీనికోసం తమ ఆస్థానంలో చరిత్రకారులను ఆదరించి ప్రోత్సహించారు. ముస్లింల రచనలు మత, రాజకీయాలకే పరిమితమయ్యాయి. పూర్తిగా ఆర్థిక, సామాజిక అంశాలను విస్మరించాయి. ఇవి ప్రధానంగా మహమ్మద్ జీవిత చరిత్రను ముస్లింల సైనిక విజయాలకు పరిమితమయ్యాయి. తొలి సమగ్ర 'సార్వత్రిక' చరిత్రను అరబ్బీ భాషలో రచించిన అల్ తబారి (క్రీ. శ. 838 - 923) కాలక్రమ చారిత్రక పద్ధతిని (Annalistic Methods) అనుసరించాడు. ముస్లింలలో మార్గదర్శకుడైన చరిత్రకారుడు ఇతడే. ఇతడు ఎక్కువగా సమాచారం సేకరించి వాస్తవిక కథనాన్నే రచించాడు. తరువాత వచ్చిన అల్‌మసూది రాజకీయ సంఘటనలతో బాటు ప్రజల సాంస్కృతిక, సాంఘిక జీవనం గురించి కూడా తన రచనల్లో పేర్కొన్నాడు.

ప్రాచీన భారత చరిత్ర రచనా సంప్రదాయంతో పోల్చి చూచినట్లయితే, మధ్యయుగ భారతీయ చరిత్ర రచనా సాంప్రదాయం మెరుగైనదని చెప్పవచ్చు. మధ్యయుగంలో ఇస్లాం మతం, పరిపాలనా వ్యవస్థలు భారతీయ చరిత్ర రచనా సాంప్రదాయాన్ని ప్రభావితంగా చేశాయి. ఫలితంగా చరిత్ర రచనలో తీవ్రమైన మార్పులు చోటు చేసుకున్నాయి. గ్రీక్, రోమన్, పారశీక చారిత్రక సాంప్రదాయాల చేత పరిపుష్టం గావించబడ్డ అరబ్బులు తమకు నచ్చిన రీతిలో చరిత్ర రచన చేశారు. ఈ కాలంలో ముస్లిం చరిత్రకారులు సాగించిన చరిత్ర రచనా సంప్రదాయానికి, ప్రాచీన భారత చరిత్ర రచనా సంప్రదాయానికి మధ్య ప్రధానమైన వ్యత్యాసం గలదు. ప్రాచీన భారతంలో చరిత్ర రచనలో సూతులు, మాగధులు, బ్రాహ్మణ పండితులు, ఆస్థానకవులు, బౌద్ధ భిక్షువులు, జైన పండితులు పాలుపంచుకొని తమ తమ ఆలోచనా ధోరణులకు, విశ్వాసాలకు అనుగుణంగా చరిత్ర రచన చేశారు. అయితే మధ్యయుగంలో చరిత్రను సృష్టించటంలో పాలుపంచుకొన్నవారు పాలకులు, వారి దగ్గరి బంధువులు, ప్రభుత్వ అధికారులు. వీరుగాక విదేశీయాత్రికులు, రాయబారులు కూడా చరిత్ర రచన చేశారు. కనుక చారిత్రక సమాచారాన్ని పోల్చిచూసి ప్రామాణికమైన సమాచారాన్ని సంపాదించుటకు అవకాశం కలిగింది.

మధ్యయుగంలో చరిత్ర రచన చాలా వరకు హేతువాద ధోరణిలో, లౌకిక దృక్పథంలో ప్రామాణికంగా రూపొందించుటకు ప్రయత్నం జరిగింది. ఈ యుగంలోని చరిత్రకారులు ప్రతి విషయం సమగ్రంగా పరిశీలించి, ప్రతిచిన్న సంఘటనను విడవకుండా ప్రస్తావించినప్పటికి, ప్రశ్నలు వేసుకొని సమాధానం రాబట్టే పద్ధతి, విమర్శ, ఆధారాలను శోధించడం, విశ్లేషించి వర్గీకరణ చేయడం, విమర్శనాత్మక ధోరణితో వివిధ అంశాలను విశ్లేషించి చరిత్ర రచనను వ్రాయడం అనేది వీరికి తెలియదు. ఈ చరిత్రకారులు కారణాలు, పరిస్థితులు, పద్ధతి వివరించకుండా సంఘటనలను, యుద్ధాలను వరుసక్రమంలో పేర్కొన్నారు. అంతేగాక ఆనాటి చరిత్రకారుల దృష్టి ఉన్నత వర్గాల చుట్టూ తిరిగింది కాని సామాన్య మానవుల జీవిత చిత్రణం నాటి చరిత్రలో చోటుచేసుకోలేదు. నాటి చరిత్రకారులు అన్ని అంశాలను క్రోడీకరించి ప్రామాణికమైన రీతిలో చరిత్ర రచన చేసినా, కార్యాకారణ సంబంధమైన అన్వేషణతో కూడిన కొత్త చారిత్రక సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టుటకు కృషి చేయలేదు. అందువలన మధ్యయుగం నాటి చరిత్రకారులైన అల్‌బెరూని, బరానీ, అబుల్ ఫజల్ మొదలగు వారు కథకులేగాని పరిశోధకులు కారు.

**10.2.2 అల్‌బెరూని భారత రాక (క్రీ.శ. 973 - 1048) :** మధ్య ఆసియాలోని ఖివాలో క్రీ.శ. 973లో జన్మించిన అల్‌బెరూని ప్రముఖ శాస్త్రవేత్త, పండితుడు. ఇతనికి అబూరైహన్ అనే మరోపేరు కూడా కలదు. సాహిత్య, శాస్త్ర, విజ్ఞానములందు గొప్ప పాండిత్యము సంపాదించిన అల్‌బెరూని కొంత కాలంపాటు క్వారిజం పాలకులకు సలహాదారుడిగా వ్యవహరించాడు. గజిని మహమ్మద్ క్వారిజంపై దండెత్తినపుడు అల్‌బెరూనీ బంధీగా చిక్కాడు. గజినీ మహమద్ భారతదేశం పై దండెత్తినపుడు అల్‌బెరూని అతనితో బాటు భారతదేశానికి వచ్చి పదకొండో శతాబ్దం మొదట్లో ఒక దశాబ్దంపాటు భారతదేశంలో నివసించాడు. ఈ సమయంలో భారతదేశ

శాస్త్ర విజ్ఞాన, సాహిత్య ప్రక్రియలను, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకొనుటకు నిజమైన ప్రయత్నం ఆరంభించాడు. అందుకుగాను సంస్కృత భాష అధ్యయనం చేశాడు. బ్రాహ్మణ తాత్వికులతో విస్తృతంగా చర్చలు జరిపాడు. బ్రాహ్మణుల తాత్విక వివేచన, వేదాంత చర్చల్లో వారు ప్రదర్శించే కౌశలం చూసి అల్‌బెరూని ఎంతో ముచ్చట పడినాడు. అయితే బ్రాహ్మణ పండితులు మొండివాదనలు చేయడం, ఇతరుల ఆలోచనలకు విలువ ఇవ్వక పోవడం అల్‌బెరూనికి నచ్చలేదు. సంస్కృత విద్వాంసుల సహకారంతో అనేక ఖగోళ, గణిత తదితర శాస్త్రగ్రంథాలను అరబ్బీ భాషలోనికి అనువదించాడు. గజనీమహ్మద్ దండయాత్రల సమయంలో ఈర్ష్యాసూయలు లేకుండా, రాగ ద్వేషరహితంగా అల్‌బెరూని 'కితాబ్ - ఉల్ - హింద్' అనే పుస్తకాన్ని క్రీ.శ. 1030లో రచించాడు.

**10.2.3 'కితాబ్ - ఉల్ - హింద్' లోని విషయవివరణ :** 'కితాబ్ - ఉల్ - హింద్' లో అల్‌బెరూని భారతదేశ మత, సాహిత్య, తాత్విక, శాస్త్రీయ విజ్ఞాన సాంప్రదాయము, రాజకీయ పరిస్థితి గురించి విపులంగా చర్చించాడు. ఈ గ్రంథంలో ఎనభై అధ్యాయాలున్నాయి. భారత సమాజాన్ని, సమకాలీన పరిస్థితులను అల్‌బెరూనీ నిష్పక్షపాత ధోరణితో అధ్యయనం చేయుటకు ప్రయత్నించాడు. ప్రతివిషయాన్ని తన గ్రంథంలో ప్రస్తావించుటకు ఇతడు కృషి చేశాడు. విదేశీయుల పట్ల భారతీయుల దృక్పథం, వర్ణ వ్యవస్థ, వివాహ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, వితంతువుల స్థితి, శిక్షలు, ద్రవ్యం, తూనికలు, కొలతలు, నదులు, రహదారులు, సాహిత్యం, తత్వ శాస్త్రం మొదలగు ఎన్నో వివరాలను అల్‌బెరూని తెలియజేశాడు.

**హిందువుల భావాలు :**

హిందువుల్లో చాలా మంది తమ దేశం లాంటి దేశం మరొకటి లేదని, తమ మతం లాంటి మతం మరొకటి లేదని, తమ శాస్త్రాల వంటి శాస్త్రాలు మరో చోట లేవని భావిస్తున్నట్లు అల్‌బెరూనీ తన గ్రంథంలో పేర్కొన్నాడు. విదేశీయులతోనూ, వారి సంస్కృతులతోనూ సంబంధం ఏర్పరచుకొని తమ ఆలోచనలను భారతీయులు మార్చుకుంటారని భావించాడు. బ్రాహ్మణులు తమ గొప్పతనం గురించి అహంకారంతో మూర్ఖంగా, మొండిగా వ్యవహరించేవారని, బ్రాహ్మణుల్లో ఆత్మవిమర్శ ఉండేది కాదని వివరించాడు. బ్రాహ్మణులు తమకు తెలిసిన విషయాలను ఇతరులకు తెలిపేవారు కాదని, ఇతర కులాల వారికి ఏ విధమైన విజ్ఞానం అందుబాటులో లేకుండా చేశారని, తమ దేశస్థులకే విజ్ఞానం పంచని బ్రాహ్మణులు విదేశీయులతో ఎట్టి పరిస్థితుల్లోని సంబంధం పెట్టుకునేవారు కాదని పేర్కొన్నాడు. ప్రపంచంలో తమకు తెలిసినన్ని శాస్త్రాలు మరెవరికీ తెలియవనే అహంకారం కూడా బ్రాహ్మణుల్లో ఉండేది. భారతీయ శాస్త్రాలన్నా, పాండిత్యమన్నా అపారంగా అభిమానించిన అల్‌బెరూనీ, మేధావి వర్గం వైఖరిని మాత్రం తీవ్రంగా నిరసించాడు.

**శాస్త్రాభివృద్ధి :**

తాను స్థానిక పండితుల వద్ద హిందూ శాస్త్రాలను, పాండిత్యాన్ని కొంత అధ్యయనం చేసిన తరువాత భారత పండితులకు ఖగోళ శాస్త్రం ఏ యే సిద్ధాంతాల మీద ఆధారపడి ఉందో వివరించానని, అలాగే గణితం ఆధార సిద్ధాంతాలను వివరించానని, అప్పటి నుంచి తన వద్ద కొత్త విషయాలు తెలుసుకోవడానికి పలువురు వచ్చారని వ్రాసాడు. తనను ఏదో మాంత్రికుడుగా ఆ పండితులు భావించేవారని, సముద్రం అవతలి నుంచి వచ్చిన వ్యక్తిగా తనను ప్రస్తావించే వారని వివరించాడు.

**భారత సమాజం :**

భారత సమాజం గురించి వ్రాస్తూ వివిధ కులాల గురించి వాటి ప్రత్యేకతల గురించి అల్‌బెరూనీ తన రచనల్లో పేర్కొన్నాడు. బాల్య వివాహాలు, సతీసహగమనం, విధవా పునర్వివాహ నిషేధం వంటివి వాడుకలో ఉన్నట్లు అల్‌బెరూనీ రచనల వల్ల తెలుస్తుంది. ఒక్కసారి అపవిత్రమైన దాన్ని శుద్ధి చేసి మళ్ళీ పవిత్రమైనదిగా హిందువులు భావించకపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తపరిచాడు. గ్రీకులు, హూణులు వంటి విదేశీయులకు సైతం హిందూ సమాజంలోకి ఆహ్వానించిన పూర్వకాలానికి ఇది భిన్నమైన ప్రవర్తన. విగ్రహారాధన విస్తృతంగా జరిగేదని, దేశమంతటా దేవాలయాలు విరివిగా నెలకొల్పారని, అయితే ఈ విగ్రహారాధన సామాన్య ప్రజలకు మాత్రమే పరిమితమని, విద్యావంతులు మాత్రం భగవంతుడిని ఆది, మధ్య, అంతాలు లేని వాడిగా భావించేవారని పేర్కొన్నాడు. హిందువులు

తమ మత వివాదాలను వాదోపవాదాల ద్వారానే పరిష్కరించుకొనేవారని, ఒకే రకమైన ఆచార వ్యవహారాలను దేశమంతటా పాటించేవారని, బ్రాహ్మణ సంస్కృతి ప్రాబల్యం దేశమంతా స్పష్టంగా ఉందని రాశాడు.

**ఆర్థిక వ్యవస్థ :**

రైతులు తమ పంటలో ఆరో వంతును పన్నుగా రాజుకు చెల్లించేవారని, చేతి పనివారు, వృత్తిపనివారు, వర్తక వర్గాలు తమ ఆదాయం పై రాజుకు పన్ను చెల్లించేవారని ఆల్‌బెరూనీ పేర్కొన్నాడు. ఇతని రచనల ప్రకారం బ్రాహ్మణులకు తప్ప మరెవ్వరికి పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు లేదు. గజనీ మహమ్మద్ దాడి వల్ల భారత దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టాన్ని ఇతడు పేర్కొన్నాడు. గజనీ మహ్మద్ తన దాడి ద్వారా దేశ సంపదను నాశనం చేశాడు. ఇతని దాడుల వల్ల హిందువులు చెల్లాచెదరైపోయారు. మిగిలిన హిందువులు ముస్లింల పట్ల విపరీతమైన ద్వేషం పెంచుకొన్నారు. ముస్లిం ప్రభావం పడని కాశ్మీర్, బెనారస్ వంటి ఇతర ప్రాంతాలకు హిందూ శాస్త్రాలు తరలిపోయాయని ఆల్‌బెరూనీ పేర్కొన్నాడు.

**10.2.4 ఆల్‌బెరూనీ రచనల ప్రాముఖ్యం :** గజనీమహ్మద్‌తోబాటు భారతదేశానికి వచ్చిన ఆల్‌బెరూనీ ఈర్ష్యాసూయలు లేకుండా, రాగద్వేషరహితంగా 'కితాబ్ - ఉల్ - హింద్' అనే గ్రంథాన్ని రాయడాన్ని బట్టి అతని వ్యక్తిత్వ వైశిష్ట్యాన్ని గుర్తించవచ్చు. ఇతని రచనలను బట్టి భారతదేశం ఆర్థిక పతనావస్థకు చేరుకుందని స్పష్టమవుతుంది. కులపరమైన, ఆర్థికపరమైన వ్యత్యాసాలు ఎక్కువ కావడంతో సమాజంలో ఉద్రిక్తత నెలకొంది. పండితుల్లో సంకుచితత్వం, పాలకుల మధ్య అనైక్యత నెలకొంది. ఈ అంశాలన్నీ క్రీ.శ. 11వ శతాబ్దం ప్రారంభంలో భారత దేశ పరిస్థితిని కుంగదీశాయి అని ఆల్‌బెరూని రచనలు పేర్కొంటున్నాయి.

## 10.3 నమూనా ప్రశ్నలు :

(i) ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. రాజతరంగిణి ప్రాధాన్యతను తెలియజేయండి.
2. ఆల్‌బెరూనీ ఏ విధంగా చరిత్రకారుడో విశ్లేషించండి.

(ii) ఈ క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. కల్హణుని విశిష్టతను తెలపండి.
2. ఆల్‌బెరూనీ రచనల ప్రాముఖ్యతని వివరించండి.

## 10.4 ఉపయుక్త గ్రంథాలు :


1. Peter Hardy : Historians of Medival India; (London, 1956)
2. Hasan Mohibbul (Ed) : Historians of Medival India; (Meerut, 1968)
3. Luniya B.N. : Some Historians of Medival India, (Agra, 1969)
4. Chidambara Kulakami : Studies in Indian History; (Bombay, 1974)
5. Mehata J.L. : Advanced Study in the History of Medival India, (New Delhi, 1980).


పాఠ్య రచయిత
- డాక్టర్ వి.కె. మోహన్.

పాఠం - 11

# గ్రీకో - రోమను చరిత్ర రచనా సంప్రదాయం

## 11.0 లక్ష్యం :

ఈ పాఠం చదవడం వల్ల మీరు

* ప్రాచీన కాలంలో గ్రీకుల ప్రామాణిక చరిత్ర రచనా సంప్రదాయం అర్థం చేసుకోగలగాలి.
* చరిత్ర రచనాభివృద్ధిలో హెరొడోటస్, థూసిడైడెస్‌ల సేవలను వివరించగలగాలి.
* గ్రీకుల ననుకరించిన రోమన్లు చరిత్ర రచనాభివృద్ధికి ఏ విధంగా తోడ్పడ్డారో చెప్పగలగాలి.

## విషయసూచిక


11.1 పరిచయం

11.2 ప్రాచీన కాలంలో భారతీయులకు చారిత్రక దృష్టి లేదు

11.2.1 హెరొడోటస్

11.2.2 థూసిడైడెస్

11.2.3 ఇతర గ్రీకు చరిత్రకారులు

11.3 రోమన్ల చరిత్ర రచనా సంప్రదాయం

11.3.1 లివీ

11.3.2 టాసిటస్

11.4 ముగింపు

11.5 సంక్షిప్తంగా

11.6 నమూనా ప్రశ్నలు

11.7 ఉపయుక్త గ్రంథాలు


## 11.1 పరిచయం :

పరిశోధకుడు చరిత్ర అంటే ఏమిటో, చరిత్రను ఎలా రాయాలో తెలుసుకోవడం మాత్రమే కాకుండా చరిత్ర ఎలా రాయబడిందో కూడా తెలుసుకోవడం అవసరం. చరిత్ర రచనకు సంబంధించిన సిద్ధాంత పరమైన అధ్యయనం కంటే అతనికి ఆ చరిత్ర గురించిన ఈ విధమైన అధ్యయనమే ఎక్కువ ప్రయోజనకరమైనది'. యువ చరిత్ర పరిశోధకులకు గత చరిత్ర రచనలు అధ్యయనం చేయడం శిక్షణరీత్యా అవసరం కూడా సాహిత్యం తరువాత స్థానాన్ని ఆక్రమించిన (గుణంలో, పరిమాణంలో) చారిత్రక వాఙ్మయం సామాజిక

పరిస్థితుల ప్రభావానికి లోనయిందే. చరిత్ర రచనా జ్ఞానం ఆయా యుగాల, తరాల, ప్రాంతాల ప్రజల అభిరుచి, ఆకాంక్షలపై ఆధారపడి వుంది. హోమరిక్ కాలం (C. 800 - 500 B.C.)లో చరిత్రకారుల రచనలో ఇతిహాస కావ్య సంప్రదాయ ప్రభావం కన్పిస్తుంది. ప్రామాణిక చరిత్ర రచనా సంప్రదాయం మాత్రం గ్రీకులతోనే ప్రారంభమయింది.

## 11.2 గ్రీకుల చరిత్ర రచనా సంప్రదాయం :

గ్రీస్‌లో చారిత్రక భావం, చరిత్ర రచన అభివృద్ధి చెందడానికి ప్రధానంగా భౌగోళిక పరిస్థితులు దోహదం చేశాయి. ఇటు తూర్పు దేశాలకు, అటు పశ్చిమ దేశాలకు మధ్యలో వున్న గ్రీస్ ఆయా ప్రజల నాగరికతల కూడలి అయింది. మూడు ఖండాలను తాకిన మెడిటరేనియను, దాని పరిసర ప్రాంతాల్లో వచ్చిన పరిణామాలను గ్రీకులు తమ ప్రాంతం నుండే చూడగలిగారు. భూకంపాలు, సముద్రం వల్ల నేల కోసుకుపోవడం వంటి కారణాల వల్ల ప్రజాజీవనంలో తరచూ వచ్చే మార్పులు, వీటి కారణంగా నగర రాజ్యాల రాజకీయ వ్యవస్థల్లో వస్తున్న మార్పుల కారణంగా మార్పు లేకుంటే ఏదీ ఉండదనే విషయాన్ని వాళ్ళు గమనించారు. భవిష్యత్తు మార్గదర్శకానికి యీ మార్పుల్ని అధ్యయనం చేయడం అవసరమని భావించారు. దీనికి తోడు చరిత్ర రచనకు అవసరమైన విశ్లేషణ, విమర్శనలలో అనుభవం, శిక్షణ పొందారు. సమకాలికులకు భిన్నంగా లౌకిక విషయాల్లో ఎక్కువ ఆసక్తి చూపించారు. చరిత్రకారునికి ఉండవలసిన 'తెలియనిది తెలుసుకోవాలనే' కుతూహలం వాళ్ళల్లో ఎక్కువ. ఈ పరిస్థితుల వల్ల గ్రీస్‌లో క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి 'లోగో గ్రాఫర్స్' అనే వచన రచయితలు ఆవిర్భవించారు. గతాన్ని క్రమబద్ధంగా వివరించడానికి వీళ్ళే మొదట ప్రయత్నించారు. నమ్మతగని కట్టుకథలను వదలివేయటం, సమాచారాన్ని ప్రత్యక్షంగా సేకరించటం, సనాతన దృక్పథాల్ని, మత విశ్వాసాల్ని త్రోసి పుచ్చటం ద్వారా చరిత్ర అంటే పరిశోధన అనే భావాన్ని పెంపొందించారు. చరిత్ర లక్ష్యం సత్యాన్వేషణ అని సాంప్రదాయికమైన కట్టుకథల్ని నిశితంగా ప్రశ్నించాలని రెండు ప్రధాన సూత్రాలను మొదటి ప్రసిద్ధ గ్రీకు వచన రచయిత హెకటెయస్ (Hecataeus) క్రీ. పూ. 6వ శతాబ్దం చరిత్రలో ప్రవేశపెట్టాడు. ఈ పద్ధతినే అతడు తన గ్రంథం 'Genealogies'లో అనుసరించాడు. ఈ పరిశోధన పద్ధతినే హెరొడోటస్ అవలంబించాడు.

**11.2.1 హెరొడోటస్ :** హెకటెయస్ ప్రవేశపెట్టిన విమర్శనాత్మక వైఖరి క్రీ.పూ. 5వ శతాబ్దిలో హెరొడోటస్, థూసిడైడెస్‌ల రచనల్లో ఉన్నత శిఖరాలను అందుకున్నది. ఒక విధంగా గ్రీకు వచన రచయితలకు, చరిత్రకారులకు మధ్య వారధిగా నిలిచిన వాడు 'చరిత్ర పిత'గా ప్రసిద్ధుడైన హెరొడోటస్. హాలికార్నసస్‌లో బహుశా క్రీ.పూ. 484లో జన్మించిన అతడు తన గ్రంథంలో పేర్కొన్నదాన్ని బట్టి క్రీ.పూ. 430 నాటికి సజీవుడే. ఆ తరువాత ఎప్పుడు, ఎక్కడ చనిపోయాడో తెలియడం లేదు. అతని గ్రంథం మాత్రం క్రీ.పూ. 425కి ముందే ప్రజలకు సుపరిచితమని స్పష్టమవుతుంది. గ్రీకు కావ్యాల్లో హోమర్ రచనలకు ప్రభావితుడైన అతడు హెక్టోమస్ రచనల్ని చదివి వచన రచనలో ప్రావీణ్యం సంపాదించాడు. చరిత్రకారునికుండవలసిన కుతూహలంతో చుట్టూ వున్న ప్రపంచం గురించి తెలుసుకోవాలని చాలా ప్రాంతాలు పర్యటించాడు. అయోనియాలో కొంతకాలం గడిపాడు. ఏథెన్స్‌లో పెంక్లిస్ ఆస్థానంలో నాలుగు సంవత్సరాలు వున్నాడు. థ్రేస్, ఈజిప్ట్, బాబిలోనియా ప్రాంతాలు పర్యటించి రాజకీయ పరిస్థితుల్ని, వ్యవస్థలనూ అధ్యయనం చేశాడు. హెకటెయస్‌లా తన గ్రంథ రచనకు సమాచార సేకరణకు మౌఖిక సంప్రదాయం, విస్తృత పర్యటనల్లో నిర్మాణాల గురించి చేసిన ప్రత్యక్ష పరిశీలన, లిఖిత పూర్వక ఆధారాలపై ఆధారపడ్డాడు. చరిత్ర అంటే అన్వేషణ లేదా పరిశోధన అనే అర్థానికి వాస్తవరూపాన్ని యిచ్చాడు. చరిత్రకూ, మానవ శాస్త్రానికి (Anthropology) అపారమైన సేవలందించి రెండింటికి పిత'గా ప్రసిద్ధుడయ్యాడు.

హెరొడోటస్ రాసిన 'History' అనే గ్రంథము మొట్టమొదటి క్రమబద్ధమైన సర్వతోముఖ చారిత్రక రచన. పారశీక సామ్రాజ్యం పుట్టుక గురించి, పారశీకులకు గ్రీకులతో క్రీ.పూ. 499 - 479 మధ్య జరిగిన పోరాటాల గురించి, ముఖ్యంగా జెర్క్సెస్ (Xerxes) సేనలు గ్రీకుల చేతుల్లో చిత్తుగా ఓడిపోవటం గురించి, యీ గ్రంథం విశదీకరిస్తుంది. గ్రంథం ప్రధానంగా పారశీక యుద్ధాల గురించే అయినా క్రీ.పూ. 6, 5 శతాబ్దాల్లోని మెడిటరేనియను, ఆసియా ప్రపంచ ప్రజల గురించి ఆసక్తికరమైన వివరాలనిచ్చింది. అంటే హెరొడోటస్ తానెంచుకున్న విషయానికే పరిమితం కాకుండా సమకాలీన చరిత్రను సమగ్రంగా చిత్రించ ప్రయత్నించాడని

స్పష్టమవుతుంది. కథాగమనంలో ఆతనికున్న ఆసక్తి, అభిరుచి 'History'ని కథారూపంలో అద్భుతంగా, ఆకర్షవంతంగా, వర్ణనాత్మకంగా తీర్చిదిద్దడానికి తోడ్పడినాయి. కథకునిగా బహుశ అతణ్ణి మించిన వాడు యిక ముందూ వుండడనే చెప్పాలి. తన గ్రంథరచనకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్న అతడు ఆ ప్రకారమే రచన కొనసాగించాడు. చరిత్రకారునిగా తన కర్తవ్యం గ్రీకులు, గ్రీకేతరులైన అనాగరికులు చేసిన పనుల గురించి భావితరాల వారికి తెలుపడం మరీ ముఖ్యంగా వాళ్ళు పరస్పరం కలహించుకోడానికి గల కారణాలను చూపించటం' అని చెప్పుకున్నాడు. అంటే ఏం జరిగిందో తెలుపడమే కాకుండా ఎందుకు జరిగిందో కార్యకరణ సంబంధంలో విశ్లేషించటం కూడా చరిత్రకారుని కర్తవ్యమని అతడు గుర్తించాడని అర్థమవుతుంది. అంతేగాక మొదటిసారిగా ఒక దేశ చరిత్రను మరో దేశానికి పరిచయం చేసే సంప్రదాయాన్ని ప్రారంభించాడు. వివేచనాత్మక వైఖరితో చరిత్రను పుక్కిట పురాణం స్థాయి నుండి శాస్త్ర స్థాయికి పెంచడానికి ప్రయత్నించాడు. షాట్‌వెల్ చెప్పినట్లు 'నిశిత పరిశీలనా కౌశలానికి గొప్ప కళాకారుని సమగ్ర కౌశలాన్ని జత చేశాడు'. స్వదేశాభిమానం కాని, పక్షపాతం కాని లేకుండా పారశీకుల శౌర్యాన్ని అభినందించగలగడం విశేషం. చరిత్రను మార్గదర్శకంగా, నీతి ప్రబోధకంగా తీర్చిదిద్దాడు. అన్నింటిని మించి హెరొడోటస్ రచనలో చివరి వరకు కన్పించే ఏకరీతి, అవిచ్ఛిన్నతలు, కథనాన్ని ఆసక్తికరంగా తీర్చిదిద్దటానికి ఉపయోగించిన శక్తివంతమైన శైలి ముఖ్యమైనవి. ఈ లక్షణాలను పురస్కరించుకునే అతని రచన మొదటి క్రమబద్ధమైన, సర్వతో ముఖమైన చరిత్ర గ్రంథంగా పరిగణింపబడటం, అతడు 'చరిత్రపిత'గా ప్రసిద్ధుడు కావటం జరిగినది.

అయితే చరిత్రకారునిగా హెరొడోటస్‌లో పరహితుడని చెప్పలేం. తప్పనిసరిగా ఇన్ని బలహీనతలు అతనిలోనూ కన్పిస్తాయి. పర్షియా, ఈజిప్ట్‌లలో పర్యటించినా ఆయా భాషల పరిజ్ఞానం లేకపోవడం వల్ల ఆ ప్రాంతాల ప్రజల గురించి సరైన అవగాహన ఏర్పడుతుందని చెప్పలేం. దీనికి తోడు విన్నది నమ్మే మనస్తత్వం ఉండటం అతని బలహీనత. ఆధారాలను పరిశీలించి సత్యాన్ని నిర్ధారించటంలో అనుసరించిన వైఖరిని అతడు సైనిక సంబంధమైన ఘట్టాలను వివరించడంలో చూపెంచలేదు. పైగా అతీత ప్రకృతి శక్తుల్లో (super natural powers) నమ్మకం మరో లోపం. భాషా శైలికి అతడిచ్చిన ప్రాధాన్యం సమాచార ప్రామాణికతా నిర్ధారణకు కొంత ఆటంకమయింది. అయితే ఈ లోపాలు ఆనాడు సర్వసాధారణం. కాబట్టి దీనికి పెద్దగా అతణ్ణి తప్పు పట్టాల్సిన పనిలేదు. వర్తమానం దృష్ట్యా కాకుండా క్రీ.పూ. 6, 5 శతాబ్దాల ప్రమాణాల రీత్యా అతణ్ణి, అతని గ్రంథాన్ని అంచనా వేయాలి. బుద్ధి సూక్ష్మతతో కూడిన ఉబలాటం 'అనుకున్నది సాధించాలనే చిత్తశుద్ధి' ఎంచుకున్న సమస్యపై సరైన అవగాహన - యీ ఉత్కృష్ట గుణాలు అతణ్ణి ప్రపచంతోనే మొదటి చరిత్రకారునిగా, ప్రముఖుడిగా కూడా నిలబెడ్తున్నాయి.

**11.2.2 థూసిడైడెస్ (క్రీ.పూ. 460 - 400) :** గ్రీకుల చరిత్ర రచనను సుసంపన్నం చేసిన మరో ప్రముఖ చరిత్రకారుడు థూసిడైడెస్. ఈతడి జీవిత విశేషాలు మనకు తెలిసినవేవో యితడి గ్రంథం నుండే లభించాయి. ఏథెన్స్‌కు చెందిన ఉన్నత కుటుంబంలో జన్మించిన యితడు సాహిత్యం, కళలను అధ్యయనం చేశాడు. ఏథెన్స్ సైన్యంలో సేనానిగా పనిచేశాడు. పెలపొనేషియను యుద్ధం జరుగుతున్నప్పుడు థ్రేస్ తీర ప్రాంత రక్షణకు నావికాదళాధిపతిగా కూడా వున్నాడు. ఆ ప్రాంతంలో వున్న సొంత బంగారు గనుల్ని కాపాడుకొనే ఆదుర్దాలో స్పార్టను సైన్యాలు ఆంఫిపోలిస్‌ని పట్టుకోవడాన్ని నిరోధించలేకపోయాడని 20 సంవత్సరాలు దేశ బహిష్కారానికి కూడా గురయ్యాడు. ఈ కాలంలోనే విస్తృతంగా యాత్రలు చేసి యుద్ధ గమనాన్ని నిశితంగా అధ్యయనం చేశాడు. యుద్ధానంతర శాంతియుత వాతావరణంలో ఏథెన్స్‌కు తిరిగి వచ్చాడు.

థూసిడైడెస్ రచన 'History of Pelaponesian War' అసంపూర్ణ గ్రంథం. గ్రీస్‌పై ఆధిపత్యం కోసం రెండు నగర రాజ్యాలైన ఏథెన్స్ స్పార్టాల మధ్య 27 సంవత్సరాలు కొనసాగిన యుద్ధం గొప్పది, గుర్తుంచుకోవలసింది అనే నమ్మకంతో తన రచనకు యీ విషయాన్ని ఎన్నుకున్న యితడు యుద్ధం ఆరంభం అయింది క్రీ.పూ. 431 మొదలుకొని రోజువారీ యుద్ధ వివరాల్ని గ్రంథస్థం చేయుటం ప్రారంభించాడు. ఇతని అంచనా సరైనదనే విషయాన్ని ఆ తరువాత జరిగిన సంఘటనలు నిరూపించాయి. అయితే క్రీ.పూ. 431లో ఆరంభమైన పోరాటంతో రచన ప్రారంభమై క్రీ.పూ. 411తో మధ్యలో ఆగిపోయింది. యుద్ధం మాత్రం మరో

ఏడు సంవత్సరాలు కొనసాగింది. ఏథెన్స్ ఓటమితో పెరిక్లిస్ యుగ వైభవం అంతరించటంతో యుద్ధం ముగిసింది. సమకాలీన సంఘటనలనే చరిత్ర చేపట్టాలనే దృక్పథంతో తానే పాత్ర వహించిన పెలోపొనీషియను యుద్ధాన్ని థూసిడైడెస్ తన రచన విషయం (theeme)గా ఎంచుకోవడంతో తానే తన కథనానికి ప్రత్యక్ష సాక్షి అయ్యాడు. చరిత్రలో సమకాలిక సంఘటనలకే ప్రాధాన్యత నివ్వడంతోబాటు సంవత్సర క్రమంలోనే వాటిని చర్చించాలని, వాటికి మానవ సంబంధమైన కారణాలనే విశ్లేషించాలని, అప్పుడే జరగటానికి అవకాశం వున్న సాదృశ సంఘటనలపై ఆకారణాలు వెలుగును ప్రసరిస్తాయని యితడు నమ్మాడు.

థూసిడైడెస్ తన యదార్థాలను నిర్ధారించుకోడానికి విపరీతంగా శ్రమించాడు. పైగానూటికి నూరు శాతం నిష్పాక్షికంగా యుద్ధం తీరుతెన్నుల్ని వర్ణించాడు. స్వస్థలం ఏథెన్స్ పట్ల అభిమానం వున్నా దాని తప్పుల్ని, బలహీనతలన్ని నిర్ద్వంద్వంగా ఖండించాడు. హెరొడోటస్‌కి భిన్నంగా కావ్యశైలి, అతీత ప్రకృతి వాదాల నుండి చరిత్రను విముక్తం చేశాడు. ఖచ్చితత్వానికై శ్రమించటంలో అగ్రగామిగా నిలిచి ఆధునిక యుగంలో రాంకెకి మార్గదర్శి అయ్యాడు. పరిధిలో విస్తృతమైన గ్రీస్ - పర్షియా యుద్ధాన్ని హెరొడోటస్ తన రచనా విషయంగా తీసుకుంటే థూసిడైడెస్ ఏథెన్స్ - స్పార్టాల మధ్య జరిగిన పెలపొనీషియన్ యుద్ధానికే పరిమితమయ్యాడు. ఆయా సంఘటనల్లో సందర్భోచితంగా, పాత్రధారుల వ్యక్తిత్వాలను అనగుణంగా ప్రసంగాలను జొప్పించటం థూసిడైడెస్ రచనలో మరో విశేషం. దీనికి చక్కని ఉదాహరణగా యుద్ధం ప్రారంభమైన మొదటి సంవత్సరంలో చనిపోయిన ఏథెన్స్ సైనికుల అంత్యక్రియల సమయంలో పెరిక్లిస్ యిచ్చిన అద్భుతమైన ఉపన్యాసం. ఈ విశేషాన్ని పరిగణించే కాలిన్‌వుడ్ యితణ్ణి మనోవైజ్ఞానిక చరిత్రకారుడని వర్ణించాడు. హెరొడోటస్‌కి, యితనికి మరో తేడా వుంది. హెరొడోటస్ పరిశోధన ఏం జరిగిందో తెలుసుకోవడానికే పరిమితమైతే యితడు ఎలా జరిగిందో, ఎందుకు జరిగిందో తెలుసుకోవడంలో శ్రద్ధ వహించాడు. హేతుబద్ధంగా క్రమబద్ధమైన శాశ్వతరీతిలో పరస్పరం కార్యకారణ సంబంధం రీత్యా అనుసంధించబడిన యదార్థ సంఘటనల అధ్యయనమే చరిత్ర అనే ప్రాథమిక సూత్రాన్ని థూసిడెడిస్‌యే మనకు బోధించాడు. యదార్థాలను సమన్వయం చేసి సాధారణ సూత్రాలను రూపొందించి చరిత్రను నీతిబోధకం చేశాడు. ఈ కారణంగా యితణ్ణి చరిత్రకారునిగా కంటే తత్త్వవేత్తగా భావించాలేమో!

చరిత్రకారునిగా థూసిడైడెస్ లోపరహితుడేం కాదు. యదార్థాల ప్రామాణికతతో చరిత్ర రచనకు పూనుకున్నా ఆ యదార్థాలను సరైన చారిత్రక అవలోకనంలో వీక్షించలేదని, చారిత్రక పరిస్థితుల్లో భౌగోళిక విషయాల ప్రాధాన్యతను మరచాడని, తన రచనా విషయాన్ని పరిమితం చేయడంతో చరిత్రలో సాంస్కృతిక, సాంఘిక, ఆర్థిక శక్తుల ప్రాముఖ్యాన్ని గుర్తించలేకపోయాడని, బర్నెస్ యితణ్ణి విమర్శించాడు. ఇతని రచనలో మరీ ముఖ్యంగా గమనించే లోపం జరిగిన సంఘటనలన్నింటిని నిర్దిష్టమైన తేదీల ప్రకారం వివరించకపోవడం ఈ విషయంలో యితడనుసరించిన రుతువుల్ని బట్టి వేసవికాలం, శీతాకాలం పద్ధతి - సంఘటనల్ని గ్రంథస్థం చేసిన పద్ధతి పాఠకుల్లో అయోమయాన్నే సృష్టించింది. రచనా శైలి కూడా క్లిష్టంగా అర్థం చేసుకోడానికి కష్టంగా ఉంది. ఈ లోపాలు ఎన్ని వున్నా యదార్థాల ప్రామాణికత, నిష్పాక్షికతకు, కార్యకారణ సంబంధంలో సంఘటనల వర్ణనకు, సాధారణీకరణాలకు థూసిడైడెస్ యిచ్చిన ప్రాధాన్యత దృష్ట్యా ఉన్నత ప్రమాణాలతో చరిత్ర రచనను తీర్చి దిద్దిన ఘనత యితనిదే.

**11.2.3 ఇతర గ్రీకు చరిత్రకారులు :** హెరొడోటస్, థూసిడైడెస్‌లే కాక యితర ప్రాచీన గ్రీకు చరిత్రకారుల్లో క్సెనోఫన్, పలిబియస్‌లు ముఖ్యులు. హోమర్, హెసియడ్ కవుల కట్టుకథల్ని మొదట ఖండించినవాడు, క్సెనోఫన్ (క్రీ.పూ. 430 - 354). ఇతని రచనల్లో 'Anabasis' ముఖ్యమైనది. ఇందులో చెప్పిన సోక్రటీస్‌పై జ్ఞాపకాలు ఆసక్తిని రేకెత్తించే అమూల్య విశేషాలు. ఇతడే థూసిడైడెస్ పెలొపొనీషి యుద్ధ చరిత్ర గ్రంథాన్ని 'Hellenica' పేరుతో కొనసాగించాడు. క్రీ.పూ. 2వ శతాబ్దపు పలీబియస్ యుద్ధ ఖైదీగా రోమ్‌కు కొనిపోబడినప్పుడు సిపియోస్ ఆదరణలో గ్రీకు భాషలో రోమను చరిత్ర (క్రీ.పూ. 164 - 146 మధ్య కాలానికి సంబంధించి)ను రాసాడు. చరిత్ర ఆధారాల ప్రామాణికతకు అధిక ప్రాముఖ్యతను యిచ్చాడు. ఇక క్రీ.పూ. మొదటి శతాబ్ది గ్రీకు చరిత్రకారుల్లో స్ట్రాబో, డైయోడోరస్, నికలస్, డైయోనీసియస్‌లు ముఖ్యులు. వీరిలో చరిత్రను 'ఉదాహరణల ద్వారా బోధించే తత్వ శాస్త్రం' అని చెప్పినవాడు డైయోనీసియస్. క్రీ.శ. మొదటి శతాబ్దంలో ప్లూటార్క్ తన 'Parallel lines' గ్రంథం ద్వారా జీవిత చరిత్ర ఎలా

రాయాలో చూపించి చరిత్ర రచనలో జీవిత చరిత్రకు స్థానం కల్పించాడు.

ఈ విధంగా ప్రాచీన గ్రీకులు జ్ఞాన ప్రపంచానికి 'చరిత్ర' అనే పదాన్ని అందించడమే గాక దానిలోని వస్తు తత్వాన్ని సంపన్నం చేశారు. హోమర్ కవిత్వంలో, లోగో గ్రాఫర్ల వచన రచనల్లో చరిత్ర అంటే అన్వేషణగా రూపుదిద్దుకుంది. హెరొడోటస్ గ్రంథంలో భౌగోళికాంశాలు, ప్రజాజీవన విధానాలు చోటు చేసుకున్నాయి. థూసిడైడెస్ చేతిలో చరిత్ర వస్తు గతమయింది.......... మార్గదర్శకత్వంలో వ్యవహారిక మయింది. పలిబియస్ చేతిలో అన్వేషణతోబాటు కథనం ప్రాధాన్యత పెరిగింది. ఈ ప్రాచీన గ్రీకులు చరిత్రకు అన్ని ప్రధాన లక్షణాలను సంతరించి దానిని మానవీయంగా, శాస్త్రీయంగా, స్వీయ దార్శనికంగా రూపొందించి విజ్ఞాన శాస్త్రం, తత్వ శాస్త్రాలలా చరిత్రకూ మూలపురుషులయ్యారు.

## 11.3 రోమన్ల చరిత్ర రచనా సంప్రదాయం :

రోమన్లు తమ సంస్కృతి అన్ని యితర దశల్లోలానే చరిత్ర రచనా రంగంలోనూ గ్రీకులు వ్యవస్థితం చేసిన నమూనాలనే అనుసరించారు. ప్రసిద్ధ రోమను చరిత్రకారులున్నా, వారు విమర్శనాత్మక పద్ధతులకు జాగ్రత్తగా కట్టుబడి వున్న థూసిడైడెస్, పలిబియస్‌లతో సాటిగా తులతూగే వాళ్ళుకారు. కొంతలో కొంత వున్న వాళ్ళలో లివీ, టాసిటస్‌లు మాత్రమే ఆ స్థాయికి దగ్గరగా నిలబెట్టడానికి అర్హులు.

రోమన్ల చరిత్ర రచనా సంప్రదాయంలో ప్రత్యేక వ్యక్తిత్వమంటూ ఏమీ కన్పించదు. ఇది గ్రీకుల సంప్రదాయానికి కేవలం అనుకరణే అయినప్పటికీ సునిశితమైన ఆలోచన, సహేతుకమైన విశ్లేషణాత్మక ధోరణి, మనోజ్ఞమైన రచనా శైలితో చరిత్ర రచనలో గ్రీకులు నెలకొల్పిన ఉన్నత ప్రమాణాలు రోమన్ల రచనల్లో కన్పించవు. రోమన్లలో ఆ నిశితదృష్టి, స్ఫూర్తి, కార్యదీక్ష లోపించడానికి కారణాలున్నాయి. లేషియమ్ (Latium) రాజ్యాల్లో ముఖ్య నగరంగా గుర్తింపు పొంది, మెడిటరేనియను ప్రాంతాన్ని జయించటం ప్రారంభించాకనే రోమ్ యితరుల దృష్టికి వచ్చింది. తామే నాగరికులమనే జాత్యహంభావం రోమన్లలో లేదు. కనుకనే వీళ్ళు ఆంతరంగిక పరిణామాలను కేవలం రోజు వారీ కార్యక్రమంగా తీసుకున్నారు. పైగా మతవిశ్వాసాల్లోను, సాహిత్యంలోను జరిగినట్లే చారిత్రక చింతనలోనూ గ్రీకుల ప్రభావం వీళ్ళపై కన్పిస్తుంది. మొదటి దశలో యీ రోమన్లు గ్రీకు భాషలోనే చరిత్ర గ్రంథాలు రాసారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మనవాళ్ళు యిప్పటికీ తమ చరిత్ర రచనల్ని ఆంగ్లంలోనే రాస్తున్నారుగా! అయితే ఒక తేడా ఏంటంటే మనల్ని జయించిన వాళ్ళ భాష మనవాళ్ళు రాస్తే, రోమన్లు తాము జయించిన వాళ్ళ భాషలో మొదట రాశారు. అంతేగాక గ్రీకులు చరిత్ర రచనలు ఆరంభించిన తరువాత దాదాపు 500 సంవత్సరాల వరకూ రోమ్‌లో చరిత్ర రచయితే కన్పించడు. గ్రీకుల రచనలు చదివాకనే రోమన్లు తమ ఘనవిజయాలను గ్రంథస్థం చేయాలనుకున్నారు. అంటే ముందుగా చరిత్ర సృష్టించి అనంతరం చరిత్ర రచనకు శ్రీకారం చుట్టారన్న మాట.

ఫెబియస్ పిక్టర్‌ని మొదటి రోమను చరిత్రకారునిగా పేర్కొనవచ్చు. క్రీ.పూ. 200కి కొద్ది ముందుగా అతడు గ్రీకు భాషలో రోమ్ గాథను తన 'Annals'లో చిత్రించాడు. అయితే పోర్షియస్ కాటో (Cato, The Elder) రచనని మాత్రమే రోమన్లు మొదటి చరిత్ర రచనగా (లాటిన్ భాషలో రాసాడు గనుక) అతణ్ణే చరిత్ర రచనకు మూల పురుషునిగా భావిస్తున్నారు. అతని గ్రంథం 'Origines' జాతీయ గ్రంథంగా పరిగణనకు నోచుకుంది. ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ సేనానాయకునిగా ప్రసిద్ధి పొందిన రోమను రాజనీతిజ్ఞుడు, జూలియస్ సీజర్ ప్రజల్లో తన చర్యలను సమర్థించుకోడానికి 'The Commentaries on the Gallic War and The Civil War' అనే గ్రంథాన్ని క్రీ.పూ. మొదటి శతాబ్దంలో రాశాడు. యుద్ధాన్ని, ప్రజల ఆచార వ్యవహారాలను నిష్పాక్షికంగానే వర్ణించాడు. అయితే థూసిడైడెస్, పలిబియస్‌ల ప్రమాణాలను రోమను చరిత్ర రచనలో ప్రవేశపెట్టినవాడు మాత్రం సాలస్ట్ (క్రీ.పూ. 86 - 34).

**11.3.1 లివీ (క్రీ.పూ. 59 - క్రీ.శ. 17) :** లివీ, టాసిటస్‌లు రోమను చరిత్రకారుల్లో సుప్రసిద్ధులు. ముందే చెప్పినట్లు వీళ్ళిద్దర్నీ రోమను హెరొడోటస్, థూసిడైడెస్‌లుగా భావింపవచ్చు. జూలియస్ సీజర్ హత్య తరువాత రోమను ప్రపంచం మొదటిసారిగా సమైక్యం కావడంతో రోమ్ చరిత్రలో కొత్త శకం, స్వర్ణయుగం ప్రారంభమయిందనే నమ్మకం బాగా పెరిగింది. ఇదే యీ యిద్దరికీ స్ఫూర్తిని

యిచ్చిన అంశం. వీళ్ళలో లివీ ఉత్తర ఇటలీలోని పాడువాలో జన్మించాడు. జీవితకాలంలో ఎక్కువగా రోమ్‌లోనే గడిపాడు. ఉపాధ్యాయుడిగా వృత్తిని చేపట్టి ఆ తరువాత మొదటి రోమను చక్రవర్తి అగస్టస్ ఆదరణలో తన రచనలను సాగించాడు. కథలు చెప్పడంలో అందె వేసిన చేయిగా ప్రసిద్ధికెక్కాడు.

లివీ ప్రసిద్ధ గ్రంథం **'Aburbe condita libri'** (రోమ్ చరిత్ర). ఈ గ్రంథం క్రీ.పూ. 753 లో రోమ్ నగర స్థాపన మొదలు క్రీ.పూ. 8లో రోమను సామ్రాజ్య స్థాపన వరకు సంభవించిన చారిత్రక పరిణామాలను వివరిస్తూ 142 సంపుటాల్లో రాయడం జరిగింది. కాని యీ మొత్తం సంపుటాల్లో 35 మాత్రమే పూర్తిగా లభించాయి. రోమ్ పతనానికి దారితీసిన పరిస్థితుల దృష్ట్యా చూస్తే యివి దొరకటం కూడా ఆశ్చర్యమే. అందులోనూ వీటిలో కొన్ని మధ్యయుగం దాకా దొరకనే లేదు. అయితే మొత్తం గ్రంథానికి **'Periochae'** అనే ఒక సంగ్రహ ప్రతిలాంటిది లభించటంతో కొంత మేరకు లభించని సంపుటాల భాగాలను పూరించటానికి దోహదపడింది. రోమ్ గత వైభవాన్ని తన సమకాలికుల ముందుంచడం, వాళ్ళ కళ్ళెదుట వెనుకటి ప్రముఖుల్ని ఆదర్శమూర్తులుగా నిలబెట్టడం తన లక్ష్యమని లివీ తన గ్రంథపీఠికలోనే స్పష్టీకరించాడు. యుద్ధాలు, ముట్టడులను వర్ణించటంలో అందెవేసిన చేయి. ఈతని రచనలో అద్భుతమైన సమగ్రత వున్నా రచనా విధానంలో ఆధారాల పరిశీలనలో ఏ మాత్రం విమర్శనా దృక్పథం కన్పించదు. ఈ కారణంగానే శాస్త్రీయ చరిత్రకారుల్లో యితనికి చోటు లేదు. అయినా రోమ్ పూర్వ చరిత్రకు సంబంధించిన సాంప్రదాయిక రచనలు అన్నిటినీ సమీకరించి, వాటి సమన్వయంతో ఒక అవిచ్ఛిన్న కథనంగా రూపొందించిన ఘనత (కాలిన్‌వుడ్ చెప్పినట్లు 'అతుకుల బొంత చరిత్రే' అయినప్పటికీ) లివీదే. ఇతడి రచన భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు, చక్కటి రచనా శైలికి ప్రసిద్ధిపొందింది.

**11.3.2 టాసిటస్ (క్రీ.శ. 55 - 117) :** ప్రసిద్ధ రోమను చరిత్రకారుల్లో చివరివాడు టాసిటస్. ఈతడి జీవిత వివరాలు యితని సన్నిహితుడైన ప్లినీ రచన నుండే తెలుస్తున్నాయి. కొంత కాలం న్యాయవాదిగా పనిచేసిన టాసిటస్ ఆ తరువాత ప్రభుత్వంలో అనేక పదవులు నిర్వహించాడు. ముఖ్యంగా బ్రిటీషు గవర్నరైన జూలియస్ అగ్రికోలా కుమార్తెను క్రీ.శ. 77లో వివాహం చేసుకున్నాక సమాజంలో ప్రోకాన్సల్ వంటి ఉన్నత పదవుల్ని నిర్వహించాడు. జీవిత చరమ దశలో చరిత్ర రచనకు పూనుకొన్నాడు. తన మామ అగ్రికోలా జీవిత చరిత్ర అయిన **'Life of Agricola'** గ్రంథంతో రచన ఆరంభించాడు. జీవిత చరిత్ర **(biography)** రచన ఎలా వుండాలో తెలియజెప్పిన యీ గ్రంథంలో బ్రిటన్‌లో రోమన్ల యుద్ధాల గురించి, రోమన్ల పాలనలో బ్రిటన్ ఎలా వుందీ, అగ్రికోలా పరిపాలన గురించి వివరించాడు. ఈ గ్రంథం అనంతరం **'Dialogue on Orators'**ను రచించాడు.

మనకు లభించిన టాసిటస్ యితర రచనల్లో **'Germania'** ఒకటి. జర్మన్ల సంప్రదాయాలను, కట్టుబాట్లను, విశ్వాసాలను వివరించే యీ గ్రంథం వర్ణనాత్మక సమాజ శాస్త్రానికి సంబంధించిన తొలి రచనల్లో ఒకటి. **'Histories, Annals'** అనేవి యితర చరిత్ర రచనలు. ఈ రెండూ నీరో కాలం నుండి ఆగస్టస్ వరకు, అగస్టస్ నుండి డామిషియన్ వరకు రోమను చరిత్రను ఉపన్యాసధోరణిలో వివరించినాయి.

టాసిటస్ రచనా విధానంలో కొంతమేరకు థూసిడైడెస్ కన్పిస్తాడు. ప్రత్యేకించి కారణాలను రూపొందించడంలోను, సంఘటనలను వ్యాఖ్యానించడంలోను యీ పోలిక వర్తిస్తుంది. ఊహాత్మక శక్తితోను, అందమైన భావవ్యక్తీకరణలోను, తాత్విక చింతనలోను గ్రీకుల చరిత్ర రచనాస్థాయిని టాసిటస్ అందుకున్నాడు. అయితే యదార్థాలను నిర్ధారించుకోవడంలో యితర రోమన్లలానే బద్ధకస్తుడే. పరిణామాల అంతరార్థాన్ని కనుగొనే ప్రయత్నమేమీ చేయలేదు. చరిత్రను పరిశోధనగా కంటే ఒక కళగానే భావించాడు. దీనికి తోడు భాష కోసం, శైలి కోసం వాస్తవాన్ని ప్రక్కన పెట్టేవాడు. రిపబ్లికను సంస్థల పట్ల పక్షపాతం ప్రదర్శించాడు. సమాజంలోని తోటి ఉన్నత వర్గాలకే ప్రాధాన్యతనిచ్చాడు. మనిషి సుగుణాలను పెంపొందించేదిగా చరిత్ర ఉండాలి అతడి నిశ్చితాభిప్రాయం. కనుకనే అతడి చరిత్ర రచనలు నైతిక, ఉపదేశాత్మక ప్రేరకంగా ఉంటాయి.

## 11.4 ముగింపు :

టాసిటస్ అనంతర కాలంలో రోమను చరిత్రకారుల్లో టాన్క్విలస్, మక్సిమస్, మార్సెలినస్‌లు కొంత పేరున్నవారు. వీళ్ళంతా

గ్రీకు చరిత్రకారుల్ని అనుకరించినవారే. ఊహాత్మక శక్తి, భావవ్యక్తీకరణ, తాత్విక చింతనల్లో గ్రీకుల స్థాయిని అందుకోవాలని ప్రయత్నించినా నిశిత దృష్టి, స్ఫూర్తి, కార్యదీక్షల్లో గ్రీకుల దరిదాపులకు కూడా వీళ్లెవరూ రాలేకపోయారు. గ్రీకో - రోమను చరిత్ర రచనాభివృద్ధిని మొత్తంగా సమీక్షిస్తే మనకు జనహిత వాదం, వస్తుత్వ వాదం సుగుణాలు రెండు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి.

## 11.5 సంక్షిప్తంగా :

ప్రాచీన గ్రీకులు ప్రపంచానికి చరిత్ర అనే పదాన్ని అందించడమేగాక దానిలోని వస్తుతత్వాన్ని సంపన్నం చేశారు. కవులు, లోగోగ్రాఫర్లనే వచన రచయితలతో ప్రారంభమైన గ్రీకుల చరిత్ర రచనా సంప్రదాయం హెరొడోటస్, థూసిడైడెస్ వంటి ప్రముఖుల చేతుల్లో అది మానవ దార్శనికంగా, శాస్త్రీయంగా రూపొందింది. రోమన్లు మొదట గ్రీకు చరిత్రకారులనే అనుకరించారు. లివీ, టాసిటస్ వంటి రోమను చరిత్రకారుల రచనల్లో చక్కని భావవ్యక్తీకరణ, అద్భుత రచనా శైలి కన్పిస్తాయి. ఐరోపాలో ప్రాచీన యుగంలో గ్రీకులు, రోమన్లు అందించిన సేవలు చరిత్ర రచనాభివృద్ధికి గట్టి పునాదులు వేశాయి.

## 11.6 నమూనా ప్రశ్నలు :

(i) క్రింది ప్రశ్నలకు వ్యాస రూప సమాధానాలు రాయండి.

1. ప్రాచీన గ్రీకు-రోమను చరిత్ర రచనా సంప్రదాయ లక్షణాలను, అభివృద్ధిని వివరించండి.
2. చారిత్రక చింతన అభివృద్ధికి గ్రీకు రచయితల సేవలను వర్ణించండి.
3. రోమను చరిత్ర రచనాభివృద్ధికి లివీ, టాసిటస్‌లు చేసిన సేవల్ని వివరించండి.

(ii) క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. 'లోగో గ్రాఫర్లు' అంటే ఎవరు ?
2. థూసిడైడెస్ రచనా విధానాన్ని సమీక్షించండి.
3. రోమన్ల చరిత్ర రచనా సంప్రదాయ లక్షణాలను పేర్కొనండి.

## 11.7 ఉపయుక్త గ్రంథాలు :


1. Ali, Sheik B. : History : Its Theory and Method (Macmillan India, 1978)
2. Barnes, H.E. : A History of Historical Writing (Dover, N. York, 1962)
3. Collingwood, R.G. : The Idea of History (Oxford, London, 1972)
4. Durga Prasad, J. : Charitra Rachana Sastramu (Tel) (Telugu Academy, Hyderabad, 1987)

5. Robinson, C.A. Jr. (Ed). : Selections from Greek and Roman Histories (RINEHART ed.. 1957)
6. Shotwell, James T. : The History of History
7. Thompsion, J.W. : History of Histroical Writing (2 Vols.) (Macmillan, N.York, 1942)
8. Toynbee, A.J. : The Greek Historical Thought
9. Usher, Stephen : The Historians of Greece and Rome

పాఠ్య రచయిత

- డాక్టర్ జె. దుర్గాప్రసాద్.

పాఠం - 12

# లియోపాల్డ్ వాన్ రాంకె (1795 - 1885)
# (LEOPOLD VON RANKE)

## 12.0 లక్ష్యం :

ఈ పాఠ్య అధ్యయనం వలన మీరు

* చరిత్ర రచనా విధానంలో ప్రత్యక్ష జ్ఞాన వాదమనే నూతన సంప్రదాయం ఆవిర్భావం వలన వచ్చిన మార్పులు తెలుసుకోవాలి.
* చరిత్ర రచనకు లియోపాల్డ్ వాన్ రాంకె చేసిన కృషిని గురించి వివరించగలగాలి.

## విషయసూచిక


12.1 పరిచయం

12.2 ప్రత్యక్షజ్ఞానవాదం

12.3 రాంకె

12.4 రాంకె మార్గదర్శకత్వం

12.5 సంక్షిప్తంగా

12.6 నమూనా ప్రశ్నలు

12.7 ఉపయుక్త గ్రంథాలు


## 12.1 పరిచయం :

ప్రాచీన యుగంలో చారిత్రక భావం, చరిత్ర రచన వృద్ధి చెందడానికి గ్రీకులకు పరిస్థితులు అనుకూలించడం వలన, వారితోనే ప్రామాణిక చరిత్ర రచనా సంప్రదాయం ప్రారంభమయినది. వీరి చేతుల్లో చరిత్ర అన్ని ప్రధాన లక్షణాలను సంతరించుకొని మానవ దార్శికంగా, శాస్త్రీయంగా, స్వీయ దార్శనికంగా రూపొందింది. రోమన్లు కూడా ప్రాచీన కాలంలో చరిత్ర రచనా సంప్రదాయాన్ని పరిపోషించారు. అయితే వీరిలో నిశితత్వము, స్ఫూర్తి, కార్యదృష్టి కనిపించవు. మధ్య యుగంలో చరిత్ర మత ప్రభావానికి లోనయింది. ఈ కాలంలోనే క్రీ.శ. 8వ శతాబ్దము నుండి వంశ చరిత్రల రచన ప్రారంభమయింది. ఇటువంటి రచనల్లో ప్రసిద్ధి చెందినది ఆంగ్లో - శాక్సను వంశాను చరితం. ఆధునిక యుగంలో ఆధ్యాత్మిక విషయాసక్తి తగ్గిపోయి, మానవీయ విషయాసక్తి పెరిగి శాస్త్రీయ దృక్పథం వృద్ధి చెందింది. దీని వల్ల చరిత్ర విషయ పరిధి విస్తృతం కావడమే గాక, వైవిధ్యమును సంతరించుకొన్నది. ఈ ఆధునిక యుగంలోనే చరిత్ర లౌకికంగా, పక్షపాత రహితంగా, సందేశాత్మకంగా, తాత్వికంగా రూపుదిద్దుకోవాలన్న కోరిక చరిత్రకారులలో బలీయమైనది.

ఆధునిక యుగంలో సాంస్కృతిక పునరుజ్జీవనం, మత సంస్కరణోద్యమం, జ్ఞాన వికాసం, కాల్పనిక వాదం, ప్రత్యక్ష జ్ఞాన వాదం చరిత్ర రచనా విధానాన్ని, చారిత్రక పరిజ్ఞానాన్ని ప్రభావితం చేశాయి. ఫలితంగా చరిత్ర రచనలో వివిధ సాంప్రదాయాలు ఆవిర్భవించి చరిత్రను లౌకికంగా, పక్షపాత రహితంగా, ఉపదేశాత్మకంగా, తాత్వికంగా, శాస్త్రీయ దృక్పథంలో చరిత్ర ఆధారాలను పరిశీలించి, ప్రామాణికతను నిర్ధారించి, విశ్వసనీయమైన చారిత్రక ఆధారాలతో విశ్లేషించి, గతంలో ఏమి జరిగింది, ఎందుకు జరిగింది, ఎలా జరిగింది అన్న క్రమబద్ధమైన సార్వజనీనమైన విశ్లేషణతో కూడిన వివరణ ఇవ్వటం ప్రారంభించారు చరిత్రకారులు.

సాంస్కృతిక పునరుజ్జీవనం ఫలితంగా మత సంస్కరణోద్యమం, భౌగోళిక ఆవిష్కరణలు, వ్యాపార విస్తరణ, జాతీయ రాజ్యాల పుట్టుక వంటి నూతన పరిణామాలు, విజ్ఞాన శాస్త్రం, తత్వ శాస్త్రం, రాజనీతి, సాహిత్యం, కళ, విద్యారంగాలలో నూతవ ధోరణులు చోటుచేసుకున్నాయి. దీని ఫలితంగా మానవీయ విషయాసక్తి, శాస్త్రీయ దృక్పధం వృద్ధి చెందాయి. సాంస్కృతిక పునరుజ్జీవన సాంప్రదాయాన్ని అనుసరించిన చరిత్రకారులలో మాకియవెలీ, గ్వేట్ చార్డీ , గంగూయి, జీన్ బోడిక్‌లు ముఖ్యులు. రాజనీతి శాస్త్ర అధ్యయమునకు చారిత్రక పద్ధతి సరైనదని మాకియావెలీ భావించడమేగాక, గతాన్ని సంస్కరించి వర్తమానమును ఆకళింపు చేసుకోవచ్చునని తెలియజేశాడు. అంతేగాక ఒక పరిణామం మరొక పరిణామానికి ఎలా దారితీస్తుందో రోమన్ చరిత్ర నుండి ఇతడు అనేక నిదర్శనాలు చూపించాడు. ఇతడు ఒకే దేశానికి, ఒకే భాషకు చెందిన జాతిని చారిత్రక రచనలో ఒక ప్రమాణంగా నిర్ధారించాడు. క్రీ.శ. 16వ శతాబ్దంలో వచ్చిన పరిణామాలను గ్వేట్ చార్డీనీ సవివరంగా, నిష్పాక్షికంగా, శాస్త్రీయంగా వివరించాడు. గంగూయి ప్రాచీన కాలం నుంచి క్రీ.శ. 15వ శతాబ్దం వరకు ఫ్రాన్స్ దేశ చరిత్రను రచించాడు. చారిత్రక పరిశోధనా పద్ధతిని అనుసరించి, వాస్తవిక పరిస్థితులను పరిశీలించి, మానవ పురోగతి ఏ విధంగా జరిగిందో పరిశీలించి దానికి కారణమైన సూత్రాలను, లక్ష్యాలను ఆధారం చేసుకొని బోడిన్ చారిత్రక తత్వము నిర్ధారించాడు.

ప్రొటస్టెంటు ఉద్యమ ఫలితంగా విమర్శనాశక్తి మరింత పెరిగి విశ్వసనీయమైన సాక్ష్యం పత్రాల విశ్లేషణ పెరిగింది. ఇందుకు సర్ థామస్ మోర్, కావెండిష్, సర్ వాల్టర్ రాల్లీల రచనలే సాక్ష్యాలు. ఫ్రాన్సిస్ బేకన్ మరో అడుగు ముందుకు వేసి నేటి ప్రయోగాత్మకమైన విజ్ఞాన శాస్త్రం ఆగమన పద్ధతిని తత్వ శాస్త్రంలో ప్రవేశపెట్టాడు. థామస్ హాబ్స్ కూడా తన సామాజిక ఒడంబడిక ద్వారా లౌకికమైన, శాస్త్రీయమైన చరిత్ర అభివృద్ధికి దోహదం చేశాడు.

క్రీ.శ. 17వ శతాబ్ది మధ్య భాగంలో జ్ఞాన వికాసం లేదా భావ విప్లవం అనే నూతన చరిత్ర రచనా సంప్రదాయం ఆవిర్భవించింది. ఈ సంప్రదాయానికి ఐజాక్ న్యూటన్, జాన్‌లాక్‌ల రచనలు నాందీ వాచకం పలికాయి. తత్వ, విజ్ఞాన శాస్త్ర రంగాలలో సాధించిన ఘనకార్యాలు, ఫలితంగా ఆవిర్భవించిన నూతన వైఖరులు కలిసి భావవిప్లమయ్యాయి. ఈ భావ విప్లవం చారిత్రక రచనపై కూడా ప్రభావం చూపింది. ఈ కాలంలో యదార్థాల నిర్ధారణను సూచించడానికి, మానవ వికాసాన్ని విలువ కట్టేందుకు ప్రగతి భావన బాగా వ్యాప్తిలోకి వచ్చింది. వివేచనయే మార్గదర్శక సూత్రమైంది. లాటిన్ బదులుగా జాతీయ భాషలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. చర్చి చరిత్ర రచనా సాంప్రదాయం తీవ్ర విమర్శకు గురైనది. ఈ కాలంలోనే చారిత్రక యదార్థాలను వాటి ఉపయోగం దృష్ట్యా చూడటం ఆరంభమైంది. అది ఉపయోగితావాదానికి దారితీసింది. దురభిమాన, పక్షపాత రహితంగా, వివేచనా దృక్పధంతో పరిశీలించినపుడు చరిత్ర ఉపయోగకరమైన సూచనలు, సలహాలు ఇస్తుందన్న భావనలో చరిత్రతత్వం అనునది ప్రచారంలోకి వచ్చింది. ఈ యుగానికి చెందిన మేధావులలో ప్రముఖులు డేవిడ్ హ్యూమ్, ఆడమ్ స్మిత్, వాల్టేరు, గిబ్బన్‌లు. విజ్ఞాన శాస్త్రం, వివేచనలలో నమ్మకమున హేతువాద సాంప్రదాయాలకు చెందిన చరిత్రకారులకు మూల పురుషుడు వాల్టేరు. ఇతడు యుద్ధం రాజకీయాల వంటి విషయాలతోపాటు ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, భావశక్తుల చరిత్రకు ప్రధాన అంశాలని గుర్తించాడు. చరిత్ర కర్తవ్యం భవిష్యత్‌ను తీర్చిదిద్దటమని ఇతడన్నాడు.

చరిత్ర భావనాపరంగా 19వ శతాబ్దంలో గొప్ప మార్పులకు లోనయింది. ముఖ్యంగా ఫ్రెంచి విప్లవం తరువాత కాల్పనిక వాదం అనే నూతన సాంప్రదాయం ఆవిర్భవించింది. వివేచన, హేతువు స్థానాన్ని ఊహ ఆక్రమించింది. భావుకత దీనికి పునాదిగా రూపొందింది. సాహిత్య రంగంలో కీట్స్, షెల్లీ, బైరన్ వంటి ఆంగ్ల కవులు దీనికి ప్రాతినిధ్యం వహించారు. వ్యక్తి స్వేచ్ఛ, సంకల్ప

ప్రాధాన్యత, అంతర జ్ఞానాలు ఈ వాదంలో భాగమయ్యాయి. ఇక చరిత్ర రచనా రంగంలో ఈ వాదాన్ని ప్రతిబింబించిన చరిత్రకారులలో కార్లైల్, ఫ్రూడ్, మెకాలే, కార్ల్‌మార్క్స్, మిచలెట్, బాంక్రాఫ్ట్ ప్రముఖులు. మహాపురుషులే చరిత్ర రథసారధులని కార్లైల్ అన్నాడు. చరిత్ర అంతా వర్గపోరాటం చరిత్ర అని, వర్గ రహిత సమసమాజ స్థాపన తన ధ్యేయమని మార్క్స్ చరిత్ర గతిని విశ్లేషించాడు. బాంక్రాఫ్ట్ అమెరికా చరిత్ర రచనా సాంప్రదాయమునకు శ్రీకారం చుట్టినాడు.

బ్రిటన్‌కు చెందిన 18, 19వ శతాబ్దపు చరిత్రకారులు చరిత్రను సారస్వత ప్రక్రియగా భావించారు. ఈ కోవకు చెందిన వారిలో గ్రోట్, విలియం స్టబ్స్, మెకాలే, మైట్‌లాండ్‌లు ముఖ్యులు. కేంబ్రిడ్జి చరిత్రకారుడు ఆక్టన్ జీవితపు నైతిక విలువలకు అధిక ప్రాముఖ్యమిచ్చి ధర్మాధర్మ వివేకాన్ని నిర్దుష్టంగా పెంపొందింపజేయుటకు చేయూతనివ్వటమే చరిత్ర లక్ష్యమన్నాడు. 19వ శతాబ్దములోనే కాల్పనికవాద శిథిలాలపై ప్రత్యక్ష జ్ఞానవాద సాంప్రదాయం జన్మించింది.

## 12.2 ప్రత్యక్ష జ్ఞానవాద సంప్రదాయము :

క్రీ.శ. 19వ శతాబ్దంలోనే కాల్పనిక వాద శిథిలాల మీద ప్రత్యక్ష జ్ఞానవాదమనే నూతన సాంప్రదాయం ఆవిర్భవించింది. జ్ఞాన వికాసానికి కాల్పనిక వాదం ప్రతిస్పందన అయినట్లే, కాల్పనిక వాదానికి ప్రతిస్పందన ప్రత్యక్ష జ్ఞానవాదం. జ్ఞానం ప్రత్యక్ష విషయాల మీదనే ఆధారపడి ఉండాలని నమ్మే తాత్త్విక సిద్ధాంతమిది. మొత్తం యదార్థాలను పరిగణనలోనికి తీసుకొని, సంఘటనలను వాటి పరిణామ క్రమంలో గుర్తించి, వ్యక్తి వాదమును వ్యతిరేకించి ప్రజాసమూహాలను, జాతులను, సమాజాలను అధ్యయన అంశాలుగా ప్రత్యక్ష జ్ఞానవాదులు తీసుకొన్నారు. అంతేగాక వీరు సామాజిక అంశాలు పరస్పరం ఒక దాని మీద ఒకటి ఆధారపడ్డాయని విశ్వసించారు. సూత్రబద్ధమైన విజ్ఞాన శాస్త్రంగా చరిత్రను తీర్చిదిద్దడం వీరి ఆశయం. అంతేగాక మతాతీత శక్తుల ప్రభావం నుంచి సాంఘిక సంఘటనలను వేరు చేసి వారి పరిశీలనలో వాటి నియమాలను గురించి శాస్త్రీయంగా విశ్లేషించాలన్నది ప్రత్యక్షవాదుల లక్ష్యం. అందుకే వీరు చరిత్రను 'సామాజిక భౌతిక శాస్త్రం' అన్నారు. అనగా కార్యకారణ సంబంధంలో గతకాలపు సంఘటనలను వివరించవచ్చునని, ఈ వివరణలో భవిష్యత్‌ను నడిపించే నియమాలను రూపొందించవచ్చునని వీరు నమ్మారు. అందువల్లనే వీరు చరిత్రలో వాస్తవికతకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. చరిత్రకారుని లక్ష్యం జరిగింది జరిగినట్లు విషయగతంగా, విశ్వసనీయంగా గతాన్ని వివరించాలని, చరిత్ర తత్వశాస్త్రమునకన్నా భిన్నమైనదని వీరు నమ్మారు. కాల్పనిక వాదం చరిత్ర రచనలో మనఃకల్పనకు, సిద్ధాంత పరతకు చోటు కల్పించింది. విషయాల యదార్థ వర్ణనమీద కంటే, అవి కళాకారుని మనస్సులో కలగజేసే ఆత్మాశ్రయ సంవేదనలపైనే రొమాటిక్ వాదులు దృష్టి కేంద్రీకృతమయింది. కాల్పనిక వాదంలో వ్యక్తులే ప్రధాన ఆకర్షణ, కేంద్రం. భావనాత్మక విలువలలోనే దాని మనుగడ. కర్త లేని కళగా చరిత్రను తీర్చి దిద్దే ప్రయత్నంలో ఇది జ్ఞాన బోధకమైన, నీతి ప్రబోధాత్మకమైన, ప్రయోజనకరమైన చరిత్రను నిర్లక్ష్యం చేసింది. పైగా పాండిత ప్రకర్షకు గౌరవాన్ని హెచ్చించింది. అయితే కాల్పనిక వాదానికి ప్రతి స్పందనగా ఆవిర్భవించిన ప్రత్యక్ష జ్ఞానవాద సంప్రదాయం యదార్థాలను పరిగణనలోకి తీసుకుంది. మానవ విజ్ఞానం మానవుని అనుభవాన్ని దాటి వెళ్ళలేదని, చారిత్రక విషయం గురించి చేసే ఏ పరిశీలన అయినా శాస్త్రీయ రీతికి పరిమితం కావాలని ప్రత్యక్ష జ్ఞానవాదం చెబుతుంది.

19వ శతాబ్దంలో ఫ్రెంచి తత్త్వవేత్త, నవీన సమాజ శాస్త్ర నిర్మాత అయిన ఆగస్ట్ కోంట్ ప్రత్యక్ష జ్ఞానవాదమును వృద్ధి చేశాడు. సెంట్ సైమన్ చే ప్రభావితుడైన కోంట్ 1848 లో రాజకీయంగా వాతావరణం ఉత్తేజకరంగా ఉన్న సమయంలో 'ప్రత్యక్ష జ్ఞానవాద సమాజం' (positivist society) నెలకొల్పాడు. ప్రకృతి రహస్యాలను గురించి ఆలోచించటం కంటే ప్రకృతిని స్వాధీనం చేసుకునే మార్గం ఆలోచించటం ప్రధానమని, కనుక జ్ఞానం ప్రత్యక్ష విషయాల మీద ఆధారపడి ఉండాలనే తాత్త్విక సిద్ధాంతం ఈ సమాజం ప్రబోధించింది. విద్యారంగంలో సాంస్కృతిక విషయాల కంటే శాస్త్రీయ విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలని పేర్కొన్నది. కోంట్ కనుగొన్న ఒక నియమంతో ప్రత్యక్ష జ్ఞానవాదం ప్రారంభం అవుతుంది. దీనికి 'త్రి దశా నియమం' (The law of Three states) అని పేరు. మొదటి దశలో మానవుడు ప్రాపంచిక సంఘటనలను మత దృష్టితోను, రెండో దశలో అది భౌతిక దృష్టితోను

వివరిస్తాడు. మత, అధి భౌతిక దశలలో మానవుడు సంఘటనలకు కారణాలను లేదా వాటి స్వరూపాన్ని అన్వేషిస్తాడు. ప్రత్యక్షానుభవదశలో అతడు నియమాలతో తృప్తి చెందుతాడు. సమాజానుశీలనను ఈ మూడో దశలోకి తీసుకెళ్ళడము అనగా మత, అధి భౌతిక వాదాల నుంచి సామాజిక సంఘటనలను వేరు చేసి, వాటి అనుశీలనలో వాటి నియమాలను గురించిన శాస్త్రీయ పర్యవేక్షణను ప్రవేశపెట్టడమే ప్రత్యక్ష జ్ఞానవాదం అవలంబించిన తత్త్వశాస్త్ర ప్రధాన లక్షణం. సామాజిక సంఘటనలను మూడో దశలోకి తెచ్చే ఇటువంటి ప్రయత్నం నుంచే భౌతిక శాస్త్రాలు ఉద్భవించాయి. ఈ ప్రత్యక్ష జ్ఞానవాద చరిత్రకారులలో జర్మనీకి చెందిన రాంకె అతి ముఖ్యుడు.

## 12.3 రాంకె (క్రీ.శ. 1795 - 1885) :

ఆధునిక విషయగత చారిత్రక సంప్రదాయానికి మార్గదర్శకునిగా ప్రసిద్ధిగాంచిన లియోపాల్డ్ వాన్ రాంకె 1795 డిసెంబర్ 20న సాక్సనీ రాజ్యంలోని థురింగియాలో గల వేహి (Wiehe)లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. 1814 లో లీప్‌జిగ్ విశ్వవిద్యాలయంలో చేరి భాషా శాస్త్రం, మత ధర్మ శాస్త్రంలో విద్యనభ్యసించాడు. ఈ దశలో ఇతడు చరిత్ర పట్ల తనకు ఆసక్తి లేదని స్పష్టంగా ప్రకటించాడు. అయితే అతని మేధో కుతూహలం, నమ్మదగిన సమాచారం సేకరించాలన్న కోరిక చివరకు అతనిని చరిత్ర అధ్యయనానికి పురికొల్పాయి. ఆ తరువాత కాంట్ యొక్క 'క్రిటిక్ ఆఫ్ ప్యూర్ రీజన్', ఫిక్టె యొక్క 'అడ్రస్ టు ది జర్మన్ నేషన్' చదివాడు. ప్రాచీన రోమన్ చరిత్ర కోసం నైబూర్ విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడం అతనికి నచ్చింది.

రాంకె ఫ్రాంక్ ఫర్ట్‌లో లాటిను, గ్రీకు ప్రామాణిక గ్రంథాలను బోధిస్తున్నపుడు అనేక పాఠ్య గ్రంథాలలో గత కాలం గురించి ఉన్న జ్ఞానం కంటే ఎక్కువ లోతైన అవగాహన కావాలనే విషయం గుర్తించాడు. కొన్ని సందర్భాలలో విభిన్న దృక్పథాలను సమన్వయించడం సాధ్యం కానంత వైవిధ్యం గ్రంథకర్తలలో ఉందని రాంకె కనుగొన్నాడు. ఫలితంగా నాటి ప్రధాన చరిత్రాధారాలను అధ్యయనం చేసి అప్పటి చరిత్రకు తన స్వీయ వర్ణనను ఇచ్చి, పరిస్థితిని మెరుగు పరచాలనే నిర్ణయానికి వచ్చాడు. ఆ విధంగా సొంత ప్రయోజనానికి ఉద్దేశించిన అతని తొలి రచన 'హిస్టరీస్ ఆఫ్ ది రోమన్ అండ్ ట్యూటోనిక్ పీపుల్స్' వెలువడింది. అయితే ఈ గ్రంథం ప్రధానంగా సంకలనమే అయినా ఐరోపా చరిత్రను విషయగతంగా పరిశీలించడంలో ముందడుగు వేసిందని జి.పి. గూచ్ అభిప్రాయపడినాడు. ఇంచుమించు ముఖ్యులైన రోమనో-జర్మానిక్ ప్రజలందరి గురించిన, పోప్ అధికార వ్యవస్థ గురించిన ఆధునిక చరిత్ర రచన కోసం మూలాధారాలను అధ్యయనం చెయ్యడంలో, ప్రాచీన రోమన్ చరిత్ర పునర్నిర్మాణంలో నైబూర్ అనుసరించిన విమర్శనాత్మక పద్ధతినే రాంకె కూడా అనుసరించాడు. ఆ తరువాత ఈ పద్ధతినే మధ్యయుగ చరిత్రకూ విస్తరించాడు.

ఆధునిక చరిత్రకారులలో ఆద్యునిగా ప్రసిద్ధుడైన రాంకె అధ్యాపక వృత్తినే చేపట్టినా అధ్యాపకునిగా కంటే అతని 'సెమినార్' పద్ధతి అతనికి పేరు ప్రతిష్టలు సంపాదించి పెట్టింది. ఈ 'సెమినార్' పద్ధతి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వందకు పైగా ప్రముఖ పండితులను సృష్టించినదని, వారు రాంకె సంప్రదాయంలో అనేక మంది విద్యార్థులను తయారు చేసారని, థాంప్సన్ పండితుడు పేర్కొన్నాడు. చారిత్రక పరిశోధనలో, చరిత్ర బోధనారీతిలో ఈ 'సెమినార్' పద్ధతినే ఆ తరువాత ఇంగ్లండ్, అమెరికా తదితర దేశాలలో అనుసరించడం జరిగింది. రాంకెలో లూథరన్ మత ధర్మనిష్ఠ, ఫిక్టె భావవాదం, హెరర్, గొయిథేల తాత్త్విక చింతన మూర్తీభవించాయి. అంతేగాక సర్వమానవ చరిత్ర అనే 18వ శతాబ్ది భావన, వ్యక్తినాదమనే 19వ శతాబ్ద కాల్పనిక భావన అతనిలో ఏకమయ్యాయి. అతడు జ్ఞానవికాస యుగపు ఉపయోగితావాద చరిత్రను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాడు. నీతులు చెప్పే చారిత్రక పద్ధతి మీద తిరుగుబాటు చేశాడు. జరిగింది జరిగినట్లుగా ఖచ్చితంగా చెప్పడం మాత్రమే చరిత్రకారుని కర్తవ్యమని అతడు ఎలుగెత్తి చాటాడు. యదార్థాల గురించి చరిత్రకారుడు చూసుకుంటే చరిత్రతత్త్వం గురించి భగవంతుడు చూసుకుంటాడని అతని నమ్మకం. ప్రత్యక్ష సాక్షుల కథనాలు, 'ఆర్కైవ్స్'లో భద్రపరచిన అత్యంత విశ్వసనీయమైన సమకాలీన సాక్ష్య పత్రాలు ఉంటే తప్ప ఆధునిక చరిత్రను రచించడం ఎవరికైనా అసాధ్యం అనే విషయం అతడు చాటాడు. స్వదేశీ దురభిమానాలను గట్టిగా ఎదిరించాడు. హెగిలియనువాదం, ఉదారతావాదం, కాల్పనిక వాదం వంటి సమకాలీన సిద్ధాంతాల ప్రభావానికి చరిత్రకారుడు లొంగకూడదని అతడు భావించాడు. ఏదైనా ఒక తాత్త్విక పద్ధతికి యదార్థాలను బలవంతంగా సరిపుచ్చే వైఖరిని రాంకె వ్యతిరేకించాడు.

చరిత్ర గురించి రాంకె సిద్ధాంతపరంగా వ్యాసాలు వ్రాశాడు. అయితే అతని మొత్తం చారిత్రక రచనలను పరిశీలించినపుడు మాత్రమే అతని చరిత్ర తత్త్వం అవగతమవుతుంది. అతడు చరిత్రను రచించినపుడే అతని తాత్త్విక భావాలు చక్కగా వ్యక్తీకరించబడ్డాయి. అతడు చరిత్రపై మొత్తం 54 సంపుటాలు ప్రచురించాడు. వీటిలో అతని నిష్పాక్షికత, అపురూప వస్తుపరత, ఖచ్చితత్వం తారాస్థాయిలో విశదమయ్యాయి.

దక్షిణ యూరప్‌లో రాకుమారులు, ప్రజలు అను శీర్షికలో రాంకె వ్రాసిన తొలి సంపుటం 'ఒట్టోమన్స్ అండ్ ది స్పానిష్ మొనార్కీ ఆఫ్ ది సిక్స్‌టీన్త్ అండ్ సెవెన్‌టీన్త్ సెంచరీస్' ఇందులో అతడు స్పానిష్ రాజ్యంలోని ఆర్థిక పాలన, వర్తకం, రాజ్యాంగం గురించి విపులంగా వర్ణించాడు. ఈ రకమైన ఇతర సంపుటాల రచనకు కావలసిన ఆధారాల కోసం రాంకె దక్షిణ ఐరోపా రాజ్యాలను సందర్శించాడు. మొదట ఇతడు ఇటలీకి తరువాత ఆస్ట్రియాకు వెళ్ళాడు. వుక్ (Wuk Stephanowich) ప్రభావంపై రాంకె 'ది హిస్టరీ ఆఫ్ రెవల్యూషన్స్ ఇన్ సెర్బియా' అను గ్రంథం వ్రాసాడు. ఈ గ్రంథంలో అతడు కొన్ని శతాబ్దాలుగా సెర్బ్‌లు ఎలా అణచబడినారో వివరించాడు. వియన్నా పర్యటనలో ఉండగా 'జెన్ట్జ్' (Gentz)తో చర్చలు జరపడం వల్ల రహస్య చారిత్రక పరిణామాల గురించి గ్రహించి ఐరోపా వ్యవస్థ ఐక్యత ఆవశ్యకతను రాంకె గుర్తించాడు. రోమ్, ఫ్లోరెన్స్ గ్రంథాలయాలలో సేకరించిన సమాచారం తరువాత సంపుటాలకు ఎంతగానో ఉపయోగపడింది. ఇటలీలో సేకరించిన సమాచారంతోనే 'వెనిస్ ఎట్ ది యండ్ ఆఫ్ ది సిక్స్‌టీన్త్ సెంచరీ' అను సంపుటం రూపొందింది.

"హిస్టోరిష్కే జీట్స్ క్రిఫ్ట్" (Historische Zeits chrift) అను పేరుతో రాంకె చారిత్రక జర్నల్‌లు నెలకొల్పి చరిత్ర పఠనానికి గొప్ప సేవ చేశాడు. ఈ జర్నల్‌లో అతడు చరిత్ర పరిశోధనలో వాస్తవ పద్ధతిని తెలియజేస్తూ ఎచట మార్పులు చేయాలో తెలిపాడు. 1830 విప్లవం వల్ల తలెత్తిన ఫ్రాన్స్ ఆధిపత్య ప్రభావాన్ని ఎదుర్కోవడానికి ఈ జర్నల్ స్థాపించబడింది. దీని ప్రభావం ప్రష్యా వెలుపల ఏమి లేకపోయినప్పటికీ చరిత్రకారుల జీవితంపై గొప్ప ప్రభావాన్ని ప్రదర్శించింది.

రాంకె రచనలన్నింటిలోకి ప్రసిద్ధి పొందినది 'హిస్టరీ ఆఫ్ ది పోప్స్' (History of the Popes). ఇది చారిత్రక పరిశోధనలో తలమానికమైనదేకాక ఒక కళాఖండం కూడా. ఈ గ్రంథం యొక్క తొలి సంపుటి 1834 లో, రెండు, మూడు సంపుటాలు 1836 లో ముద్రించబడింది. ఐరోపా అభివృద్ధిలో, మార్పులో పోప్ అధికార వ్యవస్థ కీలక పాత్ర వహించినదని ఇందులో రాంకె చాటాడు. ఈ గ్రంథంలో అతడు అపారమైన సమాచారాన్ని పొందుపరచడమేగాక, దానిని నిష్పాక్షికంగా వివరించాడు. ఐరోపా నాగరికత ఏకతకు మధ్య యుగాలలో పోప్ అధికారం ఏ విధంగా దోహదం చేసింది, పోప్ అధికార రాజ్యాలలోని అంతరంగిక జీవితం, పరిపాలన, ఆర్థికం, కళాపోషణ గురించి, 17వ శతాబ్దిలో పోప్ అధికార ప్రాభవం ఏలా క్షీణించింది ఈ గ్రంథంలో అతడు తెలియజేశాడు.

రాంకె తరువాత 'జర్మన్ హిస్టరీ ఇన్ ది టైమ్ ఆఫ్ ది రిఫర్మేషన్' అను గ్రంథాన్ని వెలువరించాడు. ఈ గ్రంథం పూర్తిగా ఆర్కైవ్స్‌లో భద్రపరచిన సాక్ష్య పత్రాల ఆధారంగా రూపొందింది. సాంస్కృతిక పునరుజ్జీవనం కాలంలో జర్మనీ గురించి, ఐరోపా రాజకీయ చరిత్ర గురించి, 15, 16 శతాబ్దాల నాటి ప్రజాజీవనం గురించిన వివరణ ఈ గ్రంథంలో గలదు. ఈ గ్రంథం ఐరోపాలో ప్రజాదరణ పొందనప్పటికీ, ఇది ఒక అద్భుత గ్రంథం అని ట్రాట్స్కీ వర్ణించాడు.

1847 - 48లో రాంకె ప్రష్యా చరిత్రకు సంబంధించి 9 పుస్తకాలు ముద్రించాడు. ఇందులో అతడు ప్రష్యా ఏ విధంగా బలమైన రాజ్యంగా రూపొందినదో వివరించడమేగాక మొదటి ఫ్రెడరిక్ విలియం గురించి వివరించాడు. రాజ్య పత్రాల ఆధారంగా రూపొందిన తొలి గ్రంథం ఇది. తరువాత 20 సంవత్సరాల కాలం రాంకె ఫ్రాన్స్, ఇంగ్లాడ్ చరిత్రలు వ్రాయడానికి పూనుకొన్నాడు. ఫ్రాన్స్ దేశ చరిత్ర రచనలో అతడు ఫ్రాన్స్ ఆర్కైవ్స్‌నే గాక ఇటలీ, జర్మనీ, బెల్జియం, ఇంగ్లండ్, స్పెయిన్ దేశాలలోని ఆధారాలను గ్రహించాడు. ఈతని ఫ్రాన్స్ చరిత్ర ఫ్రాన్స్‌లో మంచి ఆదరణ పొందింది. అలాగే రాంకె ఇంగ్లీష్ వారి చరిత్రను నిర్మించాడు. ఈ క్రమంలో అతడు లండన్ ఆర్కైవ్స్‌ను, డబ్లిక్, పారిస్, హేగ్‌లలోని ఆధారాలను పరిశీలించాడు. ఇందులో ఇంగ్లీష్ వారి తొలి చరిత్ర మూడవ జార్జి వరకు క్లుప్తంగా వివరించి తరువాత, వివిధ రాజుల ఘనకార్యాలు, 17వ శతాబ్ది నాటి రెండు విప్లవాల గురించి

తెలియజేశాడు. ఇంగ్లండ్‌కు ఇతర ప్రపంచాధిపత్య రాజ్యాలకు గల సంబంధాలు, ఈ సంబంధాలు ఏ రకంగా ఇంగ్లండ్ అంతరంగిక జీవితాన్ని ప్రభావితం చేసింది అను విషయాల గురించి తెలియజేయడం ఈ గ్రంథం యొక్క ప్రత్యేకత.

నలభై సంవత్సరాల నిరంతర కృషి వల్ల రాంకె ప్రముఖ ఐరోపా రాజ్యాల చరిత్రలను పూర్తి చేయగలిగాడు. ఆ తరువాత అతడు అనేక చారిత్రక 'మోనో గ్రాఫ్స్'ను రచించడమే గాక, తొలి గ్రంథాలను కొన్నింటిని మార్పు చేశాడు. వీటిలో ముఖ్యమైనవి 'కంట్రిబ్యూషన్స్ టూ జర్మనీ హిస్టరీ', 'హిస్టరీ ఆఫ్ వాల్లెన్స్ స్టీన్', 'ది సెవన్ ఇయర్స్ వార్', 'ది ఆరిజిన్ ఆఫ్ ది వార్స్ ఆఫ్ రెవల్యూషన్' మొదలగునవి. తన 82వ యేట రాంకె 'హర్డన్ బెర్గ్' (Harden berg)పై ఒక పెద్ద గ్రంథం రచించాడు. నెపోలియన్ యుగపు చరిత్రకు ఇది అమూల్యం.

రాంకె చిట్టచివరి బృహత్తర గ్రంథం 'ది హిస్టరీ ఆఫ్ ది వరల్డ్' (The History of the World). ఇది మొత్తం 9 సంపుటాల రచన. ఇందులో ఏడు సంపుటాలు రాంకె రచించినా చివరి రెండు సంపుటాల రచన అతని మరణానంతరం అతని అనుయాయులు పూర్తి చేశారు. ఇంచుమించు 90 యేళ్ళ వయస్సులో, చదవడం, వ్రాయడం అసాధ్యమైన ఆ అవసానదశలో రాంకె ప్రపంచ చరిత్రపై ఎంతో సాహసోపేతంగా రచన చేపట్టడం, చేపట్టిన కార్యాన్ని సాధించడం నిజంగా అత్యద్భుతమే.

చరిత్ర గతిలో ప్రాబల్యం వహించే శక్తులు అగ్రరాజ్యాల జాతీయ, రాజకీయ వ్యక్తిత్వంలో ప్రతిబింబిస్తాయని ఇందులో ప్రతి ఒక్కటీ భగవదేచ్ఛను వాస్తవ రూపంలోకి తెచ్చేదేనని రాంకె నమ్మాడు. అందువల్లనే అతడు రోమనో - జర్మానిక్ ప్రపంచం గురించి అధ్యయనం చేశాడు. అయితే ఇందులో విశ్వజనీనమైన అంశాలకే ప్రాధాన్యమిచ్చాడు. అతని 'ప్రపంచ చరిత్ర'లో మానవ నాగరికతకు సంబంధించిన సమగ్ర చిత్రాన్నివ్వడానికే ప్రయత్నించాడు. కాని రాంకె చారిత్రక రచనలు అన్నింటిలో రాజకీయ పరిణామాలకే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వబడింది. సాంస్కృతిక, ఆర్థిక విశేషాలు నేపథ్యంలోనే ఉండిపోయాయి.

రాజకీయంగా జెన్ట్జ్ ప్రభావానికి లోనైన రాంకె సాంప్రదాయవాది. జాతీయ రాజ్యమనే భావన మీద అతని భావాలు ఆధారపడ్డాయి. క్రియాశీలక రాజకీయాలలో రెండే రెండుసార్లు పాల్గొన్నారు. 1830, 1848 ఫ్రెంచి విప్లవాలు జర్మన్ రాజ్యాలలోను పరిణామాలను సృష్టించినపుడు విప్లవ శక్తులకు వ్యతిరేకంగానే నిలిచాడు. జర్మన్ యువకులు అతనిని ప్రగతి నిరోధకుడిగా భావించారు. దీని కారణంగానే 1850 - 80 మధ్య కాలంలో అతని శాస్త్రీయ దృక్పథం ప్రభావాన్ని అణచివేశారు. అయితే ఆ తరువాత శాస్త్రీయ చరిత్రకారులకు ఒక నమూనాగా అటు జర్మనీలోను, ఇటు బయట ప్రపంచంలోనూ పేరు ప్రతిష్ఠలు సంపాదించాడు.

తన ధ్యేయం విషయగతమైన పరిశోధనే అని రాంకె ప్రకటించినా మార్టిన్ లూథర్, హోహెన్ జోలెర్న్ రాజ కుటుంబం, ప్రష్యా విషయాల కొచ్చే సరికి అతని విషయ నిష్ఠత పరిమితమై పోయింది. ఆ విషయాలలో అతడు తన అభిమానాన్ని, పాక్షికతను చాటకుండా ఉండలేక పోయాడు. రాంకె రచనల్లో తాత్త్వికత లోపించిందనీ, అవి పక్షపాత ధోరణిలో సాగాయని, అతని దృష్టిలో చరిత్ర మొత్తం భగవంతుని కల్పితమని థామ్సన్ విమర్శించాడు. రాంకె యదార్థాల ఆధారంతో విషయ వివరణకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటంతో ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో అన్న విశ్లేషణ లేకుండా పోయింది. ఫలితంగా చరిత్ర క్రమబద్ధమైన సంఘటనల జాబితా అవుతుంది కాని చరిత్ర కాదు. అందుకే అతని రచనల్లో తాత్త్విక వివరణ లోపించింది.

రాంకె గొప్ప రచయిత అయినప్పటికి, దౌత్య రాజ్యపత్రాల ఆధారంగా 55 సంపుటాలు, చరిత్రకు సంబంధించి వ్రాసినప్పటికీ అందులో కన్పించేది రాజవంశాలు, యుద్ధాలు, సంధులే గాని. రాజ్యాల, దేశాల గురించి, మతం, సంస్కృతి మొదలగు విషయాల గురించి ప్రత్యేక శ్రద్ధ చూపలేదు. 19వ శతాబ్ది అందించిన చరిత్రకారులలో రాంకె ఒక పక్షపాత వాదని బియర్డ్ (Beard) పండితుడంటాడు. రాంకె తన రచనల్లో సామాన్య ప్రజల గురించి నిర్లక్ష్యం చేశాడు. దౌత్యపరమైన ఆధారాలనే ఉపయోగించడం, రాజకీయ పరమైన ధోరణినే అవలంభించడం వాస్తవ చరిత్రకాదు. తన యుగపు ప్రజలను తప్పుదారి పట్టించాడు అని థామ్సన్ అంటాడు.

చరిత్ర పట్ల రాంకె అనుసరించిన పద్ధతిలో అనేక లోపాలు ఉన్నప్పటికీ, చరిత్రకు అతడు చేసిన సేవ తక్కువేమి కాదు. చరిత్ర రచనా విధానంలో నెబూర్ అనుసరించిన విమర్శనాత్మక ధోరణిని రాంకె అనుసరించాడు. సమకాలిక ఆధారాలకే రాంకె ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాడు. 'ఆర్కైవ్స్'ను పూర్తిగా తొలిసారిగా ఉపయోగించింది ఇతడే. తను బెర్లిన్‌లో ప్రవేశపెట్టిన సెమినార్ పద్ధతిలో పరిశోధనా పద్ధతులను ప్రవేశపెట్టాడు. ఈ పద్ధతినే ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా లాంటి దేశాలు అనుసరించి చరిత్ర పీఠాలు అనేకం నెలకొల్పాయి. అంతేగాక చరిత్ర పరిశోధనకు గాను తొలి చారిత్రక జర్నల్‌ను రాంకె ప్రారంభించాడు. అంతేగాక చరిత్ర రచనలో రచయితల మనస్తత్వం, వారి సంబంధాలు మొదలగు విషయాలు గ్రహించి పరిశోధన గావించాలని చాటాడు. విషయగతంగా ఉండటం సాధ్యం కాదనే వాదన తీసుకురావద్దు. ఇది తెలిసిన విషయమే. కాని విషయగతంగా ఉండటానికి మరింత ప్రయత్నించు అని రాంకె చరిత్రకారులకు ఇచ్చిన పిలుపు అవాస్తవికమైనది కాదు. విమర్శనాత్మక కౌశలం, పరిశ్రమ, పట్టువిడవని పరిశోధనల ద్వారా రాంకె ఒక కొత్త, మరింత సంస్కరించబడిన చరిత్ర రచనా పద్ధతిని సృష్టించి అజరామరుడయ్యాడని ఆర్థర్ మార్విక్ తన 'ది నేచర్ ఆఫ్ హిస్టరీ' అను గ్రంథంలో పేర్కొన్నాడు.

జర్మన్ చరిత్రకారుడైన రాంకె అంతకు పూర్వమున్న చరిత్ర గురించిన భావనపై తిరుగుబాటు చేసి ఖచ్చితంగా ఏమి జరిగిందో చెప్పటం మాత్రమే చరిత్రకారుని కర్తవ్యం అని పేర్కొంటూ చరిత్రలో ఖచ్చితత్వం, ప్రామాణికతలు తప్పనిసరియని ప్రథమంగా చరిత్రను విజ్ఞానశాస్త్రంగా భావించాడు. అందువల్లనే రాంకెను 'ఆధునిక చరిత్రకు ఇంచుమించు కొలంబస్' అని లార్డ్ ఆక్టన్ పిలుచుటలో అసత్యం లేదు.

## 12.4 రాంకె మార్గదర్శకత్వం :

90 సంవత్సరాల (1795 - 1885) సుదీర్ఘ జీవితం గడిపిన రాంకె, అతని జీవిత కాలంలో సుప్రసిద్ధ చరిత్రకారునిగా గుర్తింపు పొందాడు. అంతేగాక అతని విద్యార్థుల్లో అత్యధికులు జర్మనీలో వివిధ పీఠాలను (Chairs) అలంకరించారు. వాస్తవానికి అతని విద్యార్థులు అత్యధికులు కావడం వలన వారి అందరి పేర్లు తెలియజేయడం సాధ్యం కాదు. కాని వారిలో వెయిట్జ్ (Waitz), గిసిబ్రెక్ట్ (Giesebrecht), కోప్కె (Kopke), విల్‌మన్స్ (Wilmans), కార్ల్ (Karl), నిట్ష్కే (Nitzsch), సీగ్‌ఫ్రిడ్ (Siegfrid), హిర్క్ (Hirch), జాఫీ(Jaffe), సిబెల్ (Sybel), డ్రోయిజన్ (Drysen), స్కిమ్డ్ట్ (Schmidt), జాకబ్ బర్క్‌హార్డ్ (Jacob Burckhardt), రుడాల్ఫ్ గ్నీస్ట్ (Rudolf Gneist), రుడాల్ఫ్ డెల్ బ్రెక్ (Rudolf Delbreck), రోస్కెర్ (Roscher), కార్లసన్ (Carlson) ముఖ్యులు. వీరిలో పెక్కుమంది బెర్లిన్‌లోని సెమినార్ విద్యార్థులు. వీరిలో సిబెల్, డ్రోయిజన్, డన్‌కెర్ మినహా మిగతా వారందరూ రాంకెకు విశ్వాసపాత్రులుగా వున్నారు. తన విద్యార్థులను చూసి రాంకె గర్వించేవాడు. వెయిట్జ్, సిబెల్‌లు తనకు ఘనతను తెచ్చిపెట్టారని కీర్తించేవాడు.

మూలాధారాల అధ్యయన విషయంలో రాంకె నవీన చారిత్రక పద్ధతి ముందుగా జర్మనీలోనే తక్షణ ప్రభావం చూపించింది. రాంకె ప్రత్యర్థి అయినప్పటికీ డ్రోయిజన్ దౌత్య చరిత్ర రచనలో అతని మార్గాన్నే అనుసరించాడు. ముల్లెర్ (Muller) శిష్యుడైన విల్‌హెల్మ్ వాటెన్‌బక్ (Wilhelm wattenbach) బెర్లిన్‌కు వచ్చిన తరువాత రాంకెచే ఆకర్షితుడై చరిత్ర అధ్యయనం ప్రారంభించాడు. తరువాత బెర్లిన్ విశ్వవిద్యాలయ అధ్యాపకుడుగా దౌత్య చరిత్ర, లిపి అధ్యయన శాస్త్రంపై ఉపన్యాసాలిచ్చాడు. ష్లెస్ విగ్ - హోల్‌స్టీన్ సరిహద్దు ప్రాంతానికి చెందిన జార్జి వెయిట్జ్ (George Waitz) న్యాయశాస్త్రం అభ్యసించడానికి బెర్లిన్ వచ్చి రాంకె సెమినార్ చే ఆకర్షితుడైనాడు. మొదటి హెన్రీపై, వ్యాసరచన పోటీలో పాల్గొని మొదటి బహుమతి పొందాడు. తరువాత ఈ వ్యాసాన్ని విస్తృత పరచి 'ఇయర్ బుక్స్ ఆఫ్ హెన్రీ I' (Year Books of Henry I ) అనే పేరుతో పుస్తకం ప్రచురించాడు. కీల్ (Kiel)లో చరిత్ర ఆచార్యుడుగా మధ్యయుగ జర్మన్ చరిత్ర రచనపై ఉపన్యాసాలిచ్చాడు. జర్మన్ రాజ్యాంగ చరిత్రను వ్రాయడం ప్రారంభించి తొలి సంపుటాన్ని తన గురువైన రాంకెకు అంకితం చేశాడు. ఇందులో తొలి జర్మన్ సంస్థలు, సాంప్రదాయాలు పొందుపరచడమైనది. మెరొవిన్‌జియన్ (Merovingian) సంస్థల గురించి రెండో సంపుటంలో, మూడు, నాల్గు సంపుటాలలో కరొలిన్‌జియన్

(Carolingian)యుగాన్ని గురించి, తరువాత నాల్గు సంపుటాలలో సాక్షన్ (Saxon), ఫ్రాంకోనియన్ (Franconian) వంశాల గురించి వివరించాడు. తరువాత వెయిట్జ్, గొటిన్ జెన్ (Gottingen)లో ఒక పాఠశాలను ప్రారంభించాడు. ఇది జర్మనీలో మధ్యయుగ చారిత్రక పరిశోధనలకు ప్రధాన కేంద్రమయింది. రాంకె పద్ధతిలో ఇతడు సెమినార్‌ను నిర్వహించాడు. ఈ తొలి సెమినార్ జర్మన్ విద్యార్థులనేగాక ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ దేశాల వారిని ఆకర్షించింది. హిస్టారికల్ కమీషన్ స్థాపనలో, హన్స (Hansa) హిస్టారికల్ సొసైటీకి సహాయమందించడంలో ఇతడు ప్రముఖపాత్ర నిర్వహించాడు.

రాంకె విద్యార్థులలో ప్రముఖుడైన విల్‌హెల్మ్ వాన్ గీసి బ్రెక్ట్ (Wilhelm Van Giese Brecht) ప్రపంచ ప్రఖ్యాతి గడించాడు. రాంకె సెమినార్‌లో పాల్గొన్న తరువాత ఇతడు బెర్లిన్‌లో బోధన చేశాడు. అనల్స్ అల్లాహెన్సస్ (Annales Allahenses) అను గ్రంథాన్ని వ్రాసి పేరు గడించాడు. ఇతడు ఆస్ట్రియా, ఇటలీలలో మధ్యయుగ ఐరోపాకు సంబంధించి ఆధారాలు సేకరించాడు. 20 సంవత్సరాల అధ్యయనం తరువాత 'ది హిస్టరీ ఆఫ్ ది జర్మన్ ఇంపీరియల్ ఇరా' అను గ్రంథాన్ని ప్రచురించాడు. రాంకె విద్యార్థులలో మరొకరైన సిబెల్ (Sybel) అనతి కాలానికే తన గురువుని వీడి ప్రష్యా స్కూల్ ఆఫ్ హిస్టరీకి మార్గదర్శకుడయ్యాడు. ఇతడు పాఠశాల స్థాయిలో నెబూర్ రచించిన రోమన్ చరిత్రకు ఆకర్షితుడైనాడు. ఆ తరువాత రాంకె యొక్క సెమినార్‌లో పాల్గొన్నాడు. 'హిస్టరీ ఆఫ్ ది ఫస్ట్ క్రూసేడ్' (History of the first crusade) అను గ్రంథాన్ని ఇతడు రచించాడు. ఇతడు బాన్, మర్‌బర్గ్, మూనిచ్‌లలో ఆచార్యుడుగా పనిచేసి ప్రష్యా ప్రభుత్వంచే 'ఆర్కివ్స్' డైరెక్టర్‌గా నియమితుడయ్యాడు. 'ది ఫౌండింగ్ ఆఫ్ ది జర్మన్ ఎంపైర్ బై విలియం I' (The Founding of the German Empire by William I) అనే గొప్ప గ్రంథాన్ని ఇతడు ఏడు సంపుటాలలో ప్రచురించాడు.

చరిత్ర రచనలో రాంకె మార్గదర్శకత్వాన్ని ఫ్రాన్స్‌లో 1870 వరకు పూర్తిగా అనుసరించడం జరుగలేదు. ఆ యుద్ధంలో ఫ్రాన్స్ అపజయాన్ని ఎదుర్కోవడంలో ఆ దేశ చరిత్రకారుడు కొలాంజెస్ (Coulanges) తమ దేశం గురించి దృష్టి కేంద్రీకరించాలని ఫ్రెంచి చరిత్రకారులను కోరాడు. ఫ్రెంచి జాతీయతావాదానికి మూలం మధ్యయుగారంభంలో ఉన్నట్లు ఇతడు తన 'హిస్టరీ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఏన్సియంట్ ఫ్రాన్స్' (History of the Institutions of ancient France) అనే గ్రంథంలో పేర్కొన్నాడు. అయితే విమర్శనాత్మక పద్ధతి చేర్పుతో ఫ్రెంచి చరిత్ర రచన సమగ్రంగా రూపొందించడం అనేది గేబ్రియల్ మోనాడ్ (Gabriel Monod) ప్రారంభించిన 'రివ్యూ హిస్టారిక్' (Revue Historique) అనే చారిత్రక పత్రిక సాధించింది. బ్రిటన్‌లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం చరిత్రకారుడు విలియం స్టబ్స్ (William Stubbs) తన 'కాన్‌స్టిట్యూషనల్ హిస్టరీ ఆఫ్ ఇంగ్లాండ్' గ్రంథం ద్వారా మధ్యయుగ ఇంగ్లీషు చరిత్ర ఆధారాల విమర్శనాత్మక అధ్యయానికి ప్రేరేపణ కలిగించాడు. మైట్‌లాండ్ న్యాయచరిత్ర అధ్యయనంలో ముఖ్యంగా ఆధారాల విషయంలో విమర్శనాత్మక పద్ధతులు అవలంబించాడు.

## 12.5 సంక్షిప్తంగా :

రాంకెతో ఆధునిక యుగంలో విమర్శనాత్మక చరిత్ర రచనా విధానంలో ఒక నూతన శకం ఆరంభమైంది. ప్రాచీన చరిత్రకు నెబూర్ అనుసరించిన పద్ధతిని ఇతడు ఆధునిక యుగానికి వర్తింపజేశాడు. సంఘటనకు అతి దగ్గర సాక్ష్యం మంచి ఆధారమని ఇతడు వక్కాణించాడు. చరిత్ర రచన చేసేటప్పుడు ఆధార పత్రాలను ఎవరు తయారు చేశారు, వారి మనస్తత్వం, ఎచట నుంచి సేకరించారు నిర్ధారించడం అవసరమని చాటాడు. ఈ సిద్ధాంతాలను ప్రయోగించి అప్పటి వరకు ప్రధాన ఆధారాలనుకున్న వాటిలో వాస్తవం లేదని తేల్చి చెప్పాడు. ఇతని సెమినార్ పద్ధతి ఇతనికి మంచి పేరు తెచ్చి పెట్టింది. అయితే ఇతని చారిత్రక రచనలన్నింటిలో రాజకీయ పరిణామాలకే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వబడింది. ప్రతి ఒక్కటి భగవదేచ్ఛను వాస్తవ రూపంలోకి తెచ్చేదేనని రాంకె నమ్మాడు. ఇతడు జ్ఞానవికాస యుగపు ఉపయోగితావాద చరిత్రను నిర్ద్వందంగా వ్యతిరేకించాడు. నీతులు చెప్పే చారిత్రక పద్ధతి మీద తిరుగుబాటు చేశాడు. ఈతని సిద్ధాంతాల ప్రభావం 19వ శతాబ్దపు ఐరోపాపై గొప్పగా ప్రసరించింది.

## 12.6 నమూనా ప్రశ్నలు :

1. చరిత్ర రచనకు లియోపోల్డ్ వాన్ రాంకె చేసిన కృషి వివరింపుము.
2. లియో పోల్డ్ వాన్ రాంకెను "ఆధునిక చరిత్రకు ఇంచుమించు కొలంబస్" అని ఆక్టన్ పిలుచుట నీ దృష్టిలో సరియేనా?
3. ఒక శాస్త్రీయ చరిత్రకారునిగా రాంకెను ఎంత వరకు పరిగణించవచ్చునో పరీక్షింపుము.

## 12.7 ఉపయుక్త గ్రంథాలు :


1 Gooch G.P. : History and Historians in the Ninteenth Century, (London, 1955)

2. Marwick Arthur : The Nature of History (London, 1970)

3. Thomson, J.W. : History of Historical Writing (2vols) (New Yark, 1958)

4. Pleter Gayl : From Ranke to Toyn Bee (Smith college Press, 1952)

5. Subrahmanyam. N : Historiography (Madurai 1986)



పాఠ్య రచయిత :

డాక్టర్ వి.కె. మోహన్

**పాఠం 13**

# కార్ల్‌మార్క్స్

## 13.0 లక్ష్యం :

ఈ పాఠం చదవడం వల్ల మీరు

* మార్క్స్ వాదానికి ప్రాతిపదిక ఏమిటో వివరించగలగాలి.
* కార్ల్‌మార్క్స్ చారిత్రక భౌతిక వాదాన్ని, దానిపై వచ్చిన విమర్శలను, వ్యాఖ్యానాలను విశ్లేషించగలగాలి.
* ఆధునిక యుగంలో చరిత్ర పరిజ్ఞానాన్ని, చారిత్రక రచనలను మార్క్స్‌వాదం ఏ విధంగా ప్రభావితం చేసిందో వివరించగలగాలి.

విషయసూచిక

13.1 పరిచయం
13.2 నేపథ్యం
13.3 కార్ల్‌మార్క్స్
13.4 మార్క్స్ రచనలు
13.5 మార్క్సీయ చరిత్రావాదం
13.5.1 గతి తార్కిక, చారిత్రక భౌతికవాదం
13.5.2 వర్గపోరాటం - సమాజ పరిణామం
13.5.3 కమ్యూనిస్ట్ సమాజం
13.6 విమర్శ
13.7 మార్క్స్‌వాద ప్రభావం
13.8 సంక్షిప్తంగా
13.9 నమూనా ప్రశ్నలు
13.10 ఉపయుక్త గ్రంథాలు

## 13.1 పరిచయం :

మనిషినీ, పరిసరాలను లోతుగా పరిశీలించి విశదీకరించడం, శాస్త్రాల ధ్యేయం. దీనివల్ల పరిసరాలను అర్థం చేసుకోవడమేకాక వాటిపై అదుపు, వాటిని మార్చగల సామర్థ్యం సంపాదించవచ్చు. చరిత్రదీ యిదే లక్ష్యం. చరిత్ర సంస్కృతి వికాసానికి దోహదం చేసే నాగరికతా పరిణామాన్ని విశదీకరించేదే సాంఘిక శాస్త్రం. చరిత్రకారుడు వర్తమాన నాగరికతా ధోరణులను విశదీకరిస్తాడు. చరిత్ర ఒక సాంఘిక ప్రవంతి. ఈ ప్రవంతిలో గతాన్ని వర్తమానం సహాయంతోను, వర్తమానాన్ని గతం సహాయంతోను అర్థం చేసుకోవడం జరుగుతుంది. అయితే యీ ప్రక్రియలో భవిష్యత్తుకీ పాత్ర వుంది. భవిష్యత్తు ఆవిర్భావం గురించి చరిత్రకారుడికి ఎటువంటి భావన వుందో దాని ఆధారంగా అతడు గతాన్ని విలువ కడతాడు, వ్యాఖ్యానిస్తాడు. కనుకనే నెవాయర్ 'చరిత్రకారులు గతాన్ని ఊహిస్తారు, భవిష్యత్తును జ్ఞాపకం వుంచుకుంటారు, అన్నాడు. చరిత్ర 'గతకాలపు సంఘటనలకు, క్రమక్రమంగా రూపొందే భవిష్యత్ లక్ష్యాలకు

మధ్య జరిగే సంభాషణ కూడా' అని కార్ చెప్పినదీ యీ ఉద్దేశ్యంతోనే. అయితే చరిత్ర గమనాన్ని నిర్దేశిస్తున్న శక్తులు ఏవి ? చరిత్ర పరిణామాన్ని, అంతరార్థాన్ని లేదా మర్మాన్ని ఎలా అర్థం చేసుకోవాలి ? అనే ప్రశ్నలను భిన్న కోణాల నుండి పరిశీలించిన తత్వవేత్తలు, చరిత్రకారులు తమ కుల, జాతి, మత ఆలోచనా ధోరణుల్ని ప్రభావితం చేసిన విభిన్న దృక్పథాల దృష్ట్యా చరిత్ర స్వభావాన్ని, తత్వాన్ని, లక్ష్యాన్ని వివరించారు, వ్యాఖ్యానించారు. అటువంటి వ్యాఖ్యానాల్లో కార్ల్ మార్క్స్ చారిత్రక భౌతిక వాద వ్యాఖ్యానం ఈనాడు ప్రపంచం మొత్తంలో అధిక సంఖ్యాకుల్ని ప్రభావితం చేసిన చింతనా ధోరణి యిది.

## 13.2 నేపథ్యం :

ఐరోపాలో 18వ శతాబ్దంలో చరిత్ర తత్వాన్ని, చరిత్ర స్వభావాన్ని ప్రభావితం చేసిన జర్మను భావవాదానికి ఇమాన్యుయల్ కాంట్, ఫిక్టె, హెగెల్‌లు ప్రతినిధులు. వీళ్ళల్లో తత్వ శాస్త్రాన్ని పూర్తిగా ఆధునిక పద్ధతుల్లో నిర్మించినవాడు హెగెల్. చరిత్రతత్వాన్ని తన **'Lectures on the Philosophy of History'** అనే గ్రంథంతో విశ్లేషించాడు. అతడు చారిత్రక ప్రక్రియను తర్కంతో గుర్తించాడు. అతని దృష్టిలో తర్కం అనేది ఒక చారిత్రక గమనం. చరిత్ర తత్వం చిదాత్మ (spirit) తత్వంలో ఒక భాగం. ప్రపంచ చరిత్ర హేతుబద్ధంగా వ్యక్తమవుతుందని అతడు వివరించాడు. అతని దృష్టిలో వివేచనాత్మకమైనది వాస్తవికం, వాస్తవికమైనది వివేచనాత్మకం. అతనికి వాస్తవికత అంటే చిదాత్మ. హేతువు పని చేసే తీరుని కనుక్కోవడమే చరిత్రకారునికి ముఖ్యమైన విషయమని హెగెల్ భావించాడు. చరిత్రకారులు ఆకర్షణీయంగా ఆయా సంఘటనలను వివరించడమే గాక మొత్తం చారిత్రక ప్రక్రియ వెనుక వున్న హేతువునీ వివరించాలి.... హేతువు ద్వారా అన్నీ తెలుస్తాయి.... ప్రపంచాన్ని పాలిస్తున్నది హేతువే కాబట్టి ప్రపంచ చరిత్ర ఒక వివేచనాత్మక ప్రక్రియ అని హెగెల్ తన అభిప్రాయాలను వెలిబుచ్చాడు. హెగెల్ తత్వాన్ని 'హేతువాదం' అని ఒక మాటలో చెప్పవచ్చు.

హెగెల్ జాతికి ఎక్కువ ప్రాధాన్యమిస్తూ చరిత్రను గతి తార్కిక పద్ధతిలో వ్యాఖ్యానించాలన్నాడు. ప్రపంచంలో చిదాత్మ ఏ విధంగా పురోగమిస్తుందో గతితార్కికం వివరిస్తుందని అతడి నమ్మకం. ఏ విషయంలోనైనా చిదాత్మ లేదా హేతువు గమ్యాన్ని చేరినప్పుడు దానిలో కన్పించేవి, కన్పించనివి కూడా వుంటాయి. ఈ రెండింటిని అర్థం చేసుకుంటేనే ఏ విషయమైనా పూర్తిగా తెలుస్తుంది. అంటే యదార్థమైనది, దానికి వ్యతిరకమైనది - యీ రెండింటినీ సమన్వయిస్తే వాస్తవం ఏమిటో నిర్ధారణ అవుతుందని హెగెల్ అభిప్రాయం. అతడు దీన్నే వాద ప్రతివాద సంఘర్షణ అన్నాడు. సంఘర్షణ ఫలితంగా సమన్వయం రూపుదాలుస్తుంది. ఇది మళ్ళీ కొత్త వాద ప్రతివాదాలకు దారితీస్తుంది. భావంలో పరిపూర్ణత వచ్చే వరకు యిలా మార్పులు జరుగుతుంటాయని అతడు వివరించాడు. చిదాత్మ పురోగమనమే మానవ జాతి చరిత్ర అని, గతి తర్కంతో దాన్ని తెలుసుకోవచ్చనీ అతడు నిర్ధారణకు వచ్చాడు. అతడు రూపొందించిన యీ తత్వ విచారం లేదా యీ గతి తార్కిక పద్ధతే మార్క్స్ వాదానికి ప్రాతిపదిక అయింది.

## 13.3 కార్ల్ మార్క్స్ :

ప్రష్యాలో అంతర్భాగమైన రైన్‌లాండ్‌లోని ట్రయర్‌లో 1818 లో మే 5వ తేదీన జర్మను యూదు కుటుంబంలో జన్మించిన కార్ల్‌మార్క్స్ బాన్, బెర్లిన్‌లలో ప్రాథమిక విద్యను పూర్తిచేశాడు. ఇతని చిన్నతనంలోనే మొత్తం కుటుంబం ప్రొటెస్టాంట్ మతాన్ని తీసుకుంది. చిన్నప్పటి నుండే వయస్సుకు మించిన బుద్ధి సూక్ష్మతను ప్రదర్శించిన మార్క్స్‌ను వృత్తిరీత్యా లాయరైన తండ్రి యితణ్ణి 'పిశాచ మేధవి'గా వర్ణించాడు. మొదటి నుండీ కవిత్వం, తత్వ శాస్త్రాలంటే యితనికి మోజు. ఇంగ్లండ్‌లో చదువుతున్నప్పుడు చరిత్ర, తత్వ శాస్త్రాలపై మరింత యిష్టం పెరిగింది. 1841 లో జేనా యూనివర్శిటీ నుండి తత్వ శాస్త్రంలో పి.హెచ్.డి పట్టా తీసుకున్నాడు. ఆ తరువాత సంవత్సరమే ఒక పత్రికా సంపదాకుడుగా వృత్తి చేపట్టాడు. అస్తుబిస్తు సంపాదన సరిపోలేదు. దీనితో మిత్రుడు ఎంజెల్స్ పై ఆధారపడ్డాడు. 1843 నుండి జర్మనీని వదలి మధ్యలో కొద్ది మాసాలు మినహా మార్క్స్ జీవితమంతా ప్రవాసంలో విదేశాల్లోనే గడిచింది. చివర్లో లండన్‌లో స్థిరపడ్డాడు.

## 13.4 మార్క్స్ రచనలు :

1843 - 45ల మధ్య ప్రూధన్ రచనలను చదివి సామాజిక వాదిగా మారిన మార్క్స్ ప్రూధన్ రాసిన 'Philosophy of Poverty'కి సమాధానంగా 1847లో 'Poverty of Philosophy'ని రాశాడు. దీన్లోనే యితడు చరిత్రకు తన ఆర్థికపరమైన వ్యాఖ్యానానికి సంబంధించి మూలప్రతిపాదన చేసాడు. అనంతరం 1848 లో ఎంజెల్స్‌తో కలసి తన మొత్తం సామాజిక తత్వాన్ని గురించి క్లుప్తంగా తెలిపే ప్రసిద్ధ 'Communist Manifesto' అనే నివేదికను వెలువరించాడు. ఆ తరువాత 'The Class Struggles in France From 1848 to 1850', 'The French Civil War', 'The Eighteenth Brudmaire of Louis Napolean Bonaparte', 'Critique of the Gotha Programme' అనే రచనలు ప్రచురించాడు. ఇక యితడి ప్రసిద్ధ గ్రంథం 'Das Capital' మొదటి సంపుటం 1867లో వెలువడింది. మిగిలిన రెండు సంపుటాలను ఎంజెల్స్ పూర్తి చేసి 1895 లో ప్రచురించాడు. మార్క్స్ చరిత్రకిచ్చిన ఆర్థిక పరమైన వ్యాఖ్యానం 'Communist Manifesto', 'Das Capital' గ్రంథాల్లో చేసాడు.

## 13.5 మార్క్సీయ చరిత్రవాదం :

హెగెల్ భావవాదాన్ని నిరాకరించిన మార్క్స్, ఎంజెల్స్‌లు అతని గతితార్కిక భావానికి విప్లవాత్మక అర్థాన్నిచ్చి ఒక నూతన దర్శనాన్ని ఆవిష్కరించారు. ఆ దార్శనిక సిద్ధాంతాలను వీళ్ళు సమాజ పరిణామానికి అన్వయించి ఆర్థిక నియమ సూత్రాన్ని ప్రతిపాదించారు. విస్తృతమైన మానవాళి చరిత్రను, దానిలోని వివిధ పరిణామ దశల్ని కార్యకారణ సంబంధం ద్వారా మాత్రమే వివరించగలమని మార్క్స్ నమ్మకం. మార్క్స్ వాదంలో లేదా మార్క్సీయ చారిత్రక వాదంలో నాలుగు సిద్ధాంతాలు ప్రధానంగా కన్పిస్తున్నాయి. అవి 1) చారిత్రక భౌతిక వాదం, 2) రాజకీయ - ఆర్థిక వ్యవస్థ : విలువను గూర్చిన శ్రామిక సిద్ధాంతం, పెట్టుబడిదారీ వ్యవస్థా విశ్లేషణ, అధిక విలువ సిద్ధాంతం, వీటి నుండి వచ్చే పరిణామాలు - యీ వ్యవస్థలోని ప్రధానాంశాలు. 3) వర్గపోరాటం, విప్లవం, రాష్ట్రం - వీటిని గురించిన సిద్ధాంతం, 4) నైతిక వ్యవస్థ.

**13.5.1 గతి తార్కిక చారిత్రక భౌతిక వాదం :** మార్క్స్ వాదానికి ప్రాతిపదిక హెగెల్ ఉపయోగించిన గతితార్కిక పద్ధతి. గతి తార్కికం (dialetic) అంటే ద్వంద్వ తర్కం. దీనికి అర్థం లేదా నిర్వచనం 'వ్యతిరేకాల సంయోజన సిద్ధాంతం'. ఇదే పూర్వపు గ్రీకు భాషలో 'వాద ప్రతివాద విద్య' అని అర్థం. ఇదొక నిరంతర పరిణామ ప్రక్రియ. మార్క్స్ దృష్టిలో దీని గమ్యం వర్గరహిత సమాజం. గతి తార్కిక భౌతిక వాదాన్ని సామాజిక అభివృద్ధికి అన్వయించడమే చారిత్రక భౌతికవాద వ్యాఖ్యానం. మార్క్స్, ఎంజెల్స్‌లు ప్రతిపాదించిన ఆర్థిక నియతి సూత్రం ప్రకారం ఉత్పత్తి విధానం, ఆర్థిక స్థితిగతులు చరిత్ర పరిణామాన్ని నిర్దేశిస్తాయి. చరిత్రలో చోటు చేసుకున్న మార్పులన్నీ భౌతిక పరిస్థితుల కారణంగానే అని మార్క్స్ భావించాడు. దీన్నే గతి తార్కిక చారిత్రక భౌతిక వాదం (Dialectical Histerical Materialism) అని అతడు వివరించాడు.

**13.5.2 వర్గ పోరాటం - సమాజ పరిణామం :** కార్ల్‌మార్క్స్ దృష్టిలో సామాజిక పరిణామం సారాంశం వర్గ పోరాటమే. ఉత్పత్తి సాధనాలను తమ అధీనంలో వుంచుకొన్న వర్గం ఎప్పుడూ పాలకవర్గమే. రెండోది పాలితుల వర్గం. ఈ రెండు వర్గాల మధ్య సంఘర్షణ తప్పదు. ఎందుకంటే పాలకవర్గం చేతుల్లో పాలితులు ఎప్పుడూ దోపిడీకి గురవుతూనే వుంటారు. చరిత్ర మొదటి దశలో మనిషి జీవితం ప్రకృతి పైనే ఆధారపడి వుంది. స్వంత ఆస్థి అంటూ అప్పుడు లేదు. ప్రకృతిలో లభించే వాటిని వుమ్మడిగానే అనుభవించేవారు. ఆ తరువాత స్వంత ఆస్థి ఏర్పడటంతో బానిసయుగం ప్రారంభమయింది. బానిసయజమానులకు, బానిసలకు మధ్య వర్గ పోరాటం జరిగింది. అనంతరం వచ్చిన భూస్వామిక యుగంలో పాలకవర్గ భూస్వాములకు, దళిత వర్గ రైతులకు సంఘర్షణ జరిగింది. తర్వాత పెట్టుబడిదారీయుగంలో యంత్రం ప్రధాన ఉత్పత్తి సాధనమయింది. యంత్రాధిపతులు అంటే పెట్టుబడిదారులు అధికారాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుంటారు. కార్మికులకు కేవలం మనుగడకు సరిపోయేలా ఆదాయం పరిమితం చేసి అదనపు విలువను అంటే లాభాన్ని పెట్టుబడిదారుడు అపహరిస్తాడు. దీనితో రెండు వర్గాలకు సంఘర్షణ తప్పదని, శ్రామికులు జయిస్తారని, ముందుగా శ్రామిక నియంతృత్వం నెలకొంటుందని, తరువాత వర్గాలు అంతరించి దోపిడీ రహిత సమసమాజం వస్తుందని మార్క్స్

సిద్ధాంతీకరించాడు. లెనిన్ తన గ్రంథం 'State and Revolution'లో మార్క్స్ చెప్పిన పెట్టుబడిదారీ వ్యవస్థ, శ్రామిక నియంతృత్వం, సామ్యవాద సమాజం గురించి విపులంగా చర్చించాడు.

**13.5.3 కమ్యూనిస్టు సమాజం :** మార్క్స్ రాసిన 'Critique of the Gotha Programme' కమ్యూనిస్ట్ సమాజం రెండు దశల్లో రూపొందుతుందని వివరించింది. మొదటి దశలో ఫ్యాక్టరీలు, యంత్రాలు, భూములు వంటి ఉత్పత్తి సాధనాలు సమాజం ఆస్తి. సమాజపు పూర్తి శ్రమ ఫలితం నుండి ఒక నిధి సమకూరుతుంది. ఇది సమాజ నిధి. ఈ నిధి నుండి ఆస్పత్రులు, పాఠశాలలు, యితర నిర్మాణాలు వెలుస్తాయి. ఈ సమాజ నిధికి మొత్తాన్ని మినహాయించాక మిగిలిన దాంట్లో ప్రతి శ్రామికుడూ తాను సమాజానికి ఎంతిచ్చాడో దాని నుండీ అంతే ప్రతిఫలం అతనికి దక్కుతుంది. ఇది అతని శ్రమకు తగ్గ ప్రతిఫలం కాదు. శ్రమించని వాడికి తిండి తినే హక్కు లేదు. ఇది తప్పనిసరి దశ. ఈ దశలో రాజ్యం వుంటుంది.

ఇక రెండో దశలో 'సామర్ధ్యాన్ని బట్టి పని, అవసరాలకు తగ్గ ప్రతిఫలం' అనే, లక్ష్యం సిద్ధిస్తుంది. ప్రజలు పూర్తిగా శ్రమించి ఉత్పత్తిని పెంచినప్పుడు, సామరస్యంతో స్వచ్ఛందంగా పనిచేసినప్పుడు రాజ్యం అంతరిస్తుంది. ఇది పరివర్తన దశ. ఈ దశలో శ్రామిక నియంతృత్వం తప్పదు. సమాజంలో బల ప్రయోగంతో బూర్జువా శక్తులన్నింటినీ రూపుమాపాక రాజ్యం అంతరిస్తుంది. ఎటువంటి తరతమ బేధాలు లేని వర్గరహిత సమాజం అవతరిస్తుంది. ఈ సమాజంలో వైషమ్యాలు, పరపీడన కన్పించవు. ప్రజలందరూ పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగి, సామాజిక జీవన మౌలిక సూత్రాలను తమకు తాము స్వచ్ఛందంగా అనుసరిస్తూ సుఖ సంతోషాలతో జీవనం సాగిస్తారు. ఇదీ కార్ల్‌మార్క్స్ అందమైన ఊహా ప్రపంచం. శ్రామిక నియంతృత్వం ద్వారానే సామ్యవాద సమాజం, రాజ్యం అవసరంలేని వర్గాలు అంతరించిన, దోపిడీ లేనటువంటి సమగ్ర సమాజం సాధించటం వీలవుతుందని లెనిన్ కూడా నొక్కి చెప్పాడు.

## 13.6 విమర్శ :

ఆలోచనాశీలిగా, ప్రవక్తగా, శాస్త్రవేత్తగా, నీతివేత్తగా ప్రసిద్ధికెక్కిన మార్క్స్ సామ్యవాద చింతనలో తనదంటూ ముద్రవేసిన తత్వవేత్త అయినా అత్యంత వివాదాస్పదుడు కూడా. థమ్సన్ చారిత్రక దృష్టివిషయంలో వివరణకు మార్క్సిస్ట్ తత్వం సరిపోదని, తాము శాస్త్రీయంగా విషయాలను పరిశీలిస్తున్నామని మార్క్సిస్టులే చెప్పుకోవటం ప్రచారం తప్ప మరేదీ కాదని, తమ వివరణ విశ్వజనీనం అని నొక్కి చెప్పటం కూడా వాళ్ళ మనస్సులోని కోరికకు ప్రతిరూపం కల్పించడమేనని విమర్శించాడు. మార్క్స్ గాని, అతని అనుయాయులు గాని వాళ్ళ సిద్ధాంతాలను పరీక్షించడానికి సరిపోయే చరిత్ర రచనల్ని వెలువరించలేదని చార్లెస్ బియర్డ్ అన్నాడు.

తీవ్ర విమర్శలకు గురైన మార్క్స్ చరిత్రతత్వం కొంతమేరకు మాత్రమే నిజమని అనేకులు భావిస్తున్నారు. దీనికి తగినట్లు గత దశాబ్దంన్నరగా రష్యా వంటి ఐరోపా కమ్యూనిస్ట్ దేశాల్లో చోటుచేసుకున్న పరిణామాలు, చైనా ఆర్థిక వ్యవస్థలో వేళ్ళూనుకున్న సంస్కరణలు తోడయ్యాయి. మార్క్స్ సిద్ధాంతం పాక్షికంగా మాత్రమే వాస్తవమనే భావనకు అది ఆర్థికవాదమనే అపోహ కారణం. సమాజ పరిణామం, చరిత్రగతి అంతా కేవలం ఆర్థిక పరిస్థితులపైనే ఆధారపడినట్లు, ఒక్క ఉత్పత్తి విధానమే మూల కారణమన్నట్లు మార్క్స్ వివరణ యిచ్చినట్లు భావించి దానిని అసమంజసమని మనిషి పురోభివృద్ధికి కేవలం ఆర్థిక స్థితిగతులే కాక అనేక ఇతర కారణాలూ సహకరిస్తాయనే విషయాన్ని అతడు పూర్తిగా విస్మరించాడని విమర్శకులు ఆరోపించారు. సమాజ పరిణామానికి ఒక్క ఉత్పత్తి విధానమే మూలకారణం, ఉత్పత్తి శక్తులే చరిత్ర గతిని నిర్ణయిస్తాయని పేర్కొనడం అంటే సమాజ పరిణామాలలో రాజకీయ విప్లవాలు, శాస్త్ర పరిజ్ఞానం, వ్యక్తుల ప్రాబల్యం, భావాల ప్రభావం వంటి అనేక యితర అంశాలకు ఏ మాత్రం స్థానం లేకుండా చేయడమే అవుతుందని వీళ్ళ వాదన. ఆర్థిక స్థితిలోని మార్పే మనుషుల యితర ప్రవర్తనకు పరమ కారణం అయితే ఆర్థిక స్థితిలో వస్తున్న మార్పు దేనివల్ల వస్తుందని వీళ్ళ ప్రశ్న. గతితర్కం అహేతుకమని, అటువంటి గతితర్కాన్ని సమాజ పరిణామానికి అన్వయించి, వర్గపోరాటమనే ఏకగతిని చరిత్రకు కల్పించి ఉత్పత్తి విధానమే అన్నిటినీ నిర్దేశిస్తుందనే మార్క్స్ వాదన చరిత్రను ఒక కర్మ సిద్ధాంతంగా జోస్యం చెప్పేదానిగా చిత్రిస్తుందని వీళ్ళు వ్యాఖ్యానించారు. మార్క్స్ వర్గ రహిత సమాజ ప్రతిపాదన కేవలం అతని

ఊహగానమేనని, అటువంటి సమాజం యింతవరకు ఎక్కడా ఏర్పడలేదని, యిక ముందూ ఏర్పడుతుందనే ఆశ లేదని మరికొందరు పేర్కొన్నారు. "తప్పని సరి గమ్యం వైపు గట్టి అవసరంతో సమాజం పురోగమిస్తుందనే భావన మత ప్రపంచానికో లేదా కర్మ సిద్ధాంతానికో వర్తిస్తుంది గాని శాస్త్ర రంగానికి లేదా చరిత్ర ప్రపంచానికి వర్తించద"ని సెబైన్ వ్యాఖ్యానించాడు.

మార్క్స్ వాదానికి ప్రాతిపదిక అయిన గతితర్కం గత చరిత్రను వ్యాఖ్యానించడానికే ఉపయోగిస్తుంది గాని భవిష్యత్తు అనుభవానికి వర్తించదని మరో సందేహాన్ని కొంతమంది వ్యక్తం చేశారు. ఒకసారి వర్గరహిత సమాజం లేదా కమ్యూనిస్ట్ సమాజం ఏర్పడ్డాక గతి తార్కిక ప్రక్రియ ముగుస్తుందని మార్క్స్ చెప్పంది సహేతుకం కాదని యీ విమర్శకులు చెప్పారు. కాని మార్క్స్ చరిత్రతత్వంలో బహుశా అన్నింటికంటే ప్రధాన లోపం ప్రకృతి న్యాయాలను, ధోరణులను అతడు సమాజానికి అన్వయించడమే కావచ్చు.

## 13.7 మార్క్స్ వాద ప్రభావం :

ప్రపంచంలో మార్క్స్ ఎంతగా వివాదాస్పదం అయ్యాడో అంతగానూ యీ నాటి సమాజాన్ని ప్రభావితం చేసిన వ్యక్తి. అతని సిద్ధాంతం ఆర్థిక వాదమనే అపోహ కారణంగా పైన పేర్కొన్న విమర్శలు చెలరేగినాయి. చరిత్రకు అతడు ఆర్థికపరమైన వ్యాఖ్యానం చేసినంత మాత్రాన ఆయా సంఘటనలకు ఆర్థిక కారణాలను మాత్రమే చూపాడని భావించడం సమంజసం కాదు. ఇతర కారణాల కంటే ఆర్థిక కారణాలు ప్రబలం అని మాత్రమే భావించవచ్చు. మార్క్స్ చెప్పినట్లు మానవాళి తమ చరిత్రను తామే రూపొందించుకుంటారు. కాని వాళ్ళు దాన్ని తమ కామోదమైనట్లో లేదా తామే ఎంచుకున్న పరిస్థితుల్లో కాక ఉన్న పరిస్థితుల్లో రూపొందిస్తారు.... గతించిన తరం సంప్రదాయం వర్తమానంలో జీవిస్తున్న వాళ్ళ మస్తిష్కంపై ఒక పర్వతాన్ని ఉంచినంత భారంగానే వుంటుంది మరి!

డబ్ల్యు.హెచ్. వాల్ష్ చెప్పినట్లు మార్క్స్ వాదంపై ఎన్ని సందేహాలు వున్నా, ఎంత విమర్శ వున్నా దాన్ని పూర్తిగా కొట్టివేయలేం. అనుభవంలోకి వచ్చిన పరిస్థితుల గురించి అవగాహన పెంచుకోడానికి మార్క్స్ సిద్ధాంతం చరిత్రకారుడికి తప్పకుండా సాయపడ్తుంది. ఇదొక పార్శ్వం. ఈ పార్శ్వం నుండి కూడా చారిత్రక సంఘటనలను చూడొచ్చు. చరిత్రలో మార్క్స్ వాదం ఒక సంచలనమే. దీని ప్రాతిపదికతోనే లెనిన్, అతని అనుయాయులు రష్యాలో శ్రామిక నియంతృత్వ వ్యవస్థను ఏర్పరచారు. శాస్త్రీయ రీతిలో సామ్యవాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించి 'ప్రపంచ కార్మికులారా! ఏకం కండి' అని నినదించి కోట్లాది ప్రజలకు మహాప్రవక్తగా, 'లౌకిక జీసస్'గా మార్క్స్ ఆరాధ్యుడయ్యాడు. గత శతాబ్దకాలంగా సమాజ శాస్త్రజ్ఞులపై, సంఘ సంస్కర్తలపై, కవులు, కళాకారులు, రచయితలు, చరిత్రకారులపై అతడి ప్రభావం స్పష్టంగా కన్పిస్తూనే వుంది. ఈనాడు ప్రపంచంలో ప్రతి పది మంది లోనూ కనీసం నలుగురైనా అతడి సిద్ధాంతం ప్రభావానికి లోనైనవారే. వాళ్ళే లౌకిక వాదులుగా, అభ్యుదయ వాదులుగా, శాస్త్రీయ చింతనా పరులుగా ఈ రోజు ప్రజాజీవనంలో కొన్ని వర్గాలను ఆకర్షించి ఉగ్రవాదుల్ని, తీవ్రవాదుల్ని, వేర్పాటువాదుల్ని తీర్చిదిద్దుతున్నది.

1930 - 40 దశకాల నుండి మార్క్స్ ప్రభావం భారత జాతీయోద్యమ గమనంపై, గమ్యంపై కన్పడ సాగింది. స్వాతంత్ర్యం వచ్చాక సోషలిస్ట్ సమసమాజ స్థాపన మన లక్ష్యంగా ఉండటానికి కారణం కూడా మార్క్స్ ప్రభావమనే చెప్పాలి. మార్క్సిస్ట్ చరిత్ర రచనా విధానం కూడా గణనీయమైన సేవలందించింది. భారతావనికి సంబంధించి మార్క్స్ ప్రతిపాదించిన పద్ధతిలో చరిత్రచోదక శక్తులను అధ్యయనం చేసిన లేదా చేసే మార్క్సిస్ట్ చరిత్రకారుల్లో కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులు లేదా సానుభూతిపరులైన హిరేన్‌ముఖర్జీ, పామెదత్, డాంగే, నంబూద్రిపాద్, పుచ్చలపల్లి సుందరయ్య, ఏటుకూరి బలరామమూర్తి, కంభంపాటి సత్యనారాయణ, వై.వి. కృష్ణారావు, కె. బాలగోపాల్ వంటి వారు అనేకులున్నారు. చరిత్ర బోధకులు, చరిత్ర రచయితలయినా కోశాంబి, హబీబ్, ఆర్. ఎస్ శర్మ, నూరుల్ హసన్, రొమిలా థాపర్, హర్బన్స్ ముఖియా, ఇర్ఫాన్ హబీబ్ తదితరులు మార్క్సిస్ట్ దృక్పథంతో భారత చరిత్ర విషయాలను వివరించారు.

## 3.8 సంక్షిప్తంగా :

చరిత్ర స్వభావాన్ని, చరిత్ర తత్వాన్ని, చరిత్ర పరిణామాలను భిన్న కోణాల నుంచి పరిశీలించిన తత్వవేత్తలు, చరిత్రకారులు సమకాలీన ఆలోచనా ధోరణులకు ప్రభావితులై విభిన్న రీతుల్లో వ్యాఖ్యానించారు. హెగెల్ గతి తార్కిక పద్ధతి సామాజికాభివృద్ధి అధ్యయనానికి అన్వయించి సామాజిక పరిణామాన్ని తన చారిత్రక భౌతికవాద వ్యాఖ్యానంతో మార్క్స్ విశ్లేషించాడు. చరిత్ర గమ్యమైన వర్గాలు, వైషమ్యాలు, దోపిడీ లేని, ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా, బాధ్యతతో జీవించే సమసమాజ స్థాపన గురించి అతడు వివరించాడు.

మార్క్స్ చరిత్రతత్వం అనేక విమర్శలకు గురి అయింది. చరిత్ర గతిని పూర్తిగా ఆర్థిక పరిస్థితులే నిర్దేశిస్తాయని మార్క్స్ అన్నాడని, యితర కారణాలను అతడు విస్మరించాడని, వర్గరహిత సమాజం అతడి ఊహాజనిత ఆదర్శమేనని విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్ని విమర్శలున్నా యీనాటి సమాజంపై మార్క్స్ ప్రభావాన్ని ఎవ్వరూ కాదనలేరు. భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగానే యీ ప్రభావం స్పష్టంగా కన్పిస్తున్నది.

## 13.9 నమూనా ప్రశ్నలు :

**I.** క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. గతితార్కిక పద్ధతిని అన్వయించి మార్క్స్ సామాజిక పరిణామాన్ని విశ్లేషించిన పద్ధతిని వివరించండి.
2. చారిత్రక భౌతికవాద వ్యాఖ్యానాన్ని వివరించండి.

**II.** క్రింది వాటిపై లఘువ్యాఖ్యలను రాయండి.

1. మార్క్స్ చెప్పిన కమ్యూనిస్ట్ సమాజంలోని రెండు దశల్ని వివరించండి.
2. మార్క్సీయ చరిత్రవాదంపై వచ్చిన విమర్శలను విశ్లేషించండి.
3. ఈనాటి సమాజంపై మార్క్స్ ప్రభావాన్ని వివరించండి.

## 13.10 ఉపయుక్త గ్రంథాలు :


1. Ali, B. Sheik : History : Its Theory and Method (MacMillan Madras, 1978)
2. Deutscher, I : Marxism in our Time (Rampart Press, SanFransisco, 1973)
3. Dray William, H : Philosophy of History (Prentice Hall, N. York, 1964)
4. Edwin, R.A. Sdignan : The Economic Interpretation of History (Columbia University, News Press, NewYork, 1965)

5. Ghosh, Shanker : Socialism and Communism in India (Allied, Bombay, 1971)

6. Gopal. S and Thapar Romilla : Problems of Historical Writing in India (!ndia International centre, N. Delhi 1963)

7. Habib, Irfan : Essays in Indian History : Toward's a Marxist Perception (Tulika, N. Delhi, 1994)

8. Helperion. W.S. (Ed.) : Essays in Modern European Historiography (London, 1970)

9. Iggers George. G : New Directions in European Historiography (Connecticudt, 1964)

10. Walsh. W.H. : An Introduction to Philosophy of History (Hutchinson, London 1951).



పాఠ్య రచయిత :

డాక్టర్ జె. దుర్గాప్రసాద్

# ఆర్నాల్డ్ జోసెఫ్ టాయన్బీ (1889-1975)
# (Arnold Joseph Toynbee)

## 14.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తరువాత మీరు చరిత్ర రచనాభివృద్ధికి టాయన్‌బీ చేసిన సేవల గురించి వివరించగలగాలి.

## విషయసూచిక :


14.1 పరిచయం

14.2 టాయన్బీ

14.3 సంక్షిప్తంగా

14.4 నమూనా ప్రశ్నలు

14.5 చదువదగిన గ్రంథాలు


## 14.1 పరిచయం :

ప్రాచీనకాలంలో గ్రీకు చరిత్రకారుల కృషివల్ల చరిత్ర అన్ని ప్రధాన లక్షణాలను సంతరించుకొని మానవ దార్శినకంగా, శాస్త్రీయంగా, స్వీయ దార్శినికంగా రూపొందించారు. గ్రీకుల చరిత్ర రచనా సాంప్రదాయం రోమన్లను ప్రభావితం చేసి చరిత్రవైపు వారి దృష్టిని మరలించింది. అయితే రోమన్ చరిత్రకారులు సమకాలీన చరిత్రకే ప్రాధాన్యమిచ్చారు. వీరు తమ పరిధిని పరిమితం చేసుకోవటంతో సాధారణీకరముల జోలికి పోలేదు. క్రీ.శ. 5 వ శతాబ్దం నుండి 13 వ శతాబ్దం వరకు చరిత్ర మత ప్రభావానికి గురైంది. ఈ కాలంలోనే వంశ చరిత్రల రచన ప్రారంభమైయింది. ఆధునిక యుగంలో ఆధ్యాత్మిక విషయాసక్తి తగ్గిపోయి, మానవీయ విషయాసక్తి, శాస్త్రీయ దృక్పథం పెరిగింది. అందువల్ల చరిత్ర విషయపరిధి విస్తృతమగుటయేగాక, వైవిధ్యమును సంతరించుకొన్నది. ఈ ఆధునిక యుగంలోనే చరిత్ర లౌకికంగా, పక్షపాత రహితంగా, ఉపదేశాత్మకంగా, తాత్వికంగా, రూపుదిద్దుకోవాలన్న ఆకాంక్ష చరిత్రకారులలో అధికమైంది.

ఆధునిక యుగంలోని చరిత్ర రచనా సంవిధానంపై సాంస్కృతిక పునరుజ్జీవనం, మత సంస్కరణోద్యమం, జ్ఞాన వికాసం, కాల్పనికవాదం, ప్రత్యక్ష జ్ఞానవాదం వరుసగా తమ ప్రగాఢ ప్రభావాన్ని చూపాయి. ఫలితంగా చరిత్రను లౌకికంగా, పక్షపాత రహితంగా, ఉపదేశాత్మకంగా, తాత్వికంగా, శాస్త్రీయ దృక్పథంతో చరిత్ర ఆధారాలను నిశితంగా పరిశీలించి, ఆధారముల ప్రామాణికతను నిర్ధారించి, విశ్లేషించి రచన చేయడం చరిత్రకారులకు ఆదర్శంగా మారింది.

ఆధునిక కాలంలో చరిత్ర తత్వము అన్న పదాన్ని సృష్టించి వివరించిన తొలి తత్వవేత్త ఫ్రెంచి దేశస్థుడైన వాల్టేరు. చరిత్ర తత్వము అంటే ఏమిటి అన్న విషయాన్ని గురించి వాల్టేర్, హెగెల్, కోంట్, వీకో, కాంట్, కారల్‌మార్క్స్, స్పెంగ్లర్, రాంకె మొదలైన వారు తమ తమ దృక్పథాల నుండి వివరించారు. ఆధునిక యుగ బ్రిటిష్ చరిత్రకారులలో 18 వ శతాబ్దికి చెందిన ఎడ్వర్డ్ గిబ్బన్, 19 వ శతాబ్దికి చెందిన కార్‌లైల్, హెన్రి థామస్, బక్లీ, 20 వ శతాబ్దికి చెందిన ఆర్నాల్డ్ టాయన్‌బీ ప్రముఖులు. గిబ్బన్ జ్ఞాన వికాస రిత్ర రచనా సాంప్రదాయానికి చెందిన ప్రముఖ చరిత్రకారుడు. చారిత్రక మార్పులకు మూలము అతీత శక్తులుకావని, మానవ

స్వభావమే కారణమని గిబ్బన్ భావించారు. ఇతడు ప్రతి అంశము గురించి శ్రద్ధగా ఆధారాలు సేకరించి, ప్రతి అంశమును సంపూర్ణముగా విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేసి, ఖచ్చితత్వమునకు ప్రాధాన్యమిచ్చాడు. చరిత్ర పరిణామంలో అవిచ్ఛిన్నత ఒక లక్షణమని కనుగొన్న మొదటివాడు గిబ్బన్ మాత్రమే. కార్లైల్ కాల్పనికవాద చరిత్ర రచనా సాంప్రదాయవాద ప్రభావితుడు. మహా పురుషుల జీవిత చరిత్రయే చరిత్ర అన్నది ఇతని ప్రగాఢ విశ్వాసం. ఈ భావన చరిత్ర రచనను ఎంతో ప్రభావితం చేసింది. అంతేగాక ఇతడు చరిత్ర రచనలో వివేచన ముఖ్యం కాదని, సమాజ ప్రేరణే ముఖ్యమన్న మరో సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. బక్లి ప్రత్యక్ష జ్ఞానవాద వర్గానికి చెందినవాడు.

చారిత్రక పరిశోధన ఏ దిశగా సాగుతుందో అనే విషయం గురించి 20 వ శతాబ్దం ఆరంభం నుంచి అనేక భావాలను రాంకె విమర్శకులు వెళ్ళబుచ్చటం ఆరంభించారు. చరిత్రకారుడు ప్రాధమి కంగా వర్తమానానికి సంబంధించిన గతకాలపు అంశాల గురించి ఆలోచించాలనేది అందులో ఒక దృక్పథం. ఆధునిక కాల, భావవైఖరికి దారితీసిన పరిణామాలనుగురించి దృష్టిని కేంద్రీకరించాలనే వైఖరి ఇందులో అంతర్నిహితంగా ఉంది. ఈ భావాన్ని వ్యాప్తి చేసిన వారిలో జర్మనీకి చెందిన డిల్తీ, ఇటలీకి చెందిన క్రోచేలు ముఖ్యులు. సమకాలీన శాస్త్ర విజయాల ప్రభావానికి లోనైన కొందరు చరిత్రను విస్తృత కార్యకారణ సంబంధంతో చూడాలని అభిప్రాయపడ్డారు. ఈ కోవకు చెందిన వారిలో పేర్కొనదగినవారు ఫ్రాన్స్‌కు చెందిన హెన్రీబెర్, అమెరికాకు చెందిన రాబిన్‌సన్‌లు. సామాజిక శాస్త్రాలను విస్తృతంగా ఉపయోగించుకొనే, వర్తమాన సమస్యలకు పరిష్కారం చూపే నవీన చరిత్రను వీరు పరిగణనలోకి తీసుకొన్నారు. ఈ పరిణామాల్లో మార్క్సువాదం ముఖ్యపాత్రను నిర్వహించింది. భౌగోళికంగా ప్రపంచ వ్యాప్తంగా జరిగిన రెండో ప్రపంచ యుద్ధపోరాటాలు ప్రపంచ చరిత్ర ప్రాముఖ్యాన్ని హెచ్చించడంతోబాటు దాని నైజాన్ని, సమస్యలను కూడా మార్చాయి. నాగరికతల క్రమ పరంపరకు సంబంధించిన ఊహాచిత్రాలు సామాన్య ప్రజానీకంలో కూడా ఎంతో కుతూహలాన్ని రేకెత్తించాయి.

స్పెన్‌గ్లర్ తన 'డిక్లైన్ ఆఫ్ ది వెస్ట్' గ్రంథంలోను, టాయన్బీ 'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ' సంపుటాల్లోనూ చేసిన పరికల్పనలు ఈ కోవలోవే. ఇటువంటి తులనాత్మక అధ్యయన పద్ధతులను జాగ్రత్తగా నిర్వహిస్తే నాగరికతల పురోగతిలో కొన్ని సామాన్య తీరు తెన్నులను తెలుసుకొనే అవకాశాలు ఎక్కువని చరిత్రకారులు భావించడం ఆరంభించారు. ఈ విధంగా తులనాత్మక చరిత్ర అధ్యయనానికి ప్రాముఖ్యత పెరిగింది.

## 14.2 టాయన్బీ :

బ్రిటిష్ చరిత్రకారుడైన ఆర్నాల్డ్ జోసెఫ్ టాయన్‌బీ క్రీ.శ. 1889లో జన్మించాడు. విన్ చెస్టర్, ఆక్స్‌ఫర్డులలో ఇతడు ప్రాచీన గ్రీక్, రోమన్ సాహిత్యం అధ్యయనం చేశాడు. ఇతడు ఒక సంవత్సరం పాటు ఏథెన్స్‌లోని బ్రిటిష్ పురావస్తు శాఖ పాఠశాలలో గడిపాడు. 1912 లో ఇతడు ఆక్స్‌ఫర్డ్‌లోని బల్లియోల్ (Balliol) కాలేజిలో ట్యూటర్‌గా చేరి 1915 వరకు ప్రాచీన చరిత్రను బోధించాడు. తరువాత ఇతడు దౌత్యనీతివేత్తగా ప్రభుత్వంలో ఉద్యోగం చేశాడు. 1919 మొదలు 1924 వరకు లండన్ విశ్వవిద్యాలయం కింగ్స్ కళాశాలలో ఇతడు ఆచార్యుడుగా ఆధునిక గ్రీకు, బైజాంటైన్ విద్యలను బోధించాడు. 1925 మొదలు ఇతడు రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డైరెక్టరుగా వ్యవహరించడమేగాక రెండో ప్రపంచ యుద్ధానంతరం జరిగిన పారిస్‌శాంతి సమావేశంలో బ్రిటిష్‌వారి ప్రతినిధి బృందంలో సభ్యుడుగా కూడా పనిచేశాడు. 1947 లో బ్రిన్ మవుర్ (Bryn Maur) కళాశాలలో వార్షిక మేరీ ఫ్లెక్స్‌నర్ ఉపన్యాసాలివ్వడానికి యునైటెడ్ స్టేట్స్ వెళ్ళాడు.

అంతర్జాతీయ పరిణామాలలో టాయన్‌బీకి ఎంతో ఆసక్తి ఉండుటచే, ఒక దేశము లేదా జాతి ప్రజలకు ఆసక్తి కలిగించే అంశాల మీద కాక ప్రపంచ ప్రజలందరి ఆసక్తిని పెంపొందింప చేసే అంశములపై గ్రంథాలు వ్రాశాడు. టాయన్‌బీకి పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టిన బృహత్ గ్రంథము 'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ' (A Study of History) అయినప్పటికీ అదే స్థాయికి చెందిన గ్రంథాలు అనేకం రచించాడు. ఆదివారాలతో సహా వారమంతా ఎల్లప్పుడు ఇతడు తన పనిలో నిమగ్నమయ్యేవాడు. చరిత్రలో శిక్షణ పొందిన తన భార్య వెరొనికా (Veronica) తో బాటు అనేక సంవత్సరాలు 'సర్వే ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్' (Survey of International Affairs) కు ఇతడు సంపాదకత్వం వహించాడు. దీనివలన సమకాలీన చరిత్రపై ఇతనికి మంచి పట్టు లభించింది. మానసికంగానే కాక శారీరకంగా ఆరోగ్యవంతుడైన టాయన్‌బీ అనేక దేశాలు దర్శించాడు. ఇది తన రచనలకు ఎంతగానో దోహదం చేసింది. ఇతని ముఖ్య రచనలు 'ఏ జర్నీ టు చైనా' (A Journey to China) 1930, 'ఈస్ట్ టు వెస్ట్' (1958), 'బిట్వీన్ ఆక్సస్ అండ్ జమునా' (1961), 'బిట్వీన్ నైల్ అండ్ నైజిర్' (1965), రెండు సంపుటాల 'హన్నిబాల్స్ లెగసి' (Hannibal's Legacy) (1965), 'బిట్వీన్ మాలె అండ్ అమజాన్' (Between Maule and Amazon), సమ్ ప్రాబెమ్స్ ఆఫ్ గ్రీక్ హిస్టరీ' (1969), 'ది గ్రీక్స్ అండ్ థెయిర్ హెరిటేజస్' (The Greeks and their Heritages), (1979) 'ఏన్ హిస్టోరియన్స్ అప్రోచ్ టు రిలిజియన్' (An Historians Approach to Religion) (1956), 'అక్వెన్‌టెన్సస్' (Acquaintances) (1967) 'ఎక్స్పీరియన్‌సెస్' (Experiences) (1969) 'సిటీస్ ఆన్ ది మూవ్' (Cities on the Move) (1970), 'ఛేంజ్ అండ్ హాబిట్' (Change and Habbit) (1966) 'క్రిస్టియానిటి ఏమాంగ్ ది రిలిజియన్స్ ఆఫ్ ది వర్ల్డ్' (Christianity among the religiouns of the world) (1958) 'కాన్‌స్టాన్‌టైన్ పార్ఫిరొజెనిటస్ అండ్ హిజ్ వరల్డ్' (Constantine Porphyrogenitus and his world) (1973), 'నేషనాలిటి అండ్ వార్' (Nationality and war), గ్రీక్ హిస్టారికల్ థాట్, 'సివిలైజేషన్ ఆన్ ట్రయల్' మొదలగునవి.

'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ' అను బృహత్ గ్రంథాన్ని రచించటానికి టాయన్‌బీకి 40 సంవత్సరాలు పట్టింది. ఈ గ్రంథాన్ని గురించిన ఆలోచన 1921లోనే ప్రారంభమై, రెండో ప్రపంచ యుద్ధంవల్ల ఆరు సంవత్సరాలపాటు ఆగిపోయి 1934 నుండి 1954 వరకు 10 సంపుటాలు, 1954 లో అట్లాస్ (Atlas) గజిటీర్ (gazetteer) లతో కూడిన 11వ సంపుటం, 1961లో 'రీకన్సిడరేషన్స్' (Reconsiderations) అను పేరుతో 12 వ సంపుటం విడుదల అయ్యింది. ఈ 12 సంపుటాల గ్రంథం టాయన్బీకి ప్రముఖ చరిత్రకారునిగా గుర్తింపు తెచ్చిపెట్టింది. గిబ్బన్ యొక్క 'డిక్లైన్ అండ్ ఫాల్ ఆఫ్ ది రోమన్ ఎంపైర్' (Gibbon's Decline and Fall of the Roman Empire) తరువాత ఒకే వ్యక్తిచే సాధించబడిన ఒక గొప్ప విజయం టాయన్‌బీ యొక్క 'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ' అని నిర్వివాదంగా చెప్పవచ్చు. 1947 లో డి.సి. సోమర్‌వెల్ (D.C. Somervell) 'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ' కి సంబంధించిన తొలి ఆరు సంపుటాలను సంక్షిప్తం చేసి ఒకే సంపుటంగా ముద్రించడంలో టాయన్‌బీ యొక్క పేరు ప్రఖ్యాతలు ప్రపంచ వ్యాప్తమయ్యింది.

సెంట్ అగస్టీన్, వాల్టేరు, హేగల్, మార్క్స్, స్పెంగ్లర్‌లవలె మానవజాతి చరిత్ర పరిణామములను అధ్యయనం చేసి, చరిత్ర పరిణామంలో ఒకరీతి లేదా పథకంను, చరిత్ర అర్థమును కనుగొనుటయే టాయన్‌బీ లక్ష్యం. విశ్వచరిత్ర రచనకు మానవుడు చేసిన తొలియత్నంగా ఈ గ్రంథరచన (ఏ స్టడీ ఆఫ్ హిస్టరి) గురించి చెప్పకోవచ్చును. ప్రాంతీయ, జాతీయ, చారిత్రక నియతివాద దృక్పథాలలో గల అంతర్గతమైన, సహజమైన దోషాలు లేకుండా అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందని నాగరికతలను అధ్యయనం చేసి, నాగరికతల పుట్టుక, పెరుగుదల, క్షీణతకు (genesis, growth and decay) కార్యకారణ సంబంధాలను వెదుకుట ఇతని ఆశయము.

టాయన్‌బీ తన బృహత్ గ్రంథమైన 'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ'కి అధ్యయన ప్రమాణంగా 'నాగరికత'ను ఎంపిక చేసుకొన్నాడు. ఇతడు 'రాజ్యము', 'జాతి', 'వ్యక్తి'లను అధ్యయన ప్రమాణంగా తీసుకోక, 'నాగరికత'ను ప్రమాణంగా ఎంపిక చేసుకొని, ప్రాచీన

ప్రపంచంలోని నాగరికతల, ఆధునిక ప్రపంచంలోని నాగరికతల పుట్టుక, అభివృద్ధి, క్షీణతలను అధ్యయనం చేసి, కొన్ని సాధారణీకరములు, నాగరికత పరిణామములు గురించి చేస్తూనే సవాలు (challenge) మరియు స్పందన (Responcse) అను సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. 6వేల సంవత్సరాల మానవ చరిత్రలో 21 నాగరికతలను ఇతడు తీసుకొన్నారు. అవి వెస్టర్న్ (western), ఆర్థడాక్స్ క్రిస్టియన్ (రష్యా, సమీప ప్రాచ్యం), ఇరానియన్, అరబిక్, హిందూ, రెండు దూర ప్రాచ్యాలు (Two far - eastern), హెలనిక్, సిరియాక్ (Syriac), ఇండిక్ (Indic), సినిక్ (sinic), మినోవన్ (minoan), సుమేరియన్, హిట్టైట్ (Hittite), బాబిలోనియ, అన్‌డియాన్ (Andean), మెక్సికో, యుకటెక్ (yucatec), మాయన్ (Mayan), ఈజిప్షియన్ (Egyptian), మరియు ఐదు అభివృద్ధి చెందని నాగరికతలైన పాలినీషియన్ (polynesian), ఎస్కిమో (Eskimo), నొమాడిక్ (Nomadic), ఆటోమన్ (Ottoman), స్పార్టన్‌లు (Spartan).

టాయన్‌బీ తన గ్రంథమైన 'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ'లో ఆరువేల సంవత్సరాల మానవచరిత్రలో 21 నాగరికతలు పుట్టి, అభివృద్ధిచెంది క్షీణించాయని, వాటిలో పశ్చిమ నాగరికతే క్షీణించలేదన్న అభిప్రాయం వెలిబుచ్చాడు. పైన పేర్కొన్న 21 నాగరికతల మధ్యగల సహజ సంబంధములను వివరించాడు. ఈ నాగరికతల పరిణామములో, ఆ నాగరికతల పెరుగుదల, క్షీణతల దృష్ట్యా అవసరమైనది సాంఘిక, భౌతిక వాతావరణములకు సంబంధించిన సవాళ్ళను ఎదుర్కొనటంలో అవి స్పందించిన విధానం లేక పద్ధతి ముఖ్యమైనదని అన్నాడు. భౌతిక వాతావరణ సవాళ్ళే వివిధ నాగరికతల ఆవిర్భావానికి కారణమన్నాడు. చరిత్ర యొక్క పొందిక సామాజిక చరిత్రలో సవాళ్ళు, స్పందనలు ఫలితంగా వచ్చిన హెచ్చు తగ్గులన్నాడు.

ఏ నాగరికత అయినా అభివృద్ధి చెందుటకు సృజనాత్మక శక్తిగల కొద్దిమంది సవాళ్ళను అధిగమించుట మాని, ఆ సృజనాత్మక శక్తిగల కొద్దిమంది సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తిని కోల్పోయినప్పుడు ఆ నాగరికత నిలుపుదల దశకు చేరుకుంటుందని, దీని తరువాత దశయే క్షీణత అన్నాడు. ఇతడు చరిత్ర తత్త్వ విశ్లేషణకు జీవశాస్త్ర సూత్రాలను ఆధారం చేసుకొన్నాడు.

నాగరికతకు సంబంధించి టాయన్‌బీ పుట్టుక, అభివృద్ధి, క్షీణత అను మూడు ప్రధాన సమస్యలను చర్చించాడు. ప్రథమంగా నాగరికతల ఆవిర్భావం గురించి చర్చిస్తూ ఆదిమ సమాజాలలో కొన్ని నాగరికంగా వృద్ధి చెందగా మరికొన్ని ఎందుకు నాగరికంగా వృద్ధి చెందలేదని ప్రశ్నించాడు. దీనికి సమాధానంగా ఇతడు జాతి లేదా భౌగోళిక వాతావరణం వలన గాక కొద్దిమంది సృజనాత్మక శక్తి గలవారు మరియు కొన్ని పరిస్థితుల కారణంగా నాగరికత ఆవిర్భవిస్తుందని పేర్కొన్నాడు. ఇచట జాతి ఆధిపత్యం వల్ల నాగరికత జనిస్తుందనే వాదం సరికాదని, జాతి ప్రభావం వాదనను త్రోసిపుచ్చారు. జాతి ప్రభావమే ఉంటే హిట్లర్ చేసిన కృషివల్ల ఒక గొప్ప నాగరికత ఆవిర్భవించి ఉండేది. అలాగే ప్రాచీన కాలంలో ఆర్యులు, గ్రీకులు, రోమన్‌లు, అరబ్బులు సృష్టించిన గొప్ప సంస్కృతి తరువాతకాలంలో కూడా కొనసాగి ఉండేది. అంతేగాక భౌగోళిక పరిస్థితుల వల్లనే నాగరికత పుట్టదు. భౌగోళిక పరిస్థితులే కారణమయితే ఖనిజ సంపద అపారంగా కలిగి, సారవంతమైన నేల గల ఆఫ్రికా చీకటి ఖండంగా ఉండేది కాదు. హన్‌టింగ్‌టన్ (Huntington) ప్రభోదించిన భౌగోళికాంశాల సిద్ధాంతాన్ని టాయన్‌బీ త్రోసి పుచ్చి రెండు ప్రధాన కారణాల వలన నాగరికత పుట్టుక సంభవిస్తుందని తెలిపారు. అందులో ఒకటి శక్తి సామర్థ్యాలు గల నాయకత్వం, సృజనాత్మక శక్తిగల కొద్దిమంది, మేధావులు కొద్దిమంది, దూరదృష్టి, కష్టించి పనిచేయగల వారి వల్ల నాగరికత ఆవిర్భవిస్తుందని తెలిపారు. రెండో అంశముగా కొన్ని అనుకూల పరిస్థితుల వల్ల నాగరికత పుడుతుందని చాటాడు.

సరియైన నాయకత్వం అనగా సృజనాత్మక శక్తిగల కొద్దిమంది మరియు సరియైన వాతావరణ పరిస్థితుల వలన నాగరికత ఆవిర్భవిస్తుందని, ఈ రెండింటి సవాలు, స్పందన ఫలితమే నాగరికత అని టాయన్‌బీ అంటాడు. సవాలు ప్రశ్నకాగా స్పందన

దానికి సమాధానము. వ్యక్తిగాని, సమాజంగాని తొలినుండి చివరివరకు సవాలును ఎదుర్కొనవలసి ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి పుట్టినప్పటినుండి మరణించేవరకు తన జీవితంలో అనేక సవాళ్ళను ఎదుర్కొంటాడు. ఈ సవాళ్ళను ఎదుర్కొనడంలోనే వ్యక్తి స్థానం నిర్ణయమవుతుంది. అలాగే సమాజం కూడా అనేక సవాళ్ళను ఎదుర్కొంటుంది. ఈ సవాళ్ళకు చక్కటి స్పందనవస్తే ఒక దశలో ఆ సమాజం నాగరిక యుగంలోకి ప్రవేశిస్తుంది. వాతావరణం సమాజానికి సవాలు విసురుతుంది. ఆ సవాలుకు సృజనాత్మక శక్తిగల కొద్దిమంది విజయవంతంగా స్పందిస్తారు. క్రొత్త క్రొత్త సవాళ్ళు, స్పందనలు నిరంతరం కొనసాగుతాయి. ఈ క్రమంలో విశ్రాంతి ఉండదు. సమాజం ఎల్లవేళల పురోగమిస్తూనే ఉంటుంది. ఈ రకమైన పురోగమనం కొద్ది కాలానికి నాగరిక స్థాయికి చేరుకొంటుంది. ఈ రకంగానే అన్ని నాగరికతలు ఆవిర్భవించాయని టాయన్బీ అంటాడు. విషయ నిర్ధారణకు ఒక దృష్టాంతము పరిశీలిద్దాం. లౌకిక వాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం ఆధారాలుగా ఆధునిక ఇండియాలో ఒక ప్రత్యేక నాగరికత ఆవిర్భవించాలంటే ప్రాంతీయతత్వం, కులవ్యవస్థ మొదలగు సవాళ్ళను ఎదుర్కోవాలి. **1947** కు ముందు ఇండియా ముందున్న ప్రధాన సమస్య విదేశీయులనుండి మాతృభూమిని విడుదల చేయించడం, స్వాతంత్ర్యం తరువాత అనారోగ్యం, అవిద్య, బీదరికం, విదేశీ ప్రమాదం, అధిక జనాభా మొదలగు అనేక సవాళ్ళను ఎదుర్కొనవలసి వచ్చింది. మనం ఈ సవాళ్ళకు సరియైన స్పందన ఇవ్వగలిగితే మనం ఒక గొప్ప నాగరిక దేశంగా ఎదగగలం 1917 లో రష్యా రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సవాళ్ళను ఎదుర్కొని అధిగమించడంలో ఆ దేశం అగ్రరాజ్యంగా రూపొందింది. ఇండియా తన సవాళ్ళను విజయవంతంగా ఎదుర్కొంటే గొప్ప సంస్కృతిగల బలమైన దేశంగా ఆవిర్భవించగలదు.

'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ' లో తరువాత సమస్య నాగరికత ఆవిర్భవించిన తరువాత అది ఎలా వృద్ధి చెందుతుంది, మరియు ఆవిర్భవించిన నాగరికతలలో 26 మాత్రమే ఎందుకు ఉచ్ఛస్థితికి వెళ్ళగలిగాయి? మిగితావి తొలిస్థాయిలోనే భగ్నమయి అంతరించాయి. ఎందువలన ? ఇది కూడా మానవ సమస్యవలె కొందరు చిన్నప్పుడే మరణిస్తారు. మరికొందరు జీవించినా సాధారణ జీవితం గడుపుతారు. కొందరు మాత్రమే ఉన్నత స్థానాన్ని అధిరోహించి ప్రపంచ ఖ్యాతి గడిస్తారు. ఈ ప్రశ్నకు టాయన్ బీ ఇచ్చే సమాధానం కుతూహలంగా ఉంటుంది. ఒక సమాజం యొక్క భూభాగం విస్తరించడం వల్ల రాజ్యం విచ్ఛిన్నమవుతుందే గాని నాగరికత వృద్ధి చెందదు. రోమన్ సామ్రాజ్యం లేక మౌర్య సామ్రాజ్యం లేక మొగల్ సామ్రాజ్యం లేక బ్రిటిష్ సామ్రాజ్యం యొక్క విస్తీర్ణం పెరగడం వల్ల అవి పతనమయ్యాయి. భూభాగ విస్తీర్ణం వల్ల అంతరంగికమైన సర్దుబాటు అంతరించి నాగరికత భగ్నం చేయబడుతుంది. సాంకేతిక పురోభివృద్ధి వలన కూడా నాగరికత అభివృద్ధి చెందదు. భౌగోళిక వాతావరణాన్ని సమాజం అదుపు చేసినందువల్ల కూడా నాగరికత వృద్ధి చెందదు. సాంకేతిక అభివృద్ధే నాగరికతాభివృద్ధికి కారణమయితే, జర్మనీ శాస్త్రీయంగా ఉన్నత స్థితిని హిట్లర్ కాలంలో అందుకుంది. బాంబు ప్రయోగం నాగరికతాభివృద్ధికి చిహ్నం కాదు. చంద్రమండలంపై మానవుడు అడుగుపెట్టడం నాగరికత ఉచ్ఛస్థితికి కారణం కాదు. సామాజిక అవసరాల దృష్ట్యా సాంకేతిక అభివృద్ధిలో ఒక ముఖ్య ఘట్టం కావచ్చు. అయితే భూభాగ విస్తరణ, సాంకేతికాభివృద్ధి సంస్కృతి అభివృద్ధికి కారణాలు కావు. అయితే ఏ కారణాల వల్ల అభివృద్ధి సాధ్యమౌతుంది. వ్యక్తిలో గల సృజనాత్మక శక్తి నాగరికతాభివృద్ధికి కారణమని టాయన్బీ సమాధానమిచ్చాడు. **'విత్‌డ్రాయల్' (Withdrawal)** మరియు 'రిటర్న్' **(Return)** అను సిద్ధాంతాలపై అభివృద్ధి ఆధారపడి ఉంది. నాగరికతాభివృద్ధికి ఫిక్టే, హెగల్‌లు 'థీసిస్,' 'ఏంటిథీసిస్', 'సింథసిస్' అను పదాలు ఉపయోగించగా, టాయన్ బీ 'విత్‌డ్రాయల్', 'రిటర్న్' అను పదాలు ప్రయోగించాడు. ఈ పద్ధతి ఒక విచిత్రమైనది. ఒక సమాజం తన పద్ధతులను మార్చుకొంటూ ముందుకు సాగాలి. ఉదాహరణంగా ఇండియాలో బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఒక సందర్భంలో బ్రిటన్ క్లైవ్, వెలస్లీ, డల్‌హౌసీ, లిట్టన్, కర్జన్ లాంటి రాజ్యవిస్తరణ వాదులను పంపగా, మరో సందర్భంలో ఉదారులైన కారన్‌వాలీస్, బెంటింక్, కానింగ్, రిప్పన్‌లను పంపింది. ఒక గవర్నర్ జనరల్ ఇండియా వారిపై బలప్రయోగం చేస్తే మరో గవర్నర్ జనరల్ తృప్తి పరచడానికి కృషిచేశాడు. ఇచట బ్రిటన్ విత్‌డ్రాయల్, రిటర్న్ పద్ధతిని అనుసరించింది.

నాగరికత ఎలా, ఎందువలన విచ్ఛిన్నమై అంతమవుతుంది. అన్నది మూడవ ప్రధాన సమస్య. నాగరికతాభివృద్ధికి, నాగరికతా విచ్ఛిన్నానికి గల ప్రధాన వ్యత్యాసమేమంటే అభివృద్ధి దశలో సవాళ్ళను విజయవంతంగా ఎదుర్కొనగా, విచ్ఛిన్నదశలో సవాళ్ళను ఎదుర్కోవడంలో విఫలం కావడం జరుగుతుంది. విచ్ఛిన్న దశలో స్పందనలు ఒకేరకంగా ఉండవు. అయితే సవాళ్ళు మాత్రం తొలిగించబడవు. సవాళ్ళకు సమాధానాలు దొరకవు. ఆత్మహత్య చేసుకోవడంవల్లనేగాని హత్యచేయడం వల్ల నాగరికత విచ్ఛిన్నం కాదని టాయన్‌బీ అంటాడు. ఇది గుర్తుంచుకోదగ్గ ప్రధాన భావం. నాగరికత పుట్టుకకు ప్రధాన సిద్ధాంతం 'విత్ డ్రాయల్', 'రిటర్న్' లాగే 'సెల్ఫ్ అన్నిహిలేషన్' (Self-annihilation) నాగరికత విచ్ఛిన్నానికి, అంతానికి ప్రధాన సూత్రం. సమాజంలో సృజనాత్మక శక్తి నశించడం, ఐక్యత లోపించడం, ద్వేషభావం ఏ నాగరికతలో చూసినా ప్రధానంగా కన్పిస్తాయి. భారతదేశ చరిత్రలో ఇందుకు దృష్టాంతాలు అనేకం గలవు. ఘోరీ, మొగల్ దాడులు, ఫ్రెంచి, బ్రిటిష్ సామ్రాజ్యాల విస్తరణ ఆంతరంగిక ఐక్యత వల్లనేగాని, విదేశీయుల ఆధిక్యత వల్ల కాదు. టాయన్‌బీ ప్రకారం నాయకత్వంలో సృజనాత్మకత లోపించడం, సమాజంలో సాంఘిక ఐక్యత లోపించడం, అత్యధికులకు న్యాయం చేకూరకపోవడం కారణాలుగా నాగరికత విచ్ఛిన్నమవుతుంది.

స్పెంగ్లర్ వలె టాయన్‌బీ కూడా నాగరికతనే ప్రమాణంగా తీసుకొన్నప్పటికి ఇద్దరి మధ్య తేడాలు గలవు. స్పెంగ్లర్ సంస్కృతుల గురించి పేర్కొనగా టాయన్‌బీ నాగరికతల గురించి ప్రస్తావించాడు. స్పెంగ్లర్ 9 సంస్కృతుల గురించి చర్చించగా టాయన్‌బీ 21 నాగరికతల గురించి చర్చించాడు. నాగరికతా సంస్కృతులు నాశనమవుతాయని స్పెంగ్లర్ పేర్కొనగా, తాను సంపాదించుకొన్న జ్ఞానం సహాయంతో ఆధునిక మానవుడు వినాశమును ఆపు చేయగల సామర్థ్యము కలిగియున్నాడని టాయన్‌బీ అభిప్రాయపడ్డాడు. చరిత్ర చక్రీయమైనది కాదని, ప్రగతి లక్షణం కలదని టాయన్‌బీ చాటాడు. స్పెంగ్లర్ నిరాశావాదానికి ప్రాతినిధ్యము వహించగా, టాయన్‌బీ ఆశావాదానికి ప్రాతినిధ్యం వహించాడు.

జర్మనీకి చెందిన తత్వవేత్త, చరిత్రకారుడైన ఆస్వాల్డ్ స్పెంగ్లర్ చరిత్ర తత్వము 'డిక్లైన్ ఆఫ్ ది వెస్ట్' అను గ్రంథము వలన తెలుసుకోవచ్చు. స్పెంగ్లర్ అభిప్రాయం ప్రకారం చరిత్ర సాంస్కృతిక ప్రమాణాలు అనుక్రమంలో తయారైంది. ఈ సాంస్కృతిక క్రమంలో ప్రతి సంస్కృతికి తనదైన విశిష్టలక్షణం ఒకటి ఉంటుంది. ప్రతి సంస్కృతి మానవ జీవితం వలె ఒక జీవిత చక్రం చుట్టుకుంది. అనగా మానవ జీవితంలో ఉన్నట్లే పుట్టుక, పెరుగుదల, అభివృద్ధి, క్షీణదశ, నాశనము అనే లక్షణాలు సంస్కృతులకున్నాయన్నాడు. సమాన స్థాయిలోనున్న అనేక నాగరికతలలో పాశ్చాత్య నాగరికత ఒకటి మాత్రమేనని, అది ఈ పాటికి క్షీణదశలో ఉందన్నాడు. ఈ క్షీణదశ నుండి మరి ఒక కొత్తది ఏది ఆవిర్భవించదన్నాడు. ఎందుకనగా సృజనాత్మక శక్తి తగ్గిపోవటంచేత లేదా సృజనాత్మక శక్తి మృగ్యమగుటచే ఆ సంస్కృతి కాలగర్భంలో కలిసిపోతుందన్నాడు. చరిత్రలో పురోగతి అన్న భావన ఒక భ్రమలాంటిదన్నాడు. ప్రజాస్వామ్యం ఒక పవిత్రమైనదిగా అన్నాడు. ప్రపంచ శాంతి స్థాపన అసాధ్యమైనదేకాక, కోరదగింది కాదన్నారు. 20 వ శతాబ్దం నియంతృత్వ, సామ్యవాద యుద్ధాలతో నిండిన శకమవుతుందని జోస్యం చెప్పాడు.

టాయన్‌బీ రచన 'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ' చాతుర్యముతో, ఆకర్షణీయమైన చిత్రణతో కూడిన బృహత్‌గ్రంథం. ఇందులో చారిత్రక సత్యాలను సామాజిక, తాత్విక, క్రైస్తవ మత దార్శనిక భావనల సహాయంతో విశ్లేషించబడింది. భగవంతుని ప్రేమను చూరగొన్న మానవజాతి ఒకటేనని చెప్పబడింది. తన ఈ గ్రంథంలోని 12 వ సంపుటంలో విమర్శకులకు వినయంగా సమాధానము ఇవ్వటమేగాక, ఇది అవకాశంగా తీసుకొని వ్యక్తిగత సమస్యలపై అనేక వ్యాసాలను పొందుపరిచాడు. ఇతడు తన కాలంలో పురావస్తు త్రవ్వకాల ద్వారా వెలుగులోకి వచ్చిన ఏడు ప్రాచీన నాగరికతలను విశ్లేషించి అధునాతన సమాచారాన్ని కూడా పొందుపరిచాడు.

టాయన్‌బీ విశ్లేషణలో అనేక లోపాలు ఉన్నాయని విమర్శకుల భావన. టాయన్‌బీ తన సిద్ధాంత వివరణకు అనుకూలమైన నాగరికతలనే ఎంపిక చేసుకోవటం, చారిత్రక ధోరణిని, పరిణామమును నిరూపించేందుకు టాయన్‌బీ నిరూపణలు లేదా ఆధారాల విలువ తక్కువగుటచే, ఇతని తుది నిర్ణయాలు అంగీకరించటానికి వీలులేదన్నారు. నాగరికతల పుట్టుక, అభివృద్ధి, క్షీణతల ఆధారంగా చరిత్ర గమనమును నిర్ధారించుట అశాస్త్రీయమని మరో విమర్శ. చరిత్ర ఎప్పుడూ మార్పులకు గురి అవుతుండుటచే ముందుగా ఏమి జరుగుతుందో జోస్యము చెప్పుటకు వీలుకాక పోవటంతో, ఒక క్రమబద్ధమైన రీతిలో, నమూనా ప్రకారం చరిత్రగమనం ఉంటుందని దృఢమైన సూత్రాలతో చరిత్రను బంధించడం తప్పని మరొక విమర్శ. నాగరికతల నిలుపుదల లేదా భగ్నతకు అంతర్గత సామర్థ్య రాహిత్యమే కారణమన్నది చరిత్ర మొత్తం గమనమునకు అన్వయించలేమన్నది మరో విమర్శ. ఇతని చరిత్రతత్వంలో కనిపించే మరో ప్రధానలోపం జాతీయ, మత దురాభిమానం. ఇతని క్రైస్తవ మతాభిమానం, పశ్చిమ నాగరికత, మనుగడ క్రైస్తవ మత పునరుద్ధరణపైనే ఆధారపడి వుందన్న భావన, ఈతని మతదురాభిమానమునకు మచ్చుతునక. అంతేగాక మానవ యత్నముకన్నా చరిత్ర దైవయత్నగతమైన ధోరణి ప్రధానమైనదన్న ఇతని భావన చరిత్ర విషయ విశిష్టతకు, శాస్త్రీయ రచనా సంవిధానానికి వ్యతిరేకమైంది. రచనాకాలం నాటి పరిస్థితులను పఠించే వ్యక్తి దృష్టిలో పెట్టుకొంటే టాయన్‌బీ సంపుటాలను సరిగా అర్థంచేసుకొని, అందలి లోటుపాట్లను అభినందించవచ్చునని విలియమ్. హెచ్. మెక్‌నీల్ (Willian H.Mc Neil) అంటాడు.

అనేక విమర్శలున్నప్పటికీ, నేడు టాయన్‌బీ గురించి పెక్కుమంది చరిత్రకారులు చర్చించడం అతని అమిత ప్రభావాన్ని తెలియజేస్తుంది. నాటి ప్రముఖ వైజ్ఞానిక వ్యక్తులలో ఆర్నాల్డ్ టాయన్‌బీ ప్రముఖ చరిత్రకారుడని, 1975 లో అతడు చనిపోయినపుడు 'ది టైమ్స్' (The Times) వర్ణించింది. గిబ్బన్ యొక్క 'డిక్లైన్ అండ్ ఫాల్ ఆఫ్ ది రోమన్ ఎంపైర్' తరువాత ఆర్నాల్డ్ టాయన్‌బీ 12 సంపుటాల 'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ' ఒక ప్రముఖ చారిత్రక గ్రంథంగా కీర్తించబడింది. అంతకు ముందు ఎన్నడూ లేనివిధంగా ఒకే వ్యక్తిచే రచింపబడిన గొప్ప వైజ్ఞానిక గ్రంథాలలో ఇది ఒకటి అని అమెరికా చరిత్రకారుడైన డబ్ల్యూ. హెచ్. ఆల్‌బ్రైట్ (W.H. Albright) అంటాడు. చరిత్ర, మతం, రాజకీయం మరియు ఇతర విషయాలపై టాయన్‌బీ భావాలు గొప్ప విధానాన్ని రేకెత్తించినా, కొన్ని సందర్భాలలో తీవ్ర విమర్శలకు గురి అయినా, తన 80 వ ఏట కూడా పాఠకులను ఆకర్షించగలిగాడు. అనేక విధాలుగా అతనికి అతడే విమర్శకుడు. వర్తమానాన్ని అర్థం చేసుకోవడానికే ప్రధానంగా ఇతడు చరిత్ర పరిశోధన చేపట్టాడు. చరిత్ర మొత్తం సమకాలిక చరిత్రే అన్న బెనిడెట్టో క్రోస్ (Benedetto Croce) తో టాయన్‌బీ ఏకీభవించాడు. ప్రాచీన చరిత్రతోబాటు సమకాలిక విషయాలపై కూడా ఇతడు అనేక రచనలు చేశాడు. ఇతడు రెండు శాంతి సమావేశాలకు హాజరగుటయేగాక, కెమాల్ ఆటాటర్క్ (Kemal Ataturk), హిట్లర్‌లతోబాటు నాటి ప్రముఖ రాజకీయ నాయకులను కలిసాడు. ఇతడు ఔత్సాహిక యాత్రికుడు. టాయన్బీ గొప్ప పండితుడు కాదని ఎవరూ సాహసించలేరు.

## 14.3 ముగింపు :

బ్రిటిష్ చరిత్రకారుడైన టాయన్బీ పది సంపుటాల తన ఉద్గ్రంథం 'ఏ స్టడీ ఆఫ్ హిస్టరీ' లో చరిత్రను ఒక బహిరంగ ప్రక్రియగా వీక్షించాడు. ఈ ప్రక్రియలో క్రమానుగత సవాళ్ళకు ప్రతి నాగరికతా సృజనాత్మకంగా స్పందించినంతకాలం అది అభివృద్ధి చెందటం కొనసాగుతుంది. అదే కనుక జయప్రదంగా స్పందించనప్పుడు భగ్నమయిపోతుంది. టాయన్బీ తన అధ్యయన ప్రమాణంగా నాగరికతను పరిగణనలోనికి తీసుకొన్నాడు. తన సవివరమైన అధ్యయనానికి, విశ్లేషణకు 21 నాగరికతలను ఎంపిక చేసుకొన్నాడు. తన విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయన ఫలితంగా నాగరికతలు క్షీణించడానికి హేతువులను తాను కనుక్కోగలనని విశ్వసించాడు. చారిత్రక సంఘటనల అసమాన నైజంలో ఇతడు ఆసక్తి చూపించలేదు. గతం నుంచి భవిష్యత్తులోకి తన సమగ్ర చారిత్రక దృక్పథాన్ని విస్తృతం చేశాడు. తద్వారా పాశ్చాత్య నాగరికత గమ్యం గురించి జోస్యం చెప్పాడు. అయితే

రెండో ప్రపంచ యుద్ధానంతరం టాయన్బీ చేసిన రచనల్లో తాను అనుభవపూర్వకంగా గ్రహించిన దానిని బట్టి పాశ్చాత్య నాగరికత భగ్నమైపోయే దశలో ఉందన్న తన భావనలో మార్పు కన్పించింది. నేటి అణుసాంకేతిక యుగంలో ప్రజాసమూహాలు ప్రాబల్యం వహిస్తున్న సమాజాల యుగంలో యుద్ధ సంబంధమైన రాజకీయ, ఆధ్యాత్మిక సవాళ్ళను ఎదుర్కోడానికి పాశ్చాత్య నాగరికత సామర్థ్యం మీద దాని మనుగడ ఆధారపడిందన్న అభిప్రాయానికి టాయన్బీ వచ్చాడు. ఈ మార్పు అతనిలో కనిపించినా, ప్రధానంగా ఉన్నత మతాలు మహిమాన్విత రూపం ధరించినా అతని చరిత్ర తత్త్వంలో మార్పు రాలేదు. ప్రత్యక్ష జ్ఞాన, జర్మన్ భావవాదులకు వ్యతిరేకంగా చేసిన విమర్శ చరిత్ర పునరావృతమన్న ఈ స్పెంగ్లర్, టాయన్బీ వంటి సైద్ధాంతికులకూ వర్తిస్తుంది. కారణం వీరూ ఎంచుకొన్న అనుభవాత్మక ప్రమాణాలను ముందుగానే నిర్ణీతమైన చరిత్రకు సంబంధించిన పథకానికి సరిపోయేలా అమర్చడానికే ప్రయత్నించారు.

## 14.4 నమూనా ప్రశ్నలు :

1. నాగరికత సంఘర్షణకు సంబంధించి టాయన్బీ యొక్క సిద్ధాంతము 'సవాలు మరియు స్పందన' వివరింపుము.
2. చరిత్ర తత్త్వమునకు టాయన్బీ చేసిన సేవను గణించుము.

## 14.5 చదువదగిన గ్రంథాలు :


1. E.W.F. Tomlin, : Arnold Toynbee, A Selection from his Works, Oxford University Press, 1978
2. B. Sheik Ali,: History : Its Theory and Method, Mc Millon, 1978.
3. N. Subrahmanyam : Historiogrophy, Madurai, 1986.
4. Pleter Geyl; : From Ranke to Toynbee, Smith College Press, 1952.
5. R.G. Collingwood; : The Idea of History, London, 1972.
6. J.W. Thompson; : A History of Historical Writing, 2 Vols. New York. 1958.


డా. వి. కె. మోహన్

పాఠం - 15

# వలసవాద చరిత్ర రచనా సంప్రదాయం

**15.0 లక్ష్యం:**

ఈ పాఠం అధ్యయనం వల్ల మీరు ఈ క్రింది విషయములను తెలుసుకొనగలరు.

* వలసవాద యుగంలో భారత చరిత్ర రచనాభివృద్ధిని వివరించగలగాలి.
* వలసవాద యుగంలో చరిత్ర రచనాభివృద్ధిలో బ్రిటిషు పండితుల, చరిత్రకారుల ఆలోచనా వైఖరులను విశ్లేషించగలగాలి.
* వలసవాద బ్రిటీషు చరిత్రకారుల ధోరణికి భారత చరిత్రకారుల ప్రతిస్పందన ఏమిటో, సమకాలీన పరిస్థితుల్ని ప్రతిబింబిస్తూ వాళ్ళ చరిత్ర రచన ఎలా జరిగిందో వివరించగలగాలి.

**విషయసూచిక:**


15.1 పరిచయం
15.2 భారత చరిత్ర రచన - సామ్రాజ్యవాద, వలసవాద ధోరణి
15.3 వలసవాద చరిత్ర రచనా సంప్రదాయంలో సానుభూతి పూర్వక వైఖరి: ప్రాచ్యవాదులు, భారత అధ్యయనాల నిపుణులు
15.3.1 సర్‌విలియమ్ జోన్స్
15.3.2 అలెగ్జాండర్ కన్నిన్గ్‌హామ్
15.3.3. ఎల్ఫిన్‌స్టన్
15.4 ప్రయోజనవాది జేమ్స్ మిల్
15.5 భారతదేశంలో బ్రిటీషుపాలన దైవదత్తమనే వైఖరి
15.6 పాశ్చాత్య, ప్రాచ్యశక్తుల పరస్పర కార్యవిధానం
15.6.1 వి.ఏ.స్మిత్
15.7 విషయగత ధోరణి
15.8 భారతీయ చరిత్రకారుల స్పందన
15.8.1. హేతువాద వర్గం
15.8.2. తీవ్రవాద వర్గం
15.9.3 యథాతథ వాదవర్గం
15.9.4 ఇతర ధోరణులు
15.9 సారాంశము
15.10 నమూనా ప్రశ్నలు
15.11 చదువదగిన గ్రంథాలు

## 15.1 పరిచయం:

చరిత్రలో విషయ నిష్ఠత అనేది వాస్తవికతకు సత్యానికి ప్రతీక. ఇది చరిత్రకారుడిచ్చే ప్రాధాన్యతను బట్టి మారే చారిత్రక యదార్థాలకే పరిమితం కాదు. ఇది యదార్థాలకు వ్యాఖ్యానానికి మధ్య వున్న సంబంధానికి సంబంధించింది. భవిష్యత్తుని దృష్టిలో వుంచుకొని చరిత్రకారుడు గతాన్ని వర్తమాన పరిధిలో క్రమబద్ధంగా పరిశీలించి వ్యాఖ్యానిస్తాడు ........ వ్యాఖ్యానించాలి. ఇది అతని బాధ్యత. కాని సమాజంలో, చరిత్రలో స్వీయ స్థితి పరిమితులను దాటి ఏ విషయాన్నైనా చూడగల సామర్థ్యం, గతం గురించి బుద్ధి సూక్ష్మతతో మరింత శాశ్వతమైన అంత దృష్టిని ప్రసాదించేలా భవిష్యత్తులోకి తన దృష్టిని సారించే సామర్థ్యం అతనికి వుండాలి. ఇలా ఎంతమందికి వుంటుందనేది వేరే విషయం. అయితే చరిత్ర రచనలో సమకాలీన దృక్కోణం నుండి గతాన్ని వీక్షించే చరిత్రకారులు సైద్ధాంతిక పరిశీలనలు, రాజకీయ నిబద్ధత, వ్యక్తిగత లేదా వర్గ దురభిమానాలు ఎక్కువగా ప్రభావితం చేసి ఆత్మాశ్రయతకు కారణం అవుతున్నాయి. ఆయా కాలాలనుబట్టి, నెలకొన్న పరిస్థితులను బట్టి చరిత్ర రచనల తీరుతెన్నులు వుంటాయి.

## 15.2 భారత చరిత్ర రచన - సామ్రాజ్యవాద, వలసవాద ధోరణి :

చరిత్ర పరిశోధనలో, రచనలో సైద్ధాంతిక పరిశీలనలు చరిత్రకారుణ్ణి ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. సైద్ధాంతిక పరిశీలనకు మూలం ఒక ప్రత్యేక ఆలోచనా మార్గంలో గట్టి నమ్మకం. అది మతధర్మ సంబంధమైనదో లేదా భౌతిక వాద సంబంధమైనదో లేదా మరే యితర మేధా సంబంధమైనదో కావచ్చు. ఆధునిక యుగంలో భారతదేశ చరిత్ర రచనలో అటువంటి సైద్ధాంతిక ధోరణులు మనకు కన్పిస్తున్నాయి. వాటిలో

అ) సామ్రాజ్యవాద, వలసవాద ధోరణి

ఆ) జాతీయవాద ధోరణి

ఇ) మతతత్వ వైఖరి

ఈ) మార్క్సిస్టు ధోరణి ప్రధానమైనవి.

ముఖ్యంగా మనదేశ చరిత్రపై వలసవాదం, జాతీయవాదం ప్రాబల్యం వహించటం కన్పిస్తుంది. ఈ రెండింటి దృష్ట్యానే అనేక అంశాలపై ఎంతో ఉపయోగకరమైన అధ్యయనాలు జరిగాయి. గత రెండు వందల సంవత్సరాల కాలంలో అనేకానేక చరిత్ర రచనలు వెలువడ్డాయి. బ్రిటీషు, భారతీయ చరిత్రకారులు చేసిన రచనలివి. ఎక్కువ భారతీయులు చేసినవే. రచనలెవరు చేసినా అన్నిటా వలసవాద చరిత్ర రచనా సంప్రదాయమే ప్రముఖంగా కన్పిస్తుంది.

భారతదేశంలో 17వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ అనే ఒక లండన్ వాణిజ్య సంస్థ కార్యకలాపాలు ముందుగా దాని మనుగడ కోసం, తరువాత ఆధిపత్యం, విస్తరణలకు సాగించిన నిరంతర ఘర్షణలు, అనంతరం 1858లో బ్రిటీషు ప్రభుత్వం అధికారం చేపట్టడం, ప్రపంచ ఆధిపత్యం కోసం యీ దేశం సామ్రాజ్యవాదుల చేతుల్లో ఒక పావుగా మారటం, వనరుల్ని ఏవిధంగా బ్రిటీషువారు దోపిడీ చేసిందీ తదితర విశేషాలు లండన్‌లోని ఇండియా ఆఫీస్ లైబ్రరీలో నిక్షిప్తమైన జాబులు, తదితర కాగితాల దొంతుల్నుండి వివరంగా లభిస్తున్నాయి. అనేక విషయాల్లో భారతదేశం బ్రిటీష్‌వారి ప్రధాన వలస కేంద్రమయినట్లు వాళ్ళ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రగతిలో అపురూప వలస రాజ్యంగా కీలకపాత్ర వహించటం ద్వారా 19వ శాతాబ్దంలో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో పూర్తిగా అంతర్భాగమైనట్లు స్పష్టమవుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ భావజాలంపై నిర్మితమైన సామ్రాజ్యవాద, వలసవాద చరిత్ర రచనా విధానం బ్రిటీషు రచయితలు మాత్రమే అనుసరించింది కాదు, ఇది ఎక్కువ మంది భారతీయ చరిత్రకారుల రచనలపై బలంగానే ప్రభావం చూపింది. కొన్నిసార్లయితే సామ్రాజ్యవాద వ్యతిరేకులుగా తమను తాము భావించుకున్న చరిత్రకారులపై కూడా యీ ప్రభావాన్ని చూడొచ్చు. భారతీయ ఆధ్యాత్మికతా చింతన చాలా గొప్పదని ఎప్పుడూ ప్రకటించే వాళ్ళు నిజానికి సామ్రాజ్యవాద చారిత్రక దృక్పధాన్నే అనుసరిస్తున్నారని చెప్పాలి. సైద్ధాంతికంగా, నాగరికంగా వెనుకబడి వున్న భారతీయ సమాజాన్ని ఆధునీకరించడానికి వలసవాదం అవసరమని 19వ శతాబ్దం ప్రారంభంలో బ్రిటీషు చరిత్రకారుల భావన. కాని ఆ శతాబ్దం చివరలో ఈ రకమైన ధోరణికి వలసవాదులు స్వస్తి చెప్పారు.

## 15.3 వలసవాద చరిత్ర రచనా సంప్రదాయంలో సానుభూతి పూర్వక వైఖరి : ప్రాచ్యవాదులు; భారత అధ్యయనాల నిపుణులు

బ్రిటీషు యుగంలో భారతదేశంలో చారిత్రక సంఘటనలు చోటు చేసుకుంటున్నప్పుడే చరిత్ర రచనలూ జరిగాయి. ఇక్కడికి వచ్చిన సైనిక యోధులు, పాలనా నిర్వాహకులు, వర్తకులు కూడా రాజకీయంగా ఉపదేశాత్మక చరిత్ర రచనల ద్వారా విధాన నిర్ణేతల నిర్ణయాలను ప్రభావితం చేయాలని ప్రయత్నించారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, హాలెండ్‌లలో మితవాద, ఉదారవాద వర్గాలు వెలసినాయి. ఐరోపావాసులే వలసలపై రాజకీయ అధికారం నెరపాలనే విషయంలో యీ రెండు వర్గాలకీ తేడా లేదు. కాకుంటే వలస వ్యవస్థలో, పాలనా విధానం విషయాల్లో తేడా వుంది. కాలం గడిచే కొద్దీ యితర ఆలోచనా ధోరణులూ ఆవిర్భవించాయి.

### 15.3.1 సర్ విలియమ్ జోన్స్ (1746-94) :

18వ శతాబ్దంలో ప్రారంభమైన బ్రిటీషువారి భారతీయ చరిత్ర రచనా సంప్రదాయం మొదట ప్రాచీన యుగ చరిత్ర విమర్శనాపూర్వక అధ్యయన పునర్నిర్మాణాలపై కేంద్రీకృతమయింది. ప్రాచ్యవాదులు లేదా ఇండాలజిస్టులు మనదేశ గత చరిత్ర - సంస్కృతి గురించి విశ్లేషించడం ఆరంభించారు. ఇక్కడ అధికారాన్ని నెరపుతున్న కంపెనీ ఉద్యోగులకు యీ ప్రజల గురించి తెలుసుకోవలసిన అవసరం ఏర్పడటమే దీనికి ప్రధాన కారణం. దీని పర్యవసానమే విలియమ్ జోన్స్, అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్, మన్రో, మాల్కొలమ్, ఎల్ఫిన్‌స్టన్ మొదలైన ప్రాచ్యవాదుల అధ్యయనాలు.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ కళాశాలలో ఉన్నతవిద్య నభ్యసించిన విలియం జోన్స్ సాంప్రదాయిక వాఙ్మయంలోను, పారశీకంలోను పండితుడు. కలకత్తా సుప్రీమ్‌కోర్ట్ న్యాయమూర్తిగా 1784లో భారతదేశం వచ్చిన అతడు అదే సంవత్సరంలో 'The Asiatic Society of Bengal' అనే సంస్థ (సంఘం) ను స్థాపించి తానే అధ్యక్షునిగా దాన్ని ఒక పరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దాడు. 'Asiatic Researches' పేరుతో యీ సొసైటీ వెలువరించిన జర్నల్‌లో భరతీయ చరిత్ర, సంస్కృతులపై అనేక పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు. ముఖ్యమైన సంస్కృత గ్రంధాలకు అనువాదాలు వచ్చాయి. ఎక్కువగా ఆంగ్లంలో వెలువడ్డాయి. విలియమ్ జోన్స్‌నే యీ అనువాదకుల్లో మొదటివానిగా చెప్పాలి. "Bibliotheca Indica" పరంపరలో వ్యాసాలు, అనువాదాలు అనేకం చోటు చేసుకున్నాయి. 'మను సంహిత', 'కాళిదాసు' 'శాకుంతలమ్', జయదేవుని గీత గోవిందమ్' లను జోన్స్ అనువదించాడు. Asiatic Society కార్యకలాపాల్లో జోన్స్‌లాగానే "భగవద్గీత" 'హితోపదేశమ్' గ్రంధాలను అనువదించిన చార్లెస్ విల్కిన్స్, కోల్‌బ్రూక్, జాన్‌షోర్, గ్లాడ్విన్ తదితరులూ ప్రాముఖ్యం వహించారు. గ్రీక్ చరిత్రకారులు పేర్కొన్న సాండ్రకొటస్‌ను ప్రాచీన భారతీయ పాలకుడు చంద్రగుప్తమౌర్యునిగా గుర్తించి గ్రీకు చక్రవర్తి అలెగ్జాండర్‌తో అతని సమకాలీనతను జోన్స్ నిర్ధారించడంతో ప్రాచీన భారతదేశ చరిత్రకు మొదటి నిశ్చితమైన తేదీ లభించినట్లయింది. అంతేగాక గంగ, సోన్ నదుల సంగమం వద్ద ప్రాచీన

పాలిబోత్ర (పాటలీపుత్ర) నగరాన్ని నిర్దేశించి తద్వారా భవిష్యత్తులో ప్రాచీన భారతదేశ భౌగోళిక స్థితిగతుల గురించి జరగబోయే అధ్యయనాలకు జోన్సే నాంది పలికాడు. ఎంతో ప్రాధాన్యత సంతరించుకొన్న అతని మరో ముఖ్యమైన పరిశోధన ఒక ప్రక్క సంస్కృత పారశీక భాషల మధ్య, మరో వంక గ్రీకు, లాటిను, సెల్టిక్, జర్మానిక్ భాషల మధ్యనున్న పోలికల గురించిన అధ్యయనం.

విలియం జోన్స్, అతని సహోద్యోగులు సంస్కృత వ్యాకరణం, నాటకం, పద్య కవిత్వ అధ్యయనాల ద్వారాను, హిందూ న్యాయశాస్త్రంతో వున్న పరిచయం ద్వారాను ప్రాచీన హిందూ నాగరికత అత్యున్నత స్థాయిలో వుందని వాదించారు. కోల్‌బ్రూక్, విల్కిన్స్, ప్రిన్సెప్‌లు వాళ్ళను సమర్థించారు. కాని జేమ్స్‌మిల్ వాళ్ళ వాదనను నిర్ద్వందంగా ఖండించాడు. ఏది ఏమైనా భారతీయ పురావస్తు శాస్త్ర రంగంలో జోన్సే మార్గదర్శి అని చెప్పాలి.

## 15.3.2 అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ (1814-1893) :

వృత్తిరీత్యా ఇంజనీర్ అయిన అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ 1833లో భారతదేశానికి వచ్చాడు. సైన్యం నుండి మేజర్ జనరల్‌గా 1861లో ఉద్యోగ విరమణ చేసాడు. అనంతరం 1865 వరకు మొదటి ఆర్క్యా లాజికల్ సర్వేయర్‌గా పని చేసి, 1870 నుండి 1885 వరకు పురావస్తు శాఖ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వర్తించాడు. దేశంలో అనేక ప్రాంతాలు పర్యటించి ముఖ్యమైన చారిత్రక విశేషాలను వార్షిక నివేదికల రూపంలో వెలువరించాడు. అనేక పరిశోధనా పత్రాలతోబాటు చరిత్ర పురావస్తు శాస్త్రాలపై పలు గ్రంథాలు ప్రచురించాడు.

కన్నింగ్‌హామ్ వెలువరించిన గ్రంథాల్లో అశోకుని శాసనాలతో వున్న 'Corpus Inscriptionum Indicarcum' మొదటి సంపుటం. 'Bhilsa Topes', Ancient Geography of India', 'The Stupa of Barhut', 'The Book of Indian Eras', 'Mahabodhi' ముఖ్యమైనవి. ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేయటం ద్వారా విలియమ్ జోన్స్ ప్రాచీన భారతీయ చరిత్ర సంస్కృతి అధ్యయనాలకు మార్గదర్శికంగా కన్నిన్గ్‌హామ్ పురావస్తు పరిశోధన నాణేల పరిశీలన ద్వారా ప్రాచీన భారతీయ సంస్కృతి అవగాహనకు ముందుగా దారితీసినవాడయ్యాడు.

## 15.3.3. ఎల్ఫిన్‌స్టన్ (1779-1859)

ఆధునిక చరిత్రకారుల్లో టాసిటస్‌గా ప్రసిద్ధిపొందిన మౌంట్ స్టూవర్ట్ ఎల్ఫిన్‌స్టన్ ఎడింబరోలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని 16వ ఏట భారతదేశం వచ్చి ఈస్ట్ ఇండియా కంపెనీలో లేఖకునిగా ఉద్యోగంలో చేరి అనేక హోదాల్లో కంపెనీని సేవించి 1819లో బొంబాయి గవర్నరు స్థానానికి ఎదిగాడు. 1827లో పదవీ విరమణ చేసాడు. 1839లో అతని మొదటి ప్రధాన చరిత్ర గ్రంథం 'History of India' వెలువడింది. ఆధునిక చరిత్ర రచనా సంప్రదాయంతో పరిచయం వున్న అతని గ్రంథంలో ప్రాచీన, మధ్యయుగాల భారతదేశ చరిత్ర విషయ వివరణలో కట్టుకథలకు, సంప్రదాయాలకు తావివ్వలేదు. ప్రాచీన భారత చరిత్రను ఋగ్వేద సంకలనంతో ప్రారంభించి పురాణాల సహాయంతో మహాభారత యుద్ధ కాలం నుండి క్రీ.శ.4వ శతాబ్దిలో గుప్తుల వరకు పాలించిన రాజవంశాల కాల నిర్ణయానికి ప్రయత్నించాడు. రాజకీయ చరిత్రపై కాక హిందూ సాంస్కృతిక ఘనతపై దృష్టిని కేంద్రీకరించాడు. జావా, బాలి వంటి ద్వీపాలతో జరిగిన విదేశీ వాణిజ్యం కూడా అతని దృష్టిని ఆకర్షించింది. తనకు లభించిన చరిత్ర ఆధారాలను పూర్తిగా వినియోగించుకొని ఎల్ఫిన్‌స్టన్ ప్రాచీన భారత సాంస్కృతిక చరిత్రకు గట్టి పునాది వేసాడు.

పైన చెప్పిన సర్ విలియమ్ జోన్స్, కన్నిన్గ్ హామ్, ఎల్ఫిన్‌స్టన్ మొదలైన ప్రాచ్య వాదులందరూ భారతీయ సమాజం పట్ల, సంస్థల పట్ల సానుకూలత, సానుభూతి తమ రచనల్లో ప్రదర్శించిన వారే. భారతీయ సంస్కృతిని ఆదర్శప్రాయమని భావించి

స్తుతించినవారే. అయితే సమకాలీన చారిత్రక పద్ధతిలో చరిత్ర ఆధారాలను విశ్లేషించలేదు. ముఖ్యంగా ప్రాచీన వాఙ్మయంలో వర్ణించినట్లు ఆనాటి భారతీయ సమాజం వుందా? లేదా? అనే ఆలోచన, ప్రశ్నలు వాళ్ళు వేసుకోలేదు. దీనికి ఆ వాఙ్మయాన్ని వాళ్ళు పూర్తిగా నమ్మడం ఒకటైతే మరొకటి వాళ్ళల్లో ఎక్కువ మంది పారిశ్రామికీకరణతో ఐరోపాలో వస్తున్న మార్పుల్ని జీర్ణించుకోలేని స్థితిలో తమ స్వీయ సమాజం నుండి వేరుపడి ఊహాస్వర్గాల కోసం మరెక్కడో వెదకడం ఆరంభించిన వారు. వాళ్ళకు ప్రాచ్య ప్రపంచంలోని భారతీయ సంస్కృతి అటువంటి ఊహాస్వర్గ సమాజంలా కన్పించింది. పైగా ప్రాచ్యవాదులు జేమ్స్‌మిల్ వంటి ఉపయోగితా వాదులతో చేస్తున్న పోరాటంలో ఓటమి పాలవుతూ రావడం కూడా దీనికి తోడయింది. కాని వాళ్ళు మన దేశ గతాన్ని పునర్దర్శించడానికి కారకులయ్యారు.

## 15.4 ప్రయోజనవాది జేమ్స్ మిల్ (1773 - 1836) :

భారతీయుల చారిత్రక చింతనను ప్రభావితం చేసిన ప్రయోజనవాదుల్లో లేదా ఉపయోగితావాదుల్లో ముఖ్యుడు జేమ్స్ స్టూవర్టు మిల్. మాన్‌ట్రోజ్ అకాడెమీలోను, ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో యీతడు చదివాడు. తత్వశాస్త్రమంటే మక్కువ ఎక్కువ బెన్‌థామ్, రికార్డో జోసెఫ్ హ్యూమ్, గ్రోట్‌లకు సన్నిహిత మిత్రుడు. రాజకీయార్థిక వ్యవస్థపై నిర్దిష్టమైన అభిప్రాయాలున్న వ్యక్తి ప్రసిద్ధ ఉపయోగితావాద తత్వవేత్త. 1819లో ఉత్తరప్రత్యుత్తరాల ఉపపరిశీలనాధికారిగా ఇండియా ఆఫీసులో నియుక్తుడైన ఈతడు 1830 నాటికి ఆ ఆఫీసుకే అధిపతిగా ఎదిగాడు.

భారతదేశం గురించి రాయడానికి పూర్వమే జేమ్స్‌మిల్ బహుళంగా రచనలు చేసిన వ్యక్తి. ఆది నుండి 18వ శతాబ్దం చివరిదాకా భారతదేశ చరిత్రను 'History of British India' పేరుతో 1818 నాటికి ఆరు భాగాలుగా వెలువరించాడు. ఇదే మొదటి భారతదేశ చరిత్ర గ్రంథ మనవచ్చు. మెకాలే ఎంతగానో మెచ్చుకున్న యీ గ్రంధాన్ని Indian Civil Service ఉద్యోగులకు పాఠాలు చెప్పే హైలిబా కళాశాలలో పాఠ్యపుస్తకంగా నిర్దేశించటం జరిగింది. ఈ గ్రంధానికున్న అత్యధిక ప్రాముఖ్యం భారతదేశ చరిత్ర రచనలో మతతత్వ వైఖరికి బలమైన పునాది వేయడం, తద్వారా ద్విజాతి సిద్ధాంతానికి చారిత్రక సమర్థనను కల్పించడం. (మన దేశ చరిత్రను మతపరంగా హిందూ నాగరికత, ముస్లిం నాగరికత, బ్రిటీష్ నాగరికత, క్రిస్టియన్ నాగరికత అని అనలేదెందుకో?) అని యుగ విభజన మొదటిసారిగా జేమ్స్‌మిల్ ప్రవేశపెట్టాడు. ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాలనే పదాలు కొంతమంది చరిత్రకారులు యిప్పుడు వాడుతున్నా మిల్ రూపొందించిన దశల విభజన ప్రాతిపదికైన ప్రధానపాలక వంశాల మతాల్లోని మార్పు యిప్పటికీ సజీవంగానే వుంది.

జేమ్స్‌మిల్ తన గ్రంథంలో జాత్యహంకార ధోరణిలో విజేత దృక్పథంతో ఉపయోగితావాద విలువల దృష్ట్యానే విషయాలను వివరించాడు. హిందూ సంస్కృతిని వెనుకబడ్డ సంస్కృతని, ప్రగతినిరోధమని, హేతురహితమని వర్ణించాడు. ముస్లిం నాగరికత పట్ల సానుభూతి కనబరచినా దాన్నీ కొన్ని సందర్భాల్లో ఖండించాడు. బ్రిటీషు యుగం విషయంలో కూడా ఉదారులైన వారన్ హేస్టింగ్స్ లాంటి పాలకుల పట్ల తీవ్ర వైఖరినే ప్రదర్శించాడు. ఇదంతా అతని జాతి దురభిమానంతో బాటు, అసమగ్ర విజ్ఞానాన్ని, విమర్శనాదృక్పథ రాహిత్యాన్ని తెలియజేస్తుంది.

## 15.5 భారతదేశంలో బ్రిటీషుపాలన దైవదత్తమనే వైఖరి :

19వ శతాబ్దంలో బ్రిటీషు తత్వవేత్తల బృందమొకటి బలంగా వుండేది. బ్రిటీషు పరిపాలన, బ్రిటీషు శాసన వ్యవస్థ భారతదేశం వెనుకబాటుతనాన్ని అంతం చేస్తాయి. కాబట్టి భారతదేశానికి బ్రిటీషువారు రావడం దైవం యిచ్చిన వరమని యీ

వర్గం నమ్మేది. బ్రిటీషు వారి పరిపాలన యిక్కడి నియంతలను తొలగించి భారత ప్రజలకు రాజకీయ చైతన్యాన్ని, స్పృహను కలిగిస్తుందని వీరు విశ్వసించారు. ఈవిధంగా భారతదేశంలో బ్రిటీషు పరిపాలన సమర్థించిన వాళ్ళల్లో జేమ్స్ మిల్ కాక మతాచార్యులైన షోర్, గ్రాంట్ మొదలైన వారున్నారు. ఒక పనికిమాలిన జాతిని విముక్తం చేయడానికి, భారతదేశంలో ఆ భగవంతుడే ముందుగ నిర్దేశించాడని వాళ్ళ భావన. క్రైస్తవ సంఘాలు వాళ్లకి మద్దతు పలికాయి. భారతీయ సమాజాన్ని మతం మార్పిడి ద్వారా, విద్యద్వా మార్చాలని వాళ్లందరూ ప్రయత్నించారు.

## 15.6 పాశ్చాత్య, ప్రాచ్య శక్తుల పరస్పర కార్యవిధానం :

ఆల్‌ఫ్రెడ్ ల్యాల్, హెనీ మైన్, స్టీఫెన్, విలియమ్ హంటర్ మొదలైన వారి వర్గం తాత్విక చరిత్రకారులతో కూడినది మరొకటి ఉంది. భారతదేశంలో బ్రిటీషు పాలన ప్రాచ్య, పాశ్చాత్య శక్తుల పరస్పర కార్య విధాన ఫలితం అనేది యీ వర్గం దృష్టి. వీళ్ళల్లో హంటర్ బ్రిటీష్ సివిల్ సర్వెంట్ అయినప్పటికీ భారతీయుల్ని ఆంగ్లేయుల హృదయాలకు దగ్గరయ్యేలా చరిత్ర రచనలు చేసాడు. అతని రచనల్లో 'A Comparative Directory of the Non-Aryan Languages in India and High Asia', 'The Annals of Rural Bengal', 14 సంపుటాల్లో 'The Imperial Gazatteer of India' ముఖ్యమైనవి. ఇవిగాక 28 సంపుటాల్లో వెలువరించిన 'The Rulers of India' పరంపరకూ అతనే సంపాదకుడు.

### 15.6.1 వి.ఏ. స్మిత్ (1848-1920)

విలియమ్ జోన్స్‌తో ప్రారంభమైన పరిశోధకుల పరంపరలో ప్రసిద్ధులైన వారిలో చిరవగా విన్సెంట్ ఆర్థర్‌స్మిత్ పేరు చెప్పాలి. జేమ్స్‌పాల్ తరువాత మన చరిత్ర రచనా సంప్రదాయాన్ని ప్రభావితం చేసిన మరో బ్రిటీషు ఉద్యోగి యీ స్మిత్. ఇతని తండ్రి పురావస్తుశాస్త్ర కోవిదుడు, నాణేల పరిష్కర్త. స్మిత్ కాలానికి వాఙ్మయ ఆధారాలతో బాటు చారిత్రక అవశేషాల పరిశోధనా ముమ్మరమయింది. 1837లో జేమ్స్ ప్రిన్సెప్ బ్రాహ్మీలిపిని పరిష్కరించడంతో శాసనాధారాల ప్రాముఖ్యం చరిత్ర పునర్నిర్మాణంలో బాగా పెరిగింది. పైగా బూలర్, కీల్‌హోర్న్ ఫ్లీట్‌ల పరిశోధనలూ భారత చరిత్ర రచనను మెరుగు దిద్దాయి.

వి.ఏ.స్మిత్ 1871లో Indian Civil Service లో చేరి 30 సంవత్సరాలు భారతదేశంలో ఉద్యోగం నిర్వహించాడు. అర్ధశతాబ్దం పాటు భారతదేశ చరిత్ర, కళలు పురావస్తు శాస్త్ర విషయాలను ఎంతో ఆసక్తితో పరిశోధించి, సమాచారాన్ని సేకరించి శాస్త్రీయంగా చక్కటి భాషా శైలితో విషయాలను సమగ్రంగా వివరించాడు. ప్రాచీన భారత చరిత్రను అధ్యయనం చేసిన యితడు ప్రతి విశేషాన్ని గ్రీకు నాగరికతా సంపర్క ప్రభావంగా నిరూపించ ప్రయత్నించాడు. 'Indian Antiquary' అనే జర్నల్‌కు 40 సంవత్సరాల పాటు అనేక విషయాలపై ఎన్నో పరిశోధనా వ్యాసాలు ప్రచురించాడు. వీటిలో 'The Coins of the Gupta Dynasty', 'The History and Coinage of the Chandela Dynasty', 'The Palas of Bengal' ముఖ్యమైనవి. ఇవిగాక ఆంధ్రుల గురించి, ఆంధ్రుల నాణేల గురించి, ఇండో-పార్థియన్ల గురించి, శకుల గురించి, గుప్తుల నాణేల గురించి కూడా అనేక పరిశోధనా వ్యాసాలను 'The Journal of the German Oriental Society' లో ప్రచురించాడు. 'Royal Asiatic Society Journal' లోనూ స్మిత్ వ్యాసాలు చోటు చేసుకున్నాయి.

వి.ఏ.స్మిత్ రాసిన చరిత్ర గ్రంథాల్లో 'Asoka - The Buddhist Emperor of India' (1901) మొదటిది. విషయపరంగాను, గుణాత్మకంగాను అశోకునిపై ఆ తరువాత వచ్చిన రచనలకు స్మిత్ గ్రంథం ఏ విధంగానూ తీసిపోని రీతిలో వుంది. 1904లో 'The Early History of India' ను పూర్తి చేసాడు. స్మిత్ యీ గ్రంధ రచనకు ఆనాటి వరకు లభించిన

చరిత్ర ఆధారాలు అన్నింటిన్నీ శోధించి వంశావళులకు సంబంధించిన రాజకీయ చరిత్రకు ప్రాధాన్యతనిస్తూ ప్రామాణికంగా రచించాడు. ఇతని యితర గ్రంధాల్లో 'Catalogue of the Coins in Indian Meseum', Vol. I (1906), 'A History of Fine Art in India and Ceylon' (1911), 'Akbar, the Great Mughal' (1917), 'The Oxford History of British India' (1918) లు రచయిత పరిశోధనాభిలాషకు, సునిశితమేధా సంపత్తికి అద్దం పట్టాయి.

గిబ్బన్‌లానే యితడు కూడా వీరులు, సామ్రాజ్యాల వల్ల ఉత్తేజితుడై భారత చరిత్రను అదే పద్ధతిలో అధ్యయనం చేసిన పర్యవసానంగా అశోకుడు, రెండో చంద్రగుప్తుడు, అక్బర్‌లు ప్రముఖ పాలకులైతే మిగిలిన పాలకుల కాలం అంధయుగమయింది. ముందే చెప్పినట్లు యితనిలో కన్పించే మరో లోపం భారతీయ నాగరికతలో కన్పించే ప్రతి మంచి విశేషం గ్రీకు నాగరికతా సంపర్క ప్రభావ ఫలితమేనని నిరూపించాలని తాపత్రయపడటం. వీటికి తోడు బ్రిటీషు పాలనను సమర్థించే ఆయుధంగా చరిత్ర రచనను చేపట్టడం వల్ల, ఆ పాలన వల్ల భారతీయులకు కలిగిన మేలుని నొక్కి చెప్పాలని అభిలషించడం వల్ల స్మిత్‌లో ఉత్తమ చరిత్రకారునికి ఉండాల్సిన విషయ నిష్ఠత లోపించింది.

## 15.7 విషయగత ధోరణి

పై ధోరణులకు, రచనలకు భిన్నంగా ఆ తరువాత వచ్చిన ఆధునిక చరిత్రకారులు పి.ఇ. రాబర్ట్స్, టి.జి.పి. స్పియర్, సి.హెచ్. ఫిలిప్స్, ఫర్టర్, బార్‌హాచెట్‌లు రాంకె అడుగుజాడల్లో చరిత్ర రచనకు పూనుకొన్నారు. చరిత్ర ఆధారాలను జాగ్రత్తగా, విమర్శనాత్మకంగా అధ్యయనం చేసి విషయాన్ని, సాధ్యమైనంతవరకు వస్తుగతంగానే చెప్పడానికి ప్రాధాన్యత నిచ్చినట్లు స్పష్టమవుతుంది.

## 15.8 భారతీయ చరిత్రకారుల స్పందన:

ఆయా దృక్పధాల నుండి బ్రిటీషు చరిత్రకారులు యీ విధంగా చరిత్ర రచన కొనసాగిస్తున్న కాలంలోనే కొంత ఆలస్యంగానే యీ రంగంలోకి అడుగుపెట్టిన భారతీయ చరిత్రకారులు సంఘటనలను ప్రభావితం చేసే ప్రక్రియలు, పరిస్థితులను విశ్లేషించే ప్రయత్నం కూడా లేకుండా కేవలం వర్ణనకు, కథనానికి పరిమితమై పోయారు. దీనికి ఉదాహరణ ఆర్.జి. భండార్కర్. అతని రచనలు 'The Early History of the Deccan' (1884), 'A Peep into the Early History of India' (1900) నిర్దిష్టతకు, యదార్థవాదానికి ప్రతీకలు. తమకంటూ యీ చరిత్రకారులకు కొత్త అవలోకనం ఏమీ లేదు. ఆంగ్లేయుల అడుగుజాడల్లోనే రాజకీయ వంశ చరిత్రలు రాసారు. కొత్త సమాచార సేకరణకు శ్రమించారు.

మొదట బ్రిటీషు వారి అడుగుజాడల్లోనే త్వరలోనే భారతీయులు తమ స్వీయ భావాలను ఏర్పరచుకున్నారు. స్వజాతి శ్రమ ద్వారా వచ్చే భారతీయ సమాజ పరిణామంలోనే చరిత్ర అసలు ప్రాముఖ్యం వుందని గుర్తించారు. అయితే యిటువంటి ఆధునిక భావజాలాన్ని ఏర్పరచుకోడానికి ముందు భారతీయుల చారిత్రక చింతనలో వైవిధ్యంతో అనేక దశలు కన్పించాయి.

### 15.8.1 హేతువాద వర్గం:

18వ శతాబ్దం చివరి దశకాల్లో భారతదేశంలో విదేశీ పండితులు విలియమ్ జోన్స్ మొదలైన వారి ద్వారా ఆధునిక చరిత్ర పరిశోధనలు ఆరంభమయ్యాయి. అనంతరం వ్యాప్తి చెందిన పాశ్చాత్య విద్య భారతీయుల ఆలోచనల్ని మార్చింది. ఆయా రంగాల్లో కొత్త భావాలు ప్రభావం చూపించాయి. శాస్త్ర పరిజ్ఞానం పెరిగింది. విషయాత్మకత చోటు చేసుకుంది. భారతదేశ చరిత్ర, సంస్కృతులపై

విమర్శనాత్మక అధ్యయనాలు ప్రారంభమయ్యాయి. మన సాంస్కృతిక వారసత్వపు విలువకు గుర్తింపు వచ్చింది. విషయాత్మక వివేకంతో హేతుబద్ధంగా చారిత్రక సంఘటనలను చరిత్రకారులు వీక్షించారు. భారత చరిత్ర విషయంలో యూరోపియన్లు చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నంలో రాజా రాజేంద్ర లాల్ మిత్రా, రమేష్ చంద్రదత్, ఆర్.జి. భండార్కర్, హెచ్.సి. రామ్ చౌదరి మొదలైన చరిత్రకారులు యీ విధంగా వ్యవహరించారు.

జోన్స్ పరిశోధనలతో స్ఫూర్తి పొందిన రాజేంద్రలాల్ మిత్రా (1822-91) బెంగాలీ యువ మేధావి. 1846-56 దశకంలో Asiatic Society ఉపకార్యదర్శిగా, లైబ్రేరియన్‌గా, అనంతరం వార్డ్స్ ఇన్‌స్టిట్యూషన్ (జమీన్దార్లు, భూస్వాముల కుమారుల విద్యాభ్యాసం కోసం స్థాపించిన సంస్థ) కు డైరెక్టర్‌గా 25 సంవత్సరాలు యితడు వ్యవహరించాడు. చరిత్ర పరిశోధకులకు ఉపయోగపడేలా గ్రంథాలు, మ్యాపులు, సంస్కృత వ్రాత ప్రతులు మొదలైనవాటి విస్తృత వర్ణనాత్మక జాబితాలు రూపొందించి యితడు ఎంతో మేలు చేసాడు. కామందకుని 'నీతిసారం' యితని సంపాదకత్వంలో వెలువడింది. కౌటిల్యుని 'అర్థశాస్త్రం', చైతన్య 'చన్ద్రోదయ నాటకమ్', శునాకుని 'బృహద్దేవత', పతంజలి 'యోగసూత్ర', 'అగ్ని పురాణం', 'వాయు పురాణం', యింకా అనేక బ్రాహ్మణాలు ఆరణ్యకాలు యితని వ్యాఖ్యానాలతో వచ్చినాయి. ఇతని వ్యాసాలను కొన్నింటిని సంకలనం చేసి 1881లో "The Indo-Aryans" పేరుతో రెండు సంపుటాలు వెలువరించారు. అయితే 'The Sanskrit Buddhist Literature of Nepal', 'Antiquities of Orissa' అనే రచనలు రాజేంద్రలాల్ పేరుని ప్రసిద్ధ భారత చరిత్రకారులు, ప్రాచీన విషయాల పరిశోధకుల జాబితాలో శాశ్వతం చేసినాయి.

బొంబాయి ఎల్ఫిన్‌స్టన్ కళాశాలలో ప్రాచ్య భాషల ఆచార్యునిగా, అనంతరం పూనాలోని దక్కన్ కళాశాలలో పనిజేసిన రామకృష్ణ గోపాల్ భండార్కర్ (1837-1925) ప్రధానంగా 'Early History of the Deccan' (1884), 'A Peep into the Early History of India' (1890), 'Vaishnavisum, Saivisum and Minor Religious Systems' (1913) అనే గ్రంధాలు రాసాడు. భండార్కర్ యింకా అనేక శాసనాలు, యితర అంశాలపై ఎన్నో చారిత్రక వ్యాసాలు ప్రచురించాడు. సమాచారాన్ని క్షుణ్ణంగా విమర్శనాత్మకంగా పరిశీలించి అభిప్రాయాలను ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో వెల్లడించేవాడు. చరిత్రకారుడు ఒక న్యాయాధీశునిలా వ్యవహరించాలని అతని భావన. రాజకీయ చరిత్రతో బాటు సామాజిక, ఆర్థిక, మత విషయాలనూ చరిత్ర అధ్యయనంలో భాగంగా అతడు పరిగణించాడు.

### 15.8.2 తీవ్రవాద వర్గం

రాజ్‌నారాయన్‌బోస్, చంద్రనాథ్ బసు, బంకించంద్ర చటర్జీ, అవినాష్ చంద్రదాస్, కాశీ ప్రసాద్ జయస్వాల్, బాలగంగాధర్ తిలక్, దామోదర్ వీర్ సావర్కర్ మొదలైన వారు తీవ్రవాద వర్గీయులు. పాశ్చాత్య సంస్కృతిపై హైందవ సంస్కృతీ ఆధిక్యతను వీళ్ళు తమ రచనల్లో చాటారు. బంకించంద్ర 'దుర్గేశ నందిని', 'కపాలకుండల', 'ఆనందమఠ్' వంటి చారిత్రక నవలలు, తిలక్ రాసిన 'Resources into the Activity of Vedas', 'The Arctic Home in the Vedas' గ్రంధాలు, సావర్కర్ రాసిన 'The First war of Indian Independence' తదితర రచనల్లో భారతదేశ గతం ఎంతో వైభవోపేతమయిందనే గట్టి నమ్మకం. జాతీయ భావాల ఉప్పెనలో స్పష్టంగా కన్పించింది. ఇస్లాం సంస్కృతి ఆధ్యాత్మిక బలంపై కాక శారీరక శక్తిపై ఆధారపడిందనే విషయం కూడా యీ రచనల్లో ప్రస్ఫుటమయింది. జయస్వాల్ (1871-1937) తన 'Hindu Polity' గ్రంధంలో మన దేశంలో గతంలో ప్రజా ప్రాతినిధ్య ప్రభుత్వం ఒక సాధారణ విషయంగా, ధర్మ బద్ధుడైన రాజు రాజ్యాంగ బద్ధంగా పాలించే వాడని చిత్రించాడు. అతడే "History of India, A.D. 150 to A.D. 350" లో నాగులను జాతివీరులుగా తీర్చిదిద్దాడు.

### 15.8.3 యథాతథవాద వర్గం:

భారతీయ చరిత్రకారుల్లో ఎటువంటి సైద్ధాంతిక వివాదానికై దూరంగా వుండాలని, రాంకె తరహా చరిత్రను అందించాలని కోరుకుని ఆ విధంగా శ్రమించిన జదూనాథ్ సర్కార్, ఎస్.ఎన్.సేన్, షాఫత్ అహ్మద్‌ఖాన్, జి.ఎస్. సర్దేశాయ్, ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్, శ్రీనివాసాచారి తదితరుల్ని 'యథాతథవాద' వర్గంగా చెప్పవచ్చు. బ్రిటీషు చరిత్రకారులు పి.ఇ. రాబర్ట్స్, టి.జి.పి. స్పియర్, సి.హెచ్. ఫిలిప్స్ వంటి వారి తరహాలో పొటుపడిన వర్గమిది.

ఈ వర్గ చరిత్రకారుల్లో జదూనాథ్ సర్కార్ (1870-1958) వృత్తి రీత్యా ఆంగ్ల భాష ఉపన్యాసకుడు. బహుభాషా కోవిదుడు చరిత్ర పరిశోధనలో అనురక్తితో మొగల్, మరాఠా చరిత్రలపై దృష్టి సారించాడు. చరిత్ర మూలాధారాలను సేకరించి, ఆయా చారిత్రక ప్రదేశాలను చూసి చక్కటి విశ్లేషణతో ప్రామాణికంగా రచనలు సాగించాడు. అతడు 1901లో 'India of Aurangabad, its Topography, Statistics and Roads" పేరుతో తన మొదటి పరిశోధన గ్రంథం వెలువరించాడు. అనంతరం 5 సంపుటాల్లో 'History of Aurangazeb,' 'Sivaji and his Times', 'Aneedotes of Aurangabad', 'Mughal Administration', 'India through the Ages', 'Studies in Mughal India', 'Historical Essays', 5 సంపుటాల్లో 'Fall of the Mughal Empire', 'Chaitanya his Pilgrimages and Teachings', 'House of Shivaji', 'Military History of India' అనే ప్రసిద్ధ గ్రంథాలు, యింకా అనేక వ్యాసాలు రాసాడు. 'Poona presidency Correspondence', 'Ain-i-Akbari' లకు సంపాదకత్వం వహించాడు. సర్కార్ చారిత్రక పరిశోధనా పద్ధతిలో దేశపట లేఖనాలు, పోల్చుకొనడం, కాలనిర్దేశం, ధృవీకరణ ముఖ్యపాత్ర వహించినాయి. చరిత్రకారుడు న్యాయాధిపతి లాంటివాడని, మంచీ చెడుల్ని నిర్భయంగా చెప్పాలని, చరిత్ర మానవాళికి ఎన్నో గుణపాఠాలు నేర్పుతుందని అతని అభిప్రాయం. తన పరిశోధనలో అతడు జి.ఎస్. సర్దేశాయ్, సహకారం పొందడం చెప్పుకోదగిన విశేషం.

సురేంద్రనాథ్‌సేన్ (ఎస్.ఎన్.సేన్) (1890-1962) మరాఠుల చరిత్రపై ఆసక్తితో వారి సామాజిక, రాజకీయ సంప్రదాయాలను అనుసంధిస్తూ పాలనా సంస్థలపై 'Administrative System of the Maratha's' అనే గ్రంథాన్ని, వారి సైనిక విషయాలపై 'Military System of the Marathas' ని రాసాడు. అతని యితర రచనల్లో 'Studies in Indian History of the Main Track', 'India through the Chinese Eyes', 'Delhi and its Monuments', ముఖ్యమైనవి. వీటిలో 1857 సంఘటనల గురించి భారతీయ కథనాన్ని వెలికి తీయడానికి అతడు చాలా శ్రమించాడు. మరో చరిత్రకారుడు షాఫత్ అహ్మద్‌ఖాన్ 'Ideals and Realities', 'East Indian Trade in the 17th Century', 'The History and Historians of British India వంటి రచనల్లో రికార్డులను విశ్లేషించి సంఘటనలను జరిగినవి జరిగినట్లు విశ్లేషించాలనే సమకాలీన వైఖరినే ప్రతిబింబించాడు.

భారతీయ చరిత్రకారుల్లో యధాతథ వాద వర్గానికి సంబంధించి మరో ప్రసిద్ధుడు గోవింద్ సఖరామ్ సర్దేశాయ్ (1865-1958). యాదృచ్ఛికంగా యితడు చరిత్రకారుడయ్యాడు. బరోడా రాకుమారులకు బోధించడానికి భారతదేశ చరిత్రపై విస్తృతంగా తయారు చేసుకున్న నోట్సే ప్రసిద్ధ 'రియాసత్'ల ప్రచురణకు మూలం అయింది! 'ముసల్మానీ రియాసత్' (2 సంపుటాలు) 'మరాఠీ రియాసత్' (8 సంపుటాలు), 'బ్రిటీష్ రియాసత్' (2 సంపుటాలు) ప్రచురింపబడినాయి. 'మరాఠీ రియాసత్'నే సర్దేశాయ్ ఆంగ్లంలో 3 సంపుటాల్లో 'The New History of the Marathas' పేరుతో ప్రచురించి మరాఠా చరిత్రకారునిగా ప్రసిద్ధికెక్కాడు. పాట్నా యూనివర్శిటీలో యిచ్చిన ఉపన్యాసాలు 'Main Currents of Maratha History' పేరుతో గ్రంథరూపంలో వెలువడ్డాయి. జె.ఎన్. సర్కార్‌తో స్నేహం వల్ల సర్దేశాయ్ మరాఠుల చరిత్ర రచనలో అగ్రగామి అయ్యాడు. చరిత్రాధారాల విశ్వసనీయతను విశ్లేషించకపోవడం, మరాఠావీరుల వ్యక్తిత్వంపై స్వీయ అంచనా యివ్వకపోవడం యితని లోపాలు.

ఇక దక్షిణ భారతంలో వున్న కొద్దిమంది చరిత్రకారుల్లో ఒకడైన ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్ (1871-1953) పరిశోధక గ్రంధాల్లో 'Ancient India: South Indian History and Culture', "Some Contributions of South India to Indian Culture', 'South India and her Mohammadan Invaders', 'Manimekhalai in its Historical setting', 'The Evolution of Hindu Administrative Institutions in South India', 2 సంపుటాల్లో, 'A History of Tirupati' ప్రధానమైనవి. ఇతని పట్టుదల, పాండిత్య ప్రతిభ పరిశోధనా కృషి ఫలితంగానే సంగమ యుగం ఘనత, పల్లవ, చోళ, విజయగనర రాజ్యాల చరిత్ర వెలుగులోకి వచ్చాయి.

### 15.8.4 ఇతర ధోరణులు:

సామ్రాజ్యవాద, వలసవాద ధోరణికి భిన్నంగా భారత చరిత్ర రచనా విధానంలో జాతీయవాద, కుల, మతతత్వ, మార్క్సు వాద వైఖరులు ప్రస్ఫుటమయ్యాయి. జాతీయోద్యమ ప్రభావంతో ఉత్తేజితులైన కొందరు రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు, మధ్య సంబంధాలను అధ్యయనం చేసారు. శాస్త్రీయ దృక్కోణం నుండి క్రమ పద్ధతిలో సాంఘిక శాస్త్రంలా అధ్యయనం చేసేవారు. డి.డి.కొశాంబిలా మార్క్సిస్టు దృక్పధం గల చరిత్రకారులు తలెత్తారు. సమకాలీన సిద్ధాంతాల, దృక్పధాల ప్రభావంతో క్రమేణా భారతీయ చరిత్ర రచనా సంప్రదాయం మారుతూ వస్తున్నదనే చెప్పాలి. సత్యాన్వేషి అయిన చరిత్రకారుడు తన కృషిని నిరంతరం కొనసాగిస్తూనే వుంటాడు.

### 15.9 సారాంశము:

గతకాలపు సంఘటనల అస్తిత్వం చరిత్రకారుని ఆలోచనపై ఆధారపడి వుంది. చరిత్రకారుడు పరిశీలిస్తున్న విషయంపై అతని వ్యక్తిత్వం పరోక్షంగా అయినా ప్రతిఫలిస్తుంది. ఈ యుగంలో చరిత్ర రచనలో చరిత్రకారుణ్ణి ఎక్కువగా సైద్ధాంతిక పరిశీలన ప్రభావితం చేస్తున్నది. మనదేశంలో గత 200 సంవత్సరాలుగా జరిగిన చరిత్ర రచనల్లో వలసవాద రచనా సంప్రదాయం ప్రాముఖ్యం కలిగి వుంది. ఈ రచనలు బ్రిటీషువారివైనా భారతీయులవైనా పెద్ద తేడా కన్పించదు. బ్రిటీష్ వారి భారతదేశ చరిత్ర రచనా సంప్రదాయం ప్రాచ్యవాదులతో ప్రారంభం అయింది. జోన్స్, కన్నింగ్‌హామ్, ఎల్ఫిన్‌స్టన్, హంటర్ వంటివారి భారత సానుకూల వైఖరి వాళ్ళ రచనల్లో కన్పించింది. మనదేశంలో చరిత్ర రచనలో మతతత్వ వైఖరికి ఆజ్యంపోసిన జేమ్స్ మిల్ యీ సమాజాన్ని జ్ఞాన వికాస నియంతృత్వం ద్వారానే అభివృద్ధిలోకి తీసుకు రాగలమని; షోర్, గ్రాంట్ వంటి మతాచార్యులు యీ దేశం వెనుకబడి వుండటానికి హైందవమే కారణమని, క్రైస్తవం ద్వారా ముందుకు తీసుకువెళ్ళగలమని; తాత్విక చరిత్రకారులు ల్యాల్ వంటి వారు భారతదేశంలో బ్రిటీషు పరిపాలన ప్రాచ్య, పాశ్చాత్య శక్తుల పరస్పర కార్యవిధాన ఫలితమని రాసారు. రాబర్ట్స్, స్పియర్, ఫిలిప్స్ వంటి ఆధునికులు వస్తుగత ధోరణిని అనుసరించారు.

ఈ పాశ్చాత్య ధోరణులకు ప్రతిస్పందనగా మన చరిత్రకారులు మొదట వర్ణనకు, కథనానికి పరిమితమైనా తరువాత పాశ్చాత్య విద్యతో వాళ్ళల్లో భారతీయ సాంస్కృతిక వారసత్వపు విలువకు గుర్తింపు వచ్చింది. రాజేంద్రలాల్, ఆర్.సి. దత్ మొదలైన వారు యూరోపియన్ల తప్పుల్ని సరిదిద్దటానికి విషయాలను మరింత వస్తుగతంగా పరిశీలించారు. రాజ్‌నారాయణ్‌బోస్, బంకించంద్ర, తిలక్, సావర్కర్‌లు హిందూ సంస్కృతి ఆధిక్యతను ఎలుగెత్తి చాటారు. ఈ సైద్ధాంతిక ధోరణులకు దూరంగా సర్కార్, సేన్, షాఫత్ అహ్మద్‌ఖాన్, సర్దేశాయ్, ఎస్.కె. అయ్యంగార్‌లు శ్రమించారు.

## 15.10 నమూనా ప్రశ్నలు:

**I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలివ్వండి.**

1. వలసవాద చరిత్ర రచనా సంప్రదాయాన్ని వివరించండి.
2. భారతదేశ చరిత్ర రచనల్లో బ్రిటీషు చరిత్రకారుల భిన్న ధోరణులను విశ్లేషించండి.
3. మన దేశ చరిత్ర రచనాభివృద్ధిలో బ్రిటీషు చరిత్రకారుల ధోరణులకు మన చరిత్రకారుల ప్రతిస్పందనను పరిశీలించండి.

**II. ఈ క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. సర్ విలియమ్ జోన్స్
2. జేమ్స్ మిల్
3. వి.ఏ. స్మిత్
4. ఆర్.జి. భండార్కర్
5. జె.ఎన్. సర్కార్
6. ఎస్.కె. అయ్యంగార్

## 15.11 చదువదగిన గ్రంథాలు:


Barnes, H.E. : A History of Historical writing (Dover Publications, New York, 1962)

Das Gupta, K.K. : Indian Historiography and Rajendralal Mitra (Calcutta, 1976)

Durga Prasad, J. : Charitra Rachana Sastram (Tel) (Telugu Akademi, Hyderabad, 1987)

Kadhirvel, S. : Historical Methods (Saravana Books, Madras, 1978)

Majumdar, R.C. : Historiography in Modern India (Asia Publishing House, Bombay, 1970)

Mukhopadhyaya. S. : Evolution of Historiography in Modern India, (1900-1960) (K.P.Bagehi, Calcutta, 1981)

| | | |
|---|---|---|
| Philips, C.H. | : | Historians of India, Pakistan and Ceylon. (O.U.P., London, 1961) |
| Sheik Ali, B. | : | History: Its Theory and Method (Macmillan, 1978) |
| Tikekar, S.R. | : | On Historiography (Popular Prakashan, Bombay, 1964) |
| Warder, A.K. | : | An Introduction to Indian Historiography (Popular Prakashan, Bombay, 1971) |

డా॥ జె. దుర్గాప్రసాద్

పాఠం - 16

# జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధి

**16.0 లక్ష్యం:**

ఈ పాఠం అధ్యయనం వల్ల మీరు ఈ క్రింది విషయములను తెలుసుకొనగలరు.

* యూరోపియన్లు చరిత్రకారులు భారత జాతీయ వాదానికి ఏ విధంగా దోహదం చేసారో తెలుసుకోగలగాలి.
* జాతీయవాద చరిత్ర రచనపై స్వాతంత్ర్యోద్యమ ప్రభావం వివరించగలగాలి.
* ఆర్థిక జాతీయవాదుల పాత్రను వివరించగలగాలి.
* జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధి విపులీకరించగలగాలి.

**విషయసూచిక:**


16.1 పరిచయం
16.2 యూరోపియను చరిత్రకారులు - భారత జాతీయవాదం
16.3 జాతీయవాద చరిత్రకారుల ప్రతిస్పందన
16.4 స్వాతంత్ర్యోద్యయం - జాతీయవాద చరిత్రకారులు
16.5 ఆర్థిక జాతీయవాదులు
16.5.1. దాదాభాయ్ నౌరోజీ (1825-1917)
16.5.2 మహాదేవ గోవింద రెనడే (1842-1891)
16.5.3 రమేష్ చంద్ర దత్ (1845-1909)
16.6 జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధి
16.6.1 కె.పి. జయస్వాల్ (1881-1937)
16.6.2 హెచ్.సి.రాయ్ చౌదరి (1892-1957)
16.6.3 కె.ఏ. నీలకంఠశాస్త్రి (1892 - )
16.6.4 ఆర్.సి. మజుందార్ (1888-1980)
16.7 సారాంశము
16.8 సంక్షిప్తంగా
16.9 నమూనా ప్రశ్నలు
16.10 చదువదగిన గ్రంథాలు

## 16.1 పరిచయం:

భారతీయ చరిత్ర రచనా క్రమ వికాస పరిణామం గురించి అధ్యయనం చేసిన చరిత్రకారులు, పండితులు యీనాడు మనం అర్థం చేసుకుంటున్న పద్ధతిలో భారతీయులకు 'మొదటి నుండీ చరిత్ర' రచనా సంప్రదాయం లేదా చారిత్రక దృష్టి లేదనే అభిప్రాయాన్ని స్పష్టంగా ప్రకటించారు. స్థూలంగా చూస్తే యిది నిజమే అన్పించినా సూక్ష్మంగా పరిశీలిస్తే మనదైన చరిత్ర రచనా విధానం ప్రాచీన కాలంలో ఇతిహాస-పురాణ సంప్రదాయంలోను, మధ్యయుగాల్లో ఇస్లాం సంస్కృతీ ప్రభావంలోను, ఆధునిక యుగంలో 19వ శతాబ్దం రెండో భాగం నుండీ కన్పిస్తున్నది. ఆధునిక కాలంలో 19వ శతాబ్ది నుండి పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం భారతీయ రచనా విధానంపై ముఖ్యంగా దృక్పథంలో, పరిభాషలో, రచనా వస్తువుకు సంబంధించిన వ్యవహార విధానంలో స్పష్టంగా మార్పు కన్పిస్తుంది. ఆంగ్ల విద్యావ్యాప్తి, పాశ్చాత్య భావపరంపర ప్రవాహం యీ మార్పుకి కారణాలు. భారతీయ చరిత్ర - సంస్కృతీ విశ్లేషణలో ప్రాచ్యవాద, ప్రయోజనవాద, జాతీయవాద దృక్పథాల ప్రభావం ఉంది.

## 16.2 యూరోపియను చరిత్రకారులు - భారత జాతీయవాదం :

భారతదేశానికి ఐరోపా జాతీయులైన పోర్చుగీసు, డచ్చి, బ్రిటీషు, ఫ్రెంచి వారి రాకతో భారతీయ చరిత్ర రచనా విధానంలోను మార్పులు చోటు చేసుకున్నాయి. అనంతర కాలంలో ఐరోపాలో పారిశ్రామిక విప్లవ ఫలితంగా వస్తున్న మార్పుల్ని జీర్ణించుకోలేని వర్గం తమ ఊహలకు అనుగుణమైన సమాజాన్ని ప్రాచీన భారతదేశంలో దర్శించారు. ఈ ప్రాచ్యవాదులు లేదా ఒరియంటలిస్టులు ప్రాచీన భారతీయ సంస్కృతిని ఆకాశానికి ఎత్తుతూ స్తుతించారు. సర్ విలియమ్ జోన్స్, చార్లెస్ విల్కిన్స్, కోల్‌బ్రూక్, హెచ్. హెచ్. విల్సన్ మొదలైనవారు ప్రాచీన భారతదేశ చరిత్ర సంస్కృతిని ఎంతో ఆర్ద్రపూర్వక దృక్పథంతో పరిశీలించారు. ఉదారవాదుల్లో మరో రకం రచయితలు సర్‌జాన్ షోర్, గ్రాంట్‌లు మనదేశంలో బ్రిటీషు పాలనను సమర్థించారు.

ప్రయోజనవాది జేమ్స్ మిల్ తన గ్రంథం 'History of British India' ద్వారా మనదేశ చరిత్రను హిందూ, ముస్లిం, బ్రిటీషు యుగాలుగా విభజించి మత తత్వ దృక్పథంతో వ్యాఖ్యానించేందుకు అవసరమైన పునాది వేశాడు. హిందూ సంస్కృతి వెనుకబడిన సంస్కృతని, అభివృద్ధికి వ్యతిరేకమని, హేతువాద వ్యతిరేకమని అతడు దుయ్యబట్టాడు. అతడు ప్రాచీన కాలపు హైందవ సంస్కృతి ఉన్న తమదే వాదనను ఖండిస్తూ హిందువుల స్థితి కంటే భూస్వామ్య వ్యవస్థలో ఐరోపావాసుల స్థితే మెరుగని పేర్కొన్నాడు. ఎల్ఫిన్‌స్టన్ హిందువుల పట్ల సానుభూతి వ్యక్తం చేసినా హిందూ పాలకుల బలాన్ని తక్కువ చేసి చూపుతూ అరబ్బులు పర్షియాను జయించినంత సులువుగా భారత దేశాన్ని జయించి వుండేవారని ప్రకటించాడు. గ్రీకులు, అరబ్బులే సముద్ర కార్యకలాపాల్ని, వ్యాపారాన్ని నిర్వహించారు తప్పించి భారతీయులకు అందులో భాగం లేదని అతడు భావించాడు. వి.ఏ.స్మిత్ కూడా ఐరోపా వారి నైపుణ్యం, క్రమశిక్షణల ముందు అత్యున్నత ఆసియా సేనలు కూడా దిగదుడుపేనని ప్రకటించాడు. భారతదేశంపై బ్రిటీషుపాలన ఉపకార నియంతృత్వమని లేకుంటే అధ్వాన్నస్థితేనని అతని అభిప్రాయం.

ఈ బ్రిటీషు చరిత్రకారులందరూ భారతదేశంలో బ్రిటీషువారి పరిపాలనను సమర్థించే లక్ష్యంతోను, వారి పరిపాలన కారణంగా అనాగరిక భారతదేశం ఆధునిక దేశంగా రూపొందుతుందనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన సంస్కరణలను సమర్థించుకుంటూను, జాత్యహంకార ధోరణిలో తమ సంస్కృతీ, నాగరికతలు ఉదాత్తమూ, ఉన్నతమూ అయినవనే భావాన్ని ప్రచారం చేసుకోడానికి చరిత్ర రచనను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు.

యూరోపియన్ల జాత్యహంకార, సాంస్కృతిక అహంకార చరిత్ర రచనా విధానానికి స్పందనగా లేదా సమాధానంగానే 19, 20 శతాబ్దాల్లో భారతీయ చరిత్ర రచనా విధానం రూపొందిందని షేక్ ఆలీ, సుబోధ్ కుమార్ ముఖోపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

పాశ్చాత్య విద్యావిధానం, భావధోరణి భారత దేశంపై గాఢమైన ముద్రవేసి రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో అనేకమైన మార్పులకు కారణమయ్యాయి. మొదట్లో బ్రిటీష్ వారి తీవ్ర విమర్శలకు సమాధానంగా తమను తాము సమర్థించుకునేందుకు ప్రయత్నించిన భారతీయులు పార్శీ, ప్రాకృత, సంస్కృతాలను అధ్యయనం చేసి చరిత్ర ఆధారాలను వెలికితీసి విమర్శనాత్మకంగా, విశ్లేషణాత్మకంగా ఆ చరిత్రకారుల అభిప్రాయాలను తీవ్రంగా ప్రతిఘటించారు. మన గతచరిత్రలో మంచిని మాత్రమే కనుగొని చరిత్రను ప్రచార సాధనంగా ఉపయోగించారు. సామాజిక సంపర్కాలకు, విదేశీయుల్ని యీ దేశం నుండి తరిమివేయడానికి, భారతీయుల్ని ఏకం చేయడానికి చరిత్రను సాధనం చేసుకుని జాతీయవాదం పెరిగేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగానే భారతీయ సమాజాన్ని సంస్కరించాల్సిన అవసరాన్ని గుర్తించి అందుకు పూనుకొన్నారు. కాని యీ విధంగా పూనుకొన్నవారు వృత్తి రీత్యా చరిత్రకారులు కాని, చరిత్ర అధ్యాపకులు కాని కారు. వారు తమ రచనలు, ప్రబోధాలు, ప్రసంగాల ద్వారా భారతీయ సమాజాన్ని మేల్కొల్ప ప్రయత్నించిన సంస్కరణవాదులు...... జాతీయవాద స్ఫూర్తితో కూడిన చరిత్ర రచనా విధానానికి అనుకూలమైన పునాదిని వేసినవారు. ఈ కోవలో ఆధునిక భారత జాతి నిర్మాతగా ప్రసిద్ధుడైన రాజారామ్‌మోహన్‌రాయ్ (1772-1833), మరో మేధావి ఈశ్వర చంద్ర విద్యాసాగర్ (1820-1891), బెంగాలీ కవి మైకేల్ మధు సూదనదత్తా (1824-1873), హిందూ భారతీయవాద చరిత్ర రచనకు పునాది వేసిన దయానంద సరస్వతి (1824-1883), 'భారతమాత' అనే భావనకు రూపమిచ్చి 'వందేమాతరం' మంత్రం ద్వారా ఉత్తేజపరచిన బంకించంద్ర ఛటర్జీ మొదలైనవారు తమ రచనల ద్వారా జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర నిర్వహించారు.

## 16.3 జాతీయవాద చరిత్రకారుల ప్రతిస్పందన:

'Evolution of Historiography in Modern India, (1900-1960) అనే గ్రంథంలో సుబోధ్‌కుమార్ ముఖోపాధ్యాయ చెప్పినట్లు 20వ శతాబ్దం ప్రారంభం నుండి భారతీయ చరిత్రకారుల రచనల్లో మొదట 'జాతీయ వాద ధోరణి, పిదప విమర్శనాత్మక శాస్త్రీయ ధోరణి ఆ తరువాత మార్క్సిస్టు ధోరణులు కనపడతాయని విశ్లేషించాడు. అంతకు ముందున్న సామ్రాజ్యవాద, వలసవాద చరిత్రకారుల పక్షపాత ధోరణికి ఆగ్రహించిన జాతీయవాద చరిత్రకారులు సవాలును స్వీకరించారు. వేదాల్లో వివరించిన హిందూమతం, సమాజాలు చాలా స్వచ్ఛమైనవి, పవిత్రమైనవి అని వీళ్లు నిరూపించ ప్రయత్నించారు. దయానంద సరస్వతి 19వ శతాబ్దపు హేతుబద్ధంగా, శాస్త్రీయంగా కనుగొన్న చాలా విషయాలు వేదాల్లోనే ఉన్నాయని నిరూపించ ప్రయత్నించాడు. రాజ్‌నారాయణ్‌బోస్, భూదర్ ముఖర్జీ, చంద్రనాధ్ బసు, బంకించంద్ర తదితరులు హైందవం ఒక ఉన్నత ఆధ్యాత్మిక శక్తి అని, సమాజంలో నెలకొన్న దుర్మార్గాలకు, మత మౌఢ్యాలకు క్రొత్త వ్యాఖ్యానం, ఆధ్యాత్మిక ప్రాధాన్యతలనిచ్చి సమర్థించారు. ఆర్.సి.దత్ లాంటివారు పురాతత్వ శాస్త్ర సంబంధ ఆధారాలతో హైందవ సంస్కృతి హీనమైనది కాదని నిరూపించారు. యూరోపియను చరిత్రకారులు వేలెత్తి చూపిన హైందవ సమాజంలోని సాంఘిక దురాచారాలను జాతీయవాద చరిత్రకారులు నిరాకరించారు. వర్ణవ్యవస్థ అనేది శ్రమ విభజన ప్రాతిపదికపై ఏర్పడిన ప్రాచీన విధానమని, వైదిక యుగంలోను, ఆ తరువాత కాలాల్లోను స్త్రీ స్థానం సమాజంలో సమున్నతమూ, గౌరవప్రదమైనదేనని వాదించారు. అలాగే భారతదేశ సమైక్యత గురించి దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వ ఉనికి గురించి, సైనిక పాటవం గురించి, జాతీయ చైతన్యం గురించి ఆర్.కె. ముఖర్జీ, కె.పి. జయస్వాల్ వంటి వారు బ్రిటీషు చరిత్రకారుల విమర్శలను ఖండించారు. బ్రిటీషు సామ్రాజ్యవాద, వలసవాద ధోరణులకు తీవ్రంగానే స్పందించారు.

## 16.4 స్వాతంత్ర్యోద్యమం - జాతీయవాద చరిత్రకారులు :

బ్రిటీషు వారికి వ్యతిరేకంగా భారతీయులు ప్రారంభించిన స్వాతంత్ర్య పోరాటం లేదా జాతీయోద్యమం భారతీయ చరిత్ర రచనా సంప్రదాయంలో ఒక సరికొత్త పంథాను ప్రవేశపెట్టింది. జాతీయవాద చరిత్రకారులు భారతదేశ చరిత్రను

ఉద్దేశపూర్వకంగా పునర్వ్యాఖ్యానించ ప్రయత్నించారు. స్వాతంత్ర్య పోరాటానికి మరింత ఉత్సాహాన్నిచ్చారు. భారత జాతీయ నాయకుల నినాదాలకు మరింత బలాన్నిచ్చారు. భారతదేశానికి డొమినియన్ ప్రతిపత్తినివ్వడానికి హిందువులు, ముస్లింల మధ్య నెలకొన్న భేదాలు ప్రధానమైన ఆటంకంగా బ్రిటీషు ప్రభుత్వం భావించటంతో భారత జాతీయ నాయకులు రెండు వర్గాల మధ్య ఐక్యత తమ స్వాతంత్ర్య పోరాట విజయానికి మౌలికమని, అత్యావశ్యకమని నమ్మారు. దీనితో సమకాలీన అవసరాలకు అనుగుణంగా ఉండేలా ముస్లిం పాలకులనాటి మొత్తం భారతదేశ చరిత్రను వారు వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగానే హిందువులు, ముస్లింలు పరస్పరం మంచి సోదరులుగానే మెలిగారని, ముస్లిం పాలనా కాలంలో హిందువులేమీ క్రుగ్గిపోలేదని, భారతదేశంపై విదేశీ పాలన రుద్దిన వాళ్ళు మొట్టమొదట బ్రిటీషువారేనని జాతీయవాద చరిత్రకారులు వాదించారు.

భారతీయులు రాజకీయ వితరణలకు, ఆ మాటకు వస్తే పూర్తి స్వాతంత్ర్యానికే యోగ్యులని జాతీయవాద చరిత్రకారులు వాదించారు. భారతీయుల కింకా అనుభవ యోగ్యత రాలేదని, అధికారాన్ని వాళ్ళకి అప్పజెప్తే మొత్తం పరిస్థితి అస్తవ్యస్తం అవుతుందని బ్రిటీషువారు రాజకీయ సంస్కరణలకుపక్రమించక తాత్సరం చేయడాన్ని వారు విమర్శించారు. అంతేగాక బ్రిటీషుపాలకుల అణచివేత, దోపిడీ విధానాలను జాతీయవాద చరిత్రకారులు ఎలుగెత్తి చాటారు.

## 16.5 ఆర్థిక జాతీయవాదులు :

వృత్తి రీత్యా చరిత్రకారులు కానటువంటి సంఘ సంస్కర్తలు రాజారామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, దయానంద సరస్వతి మొదలైన వారు వారివారి పద్ధతుల్లో భారతీయుల్లో జాతీయ చైతన్యాన్ని కలిగించినట్లే బ్రిటీషువారి ఆర్థిక దోపిడీని గురించి వివరించి ఆర్థిక జాతీయవాదానికి సేవలందించిన వారు దాదాభాయ్‌నౌరోజీ, మహాదేవ గోవింద రెనడే, రమేష్ చంద్ర దత్తాలు.

### 16.5.1 దాదాభాయ్ నౌరోజీ (1825-1917)

'Grand Old Man of India' (భారత కురువృద్ధుడు) నిగా కీర్తిని పొందిన, జాతీయోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న, మితవాద, అతివాదులచే సమాన గౌరవం పొందిన, బ్రిటీషు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నుకోబడిన, మూడుసార్లు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా వ్యవహరించిన దాదాభాయ్ నౌరోజీ మనదేశ దారిద్ర్యానికి బ్రిటీషువారు ఏవిధంగా కారకులో తాను రాసిన 'Poverty and Un-British Rule in India' అనే గ్రంథంలో విపులీకరించాడు. భారతీయుల దారిద్ర్యానికీ, ఆర్థిక దుస్థితికి కారణాలను ఇండక్షన్ విధానంలో (అనుమానాలను నివృత్తి చేసుకుంటూ ముందుకు సాగే పద్ధతిలో) అన్వేషించి డ్రెయిన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన నౌరోజీ మన సంపదను బ్రిటీషువారు తమ అవసరార్థం తరలిపోయేట్లుగా చేయడమే వర్తమాన స్థితికి కారణమని వివరించాడు. బ్రిటీషు ఆర్థిక దోపిడీనే అటు బ్రిటీషు పార్లమెంట్‌లోను, వెలుపల తన ప్రసంగాల ద్వారా అతడు చాటాడు. నౌరోజీ ప్రతిపాదించిన యీ సిద్ధాంతమే తొలి తరానికి చెందిన జాతీయ ఆర్థిక శాస్త్రవేత్తలు జస్టిస్ మహాదేవ గోవింద రెనడే, బి.వి. జోషి మొదలైన వారిని ఎంతో ప్రభావితం చేసింది.

నిజానికి 1867లో 'England's Debt to India' అనే పేరుతో ఒక పత్రాన్ని నౌరోజీ లండన్‌లోని ఈస్ట్ ఇండియా అసోసియేషన్ సభ్యుల ముందు సమర్పించాడు. ఆ పత్రంలో భారతీయుల్ని పాలించినందుకు ఖరీదుగా మనదేశం నుండీ సంపదను దోచుకుపోతున్నారని ప్రతిపాదించి సంచలనం రేకెత్తించాడు. అనంతరం 'The Wants and Means of India', 'On the Commerce of India' అనే పేర్లతో మరో రెండు పత్రాలను ప్రకటించి తన సిద్ధాంతానికి మరింత పదును పెట్టాడు. వీటన్నిటి

సారాంశంగానే 1876లో 'Poverty and Un-British Rule in India' అనే గ్రంధాన్ని వెలువరించాడు. నౌరోజీ మనదేశ ఆర్థిక దుస్థితికి కారణాలను వివరించడంతోపాటు పరిస్థితిని మెరుగు పర్చటానికి పరిష్కారాలనూ చూపించడం విశేషం. అతడనుసరించిన ఇండక్షన్ విధానంతో కూడిన పరిశోధనా పద్ధతి భారతీయ చరిత్ర రచనా విధానంలో కొత్త అధ్యాయానికి నాంది అయింది. సామాజిక, నైతిక, రాజకీయ పరిస్థితుల మధ్య అవినాభావ సంబంధం వుందని నమ్మిన అతడు మొత్తం సమాజాన్ని ఆర్థిక తత్వం ప్రభావితం చేస్తుందని చెప్పాడు. భారతీయుల పరిస్థితి మెరుగుపడాలంటే స్వపరిపాలన కావాలని అతడు స్పష్టం చేసాడు.

### 16.5.2 మహాదేవ గోవింద రెనడే (1842 - 1891) :

భారత ఆర్థిక జాతీయవాదానికి దాదాభాయ్ నౌరోజీ పితామహుడైతే బి.దత్తా చెప్పినట్లు దానికి సంపూర్ణ సమగ్ర హేతువాద స్వరూపమిచ్చినవాడు జస్టిస్ మహాదేవ గోవింద రెనడే. ఈతడు 19వ శతాబ్దం రెండో భాగానికి సంబంధించి భారత జాతీయ ఆర్థిక వ్యవస్థ స్వభావ, స్వరూప దిశల్ని బాగా అర్థం చేసుకొన్న మొదటి వ్యక్తి. వలస విధానంలో ఆర్థిక వ్యవస్థపై శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేసిన తొలి భారతీయ ఆర్థిక శాస్త్రవేత్తగా 1898లో రెనడే 12 వ్యాసాలు ప్రచురించాడు. 1872లో పూనాలో స్వదేశీ వ్యాపారం, పరిశ్రమలపై రెండు ప్రసంగాలు చేసాడు. 1878-93 మధ్య కాలంలో జర్నల్ ఆఫ్ పూనా సార్వజనిక్ సభలో 15 వ్యాసాలు ప్రచురించాడు. 'Currencies and Mints under Maratha Rule' అనే గ్రంధాన్ని రాసాడు. 1900లో 'Rise of Maratha Power' అనే గ్రంధాన్ని వెలువరించాడు. ఇవన్నీ యితని మేధా శక్తికి నిదర్శనాలు.

రెనడే భారత ఆర్థిక విషయాల అధ్యయనంలో చారిత్రక పద్ధతిని నిర్దుష్టం చేసాడు. వలస రాజ్య ఆర్థిక వ్యవస్థపై శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయడం వల్ల యిది సాధ్యమయింది. బ్రిటీషు ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిరసనగా రాజ్య వ్యవస్థ జోక్యంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చుననేది రెనడే అభిప్రాయం. సమకాలీన గణాంక వివరాలను చక్కగా ఉపయోగించుకున్నాడు. ఇతని అన్ని రచనల్లో చారిత్రక పక్షపాతం కన్పిస్తుందని హెలాల్కార్ పేర్కొన్నాడు. న్యాయమూర్తిగా రెనడే యిచ్చిన తీర్పుల్లో కూడా చారిత్రక దృష్టి కనపడుతుంది. హిందూ జాతీయవాద విజయమే మహారాష్ట్ర సమ్మేళన రాజ్యావతరణకు కారణమని రెనడే అభిప్రాయం.

### 16.5.3 రమేష్ చంద్ర దత్ (1848-1909) :

మరో ఆర్థికవేత్త, చరిత్రకారుడు, బెంగాలీ నవలా రచయిత రమేష్ చంద్రదత్. జాతీయోద్యమ కాలంలో జాతీయవాదిగా ప్రశంసనీయమైన కృషి చేసిన వ్యక్తి. 1869లో I.C.S. పరీక్షలో ఉత్తీర్ణుడై అనేక హోదాల్లో పనిజేసి 1897లో ఐచ్ఛికంగా పదవీ విరమణ చేసాడు. ఆ సంవత్సరమే లండన్‌లో యూనివర్సిటీ కాలేజీలో గౌరవ భారతదేశ చరిత్ర బోధకుడయ్యాడు. 1899లో లక్నో కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షునిగా వ్యవహరించాడు.

బంకించంద్ర ప్రోత్సాహంతో రమేష్ చంద్రదత్ ముందుగా నాలుగు చారిత్రక నవలల్ని రాసాడు. 1875లో 'Peasantry in Bengal' అనే గ్రంధాన్ని వెలువరించాడు. 1885లో ఋగ్వేదాన్ని బెంగాలీలోకి అనువదించాడు. 1890లో 'A History of Civilisation in Ancient India' అనే చరిత్ర గ్రంధాన్ని సంస్కృత సాహిత్యం ఆధారంగా రాసాడు. ఈ గ్రంధం భారతీయుల ప్రాచీన ఔన్నత్యాన్ని భారతీయులకు, ప్రపంచానికి తెలియజెప్పింది. ఈ గ్రంధ రచనే దత్‌ని జాతీయవాద చరిత్రకారుణ్ణి చేసింది. 1897లో అతడు 'England and India' గ్రంధాన్ని రాసాడు. అనంతరం మహాభారత, రామాయణాలను బెంగాలీలోకి అనువదించాడు.

దత్ 1902లో 'Economic History of India' మొదటి భాగాన్ని, 1904లో రెండో భాగాన్ని ప్రచురించాడు. ఈ రెండు భాగాల గ్రంథం సంఘటనలపై అతనికి వున్న ఆధిపత్యాన్ని, నిశిత పరిశీలనా దృష్టిని, లోతైన అవగాహనమూ తెలియజేస్తుంది. అధికార నివేదికలు, పార్లమెంటరీ పేపర్లు దీనికి మూలాధారాలయ్యాయి. గణాంక వివరాలు కూడా జత కావడంతో దత్ ప్రతిపాదనలకు మరింత బలం చేకూరింది. వీటన్నింటితో ఆర్థిక చరిత్రకు ఒక ప్రత్యేక ప్రతిపత్తి ఏర్పడింది. ఈ నాటికీ దత్ గ్రంథం ప్రధాన ఆర్థిక చరిత్ర గ్రంథంగా ప్రామాణికతను కలిగి వుంది. ప్రజల పేదరికాన్ని వివరిస్తూ అతడు చెప్పిన 'ఆర్థిక దోపిడీ' (Economic drain) యిప్పుడూ వర్తిస్తుంది. దత్ వ్యాసాలను పరిశీలిస్తే అతడు సామాజిక చరిత్రకూ ప్రాధాన్యతనిచ్చాడని స్పష్టమవుతుంది.

## 16.6 జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధి :

19వ శతాబ్దపు సాంస్కృతిక పునరుజ్జీవానికి కృషి చేసిన భారతదేశ మేధావులు, సంఘ సంస్కర్తలు జాగృతావస్థలో వున్న భారత జాతీయ చైతన్యాన్ని తమ రచనలు, ప్రబోధాలు, ప్రసంగాల ద్వారా మేలుకొల్పారు. ఇక జాతీయోద్యమ కాలం నాటి భారతీయ చరిత్రకారులు పాశ్చాత్య విద్య, సంప్రదాయం, సంస్కృతిచే ప్రభావితులై డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదుల్లా సాక్ష్యాధారాలతో ఆంగ్లేయుల విమర్శలను ఖండించేందుకు ఎంతో పరిశోధన చేసారు. దీనితో ఎన్నో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కృషిలో భాగంగానే కలకత్తా, బెనారస్ విశ్వవిద్యాలయాల్లో ప్రాచీన భారత చరిత్ర - సంస్కృతి విభాగాలు ఏర్పాటయ్యాయి. వైయక్తిక పరిశోధనలూ పెరిగాయి. హిందూ సంస్కృతి ఔన్నత్యం వెలుగులోకి వచ్చింది. తీవ్ర జాతీయవాదానికి గట్టి పునాదులు పడ్డాయి. అనేకులు చరిత్రను కూలంకషంగా లోతుగా అధ్యయనం చేసి ఆంగ్లేయుల దృక్పథాన్ని ఖండించడంలో, మనలో మనకు ఆత్మ విశ్వాసం కల్పించటంలో విజయులయ్యారు. దీనికి తోడు పాశ్చాత్య విద్య సంప్రదాయం, సంస్కృతులచే ప్రభావితులైన వృత్తి రీత్యా చరిత్ర బోధనను, చరిత్ర రచనను చేపట్టిన కె.పి. జయస్వాల్, హేమచంద్ర రాయ్ చౌదరి, కె.ఏ. నీలకంఠశాస్త్రి మొదలైన వారు తమ నైపుణ్యం, వక్తి సామర్థ్యాలనుపయోగించి వివిధ భాషల్లో వున్న పురావస్తు, సాహిత్య ఆధారాలను సమన్వయం చేసి కొత్తకోణం నుండి చరిత్రను అధ్యయనం చేసారు.

### 16.6.1 కె.పి. జయస్వాల్ (1881 - 1937)

వృత్తిరీత్యా న్యాయవాది అయిన కాశీప్రసాద్ జయస్వాల్ చరిత్ర పరిశోధనలో ఆసక్తితో భారతీయుల్లో గత ఔన్నత్యం గురించి చైతన్యాన్ని పెంపొందించే దృష్టితో 1914లో బీహార్, ఒరిస్సా పరిశోధనా సంస్థను స్థాపించి దాని ద్వారానే ఒక పరిశోధనా జర్నల్‌నూ మరుసటి సంవత్సరమే ప్రారంభించాడు. ఆ పత్రికకు అనేక సంవత్సరాలు సంపాదకునిగా అతడు వ్యవహరించడంతో బాటు పాట్నా మ్యూజియం స్థాపనలోనూ కీలక పాత్ర వహించాడు.

ప్రాచీన హిందూ న్యాయశాస్త్రంపై అనేక వ్యాసాలను జయస్వాల్ 1911-13 మధ్య 'Calcutta Weekly Notes' లో ప్రచురించాడు. మను, యాజ్ఞవల్క్యులపై కలకత్తా విశ్వవిద్యాలయంలో ఉపన్యసించాడు. తన వ్యాసాలను పుస్తక రూపంలో 'Hindu Polity' పేరుతో 1924లో వెలువరించాడు. క్రీ.శ. 150 నుండి క్రీ.శ. 350 వరకు 'History of India' పేరుతో గ్రంథాన్ని ప్రచురించాడు. నిజానికి యీ కాలాన్ని కొందరు చీకటి యుగమని వ్యవహరిస్తే జయస్వాల్ పురాణాల శాసనాలు, నాణేల సాయంతో పునర్నిర్మించి యీ కాలం విదేశీయుల పాలనకు వ్యతిరేకంగా జాతీయోద్యమం జరిగిన కాలమని నాగ-వాకాటక యుగమని భారత రాజకీయ, సాంస్కృతిక చరిత్రలో దేదీప్యంగా వెలుగొందిన కాలమని వ్యాఖ్యానించాడు.

జయస్వాల్ అశోకుని శాసనాలపై భారవేలుని హతి గుంఫా శాసనంపై, భువనేశ్వర ఆలయ తామ్ర శాసనాలపై, యింకా అనేక యితర విషయాలపై వ్యాసాలు రాసాడు. ప్రాచీన నాణేలపై కూడా అధ్యయనాలు సాగించాడు. చండేశ్వరుని 'రాజనీతి రత్నాకర', కౌటిల్యుని 'అర్థశాస్త్రం'పై భట్టస్వామి వ్యాఖ్యానం, ఆచార్యనాగార్జునుని 'విగ్రహ వ్యావర్తిని', టిబెటన్ భాషలోని 'మంజుశ్రీమూలకల్ప' వంటి గ్రంథాలకు సంపాదకత్వం వహించి ప్రచురించాడు. లేసన్ రాసిన 'History of Indian Commerce' గ్రంథాన్ని అనువదించాడు. జయస్వాల్ చరిత్ర రచనా పద్ధతి ఒక న్యాయవాది అనుసరించే పద్ధతే. ప్రశ్నలు వేసుకోవడం, సమాధానాలు రాబట్టడం, విషయాన్ని నిరూపించే సాక్ష్యాధారాలను పటిష్టంగా చూపడం, యిదీ అతడనుసరించిన విధానం. ప్రగాఢాభిమానం కల జాతీయవాది అయిన అతడు పాశ్చాత్యులు గర్వంగా చెప్పుకొనే పరిమిత రాజరికం, గణతంత్ర రాజ్య వ్యవస్థలు ప్రాచీన భారతీయులకు తెలుసని, వైదిక యుగానంతర భారతదేశంలో గణతంత్ర వ్యవస్థ వుండేదని తన 'Hindu Polity' గ్రంథంలో నిరూపించాడు. ప్రాచీన భారతదేశంలో విశాలమైన రాజ్యాలు, పరిమిత రాచరిక వ్యవస్థ, బలమైన మంత్రిమండలి, కార్య నిర్వహణాధికారంపై చట్టం ఆధిక్యత వుండేవని చెప్పాడు.

### 16.6.2 హెచ్.సి.రాయ్ చౌదరి (1892-1957):

ప్రాచీన భారతదేశ చరిత్రను వెలుగులోకి తీసుకు వచ్చి పరిపుష్టం చేసిన ప్రముఖ బెంగాలీ చరిత్రకారుల్లో హేమచంద్ర రాయ్ చౌదరి ఒకడు. ఇతడు చరిత్రోపన్యాసకుడు. ప్రాచీన భారతదేశ రాజకీయ, మత, చారిత్రక భూగోళ విషయాల పరిశోధకుడు, అసంఖ్యాక వ్యాసకర్త. ఇతని ప్రధాన చరిత్ర రచనల్లో 'The Political History of Ancient India from the Accession of Parikshit to the Extinction of the Gupta Empire' (1923) 'Materials for the study of Early History of the Vaishnava Sect' (1936), 'Studies in Indian Antiquities' లు ముఖ్యమైనవి. ఆర్.సి మజుందార్, కె.కె. దత్తాలతో కలసి యితను రాసిన 'An Advanced History of India' గ్రంథం యీనాటికీ ఉన్నత స్థాయి పాఠ్య గ్రంథంగా అలరిస్తున్నది. రాయ్ చౌదరి పరిశోధనలో ప్రామాణికత, స్వతంత్ర పంథా చెప్పుకోదగ్గ ప్రత్యేకతలు.

### 16.6.3 కె.ఏ. నీలకంఠ శాస్త్రి (1892 - ):

సుదీర్ఘ కాలం చరిత్రోపన్యాసకునిగా పనిజేసిన నీలకంఠ శాస్త్రి యునెస్కో ఆర్థిక సహాయంతో మద్రాసులో ఏర్పరచిన 'Institute of Traditional Cultures' అనే సంస్థకి సంచాలకునిగానూ వ్యవహరించాడు. చరిత్ర, పురాతత్వ శాస్త్రాలను ఔపోసన బట్టిన యితడు సంస్కృత భాషలో దిట్ట. దక్షిణ భారతదేశ చరిత్ర - సంస్కృతులను ప్రపంచానికి తెలిపిన వాడు నీలకంఠశాస్త్రి. ఇతని పరిశోధనల పరిణామంగానే బ్రిటీషువారి ప్రాచ్య నియంతృత్వ సిద్ధాంత ప్రచారాన్ని తిప్పికొట్టడం సాధ్యమయింది. ఇతడు రాసిన ప్రామాణిక గ్రంథాల్లో 'The Pandyan Kingdom', 'The Cholas', 'History of South India', 'History of India, 'The Development of Religion in South India', 'Studies in the History of Sri Vijaya', 'Foreign Notices of South India', 'Comprehensive History of India' మొదలైనవి ప్రధానమైనవి. హిందూ ఔన్నత్యాన్ని పొగడిన యితడు మహమ్మదీయుల కన్నా హిందువులే ఎక్కువ సహనశీలురని పేర్కొన్నాడు. ఇతని కృషి ఫలితంగానే చోళుల గ్రామ పరిపాలనా వ్యవస్థ ప్రపంచానికి తెలిసింది. ఇతని గ్రంథం 'The Cholas' యితణ్ణి భారతీయ చరిత్రకారుల్లో మొదటి వరుసలో నిలబెట్టిందని నిస్సందేహంగా చెప్పవచ్చును.

### 16.6.4 ఆర్.సి. మజుందార్ (1888 -1980) :

జాతీయవాద స్ఫూర్తితో అనేక చరిత్ర రచనలు చేసిన మరో చరిత్రకారుడు రమేష్ చంద్ర మజుందార్. వృత్తిరీత్యా చరిత్ర ఆచార్యుడే అయినా అతడు ఢాకా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గాను వ్యవహరించాడు. అతని తొలి రచనల్లో 'Corporate Life in Ancient India', 'History of Bengal' జావాపై రచన ముఖ్యమైనవి. ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక కాలాలకు సంబంధించి సమస్థాయిలో పరిశోధనలు, రచనలు చేయడం అతనిలోని ప్రత్యేకత. అతడు రాయ్ చౌదరి, దత్తాలతో కలసి రాసిన 'Advanced History of India' భారతదేశ చరిత్రపై ఉపయుక్తమైన ప్రామాణిక పాఠ్య గ్రంథం. అయితే సమకాలీనులకంటే అతనికి ఎంతో కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెట్టినవి. 1) కె.ఎమ్. మున్షి నేతృత్వంలోని భారతీయ విద్యాభవన్ ప్రచురించిన 11 సంపుటాల 'The History and Culture of the Indian People' గ్రంథం మజుందార్ సంపాదకత్వంలో వెలువడటం, 2) ఈ పరంపరలో అనేక ప్రకరణాలు అతనే రాయడం, యీ కృషి అంతా అతని నాయకత్వంలో అద్భుత విజయాన్ని చూరగొనడం. అతని 'History of Freedom Movement in India' సంపుటాలూ అందులోనూ ప్రత్యేకించి, 'The 1857 Muting' ఎంతో ఆసక్తిని రేకెత్తించే వివరణాత్మకమూ, వైవిష్యమూ వున్న రచనలే.

హీరాస్ జ్ఞాపకార్థం అతడిచ్చిన ఉపన్యాసాల సంపుటి 'Historiography in Modern India' ఉన్నది 60 పుటల్లోనే అయినా చరిత్ర రచనా కళపై అతని భావాలను సంక్షిప్తీకరిస్తున్నది. ఈ రచనలో ఒక చరిత్రకారునికి వుండవలసిన ఆదర్శం గురించి జదూనాథ్ సర్కార్ చెప్పిన దాన్ని ఆమోదిస్తూ మజుందార్ పునశ్చరణ యీ సందర్భంలో గుర్తుంచుకోదగ్గది. "సత్యం సంతోషకరమా, కాదా, సమకాలీన భావాలు అనుగుణమా? వ్యతిరేకమా? అనేది నేను లక్ష్యపెట్టను. నా దేశ ఔన్నత్యానికి సత్యం ఒక విఘాతమా? కాదా? అనేది కొద్దిగా కూడా నేను పట్టించుకోను. సత్యోపదేశం కోసం మిత్రులు, సమాజం వేసే అపనిందను చేసే అవహేళనను అవసరమైతే ఓర్పుతో భరిస్తాను. కాని నేనింకా సత్యాన్ని అపేక్షిస్తాను, సత్యాన్ని అర్థం చేసుకుంటాను, సత్యాన్ని అంగీకరిస్తాను. ఒక చరిత్రకారుని దృఢ సంకల్పం యిలా వుండాలి" ఇదీ అతని ఆదర్శం. తారాచంద్ లాంటి చరిత్రకారులు యీ ఆదర్శాన్ని పాటించిన వారే.

### 16.7 సారాంశము :

షేక్ ఆలీ చెప్పినట్లు 'జాతీయోద్యమ కాలంలో పాశ్చాత్య విమర్శలకు వ్యతిరేకంగా భారతీయ చరిత్రకారులు తమ పరిశోధనల ద్వారా గత ఔన్నత్యాన్ని, వైభవాన్ని వెలికి తీసారు. పాశ్చాత్యుల సవాళ్లను తమ పరిశోధనా నైపుణ్యంతో ఎదుర్కొని విమర్శల్ని ఖండించి భారతీయుల్లో జాతీయ స్ఫూర్తిని కలిగించి ఆత్మాభిమానాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించారు. ప్రతి దేశంలోను చరిత్రను తమ జాతీయ అవసరాల దృష్ట్యా రాస్తూ వచ్చినట్లే మనదేశంలోనూ స్వాతంత్ర్యానికి పూర్వం అలాగే జరిగింది. ఈ ధోరణి ఆనాడు జాతీయ చైతన్యాన్ని పెంపొందించినా లోతుగా పరిశీలిస్తే చరిత్ర రచనల్లో మతతత్వ వైఖరి పెరగడానికి దోహదపడిందని చెప్పాలి.

### 16.8 సంక్షిప్తంగా :

జాత్యహంకార, సాంస్కృతిక అహంకార బ్రిటీషు సామ్రాజ్యవాద, వలసవాద చరిత్ర రచనా విధానానికి సమాధానంగా భారత జాతీయవాద చరిత్ర రచనా సంప్రదాయం 19,20 శతాబ్దాల్లో రూపొందింది. సంఘ సంస్కర్తలు, మేధావులు జాతీయ చైతన్యాన్ని పెంపొందిస్తే, జాతీయోద్యమ స్ఫూర్తితో జాతీయవాద ఆర్థిక చరిత్రకారులు బ్రిటీషువారి దోపిడీని తమ రచనల్లో

ఎండగట్టారు. జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధి ముమ్మరమయింది. దీనితోపాటే చరిత్ర రచనలో మతతత్వం పెరిగింది. కాని ఉపజాతీయవాదం (sub-nationalism) పెరగటంతో ప్రాంతీయ, స్థానిక చరిత్రల్లో ఆసక్తి పెరిగింది.

**16.9 నమూనా ప్రశ్నలు:**

**(I) క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలివ్వండి.**

1. భారత జాతీయవాద చరిత్ర రచనాభివృద్ధిని వివరించండి.

2. జాతీయవాద చరిత్ర రచనా ధోరణి మంచి చెడులను విమర్శనాత్మకంగా విశ్లేషించండి.

**(II) ఈ క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో సంఘ సంస్కర్తల పాత్రను వివరించండి.

2. దాదాభాయ్ నౌరోజి 'డ్రెయిన్' సిద్ధాంతాన్ని విపులీకరించండి.

3. హెచ్.సి.రాయ్ చౌదరి, కె.ఏ. నీలకంఠ శాస్త్రిలు జాతీయవాద చరిత్ర రచనకందించిన సేవలను సమీక్షించండి.

**16.10 చదువదగిన గ్రంథాలు:**


| | | |
|---|---|---|
| Chandra, Bipin | : | Nationalism and Colonialism in Modern India (Orient Longman Ltd., New Delhi, 1979) |
| Durga Prasad. J. | : | Charitra Rachana Sastram (Tel) (Telugu Akademi, Hyderabad, 1987) |
| Majumdar, R.C. | : | Historiography in Modern India (Asia Publishing House, Bombay, 1970) |
| Mukhopadhyaya, S. | : | Evolution of Historiography in Modern India, 1900-1960, (K.P. Bagchi, Calcutta, 1981) |
| Philips. C.H. | : | Historians of India, Pakistan and Ceylon (Oxford University Press, London, 1961) |
| Sheik Ali, B. | : | History : Its Theory and Method (Macmillan, Madras, 1971) |
| Warder, A.K. | : | An Introduction to Indian Historiography (Popular Prakashan, Bombay, 1971) |


డా॥ జె. దుర్గాప్రసాద్

పాఠం - 17

# మార్క్సువాదం (The Marxist School)

## 17.0 లక్ష్యం :

ఈ పాఠ్యభాగము నందు ఈ క్రింది అంశాలు వివరించబడినవి.

* మార్క్సు చరిత్ర వ్యాఖ్యానము
* ప్రపంచంలోని సమాజ శాస్త్రజ్ఞుల మీద మార్క్సు ప్రభావం గురించి వివరించగలగాలి.

## విషయసూచిక :


17.1 పరిచయం

17.2 మార్క్సువాదం

17.3 మార్క్సువాద ప్రభావం

17.4 సారాంశము

17.5 నమూనా ప్రశ్నలు

17.6 చదువదగిన గ్రంథాలు


## 17.1 పరిచయం :

చరిత్ర అంటే ఏమిటి ? చరిత్ర గమనమును నిర్దేశించే శక్తులు ఏవి? చరిత్ర పరిణామం, అంతరార్థమును ఏవిధంగా అవగాహన చేసుకోవాలి ? అన్న ప్రశ్నలను వివిధ దృక్కోణాల నుండి పరిశీలించిన తత్వవేత్తలు, చరిత్రకారులు తమ కాల, జాతి, మత, ఆలోచనా ధోరణులను ప్రభావితం చేశారు. జ్ఞాన వికాసవాదం, భావవాదం, ప్రత్యక్ష జ్ఞానవాదం, చారిత్రక గతితర్కం, అస్థిత్వవాదం, చారిత్రక వాదం, మహాపురుషవాదాల దృష్ట్యా చరిత్ర - స్వభావమును, చరిత్ర తత్వమును, చరిత్ర లక్ష్యమును వివరించారు వ్యాఖ్యానించారు. అట్టి వ్యాఖ్యానంలో ఒకటి కారల్‌మార్క్సు ప్రతిపాదించిన చారిత్రక భౌతిక వాద వ్యాఖ్యానం. ఈ వ్యాఖ్యానం నేడు ప్రపంచం మొత్తంలోని అధిక సంఖ్యాకులైన చరిత్రకారులను ప్రభావితం చేస్తుంది.

భావనాపరంగా 19 వ శతాబ్దంలో చరిత్ర గొప్ప మార్పులకు లోనయింది. ఒక విధంగా వికాసయుగపు తీవ్ర వివేచనాత్మక భావవైఖరికి ఇది ప్రతిస్పందన. ముఖ్యంగా 1789 ఫ్రెంచి విప్లవం తరువాత కాల్పనికవాదం అనే ఒక క్రొత్త సంప్రదాయం ఆవిర్భవించింది. హేతువు స్థానాన్ని ఊహ ఆక్రమించింది. సాహిత్యరంగంలో కేట్స్, షెల్లీ, బైరన్ వంటి ఆంగ్లకవులు దీనికి ప్రాతినిధ్యం వహించారు. వీరి సాహిత్య ముఖ్య లక్షణం విచిత్ర, సాహస, అద్భుత, అలౌకిక విషయాలపై ఆసక్తి. విషయాల వాస్తవిక వర్ణనలకంటే అది కళాకారుని మనస్సులో కలుగజేసే ఆత్మాశ్రయ సంవేదనలపైననే కాల్పనిక వాదుల దృష్టి హెచ్చుగా ఉంది. ఇందులో తార్కిక చింతన కంటే అనుభూతికే ప్రాధాన్యత ఎక్కువ. జర్మనీలో ష్లెగల్ సోదరులు, షెల్లింగ్, ష్లియర్ మహర్ మొదలైనవారు, ఇంగ్లండులో బ్లాడ్లీ, ఫ్రాన్స్‌లో రూసో, బెర్గ్‌సన్‌లు ఈ వాదాన్ని సమర్థించారు. వ్యక్తి స్వేచ్ఛ, సంకల్ప ప్రాధాన్యత,

అంతరబుద్ధి ఈ వాదంలో భాగమయ్యాయి. చరిత్ర రచనా రంగంలో ఈ వాదానికి ప్రాతినిధ్యం వహించినవారిలో కార్లైల్, ఫ్రూడ్, మెకాలే, కార్ల్‌మార్క్స్, మొదలైనవారు ప్రముఖులు. కార్ల్‌మార్క్స్ ఆధునిక విప్లవాత్మక సామాజిక వాదాన్నీ, కమ్యూనిజాన్ని ప్రతిపాదించాడు.

మార్క్స్ తన వాదానికి హెగెల్ ఉపయోగించిన గతి తార్కిక పద్ధతినే ప్రాతిపదికగా చేసుకొన్నాడు. హెగెల్ జాతికి ఎక్కువ ప్రాధాన్యమిస్తూ చరిత్రను గతితార్కిక పద్ధతి ద్వారా వ్యాఖ్యానించాలన్నాడు. దీనివల్ల ప్రతి జాతి ప్రపంచ సంస్కృతికి దోహదం చేయడానికి వీలవుతుంది. ప్రపంచంలో చిదాత్మ (Sprit) ఏ విధంగా పురోగమిస్తుందో, ఒక స్థాయినుంచి మరొకస్థాయికి ఏ విధంగా చేరుతుందో గతితార్కికం వివరిస్తుందని హెగెల్ అన్నాడు. ఇతని ఉద్దేశంలో ప్రతి విషయంలోను చిదాత్మ లేదా హేతువు గమ్యాన్ని చేరినప్పుడు దానిలో గోచరించేవేకాక అగోచరమైనవి కూడా ఉంటాయి. ఏ విషయాన్నైనా అర్థం చేసుకోవాలంటే ఈ రెండింటిని అవగాహన చేసుకోవాలని హెగెల్ ఉద్ఘాటించాడు. అనగా యదార్థమైనది, దానికి వ్యతిరేకమైనది రెంటినీ సమన్వయపరిస్తే వాస్తవికత నిర్ధారితమవుతుంది. మరోవిధంగా చెప్పాలంటే వాద, ప్రతివాదాల మధ్య సంఘర్షణ ఏర్పడిన పర్యవసానంగా సమన్వయం రూపుదిద్దుకొంటుంది. ఈ సమన్వయంపై రెండింటిలోని మంచిని గ్రహించి పొందుపరుస్తుంది. ఇది తిరిగి కొత్త వాద, ప్రతివాదాలకు దారి తీస్తుంది. ఈ విధంగా భావానికి పరిపూర్ణత వచ్చే వరకు మార్పులు జరుగుతాయని హెగెల్ తెలియజేసాడు. ఇతడు రూపొందించిన తత్వవిచారం, ఉపయోగించిన గతితార్కిక పద్ధతి కార్ల్‌మార్క్స్ మీద బాగా ప్రభావం చూపించాయి. ఫలితంగా సామ్యవాద చరిత్రలో నూతన దృక్పథం ఏర్పడింది.

## 17.2 మార్క్స్‌వాదం:

కారల్‌మార్క్స్, అతని మిత్రుడైన ఫెడరిక్ ఏంగెల్స్‌లు హెగెల్ గతితార్కిక భావవాదానికి నూతనమైన, విప్లవాత్మకమైన పిలుపునిచ్చారు. వినూత్నమైన అర్థాన్నిచ్చారు.

మానవ చరిత్రను, దానిలోని పరిణామదశలను, కార్యకారణ (Theory of Cansality) సంబంధం ద్వారా వివరించవచ్చని మార్క్స్ పేర్కొన్నారు.

మార్క్సిజంలోని ప్రధాన అంశాలను, ఇలా చెప్పవచ్చు. 1. హెగెల్ గతితర్కం, 2. ఫాయర్‌బాఖ్ భౌతికవాదం, 3. శ్రమవిలువ అదనపువిలువ సిద్ధాంతం, 4. పెట్టుబడిదారీ విశ్లేషణ, 5. వర్గపోరాటం, 6. కమ్యూనిజం.

**1. హెగెల్ గతితర్కం :** ప్రతి అంశంలోను రెండు పరస్పర విరుద్ధ అంశాలుంటాయి. అవి ఒకే సమయంలో ఐక్యంగా ఉంటాయి. ఘర్షించుకొంటాయి. ఈ ఐక్యతా, ఘర్షణ క్రమం ద్వారానే ప్రతి అంశం అభివృద్ధి చెందుతుంది. ఈ అభివృద్ధిలో చోటు చేసుకొనే పరిణామాత్మక మార్పులు ఒక దశ తరువాత నూతనస్థాయికి చేరుకుంటాయి. అంటే గుణాత్మక మార్పులకు దారితీస్తాయి. పరిణామాత్మక దశనుండి గుణాత్మకదశకు మార్పులు జరిగే క్రమంలో పాత అంశాలు కొన్ని నశించిపోతాయి. కొన్ని కొనసాగుతాయి. కొత్తవి అదనంగా చేరుతాయి. అంటే పాత, కొత్తల సంశ్లేషణ (Synthesis)గా మార్పులు సంభవిస్తాయి. ఈ మూడు దశలుగా ప్రతి మార్పు జరుగుతుంది. మార్పు జరిగే ఈ క్రమాన్నే హెగెల్ గతితర్క పద్ధతని అన్నాడు. ఈ పద్ధతిని కాక విధానాన్ని ఉపయోగించి హెగెల్ ఆలోచనా క్రమాన్ని లేక దాని పరిణామాన్ని వివరించడానికి ప్రయత్నించారు. ఆలోచనే అన్నింటికి మూలమనే ఆయన తాత్విక దృక్పథము ఇందుకు కారణం అంటే ఆలోచన (Thought) లేక భావమే (Idea) అన్నిటి కంటే ప్రథమం. ఆలోచన లేక భావం గతితార్కిక అభివృద్ధి ఫలితమే మనం చూస్తున్న మార్పులకు మూలం. ఈ పరిణామక్రమంలో భౌతిక

అంశాలకు ఉన్నది ద్వితీయస్థానమే. పరిణామ క్రమ అంతిమలక్ష్యం అఖండ భావాన్ని (Absolute Idea) చేరుకోవడమే. అంటే అఖండ భావం విచ్చుకోవడం (unfolding) గానే భౌతిక ప్రపంచ పరిణామాన్ని చూడవలసి ఉంటుందని హెగెల్ అభిప్రాయం.

అన్నింటికి మూలం భావమని, దానిదే ప్రథమస్థానమని హెగెల్ భావించారు. కనుక అతని వాదాన్ని భావవాదమని (Idealism) వ్యవహరిస్తారు. అలానే భావ పరిణామం గతితార్కికంగా సాగుతుందని కనుక, దానిని గతితార్కిక భావవాదమని (Dialecrcal isealism) పిలుస్తారు. హెగెల్ ప్రతిపాదించిన గతితార్కిక భావవాదంలోని గతితార్కిక పద్ధతి పరిణామాన్ని సక్రమంగానే వివరిస్తుంది. కాని అన్నింటికి భావమే మూలమనే భావన వాస్తవాన్ని పాక్షికంగానే వివరిస్తుంది. ఆ మేరకు హెగెల్ భావవాదం పాక్షికమైనది.

2. **ఫాయర్ బాఖ్ భౌతికవాదం :** హెగెల్ భావవాదంలోని పాక్షికతను గుర్తించి, విమర్శించిన వ్యక్తి ఫాయర్ బాఖ్. ఈయన జర్మన్‌కు చెందిన తత్వవేత్త. విశ్వపరిణామంలో భౌతిక అంశం శాశ్వతమైనదని దాని పరిణామంలో భాగంగానే భావం (Idea) లేక చైతన్యం (consciousness) ఆవిర్భవిస్తుంది. భౌతిక అంశమే ప్రాధమ్యాన్ని నొక్కి చెప్పే ఫాయర్ బాఖ్ తాత్విక దృక్పథాన్ని భౌతికవాదం (materialism) గా పేర్కొంటారు.

విశ్వ పరిణామాన్ని వివరించడంలో భౌతిక వాదాన్ని ఆశ్రయించిన ఫాయర్ బాఖ్ సమాజ పరిణామం దగ్గరకొచ్చేసరికి భావవాదాన్ని స్వీకరించారు. దానితో పాయర్ బాఖ్ తాత్విక వైఖరిలో వైరుద్యం చోటు చేసుకుంది.

ఒకప్రక్క హెగెల్ గతితార్కిక భావవాదంలోని పాక్షికతను మరోప్రక్క ఫాయర్ బాఖ్ భౌతికవాదంలోని పాక్షికతను గుర్తించి వారిలోని పరిమితులను అధిగమించడం ద్వారా నూతన తాత్విక సంశ్లేషణకు కృషిచేసిన వ్యక్తి కారల్‌మార్క్సు. హెగెల్‌లోని గతితర్కాన్ని, ఫాయర్ బాఖ్‌లోని భౌతిక వాదంతో సంశ్లేషించడం ద్వారా నూతన తాత్విక దృక్పథాన్ని ప్రతిపాదించాడు మార్క్సు. దీనినే గతితార్కిక భౌతికవాదం (Dialectical Materialism) గా వ్యవహరిస్తారు. ప్రకృతి, సమాజం, వీటిలో భాగంగా ఉన్న మనిషి పరిణామం, భౌతిక అంశం ప్రాతిపదికగా, గతితార్కిక పద్ధతిలో సాగుతుందనేది మార్క్సు ప్రతిపాదించిన గతితార్కిక భౌతికవాద సారాంశం. పరిణామ క్రమంలో భౌతిక అంశానిదే ప్రథమస్థానం. మనిషి ఆవిర్భావంలో భౌతిక, మానసిక అంశాల పరస్పర సంసర్గం (interaction) కనిపిస్తుంది. ఈ పరిణామ క్రమంలో ఆలోచనకున్న స్థానం మరింతగా పెరుగుతూ వస్తుంది. అయితే ఇది భౌతిక పరిణామంతో ముడిపడి సాగుతూ వస్తుందన్న విషయాన్ని గమనించాలి.

సంశ్లేషణ ద్వారా మార్క్సు సాధించిన ప్రగతిని అంకగణిత పద్ధతిలో చూస్తే, తాత్వికునిగా అతడి కృషిలోని ప్రాధాన్యత, ప్రాముఖ్యత బోధపడదు.

3. **శ్రమవిలువ, అదనపు విలువ సిద్ధాంతం :** తన తాత్విక అవగాహన ప్రకారం సమాజ పరిణామాన్ని వివరించడానికి మార్క్సు చేసిన ప్రయత్న ఫలితమే చారిత్రక భౌతికవాదం (Historical Materialism)

సామాజిక జీవితానికి భౌతిక ఉత్పత్తే ప్రధాన భూమిక (Material production is the basis of social life) భౌతిక ఉత్పత్తిలో రెండు అంశాలుంటాయి. 1. ఉత్పత్తి శక్తులు, (Forces of Production) 2. ఉత్పత్తి సంబంధాలు (Relations of Production). ఉత్పత్తి శక్తులలో మరలా మూడు భాగాలుంటాయి. 1. ఉత్పత్తి లక్ష్యాలు (Objects of Production) ఉదాహరణ: భూమి, 2. ఉత్పత్తి పనిముట్లు (means of Production) 3. మానవ శ్రమ (Human Labours)

తన అవసరాలను తీర్చుకోవడానికి పనిముట్లను ఉత్పత్తి లక్ష్యాలపై ఉపయోగించి మానవుడు శ్రమిస్తాడు. ఈ శ్రమ క్రమంలో పాల్గొనే మనుషుల మధ్య ఏర్పడే సంబంధాలను ఉత్పత్తి సంబంధాలంటారు.

నిర్దిష్ట ఉత్పత్తి శక్తులు, తదనుగుణమైన ఉత్పత్తి సంబంధాలను కలిపి ఉత్పత్తి విధానం (Mode of Production) గా పరిగణిస్తారు. ఒక నిర్దుష్ఠ సామాజిక స్థితిలో ఉండే ఉత్పత్తి శక్తులతో ఉత్పత్తి సంబంధాలు పొసగి ఉంటాయి. అంటే అది ఒక నిర్దిష్ఠ ఉత్పత్తి విధానమన్నమాట. ఇలాంటి నిర్దుష్ట ఉత్పత్తి విధానాలు సమాజ పరిణామంలో ఇప్పటికి ఐదు కనిపిస్తున్నాయని మార్క్స్ తన పరిశీలనలో తెలిపాడు. 1. ఆదిమ కమ్యూనిజం (Primitive communism or communal mode of Production), 2. బానిస ఉత్పత్తి విధానం (Slavery mode of Production), 3. భూస్వామ్య ఉత్పత్తి విధానం (Fudal mode of Production), 4. ఆసియా తరహా ఉత్పత్తి విధానం (Asiatic mode of Production) 5. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం (capitalist mode of Production)

ఒక్కొక్క నిర్దుష్ట ఉత్పత్తి విధాన నేపథ్యంలో మానవులు చేసే కృషి ఫలితంగా ఒక ప్రక్క భౌతిక సంపద (Material wealth) పోగౌతుంది. మరోప్రక్క ఆత్మిక సంపద (Spriritual weath or Intellectual wealth) పోగౌతుంది. భౌతిక సంపద మానవుల భౌతిక అవసరాలు తీర్చగా, ఆత్మిక సంపద వారి మానసిక అవసరాలను తీర్చుతుంది.

ఆయా నిర్దుష్ట సమాజాలలో మానవుడు చేసే భౌతిక ఉత్పత్తి సమాజానికి పునాది (basis) అవుతుంది. అలానే ఆ ఉత్పత్తికి అనుగుణంగా వారు సాధించే ఆత్మిక సంపద ఉపరితలమౌతుంది. (Superstructure). పునాది, ఉపరితలాలమధ్య ఉండే సంబంధం ఫలితంగా సమాజ పరిణామం జరుగుతుంది. ఈ పరిణామంలో వివిధ అంశాలలో ఉండే ఐక్యతా, ఘర్షణలను చూడవచ్చు. ఈ ఐక్యతా, ఘర్షణల ఫలితంగా పరిణామాత్మక అంశాలు ఏ విధంగా గుణాత్మకంగా మారతాయో గమనించవచ్చు. ఈ క్రమంలో పాత, క్రొత్తల మధ్య జరిగే సంశ్లేషణను దర్శించవచ్చు. అంటే చరిత్ర గమనం ఏ విధంగా గతి తార్కికంగా సాగుతుందో అర్థమౌతుంది.

చరిత్రపట్ల మార్క్స్ అభివృద్ధి చేసిన ఈ భౌతికవాద అవగాహన (Materialist Conception of History) ఆధారంగా సమాజాన్ని పరిశీలిస్తే సంపదకు శ్రమ (Labour) మూలమని అర్థమౌతుంది. శ్రమ విలువ (Labour theory of value) ఆధారంగా సంపదను కొలవవలసి వస్తుంది. శ్రమ విలువను అంచనా కట్టడంలో రెండు అంశాలను పరిగణనలోనికి తీసుకోవాలి. 1. శ్రమ చేసే వ్యక్తి అవసరాలకు సరిపడ శ్రమచేయడం. 2. శ్రమజీవి అవసరాలకు మించి చేసే శ్రమ విలువ.

అవసరాలకు మించి శ్రమజీవి చేసే శ్రమ వలన అదన విలువ (surplus value) పోగౌతుందని, అదే ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో పెద్దయెత్తున దోపిడీ (Exploitation) కి, సంపద కేంద్రీకరణకు దారితీస్తుందని మార్క్స్ భావన.

4. **పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్లేషణ :** సమాజ పరిణామంలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందిన ఒక నిర్దుష్ట ఉత్పత్తి విధానం. ఇది సరుకు (commodity) కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. సరుకు కేంద్రంగా సాగే పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏ విధంగా శ్రామికుడు తాను ఉత్పత్తి చేసే వస్తువు నుండి దూరమై (Alienation) లేమిడితనాన్ని (Deprivation) అనుభవించేది మార్క్స్ తన విశ్లేషణలో నిరూపించాడు. ఆ మీదట తమ హక్కులను సాధించుకొనే క్రమంలో శ్రామికులు సంఘటితమయ్యే పరిస్థితులు ఏ విధంగా ఏర్పడతాయో కూడా మార్క్స్ వివరించాడు. ఉత్పత్తి సాధనలపై యాజమాన్యం కలిగిన పెట్టుబడిదారీ వర్గం ఏ విధంగా ఉత్పత్తి పై పట్టు బిగించి, శ్రామికులను దోచుకుంటూ తమ పెత్తనాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తుందో

'పెట్టుబడి' గ్రంథంలో మార్క్స్ విశ్లేషించాడు. ఉత్పత్తి క్రమంలో శ్రామికులు (Psoletariat), పెట్టుబడిదారీ వర్గం (capitalist class) మధ్య తలెత్తిన వర్గ పోరాటానికి పరిష్కారం విప్లవమేనని మార్క్స్ ప్రతిపాదించాడు.

5. **వర్గపోరాటం :** (Class struggle) మొదట్లో ఉన్న సమిష్టి ఉత్పత్తి విధానం (communal mode of Prduction) స్థానే సమాజ పరిణామక్రమంలో వ్యక్తిగత యాజమాన్యం చోటుచేసుకొంది. దీనితో ఉత్పత్తి సాధనాలపై కొందరి వ్యక్తిస్వామ్యం నెలకొంది. ఇది ప్రైవేట్ ఆస్తి (private property) ఏర్పాటుకు దారితీసింది. అలానే మరికొంతమంది ఉత్పత్తి సాధనాలపై యాజమాన్య హక్కులను కోల్పోయారు. కాని వాటిని ఉపయోగించి పనిచేయవలసిన పరిస్థితిలోనికి నెట్టబడ్డారు. వీరే శ్రామికులు. ఈ విధంగా వర్గ సమాజం (Class divided society), ప్రైవేట్ ఆస్తి ఏర్పడ్డాయి.

వివిధ నిర్దుష్ట ఉత్పత్తి విధానాలలో యాజమాన్యం వహించేవారు వేర్వేరుగా ఉంటారు. బానిస సమాజం మొదటి వర్గసమాజం. ఇందులో బానిస యాజమానులు, బానిసలనే రెండు ప్రధానవర్గాలు. అలానే భూస్వామ్య సమాజంలో భూస్వామ్య వర్గం, రైతాంగం లేక అర్థ బానిస (serf) లనేవి ప్రధాన వర్గాలు. పెట్టుబడిదారీ సమాజంలో పెట్టుబడిదారులు, శ్రామిక జనావళి అనే రెండు ప్రధాన వర్గాలున్నాయి.

ఇప్పుడు ప్రపంచంలోని వివిధ దేశాలలో చూసినప్పుడు ఎక్కువగా కనిపించేవి పెట్టుబడిదారీ సమాజాలే. నిర్దుష్టంగా చూసినప్పుడు వివిధ సమాజాలలో ఒకే సమయంలో వివిధ సామాజిక దశలను ప్రతిబింబించే భిన్న వర్గాలు కనిపిస్తాయి. ఉదాహరణకు, భారతదేశంలో వివిధ ప్రాంతాలలో భౌస్వామ్య సమాజంలోని వర్గాలు కనిపిస్తాయి. అదే సమయంలో పెట్టుబడిదారీ సమాజంలోని వర్గాలనూ చూడవచ్చు. అలానే ఆదిమ కమ్యూనిస్టు సమాజంలోని సామాజిక చిహ్నాలు దర్శనమిచ్చాయి. కాని ఆయా సమాజాలలో నిర్దుష్టకాలంలో ఏ ఏ వర్గాలు ప్రధాన పాత్ర నిర్వహిస్తాయో, దానిని బట్టి ఆ సమాజంలో ఏ నిర్దుష్ట ఉత్పత్తి విధానం ఉందో పేర్కొంటాం. అలానే ఏ వర్గాలు ప్రధానపాత్ర వహిస్తాయో చెబుతాం.

వర్గాలు, ప్రైవేట్ ఆస్తి ఏర్పాటుతో ప్రారంభమైన వర్గపోరాటం నేడు విభిన్న రూపాలలో మరింత తీవ్రతతో కొనసాగుతుంది. వర్గపోరాటం అభివృద్ధి చెందిన దశను నేటి పెట్టుబడిదారీ సమాజాలలో చూడవచ్చు. బానిస సమాజంలో మొదలైన వర్గపోరాటం భూస్వామ్య సమాజం ద్వారా సాగి నేడు భిన్నమైన రూపంలో పెట్టుబడిదారీ సమాజంలో కనిపిస్తుంది. ఈ మూడు సామాజిక దశలలో వర్గ దోపిడీ ఉమ్మడి కనిపిస్తుంది. ఈ వర్గ దోపిడీ పెట్టుబడిదారీ విధానంలో మరింత తీవ్రరూపాన్ని, సున్నితమైన రూపాన్ని సంతరించుకొంది. ఆ మేరకు వర్గ పోరాటాల రూపాల తీవ్రత, స్వభావం కూడ మారుతూ వస్తున్నాయి. మార్క్స్ ప్రకారం, పెట్టుబడిదారీ సమాజమే చివరి వర్గ సమాజం. దీనిలో సాగే వర్గ పోరు అంతిమంగా వర్గ సమాజాన్ని కూలదోసి వర్గరహిత, దోపిడీలేని రాజ్యానికి పునాదివేస్తుందని మార్క్స్ భావన. దోపిడీ రహిత, కమ్యూనిస్టు సమాజానికి సాగే ప్రస్తావన దశలో శ్రామికవర్గం రాజ్యాన్ని నడుపుతుంది. అని శ్రామిక వర్గ నియంతృత్వం (Dictatorship of psoletariat) గా ఉంటుందని మార్క్స్ అభిప్రాయం. శ్రామిక వర్గ నియంతృత్వ దశ తరువాత కమ్యూనిస్టు సమాజ నిర్మాణం జరుగుతుంది. ఆ క్రమంలో ఇంతకుముందు దోపిడీ సాధనంగా ఉంటూ వచ్చిన రాజ్యం (State) వడలి పోతుందని మార్క్స్ సూత్రీకరించారు.

6. **కమ్యూనిజం :** దోపిడీకి, అణచివేతకు అవకాశంలేని, పెత్తనానికి చోటులేని, వర్గరహిత, రాజ్యరహిత, సంపూర్ణ స్వేచ్ఛా సమాజాన్ని ఆవిష్కరించడమే కమ్యూనిజమని మార్క్స్ భావించాడు. వ్యక్తి స్వేచ్ఛ యావత్ సమాజ స్వేచ్ఛకు గీటురాయన్నాడు. శక్తిమేరకు పనిచేయడం, కావలసిన మేరకు అనుభవించడమే ఇక్కడ సామాజిక సూత్రం. నిజమైన అర్థంలో వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన భౌతిక, ఆత్మిక పరిస్థితులు ఇక్కడే ఆవిష్కృతమౌతాయని మార్క్స్ ప్రతిపాదించాడు.

## 17.3 మార్క్సువాద ప్రభావం :

చరిత్ర పరిశోధన ఏ దిశగా సాగుతుందో అనే విషయం గురించి 20 వ శతాబ్దం ఆరంభం నుంచి చరిత్రకారులు అనేక భావాలను వెలిబుచ్చటం ఆరంభించారు. చరిత్రకారుడు ప్రాథమికంగా వర్తమానానికి సంబంధించిన గతకాలపు అంశాల గురించి ఆలోచించాలనేది ఇందులో ఒక దృక్పథం. ఇక సమకాలీన శాస్త్ర విజయాల ప్రభావానికి లోనైన కొందరు చరిత్రను విస్తృత కార్యకారణ సంబంధంలో చూడాలని అభిప్రాయపడ్డారు. సామాజిక శాస్త్రాలను విస్తృతంగా ఉపయోగించుకొని, వర్తమాన సమస్యలకు పరిష్కారం చూపే 'నవీన చరిత్ర'ను వీరు పరిగణనలోకి తీసుకొన్నారు. ఈ పరిణామాలలో మార్క్సువాదం ముఖ్యపాత్రను నిర్వహించింది.

ప్రథమంలో మార్క్సు ప్రభావానికి తీవ్రంగా లోనైన చరిత్రకారుల సంఖ్య స్వల్పమే అయినా అతని భావాలు అప్పటి బుద్ధి వికాస వాతావరణంలో అంతర్భాగమయ్యాయి. చరిత్ర రచనలో నెలకొని ఉన్న ఊహల గురించి అనుమానించడం ప్రారంభమయింది. సామ్రాజ్యవాదయుగంలో మార్క్సిజం ప్రేరణలో చరిత్రలో ఆర్థిక, పరిపాలనాంశాల అధ్యయనం ఒక ఆకర్షణంగా పెంపొందింది. ఈ మార్గంలో పయనించిన హెన్రీ పిరనె ( Henri pirenne) 20 వ శతాబ్దం ఆరంభంలో ఆర్థిక చరిత్రకారునిగా అత్యంత ప్రసిద్ధి పొందాడు. మాక్స్‌వెబర్ వంటి సమాజ శాస్త్రజ్ఞులు పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించి మార్క్సు భావన ప్రాముఖ్యం వైపు చరిత్రకారుల దృష్టిని మళ్ళించడంలో కొంత ఉపకరించారు. దీని ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థ పరిణామంలోని వివిధ దశలు, ఉద్యోగవర్గ పాలనా మూలాలపై రాజకీయ సంస్థలకు సంబంధించి ఆధునిక రీతులపై ఆ వ్యవస్థ ప్రభావం మొదలగు వాటి గురించి చరిత్రకారులు అధ్యయనం చేయుటం ఆరంభించారు. అమెరికన్ చరిత్రకారులు ఫ్రెడరిక్ జాక్సన్‌టర్నర్, ఛార్లెస్ బియర్డ్‌ల రచనలు ఈ విధంగా ఆవిర్భవించినవే.

20 వ శతాబ్దపు అమెరికా చరిత్రను రూపుదిద్దడంలో ఫ్రెడరిక్ జాక్సన్‌టర్నర్ (Frederick Jackson Turner) గొప్ప ప్రభావం చూపాడు. అమెరికా చరిత్ర సంఘ సమావేశంలో సమర్పించిన వ్యాసం 'ది సిగ్నిఫికెన్స్ ఆఫ్ ది ఫ్రాంటియర్ ఇన్ అమెరికన్ హిస్టరీ' ద్వారా ఇతడు ప్రాముఖ్యంలోకి వచ్చాడు. అమెరికా చరిత్ర, నాగరికతలో 'పశ్చిమానికి విస్తరణ' ఒక ముఖ్య పరిణామమని సిద్ధాంతీకరించాడు. పాశ్చాత్య, ప్రాచ్య చరిత్రలను అధ్యయనం చేయాలని ఇతడు అమెరికా చరిత్రకారులను అర్థించాడు. ఇతడు 'ది సిగ్నిఫికెన్స్ ఆఫ్ హిస్టరీ', 'ప్రాబ్లమ్స్ ఇన్ అమెరికన్ హిస్టరీ', 'డామినెంట్ ఫోర్సస్ ఇన్ వెస్టర్న్‌లైఫ్', 'సోషల్ ఫోర్సస్ ఇన్ అమెరికన్ హిస్టరీ' అను వ్యాసాలను, 'ది రైస్ ఆఫ్ ది న్యూ వెస్ట్' (The Rise of the New West), 'ది సిగ్నిఫికెన్స్ ఆఫ్ సెక్షన్స్ ఇన్ అమెరికన్ హిస్టరీ' (The Significance of Sections in Americal History), 'ది యునైటెడ్ స్టేట్స్ - 1830-1850' (The United States) అను గ్రంథాలను వ్రాసాడు.

ఛార్లెస్ ఆస్టిన్ బియర్డ్ (Charles Austin Beard) తన విశేష అనుభవాలతో అనేక గ్రంథాలు వ్రాసాడు. వాటిలో 'అమెరికన్ గవర్నమెంట్ అండ్ పాలిటిక్స్', 'అమెరికన్ సిటి గవర్నమెంట్', 'ది సుప్రీమ్ కోర్ట్ అండ్ ది కాన్‌స్టిట్యూషన్', 'ఏన్ ఎకానిమిక్ ఇంటర్‌ప్రెటేషన్ ఆఫ్ ది కాన్‌స్టిట్యూషన్' (An Economic Interpretation of the constitution) 'ఎకానిమిక్ ఆరిజిన్స్ ఆఫ్ జెఫర్ సోనియన్ డెమోక్రసి' (Economic origins of Jeffersonian Democracy) ముఖ్యమైనవి. 1913 లో విడుదల చేసిన 'ఏన్ ఎకనామిక్ ఇంటర్‌ప్రెటేషన్ ఆఫ్ హిస్టరీ'లో ఆర్థికాంశాలకు ఎక్కువ ప్రాముఖ్యమివ్వాలని చరిత్రకారులను కోరాడు. 1927 లో తన భార్య మేరి రిట్టర్ బియర్డ్ (Mary Ritter Beard) తో కలిసి రెండు సంపుటాల 'ది రైజ్ ఆఫ్ అమెరికన్ సివిలైజేషన్' (The Rise of American Civilization) అను గ్రంథాన్ని ఛార్లెస్ బియర్డ్ వ్రాసాడు. ఇందులో సామాజిక వర్గాల వైరుధ్యములో ఆర్థిక

అంశాలు ప్రధాన పాత్ర నిర్వహిస్తాయని బియర్డ్ తెలియజేసాడు. ఇతని ఇతర రచనల్లో పేర్కొనదగినవి. 'ది ఐడియా ఆఫ్ నేషనల్ ఇన్‌టరెస్ట్', 'ఎన్ అనలిటికల్ స్టడీ ఇన్ అమెరికన్ ఫారిన్ పాలసి', 'ది అమెరికన్ స్పిరిట్', 'అమెరికా ఇన్ మిడ్ పాసేజ్' మొదలగునవి.

అగ్రరాజ్యాలకు మొదటి ప్రపంచయుద్ధానికి పూర్వం ఉన్న రాజ్య కార్య కుశలతకు సంబంధించిన ఫైళ్ళను యుద్ధం తరువాత పరిశీలించే అవకాశం లభించడంతో అమెరికన్ చరిత్రకారులు సిడ్నీఫే (Sidney Fay), బెర్నడాట్ స్కిమిట్‌లు యుద్ధానికి దారితీసిన పరిస్థితులపై అత్యంత ప్రామాణిక గ్రంథాలు రచించారు. అయితే ఆ తరువాత అగ్రరాజ్యాల కార్యకలాపాల వెనుక వున్న ఆర్థిక ప్రేరణలను గురించి, అనేక ఐరోపా దేశాలలోని పాలక వర్గాల గురించి సామ్రాజ్యవాద రాజ్యతంత్రజ్ఞతను విశ్లేషిస్తూ మరో అమెరికన్ చరిత్రకారుడు విలియం లాన్‌గర్ (William Langer) సమగ్ర రచన చేశాడు. అలాగే 18 వ శతాబ్దపు ఇంగ్లీష్ పాలకవర్గం గురించి బ్రిటిష్ చరిత్రకారుడు లూయిస్ నేమియర్ వ్రాశాడు. జర్మనీలో మైనెక్ (Meineke), ఇటలీలో ఫెడరికో చాబోడ్ (Federico Chabod) లు భావచరిత్రపై దృష్టిని సారించారు. ఫ్రాన్స్‌లో మార్క్ బ్లాచ్ (Marc Bloch), లూసీ ఫెబూర్ (Lucien Febure) లు తమ రచనల్లో సమాజ నిర్మాణంలో భౌతిక, ఆర్థిక, అంశాలను విశ్లేషించారు.

తీవ్ర జాతీయవాద, తీవ్ర మతతత్వ, తీవ్ర ప్రాంతీయ దృక్పథముల వల్ల తలయెత్తే దుష్పరిణామాలను గుర్తించిన కొందరు చరిత్రకారులు 1950 నుండి భారతదేశ చరిత్ర - సంస్కృతులను అధ్యయనం చేయటం ఆరంభించారు. ఈ రకమైన చరిత్ర పరిశోధనకు స్ఫూర్తినిచ్చినది కారల్ మార్క్స్ ప్రతిపాదించిన చారిత్రక గతితార్కిక భౌతికవాదం. సాంఘిక, మత వ్యవస్థకు రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు మధ్యనున్న సంబంధాన్ని ఒక క్రమ పద్ధతిలో అధ్యయనం చేయడం ప్రారంభించారు. ఈ దృక్కోణం లేక పూర్వము ఏ వ్యవస్థ కావ్యవస్థను విడివిడిగా పరిశీలించారు. కాని వాటి మధ్య ఉన్న అంతర్గత సంబంధాన్ని వారు గమనించలేదు. చరిత్రను సాంఘిక శాస్త్రంగా భావించి, సాంఘిక శాస్త్ర నమూనా ద్వారా, మార్క్స్ ప్రతిపాదించిన పద్ధతిని ఉపయోగించి భారత సంస్కృతిలో వచ్చిన మార్పులను అధ్యయనం చేయటం ఆరంభించారు. ఈ విధమైన పరిశోధన సాగిస్తున్న వారికి మార్గదర్శి డి.డి. కోశాంబి. కోశాంబి మార్గంలో కొద్దిగా మార్పులతో చరిత్రను అధ్యయనం చేస్తున్న వారిలో ఆర్.యస్.శర్మ, డి.యన్.ఝా, ఆర్.యన్. నంది, ఇర్ఫాన్ హబీబ్, రోమిల్లా థాపర్ మొదలగువారు ముఖ్యులు.

డి.డి. కొశాంబి (D.D. Kosambi) భారతీయ చరిత్ర రచనా సంవిధానంలో శాస్త్రీయ దృక్పథం ప్రవేశపెట్టి, భారతీయ చరిత్ర రచనా విశ్లేషణ దృక్పథంలో మౌలికమైన మార్పు తీసుకువచ్చి భారతదేశ చరిత్ర అంటే పాలక వంశాల ఘనకార్యాల కూర్పు కాదని, రాజుల రాణుల ప్రేమపురాణాలు, యుద్ధాలు, ముట్టడుల వివరణ కాదని, భారతీయ సమాజ పరిణామంపై సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక శక్తుల ప్రభావం కాలక్రమేణా ఎటువంటి మార్పులను తెస్తుంది అన్న భావాన్ని బలంగా నాటుకొనేటట్లు చేసి, గత ఐదు దశాబ్దాలుగా చరిత్ర పరిశోధనా రంగాన్ని గొప్పగా ప్రభావితం చేశాడు. భారత చరిత్రకారులలో మార్క్సిస్టులేగాక ఆధునిక దృక్పథం గల వారందరూ కొశాంబిని ఆద్యునిగా భావిస్తారు. చరిత్ర పరిశోధనా పద్ధతిలోనూ, సిద్ధాంత దృక్పథంలోనూ శాస్త్రీయ ప్రమాణాలు నెలకొల్పిన వ్యక్తిగా గౌరవిస్తారు. వలస తత్వం, శృతిమించిన దేశభక్తి, సంప్రదాయికత, అగ్రవర్గ ఆధిక్యత, విశృంఖలమైన ఊహా తత్పరత మొదలయిన అనేక అవలక్షణాల నుండి భాగతదేశ చరిత్రను కొశాంబి రక్షించాడు. తనకు పూర్వులూ, సమకాలికులూ అయిన చరిత్రకారులు స్థల కాలాదుల నిర్ణయంలోనూ, ప్రాచీన గ్రంథాలను, శాసనాలను పరిష్కరించడంలోనూ, చారిత్రక సంఘటనల అనుక్రమణికను తీర్మానించడంలోనూ చేసిన కృషిని కొశాంబి గౌరవించాడు. అయితే వారు అశాస్త్రీయంగా వ్యవహరించిన చోట తీవ్రంగా అభిశంసించాడు. అంతేగాదు, కొశాంబి ప్రాచీన భారత చరిత్రను గురించి చేసిన అధ్యయనాన్ని రెండు స్థాయిలలో విభజించవచ్చును. ఒకటి, ఆ చరిత్రను నడిపిన భౌతిక చోదక శక్తుల నిర్ధారణ, ఆహార సేకరణ నుండి ఆహార ఉత్పత్తికి పరిణామం జరగడం, ఆహార ఉత్పత్తి మీద ఆధారపడిన స్థిర వ్యవసాయ గ్రామాల, ఆవిర్భావం,

ఈ స్థిర వ్యవసాయ గ్రామాలు స్వయంపోషకమై భూస్వామ్య వ్యవస్థకు పునాది కల్పించడం అనే ఆర్థికక్రమం ప్రాచీన చరిత్రకు మూలం అని కొశాంబి భావించాడు. రెండోది, ఈ చోదక క్రమాన్ని భారతదేశ నైసర్గిక స్వభావానికి జోడించి .సామాజిక, సాంస్కృతిక రంగాలను వ్యాఖ్యానించడం. ఈ వ్యాఖ్యానాన్ని గురించి తరువాతి చరిత్రకారులు కొంతమేరకు విభేదించారు. అయితే కొశాంబి ప్రతిపాదించిన భౌతిక చోదక క్రమం అయిన ఆర్థిక పరిణామాన్ని వ్యతిరేకించినవారు గాని, అందుకు ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించినవారు కాని ఎవరూలేరు. శాస్త్రీయంగా ప్రాచీన భారతదేశ చరిత్రను ఎవరు అధ్యయనం చేయదల్చుకున్నా కొశాంబి ప్రతిపాదించిన భౌతిక చోదక క్రమాన్ని ప్రాతిపదికగా తీసుకోకతప్పదు.

కొశాంబి వృత్తిరీత్యా చరిత్ర ఆచార్యుడు, చరిత్ర రచయిత కాదు. అయినప్పటికి చరిత్రపై కొశాంబి వ్రాసిన 64 వ్యాసాలు, నాల్గు చరిత్ర గ్రంథాలు అతనిని ఒక విశిష్ట చరిత్రకారునిగా నిలబెట్టాయి. అతడు వ్రాసిన పుస్తకాలు 'ఎన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరీ' (1956) (An Introduction to the Study of Indian History), 'యక్సాపరేటింగ్ ఎస్సేస్ : ఎక్సర్‌సైజ్ ఇంటూ ది డైలెక్టికల్ మెథడ్' (1957), 'మిథ్ అండ్ రియాలిటి : స్టడీస్ ఇన్ ది ఫారమేషన్ ఆఫ్ ఇండియన్ కల్చర్' (1962), 'ది కల్చర్ అండ్ సివిలైజేషన్ ఆఫ్ ఏన్సియంట్ ఇండియా ఇన్ హిస్టారికల్ అవుట్‌లైన్ (1964). నాణేల అధ్యయన శాస్త్రాన్ని శాస్త్రీయ స్థాయికి తీసుకుపోవడమేగాక, ప్రాచీన భారతచరిత్రను అర్థం చేసుకోవడంలో కొశాంబి ఎంతో దోహదం చేశాడని ఆర్. యస్. శర్మ అంటాడు. కొశాంబి మానవ సమాజమును విశ్లేషించుటలో, మార్చుటలో మార్క్స్ విధానమును పూర్తిగా నమ్మినాడు. అయితే మార్క్స్ పద్ధతిని అనుసరిస్తూనే ఆధునిక పరిశోధనల వల్ల నూతన విశేషాలు బయటకు వస్తే వాటిని కూడా పరిగణనలోనికి తీసుకోవడం ద్వారా భాదతదేశ చరిత్రను విశ్లేషించుటకు ఆయన వెనుకాడలేదు. కొశాంబి పిడివాద మార్క్సిస్టు కాదు. కొశాంబి నిర్ణయాలను అంగీకరిస్తానని ఎ.యల్. భాషమ్ అంటాడు. కొశాంబి చరిత్ర విశ్లేషణా విధానం మార్క్సిస్టు పద్ధతిపై ఆధారపడినప్పటికి, ఒక అభిప్రాయం ప్రకారం కొశాంబి సాంస్కృతిక నియతివాదియే కాని ఆర్థిక నియతివాది కాదు. కొశాంబి పరిశోధనలు ప్రాచీన భారత చరిత్ర రచనా దృక్పథాన్ని మార్చి వేసిందని ఆర్.యస్. శర్మ అంటాడు.

తన దృక్పథం గతితార్కిక భౌతిక వాదమనీ దానినే మార్క్సిజం అంటారనీ పేర్కొంటూ, అయితే అది ఎంతమాత్రం ఆర్థిక నియతివాదం కాదని కొశాంబి తెలియజేసాడు. దీనికి కొశాంబి యిచ్చిన అర్థం ఏమిటో చూడాలి. స్థూలంగా మూడు విషయాలు కనబడతాయి. 1. ఒకే రకమయిన పరిస్థితులు అనివార్యంగా ఒకే రకమయిన మార్పుకు దారితీస్తాయని భావించకూడదు. సమాజం ఆ పరిస్థితులను చేరుకున్న మొత్తం చారిత్రక క్రమాన్ని దృష్టిలో పెట్టుకోనిదే భవిష్యత్ పరిణామాలు అర్థంకావు. గతకాలపు అవశేషాలు ఎప్పుడూ ఉంటాయి. వాటి ప్రభావం బలహీనంగా ఉండి తీరాలని చెప్పలేం. 2. సంస్కృతి అని పిలువబడే విషయాలు అదనపు ఉత్పత్తి మీద ఆధారపడినవే అయినంత మాత్రాన చరిత్రలో వాటి స్థానం శూన్యం కాదు. ప్రజలు తమ భౌతిక వైరుధ్యాలను తరచుగా సాంస్కృతిక సంఘర్షణల రూపంలో పరిష్కరించుకుంటారు. రెండు సమాజాల లేక వర్గాల మధ్య వైరుధ్యం ఇద్దరు దేవుళ్ళ మధ్య కొట్లాటగా పరిణమిస్తుంది. సామరస్యం దేవతల కలయికకూ, అవతారాలకూ, వివాహాలకు దారితీస్తుంది. భారతదేశంలో ఇది చాలా విస్తృతంగా జరిగింది. కాబట్టి కొశాంబి రచనలలో అనేక నిదర్శనాలు దొరుకుతాయి. అద్వైతానికే విశిష్టాద్వైతానికి గల సున్నితమైన తాత్వికభేదం ఘర్షణలకు దారితీయాల్సిన అగత్యం ఏమీలేదని, అయితే పెద్ద భూస్వాములు శైవాన్ని ఆదరించగా కొంత చిన్నతరహా కామందులు వైష్ణవాన్ని ఆదరించడం వల్ల శైవ, వైష్ణవ ఘర్షణ అంత తీవ్రంగా జరిగిందని అంటాడు. 3. మార్క్సిజం చరిత్రను పురోగామి స్వభావం గలదిగా భావిస్తుంది. అంటే ఉత్పత్తి సామర్థ్యంలో వెనుకబడ్డ దశనుండి అభివృద్ధి చెందిన దశకు చరిత్ర పురోగమిస్తుంది. అయితే ఇది చరిత్రను మొత్తంగా, విశాల భౌగోళిక ప్రాతిపదిక మీద చూసినప్పుడు మాత్రమే. ఒక పరిమితమయిన ప్రాంతంలో చరిత్రను పరిశీలించినప్పుడు చరిత్ర చాలాకాలం పురోగమించకుండ కరుడుగట్టిపోవడం ఒక్కొక్కసారి వెనక్కిపోవడం కనబడుతుంది. భారతదేశ చరిత్రలో ఇటువంటి ప్రముఖమయిన ఉదాహరణ

ఒకటివుంది. ఆర్యులకంటే సింధూ నాగరికత ప్రాచీనమయినా అదే ఆర్థికంగా పై దశలో వుండెను. సింధూ నాగరికతలో నాగలివాడకం తెలియకపోయినప్పటికీ తేలిక వ్యవసాయ పద్దతులతో చెప్పుకోదగ్గ అదనపు ఉత్పత్తిని సాధించి పట్టణాలు నిర్మించారు. వారి తరువాత వచ్చిన ఆర్యులకు తొలిరోజులలో వ్యవసాయంగానీ పట్టణ నాగరికతగానీ తెలియవు. వారు పశుపోషణ మీద ఆధారపడ్డ సంచారజీవులు.

కొశాంబి సూచించే చరిత్ర పరిశోధనా పద్దతిలో ప్రాచీన సాహిత్య మూలాలను పురావస్తు ఆధారాలు వున్నమేరకే విశ్వసించాలి. పదవిశ్లేషణ ఆధారంగా, శాసనాల శకలాల ఆధారంగా ఊహాగానాలు చేయడం మానుకోవాలి. సాహిత్య ఆధారాలలో అయినా పురావస్తు ఆధారాలలో అయినా రాజవంశాల కాలనుక్రమణిక కోసం కాక ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల పరిణామం ఛాయలకోసం వెతకాలి. ఈ పరిణామం అన్ని దశలలోను వదిలివెళ్ళిన సామాజిక అవశేషాల నుండి గతాన్ని పునర్నిర్మించుకోవాలి. అన్నిటినీ మించి, వర్తమాన సమాజంలోని క్రింది పొరలలోని ఆచార వ్యవహార సంబంధమైన అవశేషాలను జాగ్రత్తగా పరిశీలించి నైసర్గిక, భౌతిక పరిస్థితులతో, సాహిత్య పురావస్తు ఆధారాలతో సమన్వయ పరచాలి.

నిహర్ రంజన్‌రే (Nihar Ranjan Ray) కు ఆధునిక భారతదేశ చరిత్రకారులలో ఒక ప్రత్యేక స్థానము కలదు. ఇతడు సమకాలీన రాజకీయ సమస్యలపై, బెంగాలీ సాహిత్యంపై, చరిత్ర పరిశోధన యందు ఆసక్తి, అనుభవం సంపాదించి రచనా వ్యాసంగం నందు కృషి చేశాడు. ఇతనికి ఇతర భారతీయ చరిత్రకారులకు చరిత్ర అవగాహనా విషయంలో ఒక మౌళికమైన తేడా గలదు. మిగిలిన చరిత్రకారులు మాట్లాడని చరిత్ర ఆధారాలను గ్రంథాలయాల నుండి, ప్రాచీన సాహిత్యం నుండి, శాసనాలనుండి, నాణెముల నుండి గ్రహించి చరిత్రరచనకు పూనుకోగా, రే ప్రాచీన భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే చరిత్ర ఆధారాలతోబాటు, సమకాలిక ప్రజల భావాలను, సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి చరిత్ర పరిణామమును అర్థం చేసుకొనుటకు ప్రయత్నించాడు. మిగిలిన చరిత్రకారులు భారతదేశాన్ని గాఢంగా అభిమానిస్తే, రే భారతీయులను గాఢంగా అభిమానించాడు.

నిహార్ రంజన్‌రే దృక్పథంపై యూరోపియన్ అబరలిజం, పాజిటివిజం, గాంధీ, మార్క్సు ప్రభావం కలదు గాని తాను మార్క్సిస్టును కాదని, గాంధేయవాదిని కానని, తాను విమర్శనాత్మక దృక్పథం కలిగిన చరిత్రకారుడు, మేధావియని చెప్పుకొన్నాడు. ఇతడు 70 వ్యాసాలు ప్రచురించాడు. ఇతని గ్రంథాలలో ప్రధానమైనవి : 'బ్రహ్మానికల్ గాడ్స్ ఇన్ బర్మా', 'డచ్ యాక్టివిటీస్ ఇన్ ది ఈస్ట్', 'ఇండియా అండ్ ఇమేజ్ ఇన్ ఇండియన్ ఆర్ట్', 'నేషనలిజమ్ ఇన్ ఇండియా', 'ఈస్ట్ ఇండియన్ బ్రాంజెస్' మొదలగునవి.

మహమద్ హబీబ్ (Muhammed Habib) భారత స్వాతంత్ర్యానంతరం మార్క్సువాదం వైపు మొగ్గి అనేక రచనలు చేశాడు. ఇతడు ప్రధానంగా మధ్యయుగ చరిత్రకు గొప్ప సేవ చేశాడు. గతంలో ఏ చరిత్రకారుడు సృజించని అంశాలను ఇతడు సృజించాడు. హబీబ్‌లాగే కె.ఎమ్. పణిక్కర్ (K.M. Panikkar) మార్క్సిస్టు దృక్పథం కలవాడు. ఇతని రచనల్లో పేర్కొనదగినవి 'సర్వే ఆఫ్ ఇండియన్ హిస్టరీ', 'జియోగ్రాఫికల్ ఫేక్టర్స్ ఇన్ ఇండియన్ హిస్టరీ', 'ఫౌండేషన్స్ ఆఫ్ న్యూ ఇండియా', 'ఆఫ్రో-ఏషియన్ స్టేట్స్', 'రెవల్యూషన్ ఇన్ ఆఫ్రికా', 'సర్పెంట్ అండ్ ది క్రెసెట్', 'ఇండియా అండ్ చైనా', 'ఏషియా అండ్ వెస్టర్న్ డామినెన్స్' మొదలగునవి.

మార్క్సు ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాదం ఆంధ్ర చరిత్రకారులను కూడా ప్రభావితం చేసింది. ఏటుకూరి బలరామమూర్తి, కంభంపాటి సత్యనారాయణ, ఎం. పట్టాభి రామిరెడ్డి మొదలైనవారు ఈ దృక్పథంలోనే పరిశోధన కొనసాగించారు. అయితే కంభంపాటి గ్రంథం 'ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి'లో మార్క్సిస్టు సిద్ధాంత చట్రం ఉన్నప్పటికీ సాంప్రదాయిక ధోరణిలో

ఆర్య, ద్రావిడ సిద్ధాంతాల దృష్టితోను, ఈనాటి భౌగోళిక పరిమితి దృష్ట్యాను చరిత్ర రచన చేయడం వల్ల పూర్తి శాస్త్రీయ దృక్పథం లోపించిదని అలోకా పరార్ అభిప్రాయపడినారు.

## 17.4 సారాంశము :

కార్ల్‌మార్క్స్ సామ్యవాద సిద్ధాంతాన్ని శాస్త్రీయపద్ధతిలో ప్రతిపాదించి ప్రపంచంలోని శ్రమజీవులంతా విప్లవం తీసుకురావాలనే నినాదం ప్రబోధించి కోట్లాది ప్రజలకు మహా ప్రవక్తగా, 'లౌకిక జీసస్' గా ఆరాధ్యుడయ్యాడు. నేటి సమాజంపై మార్క్స్ ప్రభావాన్ని ఎవ్వరూ కాదనలేరు. మొత్తం ప్రపంచంలోని సమాజశాస్త్రాల మీద, సంఘ సంస్కర్తల మీద, విప్లవకారుల మీద అతని ప్రభావం ఎంతగానో ప్రసరించింది. నేటి చరిత్రకారులలో మార్క్సిస్టు పద్ధతిలో విశ్లేషణ చేసేవారు ఎక్కువేకాని వీరందరూ మార్క్సిస్టులు కానవసరం లేదనే విషయం గుర్తించుకోవాలి. మార్క్సిస్టు మెథడాలజీ చరిత్రకారునికి నూతన ప్రశ్నలువేసి, ఆ ప్రశ్నలకు సమాధానం రాబట్టేందుకు దోహదం చేస్తుంది. అందువల్లనే మార్క్సిస్టు విధానంలో శాస్త్రీయ క్రమ పద్ధతిలో పరిశోధన చేసే చరిత్రకారుల రచనలు నేడు ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. రొమిల్లా థాపర్, ఆర్.ఎస్. శర్మ, బిపిన్ చంద్రల చరిత్రగ్రంథాలను బహిష్కరించాలని మతతత్త్వవాదులు గగ్గోలు పెట్టినప్పుడు లౌకిక శాస్త్రీయ చారిత్రక దృష్టి కలిగిన వారందరూ ఆ ధోరణిని ఖండించారు.

మార్క్స్‌ను విమర్శించిన వారు ప్రధానంగా చరిత్రగతి పూర్తిగా ఆర్థిక పరిస్థితుల మీదనే ఆధారపడదని, మానవుని పురోగాభివృద్ధికి ఇతర కారణాలు తోడ్పడతాయని, ఆ కారణాలను మార్క్స్ నిర్లక్ష్యం చేసినాడని ఆరోపించారు. అంతేకాక మార్క్స్ ప్రతిపాదించిన వర్గరహిత సమాజం కేవలం మార్క్స్ ఊహ మాత్రమేనని, అటువంటి సమాజం ఏర్పడటం అసాధ్యమని మరికొందరు విమర్శించారు. ఈ విమర్శలలో పూర్తిగా సత్యంలేదు. ఏది ఏమైనప్పటికి నేటి సమాజంపై మార్క్స్ ప్రభావాన్ని ఎవరూ కాదనలేరు.

## 17.5 నమూనా ప్రశ్నలు :

1. చరిత్ర రచనలో మార్క్సిస్టు స్కూల్ ప్రభావం వివరింపుము.
2. చరిత్ర యొక్క భౌతికవాద వ్యాఖ్యానమును గురించి వివరింపుము.
3. మార్క్స్ చరిత్ర వ్యాఖ్యానమును వివరింపుము.

## 17.6 చదువదగిన గ్రంథాలు :


1. B. Sheik Ali : History, Its theory and Method, Mac Millon, 1978
2. N. Subrahmanyam : Historiography, Madurai, 1986
3. J.W. Thompson : A History of Historical writing, 2 Vols. New York, 1958.
4. R.G. Collingwood : The Idea of History, Oxford, 1966.
5. Edwin R.A. Seligran : The Economic Interpretation of History, New York, 1965.
6. Elliot and Dowton (Ed.) : History of India as told by its own Historians, Allahabad, 1969.


- డా॥ వి.కె. మోహన్

పాఠం - 18

# ఉపవర్గ చరిత్ర అధ్యయనాలు

## 18.0 లక్ష్యం

ఈ పాఠ్యాభాగాన్ని చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను తెలుసుకుంటారు.

- సామ్రాజ్యవాద, జాతీయవాద, మార్క్సిస్ట్ ధోరణులకు ఉపవర్గ అధ్యయనాలు ఏ విధంగా భిన్నమైనవో తెలుసుకోగలగాలి.
- ఉపవర్గ చరిత్ర రచనా సంప్రదాయ స్వభావం గురించి విశ్లేషించగలగాలి.
- ఉపవర్గ చరిత్ర రచనా విధానం మంచీ చెడుల్ని వివరించగలగాలి.

**విషయ సూచిక :**


18.1 పరిచయం

18.2 నిర్వచనం, స్వభావం, విషయపరిధి

18.3 ఉపవర్గ చరిత్ర రచనా ధోరణి చరిత్ర

18.4 ఉపవర్గ చరిత్ర అధ్యయనకారుల ధోరణి

18.5 అధ్యయన విధానం

18.6 అధ్యయనం గుణగణాలు

18.7 అధ్యయనం లోటుపాట్లు

18.8 సారాంశము

18.9 నమూనా ప్రశ్నలు

18.10 చదువదగిన గ్రంథాలు


## 18.1 పరిచయం :

ఇటీవలి కాలందాకా చరిత్ర పరిశోధనలు శిష్టవర్గాలు, వారి రాజకీయాలు, మంత్రాంగాలు, రాజభవనాలు, తదితర విషయాలకు మాత్రమే పరిమితమయ్యాయి. మన చరిత్ర రచనలు అనేక దశాబ్దాలుగా పూర్తిగా చాలా కొద్దిమంది వ్యక్తుల ప్రత్యేకించి, పాలక వర్గాల పొగడ్తలతోనే నిండినాయి. ఉత్పత్తి కార్యకలాపాలలోను, జాతి నిర్మాణంలోను పాలుపంచుకొన్న సామాన్య మానవునికి చరిత్ర రచనలలో చోటు లభించలేదు. అయితే 20 వ శతాబ్దపు మార్క్సిస్టు చరిత్ర రచనా ధోరణిలో సామాన్య మానవుని అవలోకనంలో చరిత్ర పునర్నిర్మించే ప్రయత్నం ఆరంభమయింది. కాని సామాజిక, ఆర్థిక అంశాల అధ్యయనమే పరమావధిగా సాగిన యీ అధ్యయనాలు వర్గపోరాటం, ఆర్థిక అంశాలపై ఉనికి కనబరచాయి తప్ప అణగారిన వర్గాలు, ఆటవిక తెగలు, రైతు

కూలీలు, మహిళలు మొదలైన ప్రజాసమూహాల గురించిన అంశాలు, పోలికలు తదితర విషయాలను వెనక్కి నెట్టాయి. మార్క్సిస్టు ధోరణిలోని యీ లోటుపాట్లను దృష్టిలో వుంచుకునే 1982 లో ఉపవర్గ చరిత్ర అధ్యయన వైఖరి ప్రారంభమయింది.

## 18.2 నిర్వచనం, స్వభావం, విషయపరిధి :

'Subaltern' అనే పదానికి నిఘంటు అర్థం 'అధికారమందు క్రిందైన' అని వస్తుంది. 'Inferior Rank' అని భావం వచ్చే యీ పదానికి నిజానికి 'నిమ్నశ్రేణి' అనేది తెలుగులో సమానార్థకం అవుతుంది. అయితే 'నిమ్న' పదానికి ఉన్న వ్యతిరేకార్థం కారణంగా 'అధీన వర్గం' లేదా 'ఉపశ్రేణి' అనిగాని, 'ఉపవర్గం' అనిగాని వాడవచ్చు. ఉపవర్గ అధ్యయనాల (subaltern studies) లక్ష్యం చరిత్రలో ఆధిపత్యవర్గం అణచివేతకు గురైన ఉపవర్గాల పాత్రను తెలుసుకోవడం, వెలుగులోకి తీసుకురావడం, సామాజిక క్రమంలో ఉపవర్గాలు సాగించిన పోరాటాలను, అవి సాధించిన ఫలితాల్ని, మొత్తంగా యివన్నీ అభివృద్ధికి అందించిన సేవలను తెలుసుకోవడం, అణచివేతకు గురైన ప్రజల సమస్యల్ని వారి వర్గం దృష్ట్యాగాని, కులం దృష్ట్యాగాని, వయస్సు దృష్ట్యాకాని, లింగం దృష్ట్యాకాని, వారు పనిచేసే స్థలం దృష్ట్యాగాని, యితరత్రాగాని పరిశీలించడం.

ఉపవర్గ చరిత్ర అధ్యయన విధానంలోకి లోతుగా వెళ్ళేముందు చెప్పుకోవలసిన విషయం ఒకటుంది. 'ఉపవర్గాలు', 'ఉపశ్రేణులు', 'ప్రజలు' యీ పదాలను సమానార్థకంగా ఉపయోగించడం జరుగుతుంది. ఈ రకమైన విభజనలో సామాజిక గణాలు, వాటి మూలాలు ఆ మాటకు వస్తే రణజిత్ గుహా చెప్పినట్లు పాలక శిష్టవర్గం మినహా మిగతా ప్రజానీకానికంతా యిది వర్తిస్తుంది. అయితే గ్రామీణ పెద్దలు, బీదవారిగా చేయబడ్డ భూస్వాములు, సంపన్న రైతు వర్గాలు 'మధ్య తరగతి రైతాంగంలో ఉన్నతులు' పైన పేర్కొన్న 'ప్రజలు' లేదా 'ఉపవర్గాల' క్రిందికే వచ్చినా కొన్ని స్థానిక లేదా ప్రాంతీయ పరిస్థితుల్లో ఆయా సందర్భాలలో శిష్ట వర్గానికి పనిచేసి ఆ ఆధిపత్యవర్గం క్రిందనే పరిగణింపబడతారు.

ఇంక విషయానికి వస్తే అణచివేతను ఆధిపత్యం సందర్భంలోనే అర్థం చేసుకోగలం. అణచివేత - ఆధిపత్యం ద్వంద్వ సంబంధంలో పెత్తందారీ వర్గాలు క్రింది వర్గాలను ఎప్పుడూ అణచివేస్తూనే వుంటాయి. అణచివేతకు గురౌతున్న ప్రజాగణాలు తిరుగుబాటు చేసినా ఆధిపత్యవర్గాలు (తాత్కాలికంగా వెనుకడుగు వేసినా) తమ అణచివేతను కొనసాగిస్తూనే వుంటాయి. ఇప్పటి దాకా సాగిన చరిత్ర రచనల్లో, అందులోనూ ముఖ్యంగా భారతదేశ చరిత్ర రచనల్లో ఆధిపత్యం చెలాయించే శిష్టవర్గాల కోణం నుండే ప్రతి విషయాన్నీ పరిశీలించడం జరిగింది. ఆధిపత్య వర్గాల పాత్రకు యివ్వవలసిన స్థానం యిస్తూనే అణచివేతకు గురైన లేదా 'గురౌతున్న వర్గాల దృష్టి నుండీ చరిత్రను పునఃపరిశీలించడం, పునర్నిర్మించడం ఉపవర్గ చరిత్ర అధ్యయన ధ్యేయం. అంటే ఇప్పటిదాకా శిష్టవర్గం దృష్టి నుండీ జరిగిన చరిత్ర రచనను విమర్శనాత్మకంగా పరిశీలించడం కూడా యిందులో భాగమే.

## 18.3 ఉపవర్గ చరిత్ర రచనా ధోరణి చరిత్ర :

కాబోయే చరిత్రకారుడు ఒక సమగ్ర చరిత్రకారునిగా రూపొందడానికి, సునిశిత మేధావుల కోవలో చేరడానికి ఇటలీకి చెందిన మార్క్సిస్టు తత్వవేత్త ఆంటోనియో గ్రామ్శీ యిచ్చిన పిలుపే దీనికి అంటే యీ ధోరణికి నాంది. అతని పరిభాషలోనే ఉపవర్గ చరిత్ర రచనా విధానాన్ని చక్కగా అర్థం చేసుకోగలం. అతని ప్రసిద్ధ రచన 'The Prison Dairy' లో తన భావాలను ప్రస్ఫుటీకరించాడు. చరిత్ర అధ్యయనంలో ఉపవర్గ ధోరణిని మొట్టమొదట ప్రతిపాదించిన గ్రామ్శీ 'ఆధిపత్య వర్గాల ఆలోచనలను పునర్విచించడానికి వాళ్ళ కార్యకలాపాలను విశ్లేషించడానికి మారుగా ఉపవర్గాల స్వతంత్రమైన చొరవకు సంబంధించిన ప్రతి ఆనవాలును గుర్తించమని చరిత్రకారులందర్నీ కోరాడు. ఉపవర్గాలపై వారి స్థితిగతులపై తమ దృష్టిని కేంద్రీకరించమని పిలుపు

నిచ్చాడు. తెలిసిన సంఘటనలను, విషయాలను అన్నిటినీ యీ కొత్త అవలోకనం నుండీ పునఃపరిశీలించమని చరిత్ర కారులందరికీ విజ్ఞప్తి చేశాడు.

చరిత్ర అధ్యయనంలో యీ ఉపవర్గ చరిత్ర అధ్యయన విధానానికి కట్టుబడిన చరిత్రకారుల్లో ఆంటోనియో గ్రామ్‌శ్చితోబాటు ఫ్రాన్ట్జ్‌ఫేనస్, జీన్ చెస్నాక్స్, ఇ.పి. థామ్సన్, ఎరికి హాబ్స్‌బామ్, జార్జ్‌రూడ్ మొదలైన వారున్నారు. దక్షిణాసియా అధ్యయనాల రంగంలో యీ ఉపవర్గ చరిత్ర విషయాల్లో క్రమబద్ధమైన చర్చను పరిశోధనను ప్రోత్సహిస్తున్న ఉపవర్గ చరిత్ర అధ్యయనకారుల్లో రణజిత్ గుహ, షాహిద్ అమిన్, డేవిడ్ ఆర్నాల్డ్, పార్థాచటర్జీ, డేవిడ్ హార్డిమన్, గ్యాన్‌పాండే తదితరులున్నారు. ఈ చరిత్రకారులు శిష్టవర్గాల దృక్కోణంలోని పక్షపాత ధోరణిని సరిదిద్దే ప్రయత్నాన్ని చేస్తున్నారు. గ్రామ్‌శ్చి, థామ్సన్‌ల ప్రేరణతో ప్రారంభమైన యీ ఉపవర్గ చరిత్ర రచనా విధానానికి ప్రతిబింబంలా రణజిత్ గుహ తదితరుల నేతృత్వంలో 'Subaltern Studies : Writings on South Asian History and Society' పేరుతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ ప్రచురణ పరంపరలో యిప్పటికి తొమ్మిది సంపుటాలు వెలువడ్డాయి. క్రింది వర్గాల నుండి చరిత్ర (History From Below) ను చూడాలనే ఆలోచనతో 1960, 1970 దశకాల్లో జరిగిన కొన్ని రచనలూ వచ్చాయి. ఇవీ 1980 దశకంలో ఉపవర్గ చరిత్ర అధ్యయనానికి కొంత స్ఫూర్తినిచ్చాయి.

భారతదేశంలో సామ్రాజ్యవాద వలస పాలనా కాలంలో జరిగిన చరిత్ర రచన ఓ వంక పాలకుల ప్రయోజనాల కోణం నుండీ, మరోవైపు జాతీయ బూర్జువా శిష్టవర్గం దృష్టినుండీ సాగింది. ఈ క్రమంలో సామ్రాజ్యవాద వలసపాలనా కాలంలోగాని, అంతకు పూర్వంగాని వివిధ వర్గాల ప్రజానీకం స్వతంత్రంగా నిర్వహించిన పోరాటాలను గాని, అవి అభివృద్ధికిచ్చిన తోడ్పాటునుగాని గుర్తించే స్థితి కన్పించదు. అలాగే శిష్టవర్గం కోణంనుండే 'ఉత్తేజం - స్పందన' (Stimulus and Response) దృక్పథంలో మన జాతీయోద్యమాన్ని పరిశీలించారు. ఈ ధోరణిలో ప్రజలు తమంతట తాముగా ఎలా స్పందించారో, ఏ విధంగా పాల్గొన్నారో, ఏయే త్యాగాలు చేసారో, ప్రజాస్పందన మొత్తం మీద ఎలా వుందో తెలుసుకోలేదని అవి పరిశీలించి, అధ్యయనం చేయడమే తమ లక్ష్యమని ఉపవర్గ చరిత్ర అధ్యయనకారులు పేర్కొన్నారు. 1919 నాటి రౌలట్ చట్ట వ్యతిరేక వెల్లువ, 1922 నాటి చౌరీ - చౌరా ఘటన, 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమం పట్ల ప్రజాస్పందన, 1946 లో జరిగిన రిన్ (Rin) తిరుగుబాటుకు ప్రజల సంఘీభావం... ఇవేవీ... అంటే యీ ప్రజా పోరాటాలేవీ శిష్టవర్గ చరిత్ర అధ్యయనాల్లో ప్రాముఖ్యం ఉన్నవి కావు. శిష్టుల దృష్టిలో ప్రజాపోరాటాలకు ఎటువంటి స్థానం వుంటుందో తెలుసుకోవడానికి యివన్నీ నిదర్శనాలే. అభూతకల్పనలతో కూడిన అచారిత్రకమైన ఏకసత్తావాదపు (Monistic) కోణం నుండే భారతజాతీయవాదాన్ని శిష్టవర్గం చూసింది. ఈ రకమైన చరిత్ర రచనా పద్ధతిని వ్యతిరేకించింది ఉపవర్గ చరిత్ర రచనా విధానం. శిష్టవర్గం, ఉపవర్గాల సహజీవనం, పరస్పర స్పందన ఫలితంగా సాగిన చరిత్రను అర్థం చేసుకోవడానికి శిష్టవర్గ చరిత్ర రచనా విధానానికి ప్రత్యామ్నాయంగా ఉపవర్గ చరిత్ర రచనా విధానాన్ని అభివృద్ధి చేయాలని రణజిత్ గుహ ప్రకటించాడు. ఈ ఉపవర్గ చరిత్ర అధ్యయనకారులు తమ దృష్టిని ఆధునిక భారతదేశ చరిత్ర అధ్యయనానికి, అందులోనూ ప్రత్యేకించి భారత జాతీయవాద ఆవిర్భావం, పరివ్యాప్తి అధ్యయనంపై కేంద్రీకరించారు.

## 18.4 ఉపవర్గ చరిత్ర అధ్యయనకారుల ధోరణి :

ముందే చెప్పినట్లు యీనాడు వున్న చరిత్ర రచనలు అన్నింటినీ - అవి వలసవాదాన్ని లేదా జాతీయవాదాన్ని లేదా మార్క్స్ వాదాన్ని ప్రతిబింబించినా - ఉపవర్గ చరిత్ర అధ్యయన వర్గానికి చెందిన చరిత్రకారులు శిష్టవర్గ రచనలుగా కళ్ళకు గంతలతో ఒకే వర్గ దృక్పథం నుండీ చేసిన రచనలుగా, ప్రజల చరిత్రను సరైన రీతిలో అర్థం చేసుకోవడానికి చాలని రచనలుగా అధిక్షేపించారు. ప్రజా 'రాజకీయాలను', చరిత్ర ప్రగతిని అర్థం చేసుకోవడానికి సమాజ ఆర్థిక విభజనే తగిన చిహ్నం అనే భావనను

అప్రధానమైనదనో లేదా కొన్నిసార్లు పూర్తిగా యీ చరిత్రకారులు నిరాకరిస్తున్నారు. అధికారమనే కట్టడంపై దృష్టిని కేంద్రీకరించిన వీరు సమాజం రెండుగా - ఆధిపత్య, అధీనవర్గాలుగా - విభజింపబడి వుండటం గమనించారు. ఈ వర్గాలను గ్రామ్‌శ్చి మీమాంసలోనే శిష్టవర్గం, ఉపవర్గాలుగా వ్యవహరించడానికే యిష్టపడ్డారు. సమాజంలోని ఆధిపత్య వర్గమైన శిష్టవర్గం ఉపశ్రేణులపై నిర్బంధంతోనో, మరోరకంగానో అధికారాన్ని చెలాయిస్తుందని వీరు వాదిస్తారు. ఉపవర్గాలు ఎటువంటి అసంతృప్తికి గాని, తిరుగుబాటుకుగాని ఆలోచించేంత అవకాశం కూడా యివ్వని రీతిలో శిష్టవర్గం అధికారం చెలాయించిందని వీరి నమ్మకం. అయితే ఉపవర్గాలూ తమదైన రీతిలో స్వయం ప్రతిపత్తితో చైతన్యంతో రాజకీయాలు నడిపి, కొన్ని సందర్భాలలో హింసకు, తిరుగుబాట్లకు కారకులయ్యారని వీరు చెబుతారు. దక్షిణాసియా సమాజం, రాజకీయాలకు సంబంధించిన చరిత్ర రచనల్లో సమాజంలో యిప్పటి వరకు చరిత్రకారుల నిర్లక్ష్యం చేసిన యీ ఉపశ్రేణులు, వారి చైతన్యం, అనుభవం, వారి తిరుగుబాటు ధోరణులు, విధానాలు - వీటన్నింటికీ చరిత్రలో సముచిత స్థానం కల్పించడమే తమ లక్ష్యమని యీ చరిత్రకారులు ప్రకటించారు.

## 18.5 అధ్యయన విధానం :

ఉపవర్గ చరిత్ర అధ్యయనం, రచనావిధానం వివిధ విషయాల అన్యోన్యాశ్రితత్వం పై ఆధారపడి ఉంది. సామాజిక శాస్త్రాలు యీ రోజుల్లో మరింతగా పరస్పరం ఒకదానిపై మరొకటి ఆధారపడినాయి. చరిత్ర విషయంలోనూ యిది వాస్తవమే. విజ్ఞాన ఏకత్వం యీ విధంగానే మరింత స్పష్టమవుతుంది. మన పరిమితుల్లో వేర్వేరు విషయాలు సార్వత్రిక సత్యాన్వేషణకు తోడ్పడతాయనే యథార్థం గురించిన స్పృహ మనలో మరింత కలుగుతూ వుంది. నిన్న మొన్నటిదాకా కేవలం రాజకీయ, రాజ్యాంగ చారిత్రక పరిణామాలకు పరిమితమైన అధ్యయనాలు నేడు చారిత్రక సంఘటనల సామాజిక, ఆర్థిక విశ్లేషణలకు ప్రాధాన్యతను సంతరించుకుంటూ సాగటం తెలిసిందే. సామాజిక మార్పును గురించిన చారిత్రక అవగాహనకు సాంస్కృతిక, మానవిక, నిర్మాణ-భాషా సంబంధపు వ్యాఖ్యానాలూ దోహదం చేస్తాయనే అంశాన్ని ఉపవర్గ చరిత్ర అధ్యయనాలు స్పష్టీకరిస్తున్నాయి. ఆనుషంగిక సామాజిక శాస్త్రాలకు సంబంధించిన అపభ్రంశాలను, యితరత్రా మనసుని చిందరవందర చేసే పద్ధతులను చరిత్రకారులు యిక ఏమాత్రం విస్మరించలేరు. ఉపవర్గ ప్రజానీకపు కోణం నుండి పరిశీలించడమంటే యితర కోణాలనుండీ చూసినట్లేనేది యీ రకమైన అధ్యయనకారుల భావన.

## 18.6 అధ్యయనం గుణగణాలు :

ఉపవర్గ చరిత్ర సంప్రదాయానికి చెందిన చరిత్రకారులు దక్షిణాసియా అధ్యయనాలలో ఉపశ్రేణులకు సంబంధించిన అనేక విషయాలపై క్రమబద్ధమైన వివరణతో కూడిన చర్చను పెంపొందించడంలో తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ రంగంలో శిష్టవర్గ పక్షపాతాన్ని, దురభిమానాన్ని ఎండగట్టడంలో ఎనలేని సేవలందిస్తున్నారు. గ్రామ్‌శ్చి పేర్కొన్న ఉపవర్గాలు, వారి స్థితిగతులపై యీ చరిత్రకారులు దృష్టిని కేంద్రీకరించారు. అందరికీ బాగా తెలిసిన దక్షిణాసియా చరిత్ర అధ్యయనంలోని అనేక సంఘటనలను, విషయాలను వీరు క్రొత్త అవలోకనం నుండీ పునఃపరిశీలించారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ఉప లేదా అధీనవర్గాల రాజకీయ కార్యకాలాపాలపై దృష్టిని సారించి భారత జాతీయవాదానికో క్రొత్త వ్యాఖ్యానమిచ్చారు.

ఉపవర్గ చరిత్ర అధ్యయనకారులు చరిత్ర, రాజనీతి, అర్థ, సమాజ శాస్త్ర రంగాలలో వివిధ ధోరణులను, ఆదర్శాలను, సిద్ధాంతాలను, పద్ధతులను అధ్యయనం చేసి, సేవలందించారు. 'క్రింది వర్గాల నుండి చరిత్ర' (History from below) అధ్యయనానికి ప్రాముఖ్యం యిచ్చారు. అనేక ప్రశ్నలను లేవనెత్తారు. దిశానిర్దేశం, సృజనాత్మకత లేని దక్షిణాసియా అధ్యయనాలకు వాటిని కలిగించారు. తద్వారా చరిత్ర పరిశోధనలో విప్లవాత్మక పంథాకు నాంది పలికారు. ఈ ధోరణి క్రొత్త భావాల ఆవిర్భావంలో

గుణాత్మక ఫలితాలనందించింది. చరిత్రాధ్యయనంలో యీ ఉపవర్గ రచనా విధానం అధీన వర్గాల చరిత్రపై విశాల దృక్పథంతో రచనలు వెలువడడానికి దోహదం చేస్తున్నది.

## 18.7 అధ్యయనం లోటుపాట్లు :

ఉపవర్గ చరిత్ర అధ్యయన విధానంలో యింకా స్పష్టత లేని లోటు కన్పిస్తుంది. ఈ రకమైన అధ్యయన విధానంలో సరైన చరిత్రాధారాల సేకరణ ఎంతో క్లిష్టతరం. అర్థమయ్యే రీతిలో స్పష్టంగా నిర్ధారణలు చేయలేని స్థితి అనేక విమర్శలకు తావిస్తున్నది. సమాజంలో యీ ఉపవర్గాలను గుర్తించడమూ యిబ్బందికరమే. మజీద్ సిద్దికి చెప్పినట్లు ఒక సందర్భంలో ఉపవర్గమని భావింపబడిన సమూహం మరో సందర్భంలో ఆధిపత్యవర్గంగా మారవచ్చు. శిష్ట, ఉపవర్గాలను గుర్తించడంలో రణజిత్‌గుహా, పార్థా ఛటర్జీల మధ్యనే ఏకాభిప్రాయం లేదు !

ఉపశ్రేణి చరిత్ర రచనా విధానంలో భావవాదం చోటు చేసుకోవడమూ విమర్శకు గురయింది. అలాగే వ్యక్తి స్వీయానుభవం నుండే జ్ఞానమంతా లభిస్తుందనే నవీన ప్రత్యక్ష జ్ఞానవాద (neo-positivism) ప్రభావమూ బాగా కన్పిస్తుంది. ప్రపంచం కలవడానికి వీలులేని రెండు భాగాలుగా అంటే శిష్ట, ఉపవర్గాలుగా విడివిడిగా వుందనే వీరి భావమూ లోపభూయిష్టమే. వర్గవిశ్లేషణ విస్మరించి ఉపవర్గాల కార్యకలాపాలను ఏకపక్షంగా ఆకాశానికెత్తడమూ గర్హనీయమే. మొదట్లో ఉపవర్గ చరిత్రరచనా విధానాన్ని సమర్థించిన సుమిత్ సర్కార్ యిప్పుడు దక్షిణాసియా చరిత్ర - సమాజంపై రచనలు : ఉపవర్గ అధ్యయనాల ప్రాజెక్టుతో విభేదిస్తూ 'ఉపవర్గ చరిత్ర రచనా క్షీణత'' పేరుతో ఒక విమర్శనా వ్యాసాన్ని రాసాడు. అయితే ఉపవర్గ చరిత్ర రచనా విధానంలో మలికాలంలో అంతర్జాతీయంగా వచ్చిన భావజాల మార్పులు అధునికానంతరవాదం (post - modernism) వంటివి కొంత ప్రభావం చూపించినాయి. అలాగే ప్రాజెక్టులో ఆరంభం నుండీ వున్న కొన్ని అంతర్గతమైన అస్పష్టతలు, ఉద్రిక్తతలు ఉపవర్గ చరిత్ర అధ్యయనాలపై నీలినీడల్ని ప్రసరింప జేసినాయి. భారత జాతీయ వాదాన్ని రెండు వేర్వేరు ప్రవాహాలుగా విభజించడం, కాంగ్రెస్ నేతృత్వంలోని శిష్టుల జాతీయోద్యమాన్ని 'బోగస్'గా అభివర్ణించడం ఉపవర్గ చరిత్రకారుల యీ ప్రయత్నాలను జాతీయవాదులు, నెహ్రూ పంథాలోని నవీన మార్క్సిస్టు చరిత్రకారులు తీవ్రంగా నిరసించారు. ముఖ్యంగా బిపిన్ చంద్ర సబాల్టర్న్ వ్యాఖ్యానాల్ని తీవ్రంగా విమర్శిస్తూ జాతీయోద్యమపు మొత్తం ప్రణాళికలో ఆయా సందర్భాలలో జరిగిన ప్రజల తిరుగుబాట్లు, జనబాహుళ్యం చొరవ అంతర్భాగమే తప్ప వాటిని కాంగ్రెసు ప్రధాన కార్యకలాపాలకు భిన్నమైనవనో లేదా స్వతంత్రమైనవనో ఎట్టి పరిస్థితుల్లోనూ, భావింపరాదని పేర్కొన్నాడు.

అవాంతరాల్ని, తీవ్రవిమర్శల్ని ఎదుర్కొంటున్నప్పటికీ చరిత్ర అధ్యయనంలో, పరిశోధనలో ఒక క్రొత్త కోణాన్ని ఆవిష్కరించిన ఉపవర్గ చరిత్ర అధ్యయనవేత్తలు యిబ్బందుల్ని అధిగమించి ముందుకు సాగాలి. అయితే సంకల్పబలంతోపాటు పరిశోధనా పరికరాలకు, వ్యాఖ్యానానికి క్రొత్త పద్ధతుల్ని అన్వేషించాలి. ఇప్పటి దాకా ఉపయోగిస్తున్న చరిత్ర ఆధారాలైన శాసనాలు, సాహిత్యం, నిర్మాణ శిధిలాలు వంటివి సమాజంలోని ఉన్నత వర్గాల సృష్టే. అనేకమంది చరిత్రకారులు వీటన్నిటినీ ప్రామాణిక ఆధారాలుగా తీసుకున్నా వీటిలో క్రింది వర్గాల గురించిన సమాచారం ఏమాత్రం లభించదు. సామాన్య ప్రజానీకానికి సంబంధించిన ఏ అంశమూ వీటిలో చోటుచేసుకోలేదు. ఈ పరిస్థితుల్లో ప్రజల చరిత్రను, సంస్కృతిని పునర్నిర్మించడానికి ప్రాచీన జన సంప్రదాయాలు, జానపద వాఙ్మయం మౌళిక ఆధారాలు విరివిగా సేకరించాలి. గ్రామీణ ప్రజా జీవనాన్ని ప్రతిబింబించే ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, భాషా పరిజ్ఞానం లేని ప్రజల దైనందిన జీవితాన్ని ప్రతిబింబించే దేనినీ విస్మరించరాదు. ప్రామాణికతను నిర్ధారిస్తేనే సమాచారానికి విలువ కలుగుతుంది. అప్పుడే అధీనవర్గాల చరిత్రకు రూపం ఏర్పడుతుంది.

ఏది ఏమైనప్పటికీ సాంప్రదాయక మార్క్సిస్ట్ పరిభాషలోని 'పునాది - ఉపరితలం' (Base - Superstucture) అనే భావనకు భిన్నంగా సృజనాత్మకతతో మార్క్స్ వాదాన్ని అన్వయించి సామాజిక క్రమంలో వివిధ ఉపవర్గాల పాత్రను వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రారంభమైన యీ రచనా విధానం లోటుపాట్లను అధిగమించి చరిత్ర పరిశోధన, రచనా రంగాల్ని సుసంపన్నం చేయాలని ఆశించడం తప్పుకాదు.

## 18.8 సారాంశము :

నిన్నమొన్నటిదాకా పాలక వర్గాల పొగడ్తలతో శిష్టవర్గ దృక్పథం నుండీ చేయబడిన చరిత్ర రచనలలో ఉత్పత్తి కార్యకలాపాలలో, జాతి నిర్మాణంలో పాలుపంచుకొన్న సామాన్యుడికి చోటు లభించలేదు. కాని 20వ శతాబ్దంలో మార్క్సిస్టు చరిత్ర రచనా విధానంలో సామాన్య మానవుని అవలోకనంలో చరిత్రను పునర్నిర్మించే ప్రయత్నాలు మొదలయ్యాయి. కాని యిందులోనూ సామాన్యప్రజా గణాలకు ప్రాధాన్యత లభించలేదు. దీనితో ఇటాలియను మార్క్సిస్టు సిద్ధాంతవేత్త గ్రామ్‌శ్చి, బ్రిటిషు చరిత్రకారుడు థామ్సన్‌ల స్ఫూర్తితో ఉపవర్గ చరిత్రరచనా విధానం 1980 దశకంలో ప్రారంభమయింది. రణజిత్‌గుహా, పార్థా చటర్జీ తదితరుల సంపాదకత్వంలో 'Subaltern Studies : Writings on South Asian History and Soceity' ప్రాజెక్టు క్రింద యిప్పటికి 9 సంపుటాలు వెలువడ్డాయి. భారత జాతీయోద్యమ చరిత్రలపై దృష్టి పెట్టిన యీ ఉపవర్గ చరిత్ర అధ్యయనకారులంతా మన జాతీయోద్యమాన్ని 'ఉత్తేజం - స్పందన' దృక్పథంలో శిష్టవర్గం కోణం నుండీ వీక్షించిన దానికి భిన్నంగానే ప్రజా సమూహాలు లేదా ఉపవర్గాలు అంటే అణగారిన వర్గాలు, ఆటవిక తెగలు, రైతుకూలీలు, మహిళలు, దళితులు, తదితరులంతా తమంతట తాముగా ఏ విధంగా స్పందించారో, ఏవిధంగా పాల్గొన్నారో, ఏయే త్యాగాలు చేసారో, ప్రజా స్పందన మొత్తం మీద ఎలా వుందో పరిశీలించి అధ్యయనం చేసే లక్ష్యంతో వుపక్రమించారు. ఉపవర్గాల పాత్రను నిష్పాక్షికంగా, విషయగతంగా అర్థం చేసుకోవడానికి యీ ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇందులో అవాంతరాలున్నాయి. విమర్శలెదురవుతున్నాయి. చక్కదిద్దవలసిన లోటుపాట్లు వున్నాయి. ఉపవర్గ చరిత్ర రచనా విధానం మరింత స్పష్టతనూ సంతరించుకోవలసి వుంది. ఏది ఏమైనా చరిత్ర పరిశోధన బహుముఖంలో ఇదొక కోణం.

## 18.9 నమూనా ప్రశ్నలు :

ఎ) క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.

1. ఉపవర్గ చరిత్ర రచనా సంప్రదాయ స్వభావాన్ని విశ్లేషించండి.
2. ఉపవర్గ చరిత్ర రచనా విధానం మంచీ చెడుల్ని వివరించండి.

బి) క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను వ్రాయండి.

1. ఉపవర్గాలు
2. దక్షిణాసియా చరిత్ర-సమాజం ప్రాజెక్ట్
3. ఉపవర్గ చరిత్ర రచనా విధానంపై బిపిన్ చంద్ర విమర్శ

## 18.10 చదువదగిన గ్రంథాలు :


**Subaltern Studies Volumes & Anthologies**

- Guha, Ranajit, ed. A Subaltern Studies Reader : 1986`1995. Minneapolis : University of Minnesota Press. 1998.
- _____, ed., et. al. Subaltern Studies : Writings on South Asian History & Society, Vols. I - IX. Delhi: Oxford Univesity Press, India. 1982-1996.
- ______ and Gayatri Chakravorty Spivak, eds. Selected Subaltern Studies. New York : Oxford University Press. 1988.

**Related Essays & Criticism**

- Alam, Javeed. "Peasantry, Politics and Historiography : Critique of New Trend in Relation to Marxism." Social Scientist (February 1983) 117, vol.11, no.2, pp. 43-54.
- Arnold, David. "Gramsci and Peasant Subalternity in India." Jounal of Peasant Studies (1984) 11,4, pp.155-177.
- Bahl, Vinay. " Relevance (or Irrelevance) of Subaltern Studies. "Economic and Political Weekly (1997) Vol. 32, no.23, pp. 1333.
- Bayly, C.A. "Rallying Around the Subaltern." Journal of Peasant Studies (1988) 16, 1, pp. 110-120.
- Bhabha, Homi K. "The Postcolonial and Postmodern : The Question of Agency." In The Location of Culture. London: Routledge, 1994. pp. 171-197.
- Bhattacharya, Nandini. "Behind the Veil: The Many Masks of Subaltern Sexuality." Women's Studies International Forum (May/June 1996), Vol. 19, pp. 277-92.
- Chakraborty, D., "Marx after Marxism: History, Subalternity & Difference." Meanjin (Spring 1993) 52pp. 421-434.
- --------. "Minority Histories, Subaltern Pasts." Perspectives (November 1997), pp. 37-43.
- Currie, Kate. "The Challenge to Orientalist, Elitist, and Western Historiography: Notes on the 'Subaltern Project, 1982-1989." Dialectical Anthropology (1995) Vol.20, no-2, pp. 217.
- Dienst, Richard. "Imperialism, Subalternity, Autonomy : Modes of Third World Historiography." Polygraph 1 (1987) pp. 67-80.

* Hardiman, David. "Subaltern Studies' at Crossroads. "Economic and Political Weekly 21 (February 15, 1986) pp. 288-290.

* Jalal, Ayesha. "Secularists, Subalterns & the Stigma of'Communalism'. Partition Historiography Revisited. " Modern Asian Studies (July 1996), Vol. 30, pp. 681-9

* Mukherjee, Mridula. "Peasant Resistance and Peasant Consciousness in Colonial India: 'Subalterns'. and Beyond. "Economic and Political Weekly 23 (October 8, 1988) pp. 2109-2120. (October 15, 1988) pp. 2174 - 2185.

* Pandey, Gyanendra, "Voices from the Edge : The Struggle to Write Subaltern Histories." Ethnos (1995), Vol. 60, no. 3-4, pp. 223.

* Perusek, Darshan. "Subaltern Consciousness and the Historiography of the Indian Revolution of 1857." Novel 25, 3 (Spring 1992) pp. 286-302 or in Economic and Political Weekly 28 (September 11, 1993) pp. 1931-1936.

* Prakash, Gyan, "Subaltern Studies as Postcolonial Criticism." American Historical Review 99 (December 1994) pp. 1475 - 1490.

* Sarkar, Sumit, "The Decline of the Subaltern in Subaltern Studies." In Writing Social History. Delhi: Oxford University Press India. 1997. pp. 82-108.

* Sathyamurthy, T.V. "Indian Peasant Historiography : A Critical Perspective on Ranajit Guha's Work," Journal of Peasant Studies (October 1990) Vol. 18, no. 1, pp. 93-141.

* Sivaramakrishnan, K. "Situating the Subaltern: History and Anthropology in the Subaltern Studies Project," Journal of Historical Sociology 8 (December 1995) pp. 395-429.

డా॥ జె. దుర్గాప్రసాద్.